శేషాద్రి రమణ కవుల

పరిశోధన వ్యాసమంజరి





డా॥ దేవులపల్లి రామానుజరావు శతజయంతి ప్రచురణ

తెలంగాణ సారస్వత పరిషత్తు

హైదరాబాద్

పరిశోధన వ్యాసమంజరి

కృతికర్తలు

శేషాద్రి రమణకవులు

ప్రధాన సంపాదకులు

డా॥ సి.నారాయణరెడ్డి
అధ్యక్షుడు, తెలంగాణ సారస్వత పరిషత్తు

సంపాదకులు

డా॥ జె.చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు

ప్రచురణ

తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, ఆబిడ్స్
హైదరాబాద్ - 500001
ఫోన్ : 040-24753724

2

PARISODHANA VYASA MANJARI

By Seshadri Ramana Kavulu

2017

Copies: 500

Price : 200/-

For Copies
Telangana Saraswatha Parishat
Tilak Road,
Abids, Hyderabad - 500001
Ph : 040-24753724

DTP : Lakshmi Srinivas
9885021639

Printed at
Sai Likhita Printers
Khairatabad, Hyderabad
Ph: 040-65545979

3

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి.నారాయణరెడ్డి, ఎం.ఏ
అధ్యక్షులు
తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాదు - 500 001.
ఫోన్ : (ఆ) 24753724

అవతారిక

నిజాం పాలనలో తెలుగు నిరాదరణకు గురి అయింది. ఈ దుస్థితిని అంతమొందించి తెలుగు పునరుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ తెలంగాణ సారస్వత పరిషత్తు. సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, కాళోజి నారాయణరావు, లోకనంది శంకర నారాయణరావు, కోదాటి నారాయణరావు, భాస్కరభట్ల కృష్ణారావు, గడియారం రామకృష్ణశర్మ, బుక్కపట్నం రామానుజాచారి వంటి సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు ఆనాడు తెలంగాణలో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్టస్థానం వహించింది. మాన్యమిత్రులు డా॥ దేవులపల్లి రామానుజరావు గారు యావజ్జీవం పరిషత్తు అభివృద్ధికి శ్రమించినారు. పరిషత్తు బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి దక్షతతో నిర్వహిస్తూ అందరి ప్రశంసలందు కుంటున్నది. పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద తెలుగు పరీక్షలు జరపడంతో పాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాలను, ప్రాచ్య కళాశాలను నిర్వహిస్తున్నది. పరిషత్తు ఏర్పాటు చేసే సాహితీ సభలు, గ్రంథావిష్కరణలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, పరిణతవాణి ప్రసంగాలు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, మొదలైనవి సాంస్కృతిక కార్యక్రమాలు తెలంగాణ వైశిష్ట్యానికి అద్దం పడుతున్నవి. పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీలోకం అభిమానించి స్వాగతిస్తున్నది. ఇంతవరకు దాదాపు 300 గ్రంథాలను వెలవరించింది. 2013లో పరిషత్తు సప్తతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించింది.

ఈ పరంపరలో భాగంగా పరిషత్తు 'పరిశోధన వ్యాసమంజరి' ప్రచురిస్తున్నది. కృతికర్తలు శేషాద్రి రమణకవులుగా ఖ్యాతిగాంచిన శతావధానులు, పండితులు, విమర్శకులు, ఉపాధ్యాయులు - దూపాటి శేషాచార్యులు, దూపాటి వెంకట రమణాచార్యులు. తెలంగాణ చరిత్రకు, శాసనాలకు, సాహిత్యానికి సంబంధించి

వీరు విశేష పరిశోధనలు జరిపి అనేక అమూల్యాంశాలను వెలుగులోనికి తెచ్చినారు. హనుమకొండలో వీరు స్థాపించిన 'చారిత్రక పరిశోధక మండలి' వీరి దీక్షా నిబద్ధతలకు నిదర్శనంగా భాసిస్తున్నది. నాటకం, నవలా రచనలో సహితం వీరు సిద్ధహస్తులు.

ప్రస్తుత గ్రంథంలో కాకతీయ వంశంపైన, నిజాం రాష్ట్ర వాఙ్మయంపైన రచించిన పెక్కు వ్యాసాలు వీరి పరిశోధనాచణతను నిరూపిస్తున్నాయి. నేలకొండపల్లి, రామప్పగుడులు, గుప్తసామ్రాజ్యం తదితర వ్యాసాలు ప్రతిభాన్వితంగా వున్నాయి. ప్రతి వ్యాసంలోను పరిశీలనా పాటవం వ్యక్తమవుతున్నది. సమగ్ర సమాచారంతో పాటు ఉత్తమ విశ్లేషణ, ప్రామాణిక నిర్వహణ వ్యాసాలకు మరింత సార్థక్యం సంతరిస్తున్నాయి. నేను కరీంనగరు ఉన్నత పాఠశాలలో ఏడవ, ఎనిమిదవ తరగతుల విద్యార్థిగా రాసిన పద్యాలను వెంకట రమణాచార్యులు చదివి ప్రోత్సహించిన గురువర్యులు. ఆయన బోధన కదళిపాకాన్ని తలపించేది.

పండితులకు, పరిశోధకులకు, చరిత్రాభిమానులకు అత్యంత ప్రయోజనం చేకూర్చే ఈ వ్యాసాలను భద్రపరచిన దూపాటి కుటుంబీకులు అభినందనీయులు. పరిషత్తు ప్రచురిస్తున్న ఈ గ్రంథం అందరి మన్ననలను పొందగలదని విశ్వసిస్తున్నాను.

(డా. సి. నారాయణరెడ్డి)

అధ్యక్షులు

తెలంగాణ సారస్వత పరిషత్తు

హైదరాబాద్

తేది : 04.01.2017

డా॥ జె. చెన్నయ్య

ప్రధాన కార్యదర్శి

తెలంగాణ సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాదు - 500 001.

ఫోన్ : (ఆ) 24753724

ప్రవేశిక

తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న విభిన్నమైన కార్యక్రమాల్లో పుస్తక ప్రచురణ విశిష్టమైంది. పరిషత్తు ప్రచురించిన గ్రంథాల పట్టికను చూస్తే ఎంత గొప్పవైన ప్రచురణలు వచ్చాయో తెలుస్తుంది. పరిషత్తు ఆధ్వర్యంలో తెలుగు పరీక్షల నిర్వహణ, భాషా సాహిత్య సాంస్కృతిక వికాసానికి దోహదం చేసే సదస్సుల నిర్వహణ, పెద్దల పేరిట నిర్వహించే సంస్మరణ ప్రసంగాలు, పరిణతవాణి ప్రసంగ పరంపర కొనసాగుతూ అనుబంధంగా పుస్తక ప్రచురణ జరుగుతున్నది. 2013వ సంవత్సరంలో పరిషత్తు అధ్యక్షులు డా. సి.నారాయణరెడ్డి నేతృత్వంలో సప్తతి పూర్తి సందర్భంగా ఏడాది పొడవునా అనేకమైన ప్రత్యేక కార్యక్రమాలు పరిషత్తు ఏర్పాటు చేయడం జరిగింది. 'తెలంగాణ తెలుగు సాహిత్య వికాసం', 'తెలంగాణ ప్రాచీన కవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు– ప్రయోగ రీతులు', 'తెలంగాణ ప్రాచీన నృత్య రీతులు', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'తెలంగాణ కవయిత్రులు, కథయిత్రుల సమ్మేళనం' వంటి అనేక సదస్సులు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. గత సంవత్సరం పరిణతవాణి ప్రసంగాలతో కూడిన తాజా సంపుటి, 'తెలంగాణ సాహిత్య వికాసం', 'వ్యాసగుళుచ్ఛం' రెండు సంపుటాలు ప్రచురించడం జరిగింది. వాటిని పాఠకులు ఆదరించారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది. ఈ నూతన యుగోదయవేళ తెలంగాణకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేక అధ్యయనం జరగాలి. ఆ అధ్యయనానికి కావలసిన పఠనసామాగ్రిని సమకూర్చుకోవాలి. ఇప్పటివరకు ఉమ్మడి చరిత్రలో అంతర్భాగంగా వుండి తగినంత ప్రాధాన్యం లభించలేదని ప్రజల్లో వున్న అసంతృప్తిని పోగొట్టాలి. ఆ దిశగా తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న విశిష్ట కార్యక్రమాల నిర్వహణలో ప్రచురణ ఒకటి. ఆ ప్రచురణల్లో 'తెలంగాణ సాహిత్యచరిత్ర', 'తెలంగాణ ప్రాచీనకవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు–కావ్యప్రయోగాలు', 'కుతుబ్‌షాహీల తెలుగు సాహిత్యసేవ', 'మాఊరు మాట్లాడింది', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'సురవరం ప్రతాపరెడ్డి వ్యాసావళి', 'తెలంగాణ ప్రముఖుల పరిణతవాణి', 'బంజారాల వివాహ ఆచార పద్ధతులు', 'డా.దేవులపల్లి రామానుజరావు యాభై సంవత్సరాల జ్ఞాపకాలు', 'తెలంగాణ

చరిత్ర', 'తెలుగు జానపద సాహిత్యం– స్త్రీల గేయాల్లో సంప్రదాయం' గత సంవత్సరం వెలువడ్డాయి. ఇటీవలే 'పత్రికలు, ప్రసారమాధ్యమాల భాషా స్వరూపం' అనే గ్రంథాన్ని ప్రచురించింది.

ప్రస్తుతం శేషాద్రి రమణకవుల 'పరిశోధన వ్యాసమంజరి'ని వెలువరిస్తున్నాం. శేషాద్రి రమణుల పేర్లు వినగానే తెలంగాణ చరిత్రకు ముఖ్యంగా కాకతీయుల కాలం నాటి చరిత్రకు సంబంధించిన అమూల్యమైన విశేషాలను అందించిన పరిశోధక వశిష్ఠులజంట గుర్తొస్తుంది. ఆనాడు వారు ఊరూరా తిరిగి శాసనాలను అన్వేషించి చరిత్ర మూలాలను వెలికితీశారు. ఈ గ్రంథంలో కాకతీయుల కాలపు చరిత్రకు సంబంధించిన వ్యాసాలతోపాటు నిజాము రాష్ట్ర వాఙ్మయానికి సంబంధించిన అనేక విలువైన వ్యాసాలున్నాయి. ఈ వ్యాసాలన్నీ ఆనాడు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ప్రతి వ్యాసం చివరన పత్రిక పేరు, ప్రచురణ కాలం కూడా ఉన్నది. తెలంగాణ చరిత్రను పునర్నిర్మించుకొనే ప్రయత్నాలు చేస్తున్న ఈ తరుణంలో శేషాద్రి రమణకవుల కృషికి, పరిశోధనా శేముషికి నిదర్శనాలుగా నిలిచిన మౌలికమైన ఈ వ్యాససంపుటి విలువైన ఆకరసామగ్రిని అందిస్తుందని భావించి ఈ గ్రంథాన్ని పరిషత్తు ప్రచురిస్తున్నది. పద్యరూపంలో శేషాద్రి రమణులు రాసుకున్న ఆత్మకథ కూడా ఇందులో వున్నది. అంతేగాక వారి రచనల సూచిని ఇందులో పొందుపరుస్తున్నాం. ఈ గ్రంథంలోనే గాక ఇంకా అనేక పత్రికల్లో దాగివున్న రచనల వివరాలు కూడా ఈ వాఙ్మయ సూచిలో వున్నాయి. ఈ గ్రంథాన్ని పరిషత్తు తరఫున ప్రచురిద్దామని ప్రోత్సాహక వాక్యాలతో ముందుకు నడిపిన పరిషత్తు ట్రస్టు కార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారికి కృతజ్ఞతలు. ఇందులోని వ్యాసాలను పరిశీలించి శ్రమతో క్రమాన్ని కూర్చడంలో సహకరించిన ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ఎస్వీరామారావుగారికి, ముద్రణకు సిద్ధమయ్యే ముందు సాకల్యంగా పరిశీలించి లోటుపాట్లు సరిచేయడమేగాక ప్రత్యేకంగా ఒక వ్యాసాన్ని కూడా అందించిన ప్రముఖ పరిశోధకులు కుర్రా జితేంద్రబాబు గారికి కృతజ్ఞతలు. ఈ సంపుటిని వెలుగులోకి తేవడానికి దోహదపడిన శేషాద్రి రమణకవుల మనవడు దూపాటి శేషకుమారాచార్య, ఇతర కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు. పరిషత్తు కార్యక్రమ సలహాదారు శ్రీ గోవిందరాజు రామకృష్ణారావుగారికి, డిటిపి చేసిన శ్రీమతి లక్ష్మీశ్రీనివాస్‌కి, అందంగా ముద్రించిన సాయిలిఖిత ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అధినేత వై.వెంకటేశ్వరరావుగారికి ధన్యవాదాలు తెలుపుతున్నాం.

(డా॥ జె.చెన్నయ్య)
ప్రధాన కార్యదర్శి
తెలంగాణ సారస్వత పరిషత్తు

విషయసూచిక

1. కాకతీయ సామ్రాజ్యము 9
2. కాకతీయ వంశము 24
3. కాకతీయ రాజులు 35
4. కాకతి ప్రోలరాజు చరిత్రము 54
5. కాకతీయుల చరిత్రము – విశేషాంశములు 65
6. కాకతీయుల ఆంధ్రభాషాసేవ 74
7. రుద్రమదేవి 79
8. ప్రతాపరుద్ర చక్రవర్తి 96
9. ప్రతాపరుద్రీయం 108
10. అనపోతనాయకుడు 115
11. రుద్రదేవుని అనుమకొండ శాసనము 125
12. గంగాధరుని శిలాశాసనము 136
13. భీమరాజు – గోకర్ణుడు 142
14. భీమకవి నివాసస్థానము 152
15. కామినేని మల్లారెడ్డి 163
16. సురభి మాధవరాయకవి 170
17. నిజాము రాష్ట్రాంధ్రకవులు 181
18. తూము రామదాసకవి 192
19. నిజాము రాష్ట్రమునందలి ఆంధ్రులు 195
20. నిజాము రాష్ట్రము – వాఙ్మయచరిత్రము – I 205
21. నిజాము రాష్ట్రము – వాఙ్మయచరిత్రము – II 221

22. నిజాం రాష్ట్రము – పరిశోధనోద్యమము 235

23. పరిశోధక నివేదిక 245

24. విస్మృతక్షేత్రము – పానుగల్లు 261

25. విరాటరాజు గద్దె 267

26. నేలకొండపల్లి 270

27. రామగిరిదుర్గము – మడికి సింగనకవి 273

28. రామప్పగుడులు 284

29. సువర్ణయుగము 287

30. శ్రీకృష్ణదేవరాయల విజయయాత్ర 295

31. తెనాలి రామకృష్ణకవి 298

32. గుప్త సామ్రాజ్యము 300

అనుబంధం

ఆత్మకథ 306

శేషాద్రి రమణకవుల వాఙ్మయసూచిక 311

చరిత్ర పరిశోధక వరేణ్యులు ....
ఆచార్య ఎస్వీ రామారావు 347

తొలి తరం చారిత్రక, శాసన పరిశోధకులు... ....
శ్రీ కుర్రా జితేంద్రబాబు 349

మనవి. ....
దూపాటి శేషకుమారాచార్యులు 359

1. కాకతీయ సామ్రాజ్యము

ఆంధ్ర వాఙ్మయాభివృద్ధికి ముఖ్యస్థానమును దేశీయశూరవర్యులకు నిలయమునగు నాంధ్ర సామ్రాజ్యపుఁ జరిత్రము క్రమముగ విస్మృతికి వచ్చుచున్నది. ఆంధ్రదేశీయుల పవిత్ర క్షాత్రరక్తము ప్రవహించిన కాకతీయసామ్రాజ్య మహాత్మ్యము చేతులార వ్రాసి కృతార్థులము కాఁదలంచి సంగ్రహముగ నివేదించుచున్నారము.

ఆంధ్రసామ్రాజ్య మని వ్యవహరింపఁబడిన పవిత్రక్షేత్రము నిజామురాష్ట్రములోని హనుమకొండ ఒరుంగల్లులు ముఖ్యస్థానములుగఁ జాలకాలము సుప్రసిద్ధమై యుండెను. ఈ సామ్రాజ్యమును గాకతీయులను త్రిలింగదేశవాసులు ధర్మబద్ధులై పాలించిరి. కాకతీయు లాంధ్రులు. శాసనములలో సూర్యవంశ్యులనియుఁ జంద్రవంశ్య లనియుఁ దదన్యు లనియు వ్యవహరింపఁబడుచు వచ్చిరి. శూద్రులని చరిత్రకారులు విశ్వసించుచున్నారు. ఈ వంశీయులకుఁ గాకతీయులని పేరువచ్చుట కొక చిత్రకథఁ జెప్పుచున్నారు. [1]కాకతీయను శక్త్యనుగ్రహమున గుమ్మడితీఁగయందొక బాలకుఁడు జనించెనఁట. ఆ బాలకుని వంశము కాకతీయవంశ మని ప్రసిద్ధమయ్యెనఁట, "కాకతీ"యనునది జైనదేవత యనియు నీవంశీయులలోఁ బూర్వులంద ఱాదేవత నారాధించునా రగుటచేఁ గాకతీయులని వ్యవహరింపఁబడిరనియుఁ గొందఱు తెల్పుచున్నారు. కథాంశ మెటులున్నను గాకతీయులలో గొన్ని పురుషాంతరములవారు జైనులై తదావాదముల నాదరించిరనుట విశ్వసనీయాంశము. [2]ఇట్లు జైనమతావలంబు లైనవారిలో రుద్రదేవుని జనకుఁడగు రెండవప్రోలరాజే కడపటివాఁడని తెలియుచున్నది.

మహామండలేశ్వరప్రోలరాజు

ఇతఁడు శూరవర్యుఁడు. త్రిలింగదేశమున నాంధ్రసామ్రాజ్యము నెలకొల్పిన యశఃకాముఁడీ మహామహుఁడే. ప్రోలరాజనియుఁ బ్రోలిరాజనియు నీతనినే

---

1. కాకతీయ కులోరాజా రంజితాం స్వగుణైర్భువం కాకత్యాః పరశక్తేః కృపయా కూశ్మాండవల్లికా కాచిత్పుత్ర మనూత తదే తత్కుల మనఘం కాకతీయ సంజ్ఞమభూత్. (చూ. అనితల్లి కలువచేఱు శాసనము)

2. హనుమకొండలోని పద్మాక్షీయాలయము ముందుఁ గల కర్ణాటశాసనము చూడుడు.

వ్యవహరింతురు. ఈప్రోలరాజు జనకుండగు త్రిభువనమల్లబేతరాజు చాళుక్యప్రభువుల నొద్ద సామంతుండుగ నుండెను. [3]సమస్తభువనాశ్రయ శ్రీపృథ్వీవల్లభమహారాజాదిరాజ పరమేశ్వర పరమభట్టారక సత్యాశ్రయకులతిలక చాళుక్యాభరణాది బిరుదముల నీ త్రిభువమల్లుండు వహించి శూరచూడామణియై యాంధ్రదేశమును బాలించెను. ఇతని జనకుండే మొదటి ప్రోలరాజు. దేశచరిత్రములందు శాసనములందు నీతని విస్తరమగు జీవితము కానరాదు. పూర్వుల చరిత్రము నింతతో విడచి శాఖాచంక్రమణ న్యాయము ననుసరించి మహామండలేశ్వర ప్రోలరాజు జీవితచరిత్రమును దెలిసికొనం బ్రయత్నింతము. [4]ప్రోలరాజు క్రీ.శ.౧౧వ శతాబ్దారంబమునుండి, సుప్రసిద్ధుండైనటు లూహింప వచ్చును. చాళుక్యులకు సామంతులుగం దమపూర్వు లుండిరే గాని ప్రోలరాజు మాత్రమటుల నుండలేదు. ఇతండు స్వతంత్రుడై హనుమకొండలో రాజ్యము స్థాపించి మిగుల నభివృద్ధిలోనికిం దెచ్చెను. ఈతని జీవితమంతయు విరోధుల కెదురుగ నిలుచుటతోడనే గడచినటుల శాసనముల వలనం దెలియుచున్నది. చాళుక్యచూడామణియగు తైలపదేవుని యను రాగముతో సంగరమున విడచిపెట్టెను. లుంకాక విషయాధీశ్వరుండగు గోవిందరాజును బంధించి విడచి పెట్టెను. గుండరాజును సర్వవిధముల నవమానంచి వధించెను. పలువురు మండలేశ్వరుల సహాయముతో హనుమకొండ ముట్టడించిన జగ్గదేవుని జయించెను. ఈ విజయము లన్నియు హనుమకొండ శాసనములోం జెప్పంబడి యున్నవి. ప్రోలరాజునకుం బ్రతినాయకులు సామాన్యులు గారు. వీరందఱు నిజాముదేశములోని మండలాధీశ్వరులని సాధనాంతరములచే నిరూపింపవచ్చును. స్థానికచరిత్రములో ప్రోలరాజే యోరుగంటిలోం గోటం గట్టింప మంత్రకూటనివాసులగు రామారణ్య శ్రీపాదులవారిచే శ్రీవిద్యాచక్రక్రమమున నాకృతిని నిర్మింపంజేసెననియుం గోటలన్నియుం గట్టించెనని వ్రాయంబడియున్నది. కాని దానిని విశ్వసింపవీలులేదు. సోమరాజీయాదిగ్రంథములలో గణపతిదేవుండే కోటం గట్టించినటుల గానవచ్చుచున్నది. ఇదియే విశ్వసనీయాంశమనితోంచుచున్నది. ఇప్పుడు కానవచ్చు సిద్ధేశ్వరాలయమునకుం జుట్టుం గానవచ్చు కొండలన్నింటిని జరిపేసి పెద్ద

3. వడ్డెపల్లి చెఱువునొద్ద గల జీర్ణశాసనము చూడుడు.

4. శ్రీమత్ప్రోలనృపాల సైన్యపతినా విఖ్యాతవిక్రాంతినా యద్దెయేన మహాబలేన నిహతే మంథన్యగుండాధిపః - అను రుద్రసేనాని శాసనమువలనం గాటచమూపతియే గుండాధిపుని వధించినటులం దెలియును.

కట్టిపోయcబడియున్నది. ఒకవైపు గొప్పశిలాద్వారముసైతము కానవచ్చుచున్నది. ఈ కొండలకు మధ్య సిద్ధేశ్వరాలయము మొదలుకొని పద్మాక్షియాలయమువఱకుc గల విశాలప్రదేశమే ప్రోలరాజుకాలములోc గోటగానుండెనని యాస్థలముc జూచినc దోcపకమానదు. ప్రోలరాజు జైనమతాభిమాని యనుటకుc బద్మాక్షిదేవళపుc గొండరాళ్లపైc గల జైనవిగ్రహములు నటcగల శాసనముc దోడ్పడcగలవు. బద్మాక్షిదేవళముముందు సిద్ధేశ్వరాలయముముందుc గొలcది సరోవరములు కానవచుచ్చున్నవి. ఈ సరోవరయుగ్మమధ్యభాగముననే ప్రోలరాజు కోటc గట్టియున్నట్టుల నూహింపవచ్చును. ప్రోలరాజు తన జీవిత మంతయు మండలేశ్వరుల నెదిరించుటతోc గడిపి యాంధ్రసామ్రాజ్యమునొకవిధముగ నిర్మింపcగలిగెను. ఈవీరునకు రుద్రదేవుcడు మహాదేవరాయలను నిరువురు కుమారులు కలరు. రుద్రదేవుcడే వయస్సునc బెద్దవాcడు. మహాదేవరాయల శాసనములు కానరావు. దేవగిరిరాజులతోc బోరిగతించినటుల స్థానికచరిత్రమునc గానవచ్చును. రుద్రసేనాని రామప్పగుడుల శాసనములో రుద్రదేవునియనంతరము రాజ్య మల్లకల్లోలమై విరోధిరాజులచే నాక్రమింపcబడినటులc దెలియుటచే మహాదేవరాయలు రుద్రదేవుని రాజ్యపాలనముకంటె ముందుగా గతించినటులూహింపవలయును.

రుద్రదేవ చక్రవర్తి

ఈతcడసహాయశూరుడు. యుద్ధక్రియాకౌశలుcడు. రుద్రదేవుcడు నిదురించుతల్లిc దండ్రియగు ప్రోలరాజెందులకో స్పృశించెనcట. విభ్రాంతుcడై విరోధి యనుకొని రుద్రదేవుcడు జనకుcడగు ప్రోలరాజును గత్తితోc బొడచి ప్రమాదమునకుc బశ్చాత్తాప మొందెననియుc బ్రోలరాజాఖడ్గహతితో మూcడుదినములు జీవించి కుమారుcడు నిర్దోషి యనియు నది ప్రమాద మనియుc బౌరులకుc దెలిపి మరణించెననియు స్థానికచరిత్రలోc గలదు. ఇందెంతవఱకు సత్యముకలదో నిర్ణయింప వీలుకాదు. [5]రుద్రదేవుcడు పరాక్రమశాలియగు దొమ్మరాజును భంజించెను. పొలవాసదేశాధీశ్వరుcడు మేళగిదేవుని మేదరాజును వధించెను. వర్ధమానపురసంస్థానాధీశ్వరుcడు దురాచారుcడు మాతృసపత్నీపతియగు భీమరాజును రాజ్యమునుండి పాఱcద్రోలి వెంటనంటతఱిమి వర్ధమానపురమును

5. రుద్రదేవునిc బ్రతాపరుద్రుcడని వ్యవహరించుట యిప్పటి చరిత్రకారుల కలవాటుగ నున్నది. కాని శాసనములలోనీనామము కానరాదు.

దహించి తైలనృపతి రాజ్యమునాక్రమించినందులకుఁ బగఁ దీర్చికొనెను. రుద్రదేవుని జీవితములో నాంధ్రసామ్రాజ్యము స్థిరపడెను. ఆ రాతిలోకము నశించి యాత్మరాజ్యమువృద్ధియై బలవంతమై తనరారుటచే రుద్రదేవుఁడే కాక తీయరాజ్యస్థాపనాచార్యుఁడయ్యెను. తండ్రివలె నీతఁడు జైనమతాభిమాని కాఁడు. పాలకుఱికి సోమనాథకవి యాతని యాస్థానముననుండియనేక గ్రంథముల రచించి జైన మతనిర్మూలనము సైతమీప్రభుని యాదరణముచే నొనరించి రాజ్యమునందంతటను వీరశైవమతమును వ్యాపకములోనికిఁ దెచ్చెను. జైనగ్రంథము లీకాలముననే చాలవఱకు నశించియుండును. రుద్రదేవుఁడోరుగంటిలో (ఏకశిలానగరము) ముఖ్యస్థానముగ రాజ్యము బాలించినటులఁ గొందఱు వ్రాసియున్నారు. [6] హనుమకొండయే రాజధానిగఁ బాలించినటులనితఁడు స్థాపించిన స్వయంభూదేవాలయ శాసనమునఁ గలదు. రుద్రదేవుఁడు సమధిగతపంచ మహాశబ్దమండలేశ్వర హన్మకొండాపురవరేశ్వర పరమమాహేశ్వర పతిహితచరిత వినయభూషణ శ్రీమహామండలేశ్వరాది బిరుదములు వహించి యప్రతిమానపరాక్రమశాలియై నిర్విరోదిలోకముగ (క్రీ.శ.౧౧౪౦ మొదలు ౧౧౯౬ వఱకు) రాజ్యమును బరిపాలించెను. రుద్రదేవుఁడు సంస్కృత కర్ణాటాంధ్ర భాషలలోఁ బండితుఁడు కవియునై పెక్కుగ్రంథములు రచించెను. విద్యాభూషణబిరుదమును వహించి యితఁడు సంస్కృతమున నాంధ్రమున నీతిసారమను గ్రంథమును రచించియున్నాఁడు. మఱియు నీతఁడు సరస్వతీవిలాసమను న్యాయశాస్త్రమును చెప్పినటుల సైతము తెలియుచున్నది*. రుద్రభూపాలకుఁడు తన పేరుతో ననేకగ్రామములఁగ ట్టించుటయేగాక రాజధానియగు ననుమకొండలో నొక గొప్ప దేవాలయమును గట్టించి, వాసుదేవరను రుద్రదేవుని సూర్యదేవుని బ్రతిష్టించి ముందొక సహస్రస్తంభమండపమును గట్టించెను. ఈయాలయములోని శిల్పప్రశస్తి వేనోళ్లఁ బ్రశంసింపఁదగియున్నది. ఆలయములోని స్తంభములపైనను – ద్వారములపైనను – దీర్చిన చిత్తరువులు విగ్రహములు నిరంతర మాంధ్రులశిల్పసామర్థ్యము నుద్ఘోషించుచున్నవి. సహస్రస్తంభమండపమునకు నాలయమునకు మధ్య నొక నంది

---

6. రక్తస్రోతసి రుద్రదేవజయినో నృత్యత్కబంధాఃప్లవాః ఆయాం త్యా విజయ శ్రియశ్చ సవిధం కీర్తేః ప్రయాం త్యా దిశః, తస్యా స్తే నుమకొండ నామనగరీ శ్రీ రాజధానీవ యః – రుద్రదేవరాజుల విజయరాజ్య ముత్తరోత్తరాభివ్రవర్ధమాన మాచంద్రార్కతారముగా అన్మకొండ పట్టణమునందు సుఖసంకథా వినోదంబున రాజ్యముఁ జేయుచు (చూ.హనుమకొండశాసనము)

* *ఈ 'సరస్వతీ విలాసము'ను గజపతిప్రతాపరుద్రదేవరాజు రచించాడు. ఈ గ్రంథమును ఆంగ్లానువాదముతో కె.జితేంద్రబాబు ప్రచురించారు.*

కలదు. దానిపైఁ గల హారములు దానియునికి ఆకారపుబింకము దర్శనీయము. ఇపుడా మండపము ఆలయము పాడుబడినది. చిత్తరువులన్నియు విచ్ఛిన్న మొందింపంబడినవి. స్మరణీయము లగు నాలయచిహ్నముల తోఁ బాటు పూర్వోన్నత్యముఁ దెలుపునొక దీర్ఘికయు శాసనము నేఁటికి దర్శనీయముగ నున్నవి. రుద్రదేవుని యనంతరము రాజ్యము పరనృపాధీన మయ్యెను. [7]అప్పుడు రేచర్లగోత్రికుఁడును స్వామిభక్తుఁడును సేనానాయకుఁడు నగు రుద్రసేనాని విరోధి బృందమును జక్కాడి పరనృపహస్తగతయైన రాజ్యలక్ష్మిని బంధోన్ముక్తురాలినిగ నొనరించి రాజభక్తినిప్రకటించెను. పిమ్మట గణపతిదేవుని, బితృరాజ్యమున కభిషిక్తునిగావించి కాకతీయరాజ్యస్థాపనాచార్య బిరుదము వహించెను. ఈయంశ మంతయుఁ గ్రీ.శ.౧౨౧౩ స్థాపింపఁబడినరుద్రసేనాని శాసనమునఁ గలదు. విస్తరమందుఁ జూడఁదగును. ఈ ప్రభుభక్తి పరాయణుని సదా గణపతిదేవ చక్రవర్తి సాదరమునఁ దిలకించియుండును కావుననే నాంధ్రలోకమున కంతటి కమూల్యభూషణ మనఁదగు రామప్పగుడులు సాగరమునకుఁదీసి పోని తటాకము నెలకొల్పి రుద్రసేనాని కీర్తిశేషుఁడయ్యెను. రుద్రదేవ చక్రవర్తి కాలములోఁ గాకతీయసామ్రాజ్యమునకుఁ దూర్పున సముద్రము దక్షిణమున శ్రీశైలము పశ్చిమమునఁ గటకము ఉత్తరమున మాల్యవంతము సరిహద్దులుగా నున్నటులఁ జెప్పఁబడెను.

గణపతిదేవ చక్రవర్తి

ఓరుగల్లుకోట రుద్రదేవుని యనంతరము గణపతిదేవుఁడు కట్టించి యట రాజధాని నేర్పఱచియుండును. పెదతండ్రి యగు రుద్రదేవుఁడు స్థాపించిన వడ్డెపల్లి వినాయకదేవరగుడి అయ్యనవోలు మైలారుదేవరగుడి హనుమకొండలోని పూర్వోక్తదేవాలయము గణపతిదేవుని కాలమున మిగుల నభివృద్ధిలోనికి వచ్చెను. రుద్రసేనాని గణపతిదేవుని రాజ్యకాలమున నాలయము స్థాపించియుండుటచేఁ దండ్రి తరువాత గణపతిదేవుని సమ్ముఖమున సైతము సేనానిగ నున్నటు లూహింపవచ్చును. ఇటులే రుద్రదేవుని చెంత గణపతిదేవుని చెంత నేకకాలమున నున్న వారిలో నామిరెడ్డియను సేనానియొకఁడు సైతము కలఁడు. గణపతిదేవుని పాండిత్యాదికములు

7. గ్రంథాలయసర్వస్వము మూఁడవసంపుటము ఆఱవభాగములోని రుద్రసేనాని చరిత్రమున నీయంశముఁ దెల్పు రామప్పగుడుల వద్ద గల శాసన ముదాహరింపఁబడి యున్నది.

తెలిసికొను నాధారములు లభించుట లేదు. కాని యుభయ కవిమిత్రుఁడగు తిక్కన సోమయాజి యీతని సమ్ముఖమునకు వచ్చి సత్కృతుఁడై తన భారతమును వినిపించి జైనబౌద్ధమతముల నోడించిఁయేఁగినటుల ప్రతాపచరిత్రమునను సిద్ధేశ్వరచరిత్రమునను గలదు. గణపతిదేవుని నామముతోఁ గట్టఁబడిన గణపవరముల సంఖ్యకు మితి లేదు. ఇతనియొద్ద శివదేవయ్య మంత్రిగ నుండెననియు బండితారాధ్యులవలన శైవమతదీక్ష గ్రహించెననియుఁ బ్రతాపచరిత్రమునఁ గలదు. శైవగురు పరంపరలోని విశ్వేశ్వరశివదేశికు డితఁడే యని కొందఱ యభిప్రాయము. పితృవధాకారకులగు దేవగిరిరాజులతోఁ దఱుచుగ నీతఁడు సంగ్రామములు జరిపి విజయము గడించుచు వచ్చెను. సముద్రములతోఁ బోల్పఁదగు తటాకములు పెక్కులు నిర్మించి భూమిని సస్యవతీనొనరించి ప్రజారంజకుఁ డగుటయే గాక పరిమితిగ సముద్రవ్యాపారమునకుఁ బన్నులు విధించి గణపతిదేవుఁడు సముద్రవ్యాపారము నభివృద్ధిలోనికిఁ దెచ్చెను. గణపతి దేవుని కాలమున రాజ్యము మిగుల నభివృద్ధిలోనికి వచ్చెను. మండలేశ్వరులందఱు సామంతులైరి. పూర్వము నుండి హస్తగత మగుచుఁ దొలంగుచునున్న కాంచీరాజ్యమును బాలించుట కొకప్రతినిధిని కొలదిఁబలముతో నుంచి పాండ్యరాజులఁ దఱిమివేసెను. శ్రీశైలప్రాంతమునకుఁ గొణిదెసప్రాంతమునకు వేఁగినాటికి నల్లగొండ ప్రాంతములకుఁ ప్రత్యేక ప్రతినిధుల నుచితమగు బలముతో నియోగించి మండలేశ్వరుల నందఱను సామంతులనుగఁ బాదపద్మోపజీవులనుగ నొనరించి యీ రాజచంద్రుఁడోరుగల్లులో (ఏకశిలానగరమున) రాజధాని స్థాపించి ప్రతిష్ఠ గడించెను. సాదారణముగ నాంధ్ర దేశమునఁ బూర్వము స్వంతత్రము ననుభవించిన రాజు లందఱు సామంతులై మానప్రాణములఁ గాపాడికొని సురక్షితులై జీవించిరి. గంగయసాహిణి, శివదేవయ్య సామంతభోజుఁడు చాండసేనాని నామిరెడ్డి లోనగు నాంధ్రవీరుల గణపతిదేవుని ధర్మపరిపాలనమునకు సర్వవిధములఁ దోడుపడి కాకతీయసామ్రాజ్యభారవాహికులై ప్రతిష్ఠ గడించిరి. గణపతి దేవుడు ధర్మాత్ముఁడు. ఈతనిశాసనము లాంధ్రదేశమునం దంతటను గానవచ్చుచున్నది. గణపతిదేవుని రాజ్యకాలము క్రీ.శ.౧౧౯౯ మొదలు ౧౨౬౦ వఱకని చరిత్రకారు లభిప్రాయపడియున్నారు. గణపతిదేవునకుఁ బుత్రసంతాన మున్నట్లు తెలియదు. ఇతనియనంతరము రుద్రమదేవి రాజ్యమునకు వచ్చెను.

రుద్రమదేవి రాజ్ఞి

ఈయన గణపతిదేవుని యనంతర మాంధ్ర సామ్రాజ్యమును మహత్తరముగఁ బరిపాలించెను. గణపతిదేవున కీయమ భార్యయని స్థానిక చరిత్రములయందును జరిత్రలయందుఁ గలదు. కాని కుమార్తె యనుటకే ప్రబలాధారములుకానవచ్చుచున్నవి. [8]కావునఁ గుమార్తె యని విశ్వసింపవచ్చును. మాయూహకనుగుణములగు శ్లోకములు కలవు. కాని వ్యాఖ్యాత రుద్రమదేవి భార్యగనే వ్యవహరించెను. ఈయభిప్రాయ భేదములకు హేతువు విచారణీయము. రుద్రమదేవి స్వయముగ స్థాపించిన శాసనము లభించు వఱకు నామావశిష్టమైయున్న భార్యయను వాదము సంపూర్ణముగ సంతరింపఁజాలదనుట యథార్థము. రుద్రమదేవి పరాక్రమశాలిని తన వ్యవహారములను రుద్రదేవుఁడు నామముతో జరుపుచు విరోధులకు భయంకరముగ సామ్రాజ్యము నీయమ పాలింపసాగెను. దేవగిరి యాదవరాజులు దిరుగఁబడి మహాసైన్యముతో నేకశిలానగరమును ముట్టడింపఁ జనుదెంచి పక్షముదినములు ఘోరయుద్ధమును గావించి పరాభూతులై పాఱిపోవుచుండ రుద్రమదేవి సైన్యమాబలమును దఱుముచు మూఁడు లక్షల పదాతులను లక్ష గుఱ్ఱంబులను బట్టి, దేవగిరి సమీపంబున కేగి, కోటి ద్రవ్యంబు లపరాధంబుగ దీసికొనినట్లును రుద్రమదేవి యచట జయస్తంభము స్థాపించినట్లును స్థానిక చరిత్రమునఁ గలదు. రుద్రమదేవి తనకొమార్తె యగు ముమ్మడిమ్మకు సత్సంతానముఁ బ్రసాదింపఁ గాకతమ్మ వద్దకు వడ్డెపల్లి సిద్ధివినాయకుని సన్నిధికి మొగిలిచర్ల యేకవీరాదేవి సమ్ముఖమునకు అయినవోలు మైలారుదేవి చెంతకుఁ బోవుటకుఁ బురంబువెడల, సవతిపుత్రులగు హరిహరదేవుఁడు మురారిదేవుఁడు బలోపేతులై యేకశిలానగరముఁ బ్రవేశించి గౌనులు కాచి రుద్రమదేవిని యామె పుత్రిని పరిజనంబును బురిలోనికి రాకుండ నిరోధింపఁ గార్యముమిగిలెనని సామోపాయముతోఁ గోటలోఁ బ్రవేశించి సమయానుసారముగ రుద్రమదేవి వారలను బలసహితముగా మట్టుపెట్టి సామ్రాజ్యమును రక్షించి తన రాజ్యపరిపాలన కౌశలము ప్రదర్శించి శాశ్వత ప్రతిష్ఠఁగడించెను. ఈయమ

---

8. (1) జాతా తస్య పయోనిధే రివరమా శ్రీరుద్రదేవీ సుతా (కొలను పాకశాసనము), (2) రుద్రదేవి సముదభూత్పురణ్యాత్సర్వ భూభృతాం (మల్కాపురము శాసనము), (3) పిత ర్యుపరతే తద్వ దరక్షదఖిలాం క్షితిం శ్రీ వీరరుద్రదేవీ తిదుహితామహితా గుణైః. (అనితల్లి కలువచేఱు శాసనము)

రాజ్యకాలము క్రీ.శ. ౧౨౬౧-౧౬౮౯ వఱకని చరిత్రకారులు నిర్ణయించియున్నారు. పలువురు రాజులు రుద్రమదేవి పరిపాలనమునఁ దిరుగబడి పరాభూతులై శాంతిగడించి నటుల జరిత్రమునఁగలదు. గణపతిదేవుని కాలమునందున్న యాంధ్ర సామ్రాజ్యమును జెక్కుఁజెదరనీయక కాపాడుటయే గాక రుద్రమ దేవి ధనము మిగుల నెచ్చించి యేకశిలానగరపుఁ గోటను మిక్కిలి యభివృద్ధి వఱచెను. రుద్రమదేవికిఁ బుత్రసంతానము లేదు. ఈయమ భర్త యేమండలాధీశ్వరుఁడో తెలియదు. ఇట్లు కొలఁదికాలము రాజ్యము పాలింప, రుద్రమదేవి రాజ్యభారము వహించు తేజము పుత్రియగు ముమ్మడమ్మగర్భమున నభివృద్ధి నొందసాగెను. శ్రీప్రతాపరుద్ర దేవచక్రవర్తి జనించెను. రుద్రమదేవి పుత్రికచే నోమించిన వ్రతము లన్నియు ఫలించెను. తన తండ్రి నాట నుండియు మంత్రియై దేశీకుడై యున్న శివదేవయ్యచే నాశిశువునకు రక్షార్థము విభూతిఁ బెట్టించి నామకరణము చేయించి రుద్రమదేవి శిశుసంరక్షణమున నప్రమత్తురాలై ప్రవర్తింపసాగెను. [9]యుక్తవయస్సు వచ్చిన పిమ్మట మంత్రి సామంత దండనాయకాదుల యభిప్రాయాను సారముగఁ బ్రతాపరుద్రచక్రవర్తి నొక శుభముహూర్తమునఁ బుత్రునిగా స్వీకరించెను. పిమ్మట నొక యర్హకాలమున నారుద్రమదేవిరాజ్ఞి ప్రతాపరుద్రచక్రవర్తి కాకతీయసామ్రాజ్యమును బట్టాభిషేకముఁ గావించి కృతార్థురాలయ్యెను.

శ్రీప్రతాపరుద్ర చక్రవర్తి

[10] రుద్రమదేవి మనుమనికిఁ పట్టాబిషేకము గావించినదాదిగ నతనిఁ బుత్రునిగ వ్యవహరించినట్లును అతఁడు రుద్రమదేవిని తండ్రిగ భావించినటులను దెలియుచున్నది. ప్రతాపరుద్రదేవచక్రవర్తి కాలములో దేశమునకు భాషకు సుదినములు వచ్చెను. ఆంధ్ర సామ్రాజ్యము, ద్రవిడదేశమును ఓఢ్ర దేశమును కర్ణాటదేశమును మహారాష్ట్ర దేశమును దన ఛత్రచ్ఛాయక్రిందికిఁ జేర్చుకొని ధర్మబద్ధముగఁ బవిత్రము

---

9. స్వీకృతే పుత్రభావేన దౌహిత్రే ప్రాజ్ఞమాజ్ఞయా అస్మిన్నిదేహి దౌరేయే గుర్వీ ముర్వీధురాం... (ప్రతాపరుద్రయశోభూషణము)

10. యస్యాః కాకతివంశ మౌక్తికమణి శ్రీరుద్రదేవస్సుత స్తస్యాః కిం కథయామ వైభవ మతః శ్రీరుద్రదేవ్యాః పరం (మాల్కాపురము శాసనము) రాజ్ఞా క్షత్రియమౌళిమండనమణే స్తాతస్య సానుగ్రహో (ప్రతాపరుద్రయశోభూషణము)

క్షాత్రవంతము నగు నాంధ్ర తేజముచే నిళినాభిరామముగ నేలసాగెను. ఆ కాలమువారు ప్రతాపరుద్రుని సాక్షాత్తు రుద్రాంశముగ భావించి దైవమని పూజింపసాగిరి. [11]ఈభక్తి ప్రత్తులలోని మగ్నులై ప్రతాపరుద్రునకు నొసట వేఱొక కన్నుఁగల దనియుఁ దానఁజేసి ముక్కంటి యనునామము సైతమీయనవహించె ననుటయుఁ దండకవిలెలలోఁ గాననగును. ప్రతాపరుద్ర చక్రవర్తి జీవితకాలములోఁ జాలభాగము శాంతముగ గడచెను. రాజ్యములోని భాగము లన్నింటిని సీమలుగ విభజించి తత్కాలోచితములగు పేరులఁ బెట్టి ప్రతాపరుద్రదేవుఁడు క్రొత్తనాయకులను నియోగించి వారలకు సర్వాధికారము నొసంగి రాజ్యమునంతయు శాంతిమంత మొనరించెను. తొల్లి గణపతిదేవచక్రవర్తి యిట్టి పరిపాలనముఁ గావించెఁ గాని యందుఁ గొన్ని మార్పు లావశ్యకములగుటచే బ్రతాపరుద్రుఁడనేక విధముల సంస్కరించి నూతనమార్గములఁ గనిపెట్టెను. త్రిపురాంతకాఅంబదేవాదిమండలేశ్వరు లపుడపుడు తిరుగఁబడుచు వచ్చినను బ్రతాపరుద్రచక్రవర్తి తాను స్వయముగ సంగ్రామమునకు వెడలక సైన్యముచే శాంతిని స్థాపింపసాగెను. ప్రతాపరుద్ర చక్రవర్తి దర్మస్వరూపుఁడని ఖండఖండములయందుఁ బ్రతిష్ఠ పాటఁబడెను. ఆంధ్ర సామ్రాజ్యము సామాన్యజనుఁడు మొదలు చక్రవర్తి వఱకు నాదర్శప్రాయముగ నుండెను. పూర్వము స్వతంత్రులుగ నున్న దేశాధీశ్వరులు సామంతులై ప్రతాపరుద్రచక్రవర్తికి లోఁబడి యభిమానమును గాపాడికొనవలసిన యావశ్యకము తటస్థించెను. కాని ప్రతాపరుద్రుఁడేమఱక వేఁగులచే రాజకీయతంత్రముల నెఱుపుచు నాంధ్ర సామ్రాజ్యమును వేయి కన్నులతోఁ గాంచుచు జీవితసర్వస్వమును వెచ్చించి యెట్టి కల్లోలములు జరుగకుండ జాగరూకుఁడై మెలఁగసాగెను. కాకతీయ చక్రవర్తులకు దేవగిరి రాజులకుఁ జిరకాలమునుండి ద్వేషము కలదు. పలుమాఱ్లు కాకతీయ చక్రవర్తుల నెదిరింపఁ గృతప్రయత్నులై దేవగిరి రాజు లపజయమును నార్జించి మిగుల నష్టపడిరి. ఆక్రోధాగ్ని ఆద్వేషవిద్యుత్తు - ప్రతాపరుద్రచక్రవర్తి కాలమున సైతమంతరింపలేదు. [12] దేవగిరిరాజులు ప్రతాపుని కాలములో సైతము గోదావరి

---

11. చూ. కొండవీటి సామ్రాజ్యములోని కాకతీయచరిత్రము.

12. శ్లో. రే రే సేవణ క స్తవాయ మనిదంపూర్వోఽ ద్యగర్వో మహాను ఉత్తీర్ణా కిలయేన గౌతమనదీ ప్రాప్తోఽ పి మృత్యోర్ముఖం ఏషా కాకతివీరరుద్ర ఇతి కిం నాశ్రావి సప్తాక్షరీ ప్రక్షుభ్య త్రుతిపక్ష పార్థివ మహాభూతగ్రహోచ్చాటనీ? (ప్రతాపరుద్రయశోభూషణము.)

దాఁటి యాంధ్రసామ్రాజ్యముపైఁబడి పరాజితులైనటులందెలియుచున్నది. ఆంధ్రసామ్రాజ్యము శాశ్వతముగ నంతకాలమేని నిలుచుటకుఁ ద్రవ్వని పరిమగనున్న గౌతమీస్రవంతియే కారణమనుట నిజము. ఆంధ్రనగరసైన్యము గోదావరి శూలమును గాచియుండి సామ్రాజ్య క్షేమము సంతరింపఁసాగెను. ఆంధ్రసామ్రాజ్య మెంత దుర్భేద్యముగ శత్రుజనాగమ్యముగ నుండెనో ప్రకృతకాలమున జీర్ణమైయున్న యాకోట దర్శించినచో పాఠకసోదరుల కుద్యోతకము కాఁగలదు. [13] ఆంధ్రసామ్రాజ్యమున కాకాలమున వచ్చెడి రాబడికి మేరలేదు. ఆదాయము వ్యయము స్థానిక చరిత్రమున వ్రాయఁబడియున్నది. ఇందతిశయోక్తి యున్నటుల నూహింపఁజాలము.

చాళుక్యరాజుల ముఖ్యస్థానమగు కల్యాణపురిపైకి రామేశ్వర ప్రాంతమునకు విజయయాత్ర కేగి కానుకలతో వెనుకకు మఱలుటయే గాక ప్రతాపరుద్రచక్రవర్తి

---

13. కటకవల్లభుఁడు లోనుగాఁగల చిల్లరరాజులు ప్రతివర్షంబును ఇచ్చు నప్పనంబులు ఇరువై నాల్గుకోట్లు. తనభూమి పాలితంబై రాజ్యంబువలన వచ్చు ధనంబు ఇరవైకోట్లు. అగ్రహారంబులు బ్రాహ్మణులకుఁ జెల్లుచుండెడివి నాల్గువేలు. దేవతావైభవంబులకు రెండువేల గ్రామంబులు, ఇదిగాక తన భాండారమునకు వచ్చునట్లు నాల్గుకోట్లు. (వ్యయము) ప్రతివర్షంబు తులాపురుషంబులకు మూఁడు కోట్ల యేబది లక్షలు. నిత్యవైభవంబునకు పరిమళగంధ కర్పూర కాశ్మీర జవాజి పరిమళంబులకు పంక్తిభోజనంబులకు నగరిదీపాలకును నానాదేశముల నుండి వచ్చు విద్యార్థులకును బంచిపెట్టిన ద్రవ్యంబు ప్రతివర్షంబును మూఁడుకోట్ల అరవయిలక్షల యిరువయివేలు. నగరుగాచు నిశ్శంకవల్లభునకు జీతము ప్రతివర్షంబును భటసహితంబుగా ఎనభై యెనిమిదిలక్షల యిరువదివేలు. అన్నసత్రంబుల గణుతి ఒక్కొక్క సత్రంబునకు వేయింటి చొప్పున నూరుసత్రంబులు ద్విజులకు ఏడాదికి మూఁడుకోట్ల యెనుబదిలక్షలు. రాజమదగజంబులకును ఉత్తమాశ్వంబులకును జీతంబులవారికి రెండుకోట్ల యెనుబదిలక్షలు. ఏకశిలానగరంబున గల దేవతావైభవంబున కొక్కకోటి. రాజగృహంబులు కట్టే పనులవారికి ప్రతివర్షంబున నొకకోటియు వారణాసి విశ్వేశ్వరునకు శ్రీశైలమల్లికార్జునునకు కాళహస్తీశ్వరునకు రామేశ్వరునకు నాసికా త్ర్యంబకేశ్వరునకు అరుణాచలేశ్వరునకు కొలిపాక సోమేశ్వరునకు ఏకవీరేశ్వరునకు వేములవాడ రాజేశ్వరునకు కాళహస్తిముక్తీశ్వరునకు గోకర్ణేశ్వరునకు వీరుమొదలైన యీశ్వరస్థానంబులకును శ్రీరంగనాయకులు కంచివరదరాజులు శ్రీవేంకటేశ్వరులు మంగళగిరి నృసింహస్వామి సింహాచలం ఆదివరాహమూర్తి.... భద్రాచలం శ్రీరాములకును... ప్రతివర్షంబు మూడుకోట్లు. తన భండారమునకు మూడు కోట్లు చెల్లుచుండె. (ప్రతాపచరిత్రము).

మళయాళదేశమేలుముకుందా దేవిని సౌరాష్ట్ర దేశాధీశ్వరులను గెల్చి ఢిల్లీపైకి దాడివెడలి సులతానొసంగిన కానుకలతోఁ గరుణించి వెనుకకు మఱలెనఁట. ఈచక్రవర్తి కాలములో శ్రీశైలము కాళేశ్వరము త్రిపురాంతకము లోనగు చోటులఁ గల దేవాలయము లమితవైభవముతో నలరారెను. హతశేష మగు జైనమతము సైతము చాలవఱకితని కాలముననే నశించెను. కొలనుపాక, వేములవాడ, హనుమకొండ, లోనగుచోటుల గల జైనదేవళము లన్నియు మార్చి, వానిని పాలించు జైనులఁ దొలంగించి శైవుల యధీనముఁ జేసి క్షేత్రమాహాత్మ్యములు సృజించినది సైతమీకాలముననే యని యూహింపఁ బెక్కు లాధారములు కానవచ్చుచున్నవి. రాజ్యమునందంతట నాకాలమున ప్రభుని యాదరణముచే శైవమతమునకే ముఖ్యస్థానము లభించెననుట సత్యము.

ప్రతాపరుద్ర చక్రవర్తి మిగుల సుందరాకారుఁడు. వివిధాలంకార భూషిత మగు నేనుఁగుపై నెక్కి యాంధ్రనగర రాజవీధులలో విహరించుచుఁ బ్రజలకు దర్శనభాగ్య మొసంగుచుండెను. రసికతా ప్రచురణమునకుఁ గాఁబోలు నితనికి వేశ్యాసంపర్క మున్నటుల గ్రంథాంతరములలో వ్రాసిరి.[14] కొలఁదిలోపములఁ బాటిసేయరాదు గాన ప్రతాపరుద్ర చక్రవర్తి ధర్మప్రభువనుటలో నెట్టి సంశయము లేదు. ఈ రాజన్యుఁడు తన పేరుతో నేకశిలానగరమున కీశాన్యమునఁ బ్రతాపగిరి యను నొక దుర్గముఁ గట్టించెను. రెండు వేలయోడల నిర్మించి ద్వీపాంతరములనుండి వస్తుసామగ్రిఁ దెప్పించుచు సముద్ర వ్యాపారమును మిగుల నభివృద్ధిలోనికి దెచ్చెను. ప్రతాపరుద్ర యశోభూషణముఁ జూడ చక్రవర్తి విలాసపురుషుఁడనియు స్వైర విహార ప్రియుఁడనియు నూహింప నవకాశము కలుగును. ఇతఁడు ప్రతిష్ఠించిన దేవాలయములు చేసిన ధర్మములు లెక్కయిడరానివి. ఆంధ్రవాఙ్మయమున నీయనకాలమున నూతనవికాసము కలిగెననుట సహజోక్తియే. ఈ ప్రభుని యాస్థానమున నూటయేబదిమంది బంగారు పల్లకి యెక్కి సంస్థానమునకు వచ్చు నుత్తమ విద్వాంసులు, సకల కథా ప్రవీణులగు పరిహాసకు లెనిమిదిమందియు,

---

14. శ్లో. వీరరుద్ర మధిరూఢసింధురం ద్రష్టు మంధ్రనగరీపురంధ్రయః కుర్వతే రచితచంక్రియాత్వరా స్తుంగపద్మశిఖరాధిరోహణం. (ప్రతాపరుద్ర యశోభూషణము.) విద్యోపాధ్యాయి ప్రతాపరుద్రధరణీశోపాత్త గోష్ఠీ ప్రతిష్ఠాపారీణ నెఱుంగవయ్యెదవే మాచల్దేవి వారాంగనన్. (క్రీడాభిరామము) (181)

నూర్గురు వేదవేదాంగ పారీణులు, ఇన్నూరుగురు కవీశ్వరులు కలరు. భాస్కర రామాయణములో గొంతభాగము వ్రాసిన మల్లికార్జున భట్టొకc డాయాస్తానమున మిగలు గౌరవము నంది, రాజ్యతంత్రములలోc గూడ పాలుగొనెను. ఇతcడు నిరోష్ఠ్య రామాయణమును సంస్కృతమున రచించినటుల స్థానిక చరిత్రమునc గాననగును. ప్రతాపదేవుని యాస్థానకవులలో విద్యానాథుcడగ్రగణ్యుcడు. ఈయన రచించిన యలంకార గ్రంథము సుప్రసిద్ధమగు ప్రభువంశప్రఖ్యాతి వేయువిధముల సాటుచున్నది. మఱియు నీ చక్రవర్తి యవలంబనములో నుండియే సాహిణిమారన భాస్కర రామాయణము, గన్నయసేనాని మార్కండేయ పురాణము నంకితమొంది యాంధ్ర వాఙ్మయము నలంకరించిరి. రుద్రదేవుcడను నొకకవి సంస్కృత కర్ణాటభాషలలోc గొన్ని గ్రంథముల రచించెను. ప్రధానమంత్రి యగు శివదేవయ్య శివతత్త్వరసాయన మను నొక యుత్తమకావ్యము నాంధ్రవాఙ్మయమున రచించెను. ఇటులే యాకాలమున ననేక గ్రంథములు రచింపcబడి యుండవచ్చును. నిజాము రాష్ట్రమున సమగ్రముగ గ్రంథములc బరిశీలించిన నెన్నియమూల్య గ్రంథనామములు కవినామములు వెలువడునో? ఆంధ్ర నగరాధ్యక్షుcడగు ప్రతాపరుద్రుని జీవిత మీకారణముచే నాంధ్ర వాఙ్మయమునకు భూషణముగ నున్నది.

సమాప్తి

కాకతీయ ప్రతాపరుద్రచక్రవర్తి ఆంధ్రసామ్రాజ్యమును పాలించుకాలమున ఢిల్లీ సామ్రాజ్యమున కల్లాయుద్దీను రాజైయుండెను. త్రిలింగ సామ్రాజ్యమును హరించి ప్రతాపరుద్రుని తనకు సామంతుని జేసికొనcదలంచి యతడు చాల ప్రయత్నింపసాగెను. దేవగిరిదుర్గమంతకుమున్నే మహమ్మదీయహస్తగతమై యుంటచేతను ఈ దుస్తంత్రమున దేవగిరిరాజు భాగస్వాములై యుండుటవలనను అల్లాయుద్దీను దృష్టి – దురదృష్ట దేవతచేత నావరింపcబడిన నాంధ్రసామ్రాజ్యముపై ద్వరలో ప్రసరించెను. "మలిక్ కావూరు" అనువానితో నుచితమగు బలమునొసంగి యాంధ్ర సామ్రాజ్యము ముట్టడింపు మని అల్లాఉద్దీను పంపెను. మలికాపూరు రెండు మాఱు లాంధ్రసామ్రాజ్యము పైకి సంగ్రామమునకు వచ్చి పలాయన మొనరించెను. మూcడవ మారాంధ్రసామ్రాజ్యము విజయదూరము కానున్నటులc బ్రతాప రుద్రనకు దోcచుటచే మిక్కుటముగ మలిక్ కావూరునకు రొక్కమొసంగి సంధినొనరించెను. మహమ్మదీయబలములు వెనుక కేగెను. ప్రతాపరుద్రచక్రవర్తి తీర్థయాత్రలతో

రాజ్యమభివృద్ధి నెనర్చుటతోఁ గాలము గడుపసాగెను గాని మహమ్మదీయ లెన్నటికేని రాజ్యచ్యుతుని గావింతు రను నూహ జనింపదయ్యెను. దురదృష్టదేవత నెత్తిపైఁ గూర్చుండి తాండవమాడుచుండ యుక్తాయుక్త పరిశీలన మెక్కడనుండి వచ్చును. ఢిల్లీలోని మహమ్మదీయరాజ్యమున నంతలో శాంతి నశించెను. చక్రవర్తియగు నల్లాఉద్దీనును జంపి మలిక్ కావూరు ప్రభువయ్యెను. ప్రభుద్రోహి యగు మలిక్ కావూరును ప్రజలు వధించిరి. తరువాత ముబారక్ రాజ్యమునకు వచ్చెను. వానిని జంపి ఖుస్రూ రాజ్యమునకు వచ్చెను. వానిని వధించి గజిబేగ్ తుఘ్లఖ్ రాజ్యమునకు వచ్చెను. ఇతనినే గ్యాసుద్దీ నందురు. ఇతఁడు స్థిరపడి యాంధ్రసామ్రాజ్యము పైకి దృష్టి ప్రసరింపఁజేసెను, ముఖ్య సేనానాయకులతో నమిత మగు బలముతో నలూపుఖానను వానిని నితఁ డాంధ్రసామ్రాజ్యముపైకిఁ బంపెను. ప్రతాపరుద్ర సైన్యమునకు మహమ్మదీయ సైన్యమునకును ఘోర సంగ్రామము జరిగెను. ఆంధ్ర రక్తము మహమ్మదీయరక్తము సమముగఁ బ్రవహించెను. మారణ కాలముతలంపునకు వచ్చెను. ఎంత బలమున్న నేమి? బహిరంగ స్థలములలోని రాధారముగ నున్న యవనసైన్యము ఏడుకోటల మధ్య సురక్షితమై నున్న యాంధ్రసైన్యముతోఁ బోరిపోరి విజయము గడింపఁ జాలక వెనుకడుగు వేయసాగెను. ఆంధ్ర సైన్యము యవనదళమును గోదావరి వఱకుఁ దఱిమి వెనుకకు మఱలెను. మహమ్మదీయు లేడు మాఱు లేక శిలానగరమును ముట్టడించిరని స్థానిక చరిత్రమున గలదు. గాని చరిత్రమున నాల్గుమాఱు లనియే కలదు. మహమ్మదీయ సైన్యము నాల్గువంతులు నష్టపడి ఢిల్లీకిఁ జేరెను. ఆంధ్రసైన్యము తెఱపిలేని సంగ్రామముల వలన విజయయాత్రల వలనను జూలపఱకు బలవిహీనమయ్యెను. ప్రతాపరుద్రచక్రవర్తి తన సైన్యపరాక్రమములకు హర్షించి బహూకరించి కొలఁదికాలము వఱకెట్టి విప్లవము లుండవని విశ్రాంతి నొసంగెను. అలూపుఖాను హతశేష మగు సైన్యము ఢిల్లీకేగి పరాభవము సెఱింగింప మిగుల నాగ్రహించి బలము నంతయుఁ గొనిపోయియేని యాంధ్ర సామ్రాజ్యము రూపుమాపుమని సులతా నాజ్ఞనొసంగెను. విధిలేక విశ్రాంతిపైనందీసికొనక, వెంటనే అలూపుఖాను పూర్వముకంటె నెక్కుడు బలముతో నాకస్మికముగ నాంధ్రసామ్రాజ్యమును ముట్టడించెను. ప్రతాపరుద్రచక్రవర్తి విశ్రాంతిగొనుచున్న సైనికుల సమావేశపఱచి రణోన్ముఖులను గావించెను. కోటబైట మహమ్మదీయులు, లోన నాంధ్రుల నిలచి ఘోరముగఁ బోరాడిరి. ప్రతాపరుద్రునకనేకములు

యపశకునములు స్ఫురించెను. ఆంధ్రసామ్రాజ్యమంత మొందినటులే భావించి అన్నమరాజు వీరపాండ్యరాజు తేరాల బచ్చారెడ్డి సరపతిరాయలు లోనగు యోధాగ్రేసరులకు సైన్యాధిపత్యమొసంగి గజారూఢుఁడై ప్రతాపరుద్ర చక్రవర్తియు సంగ్రామరంగమలంకరించెను. రణము కోటకన్ని ప్రక్కల ఘోరముగ భయంకరముగ జరుగసాగెను. అన్నమదేవుఁడు వీరపాండ్యరాజు బచ్చారెడ్డి నలపతిరాయలు సమానముగఁ తురుష్కసైన్యమును బ్రతిఘటించి యప్రమత్తులై రణము చేయింపసాగిరి. అంతలో నాకస్మికముగ సంగ్రామమునకు సైనికుల నియోజించు ప్రతాపరుద్రదేవుని ఉలూపు ఖాను బంధించి శిబిరమునకుఁ గొనిపోయి యటనున్న నేమి యాపద వచ్చునో యని యాత్మసంరక్షణమునకు వలయు బలముఁ జేకొని నాఁటీరాత్రినుండియే ఢిల్లీకిఁ ప్రయాణమయ్యెను. ఆంధ్ర సామ్రాజ్యమునఁ జక్రవర్తి పట్టుపడెనను వార్త వ్యాపించెను. జనులందఱు హాహాకారములు చేయసాగిరి. సేనానాయకులు సంగ్రామరంగము వదలి ప్రతాపరుద్రుని గొనిపోవు మహమ్మదీయ సైన్యము వెంటఁబడి పడిరెండామడలదూరమున నున్న రామగిరి యొద్ద మహత్తరముగ నెదిరించిరి. ఉభయదళంబుల కట మఱల ఘోరసమరము జరిగెను. ఈ సంకులసమర సమయమున విజయవార్త ముందుగ ఢిల్లీశ్వరునకుఁ దెలియనంపి ఉలూపుఖాను కొలఁదిబలముతోఁ బ్రతాపరుద్రుని ఢిల్లీకిఁ బంపివేసెను. ఆంధ్రవీరులందరు మహమ్మదీయబలమును నిర్మూలనముఁ గావించి వెదుకగా చక్రవర్తి కానరాఁడయ్యెను. ఆంధ్రవీరులిట్లు ప్రతాపరుద్ర సంరక్షణమున కేగుటఁ జూచి కోటను జుట్టియున్న యవనసైన్యము నిరాతంకముగ నేకశిలానగరమునఁ బ్రవేశించి రాజగృహముల విపణులఁదోఁచి, రాజమందిరముల నాలయముల రూపుమాపి, ఢిల్లీపురాభిముఖులై వెడలిపోయిరి. ఢిల్లీనవాబు ప్రతాపరుద్రుఁడు పట్టుబడెనని విని మిగుల సంతోషించి రాజ్యమున నుత్సవములఁ జేయించి యాతని చెఱసాలలో నుంచి ఆంధ్రసామ్రాజ్యము తన హస్తగతముఁ గావించికొనెను. [15]ఇంతతో నాంధ్రసామ్రాజ్య మంతరించెను.

ఆంధ్రసామ్రాజ్య మవిచ్ఛిన్నముగ రెండువందల సంవత్సరము లేకధాటి నభివృద్ధి నొంది యంతరించెను. ప్రాచీనాకారమును దలపింపఁ జేయుచు నాంధ్రవీరపవిత్ర క్షాత్రరక్తముచేఁ బూతమైన యా యేకశిలాపురనగరము ఓరుగల్లను పేరున

---

15. ప్రతాపరుద్రుని రాజ్యపాలనకాలము క్రీ.శ.౧౨౯౫ మొదలు క్రీ.శ.౧౩౨౧ వఱకని చరిత్రకారుల యభిప్రాయము.

నాంధ్రజనుల యశ్రుతర్పణములతోఁ దృప్తినొందుచు నేఁటికినిఁ గానవచ్చుచున్నది. సోదరా! నీ వాంధ్రుడవు. నీ వాఙ్మయ మాంధ్రము. నీ దేహమునఁ బ్రవహించునది ఆంధ్రరక్తము. ఒక్కమాఱు నామావశిష్టమై యున్న నాంధ్ర నగరమును స్మరించి సందర్శించి, కృతార్థుఁడవు కాఁగూడదా?

ఉ. "కాకతిరాజ్యవైభవ వికాసము సర్వము శూన్యమయ్యె భా
వాకలితంబు లయ్యె భవదంచితభోగ సమృద్ధులెల్ల నీ
ప్రాకటపూర్వభాగ్యపరిపాటిఁ దలంచిన, "నాంధ్రరాజ్యల
క్ష్మీ!" కఠినాత్మకుం డయినఁ జింతిలి నీరయి పోకయుండునే?"

– ఆంధ్రపత్రిక దుర్మతి సంవత్సరాది సంచిక (ఏప్రిల్ 1921)

౨. కాకతీయవంశము

ఆంధ్రరాజులలో గాకతీయులు మిగులబలవంతులు స్వకార్యనిర్వహణధుర్యులు, యశస్కాములునై యుండిరి. పడమట యాదవవంశస్థుల యుచ్ఛ్రయము తూర్పునఁగాఁకతీయుల యుచ్ఛ్రయముతో సమకాలికముగా నుండెను. ఒక కాలమం దీకాకతీయులరాజ్య మాంధ్రదేశమంతయుగాక ద్రావిడదేశములోఁ గూఁడ గొంతభాగమువరకు వ్యాపించి యుండెను. ఈ కాకతీయులవంశమం దసాధారణా నేకశక్తిసంపన్నురాలు, సకలరాజ కార్యనిర్వహణధౌరేయురాలునగు నొక స్త్రీయును, బహుసంగ్రామజేతలగు ననేక మహాశూరులు నుద్భవిల్లిరి. ఈ యాంధ్రదేశము కాకతీయుల పరిపాలనములో రాజకీయ సాంఘికమత విద్యాదిశాఖలలో నానావిధములైన మార్పులజెందెను. తెలుగుజిల్లాలలోఁ బ్రసిద్ధి కెక్కిన జమీందారీ కుటుంబములనేకములు కాకతీయచక్రవర్తుల దగ్గర పని చేసిన యుద్యోగస్థులవలన జనించినవి. కాకతీయులు రాజ్యవదభ్రష్టులుకాగా దూర్పుదక్కనులో మహమ్మదీయాధికారము స్థిరీకృతమైనది.

తూర్పు చాళుక్య రాజ్య చోళరాజ్యములు రెండును కలిసి యొక రాజుయేలుబడి క్రింద రావడము మనమిదివరకే చూచియున్నాము. చోళరాజులుఁ దెలుగు దేశమందు రాజప్రతినిధులవలన రాజ్యమేలించుట తెలుగుదేశము యొక్క విభాగమునకుఁ గారణమైనది. అందువలన ననేక వంశములు గొప్పతనము నొందినవి. కల్యాణిలోనున్న పడమటి చాళుక్యుల దండయాత్రలకు దేశములోఁబడెను. దేశ ప్రజలు చోళరాజుల వలన సహాయము నొందుటకుఁదగిన స్థితిలో నుండలేదు. చోళరాజ్యమునకుఁ జెడుకాలము వచ్చుటకు సిద్ధముగా నుండెను. ఇట్టిస్థితిలో రాజ్యపరిపాలనాధికారము నాక్రమించుటకు, స్వతంత్రసంస్థానములను స్థాపించుటకు, పెద్ద రాష్ట్రములనుబెంచుటకు నవకాశము గలిగెను. అట్టి సమయమువలన నుపకృతులై నవారిలోఁగా కతీయులు మిక్కిలి గొప్పవారైరి. కాకతీయాధికారమును స్థాపించినవాడు బేతరాజు. అతఁడు నైజాము రాష్ట్రములోని అనుమకొండకుఁ బరిపాలకుఁడై యుండెను. అతఁడు కల్యాణి రాజైన యారవవిక్రమాదిత్యు నభియోగములను మొదట కొంతమట్టుకెదిరించెను. కాని కొనకు వానికిలోఁబడెను. అతఁడు జైనులకు మిత్రుఁడైయున్నట్లు తెలియవచ్చును. ఇతఁడు సుతునకు తన

రాజ్యము నొప్పగించి 1117లో మృతినొందెను. ఈ ప్రోలరాజు రాజ్యతంత్రజ్ఞుడైన మహాయోధుడు. ఇతఁడు తనతండ్రి మృతినొందినపిదప రాజ్యభారమును బూని పశ్చిమచాళుక్య చక్రవర్తియగు నారవ విక్రమాదిత్యునికి సామంతమాండలికుఁడై యాతని మహాప్రధానులలో నొకడుగానుండి యాచక్రవర్తి స్వర్గతుఁడైన పిమ్మట స్వతంత్రుడై యాంధ్రరాజ్యమును స్థాపించుటకు బ్రయత్నించెను. పశ్చిమచాళుక్యరాజులను లక్ష్యపెట్టక స్వతంత్రరాజునని ప్రకటించెను. అనుమకొండను ముట్టడివేసిన చాళుక్యపక్షీయుఁడైన జగద్దేవుని సంపూర్ణముగా నోడించెను. ఇతఁడు చాళుక్యరాజులకు గొప్పహానినిఁగలిగించి వారిని లోబరచుకొనెను. పశ్చిమ చాళుక్యచక్రవర్తుల సేనాధిపతియైన గోవిందరాజును జయించెనని అనుమకొండలోని రుద్రదేవుని శాసనములో నొక శ్లోకమున జెప్పబడినది.[1]

అందులోఁ బేర్కొనఁబడిన గోవిందరాజు పశ్చిమచాళుక్య చక్రవర్తియగు నారవ విక్రయాదిత్యుని సేనాధిపతియైన అనంతపాలుని సోదరిపుత్రుఁడని శాసనములో నున్నది. ఈ గోవింద దండనాయకుఁడు క్రీ.శ.1126-27 సంవత్సర ప్రాంతమున నాంధ్రదేశములోని కొండపల్లిసీమకుఁ బరిపాలకుడుగ నుండెను. ప్రోలరాజీతని జయించి యితనిరాజ్యమును చోళరాజు కుటుంబములో నొకనికిచ్చి వేసెను. నూజివీడుజమీందారీలో నున్న మంతెనను (మంత్రకూటము) సంపాదించి కాకతీయరాజ్యముతో గలిపెను. ఇతఁడు వ్యవసాయదారులను సంపన్నులుగా జేయుటయందు మిక్కిలి అభిలాషగలవాడు. వ్యవసాయమున కుపయోగించు నొకపెద్ద చెఱువును ద్రవ్వించెను.

ఇట్టిపరాక్రమముగలవాడును బహుసంగ్రామ విజేతయునగు ప్రోలరాజు తనకుమారునిచే నిహతుడయ్యెనని యొకకథ కలదు. అది యెంత మట్టుకుసత్యమో మనము నిశ్చయింపనేరము. ఒకదివసంబునఁ బ్రతాపరుద్రదేవుడు దేవాలయంబున గాఢనిద్రనున్న సమయమున తండ్రియైన ప్రోలరాజతని ప్రక్కనుండి బోవుచుండగా నితనికాలతనికిఁ దగిలెనట. అంతట నతడుమేల్కాంచి శత్రుదెవ్వఁడో తన్నుముట్టుకొన

1. *"యోకుంఠోరిపతే ర కుంఠపరశుశ్లక్ష్ణా గ్రధారోల్లస*
ద్ధారాపాతనిపాతనైక చతురం గోవింద రాజాహ్వయం
బద్ధోన్ముచ్య తదోదయక్షితిభృతే రాజ్యం దదౌ లీలయా
లుంఠాకోవిషయస్య తస్య సమరే స ద్వీరదీక్షాగురుః"

వచ్చెననియెంచి తనమొలలోనున్న ఛురికముచే నతనినిఁబొడిచెను. అంతట తండ్రి నేలంగూలజూచి తెలివినొంది చేసిన పితృవధ కర్మకుఁ బశ్చాత్తాపుఁడై దుఃఖింపసాగెను. ఇది భ్రమప్రమాదవశమున సంభవించినదని యెఱింగినవాడై ప్రోలరాజు కుమారుని శిక్షింపక యోదార్చి రాజముద్రికనొసంగి రాజ్యము నొప్పగించి ప్రాణములను విడిచెను.

వాని తరువాత రాజ్యమునకు వచ్చినవాఁడు రుద్రదేవుఁడు. ఇతడు 1160 మొదలుకొని 1196 వరకు రాజ్యమేలెను. ఇతనినాడు కూడఁ బశ్చిమచాళుక్యులతో యుద్ధమను వృత్తమయ్యెను. దొమ్మ అనువాని రాజ్యమును దనరాజ్యముతోఁ గలుపుకొనెను. భిల్లమ అనువానికి ముందువాడైన మల్లుగియను యాదవరాజును జయించెను. ఈతనికిఁ బ్రతాపరుద్రుడని నామాంతరముకలదు. ఇతడు పరాక్రమమునందు తండ్రినిసయితము మించినవాడు. ఈ రుద్రదేవుడు చాళుక్య సైన్యపాలకుడైన తైలపదేవుని, కర్ణాటకచోడులైన భీమచోడ ఉదయ చోడులను, మంత్రకూటాధీశుడైన గుండమనాయని తక్కిన శత్రు రాజవర్గమును జయించి, యాంధ్రదేశమందు పశ్చిమచాళుక్య చక్రవర్తుల పరిపాలనమునకు లోబడియున్న భూభాగములనన్నిటిని స్వాధీనము చేసికొని, మహామండలేశ్వరుఁడై రాజాధిరాజై పొగడ్తకెక్కెను.[2]

కాకతిరుద్రదేవుని రాజ్యము తూర్పున సముద్రము వరకు, దక్షిణమున శ్రీశైలమువరకు, పడమట కటకమువరకు, ఉత్తరమున మాల్యవంతమువరకు, విస్తరించి యుండినది.

ఇతని కాలమందు శైవమతము మిక్కిలి వృద్ధినొందెను. శైవులమతబోధనములను విని శైవమతమం దభినివేశము గలవాడయ్యెను. నిర్నిమిత్తముగా దానుతండ్రినిజంపిన మహాపాప మెట్లుపోవునో దానికి తగిన యుపాయములజెప్పుడని శైవగురువులనడిగెను. వారు "ఓయి ప్రోలమహారాజా! దేశాటనము సలిపి దివ్యనదులగ్రుంకి, లింగముల బ్రతిష్ఠింపించి, పంచామృత దివ్యతీర్థములసేవించి, దివ్యలింగముల బ్రతిష్ఠింపించి పంచామృతముతో సదాశివుని కభిషేకముగావించి, భక్తితో సేవించిన సర్వపాప

---

2. శ్లో॥ *రాజ్యంప్రాచ్యాం లవణజలధే స్తీరపర్యంత మస్య శ్రీ*
శైలాన్తం ప్రచలతి సదా దక్షిణస్యాం సమగ్రం
ప్రాతీచ్యాన్తా కటకనికటస్థాయినీ రాజ్యలక్ష్మీః
కౌబేర్యాశాతట విలసితా మాల్యవంతం ప్రపేదే ॥

హరంబగు"నని చెప్పిరి. అందుపై రుద్రదేవుడు నూరుగురు బ్రాహ్మణోత్తరములను గాశికి బంపించి యచట విశ్వేశ్వరున కభిషేకము జేయ నియమించి విశేష ధనంబులొసంగి వారలచే దనకుగాను పితృతర్పణము జేయించెను. తన రాజ్యములో బ్రతిగ్రామమందు శివాలయములను నిర్మించి వానిపూజాదుల కొరకు భూములనొసంగెను.

ఈతడు సంస్కృతాంధ్రకర్ణాట పండితుల రావించి యాదరించుచు, పండితపక్షపాతియై తానును పండితుడు కవియునై, బహుగ్రంథములఁ బఠించుటయేగాక గ్రంథరచన యందు గూడ బ్రౌఢత్వముగల వాడై యున్నట్లు కానవచ్చుచున్నది. ఇతనికి విద్యావిభూషణుడను బిరుదుకూడగలదు. ఇతడు నీతిసారమను నొక గ్రంథము నాంధ్రభాషలో రచించినటుల దెలియవచ్చుచున్నది.[3]

కాకతిమహాదేవరాజు – ఇతడు కాకతి రుద్రదేవుని తమ్ములలోఁ బెద్దవాడు. బ్రోలరాజు ద్వితీయపుత్రుఁడు. తనయన్న యగురుద్రదేవుడు 1196 వరకు రాజ్యము చేసిమృతినొందగా మహాదేవరాజు సింహాసనారూఢుడై, మూడు సంవత్సరములు మాత్రమే రాజ్యమేలెను. ఇతడు తన యన్నగారైన రుద్రదేవ రాజు తండ్రిని జంపి రాజ్యము చేయుచున్నాడను ద్వేషముచేత నతని జంపి రాజ్య మాక్రమించు కొనవలయునని పలుమారు ప్రయత్నించెను. గాని యట్టివైపరీత్యము జరుగకుండ మంత్రులు మొదలగువారు వారించుచుండిరి. తన్ను జంపుటకై తమ్ముడుచేయు దురాలోచనలను సహించి రుద్రదేవుడు వానిని క్షమించుచువచ్చెను. అట్లుసైచుట యుక్తము కాదని మంత్రి పురోహితాదిజనంబు లెంతచెప్పినను రుద్రదేవుడు వారిమాటలను బెడచెవినిబెట్టి తమ్ముని నాదరించుచు వచ్చెను. రుద్రదేవుని యనంతరము మహాదేవరాజు రాజ్యభారమును వహించి మూడు సంవత్సరములు మాత్రమే రాజ్యముచేసెను.

శౌణదేశాధీశ్వరుండైన జైత్రపాలుడను యాదవరాజు తన తండ్రియగు సింగభూపతి యనంతరము 1199 సంవత్సరమున రాజ్యభారమును వహించి త్రిలింగ

---

3. "చ॥ పరువడి నాంధ్రభాషగల బద్దెవనీతియు సంస్కృతంబులో
బరంగఁబ్రతాపరుద్ర నరపాలునిచే రచియింపబడ్డ యా
నరవరు నీతిసారము వినం జదువం గడు మంచిదంచు చె
ఛ్చెరగ వినీతిపద్ధతులు చేసె వినోదము బాలబోధకున్॥"

దేశముపై దండెత్తి వచ్చెను. అప్పుడు జైత్రపాలునకు మహాదేవ రాజునకు జరిగిన ఘోర యుద్ధమందు మహా దేవరాజు చంపఁబడెను.

యుద్ధములో మహాదేవరాజు మృతినొందిన తరువాత నతనికుమారుడైన గణపతి దేవుడు రాజ్యభారము వహించెను. ఇతడు మహాదేవరాజునకు బయ్యమాంబికవలన జనియించినవాడు. ఇతడు తన జ్యేష్ఠ పితృవ్యుడైన రుద్రదేవునిచే స్థాపింపఁబడిన త్రైలింగ సామ్రాజ్యమును నల్గడల విస్తరింపజేసి, చక్రవర్తి పదమును వహించి, సప్తమచక్రవర్తి యని యాంధ్రభూస్థలి నంతట శ్లాఘింపబడుచుండెను. యుద్ధములో నితఁడు శత్రువులచే జిక్కువడి, విడిచిపెట్టబడిన తరువాత నాయవమానమును సహింపజాలక అసంఖ్యాకములైన సైన్యములం గూర్చుకొని యాదేశముపై దండెత్తివెళ్ళి, యాదవులతో యుద్ధము చేసి శౌణభూపతిని జయించి, యతనివలన నమూల్యములైన రత్నరాసులను ధనములను బడసి, నిజరాజధానికి మరలివచ్చెను. అప్పటినుండియు యాదవు లనేకపర్యాయము లాంధ్రదేశము నాక్రమించుకొనుటకై ప్రబలప్రయత్నములు చేయుచువచ్చిరిగాని తెలుగువారు వారిని గోదావరినదిని దాటి దిగువకు రానియ్య నాపివేసిరి. పశ్చిమచాళుక్య సామ్రాజ్య మంతరించిన వెనుక కర్ణాటదేశమున కధిపతులైన భళ్ళాణరాజులుసైతము తెలుగుదేశమును వశపర్చుకొన వలయునని ప్రబలప్రయత్నములు గావించిరి, గాని తెలుగువారి పరాక్రమముముందట నవియన్నియు భగ్నములైపోయినవి. గణపతిదేవుడు సింహాసన మెక్కిన తోడనే మండలేశ్వరు లనేకులచే బరిపాలింవబడుచున్న యాంధ్రదేశమునంతయు నేకచ్ఛత్రాధిపత్యము క్రిందికిదీసికొని రావలయునని నిశ్చయించి తదనుగుణముగా సమర్థులైన మంత్రులను సేనాధిపతులను గూర్చుకొని వారలసాహాయ్యముచే దండయాత్రలు ప్రారంభించి యొక్కొక్క మండలేశ్వరుని జయించి వశపర్చుకొని, సామంతునిగ జేసికొనుచుండెను. గణపతిదేవుడు రాజ్యతంత్రజ్ఞానము గలవాడుగావుననే పని ప్రారంభించిన నతనికి విజయమే లభించుచుండెను.

ఈ గణపతిదేవుడు వ్రాయించిన యనేక శాసనములు దక్షిణహిందూ స్థానమందు బహుళముగా గానవచ్చుచున్నవి. ఇతడు మహాపరాక్రమశాలి గొప్పవారైన యాంధ్రదేశపు రాజు లందరితోను వివాహ సంబంధములను జేసెను. వారంద రితనికి యుద్ధములయందుదోట్పాటు గావించుచుండిరి. దక్షిణపు జిల్లాలపై దండెత్తి వెళ్లి కాణిదెన, అద్దంకి, ములికినాడు, పొట్టపినాడు, రేనాడు, గండికోట జయించెను.

ఈ సమయమందు చోళరాజ్యము గందరగోళములో నుండెను. పలుమారుత్తరముగా దండెత్తివెళ్ళి నెల్లూరును కూడ బట్టుకొన్న పాండ్యులను ఘోరముగా పరాభవించెను. ఇదివరకే రాజధానియైయున్న ఒరంగల్లులో నొక గొప్పకోట గట్టెను. ఇతడు తన రాజ్యమందు పూర్ణమైన స్వాస్థ్యమును నెలకొల్పి అవ్యాహతముగా దనయాజ్ఞ చెల్లునట్లు చేసెను. మంచిబాటలను సత్రములను నిర్మించెను. ఇతడు శైవమతావలంబి జైనమత విరోధి. జైన భక్తుల ననేకుల గఠినముగా హింసించి చంపెను. వారు నివసించు ముప్పదియారు గ్రామములను, వారి దేవాలయములను నశింపజేసెను. అతని రాజ్యపాలనవరకును కంసాలివారు గ్రామకరణములై యుండిరి. తరువాత వాండ్రు జైనమతస్థులని తెలుసుకొని, వారి నాయుద్యోగములనుండి తప్పించివేసి, వారి స్థానమందు నియోగిబ్రాహ్మణులను బెట్టెను. ఇప్పటికి నివారన్ని తెలుగుజిల్లాలలోను కరణములుగా నున్నారు. అతడు చేసిన యన్నిపనులలోను సమర్థులైన మంత్రులు, యిప్పటికి ననేక ప్రదేశములయందు గానవచ్చు శాసనములను వ్రాసిన పండితులు, సహాయమొనర్చిరి. అతడు వణిక్కులకు గొప్ప మిత్రుడై యుండెను. పూర్వశతాబ్దములయందు వాణిజ్యస్థలముగా బ్రసిద్ధికెక్కినది కృష్ణానదీ ముఖద్వారమం దున్న మోటుపల్లెయను సముద్రతీర పట్టణము. నౌకాచోర (Pirates) బాధచే బాదయ్యెను. గణపతి యాస్థలమందున్న వర్తకులను గాపాడుట కనేక ప్రయత్నములను గావించెను. ఎగుమతీ దిగుమతులమీద పనులను తగ్గించెను. గంధపు చెక్కలు, కర్పూరము, పన్నీరు, గజదంతములు, పరిమళద్రవ్యములు, రాగి, సత్తు, సీసము, పచ్చలు, పట్టుబట్టలు, మొదలయినవన్ని యుదూరదేశముల నుండి యీ రేవు పట్టణముద్వారా దేశములోనికి బంపబడుచుండెను. గణపతి విద్వత్పోషకుడు. అతడు మంత్రులలో నొకడైన శివదేవయ్యచే పురుషార్థసారమనెడు నొక శైవగ్రంథమును వ్రాయించెను.

క్రమముగా గణపతిదేవమహారాజు కీర్తిశేషుడయిన పిమ్మట నతనికుమార్తె రుద్రమదేవి సింహాసనము నెక్కెను ఈ గణపతిదేవునికి పుత్ర సంతానము లేకపోవుటచే నీమెనే పుత్రునిగా జూచుకొనెను. పూర్వగ్రంథకర్తలు, నూతన గ్రంథకర్తలు రుద్రాంబిక గణపతిదేవుని భార్యయని భ్రాంతినొందిరి. మల్లినాథసూరి పుత్రుడగు కుమారస్వామి ప్రతాపరుద్రీయమునకు వ్రాసిన వ్యాఖ్యలో నొకచోట.

"పురాకిల కాకతికులసంభూతే గణపతి నామ్ని మహారాజే దుహితృమాత్ర సంతానే కదా చి ద్దైవయోగేన కాలపరిపాకము పేయుషి, తన్మహిషీ రుద్రమదేవీ నామరాజ్ఞీ

బహువర్షాణిత్రదాజ్య మకంటకం పరిపాల్య పరిణతాసతీ, దౌహిత్రే ప్రతాపరుద్రే రాజ్యధురాం నిదధే. తామిమాం కథాం మనసి నిధాయాహ 'యోరుద్ర ఇతి"[4]

రుద్రమదేవి గణపతిరాజు భార్యయని అనేకులు భ్రమపడిరి. విద్యానాథుడు వ్రాసిన ప్రతాపరుద్రీయమును జక్కగా బరిశోధించి రుద్రాంబిక గణపతిదేవుని కుమార్తెయని మొదట గనిపెట్టినవాడు Hultzsch అను జర్మనీ దేశపు పండితుడు. ఈ విషయమే ప్రతాపరుద్రీయములో నాటక ప్రకరణముందున్నది.[5]

కావున గణపతిచక్రవర్తికి రుద్రాంబిక కూతురనియు, పుత్రులు లేనికారణమున నామెను పుత్రునిగా జూచుకొనియాతడామెకు రుద్రదేవుడనియే పురుషనామ ముంచెననియు, స్పష్టమగుచున్నది.

ఈమె తండ్రిచే శిక్షింపబడినదియై రాజ్యపరిపాలనమందు మిక్కిలి ప్రసిద్ధికెక్కిన సామర్థ్యముగలదియైయుండెను. ఈమె రాజ్యపరిపాలనారంభమందే యాదవరాజు వరంగల్‌పైకి సైన్యముతో దండెత్తివచ్చి, యసంఖ్యాకములైన సైన్యముతో రాజధానిని ముట్టడివేసెను. పదునైదు దినములు జరిగిన ఘోరసంగ్రామమందు యాదవరాజు సైన్యములు పరాజయమునొంది కాందిశీకులైనవి. యాదవరాజు బలవైన నష్టముతెచ్చుకొనెను. ఆ సొమ్ములో గొంతభాగము వరంగలును సామర్థ్యముతోఁ గాపాడిన ధైర్యవంతులైన సైనికుల కిప్పించబడెను. ఆడుది రాజ్యమేలుచున్నదియని కొందరు గొప్పవారసూయావిష్టులై రుద్రమదేవి మీద తిరుగబడిరి. కాని యామె వారినందరినీ అణగగొట్టెను.

ఈమెకు సమర్థులైన మంత్రులు సేనాధిపతులు ననేకులుండిరి. వారిలో ముఖ్యులు జన్నిగదేవసాహిణి, గంగయసాహిణి, త్రిపురాంతకదేవ మహారాజు, గోనగన్నారెడ్డి, నాగదేవమహారాజు, మొదలగువారు.

---

4. "శ్లో॥ యోరుద్రో రజతాచలే స్థితి మగా దర్ధాంగ నారిః పురా
సోయం సంప్రతికాకతీశ్వరకులే సర్వాంగనారిః స్థితః।
స్థానే యద్విషమావలోకన కళామాత్రేణ భస్మీకృతా
న్యాస న్వైరిపురాణి చిత్రమధునా ఖడ్గే విషంధార్యతే॥"

5. మంత్రిణః। "ఏవమేవైతత్। అన్యధా కధమీశ్వరస్య ప్రసాదాధృతేనిరంకుశం స్త్రీవ్యక్తి విశేష స్యలోకాధిపత్యం। ఏవంమానుషశంభునా గణపతి మహారాజేన అభ్యంతర స్వానుభవ మహిమ్నః సదృశ మత్రపుత్ర ఇతి వ్యవహారః కృతః తదనుగుణా చ రుద్ర ఇతి వ్యవహారః కృతః। తదనుగుణా చ రుద్ర ఇత్యాఖ్యా॥

రుద్రాంబిక రాజ్యపరిపాలన కాలమందే మార్కొపోలో అనునాతడు ఆంధ్రదేశమునకు వచ్చెను. అతడు తనప్రయాణ వృత్తాంతములను దెలియజేయు పుస్తకములో నాంధ్రదేశ వృత్తాంతమును జక్కగావివరించెను. తండ్రివలెనే రుద్రాంబ శైవులమీద నిష్టముగలది. ఈమెకాలమందు రంగనాథ రామాయణమను కావ్యము రచింపబడెను. రంగనాథుడను నాతడు రామాయణమును ద్విపదకావ్యముగా రచించెను. కనుకనే యాగ్రంథమునకు రంగనాథ రామాయణమని పేరు కలిగినది. కాని గ్రంథాంతమందు గోనబుద్ధరాజు రచించినట్లు గానవచ్చుచున్నది. మనుమూరి సంస్థానాధిపతియగు బుద్ధరాజున క్రాశితుడైన రంగనాధుడు దీనిని తన ప్రభువుపేరిట రచించెనేకాని బుద్ధరాజు రచింపలేదనియు, బుద్ధరాజు రచించియుండెనేని బుద్ధరాజ రామాయణమనుపేరే యీ గ్రంథమునకు వచ్చునుగాని రంగనాథ రామాయణమను పేరు కలుగుటకు కారణము గానరాదనియు గొందరు చెప్పుదురు. ఎవ్వరు రచించినను యిందలి కాండాంతమున నిట్లున్నది.[6]

గోనబుద్ధరాజు తన తండ్రి విఠ్ఠలధరణీశుపేర రచియించినట్టే వ్రాయబడి యున్నది. 1291 సంవత్సరములో రుద్రమదేవి స్వర్గతినొందెను.

ఈ మహారాజ్ఞికి దరువాత ఇట్లు పదమూడవ శతాబ్దము నంతమున రుద్రమదేవికి దౌహిత్రుడును దత్తపుత్రుడునైన వీరప్రతాపరుద్ర దేవమహారాజు ఆంధ్ర సామ్రాజ్య భారమును వహించెను. ఇతడు 1295 మొదలుకొని 1323 వరకు రాజ్యమేలెను. ఇతడు రుద్రమదేవికాలమందు దేశమునకు బాధగలిగించు సామంత నృపతులను జయించి, యాంధ్ర సామ్రాజ్యము వృద్ధినొందునట్లు చేసెను. ఈతని రాజధానియగు నేకశిలానగర మాకాలమందుత్తర హిందూ దేశంబునందు మహమ్మదీయుల రాజధానియగు ఢిల్లీపురముకంటె నధికైశ్వర్యసంపన్నమై ప్రకాశించుచుండెను.

ప్రతాపరుద్రుని మంత్రులలో ముఖ్యుడగువాడు నాగయగన్నమంత్రి. ఇతనికి యల్లయనాయకుడు మేచయనాయకుడు నని యిరువురు సోదరులుండిరి. వీరిద్దరు

---

6. *"అనియాంధ్రభాష భాషాధీశవిభుడు, వినుత కావ్యగమ విమలమానసుడు*
పాలితాచారు డపారధీశరథి, భూలోకనిధి కోన బుద్ధభూవిభుడు
తమతండ్రి విఠ్ఠల ధరణీశుపేర, నాచంద్రతారార్క మైయొప్పమీర
నసమానలలిత శబ్దార్థ సంగతుల, రసిక మైచెలువొందు రామాయణంబు
పరగనలంకార భావనల్ నింద, గరమర్థి.............కాండంబు సెప్పె"

గూడ ప్రతాపరుద్రునికి సేనాధిపతులుగ నుండిరి. ఈగన్నయమంత్రి మడికిసింగనకవి విరచితమైన పద్మపురాణకృతికి భర్తయైన కందనమంత్రికి చిన్న తాతయని శ్రీవీరేశలింగముపంతులుగారు ఆంధ్రకవిజీతములలో మడికిసింగనకవి గూర్చి వ్రాయు సందర్భమున జెప్పిరి. ఈగన్నయమంత్రిని వారునియోగి బ్రాహ్మణుడని యభిప్రాయపడిరి. కాని యదిసరికాదు. ఈగన్నయమంత్రి చతుర్థకులజుడని మారనవ్రాసిన మార్కండేయపురాణములలో స్పష్టముగా దెలుపబడియున్నది. ఇతనికి నాయకత్వము ప్రతాపరుద్రునివలననే లబ్ధమైనట్లు మార్కండేయ పురాణమున జెప్పబడియున్నది.[7]

ప్రతాపరుద్రుని సైన్యాధ్యక్షులలో నొకడుగా నుండి, యోరుగంటియొక్క తూర్పుగవని మొదలుకొని తూర్పున సింహాచల పర్యంతము గల భూభాగమున కంతకు రాజప్రతినిధియై పరిపాలనము చేసినట్టు గనబడుచున్నది.[8]

ప్రతాపరుద్రుని మహామాత్యులలో నొక్కడగు నీ రుద్రరాజునే కొలనుప్రతాపరుద్రు డందురు. కొలను అనునది కృష్ణామండలములోని యేలూరుకు నామాంతరము.

కాశ్యపగోత్ర సంభూతుడైన పోలయామాత్యునకు ద్వితీయపుత్రుడైన బెండపూడి అన్నయమంత్రి వీరప్రతాపరుద్రుని రాజ్యభార ధురంధరులలో నొకడు. శ్రీనాథమహాకవి తన భీమఖండమును ఈ యన్నయమంత్రి మనుమడును అల్లుడు వీరభద్రారెడ్డి మంత్రియునగు అన్నమంత్రి కంకితము చేసెను.

భాస్కరరామాయణ కృతికి బతియైన సాహిణిమారుడు ప్రతాపరుద్రుని యశ్వసైన్యంబున కధ్యక్షుడుగ నుండెను.

---

7. చ॥ *ఎలమి బ్రతాపరుద్ర మనుజేంద్రునిచేఁ బడసేం బ్రవీణుఁడై*
కొలిచియు శౌర్యలీల రిపుకోటి రణావని గీటడంచియు
న్బలరిపుతుల్యవిక్రముడు నాగయ గన్నవిభుండు తేజము
న్విలసిత రాజచిహ్నములు వి(శుతలక్ష్మియు నాయకత్వమున్ ॥
॥*మార్కండేయపురాణము*॥

8. తే॥గీ॥ *అనఘచరితుడు కొలనిరుద్రావనీశు*
డఖిలజనులును వినుతింప నమలమహిమ
జెలగి యేకశిలాపురి సింహకుధర
పరిమితాగ్గర భూభాగ భరముదాల్చె॥ ॥*శివయోగసారము*॥

ఈ ప్రతాపరుద్రునిరాజ్యము తూర్పున సముద్రమువరకును, దక్షిణమున కాంచీపురము వరకు, పశ్చిమమున గల్యాణ కటకము వరకు, ఉత్తరమున కళింగ దేశములోని సింహాచలము వరకు, వ్యాపించి యుండెను.

1308 సంవత్సరములో మహమ్మదీయులు కాకతీయరాజ్యముపైకి దండెత్తి వచ్చిరి. కాని వర్షాధిక్యముచే మార్గమందు వారికి ప్రబలమైన ఆటంకములు గలుగుటచే నేమియు జేయనేరక ఢిల్లీకి మరలిపోయిరి. 1309లో మహమ్మదీయులు రెండవసారి పెద్ద సైన్యముతో దండెత్తివచ్చి తెలింగాణా సరిహద్దులవిడిచి, వారి మార్గమందనేక స్థలముల బట్టికొని, కొనకువరంగలునెదిరించిరి. ఆ కోటకన్ని ప్రక్కలను ముట్టడి వేసిరి. ఆకోటను గాపాడు సైనికులు తమ శక్తి వంచన లేకుండ తమ భుజశౌర్యమును గనపర్చిరి. గాని మహమ్మదీయ సైనికులు లక్ష్యముసేయక ముందుకు ద్రోసికొనివచ్చి కొన్ని పరిఖలను దాటివచ్చి కోటయొక్క లోపలి భాగములను బట్టుకొనిరి, అందుపైఁ బ్రతాపరుద్రుడు జయాశను బొత్తిగావిడిచికొని ఢిల్లీ చక్రవర్తికి లోఁబడెను. సాంవత్సరికకరము నిచ్చుటకు బ్రతిజ్ఞచేసెను. దానికి మొదటివాయిదాగా నమితమైన ధనమునొసంగెను. ఈపని జరిగిన వెంటనే ఒరిస్సా రాజైన గజపతి వరంగల్ మీదికి యుద్ధమునకు వచ్చెను. అతడు పరాజయము నొందెను. ఇంతలో ద్రవిడదేశపు పరగణాలలో కొన్ని అల్లరులుపుట్టెను. కేరళదేశపురాజైన రవివర్మకుల శేఖరుడు కాంచీపురమును బట్టుకొనెను. 1316 సం॥లో ప్రతాపరుద్రుడు ముప్పిడినాయకుడను తనదళవాయిని దాక్షిణాత్య శత్రువుల పైకిబంపి, వారువశపర్చుకొన్న దేశభాగమునంతయును మరల స్వవశము జేసికొనెను. చోళరాజ్యములో నవశిష్టభాగమును, పాండ్య దేశములోని కొన్ని భాగములను, తన రాజ్యములో గలుపుకొనెను. ప్రతాపరుద్రుడు కొంతకాలము క్రిందట ఢిల్లీ చక్రవర్తికిచ్చెదనని వాగ్దానము చేసిన పన్నును చెల్లించుట మానివేయునంత బలవంతుడయ్యెను.

ఈ సమయమందు ఢిల్లీలో కిల్జీవంశమువారు తుగ్లకువంశమువారికి తావిచ్చిరి. మొదటితుగ్లక్ చక్రవర్తియగు గాజీఉద్దీన్ ప్రతాపరుద్రునితో యుద్ధముచేయుటకొక లక్షపదాతి సైన్యమును, పదివేల గుఱ్ఱపుదండునిచ్చి తన కుమారుడైన ఉలుగ్ ఖానుని పంపెను. 1323 సం॥లో వరంగల్ పట్టణమును జయించి, మహమ్మదీయులా దేశమునంతయును యథేచ్ఛముగా దోపిడిజేసిరి. ఇట్టి సమయమందు బ్రతాపరుద్రు

డెవ్వరికి జొరశక్యముగాని వరంగల్ కోటలో దాగియుండి ప్రాణములను గాపాడుకొనెను. దానినిగూడ శత్రువులు ముట్టడించిరి. ఆయుద్ధమం దుభయపక్షముల వారునుఁ జయాశతో ఘోరముగా బరాక్రమించిరి. రెండు పక్షములవారికి నమితనష్టములు కలిగినవి. అట్టి సమయమందు ఢిల్లీ చక్రవర్తి మృతినొందెనని యొకకింవదంతి ఆకస్మికముగా వ్యాపించెను. ఇదివరకే ఆ మహమ్మదీయులు రోగముల వలనను, శీతబాధవలనను, దుస్సహపీడనొందిరి. అందుచే వారతిశీఘ్రముగా దేవగిరి మార్గము గుండా స్వస్థానమునకు బోవలసివచ్చెను.

కొన్ని నెలలతరువాత ఉలుగ్ ఖానుడు పితృమరణ వార్త కల్లయని తెలిసికొని మునుపటి కంటె బలీయమైన యుద్ధసన్నాహము గల సైన్యములదోడ్కొని వరంగలుకు వచ్చెను. ఇది వరకే పట్టుపడిన వరంగలును ముట్టడించి తెలింగానా సరిహద్దునను న్న బీదరుదగ్గిర పటాలములనుంచెను. వెలమలు, పద్మనాయకులు, కమ్మలు, రెడ్లు మొదలగు నన్నిజాతులవారు నైకమత్యమునొంది మహాశౌర్య ధైర్యములను వెల్లడించుచు నొక మనుష్యునివలె విదేశీయ శత్రువులతో బోరాడిరి, కాని శ్రమమంతయు వ్యర్థమయ్యెను. ఫిరంగిగుండ్ల వర్షమును గురిపించి దుర్భేద్యమైన వరంగల్‌కోటను ధ్వంసముచేసి లోనికిబ్రవేశించి ప్రతాపరుద్రుని యతని కుటుంబజనమును ఖయిదీలగా బట్టుకొని ఢిల్లీకిగొనిపోయిరి. ఖయిదీగా జేయంబడిన యీ మహారాజు గోదావరియొడ్డుకు వచ్చినపుడు విడుపబడెననియును, విరక్తుడై నిజాయుశ్శేషము నంతయును బైరాగియై గడిపెననియు నొకయైతిహ్యాము గలదు. అతని రాజ్యము తుగ్లకురాజ్యములో గలిపివేయబడెను. స్వతంత్రాంధ్ర రాష్ట్రము యొక్క కీర్తి ప్రతిష్ఠ లతనితో నస్తమించినవి.

– కాకతీయ సంచిక

3. కాకతీయ రాజులు

కాకతీయరాజు లాంధ్రులకుఁ జిరస్మరణీయములు. ఏనాఁడో విస్మృతమైన యాంధ్రసామ్రాజ్యమును బునరుద్ధరించి చెదరిన యాంధ్రతేజమును గేంద్రీకరించి లలితకళలఁ బునరుద్ధరించిన యాంధ్రభూపతులగు కాకతీయుల చరితామృతము తనివిదీఱఁ గ్రోల నేయాంధ్రుఁ డుత్సాహపడఁడు.

చరిత్ర పరిశోధనమునఁ దీవ్రకృషి జరుపఁబడు నీ నవయుగము నఁగూడఁ గాకతీయుల చరిత్రమును గూర్చి సరియగు పరిశోధనము జరుగలేదు. నిజాము దొరతనమువారి పరిపాలనముననున్న యాంధ్రదేశము నందలి వేలకొలఁది శాసనములు లింకను బ్రకటితములు కాలేదు. నాఁటి సారస్వతవికాసము దెలుపు గ్రంథరాజము లింక నుపలభ్యములు కాలేదు. అజ్ఞాతవాఙ్మయమున మఱుగుపడియున్న కాకతీయరాజుల చరిత్రమునకుఁ బునాదులు వేయు చరిత్రజిజ్ఞాసుల యుపయోగమునకై సందిగ్ధములగు నంశములను గొన్నింటినిమాత్రమిపుడు సమన్వయించెదము.

కాకతీయుల యాచారములు

కాకతీయులలో రాజ్యస్థాపకుఁడ మహామండలేశ్వర ప్రోలరాజు. ఈతని భార్య ముప్పమ. చరిత్రకారులీతని జైనుఁడని వ్యవహరించిరి గాని యది సత్యమని తోఁపదు. ఈతఁడొనరించిన భైవరప్రతిష్ఠలఁ దెలుపు శాసనము ఇనుగుర్తి గ్రామమునఁగలదు. ఆర్ష మతమునందును జైనమతమునందును నీతనికి సమాన గౌరవభావము కలదు. మొదటి నుండియుఁ గాకతీయరాజులు పశ్చిమచాళుక్యులకడ సేనానాయకులుగ నుండి వారివలెనే వరాహలాంఛనులైరి. కాననే కాకతీయుల శాసనములలో వరాహస్తుతియు వరాహముద్రము జెప్పఁబడినది. ప్రోలరాజు సంగరమున గుండరాజు నోడించి వానియురమున వరాహముద్ర వేసినటులు అనుమకొండ శాసనమునఁ గలదు. వరాహాంకులనుట కిదియె తార్కాణము. *

---

* *కాకతీయులు వరాహలాంఛనులనుటకు*

శ్రీమత్కాకతివంశస్య యోవిభుర్వీరలాంఛనమ్ । తద్గురుర్వసుధోద్ధార వరాహస్సపునాతుదః

– కుందవరశాసనము

ప్రోలరాజు కాలమున కాకతమ్మదేవాలయములు ఆంధ్రదేశమునc బెక్కులుగలవు. పదమూcడవ శతాబ్దమునాcటికిc గాకతమ్మగుడి ఓరుగంటిలో నున్నటులc గ్రీడాభిరామమువలనc దెలియును. కాకతమ్మ కథను గొల్లలు చెప్పుదురు. అందామె పార్వతి యవతారాంతరముగc జెప్పcబడినది. మెదకుమండలములో అల్లాదుర్గము చెంత నొకగుట్టపై కాకతమ్మగుడి కలదు. విగ్రహములు భిన్నమైనకతన కాకతిదేవి స్వరూపము గుర్తింప నవకాశము చిక్కలేదు. ఒరంగల్లులో కాకతమ్మ బావి కలదు. బహుశః కాకతీదేవియాలయ మాప్రాంతముననేయుండి యవన దౌర్జన్యముచే నశించియుండుననియు నూహింపనగును. ప్రోలరాజు శాసనములలోc బ్రధానమైనది పద్మాక్షి దేవళమునందలిది. అందలిలిపి చాళుక్యరాజుల యాంధ్రలిపిని బోలియున్నది. వర్ణములు వట్రువగ లేవు. పశ్చిమచాళుక్యులకడ నితcడు విశేషకాలము శిక్షితుcడగుటయే యిందులకుc గారణముకానోపు. ఈయనకుc బ్రత్యర్థులుగ తైలప దేవుcడు, గోవిందరాజు, గుండరాజు, జగద్దేవుcడు హనుమకొండ శాసనమునc బేర్కొనcబడిరి. వీరలగూర్చిన వివరములు మున్నోకమాఱు సవిస్తరముగ వ్రాసియుంటిమి. అనుమకొండ రాజధానిగ నుండcదగిన తావుగాదని ప్రోలరాజు రామారణ్యత్రిపాదులవారి ప్రోత్సాహముచే ఒరంగల్లు అను పురరాజమునుగట్టింప నారంభించెను. ఈతనికాలమునc బూర్తికాలేదు. ప్రోలరాజునకుc జరిత్రమునc బ్రసిద్ధులగు కుమారులిద్దఱు. మొదటివాcడు రుద్రదేవచక్రవర్తి; రెండవవాcడు మహాదేవరాయలు.

రుద్రదేవుని చరిత్రము

తండ్రియగు ప్రోలరాజుకాలమున ననుగ్రహపూర్వకముగ విడువcబడిన తైలపదేవుని రుద్రభూపతి తెగటార్చెను. మైళగిదేవుని జయించి పాలవాసరాజ్యము గైకొనెను. దొమ్మరాజును వధించెను. చోడోదయుని జంపెను. భీమరాజును సంహరించెను. ఈ ప్రత్యర్థి రాజుల చరిత్రము చరిత్రకారుల కింకను స్పష్టముగాc దెలియలేదు.

మైళగిదేవుcడు కరీమునగరు జిల్లాలోని జగిత్యాలతాలూకాకు జేరిన పాలవాస రాజధానిగcజేసికొని గోదావరి ప్రాంతమంతయుc బాలించిన రాజు. ఈతcడు నెలకొల్పిన ధర్మములcదెలుపు శాసనములు కాళేశ్వరము, మంథెన, ధర్మపురి

ప్రాంతములలోఁ గలవు. పశ్చిమచాళుక్యులకు రాజప్రతినిధిగ నీతని పూర్వులుండిరి. రుద్రదేవుని కాలమున నీతఁడు రాజ్యము కోల్పోయెను. అంతతో నీతని కుటుంబ మంతరిచెను.

రుద్రదేవుని ప్రత్యర్థులలో మేడరా జొకఁడు. ఈ మేడరాజు ప్రోలరాజుకాలము నందుఁగూడఁ బ్రసిద్ధుఁడైయుండి ప్రతిఘటించి నిలిచిన ధీరుఁడు. ఈయన మంత్రియగు నాగదేవరాజు స్థాపించిన గోవిందాపురము (పాకాలతాలూకా) శాసనము వలన మాధవవర్మవంశమున దుర్గరాజు జనించెననియు నతనికి మేడరాజు జగ్గరాజు పుట్టిరనియు కలదు. రుద్రదేవుని ప్రత్యర్థియగు నీ మేడరాజు క్షత్రియవంశజాతుఁడు. వీరి మంత్రియగు నాగదేవరాజు శా.శ.౧౦౪౯ ప్లవసంవత్సర పాల్గున శుద్ధ 3 వ (క్రీ.శ. ౧౧౨౭) పార్శ్వజినేశ్వరాలయము స్థాపించి భూదానము గావించెను. ఆ శాసనారంభమున జినదేవపాదస్మరణ మీ క్రిందివిధముగాఁ గలదు–

శ్లో॥ శ్రీమన్నరేఽంద్ర ముకులోజ్వలరత్న భూషా
నాగేంద్రహస్త సరసీరుహకర్ణపూరా
విద్యాధరేంద్ర రచితో త్తమకుంకుమావీ
భూయాత్ శుభాయ జినదేవపదాంబుజ శ్రీః

మేడరాజుకూడ జైనుఁడని విశ్వసింపవచ్చును. ఈతని శాసనముల కొఱకింకను నన్వేషింపవలసియున్నది.

రుద్రదేవుని ప్రత్యర్థులలో ఉదయచోడుఁ డొకఁడు. ఇతఁడె చోడోదయుఁడని శాసనములలోఁ బేర్కొనఁబడెను. ఉదయ చోడుఁడు నల్లగొండచెంతనున్న పానుగల్లు పాలించు ప్రభువు. మల్లికార్జున పండితారాధ్యులవారికి సమకాలికుఁడు. ఈతని శాసనము లిపుడు పానుగంటిలోఁ గనిపించకున్నను ఉదయసముద్రమను తటాక మీతని కీర్తి చిహ్నముగానున్నది. ఉదయావనీవుని మంత్రియగు గోవిందప్రధాని శాసనములు పానుగంటిలోఁ గలవు. రుద్రదేవుఁడీ రాజ్యమును లోఁగొనినవెంటనే తంత్రపాలు మల్లినాయకుఁడు ఛాయాసోమేశ్వరాలయమున నొకశాసనము స్థాపించెను. అందు ఉదయాదిత్యసముద్రమను తటాక ప్రశంస గలదు. శా.శ.౧౧౮౯ ప్రభవ సంవత్సర అధికజ్యేష్ఠ ౧౩ లు నాఁటి శార్ఙ్ఞపాణిరాయలశాసనమున ఉదయసముద్ర ప్రశంసగలదు. శా॥శ ౧౪౯౨ సంవత్సరమునాఁటి సయిదుసాదాతు సయదుశాహామీరు వేయించిన తెనుఁగుశాసనమున ఉదయసముద్ర ప్రశంస గలదు.

ఈ యుదయసముద్రము ఉదయాదిత్యుఁడు, ఉదయ చోడుఁడు అను నామములు గల పానుగంటిపాలకునిచే స్థాపింపఁబడినది గాన రుద్రదేవుని ప్రత్యర్థియగు ఉదయ చోడుఁడు నల్లగొండ చెంత గల పానుగల్లువాసియనుట స్పష్టము. పండితారాధ్య చరిత్రము గూడ నీయంశమును స్థాపించుచున్నది.

కాకతీయరుద్రునకుఁ బ్రబలప్రత్యర్థి భీమరాజు. ఈతఁడు దురాత్ముఁడు. సోదరుఁడగు గోకర్ణుని నీతఁడు చంపినటుల అనుమకొండ శాసనములో స్పష్టముగాఁ గలదు.

> **"భీమేన భీమనకులేన కులేనహీనో**
> **గ్రస్తో మమార గృహమూషకవత్ క్షణేన**
> **మార్జాలడింభకవరేణ మహాన్ధకారే**
> **గోకర్ణ నామభుజగో భువి శూరమానీ**

భీమరాజును భయంకరమగు ముంగిసచే శూరుఁడగు గోకర్ణుఁడగు పాము అంధకారమునఁ బిల్లిచే నెలుకచంపఁబడినటులఁ జంపఁబడెను."

భీమరాజు భ్రాతృహంతయనువంశమును "హంతాభ్రాతృవరస్య భోజనవిధౌ" అను శాసనశ్లోక భాగము బలపఱచుచున్నది. గోకర్ణుఁడు, భీమరాజు ఏకగర్భజనితులు. భీమరాజు స్వలాభపరాయణుఁడై తమ్ముఁడగు గోకర్ణునితోఁ గపటస్నేహముకల్పించి మోసమునగ వధించియంతతోఁ దృప్తుఁడయ్యెను.

భీమరాజుగోకర్ణుల వృత్తాంతము అమరాబాదుతాలూకాలోని మామిళ్ల పల్లి నృసింహాలయమునందుఁ గలదు. అందీ క్రింది విధముగా వంశవృక్షముగలదు. మార్యవంశమున కలియుగకర్ణుఁడగు గోకర్ణ జనించి ప్రతిష్ఠ నార్జించి సంగరరంగమున మరణించెను. ఆయనకుమారుఁ డుదయాదిత్యుఁడు. ఈతఁడు చోడవంశతిలకుఁడు. ఈయనకుమారులే భీమరాజు, గోకర్ణుఁడు. వీరియైకమత్యము శాసనమున నీ క్రిందిరీతిగాఁ బ్రశంస గావింపఁబడెను.

శ్లో॥ అథ తత్కృతినక్షత్రగణ ప్రగుణచేతసౌ,
భీమగోకర్ణ భూపాలౌ సూర్యచంద్రావివోదితౌ.

శ్లో॥ నిస్సీమ ప్రేమబుద్ధేన సమానసుఖయాద్యయోః
ఐకాత్మ్యం మన్యతేలోకా యథా పురమురద్విషోః.

రుద్రదేవుని శాసనమువలనఁ దేలనియంశము లీశాసనమువలనఁ దేలినవి. గోకర్ణుఁడు, భీమరాజు అన్నదమ్ములు. భీమరాజు వధించినది తమ్ముఁడగు గోకర్ణునె. లోకప్రతారణమునకె భీమరాజు తనతమ్మునితో నఖండస్నేహముగ నున్నటులఁ జెప్పుకొనెను. భీమరాజు తైలపదేవుని రాజ్యము హరించెను. సవతితల్లితో దుస్సాంగత్య మొనరించెను. తమ్మునిజంపెను. అందులకనియే రుద్రదేవుఁడీతని సాధింపఁ బట్టుపట్టెను. భీమరా జఖండపౌరుషశాలి. అఖండ రాజ్యలక్ష్మీ సంపన్నుఁడు. ఆతని జయింప రుద్రదేవుఁ డపరిమితబలముతో దండయాత్రకేగి రాజధానియగు వర్ధమానపురమును ముట్టడించెను. భీమరాజు పరిజనముతోఁ బారిపోవ రుద్రదేవుఁడు శక్తికొలది తటిమి ఉదయచోడుని రాజ్యము వర్ధమానపురము గైకొని తనప్రతినిధిగా నచట మల్యాలగుండ నాయకుని నియమించెను. ఈ వర్ధమానపురము నిపుడు వడ్డమానియని వ్యవహరించుచున్నారు. ఈ చరిత్రస్థలము మహబూబు నగరమండలములో నాగరకర్నూలు తాలూకాలో నున్నది. రుద్రదేవుని యత్యద్భుతవీరజీవిత మీ జీర్ణనగరముగాంచిన కొంతవఱకు బోధకాఁ గలదు. ఛందో గ్రంథము వ్రాసిన గోకర్ణుఁడీ భీమరాజుతమ్ముఁడు కాఁడని యుఁ దదన్యుఁడనియు మాతలంపు.

రుద్రదేవుని ప్రత్యర్థియగు ఉదయచోడుఁడు కందూరుపాలకుఁడును జటచర్ల శాసనమునఁ బేర్కొనినవాఁడును నగు నుదయచోడుఁడు గాఁడు. రుద్రదేవుని శాసనమునకు నితని కందూరిశాసనమునకు ౨౬ దినములె వ్యవధిగానను బూర్వజితుఁడగు నీ యుదయచోడుఁ డొకవేళ భీమరాజుగోకర్ణుల తండ్రియైనఁ గావచ్చును. లేదా పానుగంటి యుదయాదిత్యుఁడు కావచ్చును. మహబూబు నగరమండలమున చోడరాజుల శాసనములు పెక్కులు గలవు. వాని నన్నింటిని సమన్వయించిన గాని యీయంశము నిశ్చితముకాదు.

రుద్రదేవుని కళాకౌశలము

అనుమకొండలో నీతఁడొక యపూర్వశిల్పరమణీయమగు త్రికూటాలయమును గట్టించెను. ఆలయమున కెదురుగా సహస్ర స్తంభమండపము గట్టించెను. ఆలయమునందలి లతావేల్లనములు స్త్రీ పురుష విగ్రహముల విధము, పురాణకథా ప్రతిమల విలాసము చూచి తీరవలసినది. మహమ్మదీయుల కుఠారఘాతములకాగి పూర్వ ప్రశస్తి చిహ్నములు నిలుపుకొన్న యీ సుందరాలయము శిల్పకళోపాసకులకు

ధ్యేయముగనున్నది. ఇందె రుద్రదేవుని సంపూర్ణ విజయముల దెలుపు రామేశ్వరదీక్షిత రచితమగు శాసనరాజము గలదు. రుద్రదేవుని కాలమునుండి యాంధ్రలిపి కొకనూతన వికాసము వచ్చినదనుటకీ శాసనలిపియె తార్కాణకాఁగలదు. నీతిసారమను గ్రంథము నీతఁడు రచించినటులఁ గొందఱు వ్రాసిరి. అది ప్రతాపరుద్రనరపాలకృతమని చెప్పఁబడినదిగానఁ గర్తృత్వ మితని కారోపించుట ప్రమాదము. కాని రుద్రదేవుఁడు వైదుషీభూషణుఁడు. సారస్వతతంత్రజ్ఞుఁడు ననుట కాధారములు అనుమకొండశాసనమున లేక పోలేదు.

నానాశాస్త్రవిచారణైక చతురుఁడు, బ్రాహ్మీవిలాసాశ్రయుఁడను విశేషణము లీతని సర్వతోముఖసాహిత్యసంపదకు నిదర్శనములు. పిత్రనంతర మితఁడు ఒరంగల్లు రాజధానిగాఁ జేసికొనెను. శైవులకును, బౌద్ధులకును, జైనులకును దనరాజధానియం దనుకూలములుగ నుండు నాలయరాజములను బెక్కింటిని నిర్మింపఁజేసెను. ద్వారములపై గజ లక్ష్మి విగ్రహములఁ బాదుకొల్పి మరుభూమియనందగు దుర్గమధ్య ప్రదేశమునందు నగాధములు నపరిశోష్యజలములు నగు కూపరాజములను బెక్కింటిని ద్రవ్వించి తన దిగ్విజయచిహ్నములుగఁ బెక్కుజయ స్తంభముల నాటించెను. నాఁటి కూపములలో నిప్పటికిని కాకతమ్మబావి, గడియారములబావి, దేవతలబావి, అక్కచెల్లెండ్రబావులు దర్శనీయములుగా నున్నవి. శోభనాలబావియును రాజకుటుంబినుల క్రీడాసరస్సు చాలవఱకు నశించినది. ఒరంగల్లు కోటలోని నాలుగు శిలాద్వారములును ఐనవోలులోని శిలాద్వారములు రుద్రదేవుని కాలమున నెలకొల్పఁబడినవె. ఎడతెగని సంగరయాత్రలతో దిన మొకయుగముగా గడపుచు సామ్రాజ్య క్షేమమునకుఁ బాటుపడుచు ఆంధ్రశిల్పములకుఁ బేరెన్నికగాంచిన యాలయముల నిర్మించిన రుద్రదేవుఁడు ఆంధ్రులకుఁ జిరస్మరణీయుఁడు. రుద్రదేవుఁడు నామిరెడ్డి, కాట్రడ్డి, బేతరాజు, బల్లాలుఁడు మున్నగు సేనానాయకుల తోడ్పాటుతో రాజ్యమేలుచు బ్రోలరాజు కట్టింప నారంభించిన నూత్న దుర్గము పూర్తిచేసి అనుమకొండ నుండి ఒరంగల్లునకు రాజధానిని మార్చెను. ఒరంగల్లునకు కాకతిపురమనియు, ఆంధ్రనగరమనియు, ఏకశిలానగరమనియు నాకాలమున వ్యవహార నామములు గలవు. కుందాంబిక స్థాపించిన కుందవరశాసనములో ఒరంగంటిని రుద్రదేవుఁడు రాజధానిగఁజేసెనని కలదు. వ్రెక్కంటి గాహిచరావు శాసనమునఁగూడ నీయంశము స్పష్టముగాఁగలదు. శివతత్త్వసారావతారికలో

నీయంశము చెప్పఁబడినది. ఓరంగల్లునకుపూర్వప్రశస్తియు మహైశ్వర్యసంపదయు నీరుద్రదేవుని కాలమునుండియే యేర్పడియుండును.

రుద్రదేవునకు నితనితండ్రియగు ప్రోలరాజునకును సమకాలికుఁడుగ నుండిన తైలపదేవుని చరిత్రము గ్రహింపఁదగిన శాసనములు కొన్ని నిజాము రాష్ట్రమున లభించినవి. తైలపదేవుఁడు కోడూరు పాలించు ప్రభువు. ఇతఁడు చాళుక్యుఁడు. బూదుపూరు నెక్కొండలలో నితని శాసనములు గలవు. అవి చాళుక్యశకము 46 లోనివిగాన క్రీ.శ.1124 ప్రాంతమున తైలపదేవుఁడను కాకతీయసామ్రాజ్య ప్రత్యర్థి కోడూరు రాజ్యము పాలించుచుండెననుట సత్యము. రుద్రదేవుఁడు తైలపదేవుని రాజ్యము భీమచోడుని రాజ్యము తన సామ్రాజ్యములోఁ గలుపుకొని యాంధ్రసామ్రాజ్యము విస్తరింపఁజేసెను.

ఆ కాలపుఁ బరిస్థితులు

రుద్రదేవుని కాలమున ఆంధ్రదేశపరిస్థితు లల్లకల్లోలముగా నుండెను. సుప్రసిద్ధములగు జైనక్షేత్రములు వైదికాలయములుగా మార్పఁబడెను. బసవేశ్వర డాకాలమున విజృంభించి వీరశైవమతము నెలకొల్పి బిజ్జలుని సామ్రాజ్యము కూలఁద్రోచెను. మల్లికార్జున పండితారాధ్యులు వీరశైవమతము నుద్ధరింపఁ దీవ్రకృషి గావింపసాగిరి. రుద్రదేవుఁడీ కాలమున శైవమతము నాదరించి జైనులనొత్తిడి చేయసాగెను. ఆకాలముననే చాళుక్యరాజధానులలో నొకటియుఁ బ్రసిద్ధజైన క్షేత్రములలో నొకటియు నగు కొలనుపాక శైవక్షేత్రముగా మార్పఁబడెను. ప్రచారకులకు నెలవుగానున్న మతములన్నియు జైనులనుండి తొలంగింపఁబడి వీరశైవుల కొసంగఁబడెను. పలువురు కాకతీయసామ్రాజ్యమును గూలద్రోయ యత్నించుటకు ప్రధానహేతువు రుద్రదేవుఁడు జైనవిద్రోహియనియే. రుద్రదేవుని కాలమున నాంధ్రదేశమున జైనమతము సన్నగిల్ల నారంభించెననియు ఆర్ష మతస్థులు జైనాలయములను గొలఁదిగ సంస్కరించి వైదికాలయములుగా మార్చిరనియు నిశ్చయించుటకుఁ గొన్నికొన్ని యాధారములందందు నేఁటికిని గోచరించుచున్నవి.

రుద్రదేవుని యంతము

విశాలాంధ్రదేశమున కధిపతియై యప్రతిహతపరాక్రమముతో జిరకాలము రాజ్యమేలి రుద్రదేవుఁడు రాజ్యతృష్ణాధురంధరుఁడగు మహదేవరాయలను తమ్మునిచేఁ

జంపఁబడెను. భ్రాతృహంతకుఁడగు నీతఁడు రాజ్యమునకు వచ్చుటకుఁ బౌరు లంగీకరింపలేదు. కుమారుఁడగు గణపతి దేవుఁడె తండ్రియుండఁగ రాజయ్యెను. రుద్రదేవుని యనంతరము రాజ్యమల్లకల్లోలమైనట్లు రామప్పగుడులలోని శాసనమునందుఁ గలదు. అపుడు రుద్రసేనాని జీర్ణాంధ్రసామ్రాజ్యమును బునరుద్ధరించెను. యా శాసమునందలి శ్లోకమువలన గ్రహింపనగును. రుద్రదేవుని మంత్రివర్గము పరిపాలన విశేషములు కుటుంబస్థితులు కాలగర్భమునఁబడి నేఁటికి విస్మృతములైనవి. నేఁటివఱకు సుస్థిరముగా నెలకొనిన ఆంధ్ర వ్యక్తిత్వమునకు రుద్రదేవుని మహత్తరరాజ్యనిర్మాణమె ప్రధాన హేతువనుట మఱువరానియంశము. కుందాంబికాశాసనమునందు రుద్రదేవుని యనంతరము మహాదేవరాయలు రాజ్యమేలినట్లుకలదు.

"తస్మాదనంతరం తస్య మహాదేవో మహీపతిః,
అనుజో మనుజాకారమహాదేవో మహీ మధాత్"

మహాదేవరాయలు బయ్యలదేవీవల్లభుఁడు. ఈ దంపతుల పుత్రుఁడే శాంతిస్థాపకుఁడును ధర్మనిర్ణేతయు సత్ప్రభుఁడు నగు గణపతిదేవ చక్రవర్తి.

గణపతిదేవుఁడు

గణపతిదేవుఁడు రాజ్యమునకువచ్చునాఁటి కాంధ్రసామ్రాజ్యము నకుఁ దూర్పు దిక్కున సముద్రము, దక్షిణమున శ్రీశైలము, పశ్చిమమున కళ్యాణపురము, ఉత్తరమున మాల్యవంతము సరిహద్దులుగా నుండెను. ఈమధ్యభాగమున నున్న రాజులందఱు నంకితులై కాకతీయరాజ్యము నకుఁ బన్నుఁజెల్లించుచుండిరి. విశాలమగునాంధ్ర దేశమున నాతని కత్తి కెదురులేకుండెను. గణపతిదేవుఁడు గౌడదేశమునందలి రాధా మండలములోని పూర్ణ గ్రామవాసియు ధర్మశంభుని కుమారుఁడును నగు విశ్వేశ్వర శివాచార్యులయొద్దఁ జన్మయదీక్షబడసెను. అనంతరము గణపతిదేవుఁడు తన రాజ్యమునిండ శివాలయములు గట్టించుటయే గాక శైవుల కండగానుండి జైనబౌద్ధమతములు రూపుమాపుటలో మిగులఁ గృషి చేసెను. విశ్వేశ్వరశివదేశికుఁడు నిజాము రాష్ట్రమునఁ బ్రసిద్ధ క్షేత్రమును త్రిలింగస్థానములలో నొకటియు నగు కాళేశ్వరమున ఉపలమఠమును, మంత్రకూటమున శైవమఠమును స్థాపించెను. ఈ దేశికులు గణపతిదేవునికెగాక మాళవప్రభువునకుఁ గాలచురినృపాలురకు దీక్షా

ప్రదాతగనుండుటయే గాక రాజ్యాంగవేత్తయై కాక తీయసామ్రాజ్యాభ్యున్నతికిఁగూడ సర్వంకషముగాఁ దోడ్పడెను. అందులకనియేకానోపు గణపతిదేవుఁడు తా నీశివదేశికుని పుత్రుఁడనని కంఠోక్తిగాఁ జెప్పుకొనెను. మందడముశాసనములోని విధముజూడ నీవిశ్వేశ్వరశివదేశికుఁ డఖండరాజ్యతంత్రకుశలుఁడనియు గణపతి దేవుని శైవమతప్రచారమునకు నీయనయే కారకుఁడనియు నూహింపనగును. ఈయన ప్రోత్సాహమున గణపతిదేవుని యాస్థానమునఁ దిక్కనసోమయాజి యాదరసత్కారము లొందియుండును.

గణపతిదేవుఁడు ఆంధ్రసామ్రాజ్యమును సుభిక్షముగావించెను. ఈయన కాలముననే రామప్పచెఱువును రుద్రసేనానియు, పాకాలచెఱువు జగదాళముమ్మడి నాయకుఁడును, నామసముద్రమును నామిరెడ్డియు, ఎఱకసముద్రము ఎఱ్ఱక్క సానమ్మయు, చౌండసేనాని చౌండ సముద్రము నిటులే సేనానాయకు లొక్కొక్కరు దమ పేరనఖండములగు తటాకములు నెలకొల్పిరి. గణపతిదేవుఁడు పాకాల సమీపమున గణపుర మను గ్రామమును గట్టించి యపూర్వశిల్పాభి రామములగు రెండు దేవళములు నిర్మింపఁజేసి తన పేర విశాలతరమగు నొకతటాకము నెలకొల్పెను. ఇంతయేల, నిజాము రాష్ట్రములోని విశాల తరతటాకములును, మనోహరశిల్పములగు దేవళములు చాలవఱకు గణపతిదేవుని కాలములోని వనుట యతిశయోక్తి కాదు. ప్రోలరాజు రాజ్యస్థాపనమునకై జీవితము వ్యయము గావించెను. రుద్రదేవుఁడు రాజ్యము విస్తృతమొనర్చుటలో జీవితము వెచ్చించెను. గణపతి దేవుఁడు పితృదత్తరాజ్యము నిష్కంటకము గావించుటయే పరమార్థముగఁ బెట్టుకొనుటయేగాక ఓరుగల్లుదుర్గమునకు ఱాతికోటగట్టించి ప్రతిపక్షులగు దేవగిరియాదవులు, చోళులు, చాళుక్యులు తన యాజ్ఞాబద్ధులగునటులఁ గట్టడి గావించెను.

గణపతిదేవుని కాలమున ఓరుగంటిలో స్వయంభూదేవాలయము అపూర్వశిల్పవిన్యాసములతో నద్భుతకరముగాఁ గట్టఁబడెను. కాకతీయుల కీయీశ్వరుఁడే యిలవేల్పు. ఆదర్శప్రాయమై యాంధ్రదేశమునకు మకుటరూపముగా నున్న యీ దివ్యసుందరాలయము పదమూఁడవ శతాబ్దమునఁ బూర్తిగా రూపుమాపఁబడినది. ఈ మహత్తరశిల్పచిహ్నములు గట్టునపుడును యవనులు యథేష్టముగా నుపయోగించుకొనిరి. ఈదైవతప్రశంస విశేషముగాఁ బ్రతాపరుద్రీయమునఁ గలదు. ఇష్టదైవతమగు నీస్వయంభూదేవునకుఁ

గాకతీయురాజులు సమస్త వైభవులు సమకూర్చిరి. ఆంధ్రదేశమున నింతటి యాలయము లేదనిపించిరి. ఐనఫలమేమి యవనాటోపమునఁ బ్రథమాహుతి యయ్యెను.

ఇపుడీయాలయస్థలమున నాఁటి విగ్రహశకలములు నంది విగ్రహములు దర్శనీయములుగా నున్నవి. ఈ కాలమునఁ గల్పింపఁ బడిన యాలయములలో పిల్లలమర్రి నామిరెడ్డిదేవాలయములు పాలెముపట్టులోని రుద్రసేనాని దేవాలయము, కొడిశాలలోని రుద్రరెడ్డి దేవళము, కొండిపర్తిలోని చౌండసేనాని కాటచమూపతుల దేవళములు ప్రశస్తతరములు. ఈ కాలమునఁ బ్రతిసేనానాయకుఁడును శక్తికొలఁది దేశకల్యాణముకొఱకుఁ బాటువడి దుర్గములు నిర్మంచియుఁ దటాకముల నెలకొల్పియు దేవళములఁ బ్రతిష్ఠించియు నాంధ్రదేశమునం దంతటను ఆర్షమతమునకు స్థిరవసతుల నెలకొల్పిరి. నామిరెడ్డి బేతిరెడ్డి కామిరెడ్డి ప్రముఖులు నల్లగొండ మండలముననను, రుద్రసేనాని, గణపతినాయకుఁడు, బొప్పనాయకుఁడు మానుకోటసీమయందును కాటసేనాపతి, చౌండసేనాధీశ్వరుఁడు కొండిపర్తిసీమయందును బల్లాలుఁడు, గదాధరుఁడు కొలనుపాక ప్రాంతములందును గొయ్యురాహుతు, బయ్యురాహుతు గాహిచరావు మెదకు సీమయందును రాజప్రతినిధులుగా నుండియు, సేనానాయకులుగ నుండియు గణపతి దేవపాదపద్మోప జీవులమని చెప్పుకొని స్వామిభక్తి వెల్లడించిరి. ప్రజావిశ్వాసముల నీవిధముగాఁ జూరకొని సర్వసమ్మతముగాఁ జిరకాలము రాజ్యమేలి కృతార్థుఁడైన సార్థకజీవనులలో గణపతిదేవుఁ డగ్రగణ్యుఁడు. ఆంధ్రదేశమునందలి ప్రతిప్రసిద్ధ స్థలముననను గణపతిదేవుని కీర్తిచిహ్నము లేకపోలేదు. చేబ్రోలు త్రిపురాంతకము, కాళేశ్వరము, శ్రీశైలము, వాడపల్లి, ఏలేశ్వరము, అలంపురి, మున్నగు ప్రసిద్ధ క్షేత్రములలో గణపతిదేవుని శాసనములు పెక్కులు గలవు.

గణపతిదేవుని సేనానాయకులు

ఈ వీరవతంసుఁడు దేవగిరియాదవుల విజృంభణము నడంచి యంతతోఁ దృప్తినొందక కొందఱు మహారాష్ట్రుల వెంటఁగొని యాంధ్రదేశమునఁ దనకుఁ బ్రతినిధులుగా నెలకొల్పి వారలకు బిరుదము లొసఁగి గౌరవించెను. పానుగంటిస్థలాధిపతియగు శార్ఙ్గపాణి దేవుఁడు, వ్రెక్కంటిపాలకులగు కల్వణాదులు, అద్దంకి పాలకుఁడగు మాధవనాయకుఁడు మున్నగువారలు ప్రముఖులు క్రమముగా

వీరి వంశజులు ఆంధ్రులలోఁగలసిపోయిరి. గణపతిదేవుని కాలమున సమస్త వర్ణముల వారును ఆంధ్రదేశమునెడను గణపతిదేవుని యెడ నభిమానించి రాజ్యక్షేమమునకుఁ బాటుపడియుండిరి. గణపతిదేవునికడ విశ్వేశ్వరశివదేశికులును, వాణసవంశజుఁడును మెలుగూరు దుర్గాధిపతియు నగు నన్నయ్య మంత్రి గంగయసాహిణి, సామంతభోజుఁడు, చెన్నాప్రగడ గణపామాత్యుఁడు, మున్నగువారలమాత్య పదవి నధిష్టించి యవసరసమయములలో దండనాయకత్వము వహించి యాంధ్రసామ్రాజ్య క్షేమమునకు సర్వంకషముగఁ గృషి చేసిరి. ఇందులూరి సోమమంత్రి యనునియోగివీరుఁడు గణపతిదేవుని కడఁ జిరకాలము మంత్రిగానుండి రాజ్య క్షేమమునకై భయంకరసంగరముల యందుఁ బాల్గొని ఓరుగంటికిఁ దూర్పుభాగమునందున్న విశాలాంధ్ర దేశమంతయు లోఁగొని గౌతమీతీరమున వసించి ప్రతినిధిపదవి జయప్రదముగ నిర్వహించెను. మల్యాలవంశజులు, రేచర్లవంశజులు, పల్యానివంశజులు, విర్యాలవంశజులు విశేషించి ఓరుగల్లు ప్రాంతములలో సామ్రాజ్యరోణమునకు నియోగింపఁబడినట్లు కనిపించుచున్నారు. ఒకానొక శాసనమున "రేచర్ల గోత్రం తే ష్వేకం కాక తీయన్నపార్చితమ్" అని యుంటచేఁ జిరకాలము నుండి కాకతీయులకు రేచర్లగోత్రీయులకుఁ బాలకపాల్యసంబంధము కలదని తెలియుచున్నది. రేచర్ల గోత్రీయులు కాకతిప్రోలరాజుకంటె ముందు కాలము నుండి కాకతీయులకుఁ బ్రతినిధులుగ నుండిరనియు నందు బ్రహ్మయసేనాని యను ప్రముఖుఁడు కాంచీరాజలక్ష్మిని కాకతి రాజునకుఁ గైవసము గావించెననియు రామప్పగుడుల చెంత గల రుద్రసేనాని శాసనమునఁ గలరు. నాటనుండి యీవంశజులు వృద్ధి నొంది గణపతిదేవుని కాలమున నాంధ్ర దేశమునందలి యన్ని భాగములలోఁ, బ్రతినిధులుగనుండి స్వామిభక్తి ప్రకటించి యసామాన్య యశము నార్జించిరి.

గణపతిదేవునినాఁటి విద్వాంసులు

ప్రతాపరుద్రీయనాటక ప్రకరణమువలన నాకాలమున నెందఱో ప్రసిద్ధ విద్వాంస లున్నటులఁ దెలియుచున్నది. గణపతిదేవుని సోదరియగు కుందమాంబ కుందవరమున నొక శాసనము స్థాపించుచు సామంతశూరుఁడను గణపతి దేవుఁ డొకశాసనము ప్రకటించుచుఁ బ్రతిగ్రహీతలగు పండితుల నామములఁ బేర్కొనెను. వీరలు గాక అభినవమయూరకవి, దామోదరకవి, నాగదేవుఁడు, బాలభారతి, మైలారనూరి,

మార్కండేయ పురాణకర్తయగు మారయ, కుమారసంభవకర్తయగు నన్నెచోడఁడు, (వార్ధకావస్థలో) పాలకుఱికి సోమనాథుఁడు, చక్రపాణి రంగనాథుఁడు, కేతన, తిక్కన సోమయాజి, రంగనాథ రామాయణ ప్రణేతయగు గోనబుద్ధారెడ్డి, నీతిశాస్త్రముక్తావళి వ్రాసిన భద్రభూపాలుఁడు మున్నగు ప్రసిద్ధ కవులు గణపతిదేవచక్రవర్తికి సమకాలికలుగ నుండి వాఙ్మయము సేవించి ధన్యులైరి. వీరల కావ్యరచమునకు గణపతిదేవుని సత్పరిపాలనమె కేలూఁత నొసంగెననుట మఱువరాని యంశము. శివదేవయ్య పరతత్త్వ రసాయనము రచించెనని గ్రంథాంతరములలోఁ గలదు. ఈతఁడు గణపతిదేవునికిఁ జన్మయదీక్ష నొసంగిన విశ్వేశ్వరశివదేశికుఁడె కానోపు. ఏలయన నీయాచార్యుఁడు బాల్యముననె గణపతిదేవుని యాదరసత్కారాదుల నొంది రుద్రమదేవి కాలమునఁ గూడ నుండెఁ గాన ప్రతాపరుద్ర చక్రవర్తి జనన మీయన యెఱుఁగును. గ్రంథ సాధనములు లభించువఱకు నీయనయే పరతత్త్వరసాయనకర్తయని విశ్వసించుట ప్రమాదము కాఁబోదు.

గణపతిదేవుని పరిపాలనము

క్రీ.శ. ౧౧౯౯ మొదలుకొని ౧౨౬౧ వఱకీయన రాజ్యము పరిపాలించినటులఁగలదు. స్థానిక చరిత్రములందును నిటులె గలదు గాని రుద్రమదేవి రుద్రదేవుఁ డను పేరుతో స్థాపించిన శాసనములు ఈమధ్యకాలమునకుఁ జెందినవి కొన్ని యటీవలి పరిశోధనమున బయటపడినవి. అవి గణపతిదేవుని రాజ్యపాలనకాలమున రుద్రమ దేవి రుద్రదేవుఁడని వ్యవహరించుచు వేయించినవి కానోపును. గణపతిదేవుఁ డాకాలమున రాజ్యవ్యవస్థల సాక్షిమాత్రుఁడై తిలకించుచు శైవాచారరహస్యముల నెఱుఁగుచు వానప్రస్థాశ్రమమునఁగాలము గడుపుచుండెనని యూహింప వచ్చును. గణపతిదేవుని తోఁబుట్టువగు కుందలదేవి నతవాటిరాజుల కీయఁబడుటచేఁ గలిగిన బాంధవ్యము కాకతీయ సామ్రాజ్యమునకు బలకరమయ్యెను. ఈకుందాంబకు నతవాటి రుద్రరాజుతో జరిగిన వివాహాదికము ఈయమ నెలకొల్పిన కుందవరపు శిలాశాసనమున నీక్రిందివిధముగాఁ బ్రశంసింపఁ బడియున్నది.

శ్లో॥ వరాయ సద్వంశవరాయ దాతు మేనా మనేకస్సచివై రమం స్త ।

శ్రీనాతవాటీ నరనాథ వంశం తత్కాకతీశస్య కులానురూపం. ॥

శ్లో॥ శ్రీకాకతీశ వంశేన తదేవ విమలం కులం,
అలంకలయితుం స్థానే స్వర్ణే సన్మణిసంగమః.

శ్లో॥ ....రుద్రనృపతే రదదాన్మహాదేవనృపః

దీనింబట్టిచూడ మహాదేవరాయలకు ముందు దుర్జయువంశజులగు నతవాటిరాజులకుఁ గాకతీయులకు సంబంధబాంధవ్యములు లేవనియు మహాదేవరాయలు కులశీలగౌరవాదులు విచారించి మంత్రుల యాలోచనము ననుసరించి యారుద్రదేవునితో బంధుత్వము నెఱపు కొనెనని యూహించుట కీశ్లోకములు తోడ్పడుచున్నవి. ఇనుగుర్తిలోని నాగరలిపి శాసనములో బుద్ధరాజునకు ముప్పాంబకుఁగుమారుఁడగు నీరుద్రదేవుఁడు గణపతిదేవుని సోదరియు బయ్యాంబావహ దేవరాయల పుత్రియగు మైలాహ్వాయమహాదేవిని బెండ్లాడినటులఁ గలదు. కుందలదేవియే ముదునూరుశాసనములో కుందాంబయని చెప్పఁబడినది. మైలాహ్వాయదేవియే మైలాంబయనుపేరుతో రుద్రదేవుని భార్యననియు సంతానవతిననియు అమరావతిశాసనము నందును త్రిపురాంతకశాసనమునను జెప్పుకొనెను. కుందలదేవి మైలాంబిక యొకతెయో భిన్నులో నిరూపింప వీలుకాలేదు. ఎట్లయినను ఈనూతన సంబంధము నతవాటివారితోఁ గాకతీయులకు మహదేవరాయల కాలములో జరిగిన దనుట సత్యము. నతవాటిసీమ పాలకులగు రుద్రదేవుని వంశజు లంతటితోఁ గాకతీయుల కంకితులై సాగివంశజుల వలె ఆంధ్రసామ్రాజ్యవృద్ధికిఁ బాటుపడియుందురు. *

గణపతిదేవుని పరిపాలనము

గణపతిదేవుఁడు ప్రజాహితముగఁ బరిపాలించిన రాజులలోఁ బ్రథమగణ్యుఁడు. ఆకాలమున జైనులకు బౌద్ధులకు నీయన కొంచెముగనో గొప్పగనో యొత్తిడి గలిగించినమాట సత్యదూరము కాదు. అంతమాత్రమున నీతఁడు ప్రజారంజకుఁడగాఁ డన వీలుండదు. విద్యానాథుఁడు గణపతిదేవుని మానుసశంభువని ప్రశంసించెను.

---

* *ఆంధ్రుల చరిత్రమున సాగివంశమునకుఁ జెందిన గొంకదోరపరాజు పేర్కొనఁబడెను. శాసనములలో నాతని ప్రశంస "త్యాగోంక దోరాధిపః" అని గలదు. త్యాగము చిహ్నముగాఁగల దోరపరా జని యట భావము. గొంక దోరపరాజనుట ప్రమాదము కానోపు.*

**కొన్ని శాసనములలో గణపతిదేవుఁడు సప్తమచక్రవర్తియనియు శివావతారమనియుఁ బ్రజాపాలనచతురుఁడనియు సత్యహరిశ్చంద్రుఁడనియుఁ బేర్కొనఁబడెను. ఈయన ఓరుగంటి చెంతఁగల కోనేటి వద్ద వేయించిన శాసనస్తంభము వలన వర్తకమునకెంత సౌకర్యములు గలుగఁజేసి నదియుఁ దేటతెల్లము కాఁగలదు. గణపతిదేవుఁడు గణపేశ్వర మను ప్రసిద్ధ క్షేత్రరాజమును గట్టించి యందు బహుసంఖ్యాకులగు విద్వాంసుల నుంచెను. ఆగణపేశ్వర దైవతము ప్రభావమున కాకతీయకులదైవతమగు స్వయంభూనాథున కనురూపుఁడని ప్రతాపరుద్రీయ నాటక ప్రకరణము నందుఁగలదు. ఈదివ్యక్షేత్రమును గూర్చిన వివరములు స్థానిక చరిత్రమునందు విపులముగఁగలవు. ఇతర దేశాగత వర్తకుల వలన వచ్చు సుంకములను గణపతిదేవుఁ డీదేవాలయములకె కట్టడిగావించెను. ఆపన్నులు గూడఁ జాల సులభముగ నుంట నీతని సత్పరిపాలనమునకుఁ దార్కాణము. కర్పూరమున వీసెకు రెండు చిన్నములు, కస్తూరి నూఱు చిన్నములకు రెండు చిన్నములు, పట్టుమాలియందుఁ దులమునకుఁ జిన్నము, దంతము, దూనూరిపట్టు పచ్చ పట్టందుకోటబాదిక, చందనము, ముత్యము, రుద్రాక్ష, గాణబూస మొదలుగాఁగల మణిబండారములం దెల్లాను మాడకు వీసము... ఇట్లు పన్నులు వ్యాపారవృద్ధికరముగా విధింపఁబడుటయే గణపతినృపాలుని ప్రశస్తపాలనమునకుఁ దార్కాణము.

గణపతి దేవుని వంశము

గణపతిదేవుని భార్య సోమదేవియని ప్రతాపరుద్రీయమున స్పష్టముగాఁ జెప్పఁబడినది.

> **"సైవోమాచేతి నిర్దిష్టా సోమాచేతి ప్రథా మగాత్,**
> **తవమాతా శివాసాక్షా ద్దేవో గణపతిః పితా."**

ఈయనకు కుందలదేవి, మైలాంబ యను నిరువురు సోదరీరత్న ములుగలరు. శాసనాంతరములవలన గణపతిదేవునకుఁ బిన్నచోడుని కుమార్తెలగు

** *...పరమ మాహేశ్వర శ్రీ స్వయంభూనాథ దేవదివ్య శ్రీపాదపద్మారాధక ప్రత్యక్ష ప్రమథగణావతార లాడచోడకటకచూఱకాఱమన్నియ బేంటకాఱ, కదనప్రచండ చలమర్తి గండ విభవ దేవేంద్ర సత్యహరిశ్చంద్ర చతుస్సముద్ర పరమ దిక్పూరితకీర్తి సప్తమచక్రవర్తి ఉపమన్యు ప్రముఖాది సకలభక్త జనానందకారణ వైరిసంహరణ ఆదిరాజచారు చరిత్ర సుజనైకమిత్ర సుస్థిరనిజ రాజాన్వయ నామాది సమస్త ప్రశస్తి సహితం శ్రీకాకతియ్యగణపతి దేవరాజులు...*

నారాంబపేరాంబలు కూడ భార్యలని కలదు. పట్టపు రాణిమాత్రము సోమదేవియనుట నిస్సందేహము. ఈమెయందు గణపతి దేవునకు రుద్రమదేవియను పుత్రికయు గణపాంబయను పుత్రికయు జనన మొందిరి. రుద్రమదేవి చాళుక్యవంశజాతుఁడగు వీరభద్రునకును గణపాంబ ధరణికోటపాలకుఁడగు కోటబేతరాజున కొసంగి పరిణయము గావింపఁబడెను. రుద్రమదేవి బాల్యావస్థనుండియును రుద్రదేవుఁడను వ్యవహారనామముతో రాజ్యవ్యవస్థలఁ దిలకించుచుండెను. గణపతిదేవుఁడు రుద్రమదేవిని పుత్రభావముతోఁ జూచుచు తనయులు లేరన్న కొఱంతదలంపక కాలము గడిపెను. గణపతిదేవుఁడు రుద్రమదేవిని పుత్రుఁడని వ్యవహరించినటులఁ బ్రతాపరుద్రీయమునందలి యీక్రింది పంక్తు లాధారములు కాఁగలవు.

"అన్యథా కథ మీశ్వరప్రసాదాదృతే నిరంకుశం స్త్రీవ్యక్తి విశేషస్య లోకాధిపత్యం? ఏవం మానుషశంభునా గణపతిమహారాజేన అభ్యంతరస్యాஉనుభవమహిమ్నః సదృశమత్రపుత్ర ఇతివ్యవహారఃకృతః"

(ఈశ్వరుని దయయే లేకపోయినయెడల ఒక యాఁడుదాని కడ్డుకలేని లోకపాలన మెట్లు చేకూరును? ఈవిధముననే మనుజ శివుఁడగు గణపతిమహారాజు అంతరంగరహస్యవేత్తయై కొడుకని వ్యవహరించుట తగియున్నది.)

కొందఱు రుద్రమదేవి బాల్యమున మగవాఁడుగ వ్యవహరింపఁ బడుటచే నొక కన్యనిచ్చి పెండ్లిచేసిరని యేమో వ్రాసిరి. రుద్రమదేవిని గణపతిదేవుఁడు పుత్రియనియె వ్యవహరించెను. సమకాలిక శాసనములలో స్త్రీగనే వ్యవహరింపఁబడెను. రాజ్యవ్యవస్థల యందు మాత్రము రుద్రదేవుఁడని వ్యవహరించియుండు ననుట వాస్తవము. రుద్రమదేవి చాళుక్యవీరభద్రున కొసఁగి పరిణయము గావింపఁ బడుటయు నామెకు ముమ్మడాంబ, రుయ్యాంబ యను నిరువురు తనయలు గలుగుటయుఁ బ్రసిద్ధమైయుండ "రుద్రమదేవిని గణపతి దేవుఁడు పురుషుఁడని వ్యవహరించి లోకమును నమ్మించుటకుఁ గన్యనొకతెం దెచ్చి బెండ్లి తంతునడిపెననియుఁ బ్రసాదాదిత్యుఁడు రుద్రమదేవిని ఖండించెననియుఁ గల కట్టుకథల విశ్వసింపఁ బనిలేదు. గణపతిదేవుని పుత్రికారత్నము లిరువురును రాజనీతికుశలురాండ్రు కావున గణపతిదేవుని యనంతరము కాకతీయసామ్రాజ్యమును రుద్రమదేవియు ధరణికోటరాజ్యమును భర్తనంతరమును లోకోత్తరముగాఁబరిపాలించి స్త్రీలయందు సామాన్యముగాఁ గానరాని యనన్యసామాన్యపరిపాలన కౌశలమును బ్రకటించిరి.

గణపతిదేవుని మహత్త్వము

అఖండశివనిష్ఠాగరిష్ఠుఁడగుటచే నీతని దైవాంశసంభూతునిగ లోకులు విశ్వసించి పితృభావముతో వర్తించిరి. కాంచీమండలము వఱకు నొకమాఱు దండయాత్రకేగి యఖండవిజయసంపన్నుఁడై రాజధాని చేరెను. రాజ్యమేలిన యఱువది సంవత్సరములలో నీతఁడు పరాజయ మెఱుంగఁడు. ఆంధ్రసామ్రాజ్య మీతని కాలమున సర్వవైభవసంపూర్ణమై దినదినాభివృద్ధితో నఖండప్రశస్తి గడించె ననుట సత్యము. గణపతిదేవుఁడు సూర్యవంశజుఁడని పాకాల శాసనమునందుఁ జెప్పఁబడెను. చంద్రవంశజుఁడును జాళుక్యుఁడును నగు వీరభద్రునికిఁ గుమార్తెయగు రుద్రమదేవి నొసంగెను. అంతమాత్రమున గణపతిదేవుఁడు క్షత్రియుఁడనుట కవకాశము లేదు. చతుర్థవంశజులని చెప్పుకొన్న రాజకుటుంబములతో సంబంధ బాంధవ్యములు కనిపించుట యీతని క్షత్రియత్వమునకు విరోధము. కాకతీయులు తాము క్షత్రియేతరుల మని చెప్పికొనినుటల శాసనాధారములు గలవు. అనుమకొండ శాసనములో నున్న రుద్రదేవుని "క్షుద్రక్షత్రకులోన్నతి క్షయకృతః" అను విశేషణము, ప్రతాపరుద్రీయములోని ప్రతాప రుద్రుని విశేషణములగు "క్షుద్రక్షత్రియపక్షశిక్షణ విధౌ","సోమార్కాభిజం తమద్యజయతి శ్రీకాకతీయాన్వయం", "అత్యర్కేందుకులప్రశస్తి మసృజద్యం కాకతీయేశ్వరం", "సూర్యసోమాన్వయామాత్య మహత్త్వాఽద్యాధరీకృతా" అనునవి కాకతీయవంశము సూర్యచంద్రవంశములకు భిన్నమైనదనియు, క్షత్రియేతరమనియు విశ్వసింప నవకాశము నొసంగుచున్నవి.

క్రీ.శ. 1260 ప్రాంతమున నీవీరవతంసుఁడు ఆంధ్రలోకము పారశోకాంబురాశిని ముంచి దివంగతుఁడయ్యెను. పితృసన్నిధిని పరిపాలనరహస్యముల గఱచిన యఖండశేముషీధురంధురురాలగు రుద్రమదేవి చిరకాలము రాజ్యమేలి పితృయశమునకు వన్నె పెట్టెను. గణపతిదేవునితోఁ గాకతీయవంశ మంతరించెనని చెప్పవచ్చును. రుద్రమదేవి చాళుక్యరాజుల ఇంటికోడలుగావున నాయమను కాకతీయరాజ్ఞయన వీలులేదు. ఆయను పుత్రియగు ముమ్మడమ్మయుఁ గాకతీయుల కొసంగఁబడినది కాదు. ఆయమ భర్తయగు మహదేవరాయలు కాకతీయే తరుఁడనుట స్పష్టము. ఈ పరిస్థితులలో సామంతులు, ఆస్థానకవులు, విద్వాంసులు రుద్రమదేవిని ప్రతాపరుద్రుని కాకతీయవంశజు లనుటకుఁ గారణము మృగ్యము. కాకతీయసామ్రాజ్యమును బాలించుచున్న కతన కాకతీయప్రభువు లనుపించుకొందురు

గాని రుద్రమదేవి, ప్రతాపరుద్రుఁడు కాకతీయవంశజు లనిపించుకొనుట పొసఁగదు.

కాకతీయ సామ్రాజ్యము మహామండలేశ్వర ప్రోలరాజుతో నారంభమై గణపతిదేవునితో విచ్ఛిన్నమైనది. అన్యగోత్రీయ యగు రుద్రమదేవికతనఁ బెంపొంది ప్రతాపరుద్రదేవుని కాలము నంతరించినది. ప్రోలరాజును రుద్రదేవుఁడు చంపుట రుద్రదేవుని మహదేవరాయలు చంపుట మున్నగు సత్యాచారములచే నీకుటుంబము మధ్యమధ్య రాజకీయు విప్లవములకు లోనయ్యెను. రుద్రదేవచక్రవర్తిని మహదేవరాయలు వధించిన పిదప భ్రాతృహంతకుఁడని యాతని రాజ్యమునకు సేనాపతులు రానీయక పోయిరి. ఈయవకాశమును బురస్కరించుకొని ప్రత్యర్థి రాజులు కాకతీయసామ్రాజ్యమును నాశనముగావించి స్వవశము గావించుకొనఁగా రేచర్ల రుద్రసేనాని సామ్రాజ్యము నుద్ధరించినటుల రామప్పగుడిశాసనమునందు స్పష్టముగాఁ గలదు. ఇంకొకమాఱు కాక యసామ్రాజ్యమునఁ బురుషసంతతి లేకపోవుటచే విఱియాల కామసాని తన కుమారుని నొసంగి కాకతీయరాజ్యము నిలిపినటుల గూడూరుశిలాశాసనములోని యీక్రిందిపద్యములవలనఁ దెలియవచ్చును:

చ. అనుపమ దుర్జయాన్వయసుధాబ్ధి ననేకులు రాజనందనుల్
సనిన బొఱింది వెన్నడనుసంభవుడయ్యె నతిప్రసిద్ధుడై
వినుతవిరోధిమండళిక వెన్నడు వెన్నుడ వోలె వానికిఁ
ఘనుడగు నెఱ్ఱ భూపతి జగద్విదితుం డుదయించె గీర్తితోఁ.

ఉ. భావితకీర్తి నాతనికి బాండవమధ్యమ భీముడో యనం
గా విఱియాల బీమన్రిపఘస్మరుడై యుదయించె వానికిఁ
భూవినుతుణ్డు మండళిక భూషణుడెఱ్ఱనరేంద్రు డుత్తమ
శ్రీవినుతుండు బంధుజనసేవ్యుడు దానుదయించె నున్నతిన్.

చ. అతడనిబొట్టచేత వసుధాధిపుజేకొని వాని వైరి ను
చ్ఛిత్రమున జంపి యాకొఱవిదేశమునందు బ్రతిష్ఠ సేసిత
త్తనయు సమేతు డోడగలి.... యము బిట్టఱ గద్యవంబున
ప్రతిముఁడు వానితా మొగడు పర్సియు పంద్రడు నెఱ్ఱడాప్షుడై.

చ. అరుదగునట్టి ఎఱ్ఱన్రిపు నంగన కామమసాని మే
ల్గరదని బేత భూవిభుని గాకతివల్లభుజేసి వానితా

బరగగ జేతబెట్టి ఘను బల్లవరాయని నాగిచొచ్చె భా
స్కరనిభ చక్రవర్తిగనికాకతినిల్పుట కోటిసేయదే.

చ. కారకకాలుడై పడుసె గాడయ నాయకు జంపి సూరడ
వ్వేలుపుగొండ రవ్వనిపువేలుపు గొండననిల్పి వానిచే
మేలుగమూడ ముప్పయిని మేలుగ నేరెడు బోదిపాడునుం
వేలుగ బేకుమావిడ్లు మేలుగరెండెయ రాజుసంగడై.

ఈ శాసనశిలపయి చాళుక్యరాజగు సోమేశ్వరుని శాసనమొక ప్రక్కగలదు. వేఱొకవైపు విఱియాలవంశజులగు సూరవిభుఁడు, వానికొడుకు బేతన, కోడలు బెజ్జమాంబికల ప్రశంసయు ఈదంపతులకొడుకు మల్లనపేరు గలదు. కన్నడపద్యమయమగు నీశాసనభాగమున శతాబ్దములేదు. ఇంకొకవైపు చాళుక్య సోమేశ్వరుని సంబంధియగు నిమ్మభీముని శాసనముగలదు. ఇవియన్ని యుఁ బదునొకండవ శతాబ్దమునాఁటివని లిపివలన నెఱుఁగనగును. వీని సమకాలికమునగు ఉదాహృతపద్యశాసనము పదియవ శతాబ్దములోనిది కావచ్చును. ఆ కాలమునఁగల దుర్జయవంశము, అందుఁ బ్రసిద్ధులగు ఎఱ్ఱభూపతి, విఱియాలభీముఁడు జనించుటయు, విఱియాలభీముఁడు బొట్టబేతరాజును జంపి కొఱవిదేశము గైకొనుటయు, ఎఱ్ఱభూపతి భార్య కామమసాని పల్లవరాయని విజృంభణమాపి, తనకరదనిచే (బేతరాజుచే) కాకతీయవంశము నుద్ధరింపఁ జేయుటయుఁ జరిత్రమునకు గ్రొత్తయంశములు. శాసనస్థాంశముల బలపఱు పనింకఁగొన్ని సాధనాంతరములు గావలసియున్నది. బేతభూపతి కాకతీయవల్లభు నెట్లు చేసెనో కామసాని పూర్వోత్తరము లెవ్వియో బేతభూపతి కాకతీయ రాజులలో నేపేరఁబరఁగెనో భావిపరిశోధనమునఁగాని తేలదు. ఇది గణపతిదేవుని కాలపు శాసనముగానను విఱియాలవంశ మాకాలమునఁ బ్రసిద్ధముగ నున్నందునను గణపతిదేవున కీయంశమేమైన యవ్వయించునేమో యని మాయనుమానము.

పరిశిష్టము

సూర్యుఁడస్తమించినంతనే అంధకారము జగము నాక్రమింపదు. మనోహరసాంధ్య మరీచు లాకాలమున నేత్రపర్వ మొనర్చును. సాంధ్యరాగతమస్స మ్మేళనము నయనానందకరముగ నుండును. అటులే గణపతిదేవ భాస్కరుఁ

దస్తమింపఁగనే ఆంధ్రదేశ మంధకార బంధురము కాలేదు. రుద్రమదేవిపరాక్రమము దిశలరేయెండవలె లోకానందకరముగ నుండెను. తేజస్తమోఘట్టనమె ప్రతాపరుద్రునికి యవనులకు జరిగిన సంగరము. అంతతో ఆంధ్రసామ్రాజ్యభానుఁడు అవశిష్టదీధితుల నాకర్షించుకొని చిరకాలమున నిశాగర్భమున నిమిడి విద్యానగరసమీపస్థమగు ఋష్యమూకగిరిపై నుదయించెను. ఇది ప్రసంగాంతరము.

గణపతిదేవుఁడు నిర్మించిన యాలయములు నశించినవి. అతఁడు నెలకొల్పిన తటాకములు మహారణ్యగర్భితములైనవి. ఆనాఁటి కీర్తిచిహ్నములు యవనపదాఘాతములకుఁ దాళజాలక భూగర్భగతములైనవి. ఐననేమి గణపతిదేవుని యాంధ్రవ్యక్తిత్వపునరభ్యుదయదీక్ష కాలగర్భమును జీల్చుకొని యాంధ్రదేశమును ఆంధ్ర వాఙ్మయమును నలంకరించు శుభకాల మాసన్నమైనది. ఈ శుభావసరమున మాటువడిన పశ్చిమాంధ్ర దేశమునందలి (నిజాము రాష్ట్రములోని) శాసన సముదాయమును సేకరింపఁగలిగితిమేని ఆంధ్రసామ్రాజ్యచరిత్రము భవిష్యత్సోదర సంతతి కర్పింపఁగలుగుదుము. సందిగ్ధములగు చరిత్రగ్రంథులు విచ్చిపోవును. ఆంధ్రసోదరులు కాకతీయ సామ్రాజ్యచరిత్రమునకు సేవజేయుట జాతీయ సేవయను కొనఁదగును. అక్కతన పరిపాలనవశమున భిన్నములగనున్న బ్రిటిషునిజాము దేశములయందలి ఆంధ్రదేశమున కవి నాభావమగు సంబంధ మేర్పడును. *పరిశోధక యువకుల శుభాగమమునకు అభ్యుదయాకాంక్షితమగు నిజామురాష్ట్ర మపేక్షించుచున్నది.

తే. అడఁగిపోయిన కాకతీయాంధ్రచరిత
మంతరించునె యాంధ్రు లున్నంతవఱకుఁ
బ్రశిథిలాంధ్రశరీరాస్థిపంజరమున
రాజకుండునె పూర్వపరాక్రమాగ్ని !

---

* *చరిత్రకారులు స్థానికుల ప్రవాదముల పైనను, జరిత్రానుభవము శాసనపఠనాభ్యాసము లేని ప్రజలపైనను ఆధారపడుటచేఁ జరిత్రాంశములు తారుమారగుచున్నవి. కొండిపర్తి దుర్గాధిపతి యగు చౌండసేనానిని అతఁడు స్థాపించిన చౌండసముద్రమును భాండసేనాని భాండసముద్రమనుట యొక్క తార్కాణము. ఈ వ్యాసమున సూచించిన శాసనములు చాలవఱకుఁ బ్రకటింపఁబడనివె. వీని మాతృకలు కొన్ని మాయొద్దఁగలవు.*

– ఆంధ్రపత్రిక ప్రజోత్పత్తి సంవత్సరాది సంచిక (1931)

4. కాకతిప్రోలరాజు చరిత్రము

చిరకాలము నుండి అనుమకొండపురము మాధవవర్మ, పద్మసేనుఁడు, వెన్నమరాజు, ఎఱుకదేవరాజు మున్నగు ఆంధ్ర రాజులు రాజధానిగఁ జేసికొని పరిసరదేశమును బాలించినటుల స్థానిక చరిత్రమునఁ గలదుగాని విశ్వసనీయమగు చరిత్రము లభింపలేదు కాకతి ప్రోలరాజుకాలము నుండి అనుమకొండపేరు దేశదేశములందుఁ బ్రసిద్ధమైనది. త్రిలింగరాజ్యమునకు సంబంధించిన ఆంధ్రపతాకమును అనుమకొండ శైలశిఖరమునఁ దొలుతఁ బ్రతిష్ఠించిన ప్రోలరాజు జీవితచరిత్ర మునంగొన్ని క్రొత్తయంశములు తెలియవచ్చినవి రాజ్యనిర్మాతయు, వీరాధివీరుఁడు నగుప్రోలభూవల్లభుని సంపూర్ణ చరిత్రమున కీవ్యాసము మచ్చుతునక.

కాకతివంశము

కాకతివంశమున జనించిన వీరులు పలువురు పశ్చిమ చాళుక్యరాజులకుఁ బ్రతినిధులుగ నుండి యాంధ్రదేశమును బాలించిరి. కాకతీయులు విష్ణుపాదోద్భవమగు జాతిని జన్మించితి మని శాసనములలోఁ జెప్పుకొనుటచే వీరల నాలుగవ జాతివారిగ విశ్వసింపవచ్చును. ఇటీవలి శాసనములలో గణపతిదేవాదుల బ్రశంసించుచు సేనానులు కాకతీయుల సూర్యవంశజులనిరి స్థానికచరిత్రమునఁ జంద్రవంశజులని చెప్పబడిరి సూర్యచంద్ర సంబంధమగు క్షత్రియవంశములకుఁ గాకతివంశము భిన్నమైనదని ప్రతాప రుద్రయశోభూషణమునందు విద్యానాథుఁడు పేర్కొనినాఁడు. కావునఁ గాకతీయులు నాల్గవజాతివారనియె విశ్వసింపవచ్చును. ఇంతవఱకు జరిగిన పరిశోధనమువలన ప్రోలమరుసు అనువాఁడు కాకతివంశమునకుఁ గూటస్థుఁడనియు, అతనికి బేతరాజు జనించెననియు, ఈతనికుమారుఁడె అనుమకొండరాజ్యస్థాపకుఁడగు (రెండవ) ప్రోలరాజనియు నొకశాసనము[౨] వలన స్పష్టముగాఁ దెలియుచున్నది. ఈశాసనమునందు ప్రోలరాజు త్రిభువనమల్ల దేవపాదపద్మోపజీవినని స్పష్టముగఁ

---

౧ *ఈవ్యాసమున నుదాహృతములగు శాసనములు హైదరాబాదు ఆంధ్రపరిశోధకసంఘమువారి తెలంగానా శాసన సంపుటమునుండి యుద్ధృతములు*

౨ *చూ. తెలంగానా శాసనసంపుటము, కాకతీయశాసనములు ఖాజీపేఁటశాసనము.*

జెప్పికొనినాఁడు అంతియుకాక తాను దుర్జయవంశజుఁడననియుఁ, అన్మకొండపురవరేశ్వరుఁడ ననియును, బతిహితచరితుఁడ ననియుఁ జెప్పుకొనినాఁడు ఇందువలన నిస్సంశయముగాఁ బ్రోలరాజు తొలత క్రీ.శ ౧౦౪౯ మొదలు ౧౧౨౬ వఱకు రాజ్యమేలిన పశ్చిమ చాళుక్యరాజగు త్రిభువనమల్ల విక్రమాదిత్యునికాలమున రాజప్రతినిధిగ నుండి యాతని యనంతరము స్వతంత్రుఁ డయ్యెనని తెలియుచున్నది. ప్రోలరాజుతండ్రి బేతిరాజునకుఁ ద్రిభువనమల్ల దేవుఁడనునది బిరుదనామము. బేతరాజు, అతనితండ్రి ప్రోలరుసు అనుమకొండఁ బాలించినటుల స్థానిక చరిత్రమునందుఁ గలదుగాని వారల జీవితచరిత్ర మింతవఱకు మరుగుపడియున్నది.

ప్రోలరాజుమతము

మహామండలేశ్వరుఁడగు కాకతిప్రోలరాజు జైనుఁడు చరిత్ర విదులు తలంచిరి గాని యది ప్రమాదము కానోపును[3] ఒక శాసనములో ప్రోలరాజు ఈశ్వరస్తుతి గావించి వరుణప్రతిష్ఠ నొనర్చినట్లును,[౪] ఇంకొకతావున జలంధరభైరవుని బ్రతిష్ఠించినట్లును జెప్పుకొనినాఁడు కాన నీతఁ డార్ష మతమువాఁ డనియే కంఠోక్తిగఁ జెప్పుకొనినాఁడు ప్రోలరాజు జైనుఁడనుటకుఁ బద్మాక్షి దేవళముచెంత అనుమకొండలోఁ గల శిలాశాసనమునందలి ఈక్రింది శ్లోకమునందలి జైనస్తుతియు, దానికి సంబంధించిన శాసనమును కారణములుగ మనవారు గ్రహించిరి.

"శ్లో॥ శ్రీమజ్జినేంద్రపదపద్మ మహేషభవ్యం
నవ్యత్రిలోక నృపతీంద్రమునీంద్ర వంద్యమ్,
నిశ్శేషదోషపరిఖండనచండకాండం
రత్నత్రయప్రభవ మద్య గుణైకతానమ్"

ప్రోలరాజు ఈపై శ్లోకమున జనేంద్రునిఁ బ్రస్తుతించియుండుట చేత నీతఁడు జైనమతావలంబకుఁడని స్పష్టముగా బోధపడుచున్నదని ఆంధ్రచరిత్రమునఁ జెప్పఁబడినది ప్రోలరాజు జైనుఁడనుట కీశాసనమెంత వఱకు సహాయపడునో యని మేము స్వయముగా నీశాసనముఁ జదివితిమి. ప్రోలరాజునకుఁ గులక్రమాగతమంత్రి యగు వ్యోజదండాధి పతియు నతని భార్య మైలమయుఁ గావించిన ధర్మము లిందుఁ బేర్కొనఁబడినవి. ప్రోలరాజు జైనుఁడనుట కీశాసన ముపకరింపదు. ప్రోలరాజు

---

3 చూ. ఖాజిపేటశాసనము.

౪ చూ. ఇనుగుర్తి శాసనము.

శివభక్తి సంపన్నుఁడగు శైవుఁడని యతనికుమారుఁడగు రుద్ర దేవుఁడు స్పష్టముగా "శివపాదపద్మయుగళ ధ్యానామృతానందభూః" అను విశేషణమునఁ బేర్కొనినాఁడు కావున ప్రోలరాజు శైవుఁడ నుట సత్యము ప్రోలరాజుమంత్రి వ్యోజదండాధిపుని భార్య మైలమ్మ కడూలయను బ్రతిష్ఠించెను. కడూలయే పద్మాక్షి కానోపు. ఏలయన ఈశాసనముగలతావున జైనవిగ్రహములు పెక్కులుగలవు. స్త్రీవిగ్రహ మొక్కటియెగలదు. నాఁడు కడూలయగను ఆవల పద్మాక్షీగ నీవిగ్రహమె వ్యవహరింపఁబడియుండెను పద్మాక్షి జైనదేవత యనుటలో సందియము లేదు. పద్మాక్షీవిగ్రహము గల యఖండశిల కిరుపార్శ్వములఁ జెక్కఁబడిన జైనవిగ్రహములెకాక చుట్టునున్న జైనవిగ్రహములు గూడ నిందుల కాధారములు. ప్రోలరాజు సర్వమతసమభావము గల వాఁడుగాన నాతని మంత్రులు జైనులుగ నున్నను సహించె ననియే యీశాసనముసారాంశము. ఇంతయేల? ఆత్రేయగోత్రుఁడును, నియోగి బ్రాహ్మణుఁడును, అద్వైతియు నగు ప్రోలరాజుమంత్రి గంగా ధరుఁడు జైనప్రతిష్ఠ గావించితినని[౧] యొకశాసనములో నీక్రింది విధముగాఁ జెప్పుకొనినాఁడు.

కం. పరమేశుండు హరిబుద్ధ
స్వరూపుండై యప్పురవరుల వచించు జినో
హరి యనియె పట్టశాలం
దిరముగ బుద్ధప్రతిష్ఠ సేసితి భక్తిన్

ఇటుల నెన్నేని జూపవచ్చును. మాధవవర్మవంశజులు ఆర్ష మతస్థులగు మేడరాజుజగ్గరాజుల మంత్రియు నియోగియు నగు నాగదేవరాజు గూడ జైనుఁడె. అంతియకాదు; నాగదేవరాజు ప్రోలరాజుమంత్రియగు వ్యోజదండనాథుని సమకాలికుఁడు అతఁడును[౨] దన శాసనములో మైలాంబవలె జైనస్తుతి గావించినాఁడు.

శ్లో॥ "శ్రీమజ్జినేంద్రమకుటోజ్వలరత్న భూషా
నాగేంద్రహస్తసరసీరుహకర్ణపూరా,
విద్యాధరేంద్రరచితో త్తమ కుంకుమాంకా
భూయా త్సుభాయ జినదేవపదాంబుజశ్రీః"

---

౧ చూ. కరీమునగరశాసనము

౨ పరకాలతాలూకా గోవిందాపుర శాసనమునుండి.

మంత్రుల మతమునుబట్టి రాజుల మతము నిరూపింప వలనుపడదనియు, ఆర్షమతమువారుగూడ జైనబౌద్ధమతములయెడ నాదర భావమును జూపిరనియు, ప్రోలరాజు శైవుఁడనియు నిరూపించుట కింకవఱకొనర్చిన చర్చ చాలును.

ప్రోలరాజురాజధాని

మహామండలేశ్వరుఁడును, వీరవతంసుఁడును నగు ప్రోలరాజు వీరభూమియు పితృపితామహుల కాణాచియు నగు అనుమకొండలోనె రాజధాని నేర్పఱచికొనెను. పద్మాక్షిగుట్ట సిద్ధేశ్వరుగుట్టకు మధ్య గల విశాలమగు ఆవరణమున రాజమందిరములను నిర్మించెను. పెట్టనికోటల వలె నున్న కొండలను గలిపి తూర్పుదిక్కునకు ఉత్తరదక్షిణములను మహెూన్నతములగు కట్టలు పోయించెను. రాజమందిరములకుఁ బ్రధాన ద్వారము దక్షిణముగ నేర్పఱుపఁబడినది. ద్వారరక్షణమునకు దృఢతరమగు ఱాతికోటయు దానికిఁ జేరువలో నత్యున్నతమగు సింహద్వారము నేర్పఱచెను ప్రత్యర్థిరాజులు పశ్చిమదిశనుండి దుర్గమును ముట్టడింపకుండ సిద్ధసముద్రము, బాలసముద్రము అను రెండుతటాకములు, ఉత్తరదిశనుండి రాకుండ భద్రిసాగరమను నొకతటాకము నెలకొల్పెను. ఈతటాకము లాయాదిశలఁ గాచుటయేకాక యగడ్తలకుఁ గూడ జలసహాయము గావించుచు నగరలక్ష్మికి విహారసరస్సులవలె నుండెను అంతతోఁ బోక ప్రోలభూవిభుఁడు రాజమందిరములకుఁ జుట్టునున్న మూఁడు కొండలపైనను ఱాతికోటఁగూడ గట్టెను ఇన్ని సురక్షితసాదనముల మధ్య ఆంధ్రసామ్రాజ్యలక్ష్మిని ప్రోలభూపాలుఁడు ప్రతిష్ఠించి రాజ్యమేలసాగెను.

ప్రోలరాజుప్రత్యర్థులు

చాళుక్యసామ్రాజ్యపతనానంతరము ప్రోలరాజు నూతనముగా ఆంధ్రసామ్రాజ్యము నెలకొల్పుట తోడిసామంతరాజులకు బాధగ నుండెను. పలువురు రాజులు ప్రోలుని యభ్యున్నతికి సహింపక ఆంధ్ర సామ్రాజ్యమును చిన్నభిన్నము గావింపఁగడఁగిరి. వారిలో తైలప దేవుఁడు, గోవిందరాజు, గుండరాజు, జగద్దేవరాజు, మున్నగువారు ముఖ్యులు. జగద్దేవుఁడు ప్రోలరాజును బందిగాఁ గొన నెంచి నానామండలికాన్వితుఁడై అనుమకొండను ఎడతెగని పట్టుదలతోఁ గొన్ని మాసములు ముట్టడించి తుదకుఁ బరాభూతుఁ డయ్యెను. సంధి నియమములలో జగద్దేవుడు తన పరిపాలనమునందున్న

రాజ్యము నంతయు వదలి సామాన్యపౌరునివలె నెందో తలదాఁచుకొనవలసి వచ్చెను. కావున ఒక శాసనములో జగద్దేవుని యనంతరము ప్రోల భూపాలుఁడు రాజ్యమునకు వచ్చినటుల [౧]నీ క్రిందివిధముగాఁ జెప్పఁ బడినది.

"శ్లో॥ యస్థాదిభక్తమాలక్ష్యా జగద్దేవా దనంతరమ్,
కాకతీశః ప్రోలభూప స్సోధరాం పర్యపాలయత్"

ప్రత్యర్థిలోకము వశంవదమగుటతో ప్రోలుని రాజ్యము మిగుల విస్తీర్ణమయ్యెను. సంపత్సమృద్ధి యతిశయించెను పరివారము, సైన్యము, ప్రకృతివర్గము మెండయ్యెను. రాజధాని అనుమకొండనుండి మార్చినఁగాని పురోభివృద్ధి కలుగదని తలంచెను. హిడింబతీర్థవాసులగు త్రిదండిమహర్షులను, రామారణ్య శ్రీపాదులను రావించి వారి యానచే ఓరుఁగల్లు అను తావున మహత్తరమగు కోట గట్ట నారంభించి ప్రోలరాజు బొక్కసమున నున్న ధనమంతయు వ్యయపఱచెను. అఖండశిల నొకదానిని కర్ణికగా నేర్పఱచి శ్రీచక్రానుసారముగా చుట్టు ఏడుప్రాకారముల నేర్పఱచిరి. మొదటి ప్రాకారము ఇటుకకోట రెండవది ఱాతికోట. మూఁడవది పుట్టకోట. దీని కావల నింక మూఁడు మంటికోటలు, పిదప నొక కంచెకోట వేయించెను. ప్రోలరాజు తన యవశిష్టజీవిత మంతయు ఓరుఁగల్లుకోటను నిర్మించుటకును, అందు మనోహరతరములగు వాపీకూపతటాకాలయాదులు నిర్మించుటకును, వినియోగించెను ఏకసమయముననే ఓరుంగంట నూతననగర నిర్మాణము, అనుమకొండలో రాజధాని నిర్మాణము జరుగసాగెను.

ప్రోలరాజు పరివారము

పద్మాక్షీశాసనమునందు ప్రోలభూవిభుని మంత్రి వ్యోజదండ నాథుఁడని కలదు. ఇతఁడొక సంగరమున మరణించినకారణమున సామ్రాజ్యరక్షణమునకై నూతనమంత్రి నన్వేషింపవలసివచ్చెను. ప్రోలరాజు వేఁగిదేశములోని చెల్లకిపురవాసియు ఆత్రేయ గోత్రుఁడును గోవిందరాజు తురుకమాంబలకుఁ బుత్రుఁడును నగు గంగాధరుని మంత్రి గాఁ జేసికొని అనుమకొండలో నాతనికి నెలవొనంగెను. ఈయంశము దెలుపు [౨]శాసనపంక్తుల నిట నుదాహరింతుము.

---

౧ చూ. గణపవరశాసనము

౨ చూ. కరీంనగరశాసనము

కం. వెలయంగ వేఁగిదేశం
బులోన నాత్రేయగోత్రపుంగవులు మహా
త్ములు చెల్లకిపురంబున
బలవంతులు పుట్టి పెరిగి పాలించి రనన్

ఉ. భూధరధైర్యు నత్యధిక పుణ్యచరిత్రుఁ దపారకీర్తిల
క్ష్మీధరమూర్తి శిష్టజనమిత్రుఁడు గోత్రపవిత్రుఁ దచ్యుతా
రాధనతత్పరుండు సురరాజవరుండు మతిప్రభాతిగం
గాధరుఁ డిద్ధరిత్రి ననఁగా నుదయించి శుభోదయంబునన్

క. మాతాపితృవర్గము సం
ప్రీతిం జదివించి వచ్చి పెంచి లసద్వి
ద్యాతిశయకుశలుఁ జేసి వి
భూతిం బరిణయముసేసి పోషింపంగాన్.

చం. సకలకలావిధిజ్ఞుఁ దనఁజాలి సమస్తజనాలిసద్గుణ
ప్రకరము నెప్పుడుఁ బుధసభం బ్రణుతింపఁగ నున్న యట్టినఁ
బ్రకటితకీర్తి ప్రోలజనపాలుఁడు ఘోరతరాజిలోలుఁడ
త్యకుటిలచిత్తుఁ డీతఁడని యాదరికఁ బిలిపించి పంపఁగాన్.

కం. చనువుమెయి నగరిలోఁ దగు
పను లెల్లను బెంపుమెఱసి పరికించుచు నే
ర్పును భక్తియుక్తి నతిముద
మునఁ జేయుచుఁ దత్పరోక్షమున మతియుఁ బ్రభన్"

ఈ గంగాధరుఁడు ప్రోలరాజున కనంతరము రుద్రదేవుని కాలమునఁగూడ నమాత్యపదవి నిర్వహించి యత్యధికాదరసమ్మానము లొందినటులఁ బైశాసనముననే గలదు. ఈ గంగాధరుఁడు ప్రోలరాజు కాలమున మంత్రిపదవి నిర్వహించుచు సప్తసంతానములొంది యనేక దేవాలయములను అనుమకొండలోఁ బ్రతిష్ఠించినాఁడు. డొండొండు అను నగ్రహారము పండితుల కొసంగెను. బౌద్ధాలయము, త్రికూటాలయము, ప్రసన్న చన్నకేశవాలయము, పున్నేశ్వరాలయము, కేశవాలయము, భీమేశ్వరాలయము మొదలగు నాలయరాజముల అనుమకొండలోఁ బ్రతిష్ఠించినాఁడు. ప్రభుమంత్రోత్సాహశక్తి సంపన్నుఁడగు నీగంగాధరమంత్రి ప్రోలభూపాలుని కాలమున

నెట్లు నిర్వహించెనో యట్లె తత్పుత్రుఁడగు రుద్రదేవుని కాలమునసైతము మంత్రిపదవి నిర్వహించి కాకతీయసామ్రాజ్యము చిరస్థాయి యగుటకుఁ గారకుఁడయ్యెను. ఈతఁడు గావించిన ధర్మములు కరీంనగరమండలములోని నగునూరులో విశేషించి కాంచవచ్చును. భావిపరిశోధనమున నీమంత్రీంద్రుఁడు ఆంధ్రసామ్రాజ్యాభివృద్ధికిఁ గావించిన ప్రయత్న పరంపరగుర్తు పట్టుట కవకాశము లభింపవచ్చును.

ప్రోలరాజు సేనానాయకులలో ముఖ్యగణ్యులు పలువురు గలరు. రేచర్ల గోత్రోఁడగు కామయసేనాని ప్రోలభూవల్లభునకు విశ్వాసపాత్రుఁడగు దండనాథుఁడు. ఈయన అపరిమిత బలసహాయుఁడై మంథెన (మంత్రకూటము) పాలించు గుండరాజును వధించి యాతని రాజ్యము నాంధ్రసామ్రాజ్యములోఁ గల్పెను ఈవిజయము ప్రోలరాజు దని రుద్రదేవుఁడును కామసేనాని దని రుద్రసేనానియు చెప్పుకొనిరి.

శ్లో॥ కృద్ధేనోద్ధురమంత్రకూటనగరీనాథాదయో నిస్త్రపో
గుండః ఖండిత ఏవ ముండితశిరాః క్రోడాంకవక్షస్థలః॥

రుద్రదేవునిశాసనము

"శ్లో॥ శ్రీమత్ప్రోలనృపాల సైన్యపతినా విఖ్యాతవిక్రాంతినా
యుద్ధే యేన మహాబలేన నిహతే మంథన్యగుండాధిపే"

రుద్రసేనానిశాసనము

ఈకామసేనాని రేచర్లగోత్రుఁడు. వంశపరంపరాగతమగుసేనా నాయకపదవియందుండి కాకతీయప్రోలరాజును సేవించిన మహావీరుఁడు ఇంతవఱకీ మహావీరుని నామము చరిత్రవిదుల కపరిచితముగ మఱుఁగుపడియుండుట సంతాపకరము.

ప్రోలరాజుసామంతులలో వేమచోలబొడ్డమమల్లి నాయకుఁడు నతవాటిసీమను బాలించువాఁడు. ఈయన స్వామిభక్తిపరాయణుఁ డనియుఁ, గాకతిరాజ్యోద్ధారకుఁ డనియుఁ బేరుగాంచెను. [౧]అమరేశ్వరాలయము గట్టించి మాటేరులో నీతఁడు తన విజయముల ధర్మముల నచటి శాసనమునఁ బేర్కొనెను. ఈశాసనము నింక శోధించినఁ గొన్ని చరిత్రరహస్యములు వెల్లడికాఁగలవు. సజ్జసేనాపతి, అన్నసేనాపతి,

---

౧ చూ. మాటేరుశాసనము

విరియాలవెన్నఁడు మున్నగు సేనాపతులెందరో ప్రోలభూపతి కాలమునఁ గలరు. మార్కండేయపురాణకృతిభర్తయగు గన్నసేనాని కూటస్థుఁడగు మల్లసేనానియు, రంగనాథరామాయణవంశావతారిక లోని కాటచమూపతియు, శివయోగసారమునఁ పేర్కొనఁబడిన ఇందులూరి గౌరనార్యుఁడు, జ్ఞానవాసిష్ఠ రామాయణమునఁ బేర్కొనఁబడిన మొలుఁగూరుపాలకుఁడగు రుద్రమంత్రియుఁ బ్రోలరాజునకు సమకాలికులు వీరలందఱు ప్రోలరాజునకుఁ బ్రతినిధులుగ నాంధ్రదేశము నందలి పలుతావుల రాజ్యపరిపాలనము గావించిన ప్రసిద్ధులు. వీరల వివరములఁ దెలుపు ప్రత్యేక శాసనములకొఱ కెక్కువ కృషి గావింప వలసియున్నది.

ప్రోలరాజు లలితకళాభిమాని

అనుమకొండలోని కోటమైదానమునకుఁ జేరఁబోవునపుడు శిథిల ద్వారశకలములు తొలుత గోచరించుచు పిదప మహోన్నతమగు ద్వారము గోచరించును. ఈద్వారముప్రక్కనుండి మంటికోటపైకిఁ బోయి కొండ యెక్కినచో ప్రోలరాజు కట్టించిన దృఢతరము మనోహరము సువిశాలము దుర్గమము అగు ఱాతికోట దృక్పర్వము గావించును. కోటగోడలపయిని వేసిన పరుపుఱాళ్ల పొంకము, అవి కదలకుంటకై చేసిన సీలసంతెన, నేఁటికిని నాఁటిశిల్పమును స్మరింపఁజేయు చున్నవి. కోటమైదానములోని సిద్ధేశ్వరాలయము ప్రోలరాజు నెలకొల్పినదే. ఇందు శిల్ప మంతగా లేదుగాని శిలానిర్మాణము, దృఢతరమగు భిత్తికాకల్పనము చూడఁదగినది. బాలసముద్ర మనుపేర నీనృపాలుఁడు నిర్మించిన తటాకము నేఁటికిని జెక్కుచెదరని యున్నతమగు కట్టతో అగాధజలవంతమై సుస్థిరముగా నున్నది. వీథులలోఁ గమపించు వీరశిలలు, నందులు, జైనవిగ్రహములు, లింగములు, లతాకృతులు గల స్తంభులు, శిథిలములై పూఁడిపోవనున్న వాటిసముదాయము నేఁటికిని బరిశోధకుల దృష్టి కుత్సాహకరములుగా నున్నవి. ఏకశిలా నగర నిర్మాణ మత్యాశ్చర్యకరమైనది. ద్వారములు, మెట్లు, బురుజులు, విగ్రహములు, ప్రోలరాజునకుఁ గల లలితకళాభిరతికిఁ దార్కాణములు.

ప్రోలరాజు వాఙ్మయమునకుఁ గావించిన మహోపకృతులు మఱచితిమి కాని యీతనికాలమున నగునూరు, మాటేరు, గూడూరు మున్నగు తావులఁ దెనుఁగుబద్యములతో శాసనములు నెలకొల్పఁబడినవి. ప్రబంధకవిత కవి పైచేయిగ నున్నవి. అందుచేఁ బ్రోలభూవిభుఁడు ఆంధ్ర కవితారసికుఁ డనియుఁ

గవితాకళోద్ధారకుఁ డనియు జెప్పవచ్చును. ప్రోలభూవల్లభుఁడు జైనుఁడు కాకపోయినను దన కోటయావరణము లోనున్న జైనవిగ్రహముల సురక్షితముగ నుంచి భిక్షుకుల రాకపోకల కనుమతి యొసంగెను. తాను శైవుఁ డయ్యు సిద్ధేశ్వరభక్తుఁ డయ్యు జైనులపైనఁ గాని, జైనభిక్షులపైనఁ గాని భిన్న భావము ప్రకటింపక కేవలరాజ్యాభివృద్ధియే ప్రదానలక్ష్యముగాఁ జూచుకొని కాలము గడపెను. ప్రోలరాజు విశేషించిన తన రాజధానీనగరమగు అనుమకొండలో సర్పప్రతిష్ఠలు, భైరవప్రతిష్ఠలు, కాళీప్రతిష్ఠలు, శివాలయ ప్రతిష్ఠలు గావించుచు వైదిక మతాభిమానము వెల్లడించుచుంటచే జైను లీనృపాలునియెడ భిన్నాభిప్రాయముతో వర్తించుచుండి రనుటకుఁగూడ నవకాశములు గలవు.

ప్రోలరాజు కుటుంబము

ఈనృపాలుని భార్య ముప్పమదేవి చిరకాలమున కీదంపతుల కిరువురు తనయు లుద్భవించిరి. జ్యేష్ఠుఁడు రుద్రదేవుఁడు, కనిష్ఠుఁడు మహాదేవరాయలు. కుమారు లిరువురకు శివనామము లుంచుటగూడ నీతఁడు జైనుఁడు కాఁడనుట కాధారముగఁ దీనికొనవచ్చును. రుద్రదేవుఁడు భారద్వాజగోత్రుఁడును, శ్రౌతక్రియాకర్మరుఁడును, సమస్త శాస్త్రపారంగతుఁడును నగు రామేశ్వరదీక్షితునియొద్ద సమస్తవిద్యలను, రాజనీతి శాస్త్రము నభ్యసించి కవితారచనమునందు సైతము నేర్పు గడించెను. ప్రోలరాజు తన కుమారుఁడగు రుద్రదేవుని బాహుపీఠికపై రాజ్యలక్ష్మి నుంపకముందె అకాలమృత్యువువాతఁబడెను. రుద్రదేవుఁడు పితృమంత్రియగు గంగాధరుఁడు, సేనాపతియగు కాటయనాయకుఁడు మున్నగువారి సాహాయ్యమున రాజ్యేందిరను వరించి ప్రతిపక్షబృందమును వధించి శిల్పమునకుఁ గవితకుఁ జేయూఁత నొసంగి సోమనాథాదిమహా కవులచేఁ గవితారచనమునకుఁ బ్రోత్సహింపఁబడి యచిరకాలమున వాణీవిలాసాశ్రయుఁడయ్యెను. రుద్రదేవుఁడు తండ్రికాలమున నడఁగి మడఁగియున్న విరోధిబృందమును నుక్కడంచి అనుమకొండ రాజధానిగ నుంటకుఁ దగదని యోరుఁగంటికిఁ దన రాజధానిని మార్చికొనెను. ఈయంశము శివయోగసారమున సైతము కలదు.

"అనుమకొండపురంబు గాదని యావిభుం డిల నోరుఁగ
ల్లనుపురంబు ఘటించి యచ్చటి కచ్చుగా నరుదెంచి య

మ్మనుజనాథుఁడు నాయకత్వము మల్లమంత్రికిఁ చిన్నమ
ల్లనకు ధారుణి పెద్దసంప్రతి నాతతంబున నిచ్చినన్"

అమ్మనుజనాథుఁడు అనుచో రుద్రదేవుఁడని పూర్వోక్తపద్యమువలన స్పష్టమగును ప్రోలరాజు క్రీ.శ. ౧౧౨౬ మొదలు ౧౧౪౦ వఱకు రాజ్యమును బరిపాలించెనని చరిత్రకారులు నిర్ణయించి యున్నారు.

అనుమకొండలోని దృశ్యములు

మాధవర్మమొదలుకొని పలువురు రాజులు అనుమకొండను రాజధానిగఁ బాలించినను ప్రోలభూపాలునివంటి స్వాతంత్ర్యశీలుఁడు మున్నెన్నఁడు అట నుద్భవింపలేదు. సమయ మెఱింగి ప్రోలభూవల్లభుఁడు చాళుక్యరాజ్య మస్తమింపఁగనే ఆంధ్రసామ్రాజ్యమును నెలకొల్పి ఆంధ్రజాతి మఱచిపోరానంతటి మహోపకృతి గావించి యాంధ్రవ్యక్తిత్వము నిలువఁబెట్టెను. భవిష్యదాంధ్రనగరమునకుఁ బునాది వేసెను. ఆంధ్రజాతియం దంతర్లీనమైన పౌరుషము, రాజనీతి, కార్యజ్ఞత సామ్రాజ్య నిర్మాణమునం దన్వయింపఁజెసెను. ఈ వీరాధివీరుఁడు పరిపాలించిన ఆంధ్రనగరరాజమగు అనుమకొండపురమున నాఁటి ప్రాచీనచిహ్నము లుపేక్షాదృష్టితో నాశనము గావింపఁబడుచున్నవి. ప్రోలరాజు కట్టించిన యాలయములలో సిద్ధేశ్వరాలయముదక్క దాదాపుగ మిగిలినదేవళము లన్నియు నశించినవి. నగరముచుట్టునున్న మంటికోట క్రమముగా రూపుమాయుచున్నది. ఆంధ్రసామ్రాజ్యలక్ష్మీ విహార రంగమగు రాజమందిర ప్రధానద్వారము కూలిపోవ సిద్ధముగా నున్నది. రుద్రదేవనరపాలకుని బాల్యవిహారభూమియు అశేషభూపాలమౌళి రత్నఘృణీవేష్టితమును ప్రోలభూపాలరత్న సింహాసననిలయము నగు అనుమకొండకోటమైదానములో నొకప్రక్క శవదహనము, మఱియొక ప్రక్క శవఖననము, ఇంకొకవైపున మలమూత్రవిసర్జనాయలములు నెలకొనియుంట సంతాపకరము. ఆంధ్రుల వ్యక్తిత్వము పదియవశతాబ్దము నుండి సర్వతోముఖముగ వెలుంగుట కాస్పదమైన పుణ్య భూమి కానరానంతటి హేయపద మగుటతోఁగాక యచటి శిథిలములుగూడ భగ్నాతిభగ్నము లగుచుంట చరిత్రవిదుల కెంతేని సంతాపకరము లనుటలో సంశయముండదు. ఏనాఁటికేని ప్రోలరాజు సమాధి, ముప్పమదేవి సహగమన మొనరించినతావు, మాధవవర్మ బాణవిద్య నభ్యసించిన

నెలవు, కుంతలదేవి మరణించిన ప్రదేశము గ్రంథాంతర సాహాయ్యమున దృఢపడినదో విణ్మూత్రాలయములతో శ్మశానవాటికలతో నిండిన కోట మైదానములోని యాపవిత్రస్థలముల గురుతింపఁ గలుగుట యెట్లు? కావున అనుమకొండనగరవాసు లీపవిత్రస్థలమును సాదరభావముతోఁ దిలకించుచు నున్నచో ఆంధ్రులు తమ యభ్యున్నతి కాస్పదమగు మాతృమండలసందర్శనమునకు మహోత్సాహముతో నుత్సవమునకు వచ్చునట్లు తండోపతండములుగ నేతేంచే నవకాశము గలుగఁజేసినవార లగుదురు.

ఆంధ్రసోదరుల విధి

కాకతీయ సామ్రాజ్యమునకుఁ బ్రథమస్థానమగు కోటమైదానమునకు ముందున్న సింహద్వారములు కూలనున్నవి. శిలాశాసనములు నానావిధముల నష్టములగుచున్నవి. వినోదార్థముగ బాలురు అపూర్వ శిల్పరమణీయములగు విగ్రహముల నోపినకొలంది పాడుచేయుచున్నారు. జీర్ణాలయములు తమ గృహావరణలో నుండఁగాఁ బలువురు రూపుమాని గృహనిర్మాణము గావించుచున్నారు. ఈయకృత్యములు దేశమం దంతటను జరిగినటులె కాకతీయాంధ్రసామ్రాజ్యప్రధాన స్థలమునఁగూడ జరుగుచున్నవి. సాంత్వనోక్తులతో నిట్టి యకృత్యముల నాఁపుట మానవధర్మము ప్రోలభూవల్లభుని శాసనచిహ్నములు ఆంధ్ర దేశమునిండఁ గలవు. ఎన్నటికేని యం దపూర్వచరిత్రస్థలములు చిహ్నితములైనట్లు తెలిసికొంటిమేని శూన్యస్థలములో వాని దర్శింపఁజాలము. ఏకశిలాశకల మేయపూర్వ చరిత్రసిద్ధాంతమున కాస్పద మగునో యని సర్వవిధములఁ బ్రాచీనచిహ్నములఁ గాపాడుట మానవధర్మము.

ఆంధ్రసోదరా! అనుమకొండలోని ప్రోలభూవిభుని స్మారక చిహ్నములయెడ నాదరదృష్టి ప్రసరించి దేశచరిత్రము నుద్ధరింపుము.

తే.గీ. పాడ వడంగిన యాంధ్రుల పూర్వయశము
మాటువడె భగ్న పాషాణమండపముల
అరసి పూర్వతరఖ్యాతి కలరుదేని
యరుగుదె మ్మనుమకొండ కోయాంధ్రపుత్ర !

– ఆంధ్రపత్రిక ఆంగీరస సంవత్సరాది సంచిక (1932)

5. కాకతీయుల చరిత్రము - విశేషాంశములు

- దూపాటి రమణాచార్యులు

కాకతీయు లాంధ్రదేశమునకు సంఘమునకుఁ గావించినసేవ యనల్పము. క్రీ.శ.1076 మొదలు 1127 వఱకు రాజ్యమేలిన త్రిభువన మల్ల విక్రమాదిత్యుని యనంతర మీవంశజులు స్వతంత్రులైరని చరిత్ర విదుల విశ్వాసము.

కాకతీయులమతమెద్ది? కూటస్థుఁడెవఁడు? వీరలవంశమెద్ది? యనునంశములు సందిగ్ధములుగనున్నవి. వీరికులమును గూర్చి ఇదమిద్ధమను నిర్ణయమింకను జరుగలేదు. కొన్ని శాసనములు దుర్జయవంశజుఁడగు బేతరాజును గూటస్థునిగను, మఱికొన్ని దుర్జయునితావున బేతరాజునుజెప్పి అతనిపుత్రుఁడగు ప్రోలరాజును గూటస్థునిగఁ బేర్కొనినవి. ఈప్రోలునివంశమున రుద్రదేవుడు జనించెననుటచే బేతరాజునకు ముందొక ప్రోలరాజీవంశమున గలఁడనుట సత్యము. మొత్తముమీఁద నీభిన్నభావములు సమన్వయించి చరిత్రచతురాననులగు శ్రీవీరభద్రరావు పంతులువారు ఈక్రిందివిధమునఁ జరిత్రమును నిర్ణయించిరి-

"దుర్జయుని తరువాత కాకతీయవంశమున మొదటి ప్రోలరాజు జనించెను. అతఁడు అరికేసరియను గొప్ప చెఱువు త్రవ్వించెను. ఇతనికిఁ త్రిభువనమల్ల బేతరాజు జనించెను. త్రిభువనమల్లుఁ డనునది బేతరాజునకు బిరుదనామము.... మహామండలేశ్వర కాకతిబేతరాజునకు బిమ్మట రాజ్యభారము వహించినవాఁ డతని కుమారుఁడైన ప్రోలరాజు.... ఈ కాకతిప్రోలరాజు శాసనమునందు మొదట త్రిమూర్తులయిన బ్రహ్మావిష్ణు మహేశ్వరులలో నెవరిని స్తుతింపక శ్రీమజ్జినేంద్రుని మాత్రమే స్తుతించి యుండటచేత నితఁడు జైనమతావలంబియని స్పష్టముగా బోధపడుచున్నది."

కాకతీయవంశములో రుద్రదేవుని తండ్రి యగు ప్రోలరాజునకుఁ బూర్వచరిత్రము చరిత్రకారుల కింతవఱకుమాత్రమె లభించినది. దీని ననుసరించి శ్రీ మారేమండ రామారావు గారు కాకతీయులు మైసూరురాజ్యములోని కాకతి అనుగ్రామము నుండి వచ్చియుందురనియు, ఈ వంశమున కాకర్త్యగుండన కూటస్థుఁ డనియు, నతఁడు క్రీ.శ.980 ప్రాంతమువాఁడు కానోపుననియుఁ గొన్ని సిద్ధాంతములు

గావించిరి. కాకతీయవర్ధంతికి ముందు హనుమకొండ ప్రాంతములందలి శాసనముల నన్నింటిని బరి శోధించితిమి. ఇంతకుమించిన చరిత్రాంశములుగాని, ఈ సిద్ధాంతమును దారుమాఱుచేయు శాసనములుగాని లభింపలేదు.

అదృష్టవశమున ఖాజీపేటలో నొక సమాధియందు రెండు శాసనశిలలు స్తంభములుగా నుపయోగింపఁబడినవని తెలియవచ్చెను. పోయి పరిశీలింప నందపూర్వ చరిత్రాంశము లున్నట్లునవి చరిత్రమున కమూల్య పరికరములనియుఁ దెలిసెను.

ఈ రెండు శాసనసములకును బయట ఒక మూరపొడవు గలభాగము విరుగఁగొట్టఁ బడుటచే శాసనశిలలయందలి యాద్యంతములకుఁ బొత్తు కుదురకున్నది.[1]

తెలిసిన భాగమువలన రాష్ట్రకూట వంశజుఁడగు అమోఘవర్ష పృథ్వీ వల్లభ దేవుఁడు మనకుఁ బరిచితుఁడైనాఁడు. ఈతఁడు తనకుఁ బ్రతినిధిగ అనుమకొండ రాజ్యమునకు సత్యాశ్రయవంశజుఁడు చాళుక్యుఁడునగు భీమరసును నుంచెను. అమోఘవర్షపృథ్వీవల్లభ దేవుఁడు క్రీ.శ. 878 ప్రాంతమున అనుమకొండ రాజ్యమును బాలించుచుఁ దన ప్రతినిధి నుంచుటచేఁ దొమ్మిదవ శతాబ్దమునఁ బశ్చిమ చాళుక్యులనుండి రాష్ట్రకూటులు త్రిలింగ సామ్రాజ్యమును హరించి యొక పశ్చిమచాళుక్య వంశజుని రాజప్రతినిధిగనుంచిరని తెలిసినది. ఆ కాలమున అనుమకొండకు వ్యహారనామము "అమ్మకొండ".

రెండవశాసనము కాకతిబేతరాజుది. నాలుగువైపుల నీశాసనము వ్రాయఁబడియున్నది. తలభాగము ఒకమూరవరకుఁ దెగఁగొట్టఁబడుటచే ఒక చివరగల యంశము వేఱొకప్రక్కతో జతకుదరకయున్నది. ఇది యొక శాసనమా,

---

1. "..... నన్దనయె
1. మ్బసంవత్సరమాగ క
2. న్నెయోల్బృహస్పతిప్రవ
3. ర్తి నే స్వస్త్యమోఘవ
4. ర్ష శ్రీపృథువీవల్లభ
5. మహారాజాధిరాజపర
6. మేశ్వరభట్టరర పాద
7. పద్మోపసేవిత లబ్ధ
8. సమధిగతపఞ్చమ
9. మహాశబ్ద మహాసామన్తా
10. ధిపతి సత్యాశ్రయ
11. శ్రీమద్భీమరుస స్వర్వగు
12. ణజనసంస్తూయమానధ
13. ర్మసారతి చతుస్సమ
14. యాశ్రయ సకళభువ
15. నవిఖ్యాతకీర్తి శ్రీయ
16. దమ్మ కొణ్డెగె శ్రావణ

రెండు శాసనములా? యను సందియముగూడఁ గలుగుచున్నది. ఇందొకభాగము కన్నడపద్యములతో నున్నది. మఱియొకభాగము శ్లోకములతో నున్నది. తొలుత శ్లోకభాగములోని సారాంశము వివరంచెదము. ఇందు మొదట బేతరాజు, తరువాత ప్రోలరాజు, పిదప బేతరాజు వరుసగాఁ బేర్కొనబడిరి.[2] ఇందలి చివరబేతరాజే త్రిభువనమల్ల బేతరాజు. ఇతని కుమారుఁడే ప్రోలరాజు, త్రిలింగరాజ్యనిర్మాత, శాసనమునఁ బయిభాగము బోవుటచే ముందుఁగల యంశములు దుర్గ్రాహ్యములైనవి. ఉన్నంతలో బేతరాజు కాకతిపురాధి నాథుఁడు, చోళరాజుల సేనాసముద్రమును మధించి లక్ష్మి నార్జించినాఁడు. ఈ బేతరాజు త్రిభువనమల్ల బేతరాజునకుఁ దాత. క్రీ.శే.975-1025 వఱకితని రాజ్యకాలము. పాలెంపేట శాసనమునందును పిల్లలమఱ్ఱి శాసనము నందును రేచర్లబ్రహ్మసేనాని కాంచీనగరమును జయించి కాకతీయరాజుల కర్పించి నటులఁ గలదు. కాంచీరాజులు చోళులు గాన ఈబేతరాజు తాను చోడవార్ధి జయించి లక్ష్మిని గడించితిననుటచేత నీతఁడు రేచెర్ల బ్రహ్మనాయని సహాయమున కాంచి జయించిన వీరుఁడని నిశ్చయింప వచ్చును.

పైఁ జెప్పిన మొదటి బేతరాజుకుమారుఁడు మొదటి ప్రోలరాజు. ఈయన మహావీరుఁడు. కొద్వఱ్ఱిదుగ్గరాజు కుమారుఁడగు గొన్న రాజును జంపి పరకూ దేశము నాక్రమించెను. ఈ ప్రోలరాజు మహావీఁరుడుగానే పాకాల శాసనము నందుఁ గాకతీయవంశమునకుఁ గూటస్థుఁడుగాను, చేఁబ్రోలు, ఖాజిపేటనాకా, అనుమకొండ వెలిపొలము శాసనములలో నీతడు ప్రఖ్యాతుఁడుగను జెప్పఁబడినాఁడు. ఈతఁడు నిర్మించిన అరికేసరి తటాక ప్రశంస చేఁబ్రోలు శాసనమందె గాక ఖాజిపేటనాకా శాసనమునందు సైతము గలదు. క్రీ.శ.1025-1076 ఈతని కాలము కానోపును. చక్రకూటవిషయము నీతఁడు జయించినాఁడు. భావిపరిశోధనమున నీతని వీరచరిత్రము గోచరింప వచ్చును. ఈతనికాలమునఁ గల త్రైలోక్యమల్ల భూవిభుని చరిత్రమింకను శోధింపవలసి యున్నది. ఈ రెండవ బేతరాజే హనుమకొండ రుద్రదేవుని శాసనమున త్రిభువన మల్లదేవుఁడని కేవల బిరుదనామము తోడనే వ్యవహరింపఁబడినాఁడు. ఈయన కట్టించినది బేతేశ్వరాలయము. ఇపుడది నశించినది. ఈయన గట్టించిన శివపురప్రశంస కిందనుదాహరింపఁ బోవు వేఱొకశాసనము నందుఁ గూడఁ గలదు. ఇపుడీగ్రామము రూపుమాసెనో, పేరు

2. ఈ శాసనము కాకతీయ సంచిక అనుబంధమున 1 నవంబరు శాసనముగా బ్రకటింప బడినది.

మారెనో యెఱుంగుట దుష్కరము. బేతభూపతికి 'పరశు' అను బిరుదము గలదు. ఇంతియే గాక విక్రమచక్రియను బిరుదుసైతము గలదు. ఈ బిరుదము హనుమకొండ వెలిపాలము నందలి పుట్టుఱాతి పయిగల యొకశాసనమునందు జెప్పఁబడినది.

పై శాసనశ్లోకమునందలి విక్రమచక్రిపదము పాశ్చాత్యచాళుక్య చక్రవర్తి త్రిభువనమల్లుని దెల్పునదియని కవిగారు వ్రాసిరి. అది సరిగాదు. బేతభూపతిని గూర్చినది గాకున్నచో అన్వయము కుదురదు. పూర్వోదాహృతమగు మాశాసనశ్లోకములోని విక్రమచక్రిపదముబేత భూపతికి బిరుదుగాన నిదియు బిరుదమనియే నిశ్చయింపవచ్చును. బేతభూపతికాలము క్రీ.శ. 1025 మొదలు 1076 వఱకుఁ కావచ్చును లేదా 1090 వఱకు నైనను గావచ్చును.

ప్రకృతశాసనమునఁ గొంత కన్నడభాగము గలదని తెలిపియుంటిమి. అందు బడుమటి వైపున శాసనకాలము ౧౦౧౨ ప్రమోద సంవత్సరము కార్తిక బహుళ ౧౫ ఆదివారము సూర్యగ్రహణకాలమని కలదు. అచటనే కాలాముఖతపోధనాచార్యుఁడును, శ్రీశైల మల్లికార్జున శిలామఠాచార్యుఁడును నగు రామేశ్వర భట్టారకుని ప్రశంసయుఁ గలదు. బేతభూపతి మల్లికార్జునునకు రామేశ్వర భట్టారకునకునుఁ బాద ప్రక్షాళనము గావించి యొనరించిన ధర్మము చెప్పఁబడినది.[3] ఇంతియ గాక దుగ్గనృపతియే త్రిభువనమల్లుఁడనియుఁ బేర్కొనఁ బడినది. ఈశాసనమునందు బేతభూపతి ప్రశంసఁ గలదు.

'పరమమహేశ్వరం' అను నితని బిరుదము ప్రత్యేకించి పరిశీలింపఁదగినది. బసవేశ్వరుని వీరశైవమతము ఉద్భవింపకముందు నుండియు కాకతీయులు శైవమతమువారనుమాట సత్యము. బేతభూవల్లభుని గురువగు రామేశ్వరపండితుఁడు, మల్లికార్జునుఁడును శైవమతాచార్యులుగానఁ గాకతివంశజులు శైవులనియే తోఁచుచున్నది. బేతభూవిభుని శాసనము లిప్పటికి మూఁడుగోచరించినవి.

---

3. *10. స్వస్తిశ్రీ సమస్త భువనాశ్రయ*
11. శ్రీ పృథ్వీవల్లభ మహారాజా
12. ధి రాజ పరమేశ్వర పరమ
13. భట్టారక సత్యాశ్రయకుల
14. తిలక చాళుక్యాభరణ శ్రీమ
15. త్రిభువనమల్లదేవర విజ
16. యరాజ్యాభ్యుదయ మాచం
17. ద్రార్క్క తారం సలుత్తమిరే తత్పాద
18. పద్మోపజీవి సమధిగత పంచ
19. మహాశబ్ద మహామణ్డళేశ్వర
20. నమ్మన్ కొండపురవరేశ్వరం పరమ
21. మహేశ్వరం పతిహితచరి
22. తం వినయవిభూషణం శ్రీ
23. మన్మహామణ్డళేశ్వరం కాకతీ
24. యబేతరసన నన్మకొండపుర

ఇవియన్నియు శివాలయముల కొనరింపబడిన దానమును దెలుపునవేగాన బేతభూవల్లభునినాట నుండి కాకతీయులు శైవులనియు, నంతకుమున్ను శైవులని విశ్వసింపఁదగిన యాధారముల నార్జింపవచ్చుననియు మాతలంపు. కాకతీయ వంశమునఁ గూటస్థుఁడు దుర్జయుఁడు. అతని యన్వయమునఁ దొలుత మొదటి బేతరాజు నతనికి మొదటి ప్రోలరాజును జనించిరి. మొదటి ప్రోలరాజునకు రెండవ బేతరాజును, ఆతనికి రెండవప్రోలరాజుననుక్రమము ఖాజీపేటరోడ్డు ప్రక్కను, వడ్డెపల్లిచెఱువుకొమ్మునఁగల శిథిల శాసనమునందును గలదు.[4] కేసరితటాకని ర్మాతయగు మొదటిప్రోలరాజే ఈ శాసనధర్మకర్త తండ్రి. కేసరితటాకనిర్మాణమునే ఈ శాసనము చెప్పుచున్నది గానఁ క్రిందఁ జెప్పఁబడు ప్రోలరాజు మొదటి ప్రోలరాజనుట నిస్సంశయము. తరువాత త్రిభువనమల్లదేవుని పాదపద్మోపజీవులగు (రెండవ) బేతరాజు, (రెండవ) ప్రోలరాజుగావించిన వరుణప్రతిష్ఠ చెప్పఁబడినది. ఈ రెండు శాసనము లీయంశమును నిర్ణయింప నాధారపడుచున్ననుఁ తొలుతఁజెప్పిన దరగాశాసనము విపులముగను చరిత్రాత్మముగ నుంటచే దానికి రెండవశాసనము బలము కలుగఁజేయునదిగా నున్నది. కాకతీయవంశవృక్ష మీనూతనాధారములతో రుద్రదేవుని వరకు నీక్రిందివిధముగా నిర్ణయింపవచ్చును.

దుర్జయవంశము
|
బేతరాజు I క్రీ.శ. 975–1025
|
ప్రోలరాజు I క్రీ.శ. 1025–1076
|
బేతరాజు II క్రీ.శ. 1076–1126
|
ప్రోలరాజు II క్రీ.శ. 1126–1140
|
రుద్రదేవుఁడు క్రీ.శ. 1140–1196

రుద్రదేవుని యావలివంశక్రమమున కాలములును రూఢములగుటచే నుదాహరించుట మానితిని.

---

4. అనుబంధము 5వ నంబరు శాసనము.

కాకతీయులలో రెండవ ప్రోలరాజు పద్మాక్షిగుడిముందటి శాసనమున జైనస్తుతి గావించుటచే జైనుఁడని వీరభద్రరావుగారు తలంచిరిగాని యాస్తుతి ప్రోలునిదిగాదు. అతని మంత్రిభార్యయగు మైళమాంబ గావించినది. మైళమయు, అమెపుట్టినింటివారును, భర్తయు జైనులని యాశాసనమున స్పష్టముగఁ గలదు. దీనితో బ్రోలరాజునకు సంబంధములేదు. అందుచే నీశాసనము రెండవప్రోలుని మతని రూపణమున కుపకరింపదని మున్నే చెప్పియుంటిమి. ఇపుడు రెండవ ప్రోలుఁడేకాక ఆతని పూర్వులు సైతము ఆర్షమతమువారను బలవత్తరములగు ప్రమాణములు లభించినవి.

రెండవ బేతరాజునకు రెండవప్రోలరాజునకు గురువగు రామేశ్వరదీక్షితుల చరిత్రము కొంత యీసందర్భమునఁ దెలిసికొనఁ గొన్ని యవకాశములు లభించినవి. రుద్రదేవుని యనుమకొండ శాసనములో రామేశ్వరదీక్షిత ప్రశంసగలదు.

స్థూలదృష్టి నీభాగమునుగాంచి పల్వురు శాసనగ్రంథకర్తలు రామేశ్వరుడని భ్రమపడిరి. రుద్రదేవునకుఁ జాలకాలమునకు ముందే రామేశ్వరదీక్షితుఁ డుండెను. శాసనగ్రంథకర్త రామేశ్వరదీక్షితునికుమారుడు నద్వయామృతయతి శిష్యుఁడునునగు అచింతేంద్రవరుఁడు. శాసనగ్రంథకర్త యగు అచింతేంద్రవరుడు రుద్రదేవుని సమకాలికుఁడుగాన నతని తండ్రి రామేశ్వరదీక్షితుఁడు ప్రోలరాజుకాలమునాఁ డనుట స్పష్టము. రెండవబేతరాజు ఉత్తరకాలమునకు, రెండవప్రోలుని మధ్య కాలమున నీరామేశ్వరదీక్షితుఁ డుండుటవలననే దరగాశాసనమున రామేశ్వరదీక్షితునకుఁ బాదప్రక్షాళనము గావించి రెండవబేతరాజు దానము లొనరించుట పొసఁగినది. రామేశ్వరదీక్షితుఁడు వైదికమతమువాఁడుగావున నాతని పాదములను గడిగి దానమొనర్చిన రెండవబేతరాజును వైదికమతమువాఁడే. కాన రెండవ బేతరాజు కాలమునుండి కాకతీయులు తప్పక వైదికమతము వారనియే విశ్వసింపవలయును. రామేశ్వరదీక్షితుని చరిత్రము ఒక శాసనఖండమున వ్రాయబడియున్నది.[5] ఈ శాసనము కాకతి రెండవప్రోలునినాఁటిది. మాదిరెడ్డి కుంటయను ననుమకొండ

---

5. శ్లో॥ భారద్వాజకులశ్రియః పరవృధశ్రౌతక్రియా కర్మఠః
శ్రీ రామేశ్వర దీక్షితో జనయితా యస్య క్షితా వగ్రణీః
సోఽ చింతేంద్రవరో ద్వయామృతయతే శ్శిష్యో యతిశ్రద్ధయా
శ్రీమద్రుద్రనరేశ్వరస్య సుమతే ర్వంశావళిం వర్ణయే॥

చెఱువునందుఁగల ఱాళ్ళు పరిశోధించుతతి నీశాసనశిల మాకు గోచరించినది. స్థానిక ప్రముఖులసహాయమున ఱాయి నిలువఁబెట్టి ప్రతిగ్రైకొంటిమి. ఈ శిలయొక్క పయిభాగము విరుగఁగొట్టఁబడుటచే ముందుఁగల చరిత్రాంశములు తెలియకున్నను రామేశ్వరదీక్షితుని చరిత్రము, వైదుష్యము, కాలము గ్రహింప నీశాసన మెంతయో సహకారికాఁగలదు. రామేశ్వరదీక్షితుఁడు మహావిద్వాంసుఁడు. ఈయున యొకయాలయము గట్టింపఁగ దానికి త్రిభువనమల్లుఁడు (బేతరాజు) తండ్రిగాగల వాఁడు (ప్రోలరాజు) దానముగా శివపురము సమర్పించినాఁడు. రామేశ్వర దీక్షితుఁడు మాహేశ్వరగ్రామణి, అనఁగా శైవుఁడు. శాస్త్రసిద్ధాంతమున కాయన ప్రమాణభూతుఁడు. ఈయన శిష్యుఁడే కాకతీయప్రోలరాజు. ఈప్రోలరాజు చలమర్తి గండబిరుదాంకుఁడు. ఈయన స్తంభమును స్థాపించినాఁడు.

ఇందుఁ బేర్కొనఁబడిన ప్రోలరాజు రెండవ ప్రోలరాజే. రామేశ్వరదీక్షితుని కుమారుండు రుద్రదేవుని కాలమునందుండుటవలనను, రెండవ బేతరాజు కాలమునఁగూడ రామేశ్వరదీక్షితుఁడుండి యతనివలనఁ బాదపూజలు గాంచుట వలనను, ఈ శాసనము రుద్రదేవుని శాసనలిపిని సర్వవిధములఁ బోలినందునను, వక్ష్యమాణ ప్రోలరాజు రెండవ ప్రోలరాజనుట నిర్ధారితము. ఇంతకుఁ దేలిన నిర్ధారణాంశము బేతరాజు కాకతి (రెండవ) ప్రోలరాజు శైవులు. వీరలు శివాలయములకు శైవమతాచార్యులకు విశేషించి తోడ్పడి ఆలయ ప్రతిష్ఠలు గావించిరి. ప్రోలరాజు బ్రాహ్మణశిష్యుఁడు గానను, ఆ బ్రాహ్మణుఁడగు రామేశ్వర దీక్షితుఁడు మహేశ్వరగ్రామణికావున, బేతరాజునకుఁ రామేశ్వరదీక్షితునకు సంబంధము గలదు గాన, కాకతీయులు రెండవబేతరాజు కాలము నుండి శైవులని నిష్కర్షగాఁ దెలుపవచ్చునని యా తలంపు.

కాకతీయవంశము విచ్ఛిన్నమగుటచే సేనానులు తమబిడ్డల నొసంగి రాజవంశము నిలిపి నటులఁ గూడూరు మాటేరు శాసనములలోఁగొన్ని సూచనలు కలవు.[6] వీనిలోని రెండవబేతరాజును గామమ్మసాని కని కాకతీయ సామ్రాజ్యమునకు రాజునుజేసెననియుఁ, బేతని రాజుచేతఁ బెట్టి, పల్లవుల విజృంభణము నడంచెననియుఁ, దన కాన్పును కాకతిరాజును జేసి కాకతీయవంశము నిల్పుట కోటిసేయుననియుఁ దోఁచుభావము విమర్శింపవలసియున్నది.

---

6. ఈ శాసనప్రతిబింబము మండలివారి వద్ద గలదు. దీని మూలము J.A.H.R.S. VIII-Pti I P.32.*లో ప్రకటింపబడినది. సంపాదకుడు.*

ఎటులైన నేమి ఉపలబ్ధశాసనాధారములవలనఁ గాకతీయ చరిత్రమునఁ గొందఱుప్రసిద్ధుల వృత్తములు దెలసినవి. ఈవంశమున రెండవ బేతరాజునకుఁ బూర్వముఁగూడ రాజ్యప్రతినిధిత్వము గలదనియు, వీరల చరిత్రముతోఁ జాళుక్య రాజుల కెంతకాలమునుండియో సంబంధము గలదనుటయు వాస్తవము. కాకతీయులెన్నఁడు జైనులో ఎన్నఁడు శైవులో గ్రహించుట కింకను శాసనపరిశోధన మవసరము. కాకతిపురము అనునామము తొలుత అనుమకొండకును, పిమ్మట రాజధాని మారినపిదప వరంగల్లున కునునున్నటుల శాసనములందు గలదు. ఈనామాంతరము కాకతీయ లేర్పఱచినదే. తొమ్మిదవశతాబ్దమునకుముం దీభాగమును రాష్ట్ర కూటులు, పశ్చిమచాళుక్యులు బాలించుచున్నందునను, రెండవ బేతరాజుకాలమునుండి కాకతీయులు శైవులని తెలియుటవలనను, కాకతిపురమను వ్యహారము తొమ్మిదిపదిశతాబ్దములలో నిదేయనియు, గణపతిదేవాదులు పరంపరగా నా నామమునే వ్యవహరించిరనియుఁ, బ్రతాపరుద్రదేవుని కాలమున నాపేరు ఆకారణముననే ప్రతాపరుద్రయశోభూషణమునగూడఁ జేర్పఁ బడెననియుఁ దెలియచున్నది.

కాకతీయుల కులనిరూపణమున కిదివఱకు లభించిన సందిగ్ధాంశములేగాని క్రోత్తవి లభించలేదు. రెండవ ప్రోలరాజునకు చలమర్తిగండబిరుదము గలదు. ఇది (రెండవ) ప్రతాపరుద్రుని వఱకుఁ బరంపరగా వచ్చినటుల గ్రంథాంతరములందును, శాసనాంతరములందును నాధారములు గలవు.

మొదటి ప్రోలరాజు త్రైలోక్యమల్లదేవునకు లోఁబడినవాఁ డనుసూచన ఉదాహృత శ్లోకములయందుఁ గలదు. త్రైలోక్యమల్లదేవుని శాసనములు ఆలంపూరులో మూడుఁను, గంగాపురములో నొకటియుఁ, డాకూరులో నొకటియుఁ గనిపెట్టినారము. ఇందొకటియగు డాకూరులోని త్రైలోక్యమల్లునిశాసనము శా.శ.౧౦౧౩ త్రైలోక్యమల్లరాజ్య సంవత్సరములు ఆంగీరస అనుకాలనియతి గలది. ఈత్రైలోక్య మల్లదేవుఁడు చాళుక్యపెమ్మాఁడియని యుపనామముగలవాఁడు. శాసనకాలము ఆంగ్లమానముచే ౧౦౮౧ అగును. ఇది దాదాపుగ మొదటిప్రోలరాజు కాలమునకుఁ గలియునుగాక త్రైలోక్యమల్లునకు మొదటి ప్రోలునకు సంబంధము సరిపడుచున్నది.

రెండవ బేతరాజుచే నర్చితుఁడగు రామేశ్వరుని చరిత్రము కొంత గ్రహించితిమి. అట్లే యాచార్యుఁడగు మల్లికార్జున కాలాముఖాచార్యుని వివరములు గూడఁ గొంత

గ్రహించవలసి యున్నది. తపోరాశి శిష్యుఁడును, కాలాముఖమతాధికారియునగు మల్లికార్జునుఁ డను ప్రసిద్ధుఁ డొకcడు గలcడు. ఈయన క్రీ.శ.1050 ప్రాంతమున వనవాసియందు మఠము నెలకొల్పెను. పశ్చిమచాళుక్యులు, చోడులు మల్లికార్జునుని సాదరగౌరవములతోc బూజించిరి. ఈయనగురుడగు తపోరాశివిగ్రహము అలంపురియందుc గలదు. అచటి శాసనములలో విశేషించి సూర్యరాశి, తపోరాశి, తేజోరాశి మున్నగు కాలాముఖాచార్యుల ప్రశంసయు, వారిని జాళుక్యులు పూజించిన విధము పేర్కొనcబడినది. రెండవ బేతభూవల్లభుని కాలమున మిగులప్రబసిద్ధుఁడుగనున్న కాలాముఖాచార్యుడగు మల్లికార్జునుఁడీయనయనియే విశ్వసింపవచ్చును. దాదాపుగ నీబేతనృపుని కాలముతో నీతనికాలము గూడ సరిపోవుచున్నది. ఈమల్లికార్జునునిగూర్చి యుదాహరించిన యంశములు కుమారసంభవ పీఠిక నుండి రచించితిమి.

అజ్ఞాతముగానున్న కాకతీయచరిత్రమున గొన్నియంశము లిప్పటికి నిర్ణీతములైనవి. ఇcక దెలిసికొనవలసిన యంశము లివి- కాకతీయులు రాజప్రతినిధులుగ నెన్నటినుండి ఓరుగల్లు ప్రాంతములందుc బేరొందిరి? వీరలకు రాష్ట్రకూటులతోను చాళుక్యులతోను గల సంబంధము లెట్టివి? దుర్జయునమున్ మొదటి బేతరాజునకును మధ్య గల పురుషాంతరములెవ్వి? వారి ప్రసిద్ధి ఎట్టిది? కాకతీయ లేనాcడు జైనులు, ఏనాడు శైవులు? కాకతిపురము అను పురిని నివసించుటచేతనే వీరు కాకతీయులుగా పరిగణింపc బడిరా? కాకతిదేవతను గూర్చి జైన గ్రంథము లేమని చెప్పుచున్నవి? మున్నగునవి.

(కాకతీయ సంచిక)

౬. కాకతీయుల ఆంధ్రభాషాసేవ

– శ్రీమాన్ దూపాటి శేషాచార్యులు

క్రీ.శ. ౧౧౨౦ ప్రాంతమునుండి పశ్చిమ చాళుక్యచక్రవర్తి యగు త్రిభువనమల్ల విక్రమాదిత్యుని రాజ్యము క్షీణదశకు వచ్చెను. అదియే కాకతీయుల విజృంభణమున కారంభకాలము. అంతవరకు సామంతుడుగను, సేనానాయకుఁడుగ నున్న ప్రోలరాజు ఆంధ్ర సామ్రాజ్యము నకు బునాదివేసెను. దాదాపుగా నీతని పూర్వుల శాసనములన్నియుఁ గన్నడ భాషయందే యున్నవి. ఈతనికాలముననఁగూడ గొన్ని కన్నడశాసనములు పద్మాక్షి, గూడూరు, ప్రాంతములనుండుటచేతఁ దొలుత నీతడు కర్ణాటభాషకే బ్రాధాన్యతనిచ్చినటుల నూహింపవచ్చును. ఇనుగుర్తి, మాటేరులలోనున్న తెలుఁగుశాసనములలో కాకతిప్రోలుని యాలయప్రతిష్ఠలు బేర్కొనఁబడినవి. ఇవియే యీతని ప్రథమాంధ్ర శాసనములైనచో నిట నుండి కాకతీయులుగావించిన ఆంధ్రభాషాసేవ సంగ్రహముగ నెఱుంగవచ్చును.

ప్రథమ ప్రతాపరుద్రుఁడని చరిత్రవిదులు ప్రశంసించు రుద్రదేవచక్రవర్తి ఆంధ్రమున కెంతయో సేవఁగావించెను. ఈతనిమంత్రి గంగాధరుఁడు నగునూరులో వ్రాయించిన శాసనమందును, సేనానాయకుఁడగు రుద్రసేనానికి ప్రతినిధియు మంత్రియునగు రాజప్రగడ నెలకొల్పిన ఉప్పరపల్లి శాసనమునందును, ఆంధ్ర కవితాసంపద వెల్లివిరిసినది. ముఖ్యముగ గంగాధరుని శాసనమందు గొన్ని విలక్షణ భాషా స్వరూపములుగూడ గోచరించుచున్నవి. తృతీయావిభక్తిలోని 'చేతꣳ' అను ప్రత్యయాంతముగా నాలుగుపద్యములు రచియించి యేవంగుణ విశిష్టుఁడగు రుద్రభూపతిచేత మంత్రిపదవి చేకొంటినని గంగాధరుఁడు చెప్పినాఁడు. 'చేసితిꣳ' అనియు, 'మనోమోదకరు'డనుటకు, 'మనోముదకరుం'డనియుఁ, గొన్ని విలక్షణరూపములు బేర్కొనినాఁడు. ఈతని శాసన కర్తపేరు దెలియకున్న నానాటి వాఙ్మయ స్వరూపము సర్వతోముఖముగ వెలుగొందెననుటకు నగునూరుశాసనము నందలిపద్యములే చాలును.[1] మఱియు రుద్రసేనానిమంత్రియగు రాజనాయకుని

1. *"శ్రీరామాధిపుఁ డింద్రనీలనిభ శారీరుం, డుదారుండు, గౌ*
రీరామాధిపుఁ డుజ్జ్వలస్ఫటిక శారీరుండు, ధీరుండు, భా
షారామాధిపుఁ డబ్జకేసరలసచ్ఛాయా శరీరుండునుం
గారుణ్యంబున మాకు నీవుత సదాకాలంబుఁ గామ్యార్థముల్ ॥

యుప్పరపల్లి శాసనమందలి పద్యములుకూడ నాకాలపు వాఙ్మయ పరిపక్వమునకు దార్కాణములు కాగలవు.[2]

రుద్రదేవమహారాజు క్రీ.శ. ౧౧౪౦ మొదలు ౧౧౯౦ వఱకు రాజ్యము నేలెను. ఈతఁడు విద్యాభూషణ బిరుదాంకుడనియు, నీతిసారమనుపేర నొక యమూల్యగ్రంధము విరచించెననియు వినుచున్నారము. వీరశైవవాఙ్మయ నిర్మాతయగు పాలకురికి సోమనారాధ్యులు కూడ నీకాలముననే దన కవితామృతముచే నాంధ్రసామ్రాజ్యమును ముంచెయెత్తెను. ఆకాలపు శాసనములవలన రామేశ్వర భట్టారకుఁడు, కవిచక్రవర్తి, మల్లికార్జున పండితారాధ్యులు, బాలసరస్వతి మున్నగుకవులు కొందరున్నటుల దెలియవచ్చుచున్నది. సిద్ధేశ్వరాలయము చెంతగల గుహలోని గండశిలపై హన్మకొండ సామ్రాజ్యమును వర్ణింపదొరకొనిన యొక ప్రౌఢకవి కవిత అసంపూర్ణముగ గోచరించుచున్నది. అందుఁగూడ రుద్రదేవుని కాలపు టాంధ్ర వాణీవిలాసచ్ఛాయలు గలవు.

కాకతిగణపతి దేవుఁడు క్రీ.శ. ౧౧౯౯ మొదలు ౧౨౬౦ వఱకు రాజ్యమును పరిపాలించినాఁడు. ఈతని శాసనములు గొన్ని తెలుగునను, కొన్ని సంస్కృతమునను గలవు. విశేషించి ఆంధ్రశాసనములు గద్యరూపములు ఆనాటి వాఙ్మయమును గుర్తింప నివి మిక్కిలి యుపకరించును. రుద్రదేవుని కాలమునుండి గణపతిదేవుని కాలమువఱకు విస్తరించిన కాకతీయశిల్పములకు లక్షణగ్రంధమని చెప్పఁదగు నృత్తరత్నావళి వెలువడిన దీకాలముననే. ఏతత్ గ్రంధకర్తయగు జాయసేనాపతి గణపతిదేవుని బావమఱది. అంతియేకాదు ఆతని గజ సైన్యాధిపతిగూడ నైయున్నాఁడు. ఈగ్రంధము గీర్వాణ భాషలోనున్నను ఆంధ్రశిల్పములను గూర్చియు, ఆంధ్రనృత్యమును గూర్చియు, వివరములు గలిగి యుండుటచే నిది యొక యపూర్వనృత్తవాఙ్మయ చరిత్రమని చెప్పవచ్చును. విశ్వేశ్వరదేశికుఁ డాకాలపుశైవపీఠాధికారి. గణపతిదేవుఁ డీతని కాలమువాడని మల్కాపురము శాసనము వాకొనుచున్నది. బహుశః అనుభవసారము రచించిన ఆంధ్రప్రౌఢకవి యీతని కాలమువాడేమో? గణపతిదేవుని వాఙ్మయసేవ

---

2. *"ప్రతిపక్షక్షితిపాల కుంజర మదప్రారంభ సంరంభ ము*
ద్ధతబాహానిహిత ప్రచండపిసితోర్య ఖడ్గధారానఖా
హతిభేదింప యఖర్వగర్వ బలశౌర్యస్ఫూర్తి కంఠీరవా
కృతియై యున్నతవృత్తిఁ దాల్చి వెలసెౕ రేచెర్లరుద్రుం డిలన్॥

దెలుపు ప్రత్యేక గ్రంథము లేవో తెలియరావు కాని ఈతడు రసికశేఖరుఁడనుటకు సందియములేదు. తిక్కన సోమయాజి కార్యార్థియై దర్శనమున కేతెంచ నాదరించి భారతము నాలించి తద్రచన కబ్బురపడి కామితము నొసంగుటయే యీతని వాఙ్మయాభిమానమునకు బ్రబలదృష్టాంతముగఁ జెప్పవచ్చును. గణపతిదేవుని కాలమునఁ గూడ గవియైయుండి కవితాజీవనము, ఖడ్గజీవనము సమముగ నిర్వహించికొనినాఁడు. మారనమహాకవి గణపతి దేవుని కాలమున బాలుడై యుండి, తిక్కన సోమయాజికడ శుశ్రూషఁగావించి, ప్రతాపరుద్రుని యనుంగు గన్నయ సేనాని కాలమున నిరర్గళ కవితాపరిపాటి గడించినట్లు మార్కండేయ పురాణమువలన దెలిసికొనవచ్చును. దాదాపుగా నీతని కాలమువాఁడే కొలనిరుద్రదేవుఁడు కూడను. ఈతఁడు వ్యాకరణ బ్రహ్మయను బిరుదమువహించి గ్రంధరచనలో నారితేరినట్లు గూడ గొన్ని యైతిహ్యములు గలవు. ఆకాలపు జైనులకు శైవులకు బద్ధమత్సరముండుట వలన గలిగిన యన్యోన్యకలహములచే గొంతవాఙ్మయము నశించినది.

గణపతిదేవుడు ఈమతవిప్లవములలో శైవపక్షపాతియని తెలియుచున్నది. అందుచే జైన వాఙ్మయము నశించునవకాశము తటస్థించినది. శివదేవకవి కృతమగు పురుషార్థసారము వాఙ్మయమున కపూర్వభూషణము. ఈ గ్రంధ మా కాలపురాజనీతుల వెల్లడించు రాజనీతిశాస్త్రమనుటకు సందేహములేదు.[3]

శివదేవధీమణియను మకుటముగల శతకమునుగూడ నీతఁడు రచించినట్లు లక్షణ గ్రంధములవలన దెలియుచున్నది. ఈ రెండు గ్రంధములు, ఈయన శతకమును నేటివవఱకనుపలభ్యములే. శతవర్షజీవియై గణపతిదేవుని కాలమున ప్రతాపరుద్రుని కాలమునను గూడ రాజకీయచాకచక్యము వెల్లడించినట్లు స్థానికచరిత్రము వెల్లడించుచున్నది. శివయోగి ప్రతాపరుద్రదేవునకు బసవవిజయము నివేదించెననియు, దానిని తాను బద్యకావ్యముగ రచించితిననియు తుమ్మలపల్లి నాగభూషణ కవి చెప్పియున్నాఁడు. దీనినిబట్టి చూడ శివదేవుఁడు ప్రతాపరుద్రునికి శివమంత్రోపదేశికుఁ డేకాక విద్యాగురువని కూడతోచుచున్నది. రంగనాధుఁడను నొకకవి యీకాలమునందు గలఁడు. ఈతఁడు తొలుత వైష్ణవుఁడై యుండి శివనిందనుగావించి గ్రుడ్డివాఁడై

3. *ధరణి మదము లేని కరులునుబోలె, దంష్ట్రములు లేని పన్నగములు వోలె*
అరయ దుర్గరహితులైన ధాత్రీశ్వరు, లవనికెల్ల నసదు లగుదు రెపుడు
పరులకు దుర్గమువలతే, హరువరమున భువనవిజయుఁడగు రావణుడున్
శరధిగిరి ప్రాకారో త్కర పరివృతమైన లంకఘనమై యుండె౯.

"నయనగతిరగడ" అనునొకకృతిరచించి లబ్ధచక్షుష్కుఁడై నటుల నైతిహ్యములుగలవు.

రుద్రమదేవిచక్రవర్తిని క్రీ.శ. ౧౨౬౦ మొదలు ౧౨౯౫ వఱకు రాజ్యమేలినది. ఈమె గణపతిదేవుని రాజ్యాంతమునను ప్రతాపరుద్రుని రాజ్యారంభముననుగూడ నుండెను. ప్రత్యేకముగ నీయమగావించిన భాషాసేవను గమనింపజాలము. కాని యీమె పరివారము మాత్రము యెంతయో సారస్వతసేవకు దోడ్పడెను. రంగనాధరామాయణ నిర్మాతలగు కోనబుద్ధారెడ్డియు, రావిపాటి త్రిపురాంతకుఁడును, భాస్కర రామాయణ నిర్మాతలగు భాస్కరాదులును, నలకీర్తి కౌముదిరచించిన అగస్త్యేశ్వరుఁడును, దాదాపుగ నీకాలమువారే. భాస్కర రామాయణమున గొంతభాగమును బూరించిన శాకవల్లి మల్లికార్జున భట్టు బహుగ్రంధనిర్మాత. యీతడు రచించిన "అభిషిక్త రాఘవము" అను సంస్కృతకావ్యము హృదయంగమమై యీతనియొక్క యుభయ భాషానైపుణ్యమునకు దార్కాణముగ నున్నది. ప్రతాపచరిత్రము వలన మల్లికార్జునభట్టారకుఁడు కవితా విషయముననేగాక రాజకీయ తంత్రనిర్వహణమున గూడ నప్రతిమానుఁడు అని గ్రాహ్యమగుచున్నది. ఇంకనునందు మల్లికార్జునుని యమానుషచర్యలు ఆశుకవితానైపుణ్యములు గూడ బేర్కొనబడినవి. ఈతని భాషాసేవగుఱితింప పరిశోధకులు బ్రత్యేకకృషి చేయవలసియున్నది. కుమారరుద్రదేవుఁడు, హుళక్కి భాస్కరుఁడు, అయ్యలార్యుఁడు, భాస్కరుఁడు మున్నగు కవులచరిత్రములు నేటివఱకు మరుగుపడియున్నవి.

రుద్రమదేవి యనంతరము ౧౨౬౫ మొదలు ౧౩౨౩వ వఱకు నామోదౌహిత్రుఁడగు ప్రతాపరుద్రుడు రాజ్యమేలెను. ఈమధ్య కాలముననే విద్యానాధమహాకవిచే ప్రతాపరుద్రీయమను నలంకారగ్రంధ మాతని కంకితముగావింపబడినది. ఆంధ్రుల బలపరాక్రమములు సామ్రాజ్యవిస్తృతియు నందు ప్రశంసింపబడినవి. ప్రతాపరుద్రుని యాస్థానమున రెండువందల మంది కవులుండిరని స్థానికచరిత్రము చెప్పుచున్నది. ఇందతిశయోక్తియున్నను, పలువురు మహాకవుల కాశ్రయుఁడనుట మాత్రము సత్యము. ప్రతాపరుద్రుఁడు స్వయముగ కవియుబండితుఁడునై ప్రతాపమర్తాండము, వ్యాకరణ వార్తికము, మున్నగు సంస్కృత గ్రంధముల రచించెనని గ్రంధాంతరములగలదు. ఇప్పుడాగ్రంధములు మృగ్యములు. ప్రతాపరుద్రుని కాలమున దేవతోత్సవములయందు ప్రేమాభిరామమను రూపకము ప్రదర్శింపబడుచుండెడిది. దీనిని రచించినకవి రావిపాటి త్రిపురాంతకుఁడు. అది

ప్రకృతము కానరాకున్నను దాని యాంధ్రీకరణమగు క్రీడాభిరామముచే ప్రతాపరుద్రుని నాటి యోరుగంటి మహావైభవము తెలియుచున్నది. ప్రతాపరుద్రుఁడు బంధితుడగుటతో ఆంధ్ర సామ్రాజ్యము భిన్నమైనది. ఆంధ్రశిల్పము, వాఙ్మయమునశించినవి. ప్రధాననగరమున నెలకొల్పబడిన గ్రంథభాండారములు భస్మీపటలములగుటచే వాఙ్మయమున కింతంతయనరాని యపకారము వాటిల్లినది. సామ్రాజ్యోపజీవులగు మాధవవిద్యారణ్యులు, నాచనసోముఁడు, అగస్త్యేశ్వరుఁడు మున్నగు ప్రముఖులు స్థానాంతరముల కేగవలసివచ్చెను. నాటివగుచునుప లబ్ధగ్రంథములలో భాస్కర రామాయణము బహుకర్తృకము. ప్రేమాభిరామ మదృశ్యము. పురుషార్థసారము నామమాత్రశరణ్యము. ఈ రాష్ట్రమున సమగ్రమగు వాఙ్మయ పరిశోధనము జరుపఁబడక పోవుటచే హతశేషమగు గ్రంథసముదాయమును గుర్తింప నేటివఱ కవకాశము చిక్కలేదు.

* * *

శ్రీమద్గణపతి క్షోణీపతి ర్జయతి జిత్వరః ।
యచ్చిత్తేపి వశం నీశో నముంచత్య చలస్థితిం॥
తద్భక్తస్య ప్రవీరస్య శ్రీమద్రుద్ర చమూపతేః ।
రేచెర్లస్వామినో వంశం వక్ష్యే విఖ్యాతముత్తమం॥
శ్రీమద్బ్రహ్మాఖ్య సేనానీర భూద్భూరిగుణాన్వితః।
నిజప్రతాప ప్రాకార పరిత్రాత మహీతలః ॥

తూర్యప్రణాద సమనంతరమేవ తూర్ణ
మాక్షిప్యయో యవనికా సదృశం కవాటం।
కాంచీపురస్య సమపాదయ దాశువీర
లక్ష్మీవివాహ మిహ కాకతివల్లభస్య॥

(పాలంపేట శాసనము శ్లో5, 9-11)

(కాకతీయ సంచిక)

౭౦౩

7. రుద్రమదేవి

అంతఃపురము విడనాడి యెఱుంగని
ముగుద సంగ్రామభూములకుఁ జేరె
వాలు కేల ధరించు వైఖరి తెలియని
చెలువ వైరులనెల్లఁ జెండివైచె
గృహకృత్యముల నిర్వహించుటేనేరని
లలన సామ్రాజ్య పాలనమొనర్చె
ఒరులఁగాంచిన యంత నోసరిల్లు పొలంతి
యరిభూమి విభుల వెన్నాడితోలె
ఆంధ్ర సామ్రాజ్యమంతయు నద్వితీయ
విక్రమాతిశయంబున నెలయఁజేసె
కాకతీయ యశఃపతాకంబు నిల్పె
రుచిరవిక్రాంతి దీని శ్రీరుద్రదేవి.

తొలుత నుండి మేమాంధ్రులము; మాది యాంధ్రజాతియని సాటినవారు కాకతీయులు. చాళుక్యులు, పల్లవులు, చోడులు రాష్ట్ర కూటులు ఆంధ్రులా, ఆంధ్రేతరులా యను చర్చకుఁ దావుగలదుగాని, కాకతీయులవిషయమున సందేహింపఁ బనిలేదు. విద్యానాథుఁడు ప్రతాపరుద్రుని ఆంధ్రనృపుఁడని, ఏకశిలానగరమును ఆంధ్రనగరమని కాకతీయసైనికులను ఆంధ్రభటులని పేర్కొని వారియాంధ్రజాతీయత సార్థకముగావించెను. ఆంధ్రజాతికి, ఆంధ్రదేశమునకు, ఆంధ్రవాఙ్మయమునకు నపారమగు సేవగావించిన కాకతీయనృపాలురలోఁ బ్రథమ గణనీయుఁడు ప్రోలరాజు. అంత్యమునఁ బ్రశంసింపఁ దగినవాఁడు ప్రతాపరుద్ర దేవచక్రవర్తి. మన్నొకమారు కాకతీయు చరిత్రములను విపులముగఁ జర్చించియుఁటిమిగాన నిపుడు కాకతీయచరిత్రహారమున నాయకమణి యనఁదగు రుద్రమదేవి చరిత్రమాత్రము లిఖింతుము.

రుద్రమదేవి గణపతిదేవుపుత్రి. ఈయమ జననకాలము తెలుపు నాధారము గానరావు. ఆంధ్రసామ్రాజ్యాధీశ్వరుఁడగు గణపతిదేవ చక్రవర్తికిని సోమదేవికి నీయమ

పుత్రిక. గణపతిదేవునికి రుద్రమదేవి భార్యయను వాదము భ్రాంతిమూలకము. ఈవాదమునకుఁ గలకారణములు మృగ్యములు. మార్కపోలోయను ఇటలీదేశ యాత్రికుఁడు ఆంధ్రనగరపరస్థితులు రుద్రమదేవి రాజ్యవిషయములు గ్రంథస్థము గావించుచు నీయమ గణపతిదేవుని భార్యయనెను. ప్రతాపరుద్రీయ వ్యాఖ్యాతయగు కుమారస్వామి.

"పురాకిల కాకతికులసంభూతే గణపతినామ్ని మహారాజే దుహితృమాత్రసంతానే కదాచి ద్దైవయోగేన కాలపరిపాక ముపేయుషి తన్మహిషీ రుద్రదేవీనామరాజ్ఞీ బహూణి వర్షాణి తద్రాజ్య మకంటకం పరిపాల్య దౌహిత్రే ప్రతాపరుద్రే రాజ్యధురం నిధధే"

(తాత్పర్యము. పూర్వము కాకతికులమునందు జనించిన గణపతి యనుమహారాజు పుత్రికాసంతానముమాత్రము గలవాఁడై ఒకానొకప్పుడు దైవయోగమున మరణింప నతనిభార్య రుద్రదేవిరాజ్ఞి పెక్కు సంవత్సరములు రాజ్యము నిష్కంటకముగాఁ బరిపాలించి వృద్ధురాలై మనుమఁడగు ప్రతాపరుద్రునకు రాజ్యము నొసఁగె)

ఏకామ్రనాథుఁడు ప్రతాపచరిత్రమున నిట్లేచెప్పెను. కూచిమంచిజగ్గకవి సోమరాజీయమున నిట్లేచెప్పెను. స్థానిక చరిత్రములలో నిట్లేకలదు.

ప్రతాపరుద్రీయవ్యాఖ్యాతయగు కుమారస్వామి సోమయాజి ఐదువందల సంవత్సరముల నాఁటివాఁడు. నాటికే రుద్రమదేవి గణపతి దేవుని భార్యయను ప్రవాదము రూఢమైయుండును. సమకాలికుఁడును బాటసారియునగు మార్కపోలోఁగూడ నిటులె భ్రమకు లోనయ్యెను. ఈ భ్రమకుఁ గారణములు తెలియవు.

సమకాలికులశాసనములు పూర్వతరగ్రంథములు రుద్రమదేవి రాజ్ఞి గణపతి దేవుని పుత్రియని కంఠోక్తిగఁ జెప్పుచున్నవి. రుద్రమదేవి పరిపాలనము పత్రాపరుద్రునిపట్టాభిషేకము గాంచిన విద్యానాథ మహాకవి ప్రతాపరుద్రీయనాటక ప్రకరణములో రుద్రమదేవి ప్రతాపరుద్రదేవునకు మాతామహియనియు రుద్రేదవనామముతో రాజ్యమేలినదనియు సోమదేవియు గణపతిదేవుఁ డాయనుకు మాతాపితలనియుఁ జెప్పియున్నాఁడు.

"అన్యథాకథ మీశ్వరప్రసాదాదృతే నిరంకుశంస్త్రీవ్యక్తివిశేషస్య లోకాధిపత్యం? ఏవం మానుషశంభునా గణపతిమహారాజే నా

భ్యంతర స్యానుభవమహిమ్నః సదృశమత్ర పుత్రఇతి వ్యవహారః
కృతః తదనుగుణాచ రుద్రఇత్యాఖ్యా.

(తాత్పర్యము : ఆమహేశ్వరుననుగ్రహ మట్లుకానియెడ స్త్రీ వ్యక్తికి నిరంకుశమగు నిట్టిలోకాధిపత్య మెట్లు చేకూరును? ఇట్లే మానవశంభుఁడగు గణపతినృపాలుఁడు ఈయనుప్రభావము చిత్తమునందె ఱింగి తగినట్లు (రుద్రమదేవి) కుమారుఁడని వ్యవహరించెను. తదనుగుణముగా రుద్రాఖ్య యేర్పడెను.)

ఉదాహృతభాగమువలన రుద్రమదేవి గణపతిదేవుని పుత్రియనియుఁ బుత్రికమహత్త్వము నెఱింగి మాననశంభుడఁగు గణపతిదేవుఁడు కుమారుఁడనియె వ్యవహరించెననియు స్పష్టమగుచున్నది. కావుననే శాసనాదులందును గ్రంథములందును రుద్రదేవుఁడని వ్యవహరించియుఁదురు. రుద్రమదేవి పురుషవేషముతో సభ కరుదెంచి రాజకీయవ్యవహారములఁ బరిష్కరించెడి దనుట కీసమకాలికాధార మెంతయుఁ బ్రమాణము.

రుద్రమదేవిని పలుతావుల విద్యానాథమహాకవి రుద్రదేవుఁడని వ్యవహరించినాఁడు. రుద్రమదేవి పురుషవేషముతో రంగస్థలమునకుఁ బ్రవేశించుముందుఁగల ప్రతాపరుద్రీయములోని వైతాళికగీతము రుద్రమదేవి కాకతీయవంశజాతయని కంఠోక్తిగ శాసించుచున్నది.

"యోఽయంజాత స్త్రీలోకీ ప్రథితసుధిరితే కాకతీయాన్వవాయే
యస్మై శ్రేయాంస్యజస్రంవితరతిభగవాన్ దేవదేవస్స్వయంభూః;
యస్యాజ్ఞా సర్వపృథ్వీపతి మకుటమణి శ్రేణికేళీవయస్యా
సోఽయం భూపాలమౌళి ర్జయతి గుణమహా న్రుద్రదేవో నరేంద్రః."

(తాత్పర్యము : ఎవఁడు (రుద్రమదేవి) త్రిలోకప్రసిద్ధమగు కాకతీయాన్వయమున జనించెనో ఎవనికి స్వయంభూస్వామి నిత్యము శుభములఁ బ్రసాదించునో యెవనియాజ్ఞ రాజులకు మకుటధార్యమో ఆ రుద్రదేవనరేంద్రుఁడు జయముల నొందుచున్నాఁడు.)

యోరుద్రః రజతాచలే స్థితి మగా దర్ధాంగనారిః పురా
సోయం సంప్రతి కాకతీశ్వరకులే సర్వాంగనారిస్థితః

(ఏ రుద్రుఁడు రజతాచలమునందు అర్ధాంగనారీశ్వరుఁడై యుండెనో య

తఁడిపుడు కాకతీశ్వరుని వంశమునందు సర్వాంగ స్త్రీయై యున్నాఁడు.)

ఈ రెండుశ్లోకములు రుద్రమదేవి ప్రవేశమును దెలుపు వైతాళికగీతములు. మొదటి శ్లోకమునఁ గాకతీయవంశజుఁడని పేర్కొనఁబడిన రుద్రమమహారాజే సర్వాంగస్త్రీయగు రుద్రమదేవి. ఈయమతల్లి సోమదేవి. తండ్రి గణపతిదేవుఁడనుట కుదాహృతవదనము గాక మఱియొక శ్లోకముగూడఁ గలదు.

శ్లో॥ సైవోమాచేతినిర్దిష్టా సోమాచేతిప్రథామగాత్,
తవమాతాశివాసాక్షా ద్దేవో గణపతిఃపితా.

(తాత్పర్యము : ఆమె ఉమయని పేరొందెఁగాన సోమయని చెప్పబడినది. కానసోమయనుపార్వతి నీతల్లి. సాక్షాన్మహేశ్వరుఁడగు గణపతి దేవుఁడు నీతండ్రి యని శ్లోకభావము)

దీని వలన గణపతిదేవుఁడు రుద్రమదేవి తండ్రియనుట స్పష్టము. వ్యాఖ్యాత యీగణపతిదేవుఁడు రుద్రమదేవి తండ్రియగు నింకొకగణపతిదేవుఁడనుట భ్రాంతిమూలము అట్లు తలంచినచో బాధకములు చాలగలవు. కాన ప్రతాపరుద్రీయమతము ననుసరించినచో రుద్రమదేవి గణపతిదేవుని పుత్రియని నిర్ణయమగుచున్నది. ఈయంశమును స్థాపించు మల్కాపురశాసనమును శ్రీచిలుకూరి వీరభద్రరావుగారాంధ్రుల చరిత్రములో నుదాహరించిరి. రుద్రమదేవి కాలములోనే యాయనుగురువుగా గణింపఁదగిన విశ్వేశ్వరశంభుఁడు స్థాపించిన యీమల్కాపుర శాసన మీయంశమును దృఢపఱచుటలోఁ బరమప్రమాణముగ నున్నది.

"కతికతిచన సంతి భూపాః కతికతివా గుణగణాభరణాః
గుణపతినృపతి స్త్వేకో వరపతిశత పోషకః క్షోణ్యామ్;"

* * *

రుద్రదేవీ సముదభూ త్కారుణ్యా త్సర్వభూభృతామ్,
గంభీరా న్మహతస్తస్మాల్లక్ష్మీరత్నాకరాదివ;
సర్వోర్వీశ కిరీటకుట్టిమతటీ విన్యస్త పాదాంబుజా,
శాన్త్యేషా చతురంబురాశిరసనాం శ్రీరుద్రదేవీభువమ్;
యస్యా జన్మమహోత్సవో గణపతేః క్ష్మాపాలచూడామణేః,
విస్ఫూర్జ త్కలికాలకల్మషకథా ధ్వాంతౌఘతేజోనిధిః;

సామ్రాజ్యేఖిలవర్జితం విరచితే శ్రీరుద్రదేవ్యాన్వయమ్,
చాతుర్వర్ణ్య నిజస్థితి ర్విజయతే విద్రాతి కాలః కలిః.

గణపతిదేవచక్రవర్తికిఁ దనయయై రుద్రమదేవిజనించి రాజులనందఱిలోఁగొని భూమండలమేలుచున్నదనియు గణపతిదేవుఁడు స్వయముగా రుద్రమదేవికి జన్మదినోత్సవమునందుఁ బట్టాభిషేకము గావించెననియుఁ బైశ్లోకములభావము.

ఈశాసన మెంతేని విలువగలది. గణపతిదేవుఁడు వార్ధక్యమున స్వయముగాఁ బుత్రియగు రుద్రమదేవికిఁ బట్టాభిషేకము గావించినయంశమును సమకాలికమగు నీశాసనము చెప్పుటచే నిదినిస్సంశయము. రుద్రమదేవి గణపతిదేవుని పుత్రియనుట కీయాధారములుగాక యింక నేమేనియున్నచో నమూల్యమగు నీయంశము సిద్ధాంతముకాఁగలదు.

***స్వస్తి శ్రీకాకతీశో గణపతినృపతి**
స్తస్య సారుద్రమాంబా పుత్రీ లోకైకవీరా
జని రజనిపతే ర్నిష్కలంకా కలేవ; త
స్యాం పృథ్వీముదగ్రై రరిదమనభయో వేజితైర
ర్జయన్యాం లోకోద్దీపైః ప్రతాపై రకృతసుకృతి
నా మగ్రణేరగ్రహారం.

శూరభూపాలుని కోటగిరి తామ్రశాసనము.

ఈ శాసనకాలము శా.శ.1195 సరియగు క్రీ.శ.1273 ఇది రుద్రమదేవి కాకతీయసామ్రాజ్యమునకు గణపతిదేవుని పాలనమున యువరాజుగానున్న కాలము. శాసనకర్తయగు శూరమహీపతి రుద్రమదేవి సేనానాయకుఁడుగ కోటగిరిలో నుండి యీశాసనము వ్రాయించెను. సమకాలికముగాన నిందలియంశము విశ్వసనీయము.

"తత్పుత్రో గణపతినామధేయ సంజ్ఞే జలనిధిమే
ఖలాంభువం యశః; దోస్తంభే మణివలయం చకార

★ *ఈ శాసనము నిజాబాదుజిల్లాలో నొకబోయవానికిఁజిక్కఁగా నైజాముదొరతనమువారి శాసనపరిశోధక సంఘమువారికి సంక్రమించినది. ఇది నాగరిలిపిలోనున్నది. నిజాముకాలేజి ప్రొఫెసరు సిరుగూరి హనుమంతరావు యం.ఏ.యల్.టి.వారి వద్దనున్న తామ్రఫలకములఁజూచి యుదాహృతిభాగము వ్రాసికొంటిమి.*

శతై ర్దిఙ్నాగైః ఫణిపతినా కథంచిరూఢాం; జాతాతస్య పయోనిధేరివ రమా శ్రీరుద్రదేవీసుతా భాస్వద్భిః నృప మౌళిరత్ననివహైర్నీరాజితాంఘ్రిద్వయా త్యాగేన త్రిదివ ద్రుమాః దశదిశః కీర్త్యాధనానాం హతింలక్ష్మ్యా కించభు జాబలేన విజయం న్యక్కుర్వితిర్వర్తతి. భాగ్యైర్విశ్వస్య తస్యాః పతిరభవ దధో వీరభద్రాభిధానః.

పోతినాయకుని కొలనుపాక శాసనము.

ఈ శాసనము రుద్రదేవిబంటగు పోతినాయకుఁడు స్థాపించినది. శాసనశిల పయిభాగము విరుగఁగొట్టఁబడినది. అందుచే శకాబ్దముగల భాగము నశించినది. పోతినాయకుఁడు రుద్రమదేవిబంటుగాన నీశాసనము రుద్రమదేవిరాజ్యకాలమున స్థాపింపఁబడినది. ఇందు రుద్రమదేవి భర్త నామము వీరభద్రాభిధాసుఁడని కూడఁ గలదు. చరిత్రవిదుల కపరిచయనామమగు రుద్రదేవిభర్త పేరీశాసనమువలనఁ దెలియుట యొకవిశేషము. ఈ శాసనశిల కొలనుపాక సోమనాథాలయమున నున్నది.

"దుర్వార దోర్విక్రమవైరివీర భూపాలవాతాశనవైనతే యః; ప్రత్యర్థిపృథ్వీపతికుంజరేంద్ర విదారణక్రీడన మోదమానః; ప్రభూతవిఖ్యాతపరాక్రమోధూ త్తదం గభూ శ్రీగణపత్యధీశః స్ఫురజ్జయ శ్రీమతి రుద్రభూ పతీ తదాత్మజా కుర్వతి రాజ్యమున్నతమ్; విరోధిధాత్రీ పతి గర్వపర్వత క్షమాధరద్వేషిణి రాజభూషణి.

శార్ఙ్గపాణిదేవుని పానుగల్లు శాసనము.

ఈ శాసనము నల్లగొండచెంతగల ఛాయా సోమేశ్వరాలయములో నున్నది. ఈ పానుగల్లు నల్లగొండకు నాలుగుమైళ్లదూరమునందున్నది. రుద్రమదేవి రాజ్యముచేయుచుండు కాలమున నీశాసనము స్థాపింపఁబడినది. శా.శ.1189 (సరియగు 1267 క్రీ.శ.లో) శార్ఙ్గపాణి రాయలు సూర్యగ్రహణమునఁ గొంత బూమి దానమిచ్చినటుల నీశాసనశిలపైననేకలదు. గాన రుద్రమదేవి కాలమున స్థాపింపఁబడినదిగాన నీశాసనము ప్రమాణము. ఇందు రుద్రమదేవి గణపతిదేవుని పుత్రియని స్పష్టముగాఁ జెప్పఁబడినది.

ఇనుగుర్తిలోని విష్ణ్వాలయము ముందున్న నాగరలిపిశాసనములోఁగూడ గణపతి

దేవుని పుత్రి రుద్రమదేవియనిగలదు.

వచన సోమరాజీయమునందుఁగూడ రుద్రమదేవి గణపతి దేవుని పుత్రియని వ్రాయఁబడియున్నది.

పదునాలుగవ శతాబ్దమున లిఖింపఁబడిన అనితల్లి కలువచేరు శాసనములో గణపతిదేవునిపుత్రి రుద్రమదేవి యని స్పష్టముగా వ్రాయఁబడియున్నది. చూడుఁడు.

"పిత ర్యుపరతే తద్వ దరక్ష దఖిలాం క్షితిమ్, వీరరుద్రమ
దేవీతి దుహితా మహితాగుణైః. అథ సా రుద్రమదేవీ ప్ర
తాపరుద్రే హృతారినృపభద్రే దౌహిత్రే సుచరిత్రే సర్వా
మూర్వీం నిధాయ ముదితవతీ.

రుద్రమదేవి గణపతిదేవుని యనంతరము రాజ్యమేలుటయుఁ బిదప దౌహిత్రుఁడగు ప్రతాపరుద్రునకు రాజ్యము నొసంగుటయు నీశాసనమునందుఁ జెప్పఁబడెను.

క. వెండియు గణపతి ధరణీ
మండలపతిపుత్రి రుద్రమహదేవి కొగిఁ
దండాధినాథుడై భో
గండుడు పెగడన్న మనుమగన్నయ యెలమిఁ.

శివయోగసారము కృత్యాది.

ఈ గ్రంథము కొలని గణపతి దేవకృతము. ఇతఁడు దాదాపు శ్రీనాథునకు సమకాలికుఁడు. కాకతీయరాజుల విషయము లిక్కవి చాలవఱకుఁ జరిత్రానుకూలముగఁ జెప్పెఁగాన నితఁడు వ్రాసినది ప్రమాణముగ భావింపఁదగును. ఈయంశమే యిటీవల రచింపఁబడిన వెంకటగిరి సంస్థాన చరిత్రమునందుఁగూడ నీ క్రిందివిధముగఁ జెప్పఁబడినది.

తే.గీ. ఘనత ప్రసాదాదిత్యుండు కాకతిగణ
పతి చనిన నతనిసుతకుఁ బట్టణంబు
రమణతోఁగట్టి కాకతిరాయరాజ్య
స్థాపనాచార్యబిరుదు దాఁదనరఁగాంచె.

ఉదాహృతప్రమాణములవలన రుద్రమదేవి గణపతిదేవునిపుత్రి యనువంశము

రూఢమగుచున్నది. గణపతిదేవునకు రుద్రమదేవి భార్య యని తొలుతఁ జెప్పినవాఁడు మార్కొపోలో యను ఇటలీయాత్రికుఁడు. ఇతని కాంధ్రదేశపరిస్థితులు తెలియవు ఆంధ్ర భాష రాదుగాన నీతని యూహలు త్యాజ్యములు. రెండవవాఁడు ప్రతాపరుద్రీయవ్యాఖ్యాత యగు కుమారస్వామి సోమయాజి. ఈయన మూలమునకు వ్యతిరేకముగా వ్యాఖ్య వ్రాసి ప్రమాదములపాలయ్యెనుగాన నీతని నిర్ణయము సిద్ధాంతముగాదు. సర్వవిధుల రుద్రమదేవి గణపతిదేవుని పుత్రియనుటయే సత్యమునకుఁ జరిత్రమునకుఁ జేరున. పతివ్రతామతల్లియు, వీరశిరోరత్నము, కార్యఖడ్గకాశలపతియు నగు శ్రీరుద్రమదేవిజీవితచరిత్రము నిందుక చర్చింతము.

రుద్రమదేవి కుటుంబము

రుద్రమదేవి కాకతీవంశమునందు జనించెను. కాకతియను దేవత భక్తులుగాన నీవంశజులు కాకతీయులని పేరొందిరి. కాకతి జైనదేవతయనియు నీవంశమునఁగల ప్రోలరాజాదులు జైనులుగాన నీయూహ విశ్వసనీయమనియుఁ బలువురితలంపు. ఒరుగంటిలో కాకతమ్మగుడి యున్నటులఁ గ్రీడాభిరామములోఁ గలదుగాని యిపుడా క్షేత్రమంతరించినది. కుమారస్వామి కాకతియనునామె దుర్గయని తలంచి "కాకతిర్నామదుర్గాశక్తి రేకశిలానగరేశ్వరాణాం కులదేవతా; పా శక్తిర్భజ నీవ్యేతి కాకతీయః" అని చెప్పియున్నాఁడు. కాకతిదుర్గకానిందు; జైనదేవత కానిందు. కాకతిదేవిని పూజించుటచేతనే వీరలు కాకతీయులైరి.

కాకతీయులు తొలుతఁ బశ్చిమచాళుక్యులవద్ద సేవానాయకులు. ఆ రాజ్యము నశించినపిదపఁ బ్రోలరాజు హనుమకొండలోఁ దొలుత స్వతంత్రరాజ్యము నెలకొల్పెను. ఈయన కిరువురుకుమారులు. మొదటి వాఁడు రుద్రదేవుఁడు. మారుద్రదేవుఁడు విద్యాభూషణుఁడు; భాషావిదుఁడు; ప్రౌఢకవి. సంస్కృతాంధ్రములలో నితఁడు పెక్కుగ్రంథములు రచించెనఁటగాని యిప్పుడవి గోచరించవు. ఈతని బలవంతముగఁ జంపి సోదరుఁడగు మహదేవరాయలు రాజయ్యెను. మహదేవరాయల జైత్రపాలుఁడను యాదవరాజు చంపెను. అనంతరము గణపతిదేవుఁడు ఆంధ్రదేశమున కధీశ్వరుఁడయ్యెను. ఈయన భార్య సోమదేవి. ఇతని తల్లి బయ్యమాంబ. గణపతిదేవుడు క్రీ.శ. 1199 మొదలు క్రీ.శ. 1260 వఱకు అఱువది సంవత్సరములు రాజ్యముపాలించి వృద్ధావస్థలో మరణించెను. గణపతిదేవునకుఁ బుత్రసంతానములేదు. రుద్రమదేవి గణపాంబయను పుత్రికలు మాత్రము గలరు.

రుద్రమదేవిని గణపతిదేవుఁడు కుమారుఁడని ప్రకటించినట్లు ప్రతాపరుద్రీయమునందు గలదు. తరువాత నీయమను స్త్రీయని యెట్లువ్యవహరించిరో యీవ్యవహారమునకు గణపతిదేవుఁడెట్లు పాటుపడెనో తెలియదు. రుద్రమదేవికిఁ దనయంత్యకాలమున ఆంధ్రసామ్రాజ్యమునొసంగి గణపతిదేవుఁడు పట్టాభిషేకము గావించెను. గణపతిదేవుని కాలమున అనంతరమున ఈయమను గాకతీయవంశజుఁడగు కాకతి రుద్రదేవుఁడని సేనానాయకులు విద్యానాథుఁడుసైతము వ్యవహరించిరి. భర్తృవంశనామమీయమ కేలసంక్రమింపలేదో తెలియదు. రుద్రమదేవి భర్త వంశాదికములు విశేషాంశములు నేటివఱకుఁ దెలియవు. కొలనుపాక పోతినాయకుని శాసనములో మాత్రము ఈక్రింది శ్లోకములు గలవు.

"జాతాతస్య పయోనిధేరివ రమా శ్రీరుద్రదేవీసుతా;"

..

భాగ్యైర్విశ్వస్యతస్యాః పతి రభవ దథో వీరభద్రాభిధానః;
సౌందర్యేణేందు మన్వాం వతి మపి మహసామందభాసౌవి
తన్వన్ యద్వైదగ్ధంవిదగ్ధాయదురువిత
రణం యాచకోదూయదాజ్ఞాం రాజానో యత్ర్వ తాపం
విమతనృపతయోజాన్నతే జ్ఞాతభావాః జ్యేష్ఠశ్చాలుక్య
వంశార్ణవ..................

రుద్రమదేవిభర్త వీరభద్రదేవుఁడనియు నతఁడు జ్యేష్ఠచాళుక్య వంశజుఁడనియు మదాహృతభాగములవలనఁ దెలియుచున్నది. ఆవలిభాగము భిన్నముగుటచే ముఖ్య చరిత్రాంశము లిట మరుగుపడినవి. ఈ శాసనము నందె దానములొసంగుతావున రుద్రమదేవిభర్తయగు వీరభద్రదేవుఁడీ క్రిందివిధముగాఁ బ్రశంసింపఁబడినాఁడు:

'వీరేందు శేఖర నరాధిప శేఖరేణ చాళుక్యవంశమణినా
ప్రతిపాదితాసా త్రింశన్నివర్తనసముద్వహన ప్రవీణం'

ఈ వీరేందుశేఖరుని కొడుకే రుద్రమదేవిభర్తయనియుఁ జాళుక్యవంశ మణియనియు స్పష్టము. రుద్రమదేవి జన్మముచేఁ గాకతీయ వంశజురాలనియు భర్తృసంబంధముచేఁ జాళుక్యవంశ యనియు స్పష్టమైనది. కాకతీయులు దుర్జయవంశజులమనియు జతుర్థాన్వయుల మనియుఁ జెప్పుకొనిరి. చాళుక్యులు

చంద్రవంశజులను క్షత్రియులు. వీరల కెట్లు బాంధవ్యములు కుదిరెనో తెలియదు. రుద్రమదేవి భర్తయగు చాళుక్యవీరభద్రుఁడు సామాన్యుఁడు కాఁడు. వీరచూడామణి. సుందరాకారుఁడు. కార్యఖడ్గప్రవీణుఁడు గణపతిదేవుని యవంతరము రుద్రమదేవి రాజ్యపాలనము వహించుతఱి నీతఁడు రాజకీయ వ్యవహారాములఁ జూచుచు రాజ్ఞియం దిరువురు కుమారులనుబడసి యే స్వంతత్ర సమరములోనో మరణించియుండును. రుద్రమదేవి కిరువురు పుత్రికలు గలరు. ఒకతె ముమ్మడమ్మ. మఱియొకతె, రుయ్యాంబ. ముమ్మడమ్మ చాళుక్య వీరభద్రుని భార్యయని స్థానిక చరిత్రములలోఁ గలదు. ఇది ప్రమాదము. ముమ్మడమ్మ భర్త మహాదేవరాయలు. ఈయంశమును దెలుపు నితరాధారములు గలవు. ఈ మహాదేవరాయలు నిడదవోలు పురాధీశుఁడని యొకవాదము గలదు. నిడదవోలు పురాధీశులలో నొకఁడగు మహాదేవరాయల శాసనములు ప్రతాపరుద్రని రాజ్యకాలమునుండియే కనబడుచున్నవి. కాన నీతఁడు వేఱొకఁ డనియు సామంతవర్గములోని వాఁడనియుఁ దలంపనగును. రుద్రమదేవి కల్లుఁడె యైనచో సామ్రాజ్యమునందలి చక్రవర్తియైన తనకుమారుఁడగు ప్రతాపరుద్రునిందలి తన స్వల్పసంస్థానమున కంత్యకాలమున రాఁబనియుండదు. ఈ మహదేవరాజు కాకతీయవంశమునకుఁ జెందిన వేఱొక మహాదేవుఁడైయుండును. కాకున్నచోఁ బ్రతాపరుద్రుఁడు కాకతీయుఁడగుట పొసఁగదు. రుద్రమదేవి కుమారునిగాఁగైకొనుటచేఁ బ్రతాపరుద్రుఁడు కాకతీయుఁడయ్యె ననుపక్షమున విశ్వసనీయము గాదు. మహదేవరాజు పూర్వోత్తరములు భావిపరిశోధనమునఁగాని తేల నవకాశములు లేవు. రుద్రమదేవి రెండవ పుత్రి రుయ్యాంబను ఇందులూరి అన్నయ దేవుఁడు పెండ్లాడెను. ఈయన్నయ దేవుఁడు నియోగియని శివయోగసారమునఁ గలదు. క్షత్రియులు తమకూటస్థుఁడుగఁ జెప్పుకొనుచున్నారు. ఈ విషయమింక విమర్శనపాత్రముగ నున్నది.

రుద్రమదేవి పరిపాలనము

ఈయమ క్రీ.శ.1262 నుండి 1295 వఱకు రాజ్యమును బాలించెను. శాసనములందు తఱుచుగ ఈయమను రుద్రదేవుఁడని వ్యవహరించిరి. ప్రతాపరుద్రీయములో బ్రతాపరుద్రనకు రుద్రదేవుఁడు తండ్రియనికలదు. రుద్రమదేవికి రుద్రదేవుఁడను వ్యవహారనామముండుట చేతను రుద్రమదేవి ప్రతాపరుద్రుని బుత్రునిగఁ దత్తుగైకొనుటచే తను నిట్లు విద్యానాథుఁడు వ్రాసెను.

స్వీకృతే పుత్రభావేన దౌహిత్రే ప్రాజ్ఞమాజ్ఞయా;
అస్మి న్నిధేహి ధౌరేయే గుర్వీ ముర్వీధురా మితి.
"రాజ్ఞాక్షత్రియ మౌళిమండనమణి స్తాతస్యసానుగ్రహో"
"శివసికృతస్తాతస్యనియోగః"
"కింరాజ్యేన శమోన్ముఖం రచయతా తాతాంకులాలంబనం"
"భవతాపితృమాన్ కుమారః"
"పిత్రాస్వయంభూపతినోపదిష్టం ప్రతాపరుద్రస్య మహాభిషేకం"

ఈయుదాహృతభాగములవలన రుద్రమదేవి ప్రతాపరుద్రుని దత్తస్వీకృతి గావించిన విషయమె గాక రుద్రమదేవి ప్రతాపరుద్రుని కుమారునిగను ప్రతాపరుద్రుఁడు రుద్రమదేవిని తండ్రిగను వ్యవహరించినవిషయము స్పష్టపడఁగలదు. రుద్రమదేవిఁ బ్రతాపరుద్రుఁడు తనయుఁడని విశ్వేశ్వరశంభుఁ డీయంశమను మనస్సునందుంచుకొనియే మల్కాపురశాసనము నందీక్రింది విధముగా వ్రాసియున్నాఁడు.

"శ్రీవిశ్వేశ్వర దేశికేంద్ర శివహస్తోద్భాపి దోర్విక్రమ
స్త్రిక్షోణీశ జగద్దశః ప్రతిబల ప్రధ్వంసిజన్మోత్సవః;
యస్యాః కాకతివంశమౌక్తిరమణిః శ్రీరుద్రదేవస్సుత
స్తస్యాః కింకథయామ వైభవమకః శ్రీరుద్రేదవ్యాఃపరం"

విద్యానాథుఁడు ప్రతాపరుద్రుని గణపతిదేవునకు మనుమఁడని చెప్పినాఁడు. రుద్రమదేవికిఁ బ్రతాపరుద్రుఁడు దత్తసంబంధముచేఁ గుమారుఁడు గాన గణపతిదేవునకుఁ బ్రతాపరుద్రుఁడు మనుమఁడై నాఁడు. కాననే ప్రతాపరుద్రుఁడు గణపతిదేవునినప్త (మనుమఁడని) విద్యానాథుఁడిట్లు ప్రతాపరుద్రీయమున వ్రాసెను.

"యస్త్వద్గోత్ర మహత్తరస్య జగతాం త్రాతు స్స్వయంభూ విభో
స్త త్త్వాదృక్చరితాద్భుతై ర్మహిమభి స్స్వయై ర్ద్వితీయోఽభవత్;
దేవోఽసౌ గణపేశ్వరః ప్రతికలం స్ఫారప్రసాదోన్ముఖో
నప్తు స్తే కులమండనస్య మహతీం పుష్ణాతు రాజ్యశ్రియమ్"

ఈవాక్యము గణపతిదేవుని విద్వాంసులది. వంశజులకు మహిమజూపుచు మృతుఁడగు గణపతిదేవుఁడు కాకతీయుల కులదైవతమగు స్వయంభూదేవునివలె నుండెను. ఆ గణపతిదేవునకు మనుమఁడు ప్రతాపరుద్రుచక్రవర్తి. ఈయంశమను

జెప్పుటలో వ్యాఖ్యాతయగు కుమారస్వామిసోమయాజి ఈ గణపేశ్వరుఁడు గణపతి దేవస్థాపిత మహేశ్వరుఁడనియుఁ గాన రాజునకు శివునకు నిట నభేదోపచారముగాన వీరరుద్రుడు శివునకు మనుమఁడని వ్యవహరింపఁబడెననియు విచిత్రవ్యాఖ్య గావించినాఁడు. ఇట్టిప్రమాదములు మూలవ్యతిరేకాభిప్రాయములు ప్రతాప రుద్రీయవ్యాఖ్యలోఁ దఱచుగాఁ గలవు. అని చరిత్ర నిర్ణయమున కద్దుపడుచున్నవి.

రుద్రమదేవి రుద్రదేవుఁడను పేరుతో రాజ్యమేలుచుఁ బ్రతాపరుద్రునిఁ గుమారుని గఁజెప్పికొనెనని యుదాహృతభాగములహన సిద్ధాంతమగుచున్నది. రుద్రమదేవికిఁ బుత్రికాసంతానము మాత్రముంటచేఁ దనమరణానంతరము రాజ్యము పరులపాలగునేమో యని విచారపడెను. పుత్రికలకును సంతానము గలుగదయ్యెను. అందుచే నీయమ యిష్టదైవతలకు సంతానార్థియై మహోత్సవములు జరిపించెను. మొగిలిచర్ల ఏకవీరాదేవికి బంగారుకవచము చేయించెను. వడ్డిపల్లి వినాయకునకు స్వర్ణ భూషణముల నొసంగెను. ఐనవోలు మైలారుదేవునకు దివ్యమగు నాలయముగట్టించెను. స్వయంభూస్వామియాలయమున మహోత్సవముల జరిపెను. ఈ మహోత్సవఫలితమె పుత్రియగు ముమ్మడాంబయందుఁ బ్రతాపరుద్రమహారాజ జననమొందెను. రుద్రమదేవి చిరకాలము రాజ్యముపాలించిన పిదప సామ్రాజ్యమును గుమారుఁడనఁబడు ప్రతాపరుద్రునకుఁ బట్టాభిషేకముగావించెను. ఈ యంశము ప్రతాపరుద్రీయమునందలి "చిరమాసక్తాం ధురం" అను వాక్యమువలన రూఢమగుచున్నది.

గణపతిదేవుఁడు కుమారుఁడని రుద్రమదేవిని వ్యవహరించెను. అందుచే నీయనుకొంతకాలము యువరాజపదవియందుండి రాజ్యవ్యవస్థ తిలకించి యుండుననుట సత్యము. కావుననే గణపతిదేవుని రాజ్యపాలన కాలమందుఁగూడ రుద్రమదేవి దానములు కనఁపడుచున్నవి. విశ్వేశ్వరశంభుఁడు, సామంతశూరుఁడు. శార్ఙ్గపాణి, పోతినాయకుఁడు మున్నగువారు గణపతిదేవుని రాజ్యకాలముననే రుద్రమదేవి త్యాగౌదార్యములఁ బ్రశంసించిరి, అంతియగాదు, రుద్రమదేవిని గణపతిదేవు పుత్రియని కూడ వ్యవహరించిరి. ఇందుచే రుద్రమదేవి స్త్రీవ్యక్తియని గణపతి దేవుని కాలముననే వ్యవహరింపఁభడెననియు గణపతిదేవుడు పుత్రుఁడని చేసిన ప్రచారము ఎంతకాలమొ నిలువలేదనియు భావింపనగును.

అనుమకొండ సామాన్యదుర్గముగాన శత్రవులయొత్తడి యెక్కువయ్యెను. అందుచే నాస్థలముకాదని యనుకూలప్రదేశమును నిర్ణయించి ప్రోలరాజు ఒక యఖండశిలను బొడ్డురాయిగనేర్పఱచి రామారణ్యత్రిపాదుల యాజ్ఞచే ఏకశిలానగరమును నిర్మించెను. రుద్రదేవుఁడు శివయంత్యకాలమున రాజ్యమును అనుమకొండనుండి ఓరుగంటికి మార్చుకొనెను. అనంతరము గణపతిదేవుఁడు పరిపాలనమునకు వచ్చి ఓరుగల్లుకోట నింకను బెంపుచేసి వీథులదీర్చి పుట్టకోటను గట్టి పఱచి ఓరుగల్లుపురమున గొప్పసంత యేర్పఱచెను. రాజ్యము సర్వ సంవత్సమృద్ధితో నలరారుచుండెను. పిదప రుద్రమదేవి ఏకశిలానగర రత్న సింహాసనము నెక్కి ప్రజారంజనముగఁ పరిపాలించెను. ఈయమ ఓరుగంటికోట కెన్నియో మంచియేర్పాటులఁ జేసెను. రుద్రమదేవి ఓరుగంటికోటకుఁ గావించిన కట్టుదిట్టములు, ఏర్పాటులు స్థానికచరిత్రమునం దీక్రిందివిధముగాఁ బేర్కొనఁభడియున్నవి.

"తొలుతంజేయఁగ మిగిలిన కలుకోట నీయమ మహోన్నతంబుగాఁ గట్టించెను. తన ప్రజలుండటకు భూమికోట వేయించెను. ఆనదుమ యున్న తంబుగాఁ బుట్టకోట వేయించెను. కలుకోటకు నాలుగు గవనులను, నాలుగుదిడ్లను నేర్పఱచెను. భూమికోట కెనిమిదిగవనుల, పదియాఱుదిడ్ల నేర్పఱచెను. అనేక శివాలయములఁ గట్టించెను. సకల జనంబులు తన్నంబాయని పలుకుటంజేసి అంబాలయను గ్రామము కట్టించెను. నిజనామంబున వేయిరుద్రవరములు గట్టించెను. అష్టదిక్కుల జయస్తంభము లెత్తించి మహావైభవముతో రాజ్యమేలు చుండెను.

రుద్రమదేవి ఒరంగంటికోటలోనున్న కాకతమ్మబావియు, శోభనాలబావియు, శిలాద్వారములు నాలిగింటిని, ఐనవోలు మైలారు దేవునికిట్లనె నాలుగు శిలాద్వారములును, కట్టించెనని స్థానికులు చెప్పుదురు. ఒరంగల్లుకోటలోని అక్కచెల్లెంద్రబావి రుద్రమదేవి గణపాంబ గట్టించెనని కొందఱు చెప్పుదురు. స్వయంభూ దేవాలయమున కీయమ యెంతో శిల్పమును సమకూర్పఁజేసెనటఁగాని యవనవిప్లవములలో నాయాలయరాజము పూర్తిగఁ జెడఁగొట్టబడినడి. రుద్రమదేవి రాజమందిరములపై నిలిపిన హేమకుంభములపయిగల బంగారుతొడుపులు విరోధిరాజులు హరించిరి. లోన నిముడ్చు శిలాకుంభములిపుడు చెంగటగల గోరీలదొడ్డిపైఁ బెట్టఁబడియున్నవి. ఈ చిహ్నములు రుద్రమదేవి సత్పరిపాలనకుఁ దార్కాణగనున్నవి.

స్త్రీకి అంకితులుగనుండుట సామంతుల కవమానముగనుంటచే గణపతిదేవుని కాలమునుండి లోఁబడియున్న రాజులందఱు రుద్రమదేవిని దిరస్కరించి పన్నులొసంగక తిరుగఁబడిరి. జన్నిగదేవసాహిణి, గంగయసాహిణి, సామంతశూరుఁడు, త్రిపురాంతక మహారాజు, శార్ఙ్గదేవుఁడు, గోనగన్నారెడ్డి, నాగదేవరాజు, భోగరాజు, ప్రెగడన్న, మనుమగన్నయ్య, రుద్రప్రగడ, ప్రాసాదాదిత్యనాయకుఁడు మున్నగు ఆంధ్రసేవానాయకరత్నములు ప్రతిపక్షలనడంచి సామ్రాజ్యక్షేమము సంతరించుటలో మిగులఁ బాటుపడిరి. శివదేవుఁడు వీరశైవమతప్రచార మటులనుంచి శిథిలముకానున్న కాకతీయసామ్రాజ్యమును నిలువరింప నడుముకట్టి ముందు నిలిచెను. రుద్రమదేవి సత్వము శక్తి సామర్థ్యాదులు స్పష్టపడువఱకు బ్రతిపక్షులెల్లరు శక్తికొలది ప్రతిఘటించుచు వచ్చిరి. అట్లు ప్రతిఘటించినవారిలో దేవగిరియాదవులు, కటకేశ్వరులు, మల్లికార్జునుఁడు, దామోదరరాయుడు, సిద్ధయదేవచోడుడు, కదంబరాజు ప్రభృతులు ముఖ్యులు. కడప కర్నూలు మండలములలోఁజోళులు, ద్రవిడమండలములలోఁ బాండ్యులు, తొండమండలములో క్షత్రియులు, ఆంధ్రమండలములోని వెలనాటిచోడులు తిరుగుపాటునకు సిద్ధమైరి. కటకవల్లభుఁడు స్వాతంత్ర్యము ప్రకటించెను. శివదేవుని కావ్యనైపుణి ప్రతినిదుల స్వామిభక్తి తనయద్వితీయపరాక్రమము సహాయముగాఁగొని రుద్రమదేవి యాంధ్రరాష్ట్రమునంతయు స్వాధీనపఱచికొనెను. కమ్మవీరులు రెడ్డిశూరులు వెలమవజీరులు రుద్రమదేవి కన్నివిధముల నండగానుండి స్వామిభక్తి ప్రకటించుటయే రుద్రమదేవి కద్వితీయవిజయము గలుగుటకుఁ గారణమయ్యెను.

రుద్రమదేవి తన పుత్రికలతో క్షేత్రసందర్శనమున కేఁగినపుడా యమ సవతికుమారులగు హరిహరరాయలు, మురారిదేవుఁడు పరివారముతోఁ జుట్టములవలె నగరములోఁ బ్రవేశించి రుద్రమదేవి లోనికి రాకుండ ద్వారములు మూయించిరి. రుద్రమదేవి బైటికోటల నుండి బలమును రప్పించి నెలలతరబడి పోరాడి ఓరుగంటికోట నాక్రమించుకొని సవతికుమారులకు ఇతర రాజద్రోహులకు నుచితశిక్షల విధించెను. రుద్రమదేవిచే నోడింపఁబడిన రాజులందఱు కుట్రజేసి దేవగిరిపాలించు మహాదేవరాయలఁ బ్రోత్సహించి 'మేమందఱము నీకంకితులమగుదుము. ఓరుగల్లు రాజ్యమాక్రమించుకొమ్మని ప్రోత్సహించిరి. సరిహద్దులలో నొకయాఁడుది రాజ్యమేలుట యవమానకరముగనెంచి యాకస్మికముగ

మహదేవరాయ లొకదినమున ఏకశిలానగరమును అఖండ సైన్యసహితముగ ముట్టడించెను.

ఆంధ్రులలో నద్వితీయమగు పౌరుషము ప్రజ్వరిల్లెను. రుద్రమదేవికి విజయముసమకూర్పఁదలంచి భటులెల్లరు సంగరసన్నద్ధులైరి. మహారాష్ట్రులు మొక్కవోనిపరాక్రమముతో ముందునకువచ్చి ఆంధ్రనగరమును సమీపించి యగడ్తలఁబూడ్వ సాగిరి. శివదేవుఁడు, ప్రసాదాదిత్యుఁడు, రుద్రదేవుఁడు మున్నగు ప్రముఖులు రుద్రమదేవికై సంగరరంగమునఁ బ్రాణములనువిడువఁ దలంచి నడుము కట్టిరి. ఈమహాసంగ్రామమునఁ బరరాజ్యము కబళింపనెంచిన మహదేవరాయలకుఁ బరాభవము ప్రాప్తించెను. రుద్రమదేవిగడించిన యీ విజయము స్థానిక చరిత్రమునం దీక్రిందివిధముగాఁ జెప్పఁబడినది.

"దేవగిరిరాజు సమస్తసేనాసమేతుండై ఏకశిలానగరంబుపై విడిసిన వారలతో నెదిరించి యొకపోంబు ఘోరయుద్ధంబుసేసి మూఁడు లక్షల పదాతుల నుగ్గుగావించి లక్షగుఱ్ఱంబుల నేలఁగూలఁజేసెను. పారినవారల వెన్నైఁదగిలి దేవగిరిచొచ్చుపర్యంతము తరిమి వారి నుండి కోటిద్రవ్యములు కానుకలు బట్టెను. మఱియు నాద్రవ్యంబు పరదార్లకు బంచిపెట్టెను. అచట జయస్తంభములు వేసి వారలఁ దనయాజ్ఞకు లోనుజేసెను."

రుద్రమదేవి పరాజయమనుమాట యెఱుంగకుండ ముప్పది యాఱు సంవత్సరములు రాజ్యమును బాలించెను. ఈయమ సత్పరిపాలనమును విద్యానాథుఁడు ప్రతాపరుద్రీయమునందలి నొక ప్రకరణమునందుఁ బ్రశంసించి యున్నాఁడు. ఆంధ్ర సామ్రాజ్యమునకు సమస్తవైభవములు సమకూర్చి రుద్రమదేవి, రాజ్యభారము ప్రతాపరుద్రునిభుజస్కంధముపై నిడి వార్ధకమునఁ గొంతకాలము గడిపె శివసాయుజ్యమునొందెను.

రుద్రమదేవి వైదుష్యము, మతము

రుద్రమదేవి రాజ్యము పాలించినకాలములోఁ దిరుగుబాటులు మెండగుటచే ఘోరసంగ్రామములు జరుపవలసి వచ్చెను. మొక్కబోని పరాక్రముతోఁ బ్రతిపక్షుల నెదిరించి రాజ్యమును స్థిమితముగావించుటతో నీయమ జీవితము గడిచినది. గణపతిదేవుని కాలపు విద్వాంసులందఱి నీయమ పోషించుచుండెను.

అంత్యకాలమునఁ బ్రతాపరుద్రుఁడు తనయాస్థానమునుఁ బండితులతోఁ గవులతోనింపి వేసెను. ఈ యుభయులకు మధ్యనున్న రుద్రమదేవి విద్యాప్రియురాలు రసజ్ఞురాలు అనుటకు సంశయముండదుగాని ఆనాఁటి వాఙ్మయ విశేషములను నిర్ణయింప నిపుడాధారములు లభించుటలేదు. గణపతిదేవుఁడు రుద్రమదేవికి బాల్యమున సంగ్రామవిద్యల నేర్పించెను. అందుచే అశ్వారోహణము, ఖడ్గపరిశ్రమ, లక్ష్యచ్ఛేదనము మున్నగు వీరోచిత కళలన్నియు బాల్యముననే పట్టుబడెను. శివదేవాదుల సహాయమునఁ బరిపాలన విధానము నభ్యసించెను. తండ్రినిజూచి ఆరుల లోఁగొను రాజనీతి గడించెను. ప్రోలరాజుకాలమున దేశము జైనమతముతో నిండియుండెను. ప్రథమరుద్రదేవుఁడు శైవమతమునఁ బ్రవేశించెను. గణపతిదేవుఁడు విశ్వేశ్వరశంభుని పద్ద శైవదీక్ష గైకొనెను. రుద్రమదేవియు నట్లే శివదీక్షనొందిన శివభక్తురాలు. ఈయమ కాలములో శివాలయములు రెండువేలు కట్టఁబడెను. తాము శైవమతాభిమానిని యైనను ఇతరమతస్థుల కాయమ యెట్టి నిర్బంధములు కలుగఁజేయలేదు. సర్వమతసమ్మతముగా నీయమ రాజ్యమేలినిది. రుద్రమదేవి, పాలనమున మిక్కిలి కౌశలముగలదనుటకు గ్రంథాధారములు పెక్కులు గలవు. విరోధులనడఁచుటలో నీయమనుజెప్పి వేఱొకని జెప్పవలయును. ఎవరయినను నీయమను లక్ష్మియనియే వర్ణించిరి. ఈయుపమాన మీయమ సౌందర్యాతిశయమునకు బ్రజారంజనమునకుఁ దార్కాణముగఁ గైకొనవచ్చును.

ఉపసంహారము

ఆంధ్ర కాంతలలో సామ్రాజ్యపాలనము నద్వితీయముగా నెఱపి లోకాంతవిక్రాంతకీర్తి గన్న వారల యందుఁ బ్రథమగణ్య రుద్రమదేవి. భర్తయనంతరము పత్ని రాజ్యమునకు వచ్చుట తఱచుగఁ గలదు గాన రుద్రమదేవికి గణపతిదేవుని భార్యయని యిందలివారు నిర్ణయించి మిగుల దోషమున కొడిగట్టిరి. నూతన పరిశోధనముల వలన సత్యమిప్పటికి బైటపడినది. రుద్రమదేవి గణపతిదేవుని పుత్రియనుటకు నేచరిత్రవిదుఁడును నింక సంశయింపఁడు. కాకతీయులు దాదాపుగ మూఁడు వందల సంవత్సరము లాంధ్రదేశమును బాలించిరి. వారి కాలమున ఆంధ్రశిల్పమునకు ఆంధ్రవాఙ్మయమునకు ఆంధ్రత్వమునకుఁ బేరుపెంపులు వచ్చెను. ఆంధ్రరాష్ట్రము బునరుద్ధరించి మేమాంధ్రులము మారాజధాని ఆంధ్రనగరము. మాజాతియాంధ్రజాతియని సగర్వముగాఁ జెప్పుకొన్న కాకతీయరాజులకాలమున

ఆంధ్రదేశమునకుఁ గలిగిన మహోపకారము లిన్నియన్నియని నిరూపింప నయితిగాదు. ఇందుఁ బ్రత్యేకించి రుద్రమదేవి గావించిన తటాకములు, ఆలయనిర్మాణములు, నగర ప్రతిష్ఠాపనలు సంగ్రామములు తెలుపు ప్రత్యేకాధారములు లేవు. గాన సమిష్టిదృష్టితో నీయమను బ్రశంసింపవలసి వచ్చినది. రుద్రమదేవిని బురుషుఁడని గణపతిదేవుఁడు వ్యవహరించి యొక చిన్నదానిని దెచ్చి పెండ్లి చేసెననియుఁ దరువాత సత్యమెఱింగి ప్రసాదాదిత్యుఁడు అను వెలమవీరుఁ డాచిన్నదానిని పురుషునిగ దైవసహాయమున నొనరించి రుద్రమదేవిని జంపెననియు స్థానిక చరిత్రములలోఁ గలదు. ఇది విశ్వసింపరానిమాట. గణపతిదేవుని పాలనముననే రుద్రమదేవి స్త్రీ వ్యక్తియని శాసనాదులలో లిఖింపఁ బడినది. రుద్రదేవుఁడనుచు భ్రాంతినివారణార్థముగ రుద్రమదేవిని "సర్వాంగనారి"యని విద్యానాథుడు కంఠోక్తిగాఁ జెప్పినాఁడు. కాన నీకథ విశ్వసింపరానిది. రుద్రమదేవి వార్ధక్యమునఁ బ్రతాపరుద్రునకు రాజ్యమప్పగించి వంశానుచారముగ వానప్రస్థాశ్రమము గైకొననున్నటులఁ బ్రతాపరుద్రీయము నఁగలదు. ఆంధ్రమాతయనఁదగు రుద్రమదేవి సమగ్రవీరజీవితము ప్రత్యేక రాష్ట్ర సంపాదననోన్ముఖులగు ఆంధ్రసోదరులకు నిత్యస్మరణీయము.

(సూచన :- ఇందుదాహరించిన స్థానిక చరిత్రము ఒరంగల్లు శైవధర్మ ప్రచారిణివారు, ఆంధ్రసాహిత్యపరిషత్తువారు ముద్రించిన ప్రతులనుండి మావద్దఁ గల లిఖితగ్రంథమునుండి యుద్ధృతము. ఇందుదాహరింపఁబడిన అముద్రితశాసనముల ప్రతులు పూర్తిగ మావద్దఁగలవు. వీని అచ్చులు హైదరాబాదు ఆంధ్రపరిశోధక సంఘమునఁ గలవు. వావిళ్లవారి ప్రతాపరుద్రీయము నీవిమర్శనమునఁ గైకొంటిమి.)

– ఆంధ్రపత్రిక ప్రమోదూత సంవత్సరాది సంచిక **(1930)**

8. ప్రతాపరుద్ర చక్రవర్తి

ఆంధ్ర రాజులలోఁ గాకతీయులు ప్రథమగణ్యులు. వీరల దివ్యచరిత్రము పాడైనకోటగోడలలో నిద్రపోవుచున్నది. ఆంధ్రదేశమునకు, వాఙ్మయమునకు అపారసేవ గావించి ఆంధ్రజాతీయత నేఁటికిని సుస్థిరముగ నుండుటకు హేతుభూతులగు ఈవంశజుల చరిత్రము అవిశ్వసనీయములగు కట్టుకథలతో నిండియున్నది. వీరల చరిత్రము దెలుపు శాసనములో, చాలవఱకు దుర్వినియోగము లైనవి. కాకతీయరాజుల జీవితములు దెలుపు ప్రతాపచరిత్రము, సిద్ధేశ్వరచరిత్రము, సోమరాజీయము పరస్పరసంబంధము లేకున్నవి. ప్రతాపచరిత్రము మేము నాలుగైదువిధములగు ప్రతులఁ జూచితిమి. పరిషత్తువారి ప్రచురణమునకు, వరంగల్లు శైవప్రచారిణివారి ప్రచురణమునకు సంబంధమే లేదు. మావద్దఁ గల ప్రతి, హైదరాబాదు పరిశోధకశాఖలోని ప్రతియు విశేషాంశములు గలవే గాని రెంటికిని బొత్తు కుదురదు. పైఁగా నివియన్నియుఁ జరిత్రము కెంతవఱకు సంబంధించునో తెలుపఁజాలము. కాకతీయవంశజుల చరిత్రము గ్రహించుటకుఁ బ్రధానసాధనములు తత్కాలపు శాసనములు. తరువాతది ప్రతాపరుద్రుఁ డంకితముగొన్నదియు, సమకాలికుఁడగు విద్యానాథకవి రచించిన ప్రతాపరుద్రీయము. కాకతీయుల చరిత్రమునుగూర్చి బ్రహ్మశ్రీ విద్వాన్, కట్టి సాంబమూర్తిశాస్త్రిగారు ఆషాఢమాస భారతియం దొకవ్యాసము వ్రాయుచుఁ బ్రతాపరుద్రునకు, రుద్రమదేవికిఁ గల సంబంధము, రుద్రమదేవికి గణపతి దేవునకుఁ గల సంబంధము నెఱుంగుటలోఁ బొరపడిరి. అంతియకాక, సోమరాజీయమును ఆధారముగఁ దీసికొని వారొనరించిన కాకతీయచరిత్ర నిరూపణముగూడ సంశయభూయిష్ఠమే, సమన్వయించుటలోఁ గుదురక శాస్త్రిగారు భ్రమపడిరనియు, ఉన్నంతవఱకుఁ గాకతీయచరిత్రము ప్రతాపరుద్రీయములో స్పష్టముగ, నిర్వివాదముగ నున్నదని రుజువుచేయుటకును, బ్రతాపరుద్రుని గూర్చిన వివరము లెఱుంగుటకు నీవ్యాసము వ్రాయఁబోవుచున్నారము.

“ప్రతాపరుద్రుని చరిత్ర మెఱుంగుటకు నీతని కంకితముగా రచింపఁబడిన ప్రతాపరుద్రీయమునందుఁ గూడఁ గొన్ని యాధారములు గలవు. ప్రతాపరుద్రీయము వలన నీరెండు (రుద్రమదేవి గణపతిదేవుని భార్య, కొమార్తెయను) వాదములు పుట్టుట కవకాశము కలదనియుఁ, గాని రుద్రమదేవి గణపతిదేవుని భార్యయేకాని తనయ

కాదనియుఁ, బ్రతాపరుద్రుని గన్నతల్లియగు ముమ్మక్క యొక్కతెయే గణపతిదేవుని తనయయనియు, ఆమెకు రుద్రాంబయను నామాంతరము గూడ అక్కడక్కడ వ్యవహరింపఁబడె ననియుఁ దెలియనగును."

ఉదాహృత భాగములు సాంబమూర్తి శాస్త్రి గారివి. వీరీయభిప్రాయము ప్రతాపరుద్రీయము నుండి సంగ్రహించిరఁట. ప్రతాపరుద్రీయము రుద్రమదేవి గణపతిదేవుని భార్యయని చెప్పుచున్నదా? ఎచటను చెప్పలేదు. ఇందువలన ఆధారముగ వారుదాహరించిన శ్లోకములలోఁగూడ నాయర్థము లేదు. నాటక ప్రకరణములో రుద్రమదేవీరాజ్ఞి గణపతిదేవుని పుత్రికయనియు, నామెయే మనుమఁడగు ప్రతాపరుద్రుని పుత్రునిగ స్వీకరించెననియు కలదు. ఇట భ్రాంతికిఁ దావు లేదు. రుద్రమదేవి రుద్రదేవుఁడని వ్యవహరింపఁబడెను. ఈ వ్యవహారము శాసనములందును గలదు. ఈయమ కాకతీయవంశజురాలని విద్యానాథుఁడు స్పష్టముగఁ జెప్పెను.

'యోఽయం జాత స్త్రిలోకీప్రథిత సుచరితే కాకతీయాన్వవాయే
యస్మై శ్రేయాంస్యజ స్రం వితరతిభగవాన్ దేవదేవ స్స్వయంభూః;
య స్యాజ్ఞా సర్వపృథ్వీపతిముకుట మణి శ్రేణి కేళీవయస్యా
సోఽయం భూపాలమౌళి ర్జయతి గుణమహా న్రుద్రదేవో నరేంద్రః'

(స్వయం భూదేవ శ్రేయో వితరణ రూపబీజన్యా సాదుపక్షేపోఽంగమ్)

ఈ శ్లోకమునందలి రుద్రనరేంద్రుఁడే రుద్రమదేవి మహారాజ్ఞి. (ఈ మైత్రిలోక ప్రసిద్ధమగు కాకతీయాన్వయమున జనించెను. స్వయంభూదేవుఁ డీమెకు శుభప్రదాత. ఈమెయాజ్ఞ రాజులకుఁ దలమానికము. రాజులలో నీయమ రత్నము. (సుబోధమునకై పుంలింగ విశేషణములఁ బ్రకరణామసారము రుద్రమదేవికి నన్వయించి స్త్రీ లింగవివేషణములుగఁ జెప్పుచున్నారము.)

'యో రుద్రో రజతాచలే స్థితి మగా దర్ధాంగనారిః పురా
సోఽయం సంప్రతి కాకతీశ్వరకులే సర్వాంగనారి స్థితః;
స్థానే యద్విషమావలోకనకళా మాత్రేణ భస్మీకృతా
న్యాసన్ వైరిపురాణి చిత్ర మధునా ఖడ్గే విషం ధార్యతే.'

(రుద్రుఁడు వెండికొండపయి తొల్లి అర్ధాంగనారిగ నుండెను. ఆతఁడిపుడు కాకతీయరాజుల యింట పూర్తిగా ఆఁడుదియై (రుద్రమదేవిగ) ఉండెను. విషమ దృష్టిచే వైరిపురములఁ గాల్చుచు ఖడ్గమున విషము ధరించెను.)

ఈ రెండు శ్లోకములు రుద్రమదేవి కాకతీయవంశమున జనించినట్లు చెప్పుచున్నవి. గణపతిదేవునివలె రుద్రమదేవియుఁ గాకతివంశోద్భవురా లనుటకు సందియము లేదు. ఇంక నీయంశము బలపఱచు నాధారములు లేక పోలేదు.

'సై వోమా చేతి నిర్దిష్టా సోమా చేతి ప్రథామగాత్;
తవ మాతా శివా సాక్షాద్దేవో గణపతిః పితా.'

(నీ(రుద్రమదేవియొక్క) తల్లి ఉమయను నిర్దేశము గలది. ఆమె ఉమగాన సోమయని పేరొందెను. (ఆమె పేరు సోమలదేవి.) తండ్రి ప్రత్యక్షముగా గణపతి దేవుఁడే.) ఉమామహేశ్వరులిట సూచితులు. ఈ యంశమే ఇంకను స్పష్టముగా విద్యానాథుఁడు మంత్రిముఖమున నిటులఁ జెప్పినాఁడు:

'అన్యథా కథం ఈశ్వరప్రసాదాదృతే నిరంకుశం స్త్రీవ్యక్తివిశేషస్య లోకాధిపత్యం? ఏవం మానుషశంభునా గణపతిరాజేన అభ్యంతరస్య అనుభవమహిమ్న. సదృశ మత్ర పుత్ర ఇతి వ్యవహారః కృతః, తదనుగుణాచః రుద్ర ఇత్యాఖ్యా.' ("ఇతర మెట్లగును? దైవానుగ్రహమట్లులేదేని స్త్రీవ్యక్తికి నిరంకుశమగు లోకాధిపత్యమెట్లు చేకూరును; మనుజరూపధారియగు నీశ్వరుఁడని తలంపఁబడి గణపతిదేవుఁడు ఆత్మాను భవమహిమ కలవాడై కుమారుడని ప్రకటించెను. తదను గుణముగ రుద్రుఁడను పేరేర్పడెను.)

రుద్రమదేవి తన మనుమని (దౌహిత్రుని) పుత్రునిగాఁ గైకొనినటులఁ బ్రతాపరుద్రీయమున స్పష్టముగాఁ గలదు. ప్రతాపరుద్రుని తల్లి ముమ్మడమ్మ. ఈయంశము నాయక ప్రకరణములోని 'కౌన ల్యాసీ త్ప్రథమజననీ దేవకీచ ద్వితీయా విష్ణో ర్మాతా తదను మహితా ముమ్మడాంబా తృతీయా' అను శ్లోకమున సువ్యక్తమగుచున్నది. ముమ్మడమ్మ రుద్రమదేవిపుత్రి యనుట లోకమంతయు విశ్వసించిన యంశమె. రుద్రమదేవితో నీశ్వరుఁడు జన్మకాలముననే ప్రతాపరుద్రుని కుమారునిగాఁ గైకొమ్మని చెప్పెనఁట. అందుచేతనే మనుమఁడు కుమారుఁడని వ్యవహరింపఁబడెను.

'సీకృతే పుత్రభావేన దౌహిత్రే ప్రాజ్యమాజ్ఞయా;
అస్మిన్ని ధేహి థౌరేయే గుర్వీముర్వీధు రామితి'

రుద్రమదేవి తన పుత్రికాపుత్రుని బుత్రభావముతోఁ గైకొని రాజ్యము నొసంగినందుకీ యుదాహృత శ్లోక మాధారము కాఁగలదు. రుద్రమదేవిని ప్రతాపరుద్రదేవుఁడు తండ్రియని వ్యవహరించెను. ఆయమ పుత్రుఁడనియే పేర్కొనెను. ఉదాహృత ప్రతాపరుద్రీయ భాగములు రుద్రమదేవి గణపతిదేవుని పుత్రియని కంఠోక్తిగఁ బేర్కొనుచున్నవి. గణపతిదేవుని భార్య సోమలదేవియనియు, ఆమెయే రుద్రాంబ జననియనియు గ్రంథస్థమగు నాధారము గలదు. అందుచే ప్రతాపరుద్రదేవుఁడు రుద్రమదేవికి మనుమఁడనియు; గణపతిదేవునకు రుద్రమదేవి పుత్రియనియుఁ, బుత్రవ్యవహారముతో నాయమను రాజునుగ గణపతిదేవుఁ డొనరించెననియుఁ బ్రతాపరుద్రీయము కంఠోక్తిగఁ జెప్పుచున్నది. ప్రతాపరుద్రునకు సమకాలికుఁడగు విద్యానాథుఁడు చెప్పినది ప్రమాణముగాని, తరువాత నూఱునూటయేఁబది సంవత్సరములకున్న ప్రతాపరుద్రీయవ్యాఖ్యాతయగు కుమారస్వామి సోమయాజిసిద్ధాంతములు ప్రమాణములు కావు. అంతియకాదు, మూలవ్యతిరేకములు. గణపతిదేవునకు రుద్రమదేవి భార్యయని తనకయి తాను సిద్ధాంతము చేసిన కుమార స్వామిసోమయాజి వాక్యములను విద్యానాథుని వాక్యములలోఁ గలిపి శాస్త్రిగారు స్వవచోవ్యాఘాతదోషము విద్యానాథునిపయి నంటఁగట్టిరి. ప్రమాదభూయిష్ఠమగు కుమారస్వామినిర్ణయమునకుఁ దోడుపడు మూలము ప్రతాపరుద్రీయమున లేదు. పై నుదాహరించిన 'యో రుద్రో రజతాచలే' అను శ్లోకమునకు కుమారస్వామి సోమయాజి ఈక్రింది యవతారిక వ్రాసినాఁడు. దీని కనువగు మూలము లేనప్పుడెట్లిది ప్రమాణము?

'పురాకిల కాకతీయకులసంభూతే గణపతినామ్ని మహారాజే దుహితృమాత్రసంతానే కదాచి ద్దైవయోగేన కాలపరిపాక ముపేయుషి తన్మహిషీ రుద్రమదేవీ బహూని వర్షాణి తద్రాజ్య మకంటకం పరిపాల్య పరిణతాసతీ దౌహిత్రే ప్రతాపరుద్రే రాజ్యధురాం నిదధే.'

(తాత్పర్యము - కాకతీయవంశజుఁడగు గణపతిదేవుఁడు పుత్రికా మాత్రసంతానుఁడై దైవవశమున మరణింప నాతని భార్య రుద్రమదేవి చిరకాలము

రాజ్యమేలి ముదుసలితనమునఁ బ్రతాపరుద్రుఁడను మనుమని కారాజ్యము నొసంగెను.)

ఈకథ వ్యాఖ్యాతది. ఈకథకును దాని ననుసరించి రుద్రమదేవి కాకతివంశమున జనించినదను వంశమునకుఁ గాని గణపతిదేవుఁడు రుద్రమదేవియను పుత్రికి రాజ్యము నొసంగెనను నంశమునకుఁ గాని సంబంధము కలియుటలేదు. నిర్మూలమగు వ్యాఖ్యాతవాదము త్రోసి వేయఁదగినదని పలువు రిదివఱకే సిద్ధాంతీకరించిరి. వ్యాఖ్యాతవాదము విద్యానాథుని సిద్ధాంతముగఁ గైకొనుటచే శ్రీశాస్త్రులవారు ప్రమాదపడిరి.

ప్రతాపరుద్రీయమునుండి శాస్త్రిగారు ఆధారములను ఎనిమిదింటిని చూపినారు. అందు మూఁడవది వారి వాదమునకుఁ గాని, యితరవాదమునకుఁ గాని సరిపడని శరదాగమవర్ణనము. ప్రకృతమున నది నిరర్థకము. అటులె వారలు తమ వాదమున కనుకూలమని మొదట నుదాహరించిన "దేయా త్సిద్ధిం" అను శ్లోకము గూడఁ బ్రకృతమున కుపకరింపనిది. ఇందు రుద్రాంబా గణపతిదేవులు భార్యాభర్తలని సూచింపఁ బడినటుల శాస్త్రిగారు నిర్ణయించిరి. ఆభావమునకే తావు లేదు. కవిభావ మది కాదు. వ్యాఖ్యాత సూచింపలేదు. శాస్త్రిగా రేల యిట్లు నిర్ణయించిరో?

విద్యానాథుఁడు

'శ్లో. దేయా త్సిద్ధిం మహాలక్ష్మీ ర్జగద్రక్షాధురంధరా,
విష్ణువక్షస్స్ఫురన్మాలా విహితాలయతోరణా.'

అను శ్లోకము వ్రాసి, యిదిప్రతాపరుద్రుని రాజ్యలక్ష్మీ ప్రాప్తిని అర్థశక్తిచే సూచించుననియు, ('ఏషా నాందీ ప్రతాపరుద్రస్య రాజ్యలక్ష్మీ మంగళవిధిలక్షణా') ఈ నాంది ప్రతాపరుద్రుని రాజ్యలక్ష్మీమంగళవిధికి లక్షణయనియుఁ జెప్పెను. శాస్త్రిగారిది రుద్రమదేవీ గణపతి దేవుల దాంపత్యసూచన మనుట కాధారములు గానరావు. కాన వారుద్దేశించిన యీయాధారము పూర్తిగా నిరుపయోగము, ప్రమాదము.

శాస్త్రిగారు ఈ క్రింది శ్లోకమున రుద్రమదేవీ గణపతిదేవులు దంపతులని సూచింపఁబడిరని తెలిపినారు:

'భూభృత్సుతామహాదేవౌ

పితరౌ యస్య విశ్రుతౌ,

నరనాగాకృతి శ్రీమా

స్స దేవ శ్శ్రేయసేఽస్తు వః'

ఇది విరుద్ధసిద్ధాంతము. నాటకప్రకరణము ప్రతాపరుద్రుని నాయకత్వము గలది గాన పైశ్లోకమున సూచింపఁబడిన భూభృత్సుత ముమ్మడమ్మ. ఈమె ప్రతాపరుద్రుని తల్లి, మహాదేవుఁడు ప్రతాపరుద్రుని తండ్రియగు మహాదేవరాయలు. వ్యాఖ్యాత దీనిని గమనించియే 'యస్య కథానాయకస్య భూభృత్సుతా రాజపుత్రీ ముమ్మడంబా, మహాదేవః తన్నామకో మహారాజః పితరావితి విశ్రుతౌ' అని వ్రాసినాఁడు. కాన నిందు సూచితులు ప్రతాపరుద్రుని తల్లిదండ్రులగు ముమ్మడమ్మమహాదేవు లైయుండ, రుద్రాంబాగణపతిదేవులనుట ప్రకృతమునకు సందర్భమునకు, నాటకలక్షణకు వ్యతిరేకము. ప్రతాపరుద్రుని తల్లిదండ్రులు ముమ్మడాంబా మహదేవరాయలని ప్రతాపరుద్రీయనాయక ప్రకరణమున ౧౪-వ శ్లోకము నందుసైతము గలదు. కాన పైమహాదేవపదమును గణపతిదేవుఁడుగాఁ జెప్పవీలుండదు.

'మురారే ర్యః పూర్వం జలనిధిసుతాయా ముదభవ

న్మహాదేవాజ్జాతస్స పున రవనీభృద్దుహితరి,

వపుష్మా న్కామోఽయం జయతి జగతీభాగ్యవిభవైః

ప్రతాపశ్రీరుద్రః స్స్వయ మితి మనీషా మృగదృశామ్.'

'వ్యాఖ్య - మహాదేవాన్మమహాదేవనామకాన్మహారాజాత్, అవనీభృద్దుహితరి రాజపుత్ర్యాం, ఈశ్వరాత్పార్వత్యాం, మితిచ ధ్వన్యతే.'

పూర్వ శ్లోకమునందు నూచితులు ముమ్మడాంబా మహాదేవులనియు, అటులె యీ శ్లోకమునందును వారలె సూచితులైరనియుఁ, బ్రతాపరుద్రుని తండ్రి మహాదేవ రాయలనియు శ్రీశాస్త్రిగారు గమనించినచో స్వవచన వ్యాఘాతదోషము, పరస్పర విరుద్ధదోషము విద్యానాథుని తలపయిని బెట్టరు. అంతియగాదు, నోటనైన నుచ్చరింపరాని తండ్రికూఁతుల దాంపత్యకథను సిద్ధాంతముగాఁ గైకొనక యుండువారు.

ఒకటిరెండు నెంబరులు వేసిన శ్లోకములలో రుద్రాంబాగణపతిదేవులు దంపతులుగ సూచింపఁబడిరని శాస్త్రిగారనిరి. ఆ సూచనయే లేదని సిద్ధాంతీకరించితిమి. వ్యాఖ్యాత కల్పించిన అవాంతరకథ అప్రమాణము. అది విడిచినచో శాస్త్రిగా రుదాహరించిన శ్లోకములె గాదు, ప్రతాపరుద్రీయ మంతయు గణపతిదేవునకు రుద్రమదేవి పుత్రియనియు, బ్రతాపరుద్రుఁడను పౌత్రుని (?దౌహిత్రుఁడు) పుత్రునిగా స్వీకరించెననియు నిర్ణయించుచున్నది. ప్రతాపరుద్రీయము ప్రతాపరుద్రని కంకితముగా నాతని కాలమున రచింపఁబడిన గ్రంథము. ఆవల రచింపఁబడఁగూడదా యందురేమొ. ప్రతాపరుద్రునితో దాదాపు కాకతీయరాజ్యమంతరించినది. ప్రతాపరుద్రుని గుణప్రశంస, స్తోత్రము అనంతరపరిపాలకులగు యవనులకుఁ గాని ఆవల మాతృదేశము నేలిన వెలమవారికిఁ గాని యవసరముగా నుండదు. ఈ సమకాలిక గ్రంథము కాకతీయచరిత్రమునకుఁ బరమ ప్రమాణము. దీనిని అన్యోన్యవిరుద్ధముగాఁ దలంచుట కంటెఁ బ్రమాదము వేఱుండదు.

రుద్రమదేవి గణపతిదేవుని పుత్రియనుటకుఁ జాలినన్ని యాధారములు గలవు. కొలనుపాక, పానుగల్లు, కోటగిరి శాసనములు, శివయోగసారముపీఠిక, మల్కాపురము శాసనము, అనితల్లికలువచేరు శాసనము - ఇంకఁ బెక్కు శాసనములు నిరూపించుచున్నవి. శాసనములలో రుద్రమదేవి గణపతిదేవుని భార్యయని సమకాలికు లెవరును బేర్కొనలేదు. వీరభద్రరావు పంతులుగారీ యంశము నాంధ్రులచరిత్రమున సిద్ధాంతకరించిరి. సందర్భశూన్యములగు కట్టుకథలు తీసికొని నిర్ణీత చరిత్రాంశమును దారుమారు గావింపఁ జూచుట వృథాకాలయాపన మునకుఁ గారణమగును. శాస్త్రిగారు తమ ప్రమాదములను సిద్ధాంతము లనుకొని కాకతీయవంశమును దోఁచి నటుల సంస్కరించిరి. వారి విచిత్రసిద్ధాంతములు చరిత్రమునకు నందినివి. వారొందిన ప్రమాదసిద్ధాంతమును నిలువఁబెట్టునవి. చూడుఁడు శాస్త్రిగారి యూహాపరంపరలు.

1. "గణపతిదేవుని పుత్రియగు ముమ్మక్కకుఁ గూడ రుద్రాంబయను నామము గలదు. ప్రతాపరుద్రున కామెతల్లి ముమ్మక్క యను రుద్రాంబ రాజ్యమర్పించెనసుట యుక్తము. ఇది కొంచెము క్లిష్టముగా నున్నను వాస్తవమునకు సమీపముగ నున్నదేమో యని నా యూహ.

2. "మొత్తముమీఁదఁ బ్రతాపరుద్రునితల్లి వంశమువారును, దండ్రివంశమువారు నొక్క మూలపురుషు నుండి విడివడిన స్త్రీపురుష శాఖలలోనివా రనియు, ఎదురు

మేనఱికములుగలవారనియు అన్యోన్యసాదృశ్యము దానిచేఁ గలదనియుఁ దెలియనగును."

ఇవి శాస్త్రిగారి యూహాపరంపరలపైఁ దేలిన సిద్ధాంతములు. పరస్పరవిరుద్ధములు, ఊహా కల్పితములు నగు నీనూతనసిద్ధాంతముల విడిచి కాకతీయ వాస్తవచరిత్రమునకు అనుకూలములఁ గొన్నింటినిమాత్ర మిచట నుదాహరించుచున్నారము.

కాకతీయులు అని యీ వంశజులు పిలువఁబడుటకుఁ గుమారస్వామి సోమయాజి 'కాకతిర్నామ దుర్గా శక్తి రేకశిలానగరేశ్వరాణాం కులదేవతా, సాశక్తిర్భజనీయాఽ స్యేతి కాకతీయః' అని హేతువు చెప్పినాఁడు. దుర్గకుఁ గాకతి యను నామాంతరము లేదు. అందుచే నీవ్యుత్పత్తి యెంతవఱకు యుక్తమొ పాఠకులే నిర్ణయించుకొన నగును. ఇటీవలి శాసనములలో కాకతియన గుమ్మడితీఁగ యనియు, ఆం దీవంశమూల పురుషుఁడు జనించెననియు నొక కథ గ్రంథస్థము గావింపఁ బడినది. కాకతి జైనదేవత కానోపు. తద్భక్తులు గాన వీరలు కాకతీయులని కొంద ఱూహించుచున్నారు. మైసూరుమండలములో కాకతి యను గ్రామము కలదనియు, అట వీరల మూలపురుషు లుండుటచేఁ గాకతీయులనఁబడిరనియు నొకవాదము గలదు. ఇదియుఁ గేవల మూహాశరణ్యామె.

కాకతీయులు స్వయంభూదేవుని భక్తులు. స్వయంభూదేవాలయమును దొలుత ప్రోలరాజు కట్టించెను అనంతర మీతని వంశజులంద ఱాయాలయమును బెంపుచేసిరి. అపూర్వశిల్పములతో భూలోకకైలాసమని పేర్కొనఁబడి కాకతీయరాజుల సర్వస్వ మగు నీ యాలయము పదుమూఁడవశతాబ్దమునఁ బూర్తిగ రూపుమాపఁబడినది. మహ్మదీయులు ఆలయమును విధ్వంసముగావించి పుట్టుశిలగా నున్న లింగమును నేలమట్టము గావించిరి. అనంతరము రాజ్యముస్థాపించిన వెలమవీరులు, గజపతులు, చితాపుఖానుప్రముఖులు నేలమట్టమైన లింగమును ద్రవ్వి కొంచెము పయికి వచ్చునటులఁ జేసి చుట్టును ఇటుకలతో, సున్నముతో క్రొత్తగా గుడి కట్టిరి. ఆనాఁటి లింగములు, విగ్రహశకలములు, మహత్తరములగు నందులు, నాఁటి శాసనఖండములు గల ఓరుఁగంటిలోని శంభునిగుడియే ప్రతాపరుద్రీయమునందలి స్వయంభూదేవాలయము. ఈయాలయశిల్పములు ప్రతాపరుద్రానంతరము పతనమైన కోటగోడ బాగుచేయుటలో నుపయోగించిరి. కావుననే, ప్రాకారములలో

నపూర్వశిల్పాభిరామములగు శిలాఖండములు గోచరించుట. ఈస్వయంభూ దేవాలయమును శంభుని గుడియని వ్యవహరింతురు.

ఒరంగల్లున కాకాలమున ఆంధ్రనగరము, ఏకశిలాపురము, కాకతిపురము అను నామములు గలవు. ప్రతాపరుద్రునకు చలమర్తిగండయను బిరుదనామము గలదు. దీనికి కుమారస్వామిసోమయాజి 'శౌర్యాతిశయ సూచకం బిరుదనామ' యని యర్థము చెప్పినాఁడు. ప్రతాపరుద్రుఁడు సుందరమూర్తియనియు, విష్ణ్వంశ సంభూతునిగఁ బ్రజలు విశ్వసించిరనియు, సాహిత్య పరిశ్రమ కలవాఁడనియు, అఖండ త్యాగధురంధరుఁడనియు విద్యానాథుఁడు చెప్పియున్నాఁడు. కొంత యతిశయోక్తిక్రింద వదలినను సత్యము కొంతయేని గలదని విశ్వసింపవచ్చును. కాకతీయవంశమును విద్యానాథుఁడు క్షత్రియవంశమునకు భిన్నమైనదిగాఁ బలుతావులఁ జెప్పినాఁడు.

'క్షుద్రక్షత్రియపక్షశిక్షణవిధౌ', 'సోమర్కాభి జనం త మద్య జయతి శ్రీకాకతీయాన్వయః', 'సోమ సూర్యాన్వయామాత్యమహత్తాఽ ద్యాధరీకృతా' అను శ్లోక భాగములే గాక నాటకప్రకరణము పంచమాంకములోని ఈ క్రింది

'సాహస్రాంశవ మైందవంచ మహతీ యే ద్వే కులే నిర్మితే
తే జాతే లఘునీ గుణై ర్విజయిని శ్రీకాకతీయాన్వయే'

అను శ్లోకము సైతము కాకతీయవంశము సూర్యచంద్రవంశములకు భిన్నమైనదని స్పష్టముగాఁ దెలుపుచున్నది. ప్రతాపరుద్రీయమునఁ గాకతీయులు క్షత్రియు లనుటకుఁ దగిన యాధారములే లేవు. కావున క్షత్రియులమని చెప్పుకొనువారితో నీవంశమునకు సంబంధ మెటులఁ గుదురునో తోఁచదు. ఈ విషయమున నిదివఱకె పెక్కు విమర్శము లుండ సిద్ధాంత మెట్లు?

కాకతీయుల కులనిర్ణయమునకుఁ బ్రతాపరుద్రీయమున నాధారములు లేవు. సూర్యచంద్రక్షత్రియవంశములకు భిన్నుఁడనిమాత్ర మందుఁ గలదు. నిస్సందేహముగాఁ బ్రతాపరుద్రీయమువలనఁ దెలియు చరిత్రాంశములు కొన్ని గలవు. వానినిమాత్రమిచట సంగ్రహముగా వివరించుచున్నారము.

ప్రతాపరుద్రదేవుఁడు మహాదేవరాజ ముమ్మడాంబలకు జనించినాఁడు. స్వయంభూ దేవుఁడు జన్మకాలముననే బాలుని భావ్యదృష్టరేఖ దెలిపి కుమారునిగాఁ గైకొను మనెను. గణపతిదేవునకు రుద్రమదేవి రుద్రుఁడని వ్యవహరించి తన రాజ్యమున

కాయమ నధిపతిని గావించి నాఁడు. గణపతిదేవుఁడు మనుజరూపధారియగు శంభుఁడు. ప్రతాపరుద్రుఁడు అటులు కలియుగవిష్ణువు. ప్రతాపరుద్రుఁడు యువరాజుగా నుండి యొక శుభముహూర్తమున సముచిత పరివారముతో జైత్రయాత్రకు బయలునెడలెను. తొలుత దుర్గను బూజించి అనుమకొండచెంతఁ గల ప్రమదావనమున విడిసెను. అనంతరము ప్రతాపరుద్రదేవుఁడు కళింగదేశమును జయించెను. అట జయస్తంభములు నిల్పెను. పిదపఁ బాండ్యదేశమును గెలిచెను. అనంతరము రేవానది దాఁటి ఉత్తరదిశకుఁ బోయి ఘూర్జర, వంగ, లంపాక, కొంకణ, మహారాష్ట్ర దేశముల జయించెను. ఈయుదీచీదిగ్విజయమున ఆంధ్రసైనికులు ఆయా దేశవేషభాషలతో నెల్లెడలఁ ద్రిమ్మరి ప్రతిపక్షరాజుల గుఱుతించి రాజసన్నిధికిఁ గొనివచ్చిరి. పాంచాలురు, కీకటులు, భోజులు, కాంపిల్యులు, కేరళులు మున్నగువారందఱీజైత్రయాత్రలోఁ బూర్తిగా లోఁబడిపోయిరి. అనంతరము ప్రతాపరుద్రుఁడు ఆంధ్రనగరముఁ జేరఁగా మహత్తరవైభవముతోఁ బట్టాభిషేకము జరుపఁబడెను. ప్రతాపరుద్రుఁడు హస్తమునందు ధనూరేఖలు, పాదములఁ బద్మరేఖలు, శారదాబ్జముల వంటి విశాలనయనములు గలవాఁడు. ఈదివ్యసుందర మూర్తిని గాంచి యొక సిద్ధుఁడు తొల్లి యీక్రింది రీతిగఁ జెప్పెనఁట-

'చిహ్నే వస్య పదాబ్జయోః పిశునయం
తుర్వీశ్వరోపాస్యతాం
పాణీ సూచయత స్వచాపకులిశా
వుద్వాహలీలాం భువః,
నేత్రే శారదపుండరీకరుచినీ
లీలావతారం హరే
రాఖ్యాత స్తదితీహ సిద్ధవచనం
ప్రత్యక్ష మీక్షామహే.'

ఈ సిద్ధుఁడు చెప్పినది రుద్రమదేవితోఁ గానోపును. సిద్ధుఁడు రుద్రమదేవికిని బ్రతాపరుద్రునకును సమకాలికుఁడును, గణపతిదేవునకు దీక్షాగురువును నగు విశ్వేశ్వర శివదేశికుఁడు కానోపు.

ప్రతాపరుద్రీయము కేవల మలంకారగ్రంథ మైనను, గాకతీయచరిత్రమునకు నిస్సందేహసాధనములగు చరిత్రాంశములందుఁ గొన్ని లేకపోలేదు. అవి

సమన్వయించినచోఁ జరిత్రమున కమూల్యాధారములు. కొన్ని తావుల నతిశయోక్తు లున్నను అందుండి యథార్థచరిత్రము చరిత్రవిదులకుఁ గణపతిదేవునకు రుద్రమదేవి పుత్రి యనియు, నామెకు ముమ్మడమ్మ కుమార్తెయనియుఁ గలదు. ముమ్మడమ్మకు మహాదేవరాయలకుఁ బ్రతాపరుద్రుఁడు జనించినటులఁ గూడఁ గలదు. దీనిని గణపతి దేవునకు రుద్రాంబకు సూచనయని శాస్త్రిగా రొక నూతనసిద్ధాంతము చేసి చరిత్రాంశము తారుమారు చేసినను ఈయంశము నిర్ణయించు ఇతరాధారములు లేకపోలేదు. కొలనుగణపతిదేవుని శివయోగసారమున పైనిబేర్కొనిన చరిత్రాంశము లీక్రిందిరీతిగఁ బేర్కొనఁబడినవి–

'కం. వెండియు గణపతిధరణీ
మండలపతిపుత్రి రుద్రమహాదేవి కొగిꣳ
దండాధినాథులై భో
గండడు ప్రగడన్న మనుమగన్నయ యెలమిꣳ.

'కం. ఆహవమున వారు రిపు,
వ్యూహంబుల బదలుపఱచి యొక్కట గొనరే
బాహత్తరిదుర్గంబులు,
సాహసులై రుద్రమాంబశౌర్యమునకతనꣳ.

'చ. అకుపితరుద్రమాంబికకు
నాత్మజనా బొగడొందు ముమ్మడ
య్యకు మహదేవరాజునకు
నాత్మజుఁడైన ప్రతాపరుద్రుఁ డా
సకలమహీభరంబును వె
సꣳ దమయంత వహించి తాల్చెనా'

ఇట్లు వేలకొలఁది యాధారములచే సిద్ధాంతములైన యంశములఁ దారుమారుచేసి శాస్త్రిగా రంతతోఁ బోక, "ఒక్క ప్రతాపరుద్రీయమును బట్టి చూచిననే ఇన్ని వికల్పములచే నీచరిత్ర మెఱుంగుట దుష్కరముగ నున్నది గదా! ఇంకను శిలాతామ్రశాసనాది ప్రమాణము లన్నింటిని జూచిన నెన్నిచిక్కులు సంభవించునో" అని వ్రాసిరి. ప్రతాపరుద్రీయమున వికల్పములే లేవు. తెచ్చిపెట్టినది శాస్త్రిగారె. ఇంక వారె తామ్రశిలాశాసనాదికముల శోధించిన నెన్నివికల్పములు సృజింతురో!

శాస్త్రిగా రాధారముగఁ గొన్న అంశము లెన్మిదింటికి వరుససంఖ్యల సూచించితిమి. కాకతీయచరిత్రముకొరకుఁ, బ్రతాపరుద్రీయముకొఱకు మేము సేకరించిన యంశములనె యిటఁ జర్చించితిమి. శాస్త్రిగారు చూపిన వికల్పములఁ బాఠకులీ వ్యాసమును జిత్తగించి దిద్దుకొందురేని మేము ధన్యులము.

– భారతి – ప్రజోత్పత్తి మార్గశీర్షం (1931)

9. ప్రతాపరుద్రీయము

ప్రతాపరుద్రయశోభూషణము లేక ప్రతాపరుద్రీయము అను నీయలంకార శాస్త్రమును రుద్రదేవుని యాస్థానమందున్న విద్యానాధుడను మహాకవి రచించెను. ఇది భట్టుని కావ్యప్రకాశికను, విద్యాధరుని ఏకావళినిజూచి యారీతిగా వ్రాయబడినది. దీనిని కోలచల మల్లినాథసూరి పుత్రుడగు కుమారస్వామిశాస్త్రి వ్రాసిన తరళయను వ్యాఖ్యానముతో గూర్చి K.P.Trivedi (కే.పి.త్రివేదీపండితుడు) బొంబాయిలో బ్రకటించెను. ఇది తొమ్మిది ప్రకరణములుగా విభజింపబడియున్నది. ప్రథమ ప్రకరణమందు నాయక గుణములు వర్ణింపబడియున్నవి. అందుచే దానికి నాయకప్రకరణమని పేరు. అలంకార శాస్త్రములను వ్రాసిన పూర్వపు గ్రంధకర్తలందరు దానితో సంబంధించిన సకలాంశములను ప్రతిపాదించిరి గాని తమగ్రంధములను నాయకునితో గూర్చలేదు. గ్రంధములయొక్కయు గ్రంధకర్తల యొక్కయు గొప్పతనము నాయకగుణవర్ణనమునకు నాయకునికి ఆధీనమైయున్నదని యీదిగువవ్రాసిన శ్లోకములోఁ జెప్పియున్నాడు.

శ్లో॥ గుణాలంకారాణాం రసమహతి కావ్యే విలసితమ్
స్ఫురచ్ఛబ్దార్థాభ్యాం తదపి హృదయా నంది భవతి।
తయోరప్యున్మేషస్య వదమృత మాధుర్యసుభగః
పరం పుణ్యశ్లోకం చరిత మనుబధ్నన్విజయతే॥

ఆ హేతువుచేతనే యీ గ్రంధకర్త ప్రథమ ప్రకరణమందే వర్ణించియున్నాడు. నాయకుని సామాన్యగుణములను వాని లక్షణములను చెప్పి, నాయకులు ధీరోదాత్త ధీరశాన్త ధీరలలితులని నాలుగుతెగలని వారియవాంతర భేదములతో జెప్పెను. తరువాత నాయికలను వారి యవాంతర భేదములను వారి లక్షణములను బ్రతిపాదించెను.

రెండవ ప్రకరణము కావ్యప్రకరణము. ఇందులోఁ గావ్యలక్షణము శబ్దార్థభేదములు, వృత్తులు, రీతులు, శయ్య, పాకము, కావ్యభేదములు, అవాంతరభేదములు, ఆఖ్యాయిక, కథ, చంపు, ఉద్ధరణము, భోగావళి మొదలగు ఖండకావ్యములు వాని లక్షణములు వర్ణింపబడినవి.

మూడవ ప్రకరణములో వివిధములైన రూపకములు, వానిలక్షణములు,

ముఖ్యముగా నాటకము, పంచసందులు, వాని అంగములు, వాని లక్షణములు, వీనికన్నిటికి నుదాహరణభూతమైన ప్రతాపరుద్ర కళ్యాణమను నొకకళ్యాణము ప్రతిపాదింపబడినది.

నాల్గవ ప్రకరణము రసప్రకరణము. ఇందులో నవరసములు, వాని లక్షణములు, భేదములు నిరూపింపబడినవి. అయిదాఱు ప్రకరణములలో దోషములు గుణములు నుపపాదింపబడినవి. ఏడు, యెనిమిది, తొమ్మిది ప్రకరణములలో గ్రమముగా శబ్దాలంకారములు, అర్థాలంకారములు, ఉభయాలంకారములు చెప్పబడినవి.

కావ్యప్రకాశికకంటె, ఏకావళికంటె నిందులో గావ్యాలంకార లక్షణము, నాటకలక్షణము కూడ ప్రతిపాదింపబడి యుండుటచే గ్రంధము విపులతరముగా నున్నది. విశ్వనాధ రాజప్రణీతమైన సాహిత్యదర్పణము కూడ నిట్టిదే. చూడగానే మనస్సున కారోహించు దీని లక్షణమేమనగా గ్రంధమందంతట బ్రతాపరుద్రుని కీర్తి ప్రతాపవర్ణనము గ్రంధమందు బ్రతిపాద్యములైన సకలవిషయముల కుదాహరణములుగా నియ్యబడిన శ్లోకములన్నియు బ్రతాపరుద్రుని ప్రతాపమును, శౌర్యమును వదాన్యత్వసుగుణసంపదను వర్ణించుచున్నవి. కావుననే యీ గ్రంధమునకు గవి ప్రతాపరుద్ర యశోభూషణమని పేరిడెను. ఈ గ్రంధనామము నరసింహకవి రచించిన నంజరాజ యశోభూషణమను పేరుకు సదృశముగానున్నది. విద్యాధరుడు వ్రాసిన ఏకావళిలో నుత్కలదేశాధీశ్వరుడైన నరసింహరాజు, పురోహితదైవ శంకరనానాభాయి వ్రాసిన అలంకారమంజూషలో పేష్వాలైన మొదటి మాధవరావు, అతని పినతండ్రి రఘునాధరావు వర్ణింపబడిరి.

మల్లినాధుడు రఘువంశాది మహాకావ్యములకు దానువ్రాసిన వ్యాఖ్యానములలో నీగ్రంధశ్లోకములను బహుళముగా నుదాహరించెను.[1]

మల్లినాధుడీ గ్రంధశ్లోకముల నుదాహరించిన స్థలములయందు గ్రంధముపేరుగాని గ్రంధకర్త పేరుగాని యెచ్చటను చెప్పలేదు. హిందూదేశపు దక్షిణభాగమం దీగ్రంధము, దీని గ్రంధకర్త సుప్రసిద్ధముగా నుండుటచే నీరెంటిపేర్లను చెప్పకపోవుట వాస్తవమని మనమూహించుకొనవచ్చును. శేషగిరిశాస్త్రి యిప్పటికి నీగ్రంధము దక్షిణహిందూ స్థానమందు ప్రతిసంస్కృత విద్యార్థిచేతను

---

1. కుమారసంభవ వ్యాఖ్యానము సంజీవినిలో, కిరాతార్జునీయ వ్యాఖ్య గంటాపథములోను, శిశుపాలవధ వ్యాఖ్యానము సర్వంకషలోను, భట్టి కావ్యవ్యాఖ్యానము సర్వపథీనములోను.

గృషిచేయబడుచున్నదని సంస్కృత గ్రంధశోధనని వేదికలో వ్రాసియున్నాడు విశ్వేశ్వర పండితుడు తన అలంకార కౌస్తుభములోను, అప్పయదీక్షితులు చిత్రమీమాంసలోను, ప్రతాపరుద్రీయ శ్లోకముల నుదాహరించియున్నారు. "కతిపయదివసైః క్షయం ప్రయాయాత్కనకగిరిః కృతవాసరావసానః। ఇతిముదముపయాతి చక్రవాకీ వితరణశాలిని వీరరుద్రదేవే" అను శ్లోకము నప్పయదీక్షితులు కువలయానందములో సంబంధాతిశయోక్తి కుదాహరణముగా నిచ్చెను.

విద్యానాధుడు:- ప్రతాపరుద్ర యశోభూషణమను నీగ్రంధముతప్ప మరియేగ్రంధమును వ్రాసినట్లు కనపడదు. DR. Anfrecht ప్రతాపరుద్రకళ్యాణమును వ్రాసెనని చెప్పియున్నాడు కాని యదిప్రతాపరుద్రీయములో జెప్పబడిన నాటకలక్షణమును సంధులను స్పష్టముగా దెలియుట కుదాహరణముగా వ్రాసిన నాటకముగాని స్వతంత్ర గ్రంధము కాదు.

గ్రంధకర్తకాలము గ్రంధముయొక్క అంతరంగసాక్ష్యము వలనను (Internal evidence) ఏకశిలానగరము లేక ఒరంగలులో రాజ్యపరిపాలనము చేసిన కాకతీయరాజుల శాసనము వలనను సులభముగానిర్ణయింపబడినది. అలంకార శాస్త్రచరిత్రను వ్రాసిన (Sushil Kumar De M.A.Ph.D.) సుశీలకుమారడెగారు ప్రతాపరుద్రుని కాలమును గురించియు, విద్యానాధుని కాలమును గురించియు నిట్లు వ్రాసియున్నారు.

He (Prataparudra) is described as a Kakatiya King whose Capital was Ekasila Nagara in the Tilingana or Andhra country and who is said to have vanquished among other kings the princes of the Yadava family. All these and other details have led Trivedi to identify Vidyanatha's patron with Prataparudra the seventh Kakatiya King of Ekasila or Orangal whose inscriptions date between 1298-1317 A.D. and who is placed by Sewell between 1295-1323 A.D. and by Seshagiri Sastri between 1268 and 1319 A.D. The Yadava King referred to therefore seems to be Ramachandra, sixth ruler of the yadavas of Devagiri, whose dates are 1271 to 1309 A.D. We may, therefore assign Vidyanadha approximately towards the end of the 13th and the beginning of the 14th centery.

"ఒక పెద్దబండరాయి" అనునర్ధమిచ్చు "ఒరుక్కల్" అనుపదము మహమ్మదీయుల ఉచ్చారణాసౌష్టముచే "వరంగల్" అయినది. అదియే సంస్కృతములో

"ఏకశిలా" అయినది. ఒరంగల్ శబ్దమున కనేక విధోచ్చారణములు కలవు ఎట్లనగా – వొరంగల్లు, వొరంగోలు, ఒరంగల్లు, ఒరంగోలు, వోరువకల్లు, వోరువకల్లి, ఈ విశేషము లన్నియును, Sewell దొరగారు వ్రాసిన "దక్షిణహిందూస్థాన రాజవంశ సంగ్రహము (Sketch of the Dynasties of Southern India P.32)లో వ్రాసియున్నారు. ఆంధ్రదేశపు చరిత్రములో ఒరంగల్లు అను రూపమున్నది. ఒక రాయియని దానియర్థము, అదియే సంస్కృతభాషలో "ఏకశిలా" అయినది.

విద్యానాథుని కాలమీగ్రంథస్థసాక్ష్యము వలననే నిర్ణయింపబడుచున్నది. ఈ గ్రంధమువలననే యీగ్రంథకర్త ప్రతాపరుద్రునికి సమకాలికుడని స్పష్టమగుచున్నది. ఈయలంకార శాస్త్రమువలనను, శాసనముల వలనను. ప్రతాపరుద్రని కాలము, చరిత్రము పూర్ణముగా దెలియబడుచున్నవి ఇతడు కాకతీయవంశపురాజు. ఏకశిలానగరమందు బ్రతిష్టింపబడిన వారికులదేవతయగు "కాకతి" యనుదుర్గనితడు పూజించువాడు గావున కాకతిరుద్రుడని వ్యవహరింపబడెను (రత్నాపణమను వ్యాఖ్యానము– "కాకతిర్నామ దుర్గాశక్తిరేకశిలానగరేశ్వరాణాంకులదేవతా, సాశక్తిర్భజనీయా అస్యేతి కాకతీయః) ఏకశిలానగరము ఆంధ్రదేశమునకు రాజధానియైయుండెను. "శ్రీశైలము, కాళేశ్వరము, దాక్షారామము" అను స్థలములయందు మూడులింగములుండుచే త్రిలింగమని యీదేశమునకు బేరొందినది. గౌతమీనది, హనుమదచలము (అనుమకొండ) రాజధానికి అనగా వరంగలుకు దగ్గిరగానున్నవి. దుర్గాదేవి యీ కాకతీయవంశమువారికి కులదేవతగా వర్ణింపబడినది. "కాకతికుల దుర్గాదేవీసమారాధనేన విజయప్రస్థాన మంగళంకృత్వా" ప్రతాపరుద్రునికివీరరుద్రుడని, రుద్రుడని నామాంతరములు కలవు. ఇతని తండ్రిపేరు మహాదేవుడు. తల్లిపేరు ముమ్మడి లేక ముమ్మడంబ.[2]

ఇతడు సూర్యునివలె బ్రకాశమానుండై యుండుటవలన బ్రతాపరుద్రుడనియు[3] కలియుగమందు ముమ్మడి పుత్రుడగుటచే త్రేతాయుగమం దవతరించిన

---

2. (కావ్యప్రకరణము – 20 శ్లోకము) "కౌసల్యా సీత్ప్రథమజననీ దేవకీచద్వితీయా విష్ణోర్మాతా తద నుమహితా ముమ్మడంబా తృతీయా"

3. తంనుజాతం సముద్వీక్ష్యక్షోణ్యాం రవిమివోదితం।
ప్రతాపరుద్ర ఇత్యాఖ్యామకరో త్కాకతీశ్వరః।
విష్ణోర్విశ్వే కనీరస్య కాకతీయ కులేస్థితం।
అవతార మముంజ్ఞాత్వా వీరరుద్రం ప్రచక్షతే।।   (నాటక–ప్ర–11–12శ్లో)

రాముడనియు, ద్వాపరయుగమం దవతరించిన శౌరి (కృష్ణుడు) యనియు విద్యానాధుడీ గ్రంధమందు వ్రాసెను. ఈ ప్రతాపరుద్రుడు తన కాలమందు విద్యలను వృద్ధినొందించెను. తానుస్వయముగా పండితుడై యుండెను.[4]

అతనిభటు లంధ్రక్షమాభృద్భటులని చెప్పబడుచున్నారు[5] ప్రతాపరుద్రుడు వరాహధ్వజుడై నట్లొక శ్లోకము చెప్పుచున్నది.[6]

ప్రతాపరుద్రుని శత్రువులతని యనుగ్రహమును సంపాదించుటకు నాతని ధ్వజచిహ్నమైన వరాహమును తమగుండెలపై ధరించుచున్నట్లు వర్ణింపబడెను.

ఇతడు "చలమర్తిగండ" యని బిరుదువహించినట్లీ గ్రంథమందున్నది. "చలమర్తి గండ" అనగా యుద్ధమునుండి పారిపోవు మర్త్యులకు పెద్దపాషాణము, లేక యుద్ధము నుండి యెప్పుడుమరలని ధైర్యము గలవాడని యర్ధము.[7]

ఇంతియకాక నాటకప్రకరణములో నుదాహరణముగా వ్రాయబడిన ప్రతాపరుద్ర కళ్యాణమను నాటకము ప్రతాపరుద్రుని గురించియు, కాకతీయవంశపు రాజులను గురించియు, గొంతవృత్తాంతమును దెలియజేయుచున్నది.

స్వయంభువు (శివుడు) కటుంబస్థుల కందరికి వారివారి కృత్యములయందు దగినయుపదేశము లొనర్చు నిష్టదైవముగా నున్నట్లు చెప్పబడియున్నది.

వ్యాఖ్యాతయగు కుమారస్వామి చెప్పినట్లామె నిజమైనపేరు రుద్రాంబ, కాని ప్రతాపరుద్రీయవ్యాఖ్యాత యీరుద్రాంబ గణతిరాజు భార్యయని భ్రమజెందినట్లు రుద్రాంబికావర్ణన శ్లోకావతారికవలన స్పష్టమగుచున్నది. ఎట్లనగా:-

"పురాకిల కాకతికులసంభూతే గణపతి నామ్ని మహారాజే దుహితృమాత్ర సంతానే కదాచిద్దైవ యోగేన కాలపరిపాకముపేయుషి తన్మహిషీ రుద్రమదేవి మకంటకం

---

4. గోష్ఠీభిఃపరితోషయ న్బుదగర్ణాషడ్దర్శనీ సీమభిస్స త్సారస్వత మార్గదర్శన చణైన్సూక్తైః క వీన్ప్రీణయన్ సంగీతో పనిష ద్రహస్య పిశునైరాతోద్యయోగ్య క్రమైర్ధిన్వ సంసది వైణికాన్విహరతే శ్రీకాకతీవం ద్రోనృపః॥

5. యోద్ధారోవయ మిత్యరీనభి భవంత్యంధ్ర క్షమాభృద్భటాః॥

6. "మన్థానాచల మూలమేచకలా సంఘట్టనశ్యామికా కారం యత్తుహినద్యుతౌ స్ఫురతి తత్సారంగ మాచక్షతే। మన్యేనన్విహ వీరరుద్రనృపతేః కీర్తిశ్రియానిర్జిత స్తన్ముద్రాంక వరాహమిందురురసాబిభ్ర త్సముజ్జృంభతే॥"

7. "చలానాం రణభీతానాం మర్త్యానాం గండః స్థూలోపల స్తద్వన్నాశకః। యత్రకుత్రా ప్యస్యప రాభవా భావాచ్చలమర్త్యగండ ఇతి అబిరుతో పలబ్ధిః"। కొన్నిచోట్ల చలమర్త్యగండి యని కూడ బ్రయోగమున్నది. "కుర్వంత్యశ్చల మర్త్యగండినృపతే ర్జైత్రప్రయాణోద్యమాః॥"

పరిపాల్య" (Professor Trivedi's Edition - P.147 – నాటక ప్రకరణము చూచునది) రుద్రమదేవి గణపతికుమార్తెగాని భార్య కాదని నవీన చారిత్రాంశ శోధనవలన (Historical Research) దెలియువచ్చినది. మనుష్యులలో 'సోమ'యని వ్యవహరింపబడునామె యీరుద్రాంబికతల్లి. సాక్షాత్తుగా ఉమ. గణపతినామమును ధరించిన ఆమె తండ్రి సాక్షాత్తుగా శివుడగుటచేత నామెగొప్పతనము చూపింపబడెను. గణపతిదేవుని యనంతరమందామె సింహాసనమెక్కెను. రుద్రదేవునికి శివుడు స్వప్నమందు దర్శనమిచ్చి ప్రతాపరుద్రుని గొప్పతనమును స్తుతించి మనుమడైన యతనిని బుత్రునిగా దత్తతచేసికొమ్మనియు రాజ్యభారమతనియందుంచమనియు జెప్పెను.[8]

తరువాత నీప్రతాపరుద్రుడు యౌవరాజ్య పట్టాభిషిక్తుడు కాకమునుపే దిగ్విజయార్థము బయలువెడలెను. మొదట తూర్పు దిక్కుకు బయలుదేరి కళింగదేశమును జయించెను. కళింగదేశమనగా నిప్పటి యుత్తరసర్కారులు. పిదప దక్షిణముగా బ్రస్థితుడై పాండ్యదేశమును వశపర్చుకొనెను. పాండ్యదేశమిప్పటి మధుర. పిదప బశ్చిమదిక్కును గెలిచెను. అనంతరము నర్మదదాటి యుత్తరదిక్కునకు బోయెను. అచట నంగవంగ మాళవరాజులు ముగ్గురేకమై యతనినెదిరించిరి. అందుపై ప్రతాపరుద్రుని సేనాధిపతులు స్పర్ధాళువులై వారిని నిందించిరి. ఈ యుద్ధమునందు ఘూర్జరులు, లంపాకులు, వంగదేశస్థులు, కొంకణులు, హూణులు, మహారాష్ట్రులు, గెల్వబడిరి. చోళ కాశ్మీర నేపాళ సుహ్మకాంభోజ సేవన (నాసిక మొదలుకొని దేవగిరివరకు వ్యాపించిన దేశమునకు పేరు) గౌడలాట సింహళ కర్ణాట భోజ కేరళ పాంచాల కీకట దేశములను ప్రతాపరుద్రుడు జయించెను.[9]

యాదవవంశపు రాజులకు శిరోరత్నమైన సేవనుడనురాజు మహా పరాక్రమవంతుడై నను ప్రతాపరుద్రుని రణభేరీధ్వనిని విని పారిపోయెనని వర్ణింపబడినది.

ఈ సందర్భమున జెప్పబడిన సేవణరాజే ప్రతాపరుద్రుని సైనికులచే నధిక్షిప్తుడై

---

8. "స్వీకృతే పుత్రభావేన దౌహిత్రే పాజ్యమాజ్ఞయా। అస్మిన్ని ధేహిధౌరేయే గుర్వీముర్వీధురామితి"
(నాటక ప్ర–29 శ్లో)

9. నాటక–ప్ర॥ 14 శ్లో॥ రేరేగూర్జర జర్జరోసి Etc.

పారిపోవుట గౌతమినదికూడ నెరిగియున్నదని మఱియొకచోట వర్ణింపబడి యున్నది.[10]

యాదవరాజు ఏకశిలానగరమువద్ద గౌతమీనదినిదాటి వచ్చుచుండగా వీరరుద్రుని సేనాధిపతి తిరిగి యానదినిదాటి తన రాజ్యములోనికి బోవునట్లు చేసెను. ఈయాదవరాజు పేరు రామచంద్రుడు లేక రామదేవుడు. ఇతడు దేవగిరిలోనేలిన యాదవరాజులలో నారవవాడు వీనికాలము 1271–1309.

గణపతిరాజు గణపేశ్వరుని విగ్రహమును ప్రతిష్ఠచేయించెనని ప్రతాపరుద్ర కళ్యాణ నాటకములో జెప్పబడియున్నది.[11]

నాటక ప్రకరణములో గనపర్చబడిన ప్రతాపరుద్రుని వంశవృక్ష మీరీతిగానున్నది.

గణపతి (సోమను పెండ్లియాడెను)
|
రుద్రాంబిక (రుద్రయని ప్రసిద్ధి)
|
ముమ్మడంబ (మహాదేవుని భార్య)
|
ప్రతాపరుద్రుడు

---

10. రాజ్ఞోయాదవ వంశపార్థివమణేః ప్రఖ్యాతశౌర్యశ్రియ। స్వంగత్తుంగతరంగ సైన్యమహాతో మానై కవిత్తస్యచ। సద్యో రుద్రనరేంద్రనాయక చమూనాధేనకేనాప్యధి। క్షిప్త స్వాచరితాని సేవణపతే ర్జానాతిసా గౌతమీ॥

11. నాటక-ప్ర-21 శ్లో॥ యస్త్వద్గోత్రమహత్త రస్య జగతాంత్రాతు స్స్వయంభూవిభో। స్తత్తాద్ధృ క్ఛురితాద్భుతైర్మహిమభి స్స్వీయైద్వి॥ తీయో॥ భవత్। దేవో॥ సొగణపేశ్వరఃప్రతిక లంస్ఫార ప్రసాదో న్ముఖో। నప్తుసే కులమండనస్య మహతీం పుష్ణాతు రాజ్యశ్రియమ్॥

10. అనపోత నాయకుఁడు

(రక్తాంజలి)

వెలమవీరులలో రేచెర్లగోత్రీయులు సుప్రసిద్ధులు. చిరకాలము రేచర్లగోత్రీయులగు వెలమవీరులు కాకతీయసామ్రాజ్యపతాకచ్ఛాయను ధరించి తద్విజయములకు నిరవకుంశముగఁ బాటుపడి సుప్రసిద్ధులైరి. దేశమునం దైకమత్యము చెడి ఆంధ్ర సామ్రాజ్యము పతనమొందినపిమ్మట నాంధ్రత్వము నిలువఁబెట్టిన మహావీరాధి వీరుఁడు ఈయనపోతనాయకుఁడు. ఈమహామహుని జీవితచరిత్రమునందు సుప్రసిద్ధవీరరసఘట్టమగు రక్తాంజలియను ప్రకరణము చరిత్రాభిరతుల కెఱుంగించుచున్నారము.

అనపోతనాయకుఁడు రేచెర్ల సింగమనాయని కుమారుఁడు. సింగమనాయఁడు కాకతీయద్వితీయ ప్రతాపరుద్రునియొద్ద సేవానాయకుఁడుగా నుండెను. కాకతీయసామ్రాజ్య మనఁబడు ఆంధ్ర సామ్రాజ్యము పతనమైనంతనే సింగమనాయకుఁడు తనక్రిందనున్నసేనతో దేవరకొండ, రాచకొండ లోనిగుదుర్గములను స్వాధీనపఱచికొని ఛిన్నాభిన్నమైన యాంధ్రసామ్రాజ్యమును బునరుద్ధరింపవలయునని స్వతంత్రపతాకము దాల్చి తక్కినదుర్గముల లోఁబఱచికొన బయలువెడలెను. కాకతీయసామ్రాజ్యమునకు సంబంధించినసేనా నాయకులు తమ స్వాధీనమునందున్న దుర్గములకుఁ దా మధినాయకులై సింగమనాయకుని కంకితులగుటకు నిరాకరించుటచేఁ బలుతావుల సింగమనాయకుఁడు భయంకర సంగ్రామములకుఁ బాల్పడక తప్పదయ్యెను. సింగమనాయకుఁడు సహజముగ వీరమూర్తియుఁ బరాక్రమశాలియే కాక యమితసైన్యసహాయము గలవాఁడగుటచేఁ బలువురు లోఁబడి సామంతులైరి. ఒకమాఱు సింగమనాయఁడు జల్లిపల్లి దుర్గమును ముట్టడించుటకు వచ్చి గ్రామముబయట దండువిడిసియుండెను. జల్లిపల్లి దుర్గమునందున్న క్షత్త్రియవీరులు సింగమనాయని బావమఱఁదియగు చింతపల్లి సింగమనాయని మాయోపాయములచే మోసగించి కొనిపోయి కారాగృహమునందు బంధించిరి. సింగమనాయకుఁడీవార్త విని జల్లిపల్లిదుర్గము భేదింప సంగ్రామభేరి వేయించెను. జల్లిపల్లెలోని రాచబంటులు రాజులు భయపడి రాజీచేయుటకని పేరుపెట్టి రాయబారిగా తమ్మళబ్రహ్మాజీయనువానిని సంధికిఁ బంపిరి. తమ్మళ బ్రహ్మాజీ మిగుల వినయవిధేయతలతో సింగమనాయకుని సమీపించి రాజకీయవ్యవహారములు

మాటలాడుచు నమ్మిక కలుగఁజేసికొని జల్లిపల్లిదుర్గమును విడిచిపెట్టి పొందని వేఁడుకొనువానివలె సింగమనాయనిపాదముల చెంతకు వచ్చి హఠాత్తుగా మొలలోని చురియతో సింగమనాయకుని రొమ్ములో నొకపోటు పొడిచి పాఱిపోయెను. హంతకుఁడు పాఱిపోయినంతనే యీఘోరవార్త శిబిరమునందంతటను నిముషములో వ్యాపించెను. ఆక్రందనధ్వనులతో నందఱు సింగమనాయని చుట్టుముట్టిరి. ఈ వార్త వినినంతన సింగమనాయకుని కొమారులగు అనపోతనాయకుఁడు, మాదానాయకుఁడు తండ్రిని సమీపించి దీనవదనులై నిలువఁబడిరి. సింగమనాయఁడాబాధకు సహింపఁజాలక 'కుమారులారా నన్నిటుల ఘోరహత్య గావింపఁజేసిన జల్లిపల్లిరాచవారిని దెగటార్చి తద్రక్తముతో నాకుఁ దిలతర్పణాదికములు గావించినఁగాని నాయాత్మకు శాంతి కలుగదని కత్తిన బెఱుకుఁ'డని తెల్పెను. కుమారులిరువురు పిత్రాజ్ఞ నిర్వర్తింప బాసగావించి వెంటన చురియను దీసిరి. సింగమనాయకుఁడు వీరమరణము నొందెను. అనపోతనాయకుఁడు పితృసందేశమును దీర్ప "రక్తాంజలి" దీక్షవహించిన కథాంశమిది.

అనపోతనాయకుఁడు మాదానాయకుఁడు సోదరులు. వీరు రక్తాంజలితోఁ బితృతర్పణాదులు గావించిన కాలము నిర్ణయింపఁ దగిన యాధారములు గానరావు. అనపోతనాయకుఁడు రాజరక్తమునఁ బితృతర్పణాదు లొనరించి సోమకులపరశురామబిరుదమును గడించెను. ఈబిరుదము మాదానాయకుఁడు గూడ వహించినట్లు శాసనాంతరములలోఁ గలదు. కాని, ఇందుఁ బ్రధానకార్యకర్త అనపోతనాయకుఁడె. మాదానాయకుఁడు సహాయకారి. అనపోతనాయకునకు గల సోమకుల పరశురామ బిరుదము దెలుపు చరిత్రసాధనములఁ దెలిసికొందము.

*శ్లో. ముని రజని పరశురామః స్థానే వినియుజ్య వైష్ణవం తేజః,
సోమకులపరశురామే ధరా మవ త్యన్నపోత నృపతిః.

"సోమకులపరశురామాది జగత్ప్రసిద్ధబిరుద నామధేయప్రశస్తి సహితులైన... అనపోతనాయకునింగారు శా.శ. ౧౨౯౧ సం. అయ్యనవోలు అనపోతనాయని శిలాశాసనము."

---

* *తా. మునియగు పరశురాముఁడు తన వైష్ణవ తేజమును సోమకుల పరశురామునియందు నెలకొల్పెను. అతఁడె అనపోతనాముఁడై భూమియందు జనించెను – అయ్యనవోలు శాసనము. చూ.*

ఈ సోమకులపరశురామబిరుదము అనపోతనాయకుని రాచకొండలోని శాసనము లన్నింటిలో, అనఁగా శా.శ. ౧౨౭౭ భైరవుని చెంత శాసనము, ౧౨౮౫ ఆంజనేయుని చెంత శాసనము, ౧౩౦౦ నాయకుని చెంత శాసనము, ౧౩౦౨ గన్నేర్ల భైరవుని చెంతశాసనము, ౧౨౮౫ భైరవు గండిశాసనము – వీనియందుఁ గలదు. మాదానాయకుని (మాధవనాయకుని) ఉమామహేశ్వరశాసనములో సోమకులపరశు రామబిరుదము గలదు. సర్వజ్ఞ సింగభూపాలుఁడు రచించిన రసార్ణవసుధాకరమను నలంకారశాస్త్రమునందు అనపోతనాయకుని వర్ణించుచు

"సోమకులపరశురామే భుజబలభీ మేఽ ధిభూమి గోపాలే,
యత్ర చ జాగ్రతి శాసతి జగతాం జాగర్తి నిత్యకల్యాణమ్."

అని సోమకులపరశురామబిరుదమును ప్రశంసించియున్నాఁడు. ఈ విధముగ శాసనములయందు గ్రంథాంతరములందున్న అనపోతనాయకుని సోమకుల పరశు రామబిరుదము నాధారముగాఁ గొని యాతని విజయ యాత్రాకథారాజమును సేకరించుదము.

అనపోతనాయకుఁడు మాదానాయకుఁడు బాలురైనను తండ్రియగు సింగమనాయుని ఘోరమరణవార్త నాలకించినంతనే వెఱచి చీలిపోయిన సైన్యమునంతను గూడఁ దీసికొని మాటపలుకు బడిచేతను, మొగమాటముచేతను నసంఖ్యాక సైన్యమును జతపఱచుకొని పిత్రాజ్ఞ నిర్వర్తించుటకు జల్లిపల్లిదుర్గమును ముట్టడింప మహోత్సాహముతో బయలువెడలిరి. వీరివెంట నడచిన సైన్యమునందు కాల్బంట్లు ౬౦,౦౦౦, అశ్వికులు ౨౦,౦౦౦, ఏనుఁగులు ౭,౦౦౦, సేనానాయకులు ౧౦,౦౦౦ మంది గలరని బిరుదగద్యము లందును జాటువులందును గలదు. ఇందలిసంఖ్య యతిశయోక్తియని త్రోసివేయ వీలులేదు. సింగమనాయకుఁడు, ప్రతాపరుద్రుఁడు చెఱఁగొనఁబడిన పిమ్మట ముఖ్యములగు దుర్గములను స్వాధీనపఱచికొని, యందలి సైన్యమునంతయు వశపఱచికొనెను. ప్రతాపరుద్రుని స్వాధీనమునందుఁ దొమ్మిదిలక్షలసైనిక లుండిరని చరిత్రగ్రంథము లందును, ఇతర గ్రంథములందును జెప్పఁబడుటచే నం దెంతయో తక్కువయగు నీసైన్యము అనపోతనాయకుని స్వాధీనమునం దుండెననుటలో నాశ్చర్య ముండదు. జల్లిపల్లి ముట్టడింపనేతెంచు వెలమవీరుల సైన్యంబు నెదిరింప రాచబలము మితిలేని సైన్యమును సమకూర్చుకొని మొరులూరుదుర్గము చెంగటనున్న చెంజెర్ల నెదిరించెను.

వెలమ సైన్యము చెక్కుచెదరని పట్టుదలతో రాచబలముపైఁ దలపడి ఘోర సమరము గావించెను. జల్లిపల్లిదుర్గము నాకాలమున చాళుక్యులు పాలించుచుండిరి. పోలూరు, వినుకొండ, కుంట్లూరు, అరవపల్లి, క్రొత్తపల్లి, గౌరగిరి, కొలమచెలమ, రామగిరి లోనగుదుర్గాధీశ్వరులు, రెడ్డివీరులు, కమ్మవీరులు లోనగువారు సైన్యముతో చాళుక్యబలమునకు సహాయపడిరి. మిగుల భయంకరసంగ్రామము చిరకాలము జరిగెను. రామలక్ష్మణులవలె వెలమసోదరులగు అనపోతనాయకుఁడు, మాదానాయకుఁడు ముందునిలిచి సేనల ప్రోత్సహించి విరోధిసేనలపైకిఁ బంపవారును భయంకరముగ సమరమొనర్చి విరోధిసైన్యమును పంచబంగాళము గావించిరి. సైనికులనాశనమును జూచినంతన రాచకొలపువీరులందఱు వెనుకడుగువైచి ప్రాణభయముచేఁ జెంజెర్ల దుర్గముఁజేరి తలదాచుకొనిరి. వీరసోదరులంతతోఁ బోక సైన్యముతో చెంజెర్ల దుర్గమును దీవ్రతరముగాఁ గొన్నిదినములు ముట్టడించి లోని కాహారవస్తువులు, ఇతర సహాయము చేకూరుకుండ నాటంక పఱచికోటయంతయుఁ బగులఁగొట్టి దుర్గమును భేదించి యందలి రాజబృందము నంతయుఁ బట్టుకొనిరి. బంధితులగు వీరులలో, పంటముమ్మడి, పంటమైలారురాజులును, ఉద్దండమండలేశ్వరుఁడు, సత్యకదేవుఁడు, కన్నడదేవుఁడు, ఉదయదేవుఁడు, కర్కశదేవుఁడు లోనగు చంద్రవంశ క్షత్రియులు కొత్తకొండారెడ్డి, కొట్టూరి మారారెడ్డి, నారనగిరి నారారెడ్డిలోనగు రెడ్డివీరులు గలరు. అనపోతనాయకుఁడు విరోదుల నందఱ సంహరింప సైనికుల కాజ్ఞయొసంగి పితృమారకులగు జల్లిపల్లి చంద్రవంశక్షత్రియుల నందఱిఁ గొని తెప్పించి వారల స్వయముగాఁ దాను ఖండించి రక్తము బానలనిండఁ బట్టి తండ్రికి విధ్యుక్తముగా రక్తాంజలితోఁ దర్పణాదుల నొసంగి యంతతోఁ బరితృప్తి నొందక పధ్యులగు రాజులమేను లొలిపించి మాంసములు వండించి కళేబరములు కొయ్యగానుగలలో నాడించి రసముదీసి అన్నపురాశిపైఁ బోసి భూతప్రేత పిశాచాదులకు బలియొసంగెను. ఈ వీరరణవిజయానంతరము అనపోతనాయకుఁడు, మాదానాయకుఁడు "సోమకులపరశురామ"బిరుదమును వహించి వీరాధివీరులని ప్రఖ్యాతిఁబడసిరి. ఈ విజయ మేసంవత్సరమున లభించినదో గుర్తింపఁదగు నాధారములు లేవు. ఈ బిరుదము అనపోతనాయకుఁడు వహించినట్లు దెలుపుశాసనములలో శా.శ. ౧౨౮౭ సంవత్సరమునకు సరియగు క్రీ.శ. ౧౩౬౫ లోని రాచకొండ రామాలయమునకుఁ జెంతనున్న శాసనమే మొదటిది.

అనపోతనాయకుఁడు క్షత్త్రియవీరులనుజయించి మిగులభయంకరముగా క్షత్త్రియరక్తముతోఁ బితృతర్పణాదులు నెరవేర్చుట మొదలు హతశేషులగు క్షత్త్రియులకుఁ దత్కులజులకు మిగుల నవమానకరముగా నుండెను. అనపోతానాయకుఁ డింకఁ దనకెదురులేదని దేశమునంతయు నాక్రమించుకొనుటకుఁ గ్రొత్తసైన్యములను జేర్చికొని పెక్కుచోటులకు దండయాత్రల కేఁగుచు "సోమకులపరశు రామబిరుదము"ను శాసనములం దెన్నింటనో చెక్కించెను. రాచవారిది యవమానముగా భావించి యనపోతానాయకు నెదిరించి యోడించి జల్లిపల్లిరాచవారి పేరిట అనపోతనాయకుని రక్తముతోఁ దిరుగ రక్తతర్పణాదులొసంగి వీరమరణమొందిన క్షత్త్రియవీరుల కాత్మశాంతి గూర్చవలయునని తీవ్రయత్నములుచేసి, బలము నభివృద్ధిపఱచికొనిరి. రాజవంశ భూషణులగు క్షత్త్రియవీరులు మానుకోటకు సమీపమునందున్న ఇనుగుర్తి చెంత నొకకోటగట్టి యందు సురక్షితులైయుండి అనపోతనాయకుని సంగరమునకు రమ్మని వార్తనంపిరి. అనపోతనాయకుఁడు అందందునున్న బలములనన్నింటిని జతచేసికొని నియతకాలమునకు ఇనుగుర్తి దుర్గమును సమీపించెను. పరిమితసేనతో మాదానాయకుఁడన్నయగు ననపోతనాయకుని గలసికొని సంగరాభిముఖుఁడయ్యెను. ఇనుగుర్తికోటలో కొండ రాఘవరాజు, జగ్గరాజు, గోవిందరాజు, గోపరాజు, తిరుమల పోలరాజు, శ్రీపతిరాజు, మల్లదేవరాజు, కనకరాజు, బాలదేవళరాజు, చినలక్కరాజు, శ్రీనాథగౌతమీభూనాథ రాజు మున్నగు క్షత్త్రియవీరశిరోమణులు 5 లక్షల 60 వేల దళమును సమకూర్చుకొని అనపోతనాయకని సైన్యము నెదిరించిరి. మిగుల భయంకరముగా నెడతెగక కొన్ని మాసములు సంగరము జరిగెను. ఉభయసైన్యములు తీసిపోనిబీరమునఁ జిరకాలము యుద్ధము చేసినను జయాపజయములు తేలవయ్యెను. అనపోతనాయకుఁడు, మాదానాయకుఁడు సేనల నడిపించుచు ముందినుగుర్తికోటను బగులగొట్టింప నారంభించిరి. సైన్యములోఁ బడియుంటచేఁ గోట భేదించుచుండిరని లోని క్షత్రియవీరులందఱు మాఱుత్రోవను గోట వదలిపోవుటచే నెలమవీరు లాక్షత్త్రియకుమారులను బంధించిరి. తమ భూపాలకులు బద్ధులైరని విన్నంతన రాచఫౌజులన్నియుఁ జెల్లాచెదరై నలుదిక్కులకుఁ జెదరిపోయెను. మాదానాయకుఁడు సేనవెంటఁగొని పాఱిపోవు క్షత్త్రియసైన్యము నంతయు బలిగొనెను. అనపోతనాయకుఁడు చిక్కిన రాజుల నందఱిని చెంతనున్న గుండ్లచెఱువు చెంగటికిఁ

గొనిపోయి శిశుస్త్రీవృద్ధసహితముగా ఖండించి రక్తవాహినిలో స్నానముచేసి నాఁటి యాగ్రహావేశమును జల్లార్చికొనెను. క్షత్త్రియవీరుల యొక్కయు క్షత్త్రియ సైనికులయొక్కయు అద్వితీయ పరాక్రమ జీవితమునకు స్థానికులత్యాశ్చర్యము నొంది వీరమరణమొందినవా రందఱి పేరట వారివారి యాకారవేషభాషల కనుకూలములగు విగ్రహములను చెక్కించి ప్రాతించి జ్ఞాపకార్థము ప్రతి సంవత్సరము ఉత్సవములు చేయించుచున్నారు. ఈ విగ్రహములు నేటికిని దర్శనీయముగ ఇనుగుర్తిచెరువు చెంగిట నలరారుచున్నవి. అనపోతనాయకుఁ డీసంగర మేకాలమున నొనరించెనో, జల్లిపల్లి యుద్ధమునకు ఈయుద్ధమునకు మధ్య నెంతకాలవిలంబము గలదో యెఱుంగతగు నాధారములు లేవు. ఇనుగుర్తియందును నాఁటి రాజుల శాసనములుగాని, చరిత్రగ్రంథములు గాని లభించుట లేదు. మృతవీరుల స్మరణ చిహ్నములగు వీరవిగ్రహములు, వీరరంగమని ప్రశంసగని రక్తప్రవాహములతో నిండిపోయిన పాడువడిన కోటయు మాత్రము నేఁటికి దర్శనీయముగ నున్నవి. పల్లెవాండ్రు, శారదకాండ్రను కథకులు, పంబలవాండ్రు, పాడు పాటలలో క్షత్త్రియవీరుల పరాక్రమజీవితము లిమిడియున్న వనిమాత్రము కొందఱు చెప్పియున్నారు. అవకాశము వెంట వానిని సేకరించుటకు మృతవీరుల చిత్రముల ప్రతిబింబములఁ దీయుటకుఁగూడఁ బ్రయత్నింప వలసియున్నది. మంచెళ్ల కృష్ణకవి నాఁటియనపోతనాయకుని రక్తతర్పణాదికథను జ్ఞాపకముంచికొని కాఁబోలు వెలుగోటి తిమ్మభూపాలునిఁ బ్రశంసించుతఱి నిటులు చెప్పియున్నాఁడు:

సీ. మదవద్విరోధుల మెదడు బోనము చేసి
ప్రత్యర్థిదంతముల్ పప్పు చేసి
కుటిలారిమాంసముల్ కూరగాయలు చేసి
వైరికండలు పిండివంట చేసి
ఉగ్రాహుతుల గుండె లూరగాయలు చేసి
శత్రుబాహులను బచ్చళ్లు చేసి
అరిరాజరక్తంబు నానబాలుగఁ జేసి
నిష్ఠురారులక్రొవ్వు నెయ్యిచేసి
మొనసి నీఖడ్గభేతాళముఖ్యులకును
విందుఁ జేతువు సంగ్రామవీధులందు

అనపోతనాయకుని జీవితకాలము క్రీ.శ. ౧౩౪౪-౧౩౮౦ అని చరిత్రకారులు నిర్ధారణ మొనరించి యున్నారు. క్రీ.శ. ౧౩౨౮లో కాకతీయప్రతాపరుద్రుఁడు ఢిల్లికిఁ గొంపోఁబడెను. సింగమనాయకుఁ డదిమొదలు స్వతంత్రరాజ్యస్థాపనమునకుఁ బాటువడెను. సింగమనాయఁడు హత్యకు లోనగునప్పటికి ఆనపోతనాయకుఁడు మాదానాయకుఁడు ప్రౌఢవయస్కులుగాన జన్మకాలనిర్ణయము సందర్భశుద్ధిగానే యున్నది. కాని అనపోతనాయకుని యంత్యము క్రీ.శ.1380 అని మాత్రము విశ్వసింప వీలుగాదు. రాచకొండ గన్నేర్ల భైరవుని యొద్దఁగల అనపోతనాయకుని శాసను శా.శ.౧౩౦౨ సరియగు క్రీ.శ. ౧౩౮౦ లోనిది. ఇదియె యితని శాసనములందు లభించినంతటిలోఁ గడపటిది. ఇంకను బరిశోధనము జరుగవలసి యున్నది గావునను, ఇతనికుమారుఁడగు సర్వజ్ఞ సింగభూపాలుఁడు రాజ్యమునకు వచ్చుట కింకఁ గొంతవ్యవధి గలదు గావునను, అనపోతభూపాలుఁడు క్రీ.శ.1380లో మరణించె ననుటకుఁ బ్రబలాధారము లేదు గావునను అనపోతనాయకుని నిధనకాలమును గూర్చి నిర్ణయము జరుగుట కింకను బరిశోధన మావశ్యకమై యున్నది.

అనపోతనాయకుని రాజధాని రాజకొండ. ఇది దర్శనీయమగు దుర్గరాజము. ఇది నిజాము రాష్ట్రములోనున్న నల్లగొండకు ౨౫ మైళ్ల దూరములో నున్నది. హైదరాబాదునకు భువనగిరికి 30 మైళ్ల దూరములో నున్నది. అనపోతనాయకుఁడు తాను రాచకొండఁ బాలించుచున్నానని రాచకొండలోని నాలుగు శాసనములలోఁ జెప్పుకొనుటయే కాక రాచకొండలోని రెండు కొండలపైనను దుర్గాదికములు బలపఱచితి ననియు అనపోతసముద్రమని యొకతటాకమును నిర్మించితి ననియుఁ గూడఁ జెప్పుకొనియున్నాఁడు. అనపోతనాయకుని రాచకొండ నివాసత్వమును ఇతనికుమారుఁడగు సర్వజ్ఞ సింగభూపాలుఁడు తన రసార్ణవసుధాకరమున నిట్లు ప్రశంసించియున్నాఁడు.

శ్లో॥ రాజాస రాజాచలనామధేయా
మధ్యాస్య వంశక్రమరాజధానీమ్;
సతాంచ రక్షా మసతాం చ శిక్షాం
న్యాయానురోధా దనుసందధార"

రాచకొండ, నాగానాయనికొండ యనురెండు శైలములకు బలవంతములగు

కోటగోడలు కట్టఁబడెను. మధ్య రాచకొండనగరమున్నది. ఆనాఁటి వ్యూహనిర్మాణము, రాజభవనములు, శిబిరములు, దుర్గ విధము పరిశోధింపఁ దలంచిన యీరెండుదుర్గములందు ననువగు చరిత్రాంశములు లభింపఁగలవు. రాచకొండ వంశక్రమరాజధానియని అనపోతనాయకుఁడు చెప్పికొనియున్నాఁడు. కాకతీయ సామ్రాజ్యసేనాధిపతులై అనపోతనాయకుని పూర్వులు రాచకొండ దుర్గమునం దుండి సామ్రాజ్య క్షేమము కోరినవా రనియు, సింగమనాయుని కాలమునుండి స్వతంత్రదుర్గమయ్యె ననియు, అనపోతనాయకుఁడు శిధిలభాగములు బలపఱచి రాజ్యము వృద్ధిచేసికొని రాజధానీనగరముఁ గావించుకొనె ననియు విశ్వసింపవచ్చును. ఇతనిసోదరుఁడగు మాదానాయకుఁడు కొలఁది కాలమున కచటికి ముప్పదిమైళ్ల దూరముననున్న దేవరకొండచేరి యటప్రత్యేకదుర్గరాజము నొక దానిని నిర్మించి చిన్న రాజ్యమును బాలించుచుండెను.

అయ్యనవోలు మైలారుగుడిలోని శాసనమునందు తాను ఓరుగల్లు, శ్రీభువనగిరి, రాచకొండ, సింగాపురము దుర్గముల కధిపతి ననియు దిగ్విజయయాత్రా సందర్భము శా.శ.౧౨౮౧, క్రీ.శ. ౧౩౬౯లో అయ్యనవోలను గ్రామము నొసంగితి ననియు అనపోతనాయకుఁడు వ్రాయించికొనెను. ఈయన రాజ్యవిస్తృతి నెఱుంగుట కింతకంటె నాధారములు గానరావు. నిజాము రాష్ట్రములోని యాంధ్రదేశము నంతయు ననపోతనాయకుఁడు స్వాధీనపఱచికొని నిరంకుశముగా రాజ్యము పాలించెనని చెప్పవచ్చును. నిజాము రాష్ట్రములోని సుప్రసిద్ధములగు కంభము మెట్టు, ఉర్లగొండ, నల్లగొండ, పానుగల్లు, దేవరకొండ, భువనగిరి, గోలకొండ, మెదకు, కనకగిరి, అనంతగిరి, రామగిరి, లోనగుదుర్గములన్నియు అనపోతనాయకుని హస్తగతమయ్యెను. మధ్యనున్న కొచకొండ రాజధానిగఁ జేసికొనెను.

అనపోతనాయుకుఁడు కేవలవీరుఁడే కాని విద్వాంసుఁడని కాని, కవులనాదరించినవాఁడని కాని చెప్పుట కాధారములు గానరావు. సర్వజ్ఞ సింగభూపాలుఁ డితనిని తండ్రియుగుటచేఁ బలుతావులఁ బ్రశంసించి రసార్ణవసుధాకరమునం దుదాహరణము లొసంగెను గాని యందుఁ జరిత్రాంశములు గానరావు. రసార్ణవసుధాకరములోని యొకానొక* శ్లోకమువలన అనపోతనాయకుఁడు

---

* *హేమాద్రి దానై ర్ధరణీ సురాణం*
మహాచలం హస్తగతం విహాయ,
యశ్చారు సోపాన పథేన చక్ర
శ్రీపర్వతం సర్వజనాంఘ్రి గమ్యమ్

శ్రీశైలమునకు సోపానములు గట్టి సర్వజనగమ్య మొనరించినట్లు కలదు. అనపోతనాయకుఁడు, మాధవనాయకుఁడు కృష్ణ కీవలిభాగమును బాలించుతఱి అద్దంకి, కొండవీడు లోనగు దుర్గముల లోఁగొని వేమారెడ్డియు అతనికుమారుఁడగు అనపోతారెడ్డియు పాలించుచుండిరి. సింగమనాయునికి, వేమారెడ్డికి, అనపోతనాయకునకు, అనపోతారెడ్డికి సంగరములు జరిగినట్లు బిరుదధారణములో నొకరిని మించి యొకరు దానములలో నొకరిని మించి యొకరు ప్రయత్నములు గావించినట్లు తెలిసికొన నవకాశములు గలవు. రెడ్డివీరులు గుంటూరు ప్రాంతముల నుండిపోవు యాత్రికుల కనుకూలముగ శ్రీశైలమునకు మెట్లుగట్ట పోటిగా వెలమవీరులు దేవరకొండ ప్రాంతముల నుండి పోవు భక్తుల కనుకూలముగ మెట్లు గట్టిరి. వారును వీరు హేమాద్రిప్రోక్తదానముల నిర్వర్తించితిమని చెప్పికొనిరి. అనపోతనాయకుఁడు కృష్ణదాటి సైన్యసహితముగాఁ బలుమాఱు ధరణికోట ప్రాంతములకు దండయాత్రకు వచ్చి ఆ ప్రాంతములఁ బాలించు ధనంజయగోత్రులగు రాచవారితోను వారికి బాసటగావచ్చిన అనపోతారెడ్డితోను బలుమాఱు పోరాడినట్లు చరిత్రగ్రంథములవలనఁ దెలియుచున్నది. రాముఁడు పరశురాముఁఢు వలె అనపోతానాయకుఁఢు అనపోతారెడ్డి పరస్పర జిగీషువులై చిరకాలము సంగ్రామములతోఁ గాలయాపనము గావించుటయే యవననృపులు అనపోతనృపాలుని స్వాధీనములో నున్న దుర్గములలోఁ గొన్నింటి లోఁగొనిరి. క్రమముగాఁ దరతరములు విరోధము రెడ్డివారికి వెలమవారికి అభివృద్ధిలోనికి వచ్చెను. అనపోతనాయకుని యనంతరము సర్వజ్ఞ సింగభూపాలుఁడు రాచకొండ దుర్గమును జిరకాలము పాలించి శ్రీనాథమహాకవి, బమ్మెరపోతరాజులోనగు విద్వత్కవులకు నాశ్రయుఁడై యనేకోద్గ్రంథముల రచించుటకుఁ బ్రోత్సహించుటయే కాక తానుగూడ నుత్తమ గ్రంథముల రచించెను. అనపోతనాయకుని యనంతరము సుమాఱు నూటయిరువది సంవత్సరములవఱకు రాచకొండ వెలమవీరులగు రేచర్ల గోత్రీయులకు రాజధానిగ నుండెను. అనపోతనాయకుని పరాక్రమాతిశయమును దెలుపు చాటుపద్యముల నొక్కటినిమాత్రముదాహరించి వీరాధి వీరుఁడు, పరాక్రమశాలి, శూరవతంసము నగు నామహామహుని జీవిత చరిత్రమునకు శాంతి చెప్పుచున్నారము:-

సీ॥ అశ్వరేవంతుండు హయమును నెక్కిన
దండిరాజులగుండె తల్లడిల్లు
దరిని దర్భీకరకరవాలహతికిని
కర్ణాటసేనలు గళవళించు
సంగ్రామపార్థుని చాపటాంకృతులకుఁ
దెలుఁగురాజ్యం బెల్ల దిగులుచెందు
ప్రథననిశ్శంతుని బల్లెంపు డాకకు
నుల్కుల్కిపడుచుండు నొడ్డెరాజు
లరసి తఱిమినచో నుండఁదరము గాక
సొరిది సురరాజధానులు సొంపు దక్కి
యోటమందిరి సిందూరికోటబయల
సన్నుత ఖ్యాతి యనపోత మన్నెరాజు."

– ఆంధ్రపత్రిక ప్రభవ సంవత్సరాది సంచిక **(1927)**

11. రుద్రదేవుని అనుమకొండ శాసనము

కాకతీయ రాజులకుఁ దొలుత అనుమకొండ రాజధానిగ నుండెను. కాకతీయ ప్రోలరాజు స్వతంత్ర రాజ్యస్థాపనము గావించినది అనుమ కొండయందే. అనంతరము రుద్రదేవుఁడు కాకతీయ రాజ్యపునరుద్ధారకుఁడయి తండ్రి వేసిన పునాదులపైఁ గాక తీయాంధ్ర సామ్రాజ్య సౌధమును నిర్మించెను. రుద్రదేవుని కాలమున అనుమకొండయే రాజధాని నగరము. పద్మాక్షి దేవాలయము మొదలు సిద్ధేశ్వరాలయము వఱకు గల ప్రదేశయుమంతయు రాజభవనముగ నుండియుండును. రుద్రదేవుఁడు కొంతకాలమునకు ఆంధ్ర సామ్రాజ్యమునకు ముఖ్యస్థానముగ ఓరుగల్లును నేర్పాటు చేసియుండె ననుట సత్యము. రుద్రదేవుని చరిత్రము నెఱుంగ తగు సమగ్ర మగు శిలాశాసనము అనుమకొండలోని జీర్ణాలయమందుఁ గలదు. ఆలయపుఁ బూర్వనామము రుద్రేశ్వరము. ఆలయమునకుఁ గుడివైపున నున్న ద్వారమునం దీశాసనము భద్రపఱుపఁబడి దర్శనీయముగా నున్నది. ఆలయములోఁ బొక్కటి రాళ్లవలె మూఁడు గర్భాలయములు గలవు. అందు దక్షిణాభి ముఖముగా ఆలయమున వాసుదేవరను, కుడివైపు సూర్యదేవరను, ఎడమవైపు రుద్రదేవరను దొల్లి ప్రతిష్ఠించిరి. ఇపుడెడమవైపు గుడిలో నొకలింగము గలదు. మిగిలిన రెండు గర్భాలయములు లోఁ బీఠములు మాత్రము గలవు. అపూర్వ శిల్ప రమణీయమగు నీయాల యమున కెదురుగా వెయ్యి స్తంభముల మండపము గలదు. ఎదురుగ జక్కని నంది విగ్రహము గలదు. కుడివైపున గొప్ప కోనేరు, ఎడమవైపు వంటశాల గలవు. ఈ యాలయమునందలి శిల్పము అపూర్వ విలాసవంతమై దర్శనీయమైయున్నది. జీర్ణాలయముతో నీపాటి పరిచయము పాఠకులకుఁ గలిగించితిమిగాన నీయాలయమును ఆశ్రయించియున్న శాసనమును విమర్శించెదము.

శాసనము

నల్లని కురువిందశిలపైఁ జక్కఁగఁ జెక్కఁబడిన యీశాసన రాజము నేఁటివఱకు సురక్షితముగా నున్నది. నాలుగైదు తావులఁ గొంచెము చెడినను చరిత్రాంశముల నెఱుంగుటకెట్టి యాటంకము కలుగదు. లిపి మనోహరముగా వ్రాయబడియున్నది. శిల్పి తన నేర్పుఁజూపి వర్ణములను జక్కఁగఁజెక్కినాడు. శాసనము శిలకు

నాలుగువైపుల వ్రాయఁబడినది. అంతయు సంస్కృతశ్లోకములు అనుక్రమణిక మాత్రము తెలుఁగునందు వ్రాయఁబడినది. శాసనము స్థాపించినకాలము శా.శ. ౧౧౮౪ చిత్రభాను సం. మాఖశు ౧౩లు క్రీస్తు శ. ౧౧౬౦ అగును. శాసన గ్రంథకర్త భార ద్వాజగోత్రుఁడును, శ్రౌతకర్మ కర్మఠుఁ డును నగు రామేశ్వర దీక్షితుఁడు. సంస్కృత శ్లోకరచనమున నీతఁడు మిక్కిలి నేర్పరి. ధారయనన్యసాధారణముగా నుండును. ఈయన రచించిన యపూర్వగ్రంథములు గాని, ప్రత్యేక జీవితచరిత్రముగాని గ్రహింపనవకాశములు లేవు. సమకాలికుఁడగు రుద్రదేవునియొక్కయు, నతని తండ్రియగు ప్రోలరాజుయొక్కయు విజయ యాత్రాంశముల నీకవి కన్నులఁ గట్టునటులఁ జెప్పినాఁడు. ఈశాసనమునందుఁ బేర్కొనఁబడిన ప్రత్యర్థి వీరులచరిత్రములు సమగ్రముగా గ్రహింపవలసియున్నవి.

కాకతీయులు పశ్చిమచాళుక్యరాజులకడ దండనాయకులుగా నుండి క్రమముగాఁ బ్రభురాజ్యము క్షీణించుకొలంది స్వాతంత్ర్యము నార్జించుచు వచ్చిరి. రాజాను చారముగ వీరును వరాహలాంఛనులై నాణెములపై వరాహచిహ్నములు నెలకొల్పిరి. శాసనములలోఁ దొలుత వరాహస్మరణ గావించిరి. ప్రత్యర్థుల ఱొమ్ముపై వరాహముద్రలవేచిరి. తదనుసారముగ అనుమకొండ శాసనములోఁ దొలుత వరాహస్మరణము గలదు. ఈ శాసనము నందు త్రిభువనమల్లునివద్దనుండి వర్ణిన మారంభింపఁబడినది. త్రిభువనమల్లుని కుమారుఁడు ప్రోలరాజు. ఇతని భార్య ముప్పరు. ఈదంపతుల కుమారుఁడు రుద్రదేవ చక్రవర్తి. రాజధాని అనుమకొండ. త్రిభువనమల్లుని గూర్చిన వివరము లేవియు శాసనమున లేవు. ప్రోలరాజును గూర్చియు, నాతని పరాక్రమమునుగూర్చియుఁ జరిత్రాంశము లిందుఁ గొన్నగలవు. ప్రోలరాజు పరాక్రమజీవితము నెఱుంగుట కీయాధారములు సహకారి కాఁగలవు.

ప్రోలరాజు ప్రతిపక్షనాయకులు

ఖాజిపేట చెరువువద్దనున్న కన్నడశాసనమువలన గాకతీయవంశమునఁ బ్రోలరాజు గలఁడనియు, నతని కుమారుఁడు బేతరాజనియు, నితఁడే త్రిభువనమల్లుఁడనియుఁ, త్రిభువనమల్ల బేతిరాజనియు వ్యవహరింపఁబడెననియుఁ దెలియును. ఈ బేతిరాజు పశ్చిమ చాళుక్యరాజగు త్రిభువన మల్లదేవవిక్రమాదిత్య చక్రవర్తి వద్ద రాజప్రతినిధిగా నుండెను. ఈవివరము లీశాసనమున లేవు. రుద్రదేవుని తండ్రియగు ప్రోలరాజువృత్తాంతము, విజయములు మాత్రమె యీ శాసనమునఁ

బేర్కొనఁబడియున్నవి. ప్రోలరాజు క్రీ.శ. ౧౧౨౦ మొదలు ౧౧౩౯ వఱకు రాజ్యమేలియుండును. తైలపదేవుఁడు, గోవిందరాజు, గుండరాజు, జగద్దేవుఁడు, అనువారు నలుగురు ప్రోలరాజునకుఁ బ్రతిపక్షులు. తైలపదేవుని గూర్చి శాసనమునం దీక్రింది విధముగాఁ జెప్పఁబడి యున్నది.

శ్లో॥ హస్త్యారోహణకర్మకర్మఠగతిం చాళుక్యచూడామణిం
శశ్వద్యుద్ధనిబద్ధగహ్వరమతిం యుద్ధే బబంధ క్షణాత్
శ్రీమత్తైలపదేవ మంబుదనిభ స్తంబేరమస్థం క్షణాత్
ప్రఖ్యాతో రిపుకంఠఖండనవిధౌ భక్తానురాగా జ్జహౌ.

చాళుక్యవంశజుఁడును, గజారోహణకర్మఠుఁడును యుద్ధకౌశలుఁడును నగు తైలపదేవుని నేనుఁగుపై మండఁగనే బంధించి ప్రోలరాజు భక్తానురాగమున విడిచెనని పై శ్లోకమునకు భావము. ఈ తైలపదేవుడెవరో తెలిసి కొనవలసియున్నది. చరిత్రకారులీతఁ డెవరో నిర్ణయింపక చాళుక్యుల సమీపబంధువనియు, భావిపరిశోధన మున నది తేలుననియుఁ జెప్పిరి. పశ్చిమ చాళుక్యులకు సంబంధించిన శాసనములన్నియు ఓరుఁగల్లునకుఁ బైభాగమునఁ గళ్యాణపురమువఱకుఁ గలవు. తైలపదేవుఁడెవరో నిజాము రాష్ట్రమునందలి శాసనములు శోధించిన తేటపడును. తైలపదేవుని శాసనములు. మహబూబునగరములోని బూదపూరులోని ఆంజనేయాలయమునందును, గంగాపురము చెఱువుకట్టమీఁదను, నెక్కొండ సమీపముననను మేము గత సంవత్సర మేసవిలోఁ గనిపెట్టితిమి. తైలపదేవుని శాసనమొకటి నల్లగొండ చెంత పానుగల్లులో విష్ణ్వాలయములో బిగింపఁబడియున్నది. కొంతభాగమందు గోడలోఁ గలసిపోయినది. అందు "లబ్ధాతైలపదేవాఖ్యా త్తన యాశ్చక్రవర్తినః, లబ్ధాఖిలోర్వరంధ్యా... పరః, సమస్త గుణసంఘౌకః శ్రీమద్భూమండలేశ్వరః. ధర్మాయ ధార్మిక నిజాగ్రజ ధర్మభీమ... గోకర్ణబ్రహ్మపుర్యాస్థితిం అని తైలపదేవుఁడు భీమరాజు గోకర్ణుల నామము లొకచోఁగలవు. తైలపదేవుఁడు ప్రోలరాజుచే బంధింపఁబడి విడిచిపెట్టఁబడి రుద్రదేవునిచే మరణించెను. గోకర్ణుఁడు, భీమరాజు రుద్రదేవుని కాలములోని వారుగాన నిందుఁ బేర్కొనఁబడిన తైలపదేవుఁడె ప్రోలరాజు ప్రత్యర్థి. చాళుక్యచూడామణి యనుటఁబట్టి పశ్చిమచాళుక్య కుటుంబసంబంధి యని భావింపఁ జనును. ఇతఁడు త్రిభువనమల్లదేవుని వద్ద ప్రతినిధిగా నున్నట్లు పూర్వోక్త శాసనాదియందు గలఁ 'శ్రీపృథ్వీవల్లభ సత్యాశ్రయకుల

తిలకాచాళుక్యా భరణ శ్రీమత్త్రిభువనమల్ల దేవః కులశశిసార్వతో... లితాఖణ్డితారివర్గః, శ్రీమత్కల్యాణపురస్థిత నిజ విజయ స్కంధావారసుఖా స్తరస్ధం.' అనుభాగములు విశేషణ ములుగాఁ గైకొంటిమేని ధ్రువపడఁగలదు. ఈ తైలపదేవుఁడు పశ్చిమచాళుక్యుల రాజప్రతినిధిగా నుండి మహబూబునగరము చెంతనున్న కోడూరు రాజధానిగ నేలిన రాజు. ఈయంశము మహబూబునగరమునకు రెండు ఆమడల దూరములోనున్న నెక్కొండశాసనములో నీక్రింది విధముగాఁ జెప్పఁబడెను.

౧. "స్వస్తిసమస్తభువనాశ్రయ శ్రీప్రిథ్వీ

౨. వల్లభమహారాజాధిరాజపరమే

౩. శ్వర పరమభట్టారక సత్యాశ్రయకు

౪. ళతిలక చాళుక్యాభరణ శ్రీమత్రి

౫. భువనమల్ల దేవెర విజయరాజ్యముత్త

౬. రోత్తత్తరాభి ఉర్ధ్వి ప్రవర్ధమానమాచంద్రాక్కా తారాం?

౭. రసలుత్తమిరె శ్రీజయన్తి పురదనేలేవిదినోప

౮. సుఖసంకథావినోదధిం రాజ్యంగేయు త్తమిరె ఓస్వస్తిసలో

౯. ధిగతపంచమహాశబ్దమహామణ్డలేశ్వరం జయాంగనాధీ

౧౦. శ్వరనుపహసిత మనసిజర్యోత్తే త్రిలోకీలాళిత కీర్తిబేగీశ

౧౧. వంశదవదహనన స్తఖ్ఖురలోడయ పలినచోద కుళకులో దిని
చండలదేవి ప్రియుండు శ్రీమన్మహామండలేశ్వరకు
మార తైలపదేవర పట్టమహాదేవిలక్ష్మాదేవి
కుమార పెమ్మార్డిదేవర పట్టమహాదేవి బిక్కిదేవి
రాజధానికోడూరునుండి వచ్చినెక్కొండ
రామేశ్వరదేవరకు విక్రమశకవర్ష ౪౬ శ్రావణ బ 30"

పై శాసనమువలన తైలపదేవుఁడు జయంతి పురాధీశ్వరుఁడును పశ్చిమచాళు క్య వంశజుఁడునగు త్రిభువన మల్లదేవుని రాజప్రతినిధియని స్పష్టముగాఁ దెలియుచు న్నది. బేగీశవంశదహన యనుపదము వేగీశవంశదహనయను కొననగును. ఆవిశేషణము పశ్చిమచాళుక్యులకుఁ దూర్పు చాళుక్యులకుఁ గల విరోధాతిశయము

తెలుపును. విక్రమ శకము ౪౬ క్రీ.శ. ౧౧౨౨ అగును. ఇది ప్రోలరాజుకాలమెగాన నీతైలవదేవుఁడు పశ్చిమచాళుక్య రాజప్రతినిధి యుగుట సత్యము. బూదపూరుశాసనములో స్పష్టముగా నీతైలపదేవుఁడు వేంగీశ వనదవదహనుఁడని చెప్పుకొన్నాఁడు. అందీతైలపదేవుని యంశ మీ క్రింది విధముగాఁ గలదు.

(౧) ధాకర పరిజన సంపత్కర శ్రీమచ్చన్దల

(౨) దేవీనయన సరసిజసుయ్య ౯ నప్ర

(3) త్తిహరనాయ్యా౯ం గురుజనపదపరాగ

(౪) రాజితచాళుక్య కటక రక్షపాళనామా

(౫) ది సమస్త ప్రశస్తి సహితం శ్రీమ

(౬) న్మహామణ్డలేశ్వరం కుమారతైలపదేవ

(౭) దేవర పట్టమహాదేవి లక్ష్మాదేవియ

(౮) రుం కుమారం పెర్మాది దేవనుం బా ఈ

(౯) వనుం శ్రీకోదూరు పురదనేలే వి

(౧౦) విధనోళ సుభసంకథా వినోదాదిం రాజ్య

(౧౧) గెయ్యుత్తమిరె

ఇందలి శకాబ్దము, నెక్కొండ శాసన శకాబ్దము నొకటియె. తైలపదేవుడు చందలదేవి, లక్ష్మాదేవి యను రాణులకు భర్తయనియుఁ గోడూరు రాజధానిగఁ గల వాఁడనియుఁ గుమారుని పేరు పెర్మాడి దేవుఁడనియుఁ గోడలు బిక్కిమదేవియనియు నితఁడు ప్రోలరాజుచే సంగరరంగమున బద్ధుఁడై విడిచిపెట్టఁబడె ననియు నెఱుంగనగును. ఇంకఁగొన్ని తైలపదేవుని శాసనములు గలవు గాని విస్తరభీతిచే వదలుచున్నారము. కడ కీతైలపదేవుఁడు రుద్రదేవునిచే మరణించినది ముందుఁ దెలుపుదుము.

గోవిందరాజు

ప్రోలరాజు ప్రతిపక్ష వీరులలో గోవింద రాజొకఁడు. ఈతని చరిత్రము సవిస్తరముగా గ్రహింపనగు నాధారము లింతవఱకు లభింపలేదు. ఆంధ్రచరిత్రకారులీ గోవిందరాజును కొండపల్లి పాలించు వాఁడని చెప్పినారు. దూరము యోచించినచో

నితఁడు కంబము మెట్టు చెంతగల నేలకొండపల్లి పాలించు వాఁడనియు, నేల కొండపల్లినే పూర్వ శాసనములలో కొండపల్లి యని వ్యవహరించిరనియు మా విశ్వాసము. గోవిందరాజును ప్రోలరాజు జయించినటులుఁ దెలుపు శాసనశ్లోకము నిటనుదాహరించెదము.

శ్లో॥ యోకుంతారిపతే ర కుంత పరశుశ్లక్ష్ణాగ్ర ధారోల్ల స
ద్ధారాపాత నిపాతనైక చతురం గోవింద రాజాహ్వయం;
బద్ధ్వోన్ముచ్యతదోదయక్షితిభృతే రాజ్యం దదౌ లీలయా
లుంతాకో విషయస్యతస్య సమరే సద్వీర దీక్షాగురుః.

ఇందుఁ బేర్కొనఁబడిన గోవిందరాజు పశ్చిమ చాళుక్య త్రిభువన మల్లదేవుని పక్షమున నేలకొండపల్లి ప్రాంతమునకుఁ బాలకుఁడుగ నుండెను. ఉర్లుగొండ శాసనములో త్రిభువనమల్ల దేవుని మంత్రి నెమ్మన ప్రగడ యను బాణవంశజునకుఁ బుణ్యముగాను, కొండపల్లిలో భూమి దానము చేసితినని గోవిందరాజు శా.శ. ౧౦౪౫ అగు కార్తీక శుద్ధ ౬ సోమవారము నాఁడు (క్రీ.శ. ౧౧౨౩ లో) శాసనము వేయించెను. ఈ శాసనముచే గోవిందరాజునకు ప్రోలరాజు సమకాలికుఁడనియుఁ బశ్చిమ చాళుక్య రాజప్రతినిధియనియు, నేలకొండపల్లి పాలకుఁడనియుఁ దెలియును. గోవిందరాజును తొలగించి ప్రోలరాజు నిల్పిన రాజప్రతినిధియగు ఉదయరాజు బలనాటి చోడులలోని వాఁడనుట ప్రమాదము. పండిత గురు మల్లికార్జుననిచే శాపము నొందిన వాఁడును, పానుగల్లు పాలకుఁడును నగు ఉదయరాజు ప్రోలరాజు సమకాలీకుఁడు. ఇతఁడే గోవిందరాజు స్థానమున రాజప్రతినిధియై పేరొందెను. లుంతాక విషయము నల్లకొండ మండలము కావచ్చును.

ప్రోలరాజు ప్రతిపక్షులలో గుండరాజొకఁడు ఈతఁడు మహావీరుఁడు. ఈతని ప్రోలరాజు వధించిన విధ మీక్రిందిశ్లోకమునందు విపులముగా వర్ణింపఁబడియున్నది.

శ్లో॥ క్రుద్ధేనోద్ధుర మంత్రకూట నగరీం నాథాదయో నిస్త్రపో
గుండః ఖండిత ఏవ ముండితశిరాః క్రోడాంకవక్షస్థలః
ఏడోడింభకవత్పలాయనపరో జ్ఞాతో గతః స్వాం పురీం
ఆహూతోపి నృశ్వరస్య పురతః ప్రోలేన యుద్ధాయ యత్.

ఇందుఁ బేర్కొనఁబడిన గుండరాజు మంత్రకూట పాలకుఁడు. మంత్రకూటము నిజాము రాష్ట్రములో గోదావరీతీరమున నున్న మంతెన. నూజవీడు చెంతగల మంతెన

యనుట ప్రమాదము. నిజాములోని గోదావరి తీరస్థమంతెనకుఁ గాకతీయులనాఁట నుండి మంత్రకూటమని పేరుగలదు. గుండరాజుపేరుతోఁ గట్టఁబడిన గ్రామములు నేఁటికి నిజాము రాష్ట్రములోని మంతెనచెంతఁగలవు. ప్రోలరాజు గుండ రాజును జయించినపిమ్మట మంత్రకూట ప్రాంతమునకు రేచెర్ల గోత్రుఁడగు కామచమూపతిని రాజప్రతినిధిగ నియోగించెను. ఈతఁడె ప్రోలరాజుపక్షమున మంత్రి కూట ప్రభువగు గుండరాజును జంపెనని రామప్పగుడుల చెంత నీతని పుత్రుఁడగు రుద్రసేనాని శాసనము నెలకొల్పినాఁడు. అందలి ముఖ్యాంశమిది.

కామచమూపతిః

శ్లో॥ శ్రీమత్ప్రోలనృపాలసైన్యపతినా విఖ్యాత విక్రాంతినా
యుద్ధే యేన మహాబలేన నిహతే మంథన్య గుండాధిపే;
అన్యేవైరి నృపాలకాః ప్రతిదిశం ప్రాదు ధ్రువం స్తక్షణా
త్సింహేనేవ నిపాతితే గజపతౌ (?) శేషా గజాః క్షుద్రకాః.

గుండరాజు మంత్రకూట ప్రభువు. కాకతీయుల కాలములో రామారణ్యత్రిపాదు లనుయోగివర్యుండీ మంత్రకూటమునందె యుండెను. గుండరా జేశాఖకుఁ జెందినవాఁడొ, యెంతటి విస్తీర్ణ రాజ్యమున కధిపతియో యెఱుంగవలసియున్నది. ప్రోలరాజు గుండరాజుమీఁదికి దండయాత్ర కేఁగుతతీకామచమూపతి సంగర భారవాహుఁ డై గుండరాజును జంపి యుండుననియుఁ ప్రభువగుటచేఁ బ్రోలరాజావిజయము తానె వహించెననియు విశ్వసింపనగును. ప్రోలరాజు ప్రతిపక్ష వీరులలో జగద్దేవుఁడు మిగుల గొప్పవాఁడు. జగద్దేవుని ప్రతిఘటనము రుద్రదేవుఁ డీక్రింది విధముగాఁ దనశాసనములోఁ జెప్పుకొని యున్నాఁడు.

శ్లో॥ అన్యచ్చానుమకొండనామ నగరీం సంవేష్ట్యయోయం స్థితో
నానామండలికాన్వితో భువి జగద్దేవ స్సదేవప్రభః;
స్తబ్ధ స్తంభిత ఏవకార్యకరణే శక్తః క్షణాన్నిర్గతః
శ్రీమత్ప్రోలనృపస్య తస్య జయినః కిం బ్రూమహే గౌరవం.

ఇతఁడు మైసూరు రాష్ట్రములోని నగరమండల మునకుఁ జెందిన పట్టిపొంబుచ్చ పురాధీశుఁడనియు నింకఁ గొన్ని విశేషణములతో జగద్దేవుని వేఱొకనిగ నాంధ్ర చరిత్రకారులు పేర్కొనిరి. కాకతీయ రాజ్యమునకు వ్యాప్తి ప్రోలరాజు కాలమున మైసూరు

వఱకు లేదు. ఈ జగద్దేవుఁడు అనుమకొండకుఁ జేరువలోనున్న సామంతులఁ గూడఁ కలుపుకొని ప్రోలరాజును రాజ్యభ్రష్టుని చేయుటకు బయలుదేరియుండును. తుదకు విఫల ప్రయత్నుఁడై యింటి త్రోవఁ బట్టెను. జగద్దేవుఁడు పశ్చిమచాళుక్య రాజులకడ రాజప్రతినిధిగ నుండి ధర్మపురి వేములవాడ ప్రాంతములను బాలించు నొక మాండలికుఁడు. ఇతని శాసనములు కొన్ని నిజామురాష్ట్రమునఁ గలవు. అందొక దానిలోఁ బ్రోలరాజు జగద్దేవు నణఁచినటులఁ గలదు.

శ్లో॥ తత్పుత్రో భూద్దేవపాలనామధేయో ధియాన్నిధిః
జగద్దేవ మహీపాల పాలితస్సమ్మత స్సతాం
యస్థాది భక్తమాలక్ష్యా జగద్దేవాదనంతరం
కాకతీశః ప్రోలభూపస్యాధీరం పర్యపాలయత్.

౪౨వ నెంబరు ఆమనగల్లు శాసనము.

కరీమునగరమునకు ఎనిమిదిమైళ్ల దూరము నందున్న నగునూరులో నొకవీరశిలపై నాలుగువైపుల నాలుగు వీరి విగ్రహములు కలవు. అందొకవైపు విగ్రహము క్రింద నీవిధముగా నొకశాసనము వ్రాయఁబడి యున్నది.

౧. స్వస్తిశ్రీ సమస్త ప్రశస్తి సహితం
౨. శ్రీ మనుమహామండలేస్వరం
౩. దొమ్మెరాజులు శ్రీమచ్చా
౪. ళుక్య విక్రమగా....ద
౫. ఉత్తమ విన్యనాళ్కె నెయ్ద
౬. ప్రమాది సంవత్సరద వై
౭. సక భహుళ భధివెలు
౮. పుయమన సుక్రవర
౯. మునాడు మేడెరజుజ
౧౦. జగద్దేవడుం ఎనభఇ
౧౧. వేలుతోపొడిచి గెలిచె.

దీనివలన దొమ్మెరాజు మండలేశ్వరుఁడనియు, మేడరాజు జగద్దేవుఁడు నాతన సంబంధులు గానుండి ప్రతిపక్షుల యెనుబదివేల సైన్యముతోఁ బోరి గెలిచిరని

చెప్పఁబడెను. దొమ్మరాజు, మేడరాజు రుద్రదేవుని కాలములోని వారనునంశము ముందుఁ జెప్పనున్నారము. జగద్దేవుఁడు ప్రోలరాజు కాలములోనున్న యొక రాజప్రతి నిధియని దీనిచే స్పష్టమగుచున్నది. లేములవాడలో భీమేశ్వరాలయమున కెదుటనున్న శాసనమున జగద్దేవుని విషయము నిస్పష్టముగాఁ జెప్పఁబడియున్నది.

౧. స్వస్తిశ్రీ లేంబాలవాడ

౨. సమావాసోసమస్తప్రశస్తో

౩. పేత సమధిగత పంచమహా

౪. శబ్దాద్యలంకారఃక్రితః శ్రీమ

౫. హామండలేశ్వరంపొ

౬. వాకకులతిలకః శ్రీమజ

౭. గద్దేవర సరునుకచ్ఛశ ౧౦౩౧

౮. యయసర్వధారిసంవత్స

౯. రదవై శాఖసుద్ద చతుర్ద

౧౦. సి ఆదివారదందుహరీ

౧౧. శ్వరదేవరిగె.............

ఈ శాసనమువలన స్పష్టముగా నొక కాలమున[1] జగద్దేవునకు వేములవాడ రాజధాని యనియు నతఁడు విశేష రాజ్యమున కధికారియనియు శా.శ. ౧౦౩౧ సరియగు క్రీ.శ. ౧౧౦౯ లు ప్రాంతమునఁ బ్రోలరాజునకు సమకాలికుఁడు గానుండెననియు స్పష్టమగుచున్నది. పైను దాహరించిన శాసనమునందలి ప్రోలరాజు

---

1. ఈ జగద్దేవుఁడు గాక ఓరుగల్లు ప్రాంతమున నింక నిరువురు జగద్దేవులు గలరు. కొలనుపాకలో నొక జగద్దేవుఁడు కొన్ని శాసనములు వేయించినాఁడు. ఇతనిపేర శాసన సహిత మగు జయ స్తంభము కొలనుపాక చిన వాగుగడ్డవద్దను మరియొక శాసనము చండికాంబగుడి గోడలోను గలదు. ఇతఁడు ప్రోలరాజు సమకాలికుఁడే. బసవేశ్వరుని భక్తగణములోనివాఁడును బసవపురాణమున బేర్కొనబడిన వాఁడునగు జగదేక మల్లుఁడొకఁడు. ఇతఁడు వీరచూడామణి, ఈ జగదేకమల్లుఁడును ప్రోలరాజు కాలములోనివాఁడెగావచ్చును. మైసూరు మండలములోని జగదేకమల్లుఁడు కాకతిప్రోలరాజు ప్రత్యర్థియనఁజాలము.

ప్రత్యర్థి వీరులందఱు అనుమకొండ సమీప వాసులనియు, నిజాము రాష్ట్రము లోనివారనియు స్పష్టపడినదిగదా? రుద్రదేవుని ప్రత్యర్థుల గూర్చి విచారించుదము.

రుద్రదేవుని ప్రత్యర్థులు అనుమకొండ శాసనానుసారముగా, దొమ్మరాజు, మేదరాజు, మైళగిదేవుఁడు, భీమరాజు, [2] తైలపదేవుఁడు, కందూరు ఉదయచోడుడు అనువారు కనుపించుచున్నారు. జగద్దేవుని సందర్భమున దొమ్మరాజుపేరు నగునూరు శాసనమున స్పష్టపడినది. ఈ దొమ్మరాజు ప్రోలరాజుకాలమున బ్రతిపక్షిగనుండి రుద్రదేవుని కాలమునఁ బ్రతిఘటించి రాజ్యమును గోలుపోయినాఁడు. ఇతఁడు ధర్మపురి మొదలు భద్రాద్రి వఱకు గల దేశముపాలించు రాజు. భద్రాద్రి చెంతగల దొమ్మగూడె మీతనిపేరుతోఁ గట్టఁబడినదె. ఈతనిని గూర్చి, అనుమకొండ శాసనములో నిటులఁ జెప్పఁబడి యున్నది.

శ్లో॥ త్వంగత్తుంగ తురంగ పుంగవచయా రోహక్రమే కర్మఠం
దొమ్మం చారుపరాక్రమక్రమభరం భజ్యాసకృల్లీలయా;
కర్ణంపార్థ ఇవామలైః శర శతై ర్విద్రావ్యవిద్రావ్యయో
లేభే సర్వవిశేష యుక్తనగర గ్రామం సరుద్రో నృపః.

దొమ్మరాజు అశ్వమును నడిపించుటలో మిగుల నేర్పరి; పరాక్రమశాలి. ఈతని గూర్చి ప్రత్యేక శాసనములు కరీమునగరు, వరంగల్లు మండలములలోని గోదావరి తీరమున దొరుకఁ గలవు.

---

2. మూఁడవ తైలపదేఁవుడు కల్యాణ నగరమును రాజధానిగఁ జేసికొని కర్ణాటాంధ్ర దేశములు పాలించు చుండెను. ఇతని చివరశాసనము క్రీ.శ.౧౧౫౫లోనిదిగ బెలగాములో నున్నది. కాకతీయ ప్రోలరాజు క్రీ.౧౧౪౦ వఱకును, రుద్రదేవుడు తరువాతను బాలించిరి గాన నీమూఁడవ తైలపదేవుఁడు ప్రోలరాజు కాలమున బంధింపబడి యున్ముక్తుఁడగుటయుఁ బిమ్మట రుద్రదేవునిచే వధింపఁబడుటయుఁ బొసఁగియున్నది. రుద్రదేవుఁడు తన రాజ్యమున కొక హద్దు కటకమని చెప్పినాఁడు. ఇదియె కళ్యాణపురి. దీనిచేఁగూడ మూఁడవ తైలపదేవుఁడు ప్రోలరాజు రుద్రదేవులకు లోఁబడినవాఁడని తేలును. అనంతరము తైలపదేవుని రాజ్యమును బిజ్జలుఁ డాక్రమించు కొనెను. చాళుక్యచూడామణి బిరుద మితనికిఁ దగియున్నది. కాకతీయుల ప్రత్యర్థి యీమూఁధవ తైలపదేవుఁడను కొనుటకు ఆకరములు గానరావు.

శ్లో॥ ఈడే మేడవిడంబడంబర భర
క్షోదక్షమంక్ష్మాభృతాం
దుర్వారోద్ధుర వీరమన్త్ర సమయా
దానైక దీక్షాగురుం
శ్రీమన్మేళగిదేవ సజ్జసమయ
ప్రోద్భూత దర్పాపహం
ప్రాప్త శ్రీపొలవాసదేశ విభవం
శ్రీరుద్ర దేవం సదా.

– భారతి – శుక్లచైత్రం (1929)

12. గంగాధరుని శిలాశాసనము

హనుమకొండ కాకతీయరాజులకు ఓరుగంటికంటె ముందు రాజధానిగ నుండెను. ఇచటఁగల శిలాశాసనములలోఁ బద్మాక్షిగుడి శాసనము, ప్రోలరాజు శాసనము, రుద్రదేవుని శాసనము ప్రకటితములు. ఈ ప్రాచీన నగరములో శిలాశాసనములను వెదకుతఱి బాలసముద్రములో మొదలు చివరలేని శాసనఖండము దొరికినది. అది దాదాపుగ నిరుపయోగస్థితిలో నుండెను. దీనికి సంబంధించిన శకలములకొఱకు వెదుకఁగా వెదుకఁగా రెండు సంవత్సరముల ప్రయత్నఫలితముగ సిద్ధసాగరమను తటాకములో పఱుపుఱాళ్లలోఁ బ్రకృత శాసనము గోచరించినది. ప్రాఁకుడుపట్టియున్న ఈ శిలను శాసనమని గుర్తించుటలోను దీనిని గొనివచ్చి గ్రంథాలయావరణమున భద్రము చేయుటకును స్థానిక ప్రముఖులను న్యాయవాదులునునగు అస్మన్మిత్రులు తూము వరదరాజులుగారు మిగులఁ దోడ్పడిరి. శాసనప్రకటనమునకు ముందు వారి శ్రమకుఁ గృతజ్ఞత దెలుపుట మా ప్రధాన కర్తవ్యము.

ఈ శాసనశిలకును బాలసముద్రములోని శాసనశిలాఖండమునకును జత కుదిరినది. ఇంకఁ గొంతభాగము లభింపవలసియున్నది. ఇంతలో హనుమకొండ నుండి ఈ విలేఖకునకు దూరస్థలమునకుఁ బరివర్తన మగుటచే మిగిలిన శాసన భాగములు వెదకుటకు వీలు గలుగలేదు. అచ్చు దీసితిమిగాని శాసనశిలలు అరిగియుంటచేఁ బ్రతులు చక్కఁగా రాలేదు. శిలపయి సీమసున్నము పూసి మిగుల శ్రమపడి శాసనస్థములగు శ్లోకములను వ్రాసికొంటిమి. కాకతీయ చరిత్రమునకు సంబంధించిన అపూర్వచరిత్రాంశము లుంటచేఁ పరిశోధకులకు ఉపకరించునని దీనిని ప్రకటించుచున్నారము. ఈ శాసన మింతవఱకుఁ బ్రచురింపఁబడలేదు.

లిపి హనుమకొండ రుద్రదేవుని శాసనలిపిని బోలియున్నది. అక్షరము లంతగా లోతుగాఁ జెక్కనందునఁ దటాక జలపాతముచే రెండువైపుల అక్షరములు అరిగిపోయినవి. ఒక వైపు ధర్మరక్షణమునుగూర్చిన శ్లోకములును, ఇంకొకవైపు దేవప్రతిష్ఠాదికములను గూర్చిన వివరము లుంటచే విడిచి, చరిత్రమునకు సంబంధించినంతవఱకు మాత్రమె రెండు వైపుల నుండి పూర్తిగా వ్రాసితిమి. ఈ

శిలకు సంబంధించిన శకలమున రుద్రదేవుని విజయములును ప్రసన్న కేశవాలయప్రశంసయు మేడరాజును జయించిన యంశములును గలవు. దాదాపుగఁ బ్రకటితభాగమున కది పునరుక్తప్రాయము. ఇందలి చరిత్రాంశముల గమనింపుదము.

ఇంతకుమున్ను ప్రకృతశాసనకర్త యగు గంగాధరుని శిలాశాసనము నగునూరులో నుండఁగా రాజకీయోద్యోగులు దానిని కరీమునగరమునకుఁ గొనివచ్చి మండలాధికారి గృహమునఁ బాతివేసిరి. మేము కనిపెట్టినయది తెలంగానాశాసన సంపుటములోఁ గాకతీయ శాసనములలో ౬- వదిగా కరీమునగరము శాసనమను పేరఁ బ్రకటింపఁబడినది. ఆంధ్రుల చరిత్రములో ఐదవ సంపుటములో నీశాసనము కొంతవఱకు విమర్శింపఁబడినది. కరీమునగర శాసనము పద్యమయము. ప్రకృత శాసనము శ్లోకమయము. శ్లోకకవిత మిగుల రమణీయముగా నున్నది.

వంశక్రమము:- విష్ణునాభి కమలమునుండి బ్రహ్మ జనించెను. బ్రహ్మకు అత్రియు నతనికి దత్తాత్రేయుఁడు జనించెను. తద్వంశమున వేంగీవిషయవర్తనుఁడగు కొమ్మన జన్మించెను. కొమ్మన కుమారుఁడు నారాయణుఁడు. నారాయణుని పుత్రుఁడు గోవిందుఁడు. గోవిందుఁడు తుర్కమాంబల కుమారుఁడె గంగాధరమంత్రి. గంగాధరుని పేరుగల భాగము పోవుటచే కరీమునగరు శాసనము నుండి నామమును దీసికొంటిమి.

రెండవ వైపునఁగల శాసనశ్లోకముల వలనఁ గొన్న క్రొత్త చరిత్రాంశములు తెలియుచున్నవి. మేడక్షితిపాలుని నుండి చక్రకూట ప్రభువు మానకఖేటకారమును హరించెను. ఆ చక్రకూటప్రభువును రుద్రదేవుఁడు గజసంఘ యుక్తముగా జయించెను. మేడభూపాలుఁడు రాజ్యమును గోల్పోయి మాల్యవత్పర్వతము నాశ్రయించెను. రుద్రదేవుఁడు మేడరాజును రణరంగమున జయించి, యతనినగరము దహించి సేతువును ఖండించి తాలోపవనము పెరికివేసినాఁడు. మేడరాజు తన పూర్వులార్జించిన కీర్తిని అభిమానమును ఐశ్వర్యమునే గాక అడుగకున్నను రుద్రదేవునకు కాంధాతు నగరము నొసంగెను. రుద్రదేవుఁడు మేడరాజు యొక్క మదపుటేనుఁగులను రెంటిని గైకొనెను. తరువాత పులస్త్యనామ నగరమును రుద్రదేవుఁడు కాల్చుటయు నపుడు వెలువడిన పొగ మేఘమువలె నుండి నెమిళ్లకు అకాల వర్షాబ్దదర్శన వినోదము కల్పించుటయు వర్ణింపఁబడినది. పులస్త్య నామనగరము పొలవాస. ఇది జగిత్యాల తాలూకాలో నున్నది. మేడరాజు మేడవరము

పాలించురాజు. ఇది ఒరంగల్లు చెంత పాకాలతాలూకాకుఁ జేరువలోని కురువపట్టెలో నున్నది. రెండవ శిలాఖండములో "దాసీవమేడక్షితపాలలక్ష్మీః యస్యాంగణం సించతి నిర్వ్యళీకా" అను శ్లోక భాగముగూడ మేడరాజును రుద్రదేవుఁడు జయించుట బలపఱుచుచున్నది. ఇందుఁ బేర్కొనఁబడిన చక్రకూటవిషయాధీశ్వరుఁడు కన్నరదేవరాజునకు జగదేకభూషణ వీరసోమేశ్వరునకు మధ్యనున్న ఒకానొక రాజు కానోపు! మొదటి ప్రోలరాజు చక్రకూటము జయించినట్లు ఖాజిపేటదర్గ శాసనమునఁ గలదు. రుద్రదేవుఁడును చక్రకూటము జయించె ననుసంగతి ప్రకృతశాసన మెఱింగించుచున్నది.

కరీమునగర శాసనమువలన గంగాధరుని చరిత్రము గ్రహింపవీలగుచున్నది. ఈతఁడు విద్యాబుద్ధులు నేర్చి పరిణయానంతరము వేఁగి దేశములోని వెల్లఁకినుండి హనుమకొండకుఁ జేరినాఁడు. ఘోరతరాజిలోలుడు అకుటిలచిత్తుఁడునగు కాకతి ప్రోలరాజు ఇతనిని నగరపాలకునిగా నియోగించెను. ప్రోలరాజు పరోక్షమున అన్మకుండాపుర నాథుండగు రుద్రభూపతి చేత అమాత్యసంపద, నియోగవృత్తి, దళము, సితాతపత్రము భూషణాదికములు బడసెను. దొండందు అను నగ్రహారము బ్రాహ్మణుల కొసంగి అందు త్రికూటశివాలయము చెఱువు ప్రతిష్ఠించెను. ఇది జనగాము తాలూకాలోని తొండ అనుగ్రామము కావచ్చును. హనుమకొండలోఁ బ్రసన్న చెన్నకేశవస్వామిని రుద్రేశ్వరము చెంతఁ బ్రతిష్ఠించెను. ఈ ప్రసన్న కేశవాలయము పుర మధ్యమునఁ గలదని చెప్పఁబడెను. ఇపుడా యాలయము లేదు. ప్రకృత శాసనము ప్రసన్న చెన్నకేశవ ప్రతిష్ఠ తెలుపునదె. హనుమకొండలో పున్నేశ్వరాలయము చెంగట శివాలయము నెలకొల్పి త్రిమూర్తులఁ బ్రతిష్ఠించెను. గంగారాయ చెఱువుకడ కేశవుని బ్రతిష్ఠించెను. ఇపుడీ యాలయములు నశించినవి. హిడింబ తీర్థమునఁ బెక్కు దేవళము లంతకుముందె గలవు. గంగాధరుఁ డచట విష్ణుని ప్రతిష్ఠ చేసెను. హిడింబ తీర్థమన ఓరుగల్లు చెంతగల మెట్టు రామప్పగుట్ట. హిడింబ క్షేత్రప్రశంస ప్రతాపరుద్రీయ నాటక ప్రకరణమునను ప్రతాపచరిత్రమునను గలదు పట్టశాలలో జినోహరి అను ధర్మముచే జైనాలయము కట్టించెను. సంవర్తకేశ్వరమున శివాలయములు తటాకములు, హనుమకొండలో రుద్రేశ్వరము చెంత శివ విష్ణు దేవాగారములు, మంత్రకూటమున శివాలయము, నగునూరిలో చతుర్వింశతిమూర్తులు గల జైనాలయము విష్ణుదేవాలయము నెలకొల్పెను. ఇంతియగాక గంగాధరుఁడు సప్తసంతానములు

బడసెను. నగునూరులోని దేవాలయములు మనోహరములగు శిల్పములతో నీతని మహోన్నతిస్థితికి దార్కాణగా నున్నవి. హనుమకొండలో రుద్రదేవుని కాలమున గంగాధరుఁడు "తటాకసేతౌ గిరిమస్తకేచ సమ్యక్ ప్రతిష్ఠాప్య శివస్య లింగం" అను సూక్తులచేఁ జెఱువు కట్టపయినను శైలశిఖరముననను శివాలయములఁ బ్రతిష్ఠించినట్లు కలదు. తటాకముపయి గల శివాలయము అంతరించినది. గిరిమస్తకమున శివాలయపు గుర్తులు సైతము లేకున్నవి.

కాకతీయసామ్రాజ్యము పాలించిన రుద్రదేవునకుఁ బ్రధానమంత్రియై జినధర్మములకుఁ బ్రాణభిక్ష నొసంగుచు శివాలయములు విష్ణ్వాలయములు నెలకొల్పి సప్తసంతానములఁ బడసి విజయలక్ష్మిని రాజేంద్రునికి గైవశము చేసిన గంగాధరమంత్రి చరిత్రమును గ్రహించుటకు శిథిలదేవాలయములు రెండు శాసనములు మాత్రము మిగిలినవి. ఆతఁ డొందినకృతి యేనాఁడో అంతరించినది. ఈతని యభిమాన స్థలమగు నగునూరు కరీంనగరమునకు నాల్గు క్రోశముల దూరములో నున్నది. అచటఁ గల మహాలయములు సందర్శించినచో నితని మహోన్నతస్థితి కొంతవఱకేని గోచరింపఁ గలదు. మ.ఘ. నిజాము దొరతనమువారి నివేదికలయిందును కాకతీయసంచికయందును గంగాధర నిర్మితాలయ ప్రతిబింబము గలదు. ఇతరత్ర పేర్కొనఁబడని రుద్రదేవుని విజయములు, మేడరాజు వృత్తాంతము, సందిగ్ధముగానున్న పాలవాన విజయము, చక్రకూటాక్రమణము ప్రకృతశాసనమువలనఁ దెలియుటచే నీ శాసనము మిగుల విలువగలది. ౧౯౩౭ సం॥ మే నెలలో ఈ శాసనము గుర్తింపఁబడినది.

మొదటివైపు

1. స్వస్తిశ్రీ జయశ్చాభ్యుదయశ్చ॥ జయతి ము
2. రరిపుః సయ్యన్యదంష్ట్రాంకుర.... మధీశయు
3. వరాహరూపభాజః విభాఖిలముకుళ్యాగ్రనం
4. గినీవ భ్రమరీవ దోరధికం రరాజ పృథ్వీ॥
5. నాభీసర స్యుదభ న్మదుకైటభారే రంభోరుహా
6. (న్వి)తధృతిః సమభూచ్చ౯ తత్ర॥ సామన్యనైమ్ము౯ఖ
7. చతుష్టయనిగ్గ౯తైయ్యు౯ఃపద్మాదిభిః భ్రమరవన్నిత

8. రాం విభాతి। నిశ్శేష వేదనివహైకనివాసభూమి స్త
9. త్తాత్మజః సమభవన్ముని ర(త్రినామా। ఉజ్జీవయన్న
10. (యన)మీశవిలోచనాధిదగ్ధం యదీయనయనాత్స
11. మజాయతేందుః॥ యస్య ప్రసాదాత్ క తవీ
12. య్యా౯సూను బ్బా౯జాసహస్రేణ శశాన పృథ్వీం
13. మురారిమూత్తి౯ః కిలసాపి దత్తాత్రేయాభిధో
14. యస్య బభూవ సూనుః॥ యత్కోపశాపాక్షరమా
15. త్రకేణ నిశ్శ్రీకమాసీత్సుర రాజరాజ్యం। దువ్వా౯స
16. సప్తస్యపురత్రయారిమూత్తి౯ః పితాయశ్చ జగత్ప్ర
17. సిద్ధః॥ పతివ్రతాశాపనిరుద్ధచండ భానూదయా
18. త్థ౯ం సముపాసితాచ। విరించి నారాయణచంద్రచూ
19. డై య్యా౯స్యానసూయాకిల ధమ్మా౯పత్నీ॥ వెల్ల క్యాఖ్యా
20. గ్రహారస్య వేంగీవిషయవత్తి౯ని। వంశః ప్రేమవృ తో భూ
21. యా౯ శ్రుతిశీలసమన్వితః॥ సమభవదధవం శేతత్రని
22. స్సీమసత్వః సకలవిబుధవగ్గ౯ః సమ్మతః కొమ్మరా
23. జః। చిరతరమధితస్థు బ్బా౯ంధవా యస్యగేహేక
24. మలవనమివోచ్చైహంసవగ్గా౯సుఖేన॥ నారాయ
25. ణ స్తస్య సుతో బభూవ పారాయణ స్సజ్జనమండ
26. లస్య। సౌజన్యపీయూషరసేన యస్య సంవద్ధి౯తో
27. మానతరుబ్బు౯ధానాం॥ నిఖిల జగదమందానంద బృందో
28. పకారీ సమజని చ తనూజ స్తస్య గోవింద రాజః ।
29. రజతగిరిహిమాంశుస్పర్ధి౯ నీయస్య కీత్తి౯ స్త్రిజగతి
30. నిజబంధూన్వ్రతాసాధితోచ్చైః। సాధ్వీతురుకమా
31. భిఖ్యా గృహిణీ తస్య చాభవత్। యానసూయా భత్త౯రి

రెండవ వైపు

1. యస్య ప్రతాపహుతభుక్శిఖయావలీ
2. ధా। ముంచంతి నైవ జగతాం మహితక్షితీ

3. శా॥ జహార యో మాన్యకఖేటకారనా

4. మాపి మేదక్షితిపా ద్బలేన। తచ్చక్రకూ

5. టక్షితిపాల ముచ్చై జ్జర్గాయ యత్త

6. ద్విపసంఘ యుక్తం॥ నిత్యోదయః ప్ర

7. తిదిశః ప్రసరత్ప్రతాప శ్రీరుద్రదేవనృప

8. తిః సవితాచ నిత్యం। నీచాంగతిం దినకరో

9. భజతే కదాచిత్ కాకత్యవంశతిలకస్తు

10. సదోచ్చవృత్తిః॥ దహతు దహతు రు

11. ద్రో రాజధానీ మమాసౌ ప్రలయము

12. పగతాః కిం మాల్యవచ్ఛైలవృక్షాః ఇతి హ

13. నతి గిరిస్థో నిజ్జిర్తో యేన మేద

14. క్షితిపతి రతిమాత్రం కక్షవాద్యం వితన్వర్ బిభేదసే

15. తుం నగరం దదాహ జహార హస్తిద్వితయం

16. మదాంధం। ఉలావ తాలోపవనం హఠేన

17. యో మేదరాజం సమరే విజిత్య॥ అని

18. చ్ఛన్నపి కాంధాతుం యస్మై మేదనృపో ద

19. దౌ। విభూతిం చాభిమానంచ కీతిర్ంచ కులసం

20. చితాం। క్రుద్ధో యత్ర పులస్త్య వాసనగరీ

21. ప్రోద్దామధూమావతీ శ్యామవ్యోమ వి

22. లోక్య చండపటహధ్వానం సమాకణ్ణ్యర్ చ సం

23. చింత్యాంబుధ రాగమం పునరపి వ్యాకీణ్ణర్ బ

24. హిర్వ్రజః సానందం ననృతు మ్మర్యూరనివహా

25. శ్శైలాగ్రరంధ్రస్థితాః॥ యో శ్యామాక తుషో

26. వవావవిధినా తత్వాసు విద్యా సదా య

27. ద్దోగ్గర్త్య విషణ్ణవల్లభ జనైగ్గార్ఢం సమాలింగితః॥

(తా.క. మొదటివైపు రెండవవైపు శాసనశిలలోఁ జిపరభాగములు లేవు.)

– ఆంధ్రపత్రిక ప్రమాది సంవత్సరాది సంచిక (1939)

13. భీమరాజు - గోకర్ణుఁడు

అనుమకొండలోని రుద్రదేవుని శాసనమువలన భీమరాజు, గోకర్ణుఁడు అను నిరువురు వ్యక్తులు మనకుఁ బరిచయులగుచున్నారు. వీరలెవరు? వీరి రాజధానియేది? వీరిని గూర్చిన ప్రత్యేక చరిత్ర మేది యను సంశయమునఁ దగిన పరికరములు నిజాము రాష్ట్రమునఁగల అజ్ఞాత శాసనసముదాయమున మరుగుపడియున్నవి. వాని నాధారముగఁ జేసికొని ఈ వీరపురుషుల జీవితచరిత్రము సంగ్రహముగాఁ దెలుపుటయే ఈ వ్యాసరచనోద్దేశము.

భీమరాజు పెద్దవాఁడు. అతని సహోదరుఁడు గోకర్ణుఁడు. వీరు ఆంధ్రచోడవంశమునకుఁ జెందినవారు. తమ కులగోత్రాదికములను వీరలిరువురును గలిసి మహబూబునగరు జిల్లాలోని అమరాబాదు తాలూకా మామిళ్ళపల్లిలోని నృసింహాలయమున నొకశాసనమున స్థాపించిరి. అందీ క్రింది చరిత్రాంశములు గలవు:

"తీవ్రాంశువంశతిలకః కలికాలకర్ణో
గోకర్ణ ఇత్యుదభవ ద్భువనైకవీరః,
యోమిత్రమండల అపత్రప ఏవయుద్ధే
ముక్తింగతేన ఘనరావ మృదే కదాచిత్.

ఉదభూ దుదయాదిత్య స్సత్యసంధ స్సుత స్తతః
చోడఖ్యాతిమయీ యస్య మయూఖవితతిక్షితౌ.
తస్య ధర్మసుతం దేవ ధార్మికత్వం కిముచ్యతే,
ప్రాప్తాయుద్ధే మృతే యస్యా మిత్రైః పుణ్యాంకురై రివ.

అధ తత్పృతి నక్షత్రగణ ప్రగుణ తేజసః,
భీమగోకర్ణ భూపాలౌ సూర్యచంద్రా వినోదితౌ
నిస్సీమ ప్రేమబంధేన సమానస్సుఖయో ర్యయోః,
ఐకాత్మ్యంమన్యతే లోకాః యధాపురమురద్విషోః"

ఈ శాసనమునందుఁగల చరిత్రాంశము లింతవఱకె. శతాబ్దము లేదు. "విళంబి

కార్తికేమాసే విశుద్ధేద్వాదశితిథౌ" అని సంవత్సరాధికము మాత్రము సూచింపఁబడినది. పై శ్లోకముల వలన ఈ క్రింది వంశవృక్షము ఏర్పడుచున్నది.

సూర్యుని వంశమునందు గోకర్ణుఁడు

|

ఉదయాదిత్యుఁడు

|

భీమరాజు — **గోకర్ణుఁడు**

భీమరాజు తుమ్మటి గ్రామమునందలి కాలువను, గోకర్ణుఁడు మండిగంటి గ్రామ భాగమును నృహరికి సమర్పించిరి. ఇందు మూలపురుషుఁడగు మొదటి గోకర్ణుఁడు కలికాలకర్ణుఁడు చోడవంశమునకుఁ గీర్తికలిగించినాఁడు. గోకర్ణచ్ఛందస్సు, నాగేంద్రుని శిష్యత్వము లోనగునని ఈమొదటి గోకర్ణునకు సంబంధించినవి కావచ్చును. ఉదయాదిత్యుఁడు చరిత్ర ప్రసిద్ధుఁడు. రుద్రదేవుని శాసనమునందు ప్రోలరాజును ప్రశంసించు భాగమున ఈ యుదయరాజు ప్రశంస యీ క్రిందివిధముగాఁ గలదు:

> **"యోకుంతారిపతేరకుం కుంతపరశుశ్లక్ష్ణా గ్రధారోల్లస**
> **ద్ధారాపాతనిపాతనైకచతురం గోవిందరాజాహ్వయం,**
> **బద్ధ్వోన్ముచ్యతదోదయక్షితిభృతే! రాజ్యం దదౌ లీలయా"**

ప్రోలరాజు వీరుఁడగు *గోవిందరాజును బంధించి విడిచివేసి యాతని రాజ్యమును ఉదయరాజునకు నొసంగెను. ఈ యుదయరాజే మామిళ్లపల్లి శాసనములోని ఉదయాదిత్యుఁడు. గణపేశ్వరము శాసనములోని ప్రోలరాజు ప్రశంసయందుఁగల "కేచిత్ స్వస్యపదేషుయేననిహి తా శ్చోడోదయ క్ష్మేశనత్" అనుభాగముగూడ నీ యుదయాదిత్యున కన్వయించునదే. ఆంధ్ర చోడవంశజుఁడును, వీరుఁడును నగు ఉదయాదిత్యుఁడు పశ్చిమచాళుక్య సామ్రాజ్యము క్షీణించిన పిమ్మటఁ

★ *ఈ గోవిందరాజు కందూరునకు ౨౦ మైళ్ల దూరమునగల అమ్మాపురము పాలించినరాజనియు, ఇతఁడు బలవంతుఁడై ఉదయరాజు రాజ్యమును హరింపఁగాఁ గాకతి ప్రోలరాజు వానిజయించి ఉదయావనీపతికిఁ దిరుగ రాజ్యము నొసంగెననియు కోపూరు భరతయ్యగారను పరిశోధకులు దెలుపుచున్నారు.*

గాకతీయ చక్రవర్తియగు ప్రోలరాజునకులోఁబడి రాజ్యము పాలించుచు రాజద్రోహియగు గోవిందరాజు శిక్షితుఁడైన పిమ్మట నతనిరాజ్యమునకుఁ గూడ ప్రభువైనాఁడు. ప్రోలునియనంతరము రుద్రదేవుఁడు రాజ్యమునకు వచ్చినపుడు ఉదయాదిత్యుని కుమారులగు భీమరాజు, గోకర్ణుఁడు పితృరాజ్యమునకుఁ బరిపాలకులైరి. కొంతకాల మీ సోదరులిరువురు ఏకభావముతో శివకేశవులవలెఁ గలసి యుండిరి. పిమ్మట నెవరికి వారుగఁ జీలి ధర్మములు గావించిరి. అందు భీమరాజుశాసనములు లభింపలేదుగాని గోకర్ణుని శాసనములు మాత్రము అందందు గోచరించుచున్నవి. గోకర్ణుఁడు దయా సత్యశౌచసంపన్నుఁడగుటచే దుర్మార్గుఁడగు భీమరాజును వ్యతిరేకించెను. తత్ఫలితముగా రుద్రదేవుని శాసనమునందలి ఈ క్రింది శ్లోకానుసారమున దుర్మరణము నొందెను.

"భీమేన భీమనకులేన కులేనహీనో గ్రస్తో మమార గృహమూషకవత్ క్షణేన,
మార్జారడింభకవరేణ మహాంధకారే గోకర్ణ నామభుజగో భువి శూరమానీ."

భీమరాజునకుఁ గల విశేషణములలో "హన్తా భ్రాతృవరస్య భోజనవిధా" అనునది యొకటి. కాన భీమరాజు గోకర్ణుని భోజన కాలమున నమ్మించి చంపినదె వాస్తవము. ఇంతటితో గోకర్ణుని చరిత్రము సమాప్తమైనది.

భీమరాజు సోదరుని రాజ్యము నాక్రమించుకొనినాఁడు. అంతఁ బోక పితృమరణానంతరము అతనిభార్యలలో నొకతెను (చవితితల్లిని) ఉంపుడుకత్తెను జేసికొనినాఁడు. దురాశాపరవశుఁడై పరరాజ్యము లనుఁ గైకొన్నాఁడు. చిన్న చిన్న సామంతరాజులఁ దిరుగఁదీసి కాకతీయ సామ్రాజ్యము నేలు రుద్రదేవచక్రవర్తికిఁ దిరుగఁబడినాఁడు. (చూ. అనుమకొండశాసనము ౨౦-౨౧ శ్లో) అంతియగాక రుద్రదేవుని పరాక్రమమునకు వెఱచి మరణించిన చోడోదయుఁడగు తైలపుని రాజ్యమును దనరాజ్యములోఁ గలుపుకొన్నాఁడు. అందులకై రుద్రదేవుఁడు భీమరాజును వధించి తద్రాజ్యము గైకొనవలసిన యవసరము తటస్థించినది. భీమరాజు రుద్రదేవుని ధాటికి వెఱచి మరణించిన తైలపదేవుని రాజ్యమును హరించెనని ఈ క్రింది శ్లోకమువలన స్పష్టపఱుపఁబడినది:

'యాతేఽపి తైలపనృపే దివమస్య భీత్యా సర్వాతి సారకబలీకృతగాత్రయష్టౌ,
శ్రీరుద్రదేవనృపతేః పృథువిక్రమస్య భీమోపి రాజ్యపదవీం క్షణికాం స లేభే.'

ఇట రుద్రదేవుని ప్రత్యర్థియై యాతనిధాటికి మరణించిన తైలపదేవుని వృత్తాంతము గ్రహించినగాని భీమరాజు చరిత్రము సంపూర్ణము గాదు. హనుమకొండ శాసనములో నొక తైలపదేవుని ప్రశంస ప్రోలుని చరిత్రమునఁగలదు. ప్రోలరాజు చాళుక్య చూడామణియగు తైలపదేవుని బంధించి భక్త్యనురాగములచే విడిచెను. ఈ చాళుక్య తైలపదేవుఁడును, రుద్రదేవుని ధాటికి వెఱచి మరణించిన తైలపదేవుఁడును భిన్నవ్యక్తులు.

ప్రోలరాజునాఁటి చాళుక్యచూడామణియగు తైలపుఁడు ఆఱవవిక్రమాదిత్యునకు మనుమఁడు. మూఁడవ సోమేశ్వరుని తనయుఁడు. ఈతనిని మూఁడవ తైలపదేవుఁడని యందురు. ఈ తైలపదేవుఁడు క్రీ.శ.౧౧౪౯ నుండి ౧౧౬౫ వఱకు రాజ్యమును బాలించినాఁడు. క్రీ.శ. ౧౧౫౬ లో కాలచుర్యవంశజుఁడును, సామంతుఁడును నగు బిజ్జలు నీతైలవుని రాజ్యము నూడలాగుకొని దూరముగఁబోఁదోలెను. అంత తైలపుఁడు తొలుత ధార్వాకమండలంలోని అన్నిగిరిలోను రాజ్యము నెలకొల్పెను. బిజ్జలుఁడచటకును వచ్చి ముట్టడించుట నారాజ్యము వదలివేసి ఇంకను దూరముగనున్న వనవాసిలో రాజ్యం నెలకొల్పి క్రీ.శ. ౧౧౬౫ లో మరణించినాఁడు. హనుమకొండ శాసనము క్రీ.శ. ౧౧౬౨ న నెలకొల్పఁబడినది. అండంతకు .. ముందు గతించినటులఁ జెప్పఁబడిన తైలపుఁ డింకొక వ్యక్తియై యుండును. ఆ వ్యక్తి రాజ్యము భీమరాజు ఆక్రమించుకొనుటకుఁ దగినదిగా నుండవలయును. ఉపలబ్ధములగు నాధారములచే నీ మరణించిన తైలపదేవుడెవరో తెలిసికొనుట కవకాశములు గలవు.

రుద్రదేవుఁడు అనుమకొండ రాజ్యమును బాలించుకాలమున చోడవంశజుఁడు, భీమరాజునకు జ్ఞాతికుటుంబములో వాఁడును తైలపదేవుఁడను రాజు కోడూరు రాజధానిగఁ జేసికొని పరిసర భూభాగములను బాలించుచుండెను. భీమరాజు రాజధానియగు వర్ధమానపురమునకు ఈకోడూరునకు నాలుగామడలదూరము. ఇరువురి రాజ్యమునకు సరిహద్దు ఒకటియె. త్రిభువనమల్లదేవుని సామంతుఁ చోడువంశజుఁడగు తైలపదేవుఁడు చందలదేవికి భర్త. వీని పట్టపురాణి లక్ష్మీదేవి. కుమారుఁడు పెమ్మాడిదేవుఁడు. కోడలు బూదపూరులోను, నెక్కొండయందును విక్రమశక వర్షములు ప్లవసంవత్సరము శ్రావణ అమావాశ్య ఆదివారమునందు శాసనము నెలకొల్పుచు తైలపదేవుఁడు తాను చోడవంశజుఁడననియు, కోడూరు

తన రాజధానియనియుఁ జెప్పుకొనినాఁడు. ఈ తైలపదేవుఁడు ఏ వంశదవదహన, ప్రోరమ శేయసరనాది బిరుదములను బూదపూరు నెక్కొండశాసనములలో సమముగఁ జెప్పుకొనెను. ఈ రెండు శాసనములందును కోడూరు తన రాజధానియనియు, కందూరులోని భూరామేశ్వరునకు దానముగ నిచ్చితిననియు వాకొనుటచే నీతఁడు రాయచూరుమండలములోని కొంత భాగమునకును, వర్ధమానపురము సరిహద్దులలో నున్న కందూరువఱకును రాజని తెలియును. ప్రోరమశేయయను విశేషణముచేఁ గాకతిప్రోలరాజున కీతఁడు ప్రత్యర్థిగ నిలిచి యాతని నెదిరించినకాతన యనంతరము రుద్రదేవునకుఁగూడ విరోధిగా బరిణమించెనని విశ్వసింపవచ్చును. కావుననే రుద్రభూవల్లభుఁడు పుని జయింపవచ్చి విజయము నొందెను. రుద్రదేవునకు వెఱచి చోడతైలపుఁడు మరణింపఁగనే సమీపమునమన్న భీమరాజు తైలపదేవుని రాజ్యమునంతయు నాక్రమించుకొనెను.

తైలపదేవుని నిర్యాణానంతరము భీమరాజు ఆతని రాజ్యమును. హరించెను. ఇది క్షణికము. ఈ యంశము చారులవలన విని భీమరాజు దుశ్చేష్టల నాలకించి యాతనిపైకి దండయాత్రకు రుద్రదేవచక్రవర్తిగా బయలుదేరెను. తొలుత రుద్రదేవుఁడు గొప్ప ప్రాకారముతో ఉత్తర దుర్గముగానున్న వర్ధమానపురమును ముట్టడించి దానిని దనకోప వహ్నిచే వేల్చివైచెను. ఈయంశము ఈక్రింది శ్లోకములలో హనుమకొండ శాసనమునందుఁ జెప్పఁబడెను:

> **"గత్వా జవా త్రిచతురాణి పదాని రాజా**
> **సస్యస్య ఖండన మివ ప్రథమాహుతింవా,**
> **భ్రూభంగవీక్షణ వివర్ధితకోపవహ్నౌ**
> **యద్వర్ధమాననగరీం ప్రథమం జుహోవ"**

రుద్రదేవుఁడు వర్ధమానపురమును ముట్టడించి ప్రతిపక్ష సైన్యమును జెండాడుట జూచి పరాజయశంకచే భీమరాజు రాజ్యమును, భోగభాగ్యములను విడిచి అవరోధకాంతలమ వెంటఁగొని లజ్జానిహీనుఁడై ప్రాణరక్షణము కొఱకు అరణ్యములకుఁ బోయెను. వర్ధమానపురము నందు భీమరాజు నేలలోని సొరంగమునుండి పోయినటుల నేఁటికిని గ్రామవాసులు కొన్ని దృష్టాంతములను జూపుచున్నారు. రుద్రదేవుఁడు కొంతదూరము భీమరాజును నెన్నంటి యాతఁడు గనఁబడక పోవుటచే వెనుకకు మఱలి చోడోదయుఁడనఁబడు భీమరాజు నగరము

దహన మొనరించి నగరమధ్యమునఁగల యుద్యానవనము నూడబెరికించి దుర్గమును భేదించి నగర ప్రాకారమును గట్టఁ జేసి నగర మద్యమునం దొక గొప్పతటాకము నేర్పఱచి విరోధికి ఆనగరము మరల ఆశ్రయము గాకుండఁజేసెను. శిధిలమగు వర్థమానపురమును నేఁటికిని రుద్రదేవుని పరాక్రమచిహ్నములు గోచరించుచున్నవి.

కందూరు తొలుత తైలపదేవుని రాజ్యములోని దగు కోడూరునకు శాఖానగరము, తైలపదేవుని మరణానంతరము భీమరాజానగర రాజ్యమును ఆక్రమించుకొని పూర్వరాజకుటుంబమును నిర్బంధమునం నుంచి కాకతీయరాజ్యమునకు ఎదురుతిరిగెను. రుద్రదేవుఁడు వర్ధమాన నగరము నాశనము గావించిన పిదప చోడుదయుల కాశ్రయముగా నున్న కందూరు జయించి యచటి సర్వభాగ్యములను జూరగొని తైలపదేవుని పుత్రికయగు పద్మావతిని బరిగ్రహించెను. రుద్రదేవుని ధాటికి వెరచి తైలపదేవుఁడు మరణించుటచే నాతని భార్యలు సహగమనము గావించిరి. కోదూరులో ఈ సహగమనస్థలమున నొక స్థూపముగట్టి యాతని వంశజులు గతించిన వీరుల జ్ఞాపకార్థముగ వీర విగ్రహములను స్తూపముచుట్టును బ్రతిష్ఠజేసిరి. నేఁటికిని కోడూరులో నీ వీరవిగ్రహములు గల భాగము పూజనీయప్రదేశముగల “బిందమనుపేర” బవిత్ర స్థలముగ భావింపఁబడుచున్నది. తైలపదేవునితో కోదూరు కందూరు రాజ్యములను, భీమరాజుతో వర్ధమానపుర రాజ్యము అంతరించి కాకతీయ సామ్రాజ్యములోఁ గలసిపోయెను. ఇంతతో నీ యాంధ్రచోడుల రాజ్య మంతరించుటచేఁ దద్వంశజులు కాకతీయరాజ్యమున కంకితులై రాజకీయోద్యోగులుగ మారిపోయిరి. మహబూబు నగరమండలము నుండి వనపర్తి సంస్థానమున కేగు త్రోవలో 30 మైళ్లపైన కందూరు బుచర్ల నుండి నాగరకర్నూలు పోవు త్రోవలో ౨౦ మైళ్లపైన వర్ధమానపురము మహబూబునగరు రైలు స్టేషనునకు బ్రక్కటిగ కోదూరు నేఁటికిని నాఁటి చరిత్రములకు జ్ఞాపకచిహ్నములుగ నున్నవి.

భీమరాజు చాళుక్యుఁడగు మూఁడవ తైలపుని జయింపవేగినటులఁ జరిత్రాధారములు లేవు. బిజ్జలుఁడు స్వతంత్రుఁడై కల్యాణనగరమున రాజ్యము నెలకొల్పియుండ నాతనిఁ దిరస్కరించి యావల నెందో నూతనరాజ్యము నెలకొల్పిన తైలపదేవుని జయింప భీమరాజు పోవుటగాని, క్రీ.శ. ౧౧౬౫ వఱకు జీవించిన మూఁడవ చాళుక్యతైలపుఁడు క్రీ.శ. ౧౧౬౨ లోని రుద్రదేవుని శాసనము నాఁటికి మరణించుటయుఁగాని బొనుగదుగాన సరిహద్దులలో జ్ఞాతులగు చోడతైలపదేవుఁడు,

భీమరాజులతో రుద్రదేవుని శాసనాంశములకు సమన్వయము కుదురుచున్నది గాననిదియె విశ్వసింపఁదగు మార్గము. భీమరాజు అడవుల పాలగుటతోఁ జోడరాజ్యమంతయుఁ గాకతీయుల హస్తగతమయ్యెను. మల్యాలవంశజులగు దన్న సేనానాయకుఁడును, అతని కుమారుఁడగు జావసేనానియుఁ జోడరాజ్యమునకుఁ, గాకతీయ సామ్రాజ్యమునకుఁ బ్రతినిధులుగ రుద్రదేవునిచే నియోగింపఁబడిరని బూదవూరులోని గుండయసేనాని శాసనమువలన గ్రహింప వీలగుచున్నది.

నల్లగొండ యొద్ద గల పానుగంటిలో నొక శాసనఖండము లభించినది. అడ్డముగా వ్రాయఁబడిన ఆ శాసన శిలయందుఁచివరభాగము విరిగి పోయినది. అందుచే నందలి శ్లోకము లసంపూర్ణములుగ నున్నవి. అందుండి యీక్రింది చరిత్రాంశము నిర్ణయింప వీలగుచున్నది.

సోమరాజు భార్య బెడగాదేవి

పుత్రి మేలాంబిక

1. ఉదయాదిత్యుఁడు **2. భీమరాజు** **3. గోకర్ణుఁడు**

ఇందుఁగల మేలాంబిక యెవనిభార్యయో తెలియదు. ఉదయాదిత్యుఁడనువాఁడు పానుగంటి రాజ్యమునకుఁ బాలకుఁడుగా నుండి పండితారాధ్యులనఁబడు మల్లిఖార్జున పండితారాధ్యులను ద్వేషించి శాపగ్రస్తుఁడై మరణించినటుల పాలకురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రములోనఁగల యీక్రింది భాగములవలన మనము గ్రహించ వచ్చును.

కాదింక నీ పానుగంట నుండఁగ మ
హాదేవుభక్తుల కనుచుఁగట్టలుక
మసలక పండితమల్లికార్జునుఁడు
వెసఁదలిర్పఁగఁ బురివెడలంగ వెనుక
నక్కజంబుగఁ బూచె నంతకల్పొన్న
కొక్కొరో కుఖ్ఖని కూసె కల్కోడి
పురిమహోత్పాతముల్ పుట్టె వెండియును

పురము పొదగునని బుధులుగలంగ
విదితశాపోద్ధతవిలయోగ్రవహ్ని
కుదయావనీకుఁ దాహుతియయ్యెఁ బుత్ర
పాత్రులన్యోన్య కళత్రాభినిరతి
శత్రులై చీఁకటి చప్పరంబులను
దడయ కాసురియచేఁ దన పురిజనము
లడరంగ నిర్మూలమై రట్టుగూడ
సంతానమెల్ల నిస్సంతాన మయ్యె.

మహిమప్రకరణము, పుట ౩౦౧.

పండితారాధ్యుల శాపముచేఁ బానుగంటి ఉదయరాజు కుటుంబము నిశ్శేషముగ నశించినది. ఉదయరాజు శాసనము తర్కాబ్ధిదిఙ్మితే కాలేయసుటచే శా.శ. ౧౦౪౬ క్రీ.శ. ౧౧౨౪ అగుచున్నది. నిస్సంతతిగా నశించిన యీ కుటుంబము కాకతిరుద్రదేవుని ప్రతిపక్షివర్గమునకుఁ జెందినదికాదు. కాన నీ వంశమునకును వర్ధమానపురము బాలించిన భీమరాజు గోకర్ణుల వంశమునకును ఎట్టి సంబంధము లేదు. రెంటికిని గూటస్థులలోఁగూడ వ్యత్యాసము గలదు. కె.వి.లక్ష్మణరావు పంతులువారు మల్లికార్జున పండితారాధ్యుల నాఁటి ఉదయరాజాదులు వనపర్తి సంస్థానముచెంత గల పానుగంటి పాలకులనిరి గాని యాపానుగంటి చోడోదయుల శాసనములు, రాజ్యచిహ్నములు లేవు. ఉదయచోదుని శాసనములు ఉదయ సముద్రము, ఉదయచోడ సోమేశ్వరాలయము గల్గి చోడులకు రాజధాని యని శాసనాదులచే నెఱుంగఁబడు నల్లగొండ చెంతఁగల పానుగల్లే పండితుని ప్రత్యర్థి యగు ఉదయచోడుని రాజధాని.

భీమరాజు శాసనములు ప్రత్యేకించి లభింపకున్నను నాతఁడు పరాక్రమశాలియగు గొప్ప రాజు. తన తండ్రియగు ఉదయరాజు కాకతి ప్రోలరాజునకు లోఁబడి యాతఁడొసంగిన రాజ్యమునకుఁ బ్రభువగుట తన వీరత్వమునకుఁదగని దిగఁదోఁచెను. కాననే రుద్రదేవుని కాలమున స్వతంత్రపతాకము నిలుపఁబెట్టి వర్ధమాననగరము రాజధానిగఁ జేసికొని బలసంపత్తి మిగుల నభివృద్ధిపఱచెను. ఓరుగంటి మంటికోటకు సమానముగఁ దననగరికి మంటికోటగట్టి యగాధమగు పరిఘ త్రవ్వించెను. రాజధానిలో మనోహరశిల్పములు గల ఆలయములను చెక్కించి

గట్టించెను. కాకతీయుల నెదుర్కొననియ్యకొనని తన సోదరుఁడగు గోకర్ణుని వధించి నిరంకుశపరిపాలనము స్థాపించెను. ఇది జూచి తైలపదేవుఁడును కోడురు పాలకుఁడు సైతము కాకతీయ రుద్రదేవుని నెదిరించెను. సామ్రాజ్యము విస్తరింపఁజేయు కాంక్ష గల ప్రతాప శాలియగు రుద్రదేవుఁ డిందులకు సహింపక తైలపదేవుని మృతుశరణ్యుని గావించెను. ఈయదను గ్రహించి సమీపరాజులను గలుపుకొని భీమరాజు సరిహద్దులలోనున్న తైలపుని రాజ్యమును లోఁగొని సమీపమునందలి కందూరిలో బలమునుంచి కాకతీయ సామ్రాజ్యమునే కబళింపఁదలఁపడెను. దైవబలము, స్థానికబలము చాలకుంటచే భీమరాజు ప్రాణభీతితో నడవులలో డాఁగి యుండి మరణింపవలసివచ్చెను. బూదవూరు, నెక్కొండలలోని తైలపచోడుని శాసనములు విక్రమ శకము ౪౬ లోనివికాన క్రీ.శ. ౧౧౨౧ నాఁటివి. గోకర్ణుని శాసనమొకటి ఏలేశ్వరమున లభించినది. అది విక్రమ శకము ౩౩ క్రీ.శ. ౧౧౦౮ లోనిది. ఇవి వీరల రాజ్యారంభమున నెలకొల్పఁబడిన శాసనములుగ నున్నచో రుద్రదేవుఁడు రాజ్యమును వచ్చిన క్రీ.శ. ౧౧౩౨ నాఁటికి ప్రత్యర్థులు నడివయస్సు దాఁటిన వారుగ నుందురు. అందుచే భీమగోకర్ణులు, తైలపదేవులు రుద్రదేవుని రాజ్యారంభమున నుండి ప్రత్యర్థి కోటిలోఁ జేరినవారను సమన్వయము కుదురును. భీమరాజు, గోకర్ణుఁడు మామిళ్ల పల్లి శాసనమునకు సంబంధిచిన వారనియు, వీరిరాజ్యము మహబూబునగరమండల మంతయు నావరించి దాదాపుగ శ్రీశైలమువఱకు వ్యాపించి దుర్భేద్యముగ నుండెననుట సత్యము. మహబూబునగర మండలములోని వర్ధమానపురము కందూరు, కోడూరు పరిసరములలో నీచోళవంశజుల శాసములు పెక్కులు మరుగుపడియున్నవి. అవి పరిశీలించినమీఁదట భీమరాజు చరిత్రము, రుద్రదేవుని విజృంభణము, గోకర్ణుని నిధనము గూర్చిన వివరము లింకను దెలియఁగలవు.

శ్రీయుతులగు జయంతి రామయ్య పంతులు వారు గోనగన్నారెడ్డి బంధుల రాయచూరుకోటపయి గల శాసనమును ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రికలోఁ బ్రచురించుచు వర్థమాన పురమును గూర్చి స్థలనిర్ణయము చేయటలో వర్ధమానపురము వర్ధమానకోటగ మారెననియు, అదియె యిప్పటి మానుకోట యను గ్రామమనియు వ్రాసియున్నారు. వర్ధమానపురము ఇపుడు వడ్డమానియని అపభ్రంశనామముతో మహబూబునగరమండలమున నున్నది. మానుకోట బెజవాడ నుండి హైదరాబాదు

పోవు రైలుమార్గములో మహబూబాబాదు అను నూతన నామముతో నొప్పుచున్నది. కాకతీయ రుద్రదేవుని కాలమునఁగల భీమరాజు రాజధాని మహబూబునగరమండలములోన సుప్రసిద్ధ చరిత్రస్థలమై వడ్డమానియనఁబడు వర్ధమాననగరమని చరిత్రాధారములచేతను, స్థల విశేషముల చేతను ఋజువగుచున్నది.

– ఆంధ్రపత్రిక ధాత సంవత్సరాది సంచిక (1936)

ఌఌ

14. భీమకవి నివాసస్థానము

కేశవరపు కామరాజుగారు భీమకవి జన్మస్థానమును గూర్చి భారతి సంపుటము పుష్య మధుమాసముల సంచికలలో నొకానొక వ్యాసమును వ్రాసి ప్రచురించిరి. ఆవ్యాసమును మూడుభాగములుగ బ్రత్యుత్తర సౌకర్యమునకు విభజింపవచ్చును. ఒక భాగమునకు మేము ప్రత్యుత్తర మొసంగవలసి యున్నది. మేము వ్రాసిన కాకతీయసామ్రాజ్యము, నిజామురాష్ట్రపరిశోధనోద్యమము, శారదలోని పరిశోధననివేదిక కామరాజు గారు ఆయా సందర్భములలో విమర్శించుటవలన. రెండవ భాగము: కవిజనాశ్రయ పీఠికా విమర్శనము. అది శ్రీ జయంతి రామయ్యపంతులువారిని గూర్చినది. మూడవ భాగము: ద్రాక్షారామము క్షేత్రమాహాత్మ్యమును గూర్చినది. కడమ రెండుభాగములను వదలి మాత్రాతల సమన్వయించుటలో విమర్శకు లొందిన పొరపాటు సూచించి భీమకవి నిజామురాష్ట్రములోని వాడనుటకు గల యుపపత్తుల దెలుపనున్నారము.

కామరాజుగారు కాశీఖండమునుండి ద్రాక్షారామ ప్రశంసాభాగమునంతయు నెత్తి వ్రాసిరి. మూలమున అగస్త్యుడు గోదావరి ప్రాంతమునజేరి కొల్లాపురలక్ష్మిని దర్శింప నేగెననిమాత్రము గలదనియు, శ్రీనాథు డాంధ్రుడగుటచే మఱికొన్ని క్షేత్రములను జేర్చెనని విమర్శకులు వ్రాసిరి. అందు భీమకవి ప్రశంసగాని ప్రకృతాంశము గాని లేకుంటచే విమర్శింప నవసరము లేదు. ఇటులే భీమఖండమునుగూర్చియు వ్రాయబడినది. ద్రాక్షారామము ప్రశస్తిని దెలుపు శాసనముల గొన్నింటి నుదాహరించిరి. ఇందువలన గోదావరీమండలమున ద్రాక్షారామ మున్నటుల సువ్యక్తమగుచున్నది. ఇది వివాదాంశము గాదు గాన దీనిని గూర్చి యింతచర్చ యనవసరము.

భీమకవి నివాసస్థానమునుగూర్చిన చర్చ కవిజనాశ్రయపీఠిక కవసరమగుటచే జయంతి రామయ్యపంతులు గారు 1915 ఈష్టరు సెలవులలో ఓరుగల్లు దర్శింపవచ్చి యచటి ప్రముఖులను బ్రశ్నింప బలువురు కరీంనగర మండలములోని వేములవాడయే భీమకవి నివాసమని తెలిపిరి. ప్రజాప్రవాదము త్రోసివేయరానిదని యచటి విశేషములను వ్రాసితెచ్చుటకు మాలోనొకని బంపిరి. అంతకుమున్నె మాకు వేములవాడతో బరిచయము గలదు. 1924 వేసవిసెలవులలో మాలో నొకరము

శాసన పరిశోధనమునకు వేములవాడ కేగియుంటిమి. కావున వేములవాడ విశేషముల నిట విస్తరించి తెలిపి విమర్శకులు సమన్వయించుటలో నొందిన ప్రమాదము దెలుపుదుము.

వేములవాడ నిజామురాష్ట్రమున కరీమునగరమునకు మూడామడలదూరమున నున్నది. ఈ గ్రామమున బెక్కు దేవాలయములు గలవు గాని అందు రాజేశ్వరాలయము, భీమేశ్వరాలయము మిగుల సుప్రసిద్ధములైనవి. రాజేశ్వరాలయమునకు వెనుకవైపుగా ఫర్లాంగుదూరమున భీమేశ్వరాలయమున్నది. భీమేశ్వరాలయము ముందు త్రిభువనమల్లవిక్రమాదిత్యుని శిలాశాసన మొకటి కలదు. రాజేశ్వరాలయమునం దెడమవైపున రాజరాజను చాళుక్యునియొక్కయు త్రిభువనమల్లవిక్రమాదిత్యుని యొక్కయు శాసనములు రెండు గలవు. ఇంక రెండుమూడుశాసనము లీ యాలయమున గలవు గాని యవి యరిగిపోయినవి. ఈ శాసనములు పదిపదనొకండు శతాబ్దములకు ముందువి. ఈగ్రామము నిచటి జనులు లేములవాడ, వేములవాడ యని వ్యవహరింతురు. పాట కపుజనులు లేండాల యేండాల యందురు. శాసనములో లేమ్బులవాడ యని కలదు. మేము చూచినంతలో బ్రాచీనగ్రంథములయందు ఈ క్షేత్రమునకు లేములవాడ యను నామమే కాన్పించినది. వేములవాడ యనురూపము, తక్కినరూపములు ఇటీవల వ్యవహారమునకు వచ్చినటులు దలంప వీలగుచున్నది.

కామరాజుగారు తొలుత భీమేశ్వరుడు వేఱు, రాజేశ్వరుడు వేఱని యంగీకరించి వెంటనే యా యంశముదెలుపు స్థలపురాణమొ, మూజువాణిసాక్ష్యమొ తప్పు గావలెను. లేదా రెండును దప్పుగావలెనని వ్రాసిరి. మూజువాణిసాక్ష్యము వ్రాసినది. లేములవాడ నివాసులును బండితో త్తములును వృద్ధులు నగు బ్రాహ్మణులు. స్థలపురాణము దేవస్థానములో నేటికి లభించును. ఈ పరిస్థితులు గమనింపక తమవాదమునకు విమర్శాసౌకర్యమునకు అనుకూల పరిస్థితులు లభించనంతమాత్రమున రెంటిని ద్రోసివేయుట సమంజసముగాదు. కామరాజుగా రొనరించిన విషయసమన్వయమె తప్పుగాని విషయము తప్పుగాదు. విషయము సుబోధ మగుటకు కామరాజు గారి వాక్యము లిట నుదాహరించుచున్నారము:

"శివౌః, జనయామాస తుస్తత్ర శివలింగం సనాతనమ్,
దక్షవాట్యాం భీమలింగం యత్ర రాజేశ్వర శ్శివః"

పూర్వాపరసందర్భములజూడ దీని కర్థ మిటులు దోచుచున్నది.

పార్వతీపరమేశ్వరులు దక్షవాటిక (యందలి) సనాతనశివలింగమైన భీమలింగమును బుట్టించినారట. దీనివలన భీమేశ్వరప్రతిష్టకు బూర్వము రాజేశ్వరు డచ్చట గలడని గదా తేలుచున్నది. శ్రీ రామయ్యపంతులవా రాచార్యులవారి ద్వారా గ్రామస్థులయొద్ద నుండి తెప్పించిన పత్రము (మూజువాణి సాక్ష్యము) భాగమున నీ క్రిందివిషయము గలదు. "రాజేశ్వరుడని చెప్పియున్నది. అయితే భీమేశ్వరుడు వేఱు రాజేశ్వరుడు వేఱునా? లేక రాజేశ్వరు డంతటినుండి భీమేశ్వరుడుగా మాఱెనా? యీయసందర్భములజూడ భీమేశ్వరలింగమును బార్వతీపరమేశ్వరులు పుట్టించుటకు మాఱుగ నెవ్వరో సృష్టించియుందురు. జైనవిగ్రహములు భీమేశ్వరాలయమున లేవని రామయ్యపంతులు వారు వ్రాసిరి. రాజేశ్వరాలయ ముఖద్వారమునొద్దను బ్రాకారము లోపలితట్టు గర్భాలయమునొద్దను వివిధములు వివిధాకృతులుగల జైన విగ్రహములు గలవని యాచార్యులువారు వ్రాసిరి. రాజేశ్వరాలయము పూర్వ మొక జైనమతమై శైవులచే నాక్రమింపబడెనని చెప్పుదురని యు నీయాలయావరణములో బెక్కు జైనవిగ్రహములు గలవనియు శ్రీ శేషాద్రిరమణకవులు వ్రాసిరి. భీమేశ్వరుడు వేఱు, రాజేశ్వరుడు వేఱని తేలుచున్నది. స్థల పురాణమొ మూజువాణిసాక్ష్యమొ తప్పుకావలెను. లేక రెండును దప్పుగావలెను."

న్యాయస్థానములందు ధర్మసూత్రములకు (Laws) అర్థాంతరుల దీయునటుల నీ శ్లోకమునకు మూజువాణిసాక్ష్యమునకు ఇతరాధారములకు అర్థాంతరముల గల్పించిరి. "శివౌ యత్ర దక్షవాట్యాం రాజేశ్వర శ్శివ(స్థితః) తత్ర సనాతనం శివలింగం భీమలింగంజనయామాసతుః" అని యన్వయింపవలయును. అపుడు పార్వతీపరమేశ్వరులు ఎచ్చట దక్షవాటికయందు రాజేశ్వరుడగు శివుడు గలడో యచట పురాతనమైనదియు శివలింగమునకు భీమలింగమును పుట్టించిరి. అనగా బ్రతిష్ఠించిరని భావము. స్థలపురాణమున బార్వతీపరమేశ్వరులు ఇపుడు రాజేశ్వరు డనబడు శివుడున్న చోట గల శివలింగమును సనాతనమైనదానిని బ్రతిష్ఠించిరనియు ఆ శివలింగముగల చోటు పూర్వము దక్షుడు జన్నముచేసినచోటు గాన నది దక్షవాటిక యనియు స్పష్టముగ జెప్పబడియున్నది. ఈయర్థ ముదాహృతశ్లోకమునందు సుగమమైయున్నది. దీనిభావము; రాజేశ్వరుడను పేరుతో శివుడున్న తావునగల శివలింగము పార్వతీపరమేశ్వరులు ప్రతిష్ఠించినది. ఆలయ ప్రదేశము దక్షవాటిక యని తెలియుచున్నది. 'జనయామాసతుః' అను క్రియాపదము రాజేశ్వరాలయములోని లింగము పార్వతీపరమేశ్వరసృష్టమని తెలుపును. రాజేశ్వరాలయము దక్షవాటిక

గావునను, అచట బార్వతీశంకరులు రాజేశ్వరశివస్థానమున భీమలింగమును బ్రతిష్ఠించిరి గావునను దాక్షారామ భీమేశ్వరుడన లేములవాడలోని దక్షవాటిక యనబడు రాజేశ్వరాలయమునందలి భీమేశ్వరలింగ మని నిశ్చయించి "దాక్షారామ భీమేశనందనుడఁ" అను భీమకవివాక్యము లేములవాడకే సరిపడునని తెలిపితిమి. "లేములవాడను నెలసిన భీమేశ్వరు కరుణగలుగు భీమనకవిని" అను భీమకవివాక్యము గోదావరి మండలములోని దాక్షారామమున కన్వయింపదనియు గోదావరి మండలములోని వేములవాడలో భీమేశ్వరాలయము లేదనియు బూర్వోక్తాధారములచే లేములవాడలోని రాజేశ్వరాలయభాగము దక్షవాటికయనియు నచటి శివుడె భీమకవికి వరప్రదాతయనియు మేము సమర్థించితిమి. ఈ కథయంతయు లేములవాడలోని రాజేశ్వరక్షేత్రము నకు సంబంధించినది. రాజేశ్వరక్షేత్రము ప్రకృతము శివాలయముగ నున్నది. దీనిముందు ధర్మకుండ మను కోనేరు గలదు. ఈ యాలయము విశాల మగునొక తటాకపుగట్టుమీద నున్నది. చెఱువులోనను ఆలయ ప్రాకారరముచుట్టును గల జైనవిగ్రహము లసంఖ్యాకములు. దృఢము విశాలమునగు ప్రాకారముమధ్య రాజేశ్వరాలయమున్నది. ద్వారమున జైనవిగ్రహములు ద్వారపాలకులవలె గలవు. లోనికి రాగానే ద్వారమునకు వెనుకను గర్భద్వారముముందును జైనవిగ్రహములు గలవు. ఇపుడు రాజేశ్వరాలయమని చెప్పబడు నాలయము శివాలయమువలెగాక యొక మిద్దెవలె గట్టబడినది. ఆలయమునందు శివాలయచిహ్నాము లిటీవల గల్పింపబడినవి. ఇది తొలుత నుండి శివాలయమేయని జైనులను వంచించి లోకులకనుగప్పుటకు క్షేత్రమహాత్మ్యము కల్పింపబడియుండును. రాజేశ్వరుడను పశ్చిమచాళుక్యరాజు శివలింగమునకు వృత్తు లొసంగి శైవధర్మస్థాపకుడై యీయాలయమున శాసనముల స్థాపించెను. జైనులు మతాచార్యులబోధచే దొలుత శైవులుగను బిమ్మట వైష్ణవులుగను మాఱుటచే రాజేశ్వరాలయమున శివునకు విష్ణునకు స్థానము లీయబడెను. హతశేషులగు జైనుల నోదార్చుటకు జైనవిగ్రహముల లెక్కలేనన్ని యుంచిరి. యవనసోదరులు దౌర్జన్యమొనరించి యాలయము రూపుమాపకుంటకు "ఒక యవనబోధకుని సమాధికి ప్రాకారములో దావొసంగి యవనుల పూజాపురస్కారముల గల్పించిరి. పూర్వభక్తి శ్రద్ధలతో జైనులుగూడ నేటికిని రాజేశ్వరాలయమునకు వచ్చుచున్నారు. నాటి జైనాచారములను బురస్కరించికొని పంచములు సైతము ఆలయముముందునకు వచ్చుచున్నారు. నిజామారాష్ట్రమున సుప్రసిద్ధములగు క్షేత్రములలో లేములవాడ యగ్రగణ్యము. ఈగ్రామమున నూరు

బ్రాహ్మణగృహములు గలవు. ఇక భీమేశ్వరాలయమన్ననో! ఇదియు లేములవాడలో చెఱువు కొనను ప్రత్యేక ప్రాకారములో నున్నది. ఇందు మిక్కిలి యెత్తయినలింగము గలదు. ఇది మొదటి నుండియు శివాలయమె యని నిర్ణయింపనవకాశములు గలవు. ఇందు జైనవిగ్రహములుగాని జైనచిహ్నములుగాని కానరావు. మేము స్వయముగా గనులార జూచినయంశము. ఇక రాజేశ్వరక్షేత్రమాహాత్మ్యము ప్రతులు లేములవాడ ప్రాంతమున బలుతావులగలవు. గ్రామస్థులయొద్ద రెండుమూడుప్రతులు భిన్న కాలములలో వ్రాయబడినవి చూచితిమి. గ్రామస్థులు వ్రాసియిచ్చిన పత్రములో, రాజేశ్వరమహాత్మ్యములో యీ రాజేశ్వరుణ్ణి భీమేశ్వరుడని చెప్పియున్నదని వ్రాసిరి. ఇందసందర్భము లేదు. "దక్షవాట్యాం భీమలింగం యత్ర రాజేశ్వరశ్శివః" అను శ్లోకభాగమువలన దక్షవాటికయందు రాజేశ్వరస్థానమున భీమలింగమును బార్వతీపరమేశ్వరులు స్థాపించిరని కలదు. రాజేశ్వర నామ మీశ్వరునకు రాజరాజను చాళుక్యభూపాలుడు వృత్తులొసంగిననాటి నుండి వచ్చినదనియు నతని భీమేశ్వరుడనిగూడ వ్యవహరింతురు. ఈ యంశము క్షేత్ర మహాత్మ్యములో గలదని గ్రామస్థులు వ్రాసియిచ్చిరి. రాజేశ్వరాలయముగాక సుప్రసిద్ధమైన భీమేశ్వరాలయము గూడ లేములవాడలో నున్నది. ఇవి గమనించియో గమనింపకయో శ్రీ కామరాజుగారు భీమేశ్వరుడు వేఱు రాజేశ్వరుడు వేఱని తేలుచున్నదని వ్రాసి యీ వాదమున కాధారమగు స్థలపురాణమో మూజువాణిసాక్ష్యమో తప్పుగావలయు ననుటలోగల సందర్భము పాఠకులు గమనింపకపోరు. తుంటరుల దుండగములచే బరిశోధకులొందు నవస్థలు దెలుపుభాగమును విమర్శకులు వివాదబీజమున కుపశ్రుతి యని త్రోసివేసిరి. మండు వేసవిలో ఉద్యోగమునందలి విశ్రాంతి ననుభవింపక పాదచారులుగ ఆమలకొలది బోయి తిరుగు పరిశోధక భిక్షులకు గలుగు బాధలయెడ విమర్శకు లొసగు సానుభూతి సంతాపకరము.

"శ్రీ శేషాద్రిరమణకవులు కొలనుపాక యని వ్రాసిన గ్రామమునే ఆచార్యులవారు కొద్రుపాక యని వ్రాయించిరి. పరిశోధకులలో నిట్లొకరికి దొరకిన గ్రామనామముగూడ స్వల్పవ్యవధిలో మరియొకరికి దొరకుట ప్రస్తుతకాలమున దుస్తరమగుచుండ జనులను కొను కొన్నిమాటల బత్రములుగజేసి తదాధారమున గ్రంథస్థాంశముల ననాదరించి చరిత్రాంశముల నిర్ణయించుట గడుంగడుసాహసము."

అని విమర్శకులు వ్రాసిరిగాని యిది సవిమర్శముగా మావ్యాసములు చూడమిచే గలిగిన ప్రమాదము. కొలనుపాక వేఱు; కొద్రుపాకవేఱు. రెంటిని నొకటిగా మేము

చెప్పలేదు. వేఱువేఱుగానే చెప్పినారము. "కొలనుపాక" దక్షిణకాశి యని స్థలపురాణములో గలదు. మాస్వకపోలకల్పితముగాదు చూడుడు. సంస్కృతాంధ్ర స్థలపురాణములలో నిటులె కలదు. ఆ గ్రామ ప్రముఖ లొకగ్రంథమాల నెలకొల్పి దానికి దక్షిణకాశీ గ్రంథమాలయని పేరిడియున్నాడు కాననే మేము దక్షిణకాశి యంటిమి.

ఈ కొలనుపాక బెజవాడనుండి హైదరాబాదు బోవు ఇనుపదారిలోని ఆలేరు స్టేషనునకు నాలుగుమైళ్ల దూరములో నున్నది. "కొలనుపాక వీరనారాయణ ముకుంద" అను రావూరి సంజీవరాయనిశతక మీగ్రామమును గూర్చినదే? శాసనములలో నీగ్రామమున కొలిపాక యనిరి. జైనులీగ్రామమున, 'తీర్థరాజ్ కొలిపాక్' అని వ్యవహరించిరి. జైనమతస్థుల ప్రధానస్థానములలో కొలనుపాక యొకటి. చాళు క్యులయు గాక తీయులయు నాదరముల జూరగొన్న సోమనాథాలయమను ప్రశస్త మైన దేవాలయమిటగలదు. "కొలనుప్రతాపరుద్ర నృపకుంజరుచే" అను భీమఖండములోని శ్రీనాథుని పద్యము ఈ కొలనుపాకను గూర్చినదే. ఇది మున్ను మేము తెలిపినయంశమే. ఇక కొద్రుపాక వరంగల్లు నుండి కరీంనగరము ౬౦ మైళ్లు పోయి అచటినుండి ౨౦ మైళ్లు రోడ్డువెంట బోవగా ప్రక్కన కొద్రుపాక గలదు. ఇది లేములవాడకు ౫ మైళ్లదూరములోన నున్నది. ఇందు ఆలయములు ప్రసిద్ధమైనవి లేవు. చరిత్రస్థలము కాదు. శేషాద్రిరమణకవుల వ్యాసమునుండి కొలనుపాకను ఆచార్యులగారి వ్యాసమునుండి కొద్రుపాకను గైకొని భిన్నగ్రామముల నేకగ్రామముచేసి కామరాజుగారు కొంత కథనడిపి సమకాలికులే గ్రామనామములు వేఱుగా వ్రాసియుండ లోకులమాటలనమ్మి చరిత్రాంశముల మార్చుట కడుసాహసమని సెలవిచ్చిరి. ముద్రితమై విపుల వివరణములతో నున్న వ్యాసములలోని భిన్నస్థానములగు కొలనుపాకను కొద్రుపాకను ఒకేగ్రామముగా భ్రాంతిపడి అది గ్రంథస్థమొనరించి సత్యము మరుగుపరచుటకంటె ప్రజాప్రవాదములు చాటూక్తులు సమన్వయించి చారిత్రకవిశేషముల నరయ యత్నించుట సాహసముకాదని విమర్శకులకు మనవి చేయుచున్నారము.

"ఈ ప్రశ్నునుగూర్చి యోచించుటలో గేవల తార్కికప్రజ ప్రతీతికంటె గ్రంథస్థాంశములు ప్రబలప్రమాణములు. ఆ గ్రంథములలోను నీవిషయమై చర్చరాని క్రితము వ్రాయబడినవి యుత్తమములు." అని కాదు రాజుగారు వ్రాసిరి. ఈ వాక్యభావము ననుసరించిన బరిశోధనముతో నూతనదేశచరిత్రములతో బనియే

యుండదు. శోధించినకొలది నూతనాంశములు తేలి చరిత్రము తలక్రిందు లగుచుండును. నేడు ఎరువు తోలదగిన పాటిదిబ్బ తేపు చరిత్రరంగస్థల మను నాధారములు బయలుపడవచ్చును. నిన్నటివఱకు గణపతిదేవుని భార్య యనుకొన్న రుద్రమదేవి కుమార్తె యనుటకు ప్రబలప్రమాణములు చిక్కుచున్నవి. ఆంధ్రుల ఆంధ్ర దేశవాసులకనుకొన్న రెడ్డివారు రాష్ట్రకూటవంశస్థులని ఉత్తరహిందూ స్థానవాసులనుటకు బ్రమాణములు శోధింపబడుచున్నవి. నన్నయకు బూర్వపు గవిత దొఱకుచున్నది. ఒంటిమిట్టవాడనుకొన్న పోతరాజు ఓరుగంటివాడైనాడు. గోదావరిమండలములోని బిక్కవోలు వాడనుకొన్న మల్లారెడ్డి హైదరాబాదుచెంత గల బిక్కనవోలివాసుడైనాడు. ఎనిమిదవశతాబ్దము వాడన్న శంకరుడు రెండవశతాబ్దము చేరువలోని కేగినాడు. బుద్ధునికంటె మహావీరుడు పూర్వుడని నిశ్చితమైనది. చరిత్ర మిటులు దారుమారగుచుండ వివాదము రానినాటి ప్రాతపొత్తముల బరమప్రమాణములుగా గొనవలయుననుట సమజంసముగా లేదు. జనులయందు బ్రాణశక్తి యున్నంతవఱకు, నూతనవిషయాన్వేషణతృష్ణ యున్న వఱకు చరిత్రాకాశమున విమర్శవాతము వీచుచునే యుండును.

కం. "లేములవాడను వెలసిన
భీమేశ్వరు కరుణగల్గు భీమసుకవి నేఁ
గోమటి రేచనమీఁదను
నీమహిఁ గవులెన్న ఛందమెలమి రచింతు౯"

అను పద్యము కవిజనాశ్రయావతారికలోనిది. దీనిని బట్టిచూడ భీమకవి వరప్రదాతయగు నీశ్వరుడు లేములవాడ భీమేశ్వరుడు. గోదావరి మండలములోని వేములవాడలో భీమేశ్వరుడు లేడు. అచటికి గొంతదూరము లోనున్న ద్రాక్షారామములో నున్నాడు. భీమేశ్వరుడున్న లేములవాడయే కవినివాసము. కాన భీమేశ్వరాలయము సుప్రసిద్ధమైనది నైజాములోని లేములవాడలో గలదు. లేములవాడ భీమకవి నివాసమనుటకు బ్రవాదాది ప్రమాణములు గలవు. "లేములవాడ భీమునవలీ లగఁజూచి కళింగగంగు", "లేములవాడ భీమభళిరే కవిసన్నుత" లోనగుపద్యములు భీమకవి లేములవాడ నివాసియని తెలుపుచున్నవి. జైనమతవ్యాప్తి, భీమేశ్వరాలయము క్షేత్రమాహాత్మ్యములొ నదియే దక్షవాటిక యనుటయు నీసిద్ధాంతమునకు బలమగు నాధారములు. వీనిని సమన్వయించి శ్రీ ప్రభాకరశాస్త్రిగారు, భీమకవి

నిజామురాష్ట్రములోని లేములవాడ నివాసియనుటయే సమంజసమని వ్రాయుచు దమకు గల సందియముగూడ దెలిపికొనినారు. వారి వాక్యములివి:

"రామకృష్ణకవిగారు భీమకవిదేశము నైజాము రాష్ట్రమందలి లేములవాడ యగునోయని నీతిశాస్త్రముక్తావళి పీఠికలో దెలిపిన తలపును (జయంతి) రామయ్యపంతులుగారు కొన్ని యుపపత్తులతో బొందించి బలపఱచినారు. వాస్తవముకానవచ్చును. నైజామురాష్ట్రనందలి లేములవాడలో వెలసిన ఈశ్వరునకు సుప్రసిద్ధ నామమయ్యెను. ఆ రాజేశ్వరునకుగూడ భీమేశ్వరుడని సుప్రతీతి కలదా? అక్కడ సుప్రసిద్ధమైన రాజేశ్వరనామమును విడిచి స్థలాంతరమున సుప్రసిద్ధమగు భీమేశ్వర నామమును బేర్కొనుట భీమకవి గోలకొండ వాస్తవ్యత్వమునకు గొంత బాధకము. పద్యములోనున్న లేములవాడ యన్న పేరు గోదావరీ మండలమందలి వేములవాడకు గుదురకపోవుట తత్రత్యత్వమునకు బాధకము. (ప్రబంధరత్నావళి పీఠిక)

శ్రీ ప్రభాకరశాస్త్రిగారి లేములవాడలో భీమకవియున్నటు లామోదించిరని తెలియును. వారి సంశయము లేములవాడ రాజేశ్వరుడెగాని భీమేశ్వరుడు లేడేయని లేములవాడలో సుప్రసిద్ధభీమేశ్వరాలయము మిగుల బ్రసిద్ధమైనది. చాళుక్య త్రిభువనమల్లుని శాసనము ముఖభాగమునందుగలది నేటికి జెక్కు చెదరకున్నది. వివాదాధారములను మేమే కల్పించితిమన్ను విమర్శకులు భీమమేశ్వరాలయము మేము సృష్టించితిమన్నను సంతోషింపవలసినదే. ఇవియన్నియు లేములవాడ చూడక పోవుటవలనను, అచట భీమేశ్వరాలయమును ప్రసిద్ధమైనది కలదని చెప్పినను గమనింపకపోవుటవలనను గలిగినయవస్థ. పై ప్రభాకరశాస్త్రిగారి వాక్యములు భీమకవి నిజామురాష్ట్రములోని లేములవాడ నివాసియని యామోదించుచున్నవి గాని అచట భీమేశ్వరుడు లేడేయని సంశయించుచున్నవి. కావున మేము ప్రత్యుత్తరముగ "ప్రభాకరశాస్త్రిగారు నైజామురాష్ట్రములోని లేములవాడ భీమకవి జన్మస్థానముగాదని సంశయించిరి. గాని వారిచట భీమేశ్వరాలయముంట యెఱుగ కట్లు వ్రాసియున్నారు" అని మేము వ్రాసియుంటిమి. దానిపై కామరాజుగారు 'శేషాద్రిరమణకవులు పైవిధముగా వ్రాసిరి. ప్రభాకరశాస్త్రిగారి కావిషయము దెలియదని వీరికెట్లు తెలియునని ప్రశ్నించిరి. మాకెటులు దెలియునో ప్రభాకరశాస్త్రిగారి ప్రబంధరత్నావళి పీఠికావాక్య ములే విమర్శకులకు దెలుపగలవు. ఇందు మాకల్పనయే మాత్రము లేదు.

నిజామురాష్ట్రమున ఆంధ్రులలో నిప్పటికి జైన మతవ్యాప్తి గలదు. మెదకుమండలములో నైదారు సుప్రసిద్ధజైనాలయములు గలవు. కొలనుపాక వీరనారాయణాలయము, హనుమకొండ పద్మావతీ సిద్ధేశ్వరాలయములు, అల్లదుర్గము, వీరభద్రేశ్వరాలయము ఇపుడు హిందూ దేవాలయములుగా మార్పబడినవి. 1921 సంవత్సరములో జరిగిన జనపరిగణనము (జనాభా)ను బట్టి నిజామురాష్ట్రమున జైనులు స్త్రీపురుషులు గలసి 20884 అనియు, అందు స్త్రీలు 9852 అనియు దెలియుచున్నది. నిజామురాష్ట్రములో ఏయే మండలములందిప్పటికిని జైనమతవ్యాప్తి గలదో తెలియుటకు ఆయా మండలములలోగల జైనుల సంఖ్య నొసంగెదము.

★ హైదరాబాదునగరము	1238
★ అతరాపుబల్దా	109
★ వరంగల్లు	89
★ కరీమునగరము	5
★ ఆదిలాబాదు	244
★ మెదకు	229
★ నిజామాబాదు	145
★ మహబూబునగరు	48
★ నల్లగొండ	34
★ ఔరంగబాదు	3930
★ బీడు	2268
★ నాందేడు	867
★ పర్భని	3061
★ గుల్బర్గా	1828
★ ఉస్మానాబాదు	3046
★ రాయచూరు	656
★ బీదరు	787

ఇటుల గుర్తింపబడినవన్నియు ఆంధ్రమండలములు. ఆచారవ్యవహారములలో జైనులు వేఱుపడియున్నారు. జైనమతము వ్యాప్తిలో నున్న కాలమున గవి జనాశ్రయము వ్రాయబడినట్లు గవిజనాశ్రయములోని యీక్రిందిపద్యములవలన మనము తెలిసికొనవచ్చును.

క. ఘనదండ కాష్ఠకృష్ణా
జినములు సొగయింప నొక్కజినముని చనుదెం
చె ననగ సమయవిరోధం
బని కవులకుజెప్పు గవిజనాశ్రయుఁడొనరఁ

క. జినసుత ధర్మమహింసయ
యనుమతమున వితతముగ గజాసురు బాపం
బని చంపడయ్యె నీశ్వరు
డనిది యాగమవిరోధ మనిరి కవీంద్రుల్.

దోషాధికారము.

భీమకవి పండ్రెండవ శతాబ్దారంభమున నున్నట్లు జయంతి రామయ్యపంతులువారు వ్రాసిరి. వీరేశలింగము పంతులువారు పదమూడవశతాబ్దము లోని వాడనిరి. ఎటులైన నీ రెండు శతాబ్దములందుగాక నేటివఱకు నిజామురాష్ట్రమున జైనమతము నశింపలేదు. గోదావరి మండలమున నింతవ్యాప్తి జైనమతమునకు ఆనాడు నీనాడును లేదు. కాన భీమకవి నిజామురాష్ట్రములోని లేములవాడ ప్రాంతవాసియనుటయే పొసగియున్నది.

లేములవాడ సుప్రసిద్ధ శివక్షేత్రము. బ్రాహ్మణ విస్తృతియు వేదశాస్త్రఘోషణములు సదాచారసంపత్తి నేటికి లేములవాడయందు గలదు. అటగల రాజేశ్వరునకు భీమేశ్వరునకు గలసి సంవత్సరమునకు దైర్ఘిక ప్రజల వలన ఎనుబది డెబ్బదివేల రూపాయలు మ్రొక్కుబడులు వచ్చుచున్నవి. ప్రతిదినము వచ్చెడి పోయెడి యాత్రికులకు లెక్కయేలేదు.

లేములవాడ భీమేశ్వరుడు సుప్రసిద్ధుడు. అచటి భీమేశ్వరాలయము చెక్కుచెదరక యన్నివిధముల మనోహరముగా నున్నను రాజేశ్వరునకే యిపుడు పూజాదికములు భోగాదికము లతిశయించి జరుగుచున్నవి. లేములవాడ నివాసియగు సోమనాథకవి తన విద్వద్రంజనీ వ్యాఖ్యలో;

'శ్రీమల్లేములవాడ పుణ్యసరసీ... రాజేశ్వరం భావయే' అని చెప్పియున్నాడు.

రాపాక లక్ష్మీపతి తన భద్రాయురభ్యుదయములో గృతిపతి వంశావతారమునందు;

'గీ. రాజరాజేశ్వరాత్మ విభ్రాజమాన
మైన లేములవాడ నెయ్యమున జేరి.'

అని చెప్పెను. ఇటుల భీమేశ్వరుని ప్రతిభ దెలుపు పుస్తకములుగూడనుండ వచ్చును. నిజాం రాష్ట్రకవుల గ్రంథములంతరించుటచే నిర్ధారణమునకు వీలగుటలేదు. పైపద్యములవలన లేములవాడ సుప్రసిద్ధక్షేత్రమని తెలియును. అటగల భీమేశ్వరాలయ ప్రసిద్ధిని గూర్చి యింకను దెలిసికొనగోరు స్థలపరిచయుల నడిగిన విశేషాంశములు దెలియగలవు. వీలువెంట నీవ్యాసమున కనుబంధముగ భీమేశ్వరస్వామి ప్రశస్తి దెలుపు గ్రంథభాగములు శాసనభాగములు ప్రకటింతుము.

శ్రీకామరాజుగారి వ్యాసములో బ్రత్యేకించి మాకు సంబంధించినంతవఱకు గలవిషయములకు బ్రత్యుత్తరము వ్రాసితిమి. నిజాము రాష్ట్రము చరిత్రస్థలమనుటలో సంశయములేదు. ఆంధ్రులెల్లరకు యాత్రాస్థలములుగా బ్రసిద్ధినొందిన ధర్మపురి, అలంపురి, ఏలేశ్వరము, కాళేశ్వరము, కొలనుపాక, లేములవాడ, ఉమామహేశ్వరము లోనగు పుణ్యక్షేత్రములను బ్రిటిషు దేశాంధ్రులు దర్శింపనేతెంచుటలేదు. ఆయా ప్రాంతములందున్న మహాకవుల నివాసస్థానములు చరిత్రకారులు భ్రాంతి పరస్థానములజేర్చిరి. ఇపుడు పరిశోధించి విమర్శకులముందు బెట్టునపుడు కొంత యలజడి కలుగుచున్నది. కాని సత్యము నిజామురాష్ట్రమువైపె ములు సూపును. దేశమంతయు గల్లోలపడుచున్నను నిజాము రాష్ట్రీయసోదరులు చరిత్ర గ్రంథులు విప్పుటకు దొరకొనక మిన్నకుంటయే వివాదాంశములు పెరిగి చర్చాఫలితము తేలకుంటకు గారణము.

విమర్శవ్యాసము సౌజన్యముగ వ్రాసి చర్చలో శాంతముగ బాలుగొన్న కామరాజుగారియెడ కృతజ్ఞులము. వారు శేషాద్రిరమణకవులను వేఱుగ వేంకట రమణాచార్యులను వేఱుగ దలంచి పరస్పరవిరుద్ధాభిప్రాయముల జూపనెంచిరి. శేషాద్రిరమణ కవులలోని రమణ కవియే వేంకటరమణాచార్యులని మామిత్రులు గమనింపగోరెదము. మేము ప్రత్యేకించి వ్రాయుచున్న నిజాము రాష్ట్ర ఆంధ్రకవిచరిత్రమునందును, నిజామురాష్ట్ర ఆంధ్రవాఙ్మయ చరిత్రమునందును, ఈవ్యాసమునకు సంబంధించిన విశేషాంశము లుండునుగాక బ్రకృత ముభయవాదములపై సత్యము భాషాభిమానులు తేల్చికొనుటకుగాను ఈచిన్ని వ్యాసమును బ్రచురించితిమి.

– భారతి, అక్షయ ఆషాఢం (1926)

15. కామినేని మల్లారెడ్డి

మనము చూచినంతలో రెడ్డివీరవంశమున మల్లారెడ్డినే ప్రథమాంధ్రకవిగా భావింపవచ్చును. కాకతీయ సామ్రాజ్యము ఓరుగంటియందుఁ జింకాలము వృద్ధినొంది కాలవశమున క్షీణదశలోనికి వచ్చినపిమ్మట సామంతులుగ సేనానాయకులుగ నున్న వీరులందఱు స్వతంత్రరాజ్యములు స్థాపించిరి, వెలమవీరులు రాచకొండ సింగవరము భువనగిరిలోనగు దుర్గముల నాశ్రయించి బలపడిరి. హరిహర రాయాదులు తుంగభద్రాతీరమునకేగిరి. రెడ్డిరాజన్యులు నెల్లూరు మండలము గోదావరిమండలము గుంటూరు కృష్ణామండలములు యథేచ్ఛముగ నాక్రమించి పలుతావుల దుర్గములు స్థాపించిరి. ఆ కాలమున రెడ్డివీరులాంధ్రకవులకు ననేక విధములఁ దోడ్పడి యుద్గ్రంథముల వ్రాయించిరి. శ్రీనాథుఁడు, ఎఱ్ఱాప్రగడలోనగు మహాకవులీ రెడ్డి రాజ్య పతాకము క్రినీడనే సుఖజీవనముఁజేసి యున్నారు. కాని రెడ్డివీరులలో మల్లారెడ్డి కవికంటెఁ బూర్వాంధ్రకవి కానరాఁడు. ఇక్కవి జీవితము నొకమాఱు పరించి కవితాజీవనమున నెంతవఱకు రెడ్డిసోదరులు మృతజీవులై యున్నది నిశ్చయింపవచ్చును.

మల్లారెడ్డి యింటిపేరు కామినేనివారు. వీరు పాకనాఁటివారు. నివాసస్థానము బిక్కనవోలు సంస్థానము. ఇది హైదరాబాదునకు నించుమించుగ నేఁడెనిమిది యామడల దూరములో నున్నది. మల్లారెడ్డి పూర్వులు కృష్ణామండలములోని వారై బిక్కనవోలు ప్రాంతములకు వలసపోయినటుల శివధర్మోత్తర ఖండములోని యీక్రింది పద్యమువలన తెలియును.

మ. ఘనుఁడాకాశ నృపాలశేఖరుఁడు ముః గర్ణాట దేశంబునం
దున దుర్గాధిపతిత్వవైభవముతోడ్తో గాంచి సుల్తాను పి
ల్వనఁ గృష్ణానది దాటి యా మెదుకుబల్ దుర్గంబుక్రిందన్ జిరం
తనమౌ బిక్క నవోలనుండెనది యాత్రాస్థాన రాజంబుగః

కృష్ణ కావలనుండి సులతాను పిలుపుచే మెదకుదుర్గముక్రిందనున్న బిక్కనవోలునకుఁ బరిపాలకుఁ డుగా వచ్చిన కాచారెడ్డి కామిరెడ్డి కొమారుఁడు. ఈ కాచారెడ్డిని రాఁదీసిన సులతానుపేరు తెలిసికొను నాధారములు కానరావు. మల్లారెడ్డి వంశీయుల చరిత్రమును ఉమాపత్యభ్యుదయములోని

తే.గీ. ఇప్పగిది కాచరెడ్డిభూమీశ మౌళి
యెదురులేని పరాక్రమ మెసఁగ మెసఁగ
నవని యేలంగ సుల్తాన్ మహమ్మదనెడు
హిందుపాదుష గోల్కొండ నేలుచుండె॥

అను పద్యమువలన మహమ్మదు సుల్తాను గోలకొండ రాజ్యము పాలించుతఱి నీకవి పూర్వులు కృష్ణామండలమునుండి నిజాము రాష్ట్రమున కేగినటుల నిర్ణయింప వీలు కలుగుచున్నది. మల్లారెడ్డి యుక్తవయస్కుఁడై యున్న కాలమున బిక్కనవోలు సంస్థానమును నాతనియున్నయగు కామిరెడ్డి పరిపాలించుచుండెను. ఈకామిరెడ్డి సర్వతంత్ర స్వతంత్రుఁడు. రాజ్యనీతిజ్ఞుఁడు. గోలకొండ సుల్తానులవద్ద మంచి పలుకుఁబడిగలవాఁడు. అగ్రజుని పోషణముననుండి మల్లారెడ్డికవి సంస్కృతాంధ్రము లలోఁజక్కని వైదుష్యము నార్జించి కవితారచనమున కారంభించి గ్రంథరచనము సేయ సాగెను. మల్లారెడ్డినిగూర్చి ఉమాపత్యభ్యుదయమున నొక విచిత్రకథ చెప్పఁబడియున్నది. శ్రీరామాలయము గట్టింపవలయునని మల్లారెడ్డి నిశ్చయించి సామంతుల జయించి పన్నులు గొనిరా నిశ్చయించి దేశాటనము గావించి సిద్ధ సంకల్పుఁడై ద్రవ్యముతో బయలుదేరి వచ్చుచుండ దేవగిరివద్ద ప్రొద్దుక్రుంకెను. పరిజనమంతయు నట నిదురించెను. రాత్రికాలమున శ్రీరామమూర్తి మల్లారెడ్డి స్వప్నములోఁ బ్రత్యక్షమైతనయా! రాక్షసుల బాధలకోర్వక దేవతలు విష్ణుమూర్తిని శ్రీరామావ తారమెత్తుమని ప్రార్థించినచోటిది కావుననే దీనిని దేవగిరియని వ్యవహరింతురు. శైలాగ్రముననొక గొప్పపుట్టగలదు దాని చెంతనొక సీతారామ విగ్రహము గలదు. విశాలఫణము గల సర్పము విగ్రహమున కెండ సోకనటుల పడగవద్దుపెట్టియుండును. నీవాప్రదేశము గుర్తించి దేవాలయము నిర్మింపుమని యాజ్ఞయిచ్చి యంతర్ధానమయ్యెను. మల్లారెడ్డి స్వప్నప్రకారము శిఖరాగ్రమున శ్రీరామునిదర్శించి యార్జిత ద్రవ్యముతో గొప్ప శ్రీరామాలయము గట్టెను. చెంత నిష్టదైవమగు శివునకు సైతము రాజరాజేశ్వరాలయము నిర్మించి యందు శివుని బ్రతిష్ఠించెను.

మల్లారెడ్డికవి వ్రాసిన గ్రంథములలోఁ బద్మపురాణము, శివధర్మోత్తరఖండము, షట్చక్రవర్తిచరిత్రము మాత్రమె ముద్రితములు. కొందఱు తద్వంశీ యులు కృతినొందిన గ్రంథములన్నిఁటి కర్తృత్వము మల్లారెడ్డిపై నారోపించియున్నారు. ఆ గ్రంథములు విమర్శ దృష్టితోఁ బరిశీలించిగాని యాయంశము నిరూపింప వీలు కలుగదు.

మల్లారెడ్డి సిద్ధరామేశ్వరస్వామి భక్తుఁడు. ఈ దేవాలయము బిక్కనవోలులో దక్షిణ దిక్కున నున్న సిద్ధతీర్థమను సరస్తీరమున నున్నదనియు వంశీయులగు పూర్వులందఱును నాదైవమునకు భక్తులని యునిశ్చయింప నాధారములు కలవు. పద్మపురాణలోని అంశములవలన నీయంశము స్థిరవడును.

కం.బిక్కనవోల్ ఘన దక్షిణ
దిక్కన దురుసిద్ధతీర్థ తీరోన్నత స
మ్యక్కనక ప్రాసాదముఁ
జక్కగ నెలకొన్న భక్తజనపాలునకుఁ

మల్లారెడ్డి నివాసస్థానమగు బిక్కనబోలు గోదావరి మండలములోనిదికాదు. నిజాము రాష్ట్రము లోనిది. పద్మపురాణమున కవితన నివాసస్థానమగు బిక్కనవోలు పురమును నీక్రింది విధముగా వర్ణించి యున్నాఁడు.

సీ. శ్రీసిద్ధ రామేశ శీతలాలోక
సంజాత సమ్మద చంద్రికంబు
శ్రీవేంకటేశ వక్షోవైజయంతికా
గంధానిల విహార బంధురంబు
భద్రదాయక వీరభద్ర మహోత్సాహ
బాహాబలాక్రాంత పాలితంబు
మైలారిలింగ పూజాలబ్ధ నిఖిలార్థ
సంపత్తి సుఖిత ప్రజావ్రజంబు

తే.గీ. వెలయు నభ్రంకషాదీప్త విపణిసౌధ
గోపురో పవన తటాక కుంజరాశ్వ
రథభటాది నిరంతరా రాతిహృదయ
ఘట్టనంబగు బిక్కనోల్పట్టణంబు ॥

మల్లారెడ్డి తన యగ్రజుఁడగు కామిరెడ్డి యొనరించిన ధర్మములఁ బెక్కు లుగ్గడించుచు నాఁతడు నిర్మించిన గ్రామముల నిటులఁ బేర్కొని శివధర్మోత్తరము వ్రాసికొని యున్నాఁడు.

సీ. తన గురూత్తముపేర జనకునిపేరను
తన యన్న పేరను తనదు పేరఁ

దమ్ముల పేరను తనయు పేరఁటఁ దల్లి
పేరను సోదరిపేర భార్య
పేర మఱందలి పేరను లింగా పు
రంబును గాధాపురంబు జంగ
మారెడ్డి పురము గామారెడ్డియునునెల్ల
రెడ్డిపేటయు మల్లరెడ్డికామి

తే.గీ॥ రెడ్డి పేటలు తిప్పాపురంబు సిరుల
బొదలు లింగాపురంబును బోతసాని
పల్లెయును మించఁ గట్టించె భవ్యకీర్తి
ప్రబలె మాయన్న శ్రీకామిరెడ్డిఘనుఁడు ॥

ఈ గ్రామములన్నియు బిక్కనవోలు పరిసరమున నున్నవి. బిక్కనవోలు నిజాము రాష్ట్రములోని మెదకు దుర్గము క్రిందిదై పూర్వోక్త గ్రామములకుఁ జేరువలో నున్నది, కానమల్లారెడ్డికవి నిజాం రాష్ట్రీయుఁడనుట నిరూపణలేదు. మల్లారెడ్డి తనను గూర్చి తనకవిత్వమునుగూర్చి పద్మపురాణములో నీక్రిందివిధముగాఁ జెప్పుకొని యున్నాడు.

ఉ. కుంభినియందు నాంధ్రమును గొందఱుగొందఱు సంస్కృతంబున
జృంభిత శక్తి యుక్తులను జెప్పఁగ నేర్తుగాని రెంటికిన్
శంభుకృపన్ విచక్షణుఁడు శక్తుఁడు మల్లవిభుండుతత్పురా
ణోంభితశబ్దముల్ సరవి యోజన జేసి రచింపనేర్చునన్

చ. బొటబొటతేనియల్ వడయుసూక్తులు ప్రోక్తన జన్మపుణ్య సం
ఘటితములై కవీంద్రులక ఖండముదంబుహృదంబుజంబు నం
బొటమగఁజేయఁ గ్రమరసపూరములౌ మహిత ప్రబంధముల్
పటు మతిసల్పఁ గాఁదగిన ప్రాజ్ఞుఁడు మల్ల నృపాలుఁ డెంతయున్

కం.శ్లేషకవి వీవుభాగా। శేషాహివి (శి.ధ)

వ. ఉభయభాషాకవితా మంజు మంజరీగళ న్నవరస మధుర
మధురసధారా సంతోషితా మనీషిహృద యేందిందిర
నిజాశ్రితనికేతన... గుణోల్లసిత భూసుర విరచిత భాగధేయ

ఇట్టి ప్రశంసా పద్యములు కవితనకుఁదా వ్రాసికొనుటచే నీతఁడు ఆత్మస్తోత్ర పరాయణుఁడని తోఁచును, గాని కవితయందుఁ గల సుగుణములు గ్రహించుపట్టున

నీస్వల్పదోషములు పరిగ్రాహ్యములు కావు. మల్లారెడ్డికవిత మృదుమధురధారావంతమై నిర్దుష్టముగ నుండును. నిరర్థక పదాడంబరములు చిత్రకవిత్వము లతోఁ గాలము గడుపడు. స్వతస్సిద్ధమగు మనోహర ధారతో నేగ్రంధపూరణముగావించును. ఇతఁడు వ్రాసిన గ్రంథములలో స్వతంత్ర ప్రబంధములు లేవు. షట్చక్రవర్తి చరిత్రము ప్రబంధములకుఁ బురాణములకు మధ్యస్థానములో నున్నది. కావున నీతని కవితలోఁగథా కల్పనాదులు పాత్రపోషణాదులు విమర్శింప వీలుగాదు, గాని ధారాశుద్ధియందు రచనాకౌశల్యమందు మల్లారెడ్డి సమర్థుడని శ్లాఘింప వచ్చును. ప్రబంధ యుగములోని కవులలో మల్లారెడ్డి యొక్కఁడె ప్రాఁద్రోవవిడువక పురాణాంధ్రీకరణములు పరమావధిగా దీసికొనిన వాడని తోఁచుచున్నది.

షట్చక్రవర్తి చరిత్రమునఁ గృత్యాదికములు లేకపోవుటచేతఁ గవి నివాసము కాలము నిరూపింపనింత వఱకు నిర్దిష్టమగు మార్గములు లభింపలేదు. ఇపుడు లభించిన పద్మపురాణము శివధర్మోత్తర ఖండముల సహాయముతోఁ గవి కాలము నిరూపింపఁ గొంత వీలుకలుగుచున్నది.

శా. శ్రీరాజత్సులతాన్ మహమ్మదు ధరిత్రీ భృన్నిజాం శాదరా
స్థారా దేదులఖానరాడగ బరుక్షా పాలసింహాస నో
దారాక్రాంతనితాంత సన్నుతి చరిత్రప్రాభవోద్దామ

అను పద్యముచే మహమ్మదు, ఏదులఖాను, అగ్బరు మొదలగు మహమ్మదీయ రాజన్యులచేఁ గూడ సిద్ధరామేశ్వరుఁడు సేవలందెనని తెలియుచున్నది. ఇంతియగాక

తే.గీ. ఔర బిక్కనవోలి పురాదినాథ
కాచవిభునెల్ల రెడ్డిభూకాంతుఁడెలమి
భవ్యసులతాన్ మహమ్మదు పాదుశాహి
కలములోపల నింతటి కాపుగలఁడె ।

అనుపద్యముచేఁ గవి కగ్రజుఁడగు కామిరెడ్డి గోల్కొండ నవాబగు సులతాను మహమ్మదుపాదుషా కాలములో నుండెనని తెలియును. ఉమాపత్యభ్యుదయమున గోలకొండ నేలుచున్న కుతుబుషాహిపాదుషా వలన ననేక బిరుదంబులు మల్లారెడ్డి పొందినటులఁ కామిరెడ్డి ప్రశంసగల కథా భాగములలోని

"భవ్యసులతాను మహ్మదుపాదుశాహ
లబ్ధభూషణ పల్యంకికా...

రమ్యగుణశాలి శ్రీరామరెడ్డిమౌళి।

శా. శ్రీరాజద్గజరాజకన్నడ మహీభృచ్చారుఖానాది।

లోనగు పద్యభాగములలోనియంశములు సవిమర్శముగఁ బరిశీలింతుమేని మల్లారెడ్డి, కామిరెడ్డి కాలములో సులతాను మహ్మదు, లోనగు గోలకొండనవాబులు రాజ్యము నేలుచున్నటులఁ దెలియును. ఏదులఖాను కృష్ణరాయలచేఁ జంపఁబడినవాఁడైయుండు నేమో క్రీ.శ ౧౫౨౯ ప్రాంతమున కృష్ణరాయలతోఁ బోర జాలక ఆదిల్ శాహపరారయ్యెను. బహుశః యతఁడైన గావచ్చును. చరిత్రముల వలన మనకవికి సమకాలికుల మహమ్మదుశాహి క్రీ.శ. ౧౫౮౦-౧౬౧౧ వఱకును అగ్బరు క్రీ.శ. ౧౫౫౬-౧౬౦౫ వఱకును జీవించి యున్నటుల స్పష్టముగఁ దెలియుచున్నది. ఇంతియగాక మల్లారెడ్డియన్నయగు కామిరెడ్డిని గూర్చి బ్రహ్మోత్తరఖండములో పట్టమట్టసరస్వతీ సోమయాజియిటులఁ జెప్పియున్నాఁడు.

తే.గీ. కలిమి బిక్కనవోలి శ్రీకామిరెడ్డి
భూమివిభు నాశ్రయించిన బుధులు నిజము
శాలివాహన శకవర్షసంఖ్యపదియు
నైదునూర్లైన వర్తమానాబ్దములుగ॥

దీనిచే మల్లారెడ్డి కవి యగ్రజుఁడు క్రీ.శ ౧౫౪౦ ప్రాంతమనుట నిశ్చయము. వీని నన్నిటిని సమన్వయించి చూచినచో మల్లారెడ్డి కవి రాజ క్రీ.శ. ౧౫౫౦ మొదలు ౧౬౦౦ వఱకు జీవించి యుండెనని విశ్వసింపవచ్చును. మల్లారెడ్డి కవి వంశస్థులు నిజాము రాష్ట్రములోని దోమకొండ సంస్థానమునఁ బ్రభువులై మిగుల ప్రఖ్యాతులైయున్నారు. తద్వంశీ యుల యాదరణముననే పాఠకలోకము మల్లారెడ్డి గ్రంథరాజములగు శివధోర్మోత్తరము పద్మపురాణము పఠింప నాంధ్రలోకమున కవకాశము చిక్కినది.

ఉ. దీనిధి సాహితీయుతుఁ బ్రతీతయశుం గుతుపావ నీశ్వరా
స్థాన మహాకవీంద్రు నిజదర్శనవైభవ కౌతుకాగతుౕ
శ్రీనరసింహ పండితవరేణ్యకుమారు గణేశధీరు

ఉ. నీవుజగత్ప్రసిద్ధుఁడగు నిందుమతిం బదవాక్యమానవి
ద్యావిదులుౕ రసజ్ఞమణులౌనని మెచ్చఁగ సంస్కృతాంధ్ర భా
షావర కావ్యకల్పనవిచక్షణతౕ గణనాథ సత్కవీ

అను పద్మపురాణములోని పద్యములవలన మల్లారెడ్డికవికి సమకాలికుఁడై సంస్కృతాంధ్ర కావ్యరచనా శోభితుఁడగు గణేశ్వరకవి కుతుపుషాహ ఆస్థానకవిగ నున్నటులఁ దెలియుచున్నది. మహమ్మదీయుల నాశ్రయించిన కవులలో గణేశ్వరకవి నొక్కనిగ గణింపఁ వచ్చును. గణేశ్వరకవి గ్రంథరాజములింక లభింపలేదు.

కవిరాజగు మల్లారెడ్డి గ్రంథములు పెక్కులు తద్వంశీయులవద్ద నముద్రితదశలో నున్నటుల వినుచున్నారము. రెడ్డి సంఘమునకు ఆంధ్రవాఙ్మయమునకు సేవఁ జేయనెంచిన యీపత్రికలో దోమకొండ ప్రభువులు తత్కవిగ్రంథములు ప్రచురింతురుగాక.

– రెడ్డి రాణి (1 అక్టోబర్ 1923)

16. సురభి మాధవరాయకవి

ఇక్కవి చంద్రికాపరిణయమను నాఱాశ్వాసముల పద్యకావ్యమురచించి గోపాలాంకిత మొనరించెను. ఇతఁడు పద్మనాయక వంశజుఁడు. పద్మనాయకులను వెలమవారని సైతము వ్యవహరించువాడుక కలదు. ఒకానొకరు వెలమవారు పద్మనాయకులు వేఱనియు, వెలమవారు సంకర జాతివారనియు వ్రాసిరిగాని యది చాలప్రమాదము. పద్మనాయకపదము వెలమపదమునకుఁ బర్యాయపదమని నిరూపింపఁ బెక్కులాధారములు కలవు. వెలమవారు శూద్రులు కారనియు, సంకరులనియు వ్రాసిన రాత నిరాధారము. వెలమవారు సచ్ఛూద్రులనుటకు జంకనక్కరలేదు. శూద్రశబ్దమునకు బర్యాయపదముగ వెలమపదము గ్రంథములలోఁ గానవచ్చుటయే దీనికాధారము.

కం. ఈరెడ్డికొడుకు చెరియొకవలనఁ

కం. ఒక్కచతుర్థుండువచ్చి యొ దొరుఁగడవన్.

ఇటుల వాకొనిని రెడ్డినె చతుర్థునె యనంతామాత్యకవి భోజరాజీయములో వెలమయని వ్యవహరించియున్నాఁడు, చూడుఁడు:

చ. అనయము వేశ్య యీతరుణి యాతఁదు క్షత్రిముఁ దేసు విప్రుడన్
విను వణిజుండు వాఁ డతఁడు వెల్మయు నల్వురుఁ దొల్లి దీని ది
క్కునఁ జరియించుచుండుదుము కొండొకకాలముచెల్ల నింతి మా
మనములనున్న ప్రేమపరిమాణ మెఱుంగఁదలంచి యిట్లనిఁ.

– సప్తమాశ్వాసము

తెనాలి రామకృష్ణకవి పాండురంగ మాహాత్మ్యములోఁ జాతుర్వర్ణ్యముల వర్ణించుచు శూద్రులని చెప్పక నాల్గవజాతిని వెలమలని యిటుల నుద్గడించి యున్నాఁడు;

కం. హరుమౌళిహీర మచ్యుత
చరణాబ్జమరంద రేఖ జాహ్నవి లోకే
శ్వరి తనసోదరి యగునఁట
పురివెలమలభాగ్యరేఖ పొగడదరంబే.

– ప్రథమాశ్వాసము

శూద్రశబ్దమునకుఁ బర్యాయపదముగఁ బ్రాచీనప్రమాణ ములచేఁ బ్రయుక్త మైయున్న వెలమశబ్దము ద్రవిడములో (నీరుకట్టువారను నర్థముఁగల) వెళ్ళాన్మెలో బుట్టినది యూహించుట యసమంజసము. ఈ విషయమై విశేషించి చర్చించుట ప్రకృతముకాదు. షష్ఠ్యంతములలోని యీ క్రిందిపద్యమువలన మాధవరాయకవి వర్యుఁడు జటప్రోలుపాలకుఁడని తెలియుచున్నది.

కం. శ్రీవాసజ్జటప్రోల్ సం
భావుక పట్టణవిహార పటుశీలునకు
గోవర్ధన గోవర్ధన
గోవర్ధన వృష్టిహృతికి గోపాలునకున్.

ఈ జటప్రోలు నిజామురాష్ట్రములో గద్వాలసమీపములో నున్నది. జటప్రోలు కవిపాల్యమనుటకు నివాసమనుటకు సురభివంశచరిత్రమున దృష్టాంతరములు పెక్కులుకలవు. సురభివారి వంశ చరిత్రమున మాధవరాయ ప్రభుకవి జీవితముకాలము తెలుపఁబడియున్నది. జటప్రోలుసంస్థానపండితులు వ్రాసిన సురభివారి వంశ చరిత్రములోని కాలముల జర్చించుచు మాధవరాయప్రభుకవియే కాలమువాఁడో తెలిసి కొందము. చంద్రికాపరిణయమునఁ గవిస్తుతిలోఁ గవిత్రయము మాత్రము ప్రశంసింపఁబడుటచేఁ బ్రాచీనతరుఁడని తోచుఁగాని వంశావతారము సావధానముగ జూచితి మేని యితఁడు ప్రబంధయుగములోనివాఁడని తోపకపోదు. మాధవరాయప్రభువు తన వంశాదికమును వర్ణించుచు,

సీ॥ అరిపురభేదనాయత దోర్బలస్ఫూర్తి
నతరాజవర్ధన వితతకీర్తి
గనదహీనాంగద కవితబాహాలీల
ఖండితాహిత ఘనాఘన విహేల
సద్గణరక్షణ క్షమచరణాసక్తి
పటుచంద్రకోటీరభానిషక్తి
దతసర్వ మంగళాంచిత గాత్రరుచిపాళి
నచలధర్మోన్నత ప్రచయకేళి
తే॥గీ॥ ప్రకటదుర్గాధినాయక భావభూతి
వైరిదర్ప కదాంబక వహ్నిహేతి

నవని౸ బొగడొందె సర్వజ్ఞు౸ దన౸గ సింగ
ధరణిభృన్మౌళి తీవ్రప్రతాపహేళి. (I-22)

ఇట్లు సర్వజ్ఞ సింగభూపాలుని ప్రథమునిగ వర్ణించి యా వంశమున బెద్ద శౌరి జనించెనని చెప్పుచు నచటినుండి మాధవరాయకవి తనవఱకు వంశము౸జెప్పి కొనియున్నా౸డు. సర్వజ్ఞ సింగభూపాలు౸డు రసార్ణవసుధాకరము రచించినవా౸డును, బేతాళనాయని కేడవ పురుషు౸డునై యున్నా౸డు. ఇత౸డు క్రీ.శ. ౧౩౮౦ ప్రాంతములలో రాజ్యము పాలించుటచే మాధవరాయకవి సర్వజ్ఞ సింగభూపాలున కెంతయో తరువాతివా౸డు. మాదవరాయకవికాలము నిరూపింప సురభివారివంశ చరిత్రములో నొకటి రెండాధారములు కలవు. అందు సురభి మాధవరాయనికి రామరాజు ఇచ్చిన సనదునొక యాధారముగ౸ దీసికొనవచ్చును. ఇదియె ప్రథానాధారము. దాని నిట నుదాహరింతుము.

"పంపా విరూపాక్ష పదసేవకులైన విజయ విఠ్ఠల పాదసేవకులైన, శ్రీ గవి రంగనాయకుల పాదసేవకులైన, చక్రతీర్థసన్నిధానులైన, విద్వద్గజపతి ప్రౌఢదేవ రాయల సాంప్రదాయకులైన, అచ్యుతరాయ కృష్ణరాయల సాంప్రదాయకులైన రామరాజు మహారాజుగారు.

"ఆనెగొందితక్తు సింహాసనానికి అధిపతులైన సూర్యచంద్రాదులకు సృష్టికి అధిపతులైనవారు మాధవరావు ఫరజందు, మాధవరావు దేశముఖు దేశపాండ్యా పరగణే జటప్రోలుగారికి. అయితే మీరు తక్తుసింహాసనానికి హర్షాయమానులై మనఃపూర్వముగా వస్తిరి గనుక మీమీ౸ద కరుణతాత్పర్యం వుంచి సంస్థాన జట ప్రోలుగ్రామాలు మీరు సదానుకాలం అనుభవించడానకు అమరచేసి యిచ్చినాము. మీ పుత్రపౌత్ర పారంపర్యంతం ఆచంద్రార్కంగా సూర్యచంద్రులున్నంత సేపు అనుభవించుక కాతరుగా వుండవలెను. దీనికి నరపతు లెవ్వరైనా ఆక్షేపణ చేసి రాయనా కాశీలో గోహత్య బ్రహ్మహత్యచేసిన పాపానబోదురు. మ్లేచ్ఛు లాక్షేపణ జేసి రాయనా మక్కాలో వరహావతారాన్ని కోసినపాపాన బోదురు. ఇట్లని మా పెద్దల సుకృతముగాను, శ్రీ విరూపాక్షసాక్షిగాను, శ్రీ పర్వతసాక్షిగాను అమరం వ్రాసియిచ్చిన దానపత్రం సహి.

శ్లో॥ స్వదత్తా ద్విగుణం పుణ్యం పరదత్తానుపాలనం
పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్॥ ద॥ సాళ్వ అప్పాజీ.

ఈ దానపత్రమునుగూర్చి చెప్పకముందు విద్యానగర సంస్థానచరిత్రము నించుక వాకొనవలసియున్నది. కృష్ణదేవరాయలు క్రీ.శ. ౧౫౦౯ మొదలు ఇఱువది యొక్క సంవత్సరములు నానాదేశముల జయించి రాజ్యమేలి ౧౫౩౦ లోఁగాల ధర్మమొందెను. ఇతని యనంతరము తమ్ముఁడు సదాశివరాయలకును అచ్యుతరాయల పుత్రుఁడగు శ్రీరంగరాయలకును రాజ్యము నాకు నాకనుటలో వివాదము పుట్టెను. కృష్ణరాయల యల్లుఁడగు రామరాజు, అతని సహోదరులగు తిరుమలరాయఁడు, వెంకటపతిరాయలు, సదాశివరాయలపక్షమున నుండిరి. శ్రీరంగరాయలపక్షమున నచ్యుతదేవరాయల మామయగు సలకము తిమ్మరాజు నిల్చెను. ఉభయపక్షములు సంగ్రామములు సలుపఁ దుదకు సదాశివరాయలపక్షమునకే విజయమబ్బెను. పిమ్మట సదాశివరాయలు రాజ్యపాలనాకౌశల్యము కలవాఁడు కామిచే సోదరుల సహాయముతో విద్యానగరరాజ్యము రామరాజే చాలకాలము పాలించి క్రీ.శ.౧౫౬౫ లో జరిగిన తాళికోట యుద్ధములోఁ జనిపోయెను.

ఈ రామరాజే సామంతుఁడై పాలించుచున్న జటప్రోలుపాలకుఁడగు సురభి మాధవరాయప్రభునకు సర్వాధికారములతో సంస్థానాధిపత్యము నొసంగెను. బహుశః మాధవరాయనిపూర్వు లెవరేని సదాశివరాయలకు, శ్రీరంగరాయలకు జరిగిన సంగ్రామములో రామరాజునకు సహాయము పోయియుందురేమో తెలియదు.

దానపత్రములో నుదాహరింపఁబడిన మాధవరాయలె చంద్రికాపరిణయ కర్తయని పీఠికలో తిరుమల సెట్టి జగన్నాధకవిగారు వ్రాసియున్నారు. మాధవరాయ కవి భట్టుమూర్తికి సమకాలికుఁడనియు నెలకూచి బాలసరస్వతి కాశ్రయుఁడనియు సురభి వంశ చరిత్రకారులు వ్రాసియున్నారు. ఇంతతోఁబోక మాధవరాయకవి క్రీ.శ.17 శతాబ్దారంభములో నుండెననియు సంస్థానపు సనదుఁబొందిన మాధవరాయలంతకుఁ బదితరములు పూర్వుఁడని చెప్పియున్నారు. వీనిని సమన్వయించినఁగాని మాధవరాయకవికాలము నిరూపింప వీలుచిక్కదు.

ఎలకూచి బాలసరస్వతి యప్పకవికంటెఁ బూర్వుఁడని యప్పకవీయమువలనఁ దెలియును. అప్పకవియమున శాలివాహననామశకమున 'గజశైలశరసుధాకిరణుల సంఖ్యదనరి' అనుటచే శా.శ.౧౫౭౮ కు సరియగు క్రీ.శ.౧౬౫౬ లో నప్పకవీయ మారంభింపఁబడి యుండును. ఆంధ్రశబ్దచింతామణివ్యాఖ్యాతగు నెలకూచి బాల సరస్వతి యప్పకవినాఁటికి గతించి ప్రమాణకవిగా నుంటచే బాలసరస్వతికాలము క్రీ.శ.౧౫౩౦ ప్రాంతమునకు సమీపమనుట నిర్వివాదాంశము. ఇంచుమించుగ

రామరాజభూషణుఁడు నాకాలమువాఁడె. కాన మాధవరాయకవి తప్పక విద్యానగర పాలకుఁడగు నళియరామరాజు కాలమువాఁడనియు, రామరాజు రాజ్యావసానదశలో మాధవరాయలు సంస్థానపతియై సనదుపొందెననియె యూహింపవలయును. అటు లూహిఁతుమేని బాలసరస్వతి, రామరాజభూషణుఁడు, రామరాజు, మాధవరాయలొక కాలమువారనుట పొసఁగును. వీరేశలింగముపంతులువారు సైతము రామరాజు వలన సనదునొందినది చంద్రికాపరిణయకర్తయగు మాధవరాయలేయని మల్లభూపాలీయము పీఠికలోఁజెప్పియున్నారు. సురభివా రెతనిని జటప్రోలు సంస్థానపు సనదు నందినటుల భావించిరో యా మాదానాయఁడు దేవరకొండ రాజ్యము బాలించుచుండెను. స్వతంత్రుడు. పైగ నీమాదానాయఁడు క్రీ.శ.౧౪౫౦ లోనున్న పదియవ తరపు సర్వజ్ఞసింగవిభునకు మునిమనుమఁడుగాన నెంతముందునకులాగినను క్రీ.శ. ౧౫౪౧ కంటె యీవలివాడుకాఁజాలఁడు కాన నిరాక్షేపముగ రామరాజువలన సంస్థానపు సనదందినది మాదానాయకుఁడు కానేరఁడు. మాదానాయకుఁడు రామరాజునకెంతయో పూర్వుఁడు.

ఎలకూచి బాలసరస్వతి మాధవరాయకవికి సమకాలికుఁడు గాన నాతని యానచే మల్లభూపాలీయమను పేరుతో భర్తృహరిసుభాషితములను తెలిగించియున్నాఁడు. మాధవరాయకవి రామరాజువలన సనదుఁబొందెను. చంద్రికాపరిణయము రామరాజనిధనానంతరమున రచింపఁబడిన వసుచరిత్రమునకుఁ బిమ్మట రచింపఁబడి యుండును. మాధవరాయకవి రామరాజు రాజ్యాంతములో నసఁగా క్రీ.శ. ౧౫౫౦ మొదలుకొని ౧౬౦౦ వరకు జీవించియుండెనని నిర్ణయింపవచ్చును. మాధవరాయకవిని గూర్చి యొక చాటువు కలదు.

ఉ. సురభికులామలాబ్ధిఁ బొడసూపిన మాధవరాయచంద్రుఁ డా
సరసపదార్థరంజనము సత్కవిహృద్యముగాఁగఁ జంద్రికా
పరిణయముఞ్ రచించె నది భావ్యము నీ వసుచర్యచూడఁగాఁ
బరగె నిగూఢవృత్తి నటువర్తిలె నీకును మూర్తినామముఞ్.

ఇపద్యమువలన మాధవరాయకవిచంద్రికాపరిణయము, వసుచరిత్రరచనా నంతరమున ముగింపఁబడెనని తెలియును. ఇపద్యముయొక్క యాథార్థ్యమెటులున్నను చంద్రికాపరిణయమునకు వసుచరిత్రకు సంబంధము లేకపోలేదు. మానపల్లి రామకృష్ణకవిగారు మాధవరాయకవికాలము క్రీ.శ. ౧౬౮౦ అనిరి గాని యది

ప్రమాదము. వారె చంద్రికాపరిణయము మాధవరాయ ప్రభువర్యుఁడు తోరణాల చొక్కయామాత్యుని సహాయముతో వ్రాసెననియు నందువలనఁ జొక్కయామాత్యుని సమకాలికులు "తోరణాలచొక్క! దొంగకుక్క!" యని యందురని వ్రాసియున్నారు.

మాధవరాయకవి పరిపాలనమునకు రాకముందుఁ జంద్రికాపరిణయము రచించెనని జటప్రోలు సంస్థానపండితులు వ్రాసిరిగాని చంద్రికాపరిణయములో మాధవరాయనిగూర్చిన

"తే॥ గీ॥ ఆ ధరాధీశు పిమ్మట నఖిలభూమి
భరము నీవు ధరించితి కిరికులేంద్ర
కమఠవల్లభ కులశైల కరటిసంస
దురగనాథులతోడఁ బెన్నుద్దివగుచు॥" (I-66)

అను పద్యమువలన ప్రభుత్వము చేయుచున్న కాలములోననె గ్రంథరచనము జరిగినటుల స్పష్టమగుచున్నది.

మాధవరాయకవి కాలనిరూపణమునకు మఱియొక బలమగునాధారము కలదు. మాధవరాయప్రభువర్యునకు నారాయణరావు, తిరుమలరావు, నరసింహరావను ముప్వురు పుత్రులు కలరు. ఈ ముప్వురు గోలకొండ పాలించుచున్న సుల్తాన్ అబ్దుల్ హసన్ ఖుత్కుషాగారి వలన నీ ఫర్మానా పొందియున్నారు. దాని నిట నుదాహరించు చున్నారము:

"మీతండ్రికార్‌కిద్దున నడుచుచున్న సంస్థానములు కదీము, జటప్రోలు, వ.ఫూట్ మొఖాసాగ్రామాలు, వ.సూగూరుకొత్తకోట, వ.దేహాయనెడి వెన్ను, ఇజారతి, దేఖీలు, యెప్పటివలె మీతండ్రి మాధవరాయని కార్‌కిద్దున నడిచినట్లు మీకు శాశ్వతంగా నిరాచ్ఛేదముగ మొకరరుచేయ నవధరించినారము. కాన ఖాతరుజమాతోటి కమావిసు చేసుకునేది."

* * *

సిత్ పమానీసు అలఫ్ (ఫస ౧౦౭౮)

మాధవరాయకవిపుత్రులకు సంస్థానస్వతంత్రమొసంగిన గోలకొండ నవాబగు అబ్దుల్ హసన్‌కుతుబ్ షా (తానీషా) క్రీ.శ. ౧౬౭౧ మొదలు ౧౬౮౭ వఱకు రాజ్యమేలెను. సనదుసైతము రమారమి క్రీ.శ. ౧౬౮౦ లో నొసంగఁబడి నదిగాన మాధవరాయకవి కుమారులు ౧౬౮౦ లోనుంటచే నతఁడు పదునేనవ శతాబ్ద

మధ్య భాగముమొదలు నాశతాబ్దాంతమువఱకు నుండెననుట విశ్వసనీయము. మాధవరాయలు విద్యానగర పాలకుఁడుగనున్న రామరాయలవలన సంస్థానపుననదు నొందినను రామరాయలు తల్లికోటయుద్ధములో మడియుటచే నాప్రాంతములు తరుష్కుల యధీనమాయెను. కాననే సంస్థానాధిపత్యమునకుఁ దురుష్కుల యాజ్ఞాపత్త్రము మాధవరాయకవిపుత్రుల కావశ్యకమయ్యెను. సురభివారి వంశ చరిత్రములోఁ జరిత్రకారులు చూపిన దృష్టాంతరములన్నియు మాధవరాయకవి క్రీ.శ. ౧౫ వ శతాబ్ది యంత్యములోనివాఁడని చాటుచుండ నిరాధరముగఁ బదునేడవ శతాబ్దములోని వాఁడనుటకుఁ గారణము తెలియదు. వసుచరిత్రము రచింపబడిన కొలఁదికాలము నకె మాధవరాయకవి చంద్రికాపరిణయమును రచించెననియు, భట్టుమూర్తియు, మాధవరాయలు, ఎలకూచి బాలసరస్వతి పదునేనవ శతాబ్దాంతమున నుండిరనియు విశ్వసించుట యుక్తము. చంద్రికాపరిణయము పద్యపుఁబోకడలలో వసుచరిత్రము నకుఁ బ్రతిబింబ మనఁదగియున్నది. రామరాజభూషణుఁడు చెప్పినభావమునె మాధవరాయకవి పదములుమార్చి యట్టి భావములనే యేర్చి వ్రాసినటుల వర్ణనము లన్నియు సాక్ష్యమీయఁగలవు.

సీ॥ తరుణార్క కబళనోద్ధతిఁ జూపెనెవ్వాఁడు
  రుచులచే ఫలమోహరుచుల చేత
నకలంక రామముద్రికఁ బూనెనెవ్వాఁడు
  శయముచే హృత్కు శేశయముచేత
మున్నీరుఁ బల్వలఁబుగ దాఁటె నెవ్వాఁడు
  జపముచే గుణగణార్జవముచేత
నక్షశిక్షాప్రౌఢి నలరారె నెవ్వాఁడు
  రణముచే నియమధారణముచేత

తే.గీ. ధరణి నెవ్వాఁడు దానవద్విరద దళన
విహృతిఁ దనకేసరికిశోరవృత్తిఁ దెలిపె
నతని మత్కావ్య భవ్య వాగమృత ఘటన
మంజులస్వాంతు హనుమంతు మదిఁదలఁతు ॥

– వసుచరిత్రము.

సీ॥ వనరాశి భంగంబుఁ గనఁ జేసె నెవ్వాఁడు
  కరముచేఁ బర్వతోత్కరముచేత

ఘనవలాహకశక్తిఁ గలిగించె నెవ్వాఁడు
రుతముచే వేగమారుతము చేత
నరిపుర విస్ఫూర్తిఁ బరిమార్చె నెవ్వాఁడు
హేతిచే నిజనఖహేతిచేతఁ
దతమహామిత్రవర్ధనమూన్చె నెవ్వాఁడు
క్షణమచే మధురవీక్షణముచేత

తే.గీ. నవని నెవ్వాఁడు జానకీస్వాత్మసూచ
నాంజ నాత్మజవిఖ్యాతి నధిగమించె
నతనిమామకకృతి చమత్కృతికిఁ దలఁతు
మహిత ధీమంతు హనుమంతు మానవంతు.

– చంద్రికాపరిణయము

సీ॥ వసుమతీభాగ ధూర్వహత నెవ్వనియుర్వ
రావరాహాంక మర్థత వహించు. (వసు)

సీ॥ నిజకటకాశ్రిత ద్విజపోషణమున నె
వ్వని సార్వభౌమత ఘనతగాంచు (చంద్రి)

సీ॥ కుంతలస్థలికి నే గుణగరిష్టనిచీటి
కమనీయ కేతకీ గర్భదళము (వసు)

సీ॥ లాటాంతరమున కే లలితవిగ్రహు గుణ
శ్రేణి వినూతన చిత్రరచన (చంద్రి)

సీ॥ కురులపట్టునకు నే యురుకలానిధియాజ్ఞ
తరుణచంపకగర్భ దామకంబు. (చంద్రి)

మ॥ ఘననాభీగుహచెంత నారుపొగ లేఁగౌనాని తా నాయనం
గుని మెప్పించి తదాత్మతం బొరయఁ గన్గోఁజాల కుజ్జృంభిత
స్తనయుగ్మం బతనుత్వమొందె నధరోష్ఠం బిక్షుధర్మస్థితిన్
దనరెం గన్నులు శంఖరాహితగతిన్ దాల్చెన్ బయోజాస్యకున్.

– వసుచరిత్రము ఆ. ౨

మ॥ నవరోమావళి యష్టికాగ్రముపయి రాజిల్లి చందోయి తా
నవి మెప్పించి తదాత్మత న్మన నసూయన్ గ్రీవ యబ్జాప్తు పై

భవముంజేకొనె నొంచె మున్నరుణబింబస్ఫూర్తిఁ గెమ్మోవి వే
ణి విరాజిల్లె దమస్సపత్నగతి నెంతేదాల్చి యయ్యింతికిన్. చంద్రి.ఆ.3

సీ॥ **స్వామియై నిగమాతిభూమియై సురపురో**
గామియై యబ్ధిజా కామియుండ ఆ. ౪ (వసు).

సీ॥ **పరమతుత్పరమారి పరమారి భర్తయై**
కర్తయైవెలయు శ్రీ భర్తయుండ ఆ. ౪ (చంద్రి).

ఇట్లుభయగ్రంథములకు వర్ణనములలో నెంతయో పోలిక గలదు. కవులిరువురు సమకాలికులగుటచేఁ బౌర్వాపర్యనిర్ణయము సామాన్యము కాదు. రెండుగ్రంథములు సమగ్రముగఁబంచుటచే మాదృష్టికి వసుచరిత్రము ప్రథమగ్రంథమనియె తోఁచినది. వసుచరిత్రములోనున్న పద్యములు భావగంభీర్యము, పదప్రయోజనము స్వభావ ధారళముకలవిగ నున్నవి. చంద్రికాపరిణయములోని ప్రతిబింబపద్యములలో ధారాళము, సౌష్ఠవము కానరాదు. వసుచరిత్రములోని రాజవంశావతారపద్యములు, గిరికావర్ణనము, ఇష్టదేవతాస్తుతి చంద్రికాపరిణయములోఁ బ్రతిబింబములుగ నున్నవి గాని సర్వవిధముల వసుచరిత్రములో పద్యములే మాతృకలుగనున్నవి. వసుచరిత్ర మునన్నున్న సీ॥ లలనాజనాపాంగ (ఆ ౧. ప. ౧౨౬) సీ॥ ధ్యానంబు హృదయ వాస్తవ్యకుటుంబికి (ఆ.3 ప.౧౭౦) శా॥ రాజీవాక్షులనేచు పాతకివి (ఆ.౪ ప.౨౭) మొదలగు మనోహరములగు భావములుగల పద్యములు చంద్రికాపరిణయమున లేవు. వసుచరిత్రములోని పద్యములతోఁ బోలికలేని చంద్రికాపరిణయములోని ప్రథమా శ్వాసమందలి సుచంద్రమౌనిసంవాదము, ద్వితీయాశ్వాసములోని మౌనితపోభంగ యత్నము, చతుర్థాశ్వాసములోని వసంతాదివర్ణనములు, పంచమాశ్వాసములోని స్వయంగ్రహాగతప్రభువర్ణనము – మాథవరాయకవి స్వతంత్రముగ వ్రాసినవని చెప్పవచ్చును. ఇవి వసుచరిత్రములోని స్వతంత్రపద్యములకుఁ బోలికలగు పద్యములన్నింటికి దీసిపోవుచున్నవి. దీనినిఁబట్టి విచారించినచో చంద్రికాపరిణయము వసుచరిత్రమునకుఁ బ్రతిబింబమని తోఁపకపోదు. మాధవరాయకవి వర్ణనాంశముల యందు వసుచరిత్రముపై లక్ష్యముంచెననియు గొంతవఱకుఁ బద్యపరికరములు సైతము వసుచరిత్రమునుండి సంగ్రహించెననియు దోచుచున్నది. వసుచరిత్రమునే ప్రమాణముగఁ దీసికొని యాపోలికలనే యనుసరించుటచేఁ జంద్రికాపరిణయము లోని కొన్నిభాగములు తృప్తికరముగ నుండుట లేదు.

మ॥ జనకోత్సంగ నివాసవాసననొ రాజన్యస్తహస్తాభిమ
ర్శన సౌఖ్యామృత పారవశ్యముననో సైచెౙ శిలాయోజనం
బని సాధ్వుల్వొగడౙ బ్రియాంఘ్రిసనెకల్ హత్తించె భూజాని త
ద్ఘనభాగ్యంబు ఝుళంఝుళత్కటక రత్నంబుల్ ప్రశంసింపగౙ.

– వసుచరిత్రము ఆశ్వా.౬ ప.౩౨

మ॥ సనెకల్‌హత్తఁగఁజేసె నంఘ్రి చెలి చంచత్కుడ్య చిత్రాత్మ ని
ల్చిన కంతుండు పురాకృతాగముచనౙ జిత్తంబులో నిల్పియం
చనురక్తిౙ దనుఁబ్రోవుమంచుఁ దదనుచ్ఛాయోపధిం డాసి వం
దనమూన్పంగని ప్రోతునం చభయపాదంబూను చందంబునౙ.

– చంద్రికాపరిణయము, ఆశ్వా.౬ ప ౭౪

తండ్రియగు కోలాహలపర్వతునితొడమీదఁ గూర్చుండు నలవాటుననో, రాజు తనుఁదాకుటచేఁ బారవశ్యమొంది మేనెఱుంగకయో గిరికాదేవి సన్నెకల్లు కాలితోఁ దాకెను. ఆసన్నెకంటికి సజాతీయములగు గిరికాకటకరత్నములు ధ్వనిమిషచే నాకార్యమును బ్రశంసించెను. భావమును మాధవరాయకవి హృదయమందుంచుకొని మున్నలయించిన కుడ్యమందుఁ బ్రతిబింబముగల మన్మధుఁడు వెనుకటికోపము మానుమని సన్నెకంటియందుఁ బ్రతిబింబించి వేడ నందులకియ్యకొని యభయపాద మిచ్చి నటుల చంద్రిక సన్నెకల్లుత్రొక్కెనని చెప్పియున్నాఁడు. ఆర్తున కభయపాదము నీయరు. అభయహస్త మొసంగెదరు. ఇదికాక కుడ్యగతబింబము సన్నెకఁటిపై ప్రతిబింబించుటయుఁ గుడ్యమున మన్మధబింబముంటయు నసంభవముగాన నిటఁ బ్రతిబింబము గనున్న నీపద్యములో భావముచెడినదని చెప్పవచ్చును. మాధవరాయకవిపద్యము రామరాజభూషణుని పద్యమునకు ప్రతిబింబము కాదనవీలులేదు. సన్నెకల్లు అనుదేశ్యమును సనెకల్ అనుటయు ద్రొక్కించుట యనునర్థమున రూఢముగాని హత్తించుటనునటులే ప్రయోగించుటయుఁ జూడ వసుచరిత్రములోని పద్యము చంద్రికాపరిణయంబునఁ బ్రతిబింబిత మయ్యెనని తోఁచును.

రమారమి రెండువందలపద్యములు వసుచరిత్రములోని పద్యములతోఁ బోలి నంతమాత్రమునఁ జంద్రికాపరిణయకర్తపై దోసమారోపింప వీలులేదు. పద్యవుఁ బోకడలు మనోహరముగ నుండటచేతను, బలుమాఱు వసుచరిత్రము పఠించి సరసములగు పద్యములు కంఠస్థముఁజేసికొని యుంటచేతను చంద్రికా పరిణయములోఁ బోలికపద్యములు పడియుండునుగాని వేఱుగాదు. ఇంతమాత్రముచే

మాధవరాయకవి గ్రంథచౌర్య మొనరించెననరాదు. ఒక మాధవరాయకవియేగాక యాధుని కులందఱు వసుచరిత్రమును దృష్టిపథమునందుంచికొని కావ్యసూత్రములఁ బన్నినవారె. రామరాజభూషణునకు శ్లేషలు, యమకములు సహజములు మఱియు నతఁడు సంగీతపండితుండగుటచే నాచాయలుసైతము కొన్నిపద్యములలోఁ గలవు. నేటికి వసుచరిత్రములోని పద్యములు కీర్తనలవలె పాడువారు కలరు. అందుఁగల యమకము ముక్తపదగ్రస్తములు సంగీతనియమములకుఁ దాళములకు ననుకూల పడుచున్నవి. చంద్రికాపరిణయములో నాలుగవ యాశ్వాసమంతయు యమక కవిత్వముగ నున్నది. యుక్తభాగములలో రసపుష్టియుఁ గఱవులేకున్నది. వసుచరిత్ర మునకిది పోలుటచే నుభయగ్రంథములఁ బరిశీలించుతఱి ప్రథమగౌరవము వసుచరిత్రమున కొసంగవలయునేగాని, చంద్రికాపరిణయము సామాన్యప్రబంధము గాదు. మాధవరాయకవి సంస్కృతాంధ్రములయందుఁ దర్కవ్యాకరణములయందుఁ గృతపరిశ్రముఁడని గ్రంథము సాక్ష్యమీయఁగలదు. గ్రంథమధ్యమునఁగల కాళీస్తుతి దండకము పరిశీలించినఁ గవికిఁగల సంస్కృతభాషాభినివేశము వెల్లడికాఁగలదు. చంద్రికాపరిణయము నిర్దుష్టప్రబంధము. ఇందుఁ గథానాయికయగు చంద్రిక పాంచాలదేశాధీశ్వరుఁడగు క్షణదోదయనృపాలుని తనయ. ఈయమను సుచంద్రుఁడను నృపాలుఁడు పెండ్లాడుటయను కథను విస్తరించి యాఱాశ్వాసముల పద్యకావ్యముగ రచించెను. ఈ సుచంద్రుఁడు రామాయణములో నిటులఁ బ్రశంసింపఁబడి యున్నాఁడు.

విశాలస్యసుతో రామ హేమచంద్రో మహాబలః
సుచంద్ర ఇతివిఖ్యాతో హేమచంద్రా దనంతరం. – బాలకాండము.

రామాయణములో సూత్రప్రాయముగనున్న యీ సుచంద్రచరిత్రము విస్తరించి మాధవరాయకవి యాఱాశ్వాసములలోఁ జెప్పియున్నాఁడు. ఈ చంద్రికాపరిణయము సరసముగను శ్రావ్యముగనునున్నది. ఆంధ్రగ్రంథరాజములలో నిదియొకటి. ఇది వసుచరిత్రము తరగతిలోఁ జేరినదగుటచేఁ గథాంశము విమర్శించుపట్ల నుభయ గ్రంథములను జర్చించు టావశ్యకమగును. గ్రంథమును యమకముతో నొక యా శ్వాసము నింపఁబడియున్నది. శ్లేషకవి యంత్యనియమములు మెండుగాఁగానవచ్చును. ఇందు గర్భకవిత, బంధకవిత, పాదభ్రమకాదివిపరీత శిల్పములు లేవు. ఇందుఁ గథాంశమెటుల సమర్థింపఁబడెనో పాత్రపోషణమున కెంతవీలు కవి కలిగించుకొనేనో కథా భాగములఁ గవియెటులఁ బోషించెనో తెలిసికొందము.

– సారస్వత సర్వస్వము

17. నిజామురాష్ట్రాంధ్ర కవులు

ఆంధ్ర దేశమునందుఁ జాలభాగము నిజాము రాష్ట్రమునందున్నది. ఆంధ్రులలో సుప్రసిద్ధులగు రాజన్యులు పలువురు నిజాము రాష్ట్రము నందలి చరిత్ర స్థలములలో నివసించి వాఙ్మయమునకు శిల్పమునకు జాతికి నమోఘమగు సేవఁగావించి కృతార్థులైరి. నిజాము రాష్ట్రములోని చాల భాగ మాంధ్రదేశ మనియు, సుప్రసిద్ధ పూర్వకవివతంసులలోఁ బలువురు నిజాము రాష్ట్రమునకుఁ జెందిన వారెయనియుఁ జాలమంది కింత వఱకుఁ దెలియదనియె చెప్పవచ్చును. పరిశోధకులు బ్రిటిషు ఆంధ్ర దేశమునందె తమ దృష్టి ప్రసరింపఁజేసి చరిత్ర గ్రంథముల ముగించుటచే నిజాము రాష్ట్రము నందలి చరిత్ర మింత వఱకు దుర్భేద్యముగా నుండె ననుటలో సాహసము లేదు.

నిజాము రాష్ట్ర వైశాల్యము ౮౨ వేల ౬౯౮ చదరపుమైళ్లు. ఆందాంధ్రభాగము ౪౧ వేల ౩౪౧ చదరపు మైళ్ల వైశాల్యమునఁ దెలుఁగు దేశము సగ భాగమునకుఁ జేరువలోనున్నది. నిజాము రాష్ట్రములోని పదియాఱు మండలములలో ఒరంగల్లు, కరీమునగరము, అత్రాపుబల్దా, మెదకు మహబూబునగరు, నల్లగొండ యగు నారు మఁడలములు సంపూర్ణముగా నాంధ్ర మండలములు. ఆదిలాబాదు జిల్లాలోని నిర్మల, చెన్నూరు, లక్సెట్టిపేట, తాలూకాలు తక్క మిగిలిన భాగము, నిజామాబాదులోని బోధను తాలూకా తక్క మిగిలిన భాగము, గుల్బర్గా జిల్లాలోని కొడంగల్లు తాలూకాయు రాయచూరు జిల్లాలోని అలంపూరు తాలూకాయు రాయచూరు తాలూకాలో మూడు వంతులు తెలుఁగు ప్రదేశములుగాఁ బరిగణింపవచ్చును. ఇటఁగల యాంధ్రులసంఖ్య ౬౪౧౯౨౯౮. ఇంత విశాలమగు ప్రదేశమును ఉపేక్షా దృష్టితోఁ జూచుట చేతనే ఆంధ్రుల చరిత్రము ఆంధ్ర కవుల చరిత్రను అసమగ్రములుగ భావింప వలసి వచ్చినది. యాదవ చాళుక్య, చోళ, రాష్ట్రకూట, కాకతీయాది పూర్వ రాజన్యులు రాజధానిగాఁ జేసికొని పరిపాలించిన యీ నిజాము రాష్ట్రమున సమగ్రమగు పరిశోధనము జరుగనంత వఱకు మనదేశ చరిత్రము లన్నియు నసమగ్రమలనక తప్పదు. ప్రకృతము నిజాము రాష్ట్రమునఁగల కవులెందఱో! సారస్వత మీ రాష్ట్రమున నెట్టి నూతన వికాసముల నొంది యెన్ని యంత శ్శాఖలతో శోభించెనో తెలుపుటకీ చిన్న వ్యాసము వ్రాయ నారంభించితిమి. విస్తరము ప్రత్యేక గ్రంధమున నివేదింతుము.

ప్రత్యేకించి నిజాము రాష్ట్రమునందు గల ఆంధ్రకవులను దెలిసికొని చరిత్రము వ్రాయుట యవసరమైయున్నది. ఘనత వహించిన నిజాము ప్రభువుగారి పరిపాలనము నందున్న దేశములోని యాంధ్ర భాగమున గల పూర్వ కవుల చరిత్రములను సేకరించి నిజాం రాష్ట్రమందలి యాంధ్ర కవుల చరిత్ర వ్రాయుట చాల ముఖ్యకార్యము. నిజాము రాష్ట్రములోని కొంత భాగము సుప్రసిద్ధాంధ్ర దేశమను తలంపు జనసామాన్యమునకుఁగలుగఁ జేయుటకుఁ బూర్వ ప్రశస్తి తెలిపి వాఙ్మయ నిర్వహణమునకు వర్తమాన నిజాము రాష్ట్రాంధ్ర సోదరులఁ బ్రోత్సహించుటకె యీ ప్రత్యేక చరిత్ర రచనము గావింప వలెనని మేము సంకల్పించితిమి.

నిజాము రాష్ట్రము నందలి యాంధ్ర కవుల చరిత్రము వ్రాయుట సామాన్య కార్యము కాదు. ఈ రాష్ట్రమునఁ గల ప్రాచీన గ్రంథములు సమగ్రముగా సేకరింపఁ బడలేదు. సమకూర్చి యుపయోగార్థముగా నుంచఁబడిన లిఖిత పుస్తకాలయములు లేవు. గ్రంథస్థములగు గ్రామనామములు పెక్కులు మహమ్మదీయ నామాంకితముగా మాఱియున్నవి. పెక్కు గృహములందు తాళపత్ర గ్రంథములు చివికి జీర్ణించుచున్నవి. ఈ పరిస్థితులలో నిజాము రాష్ట్రాంధ్ర కవులను గూర్చి చరిత్రాంశములు సేకరించుట కష్టతరము. ఐనను బరిశోధన పరిచయమును బురస్కరించి కొని నిజాము రాష్ట్రమునఁగల యాంధ్ర మహాకవుల చరిత్రమును సూత్ర ప్రాయముగ నీవ్యాసమునందుదాహరించు చున్నారము.

కవి జీవితము వ్రాయుతఱి నిజాము రాష్ట్రమున నేయే సంస్థానములు, రాజ్యములు కవులకుఁ దోడ్పడెనో యెటనేయే కవివరులు వసించిరో తెలిసికొనుట యవసరము. రాజావలంబనముఁ గవులకుఁ గలిగిన ప్రోత్సాహము తొలుత గమనింతము. ఆంధ్ర కవులకుఁ గాకతీయ సామ్రాజ్యము మిగులఁ దోడ్పడినదని చెప్పక తప్పదు. ప్రోలరాజు కాలము నుండి కాకతీయులు స్వతంత్ర పతాకమును లేవనెత్తిరి. కాకతి ప్రోలరాజునకు సమకాలికుఁడై శైవమత ప్రచారమునందు నిరంకుశముగాఁ గృషి చేసిన మల్లికార్జున పండితారాధ్యుల వారినె మనము నిజాము రాష్ట్ర ప్రథమాంధ్ర కవిగా భావింపవచ్చును. ఈయన నాఁటి నుండి నేఁటి వఱకు వీరశైవ కవులు మత గ్రంథముల నాంధ్రభాషలో వ్రాయనారంభించిరి. మల్లికార్జున పండితారాధ్యులు నిజామున రాష్ట్రములోనే ప్రాంతమున జనించెనో తెలుప నాధారములు లేవుగాని, నిజాము రాష్ట్ర వాసియని కంఠోక్తిగాఁ జెప్పవచ్చును. హనుమకొండ స్వయంభూ దేవాలయమున నొక స్తంభముపై

నీయన నామముగలదు. దాదాపు ఆరాధ్యుల కాలమున వ్రాయఁబడినది. ఆ స్తంభము చెంత నాసీనుఁడై మత చర్చ గావించు వాఁడు గాన జ్ఞాపకార్థము నామము నా కాలమున వ్రాసియుందురు. రామప్ప గుడులలో ముఖ భాగమునందలి శిలపైని మల్లికార్జున పండితుని విగ్రహము ఆయన నామము చెక్కఁబడి యున్నవి. సోమనాధకవి పండితారాధ్య చరిత్రములో మల్లికార్జున పండితారాధ్యుల జీవితము వ్రాసెను. చందవోలు, అమరావతి లోనగుచోటుల బౌద్ధమతస్థుల నోడించి పండితారాధ్యులు వారలకు శైవ మతదీక్ష ప్రసాదించెను. నల్లగొండ చెంతఁగల పానుగల్లు చేరి యచట రాజుగనున్న ఉదయుని దర్శించి కొంతకాలమట నివసించెను గాని కారణాంతరములచే నుదయుని శపించి కళ్యాణము నకుఁ బ్రయాణ మయ్యెను. పండితారాధ్యులు పోయిన బహమనీ రాజ్య ముఖ్య స్థానమగు పానుగల్లని కీ.శే. లక్ష్మణరావు పంతులు వారు చెప్పిరి. కాని యదిసరిగాదు. నల్లగొండ చెంతఁగల పానుగల్లె మల్లికార్జున పండితులు సందర్శించిన చోటు. అచటి శాసనములలోఁ చోడుల పేరులు గలవు ఉదయచోడుని పేర ఉదయసముద్ర మనుతటాకము గలదు తటాకమునకి పేరున్న సంగతి యచటి ఛాయాసోమేశ్వరాలయములోని శార్ఙపాణి శాసనమునందు గలదు. కలుకోడి యచటఁ గలదని క్రీడాభిరామమునందును పల్నాటి వీర చరిత్రమునందును గలదు. పండితారాధ్యులు శాపమిడ కలుకోడి కూసినటులఁ బండితారాధ్య చరిత్రమునందుఁ గలదు. మల్లికార్జున పండితారాధ్యులు బసవేశ్వరుని దర్శింప కళ్యాణపురమున కేఁగుచుండఁ ద్రోవలో నాయున కూడలిలో లింగైక్యమయినటులఁ దెలిసి నల్లగొండ నుండి కళ్యాణ నగరమునకుఁ బోవు త్రోవలోనున్న "వెల్లటూరు" నందుఁ దామను లింగైక్యమయ్యెను. వీనిని సమన్వయించితి మేని మల్లికార్జున పండితారాధ్యులవారు నిజాము రాష్ట్ర ప్రథమాంధ్ర కవియనియు ఆయన రచించిన 'శివతత్వ సారము' లభించి నంతలో నిజాము రాష్ట్ర ప్రథమాంధ్ర గ్రంధమని యంగీకరింప తప్పదు. ఈయన పేరు కర్ణాటకవి చరిత్రమునందుఁగూడఁ గలదు. కర్ణాటాంధ్ర భాషలలోని నీ కవి పెక్కు గ్రంథములు రచించెను గాని యవి కనఁబడవు శివతత్వ సారము అసంపూర్ణ ప్రతి మాత్రమిపుడు లభించుచున్నది. ఈయన పశ్చిమ చాళుక్యుల కడను గాకతీయులకడను దండనాయకుఁడుగా నుండెను. ఈ కవి కాలము క్రీ.శ ౧౧౨౦- ౧౧౮౦ అయియుండును.

మల్లికార్జున పండితారాధ్యులు గతించిన కొలఁది కాలమునకు ఆయన జీవితచరిత్రమును పాలకురికి సోమనాథ కవిద్విపద కావ్యముగా వ్రాసెను. ఈ సోమనాథ కవి కాకతీయ (ప్రథమ) రుద్రదేవుని కాలమువాఁడు. రుద్రదేవుఁడు సంస్కృతాంధ్ర కర్ణాట భాషలలోఁగవి. సోమనాథుఁడు సంస్కృతాంధ్రములందె గాక కర్ణాట భాషలోఁ గూడఁ గొప్ప గ్రంధములు వ్రాసి కన్నడ కవియగు సోమరాజుచె స్తోత్రములందెను. సోమనాథుఁడు ఓరుగల్లునకు నాలుగామడల దూరమందున్న పాలకురికిలో సిద్ధిపొందెను. రుద్రదేవుని కాలమునఁగల కవులలో రామేశ్వర దీక్షితుఁడను సంస్కృత కవి యొకఁడు గలఁడు. హనుమకొండ శాసనమాయన రచించినది. ఈ కవినిఁ గూర్చిన వృత్తాంతము మనకేమియుఁ దెలియరాదు. గణపతి దేవుఁడు రుద్రమదేవుల కాలమునఁ గల విశ్వేశ్వర శివ దేశికుఁడు ఒక ప్రసిద్ధమహాకవి. ఈయన ఒక శతకము పురుషార్థ సారము అను పొత్తముల రచించెను. ఇంతకుమున్ను వర్ధమాన పురమునందు రుద్రదేవుని కాలమునందున్న గోకర్ణుఁడు ఛందస్సును దెలుఁగులో వ్రాసెను. గోకర్ణ చ్ఛందస్సును అప్పకవి పేర్కొనెను. కవి జనాశ్రయము భీమకవి కృతముకాదు గోకర్ణ కృతమను నొక వాదముగలదు. ఇది చర్చించుట ప్రకృతము కాదు. రుద్రమదేవి ప్రతాప రుద్ర చక్రవర్తులకు మధ్య కాలమునఁ గల కవులఁ బేర్కొనుటకు ముందు తిక్కన సోమయాజి ఓరుగంటికి వచ్చి గణపతి దేవునకు భారతము వినిపించి లోఁగొన్న సంగతి మఱువఁజనదు. ఈయన రాకకు ఫలితముగ సరస్వతీదేవి నిజాము రాష్ట్రమునకుఁ బ్రసాదించిన కవి – మారన. ఈయన రుద్రమదేవి ప్రతాపరుద్రుల మధ్య కాలమునందుండి మార్కండేయ పురాణము తెనింగించెను. రంగనాథ రామాయణము కోన బుద్ధారెడ్డి యీ సంధి కాలముననే రచించెను. బుద్ధరెడ్డి యనియు బుద్ధరాజనియు నీతని వ్యవహరింతురు. బుద్ధరాజుకుమార్తెయగు కుప్పాంబ నెలకొల్పిన బూదపూరు శాసనము వలన రంగనాథ రామాయణము నిజాము రాష్ట్రమున జనించెనని విశ్వసింప వీలుచిక్కినది. బుద్ధరాజునకుఁ గుమారులగు కాచవిభుఁడు విఠల రాజును గలసి తమ త్రండి కంకితముగా నుత్తర రామాయణము ద్విపదగా రచించిరి. ద్విపద కావ్య రచనమునఁ బాలకురికి సోమనాథుఁడు ఆంధ్ర వాఙ్మయమున మొదటివాఁడు. తరువాతివారు బుద్ధరాజు, కాచనవిభుఁడు, విఠలరాజు వీరందఱు నిజాము రాష్ట్ర వాసులే. గాన ద్విపద రచన జన్మస్థానము నిజాము రాష్ట్రమని చెప్పక తప్పదు. (ద్వితీయ) ప్రతాపరుద్రుని కాలములో రచింపఁబడిన కావ్యములలో

నుత్తమోత్తమ గ్రంథము భాస్కర రామాయణము. ఇది ప్రతాప రుద్రునకించుక ముందుగ భాస్కరుఁడు తెనిఁగింప నారంభించెను. కడకీ రామాయణమే కారణముల చేతనైన నేమి పలువురు పూర్తిచేసిరి. సమకాలిక కవులఁ బలువుర నొక్కమాఱు తెలిసికొనుటకీ రామాయణము తోడ్పడుచున్నది. భాస్కరుఁడు, హుళిక్కి భాస్కరుఁడు, మల్లికార్జునభట్టు, కుమార రుద్ర దేవుఁడు, అయ్యలార్యుఁడు భాస్కర రామాయణ భాగములంబూర్తి చేసిన కవులు. వీరందఱు నిజాం రాష్ట్రకవులె. భాస్కరుఁడు సాహిణిమారన కంకితముగ అరణ్యకాండమె గాక దశగతులను గ్రంథము రచించెను. మల్లికార్జున బట్టు మహా విద్వాంసుని వలె నున్నాఁడు. ఇతఁడు సంస్కృతమున సరస్వతి చంపు, ఉదార రాఘవమను గ్రంథమును రచించెను. తక్కిన కవుల ప్రత్యేక చరిత్రములు సంగ్రహింప వలసియున్నది. రుద్రమదేవి ప్రతాపరుద్ర దేవుల సంధికాలమున సంస్కృత కవులు కొందఱు గలరు. నృత్తరత్నావళి వ్రాసిన జాయ సేనాపతియు, గణమంజరి, విక్రమార్క చరిత్రము, నిఘంటువులు వ్రాసిన కవి భల్లటుఁడు, బాల భారతము వ్రాసిన అగస్త్యేశ్వరుఁడు, కపర్ది, విద్యా నాథుఁడు లోనగు సుప్రసిద్ధ సంస్కృత కవిరాజులు పలువురుగలరు. సూక్ష్మములోఁ గాకతీయసామ్రాజ్యమునకు సంబంధించినకవులను దెలిసి కొంటిమి. సంస్కృత కర్ణాట భాషలో బహుగ్రంథములు వ్రాసిన రుద్రభట్టు. కేయూరబాహు చరిత్రము వ్రాసిన మంచనయు శివతత్వరసాయనము బ్రాసిన శివదేవయయయు, ప్రతాప చరిత్రము వ్రాసిన కాసె సర్వప్పయు, ద్వితీయ ప్రతాపరుద్రుని యాదరణము పడసిన ధన్యులు ౧౩౨౭ తోఁ బ్రతాపరుద్రుని రాజ్య మంతరించెను. ఆంధ్రుల యైశ్వర్యము, స్వతంత్రముతోఁ బాటు చక్రవర్తియుఁ బరాథీనుఁడయ్యెను. అప్పటి సంఘటనమున నెన్ని యమూల్య గ్రంథములు పేరులేక రూపుమాసెనో నిర్ణయింపఁ జాలము. నాఁడు నశించిన రాజచరిత్రము నాజ్ఞాపకమునకు దెచ్చుకొని ఆరు వందల త్సరములు గడచిన పిదప నిపుడు పరిశీలింప నీస్వల్ప సంఖ్యాకుల నామములు పుస్తకములు గోచరించినవి. సమగ్ర పరిశోధనము జరిగిన నెన్ని విస్మృతాంశములు బయలువడునో!

కాకతీయ సామ్రాజ్యము విచ్ఛిన్నమై యది మూడు భాగములయ్యెను. ఒరంగల్లు, రాచకొండ, దేవరకొండ, మెదకులోనగు దుర్గములను లోఁబఱచి కొని కృష్ణ సరిహద్దు గాఁగల పశ్చిమాంధ్ర దేశమును (నిజాము రాష్ట్రము నంతయు) వెలమవీరులు పరిపాలించిరి ప్రతాపరుద్రుని రాజ్య పతనానంతరము యవనసేనా సముద్రమునకుఁ

జెల్లెలి కట్టవలె నాగినవాఁడు రేచెర్ల సింగమ నాయుఁడు. ఈయన యనంతరము ప్రసిద్ధులు తత్పుత్రులగు అనపోతానాయకుఁడు మాధవ రాయలు. తరువాత విస్తృతమగు నీవెలమ రాజ్యము యవనుల దాడుల వలనను గద్వాల మెదకు ప్రాంతముల నున్న రెడ్డి దొరల తిరుగుబాటు వలనను జీవికయయ్యెను. హరి హరరాయ బుక్క రాయలు విద్యారణ్యుల సహాయముతోఁ బ్రతాప రుద్రదేవుని ఐశ్వర్య శేషముతో నేఁగి తుంగభద్రా తీరమున విద్యానగర సామ్రాజ్యము నెలకొల్పిరి. ప్రోలరెడ్డి అద్దంకి చేరిరెడ్డి రాజ్యమును కొండవీడు కొండపల్లి దుర్గములతోడ్పాటు తోఁ గ్రొత్తగా స్థాపించెను. మనకిపుడు గావలసినది వెలమ రాజ్యము గూర్చియే దాని నాధారపఱచి కొని పదు నేడవ శతాబ్ది వఱకు నిజాము రాష్ట్రము నందాంధ్ర వాఙ్మయమెటు లభివృద్ధికి వచ్చెనో తెలిసికొనవచ్చును.

ఇంచుమించు సింగమ నాయకుని కాలమున మహావిద్వాంసుఁడును బహు గ్రంథ వ్యాఖ్యాతయు సర్వజ్ఞ శిరోమణియు నగు మల్లినాధ సూరి మెదకు మండలములోని కొలిచలమ యందుండి యసంఖ్యాకములగు సంస్కృత గ్రంథములకు వ్యాఖ్యానములు వ్రాసెను. మఱికొంత కాలమునకుఁ గుమారస్వామి సోమయాజి ప్రతాపరుద్రీయమునకు వ్యాఖ్యానము గావించెను. సర్వజ్ఞ సింగ భూపాలుఁడు రసార్ణవసుధాకరము వ్రాసెను. రావు మాధవరావు రామాయణమునకు వ్యాఖ్య గావించెను. ఇవి వెలమవారు గావించిన సంస్కృత గ్రంథరచనాలేశప్రశంస. బమ్మెర పోతరాజు ఓరుగల్లు చేరి ఆంధ్ర భాగవతము మున్నగు గ్రంథముల వ్రాసెను. ఈయన వంశీకులగు కేసన మల్లనలు పాకాల తాలూకాలోని గురుజాడపాలకు నాశ్రయించి దాక్షాయిణీ పరిణయము, విష్ణు భజనానందమును రచించిరి తద్వంశీయులలో నింకొకరగు నెల్లుట్ల నారాయణకవి పత్రాభ్యుదయమను ప్రబంధమును రచించెను. మాధవనాయకుని యాశ్రయ కుటుంబమునకుఁ జెందిన గౌరన నవనాధ చరిత్రము, హరిశ్చంద్ర ద్విపద రచించెను. జటప్రోలు పాలకుఁడగు మాధవరావు చంద్రికా పరిణయమను నపూర్వ ప్రౌఢ ప్రబంధము రచించెను. ఈ కావ్యమునకుఁ దానె వ్యాఖ్య గూడ వ్రాసికొనెను. గ్రంథరచనమున తోరణాల చొక్కయ తోడ్పడెనందురు ఇది యెంత వఱకు విశ్వాసార్హ మొగాని యీ సందర్భమున తోరణాల చొక్కయ యనుకవి లభించుట యొక విశేషాంశము. బమ్మెర పోతరాజు నిజాము రాష్ట్రకవులలో మిగుల సుప్రసిద్ధుఁడు. ఈమహాకవి నామమెఱుంగని ఈయన కవితా రసము చూడని

యాంధ్రుఁ డుండఁడు. ఈకవి వతంసుని నివాసమగు బమ్మెర ఓరుగల్లునకు మూఁడు నాలుగామడల దూరమున నున్నది. భాగవత రచయితయగు పోతరాజుతోఁ బాటు పంచమస్కంధము వ్రాసిన బోప్పరాజు గంగనయు, షష్ఠస్కందము వ్రాసిన ఎర్చూరి సింగన, పదునొకండు పండ్రిండుస్కంధములు వ్రాసిన హరిభట్టు మడికిసింగన వెలిగందన నారయాదులు నిజాము రాష్ట్ర కవులె యనుటకు బలమైన యాదారములు గలవు భాగవతము అంకితము గావలయునని కోరిన మొదటి సర్వజ్ఞ భూపతి రాచకొండ పాలకుఁడు. శృంగార షష్ఠమను గ్రంధనామము లక్షణ గ్రంథములందు వినంబడును. ఇది యెవరు రచించిరో గానియది భాగవత షష్ఠస్కంధ మనుటకుఁగల యుపపత్తులను భాగవత పీఠికలో మేము వ్రాసితిమి సమగ్రగ్రంథము లభించినగాని యీ గ్రంధకర్త నిజాము రాష్ట్రములోని యే భాగమునకుఁ జెందినవాఁడో నిరూపింప వీలుకలుగదు. ఇవటూరు పిడుపర్తి, వెల్లటూరు, పాలకురికిలోనగు చోటులఁగల శైవ మఠములకు నాంధ్ర సారస్వతమునకుఁగల సంబంధము పరిశోధింపఁదగినది బేతిరెడ్డి వామిరెడ్డి శాసనములు రుద్రదేవుని కావలనున్న రుద్రసేనాని శాసనము చౌండసేనాని కొండిపర్తి శాసనము బూదపూరు వర్థమాన పురములోని శాసనములు సంస్కృత శ్లోకమయములై యాకాలపు కవితా వికాసమును దెలుపు చున్నవి. గూడూరు చాళుక్య శాసనము నందు తెలుఁగు పద్యములు కన్నడ పద్యములు కలసియున్నవి. రుద్ర సేనాని ఉప్పరపల్లి శాసనము తెలుఁగు పద్దెముల నొప్పుచున్నది ఇట్టి తెలుఁగు పద్యశాసనము నుగునూరిలో నుండ కరీమునగరము చేర్పఁబడినది. ఈ శాసన రచయితలు ఆంధ్ర సారస్వతమునను సంస్కృత సారస్వతము నందును సుప్రసిద్ధ కవులనుటకు సంశయము లేదు గాని వారి జీవితములు ఇతర గ్రంధములు లభించిన గాని నిరూపింప వీలుండదు. వెలమ రాజ్యము చీలికలైన కొలఁది వంశీయులు దుర్బలులై కృష్ణదాఁటి బ్రిటిషు ఆంధ్ర దేశమునకు వలసపోయిరి. నిజాము రాష్ట్రమునందుఁ బరిపాలన స్వతంత్రముతో నిలిచిన వెలమ సంస్థానములలోఁ బ్రసిద్ధ మైనది జటప్రోలు సంస్థానము. కృష్ణదేవరాయల విద్యానగర సామ్రాజ్యమునకు జటప్రోలు సంస్థానమునకు గొన్ని సంబంధములు గలవు వాని గుర్తించితి మేని నాఁటి సారస్వత పరిణామము గుర్తింప వీలుచిక్కును. ఆంధ్రశబ్ద చింతామణి వ్యాక్యాతయు మహొపాధ్యాయుఁడు నగు ఎలకూచి బాలసరస్వతి కవి మాధవరాయల తండ్రియగు మల్ల నృపుని పేర మల్లభూపాలీయమును, పరిటాల ప్రభువగు జూపల్లి

వేంకటాద్రి పేర చంద్రికాపరిణయ మను వేఱొక గ్రంథమును రచించెను. సర్వజ్ఞ సింగ భూపాలుని కాలమునకుఁ గొంచె మావలమడికి సింగన పెద్దపల్లి చెంతఁగల రామగిరిచేరి కందనామాత్యునిపేర నంకితముగా పద్మ పురాణమును, జ్ఞాన వాసిష్ఠ రామాయణము, సకల నీతి సమ్మతమను గ్రంథములు నీతి తారావళి రచియించెను. ఇంతియ గాక భాగవత దశమస్కంథములో గొంతయు ఏకాశ ద్వాదశ స్కంధములు ద్విపద కావ్యముగా వ్రాసెను. చరికొఁడ ధర్మ కవియు నీకాలమున కించుక చేరువలో నుండి చిత్రభారతమను ప్రబంధ రాజము ధర్మపురి నృసింహ స్వామి ప్రశంసతోఁ జిత్తాపు ఖానుని (సీతాపతి) మంత్రియగు ఇన్ములపల్లి పెద్దనార్యునకు నంకితము గావించెను. మాధవ నాయకుని ఉమామహేశ్వర శాసనము వలన పశుపతి పండిత పుత్రుఁడగు నాగనాధ కవి పేరు తెలిసికొంటిమి. ఈయన విష్ణు పురాణమును వ్రాసెను. కొన్ని పద్యములు మాత్రము ప్రబంధ రత్నావళి యందుఁ గలవు. చంద్రికా పరిణయ రచయితలు జటప్రోలు సంస్థాన ప్రభువులు నగు మాధవరావు కుమారుఁడు నరసింగరావు క్షత్ర ఖేలనము, ఆయన కుమారుఁడు చిన మాధవరావు శూద్ర స్మృతియు రచించిరి. ఈ రెండును సంస్కృత గ్రంథములు. పొనుగోటి జగన్నాథరాయకవి కుముదవల్లి విలాసము వ్రాసెను. ఇది యాంధ్రకావ్యము.

రెడ్డి సంస్థానముల నాశ్రయించి కొందఱు కవులు గ్రంధ రచనము కావించిరి గద్వాల సోమభూపాలుని కాలమునఁ బలువురు కవులు గ్రంధ రత్నములు రచించిరి. అట్టి వారిలో వీర రాఘవ కవి, కాణాదము పెద్దన సోమయాజి, హరిభట్టు, సుప్రసిద్ధులు. సోమ భూపాలుఁడు గూడ స్వయముగాఁ గవియై రతి రహస్యమును దెలుఁగు చేసెను. దోమకొండ సంస్థాన ప్రభువులా కాలమున బిక్కవోలులో నుండిరి మల్లారెడ్డి కవి పద్మ పురాణము, శివధర్మోత్తర ఖండము, షట్చక్రవర్తి చరిత్రము, ఎల్లారెడ్డి లింగ పురాణము వాసిష్ఠము లోనగు గ్రంథములు రచించిరి. రాపాక లక్ష్మీపతి కవి ఈ కవి వంశీయుఁడగు రాజన్న చౌదరిపేర భద్రాయురభ్యుదయము, శ్రీకృష్ణ విలాసము లోనగు గ్రంథములు రచించెను. వనపర్తి సంస్థాన ప్రభువులలో రాజా గోపాలరావు అష్ట భాషలలో గవి. సంస్కృతమునఁ బెక్కు కావ్యములు వ్రాసెను. వనపర్తి సంస్థాన రాణులలోఁ గవయిత్రులు కలరు. వారిని గూర్చి ప్రత్యేకించి వ్రాయవలసి యున్నది. మల్లారెడ్డి కవి యన్నయగు కామిరెడ్డి కంకితముగా పట్టపెట్ట సోమనాథ కవి నూతసంహిత, బ్రహ్మోత్తర ఖండాదుల రచించెను. సోమ నృపాలుఁడు భార్గవ

పురాణము తెనింగించెను. ఇతఁడు సురపుర సంస్థాన ప్రభువు. బిజ్జల తిమ్మ భూపాలుఁడు అనర్ఘ రాఘవమును పద్యకావ్యముగా రచించెను. ఈయన ప్రాకుటూరి సంస్థాన ప్రభువు. దొంతిరెడ్డి పట్టాభి రామరెడ్డి ఆంధ్ర యామునాచార్య ప్రభావము వ్రాసెను. ఇఁక విచారించిన రెడ్డి వారిలోఁ బలువురు కవులు కలరు. కృష్ణమాచార్యులను సంస్కృత కవియు, అయ్యమాచార్యులను నాంధ్ర కవి రెడ్డి సంస్థానముల నాశ్రయించి బహుగ్రంథముల రచించియున్నారు. రెడ్డి కవుల వాఙ్మయసేవను గుఱించి యింకను గృషి మేము చేయవలసియున్నది.

ఆంధ్ర భాషకు నూతన వికాసములు కలుగజేయుటలో మిగులఁ దోడ్పడిన యవన ప్రభువుల మనము మఱువఁజనదు, అద్దంకి గంగాధర కవి పొన్నగంటి తెలగన్నయు మహమ్మదీయ నృపాలుర యాస్థాన కవులు. గంగాపరిణయాది కావ్యములు వసుచరిత్ర వ్యాఖ్య వ్రాసిన సోమనాథ మహాకవి వేములవాడ నివాసి. పరిశోధించిన కొలఁది యెందఱు మహాకవులు నిజాము రాష్ట్రమునఁగలరో కాలమే నిర్ణయింపఁగలదు. పరశురామ పంతుల లింగమూర్తి రామమూర్తి యను నిరువురు కవులు ఒరంగల్లు నివాసులు. కుందావర్ఘుల గోపాలకృష్ణకవి కరీమునగర మండలవాసి. ఈయన కృష్ణజన్మ ఖండము అను మహాగ్రంథము రచించియున్నాఁడు. కాండూరు రామానుజాచార్యకవి తిరువాయి మొడి. అయ్యమాచార్యుల రామేశ్వర విజయము, వీర రాఘవ కవి భారతోద్యోగ పర్వము, మరింగంటి నరసింహా చార్యుల తాలాంకనందిని పరిణయము, తెనాలి రామలింగకవి ధీరమనోరంజనము, విఠలదాసుకవి ఆధ్యాత్మ రామాయణము, బంగారు రంగప్ప భేతాళ చరిత్రము ఆంధ్ర దేశమింత వఱకెఱుంగదనియే చెప్పవచ్చును. వీరందఱు నిజాము రాష్ట్ర వాసులని నిరూపించుటకు ఇంక నిటులె విసుఁగుబుట్టవఱకు కవులను గ్రంథములను బేర్కొనుటకుఁ బరికరముల సేకరించి నారము.

కవుల చరిత్రకారులు నివాసములు నిరూపింపని కవులలో నాచన సోముఁడు, పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు సారంగు తమ్మయ్య, భీమకవి, పిడుపర్తి బసవన్న ఈసోమనాథులు మరింగంటి సింగరాచార్యులు లోనగుమహాకవుల నివాసస్థానములు నిజాము రాష్ట్రములోని గ్రామములని నిరూపింపఁదగిన యాధారములు లభించినవి. ఏవిధముగాఁ జూచినను నిజాము రాష్ట్రము సారస్వత పీఠమనుటలో సందియములేదు. దిఙ్మాత్రముగా నిజాము రాష్ట్రమునఁ గల మహాకవులను గూర్చి నిర్ధారణాంశముల

సూచించి వదలితిమి. నివాస స్థానముల గూర్చిన చర్చలు కాలనిరూపణమున కనుకూలము లగు చరిత్రాంశములు ఇందు దాహరింప లేదు. ఇప్పటికి సుప్రసిద్ధులగు మహాకవుల జీవితములు నూరింటికిఁ బైగ మాకు లభించినవి. ఇంకఁ గొన్ని జీవితములు విమర్శ నీయములుగా నున్నవి. పలువుర జీవితము లీవ్యాసమున నుదాహరించుటకే తావులేక పోయినది. జైనాలయములలోఁగొన్ని తావుల తాళపత్ర గ్రంథములు గలవు. మెదకు మండలములోని శైవమటములలో నాంధ్ర కర్ణాటక గ్రంథము లసంఖ్యాకములుగలవని వింటిమి. ఆంధ్ర సారస్వతమునఁ బూర్వము జైన గ్రంథములు పెక్కులు గలవు. అట్టి వానిలో నిపుడొక కవిజనాశ్రయము మాత్రమె కనిపించుచున్నది. మాటు మడఁగియున్న జైన గ్రంథములకై నిజాము రాష్ట్రములోని యాంధ్రుల యవలంబనములో నున్న జైనాలయములలో వెదక వలసియున్నది. ఆంధ్ర కవులు కర్ణాట భాషలోఁ గూడఁబెక్కు గ్రంథముల వ్రాసియున్నారు. కర్ణాటకవి జీవితములో గొంద రాంధ్ర కవులు గలరు. కొందఱు కర్ణాట కవులాంధ్ర కావ్యములను కన్నడించిరి. కన్నడ గ్రంథములను గొందరాంధ్ర కవులు తెలిఁగించిరి. ఇట్టివారు నిజామురాష్ట్ర కవులలో బెక్కుమంది గలరు. వారి జీవితములు చర్చించుటకు పూనుకొందుమేని గ్రంథ విస్తృతి యగును. అట్టివారిలో పాలకురికి సోమనాధుఁడును వేములవాడ భీమకవియు పిడుపర్తి బసవ కవియు లోనగు వారు ముఖ్యులు. సకల నీతి సమ్మతము వలన మడికి సింగన కంటె పూర్వ గ్రంథములని విశ్వసింపదగు ముద్రామాత్యము. నీతిసారము, పంచతంత్రి, పురుషార్థ సారము; నీతి భూషణము, కామందకము, నీతితారావళి, శాలిహెూత్రము లోనగునైతిక గ్రంథములు కనిపించుటలేదు. ఇందు గొన్ని యేని నిజాము రాష్ట్రకవుల గ్రంథము లనుటకు సందియము లేదు. నిజాము రాష్ట్ర ఆంధ్రకవి జీవితము సమగ్ర పరిశోధముతో బయలు వెడలినచో ఆంధ్రకవి జీవిత సంశయ గ్రంథులు విడిపోవుటయే గాక నిజాము రాష్ట్రాంధ్ర దేశము యావదాంధ్ర దేశమునకు శిరః ప్రాయమను నంశమాబాల వేద్యము కాఁగలదు. మరుగుపడియున్న యాంధ్రమహాకవుల జీవిత లేశములను దెలిపి యీ వ్యాసమున నిజాము రాష్ట్ర మాంధ్ర వాఙ్మయమున కెటులఁ దోడ్పడెనో గొంచెముగా సూచించి వదలితిమి. సమగ్రమగు జీవిత చరిత్రము వ్రాయుటకు ననువగు పరికరములను కొంత వఱకు సేకరించితిమి. ఇంకను సేకరించు చున్నారము. నిజాము రాష్ట్రము ఆంధ్ర దేశమునకు నాయకమణియని నిరూపించుట భగవదిష్ట

మయ్యేనేని యచిరకాలమున నిజాము రాష్ట్రాంధ్ర కవిజీవితము, నిజాము రాష్ట్రాంధ్ర వాఙ్మయ చరిత్రము ప్రచురణము కాఁగలవు. ఆంధ్ర మహాశయులు తమకు లభించు గ్రంథములు ఆధారములు కవి జీవితములు పత్రికా ముఖమున బ్రచురించుచున్నచో సమగ్ర నిజాము రాష్ట్రాంధ్రకవి జీవితము ఆంధ్ర భారతి చరణ సన్నిధిని సమర్పింప వీలుకలుగును.

శ్రీకృష్ణరాయల ఆంధ్రభాషా నిలయ రజతోత్సవ సందర్భమున నిజాము రాష్ట్రాంధ్రకవి జీవితము సంగ్రహముగా నిజాము రాష్ట్రాంధ్ర సోదరులకు విన్నవింప నవకాశమొంసగిన కార్యనిర్వాహక వర్గమును బ్రశంసించుచు నింతటితో నీవ్యాసమును ముగించుచున్నారము.

"అచ్చ తెనుంగు కావ్యమున కాదిపదంబయి పొల్చు భాగ్యముఁ
హెచ్చుగఁగన్న దేశ మిదియే దురదృష్టమొ యాంధ్రభాష నేఁ
డిచ్చట నింపుసొంపుచెడి హీనదశార్తినిఁ గుందె నక్కటా
యచ్చపు టాంధ్రపుత్రులకు నందఱకుఁ దలవంపులౌనటుల్"

– శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ రజతోత్సవ సంచిక (1927)

ꕥ

18. తూము రామదాసుకవి

ఓరుగల్లు తొల్లిటినుండి విద్యా నిలయము. కాకతీయ సామ్రాజ్యము మహోన్నత దశయందున్నప్పుడు శివదేవాదికవులు రాజ్యపతన సమయమున మారన విద్యానాథాదికవులు పిమ్మట పోత రాజాదికవులునుండిరి. పరశురామపంతులవారు ఓరుగల్లు నగరమును విద్యా నిలయముగా నొనర్చిరి. ప్రాచీన నాగరికత పూర్తిగా మాటి పూర్వ కవితా విశేషాదికములు సన్నగిల్లు యుగసంధిలో ఓరుగల్లులో కవులు గలరేమో యోచింపవలసి యున్నది. పాశ్చాత్య నాగరికత ప్రాచీన నాగరికతను ఆహుతిగొనుతటి మాతృభాషా విలాసములు నొకమాఱు లోకమునకు నిజాము రాష్ట్రము నిర్వీర్య భూమి కాదు కళానిలయమని సాటినకవి తూము రామదాసు. ఈ కవి పేరు నిజాము రాష్ట్రకవి జీవితమునందు జేర్పవలసియున్నది. ఇందులకై సేకరించిన యాధార గ్రంథములు ప్రకృత మీ కవి జీవితము. సుజాత తొలి సంచిక కొసంగి యీ మహాకవి జీవితము నిజాం రాష్ట్రాంధ్ర సోదరులకు నివేదింపనున్నారము.

రామదాసకవి నివాసస్థలం ఓరుగల్లు. ఇంటిపేరు తూము. తండ్రి సర్వేశము, తాత రామయ్య. కందాళ సింగరాచార్యులు అను వారు కవిగురువు. ఈ కవి బాల్యమున బిచ్చగాడై బిచ్చము గొనుతటి సింగరాచార్యులగారి సహాయమున బిచ్చమాన్పి హితవొసంగి యితనికి విద్యాజ్ఞానము ప్రసాదించిరి. ప్రతాపపుర రంగాచార్యులు కవికి విద్యా దేశికుడు. రామదాసకవి చతుర్థకు (తెలగ)కుల భూషణుడు, సంస్కృతాంధ్రముల యందు నిరంకుశతా సాహిత్యము ఉభయ భాషలయందు నిరర్గళమగు కవితా ధోరణిగలవాడు. ఈకవి రచించిన పుస్తకములు 1. కాళిదాసు నాటకము 2. నిర్వచన మిత్రవిందోద్వాహము ప్రబంధము 3. ఆంధ్రపద నిధానము ఆంధ్రనామ సంగ్రహమువంటి నిఘంటువు. ఇంకగొన్ని పుస్తకములు రచించెనట. గాని ప్రకృతమున ఈ గ్రంథములు కనిపించుట లేదు. కాళిదాస నాటకము సురభి కంపెనివారి ప్రదర్శనము కొఱకు వ్రాయబడినది. ఇందు గొన్ని భోజచరిత్రములోని శ్లోకము లాంధ్రీకరింపబడినవి. కవిత మనోహరముగా నున్నది. గాని శైలిమాత్రము దృశ్య ప్రబంధోచితముగా లేదు. అది యీ కవి లోపమనజాలము. నాటకయుగమున కారంభమున నున్న చిత్రనళీయాది నాటకములు అంతకు కొంచెము ముందున్న

వచన నాటకములు దాదాపుగ నీ శైలిలోనివే. సమకాలిక లోపము నీకవి నివారింపజాలక పోయెను.

ఈ నాటకము క్రీ.శ.1899లో ముద్రితమైనదిగాని ప్రకృతము ప్రతులు లభించుటలేదు. గాన ద్వితీయ ముద్రణమవసరమైయున్నది. రెండవ పుస్తకము మిత్రవిందోద్వాహము. ఇది యైదాశ్వాసముల చిత్రప్రబంధము. ఇందు దాదాపు 800 పద్యములు కలవు. బంధకవిత్వము, చిత్రకవిత్వము ఇందు గలవు. ఈ ప్రబంధము కవికిగల చతుర్విధ కవితానిపుణతను కవితా ప్రాగల్భ్యమును దెలుపుచున్నది. సాధారణముగ ప్రబంధములయందున్న వర్ణనములన్నియు నిందుగలవు. కవిత సాధారణముగా సమాస బంధురముగ శబ్దాలంకార నిబద్ధముగ ప్రౌఢముగా నుండును. వర్ణనలు విపులములు, కథాంశము చాల హ్రస్వము. కవి వర్ణనకె విశేషించి స్థానము నొసంగెను. వసుచరిత్రమున కావలి ప్రబంధములందంన్నిటిలో నిట్టి యలంకరణమె కలదు, సర్వ విధముల నీ గ్రంథము పూర్వ ప్రబంధములకు సమానముగ నున్నది.

ఈ పుస్తకము 1899లో మదరాసులో ముద్రితమయ్యెను. బి.ఏ.పరీక్షా విద్యార్థుల కిందలి భాగములు పఠనీయములుగా నిర్ణయించ బడినటులొకరు చెప్పుచున్నారు. ప్రకృత మీ గ్రంథప్రతులు లభించుట లేదు. ఆంధ్రపదనిధానము ఇది రమారమి 1400 పద్యములుగల నిఘంటువు. అమరము నిబంధనము రచనాక్రమము ననుసరించి వ్రాయబడిన పుస్తకము. శబ్దరత్నాకరము నందుగల యాంధ్రపదము లన్నియు నిందు వర్ణభేద జనముగావింపఁబడి పద్యములలో జేర్పఁబడుటచె నింతకు వెనుకనున్న ఆంధ్రనామ సంగ్రహాదులకంటె సర్వవిధముల సంపూర్ణ గ్రంథమనుటకు సంశయము లేదు. అమరము ననుకరించిన తెలుగు పద్య నిఘంటువులలలో ఆంధ్రభాషార్ణవమొకటి. అంతకంటె నీ యాంధ్రపద నిధానము సమగ్రముగా విపులముగా నున్నది. కవి స్వహస్తముతో నిరువది సంవత్సరముల క్రిందట వ్రాసిన లిఖితప్రతి మాకుఁగవి కుమారుల వలనఁ బరిశోధనమున కొసంగఁబడెను. ఆంధ్రభాష నభ్యసించు బాలురకీ నిఘంటువు కామధేనువు వంటిది. అమరము నందలి వర్ణభేదములన్నియు ఇందుఁ జూపబడినవి. ఆంధ్రభాషా స్వతంత్ర వ్యక్తిత్వమున కీకృతి ప్రధాన దృష్టాంతము. ఇతర నిఘంటువులందు గానరాని పదజాలము విశేషించి యీ గ్రంథమునందు కలదు. పదజాలమును సమకూర్చుటయందును పద్యరచనము నందును గవి తన శక్తియంతయు నీ గ్రంథమునఁజూపి గ్రంథరచనానంతరము కొలఁది కాలమునకుఁ కీర్తిశేషుఁడయ్యెను.

ఆంధ్రపద నిధానము బాలనగర వేంకటేశ్వరస్వామి కంకితముగావింపఁబడెను. ఓరుగల్లులోని వేంకటేశ్వరాలయము గల ప్రాంతమును బాలనగరమందురు. అచటి వేంకటేశ్వరుఁడే యితని కిష్టదైవతము. ఈ నిఘంటువున తన వృత్తాంతము విపులముగఁ జెప్పలేదు. అవతారిక 13 పద్యములలో నిముడ్చబడెను. కవి తన జీవిత చరిత్రమునకుఁ జరిత్రకారులు సేకరించికొనఁదగిన యంశములు మిత్రవిందోద్వాహమునందు జేర్చెను. జీర్ణాతిజీర్ణమైయున్న యీ యుత్తమ నిఘంటువును కవి కుమారులును సుప్రసిద్ధ న్యాయవాదులునగు మ.రా.రా.శ్రీ.తూము రంగయ్య వరదరాజులు గారలు మా యాజమాన్యముచే విశేషవ్యయముల గావించి ముద్రణము గావించుచున్నారు. కొలఁదికాలములో సర్వాంగ సుందరమగు నీ ముద్రితగ్రంథము ఆంధ్రసేవగావించుటకు బయలు వెడలనున్నది.

ఈ కవివర్యుని మూడు పుస్తకములును ఆంధ్రభారతి కంఠాలంకృతములగు మూడు నాయకమణులు. చిరకాల గ్రంథ రచనాపరిశ్రమలచే నీకవి నించుమించుగా నెనుబదవయేట ఆరోగ్యము చెడి రాజవ్రణ పీడితుడై ఇప్పటికి ఇరువదిమూడు సంవత్సరముల క్రిందట స్వగ్రామమగు ఓరుగంటిలో స్వగృహమున (క్రోధి సంవత్సరము గార్తీక బ॥2న) పరలోకము చేరెను. కవిఖనన స్థలమున స్థాపింపబడిన సమాధి గ్రంథములతో బాటు నేటికి కవియశోగీతికను గానము చేయుచున్నది. ఈ కవి బాల్యమున వ్రాసిన గోపికావిలాసము మొన్నటివఱకుండెనని కవి కుమారులు చెప్పుచున్నారు. ప్రకృత మీ గ్రంథము కనుపించకపోవుట మిగుల సంతాపకరము.

తన గ్రంథములన్నింటి యందును ఒకే విధమగు గద్యమును వ్రాసి కొనియున్నాడు. పాఠక పరిచయమున కిట నుదాహరించుచున్నారము.

గద్య.ఇది శ్రీమదలమేల్మంగోత్తుంగ స్తనశృంగ సంగధారాధర
వెంకటేశ్వర కృపా పారగ లబ్ధ వాగ్వైభవరంతర భాగవతారాధనా
ధేయ తూముకుల పవిత్ర సర్వేశాభిధానపుత్ర రామదాస ప్రణితంబైనన్

– గోలకొండ పత్రిక (28.12.1927)

19. నిజాము రాష్ట్రమునందలి ఆంధ్రులు

విశాలమగు నాంధ్రదేశమునందలి నలువదియొక్కవేయి మూఁడువందల నలువదియొక్క చదరపు మైళ్ల విశాల ప్రదేశము నిజాము దొరతనమువారి పాలనమునందున్నది. ఆంధ్రజాతీయతకును, ఆంధ్ర వికాసమునకును, ఆటపట్టగు నీపుణ్యభూమిని శోధించి చరిత్రాంశములను సేకరించువఱ కాంధ్రచరిత్రము సమగ్రము గాదు. అచట కవులజీవితములను సేకరించి చర్చించువఱ కాంధ్ర కవిచరిత్రము సమగ్రముగాదు. రాజకీయ సంబంధ మగు తెఱ యొకటి యడ్డుపడుటచే ఆంధ్ర దేశము రెండు చీలికలైనది. వాఙ్మయ సంబంధమున నీతెఱను జించితిమేని ఆంధ్రైక్యమునకు మంచి యవకాశము చిక్కును. నిజాము రాష్ట్రములోని పదియాఱుమండలములలో 1. వరంగల్లు, 2. కరీంనగరు, 3. ఆదిలాబాదు, 4. అత్రాపుబల్దా, 5. మెదకు, 6. నిజామాబాదు, 7. మహబూబునగరు, 8. నల్లగొండ మండలములు పూర్తిగా నాంధ్రమండలములు. గుల్బర్గాజిల్లా చాలభాగ మాంధ్రదేశమె. ఇంక కర్నాట మహారాష్ట్ర ప్రాంతములలోఁ గొన్ని యాంధ్రగ్రామములు కలవు. మొత్తమున కీరాష్ట్రమున అఱువది నాలుగు లక్షలకుపైన నాంధ్రులు గలరు. వీరలందఱు వించుమించుగా నీప్రాంతమునందాదిమవాసులని చెప్పవచ్చును. మహమ్మదీయ నామాంకితములగు గ్రామనామములన్నియు నిన్న మొన్నటివఱకు దేశీయ నామములతో నుండెడివి. వానిని ప్రభువులు, అధికారులు, జమీందారులు స్వనామాంకితములుగ మార్చి చరిత్రగౌరవమును బలవంతముగఁ దొలంగించిరని విజ్ఞులు తలంతురుగాక. వందలకొలఁది సంవత్సరములనుండి యవనులు పాలించుచుంటచే నిచటి యాంధ్రులకు వేషభాషలలోఁ గొంతమార్పు గలిగెను. ఉన్నత పాఠశాలలందు ఆంధ్రమునకుఁ ప్రాముఖ్యము లేకపోవుట వలనను, ప్రాథమిక పాఠశాల లాంధ్రులకు చాలనన్ని లేక పోవుటవలనను జనసామాన్యమున కిచట ఆంధ్ర భాషా ప్రవేశము తగ్గినదని తోఁచును. మహమ్మదీయులు పెట్టిన గ్రామనామములు రాజకీయ వ్యవహారములలో నెట్లు వాడఁబడుచుండెనో అటులే పూర్వనామములు ప్రజావ్యవహారములలో వాడుచున్నచోఁ జరిత్రమునకుఁ గొంత యనుకూలపరిస్థితి యేర్పడును. జాతీయత యేనాటికేని బహిరంగ మగును.

నిజామురాష్ట్రమునందు దాదాపు సగము భాగ మాంధ్రదేశము. ఇచటి యాంధ్రులు వసించుపుణ్యభూమి, యాంధ్రచరిత్ర రహస్యములకు నెలవు. మహాకవులిందు పలువురుదయించిరి. త్యాగమూర్తులగు రాజాధిరాజు లీప్రదేశమున సామ్రాజ్యములు నెలకొల్పి యాంధ్రవ్యక్తితము నెలకొల్పిరి. ఆంధ్ర శిల్పులు, దృఢతరము లగుదుర్గములు, చిత్రతరములగు దేవళములు కట్టి యాంధ్రకౌశలములను వెల్లడించిరి. ఈ వరాలచారిత్రకప్రదేశ మిపుడు నూతనోత్సాహముతోఁ దనజాతియతను నిలువఁబెట్టుకొన ముందంజ వేయుచున్నది.

చరిత్రస్థలములు

చరిత్ర దృష్టితో శోధించితిమేని నిజామురాష్ట్రమున సుప్రసిద్ధములగు ప్రాచీననగరము లెన్నియో గోచరించును. ఇపుడు నాందేడు అనఁబడునగరము పూర్వము నందగిరియని వ్యవహరింపఁబడుచుఁ బశ్చిమచాళుక్యుల పరిపాలనమున మహాభోగములు ననుభవించెను. ఆలేరుచెంతనున్న కొలనుపాకము ప్రసిద్ధమగు జైన క్షేత్రము. అచ్చటి జైనవిగ్రహము అమూల్యమును ప్రాచీనతరము నైయున్నది. బిజాపురమండలములోని బాదామి పశ్చిమచాళుక్యులలోఁ బ్రథముఁడగు సత్యాశ్రయ పులకేశివల్లభుని కాలమున మహత్తరముగ నుండెను. రాష్ట్రకూటుల రాజధాని యగుకట్టలూరుకు, అనంతర రాజధానియగు మాల్యఖేటము ఉస్మానాబాదు ప్రాంతములలో నున్నవి. మాల్యఖేటము ప్రపంచములో నాలుగవ సార్వభౌముఁడని ప్రశంసకొన్న గోవిందరాజు రాజధాని. అశోకుని రాజప్రతినిధి వసించిన సువర్ణగిరియు అమూల్యమగు అశోకుని శిలాశాసనము లభించిన మాస్కే రాయచూరుప్రాంతముననున్నవి. విక్రమాంకదేవచరిత్రమున బిల్హణకవిచే నభివర్ణితుఁడైన ఆఱవ విక్రమాదిత్యునికి రాజధానియగు కల్యాణపురము గుల్బర్గామండలము లోనిది. ఇంతియగాక గంగాపురము, నేలకొండపల్లి, పానుగల్లు, ధర్మపురి నందగిరి, ఆమనగల్లు, ఏలేశ్వరము, ఓరుగల్లు మున్నగు చరిత్ర ప్రసిద్ధములగు గ్రామము లీ రాష్ట్రమునఁగలవు. ఈ చరిత్రస్థలములలో నున్న వారికి జరిత్రాభిమానము లేకుంటచేతను రాష్ట్రీయులకు దూరస్థులగుటచే బ్రిటిషు ఆంధ్రులకిటబరిచయము లేకున్నవి. ఇంతియు గాక భద్రాచలారణ్యమునందును, ములుగు ప్రాంతమునందలి యరణ్యమునందును, గోదావరి పరిసర భాగములందును మహానగరచిహ్నాములు, శాసనములు, దేవాలయములు లెక్కకుమించినన్ని గోచరించుచున్నవి.

అరణ్యములలోనున్న యీ యగమ్యభాగముల వృత్తాంతములు తెలిసికొనువారే అరుదుగ నున్నారు.

శాసనములు, చరిత్రాంశములు

రాష్ట్రకూటులు, పశ్చిమచాళుక్యులు, చోళులు, కాకతీయులు మున్నగు ఆంధ్రరాజన్యుల చరిత్రములందింక నెన్నియోచరిత్రాంశములు తెలియకున్నవి. రాష్ట్రీయుల ఉపేక్షాదృష్టిచే నిజాంరాష్ట్రమునఁ జరిత్రోపయుక్తము లగు శాసనములు దురవస్థలో నున్నవి. ఎడతెగని దండయాత్రలలో నిజాము రాష్ట్రాంధ్రులు సర్వస్వము గోలుపోయిరి. చిన్నాభిన్నము గాని యాలయమే లేదు. రూపుమాయని విగ్రహమేలేదు. ఎటనైనఁ జూడుఁడు. శాసనములు విఱిగి ముక్కలు ముక్కలై పైభాగ మొకతావునను, గ్రింది భాగమున వేఱొకతావునను లభించుచున్నవి. హనుమకొండలోని యొకశాసనమునఁ గాకతీయులు తొలుత జైనులనితెలియును. మఱియొక శాసనము వలనఁ బ్రత్యర్థ రాజులగు గుండరాజు, జగద్దేవుఁడు, మేదరాజు, గోవిందరాజు, మైళగిదేవుఁడు మున్నగువారల నామములు గోచరించుచున్నవి. కొఱవి, గూడూరు గ్రామములందలి శాసనములు నన్నయభట్టారునకు బూర్వముననున్న ఆంధ్ర వాఙ్మయమును జవిచూపుచున్నవి. రంగశాయి గుట్టచెంత నున్నగుహలోని శాసనములు సిద్ధేశ్వరాలయ గుహాశాసనములు ఆంధ్ర సామ్రాజ్య వైభవమున సహస్ర ముఖములఁ గొనియాడుచున్నవి. కొలనుపాక, ఆలంపూరు, అల్లాదుర్గము, అమనగల్లు, గంగాపురములలోని శాసనములు పశ్చిమచాళుక్యుల రాజ్య విస్తీర్ణమునకుఁ బరిపాలన కౌశల్యమునకుఁ దార్కాణముగ నున్నవి. అయ్యనవోలు శాసనమువలన అనపోతనాయకుఁడను వెలమవీరుఁడు సోమశిల పరశురామ బిరుదొందినట్లు తెలియును. ఉమామహేశ్వరశాసనము వలన ద్విపద రచనాధౌరేయుఁడగు గౌరవ వంశముకాలము. విష్ణుపురాణ రచయితయగు నాగనాథుని కాలము తెలియుచున్నది. టేకుమాలు శాసనమున ప్రతాపరుద్రునిమంత్రి పురవరిమమాదేవనాయకులని కలదు. సామంతశూరుని శాసనము, పానుగల్లు శాసనము, ఇనుగుర్తి శాసనము, కొలనుపాక శాసనము, రుద్రమదేవి గణపతిదేవుని పుత్రి యంతెలుపుచున్నవి. ఇటులె చరిత్ర విషయమున నమూల్యము లగు శాసనరాజములు నిజాము రాష్ట్రమునందలి ఆంధ్ర భాగములలో విరివిగ లభించుచున్నవి. చాల శాసనములు విలువ తెలియక అరుగులకు బావులకు చెఱువుతూములకు ఆలయప్రాకారములకు బిగించి, వాని

ప్రయోజనము రూపుమాపిరి. దొరతనమువారు 1914లో శాసనపరిశోధనశాఖను నెలకొల్పిరి గాని ఆంధ్రచరిత్రమున కుపయోగించు శాసనములను ఐదింటినో నాలుగింటినో ప్రచురించియున్నారు. ఎన్నివేల శాసనములోఁ బ్రచురణము కావలసియున్నవి.

శిల్పములు - దేవాలయములు

అజంతాలోని శిల్పములు లోకోత్తరములు. ఇచటి చిత్రములు జీర్ణమైపోయినచో శిల్పకళకుఁ గొరత కలుగునని త్రివర్ణచిత్రములతో ఆఱులక్షల రూప్యములు వెచ్చించి నిజాము దొరతనమువారు వ్రాయింప నెంచుట శుభసూచకము. అజంతా బౌద్ధయుగమునాఁటి శిల్పప్రశస్తికిఁ తార్కాణము. సమీపమున నున్న ఎల్లోరా గుహలు ఆర్షమతమునాటి విజృంభణకు దృష్టాంతముగనున్నవి. ఈ రెంటినిగూర్చి దేశీయులకుఁ బ్రత్యేకించి పరిచయము గలిగింపవలసినపనిలేదు. ఇవి ఔరంగబాదు మండలములో నున్నవి. మహమ్మదీయ దండయాత్రలో చిత్రతరములగు శిల్పములు గల ఆలయరాజములు చాలవరకు రూపుమాసినవి. వృత్తులు నశించినవి. పూజా పునస్కారములు శూన్యమైనవి. ఎంద రెన్నివిధముల భగ్నమొందినను బ్రాచీనశిల్పకళమాత్రమప్రతిమానముగ గోచరించుచున్నది. నిజాము రాష్ట్రమున జైనులు, బౌద్ధులు కట్టినయాలయములు నేఁటికిఁ గొన్ని గోచరించుచున్నవి. కొలనుపాక వీరనారాయణాలయము, అల్లాదుర్గములోని వీరభద్రాలయము, నగు నూరులోని శివాలయము, లేములవాడలోని రాజేశ్వరాలయము తొలుత జైనాలయములె. పంటచెరువు(పటాన్ చెఱువు)లోని మూఁడువందల జైనాలయములను శైవులు శివాలయములుగ మార్చిరి. హనుమకొండలోని పద్మాక్షి జైనదేవత. ఇపుడామె కాళియపరావతార మైనది. ఇవియన్నియు మతకలహములలో నొందిన రూపాంతరములు. చాళుక్యులు, కాకతీయులు ఎనిమిదవ శతాబ్దము మొదలు పదునాలుగవ శతాబ్దమువఱకు శిల్పకళను పెంపొందించిరి. చాళుక్యశిల్పమునఁ గొంత జీవకళ యతిశయముగ నుండును. కాకతీయశిల్పము ఆకారవైచిత్ర శిల్పవిన్యాసములు పైమెఱుఁగులతో నుండును. చాళుక్యశిల్పమునకుఁ జెందినవి గంగాపురము, కోడూరు, పానుగల్లు, అలంపూరు, కల్యాణనగరములలోని దేవళములు. కాకతీయ శిల్పమునకుఁ జెందినవి. హనుమకొండ, పిల్లలమఱ్ఱి, నాగులపాడు, జలాలుపురము, పాలెంపట్టు, గణపురము మున్నగుతావులలోని దేవళములు. ఈ

యాలయమునందలి స్త్రీ ప్రతిమల శృంగారహావభావములు, పురాణ కథాశిల్పములు, లతాకల్పనములు, త్రిభంగినృత్యము ప్రత్యేక ప్రశంసాపాత్రములు. పాలంపేట దేవాలయములోని విగ్రహములు శృంగారరసమునకుఁ బరమావధి యనఁదగినవి. ఓరంగల్లులో శంభునిగుడి దండయాత్రలలో రూపుమాపఁబడెను. ఇపుడున్న యాలయము మధ్య కాలమునఁ గట్టినది. మనోహరమగు నీ యాలయ శిల్పశకలములు దుర్గపు గోడలందును, అసంపూర్ణ భవనములందును, బ్రాకారములందును మధ్యకాలమున జేర్చికట్టిరి. ఇవియుఁ గాకతీయశిల్పమునకు లక్ష్యములే. ఒరంగల్లులోని శిలాద్వారములు, శోభనాలబావి, అక్కచెల్లెంద్రబావి, కాకతమ్మబావి, మైలారుదేవుని అయ్యవోలు దేవాలయము. ప్రత్యేక ప్రశంసాపాత్రములు. ఈ యాలయరాజములన్నియు మహమ్మదీయుల గునపపు దెబ్బలకోర్చి ఛిన్నభిన్నములైన జీర్ణచిహ్నము లగుసంగతి సోదరాంధ్రులు మఱవ వలదని మా ప్రార్థనము.

దుర్గములు – తటాకములు

ఆంధ్రవీరుల ప్రత్యేక వ్యక్తిత్వము దెలుపు దుర్గములను బ్రశంసించుట ప్రకృతము గాకపోదు. విశాల మగునాంధ్ర సామ్రాజ్యమునకు నెలవైన ఓరుగల్లుకోట దర్శనీయము. ఆ యగడ్తలు, ఱాతికోట, పుట్టకోట, బురుజులు, పూర్వ ప్రతిభను నేటికిని జాటుచున్నవి. కాకతీయుల కాలమునను, దరువాతికాలమునను జేరుగొన్న రాచకొండ, ఆరామగిరి, భువనగిరి, కంభము మెట్టు, ఉర్లుగొండ, ఊంద్రుగొండ, దేవరకొండ, కనకగిరి, దుర్గములు నేఁటికి దర్శనీయములుగ నున్నవి. ఇవిగాక అరణ్యములలో నెన్నియోదుర్గములు క్రూరమృగావృతములై దుర్గమముగా నున్నవి. మహమ్మదీయుల కాలములోఁ గట్టఁబడిన నిర్మలదుర్గము, వేల్పుకొండదుర్గము, గోలకొండదుర్గము ఆధునికములు గాన, నింకను దృఢతరములుగనున్నను కల్పవాలాఘవమున ఆంధ్రవ్యక్తిత్వము దెలుపు దుర్గముల ముందు దీసిపోవుచున్నవి. కాకతీయ రాజులకాలములో నెలకొల్పఁబడిన తటాకములు నేటిదనుక వెట్టి మరమ్మత్తుతోఁ గూడఁ బనిలేకుండా అ గాధజలపూరితములై రాష్ట్రీయులకు శాల్యోదవము ప్రభుత్వమునకు లెక్కలేనంత బొక్కసము సమకూర్చుచున్నది. రామప్ప చెఱువు. పాకాలచెఱువు, లక్నారముచెఱువు, గణపురము చెఱువు, కమలాపురము చెఱువు, ధర్మసాగరము చెరువు ప్రత్యేక ప్రశంసాపాత్రములు. ఓరుగల్లు కోటచుట్టు నున్న అగడ్తయే కొన్ని తావులఁ దటాకమువలెఁ బైరుపచ్చల కుపయోగమున నున్నది. ఎన్నియో తటాకములు గండ్లుపడి సేద్యము చేయఁబడుచున్నవి.

ఆధునికయుగము - పరిశ్రమలు

ఇతరస్థలముల నుండి దిగుమతి యగు వస్తువులకు సుంకము విధించు నాచారముండుటవలనను, విదేశవస్తువులు ప్రయాణసౌకర్యములు లేని మాఱుమూలలకు బోవ వీలు లేకపోవుట వలనను ఈ రాష్ట్రమునః జేతిపనులకు భంగము కలుగలేదు. సీమవలె సన్నగ మృదువుగా దారమువడుకు కులకాంతలు, చక్కంగ నేయఁగల పనివాండ్రు పలువురు గలరు. లోహములతోఁ జిత్రములగు పోఁతపనిముట్లు చేయువారలు, కొమ్ములతోఁ జిత్రములగు పెట్టెలు, కలములు, కఱ్ఱలు చేయువారలు నేఁటికిఁగలరు. పట్టువస్త్రములు చిత్రములగు అంచుబట్టలు, కత్తులు, కాగితములు, తుపాకులు, మన్నగున వీరాష్ట్రమున విరివిగఁ దయారగుచున్నవి. తాళములు, పెట్టెలు, వాహనములు, గాజులు చేయుట, రాళ్ళ నుండి లోహములను తీయుట, ఔషధ పరిశ్రమ నేఁటికీ రాష్ట్రమున సజీవముగ నున్నది. రాష్ట్రీయ లీవృత్తుల నబిమానించుచుంట యొక విశేషము.

నవయుగారంభము - నూతనవికాసము

నిజాము రాష్ట్రాంధ్రులిపుడభ్యుదయ కాంక్షులై ముందంజ వేయుచున్నారు. యువకులలో మృదుమధురముగఁ గవితరచింపఁగలవారలు, సరసముగను, జమత్కారముగఁ, ఆలోచితముగఁ గథాకల్పనము గావించువారలు ముందంజ వేసి సరస్వతీసేవకుఁ బూనుకొనుటయే శుభోదయ సూచనము. ఏకారణములవలన నైననేమి, రాష్ట్రమునఁ బలుకుబడి సంపాదించిన నీలగిరి, తెనుఁగుపత్రిక యను వారపత్రిక లిపుడంతరించినవి. ఇవి రెండు రాష్ట్రమునఁ బ్రబోధము కలిగించిన వనుట సత్యము. ఇపుడు గోలకొండ యనుద్వైవారపత్రిక రాష్ట్రమునకు విజ్ఞానము ప్రసాదించుచు, విజ్ఞానవ్యాప్తి కుపయోగించుచున్నది. సుజాత యను సచరిత్రమాసపత్రిక రెండుమూఁడు సంవత్సరములనుండి సర్వాంగసుందరముగఁ బ్రచురింపఁబడుచున్నది. కృష్ణదేవరాయ గ్రంధాలయపక్షమున రెండు సంవత్సరముల క్రింద హైదరాబాదులో జరుపఁబడిన రజతోత్సవసందర్భమునఁ బ్రచురింపఁబడిన సంచికలు రెండును, ఆంధ్రగ్రంథాల యోద్యమజీవిత మీరాష్ట్రము నెట్లభ్యుదయము నొందినది తెలుపుచున్నవి. సారస్వత కుశలులగుయువకులు వృద్ధులు బాలురు కూడ అవేశాభిమానముల తో నీయుత్సవసందర్భమునను సంచికా ప్రకటనమునను జూపిన

ప్రత్యేకాభిమానము ప్రశంసాపాత్రము. ఆంధ్రవ్యక్తిత్వమును నిలువఁబెట్టుటకుఁ బ్రయత్నించు ఆంధ్రకేంద్ర సంఘమును, దాని కార్యదర్శియు నిరాడంబర కార్యదీక్షాతత్పరుఁడును నగు శ్రీమాడపాటి హనుమంతరావు పంతులువారిని మన మీసందర్భమునఁ బ్రశంసింపవలసి యున్నది. ఆంధ్ర కేంద్రసంఘము జాతీయ మతవిలువఁ బెట్టుటయందును, గులసంఘములను దమపాలనములోఁకిఁ దెచ్చుటకును, ఆంధ్రుల ప్రత్యేక వ్యక్తిత్వమును కార్యశూరత్వమును బ్రకటించుటకును, శక్తికొలది పాటుపడుచున్నది. పరిశోధనశాఖను గ్రంథాలయశాఖను బోషించుచు కేంద్ర సంఘము మహారాష్ట్ర కర్ణాటక మహమ్మదీయ వ్యక్తిత్వముల నతిశయించి ఆంధ్రవ్యక్తిత్వము పేరొందుటకై గావించు ప్రయత్నములే నాఁటికిని ఫలింపకపోవు. సంఘసంస్కరణోద్యమము, పంచమసంఘోద్ధరణము, జీవరక్షప్రచారము, స్త్రీవిద్య మున్నగు నూతమోద్యమములలో నిజామురాష్ట్రములోని బ్రధాననగరములు ముందంజ వేయుచున్నవి. కాని, వితంతూవివాహాది సంస్కారములు పల్లెలలోఁగూడ యువకులాచరణమునఁబెట్టుటచే సాంఘిక విప్లవములు, బహిష్కారములు, అన్యోన్యాభి యోగములు చెలరేఁగి కలహములకుఁ గారణమగుట సంతాపకరము.

భాషాసేవ - పరిశోధనము

ఉస్మానియా యూనివర్సిటీవారు ఆంధ్రభాషకుఁగూడఁ దావొసంగిరి. కాని, ఆంధ్రవిద్యార్థుల సంఖ్య చాల స్వల్పముగ నున్నది. రాజకీయములలో నాంధ్రమునకుఁ దావులేకుండుటచే నీపరిస్థితులేర్పడిన వని కొందఱందురు. మహామహులగు నాంధ్రులు తొలుత విశ్వవిద్యాలయ విద్యార్థులలో నాంధ్రమును సహాయ భాషగాఁ గైకొని విద్యార్థులసంఖ్య పెంపొందించుట చాల అవసరము. మహారాష్ట్రులను యవనులను, కన్నడులను, ఈ సందర్భమున ఆదర్శముగాఁ దీసికొనుట యుక్తము. ఆంధ్రులలోఁ బలువురు ఆంధ్రోద్యమములయెడ నభిమానముఁ జూపుచున్నారు. గాని మాతృభాషా గ్రంథపఠనములయం దింక నభిమానము కుదరలేదు. ఇపుడిపుడు మే మాంధ్రులము, మాది ఆంధ్రభాషమాకును బ్రత్యేకవ్యక్తిత్వము ప్రత్యేక వాఙ్మయము గలదను నభిమాను ముదయించినది. నిర్భయముగా నుపన్యాస వేదికలపై నధికారులు ఆంధ్రభాష మృతభాషయని సాహసించి పలుకుటయు, దేశభాషలను తుంగలోఁద్రొక్కి ఉర్దును మాతృభాషగ వ్యవహారభాషగ, నీ రాష్ట్రమునఁ జేయవలయుననుటకు ఉరుదూ పత్రికలు సాహసించుటయు నీమధ్య జరిగినది. ఈ యవనసోదరులు

తపతీసంవరణోపాఖ్యానము, యయాతి చరిత్రము మున్నగు ఆంధ్రకావ్యముల నంకితముగాఁగొన్న యవనుల సంతతివారమే యను సంగతి మఱచిపోవుట సంతాపకరము. నిజామురాష్ట్రమున స్థానికసంఘములు పురపారిశుద్ధ్యసంఘములు దొరతనమువారి యధీనములో నున్నవి. అందుచే దేశభాషల బోధించు ప్రాధమిక పాఠశాలలు ప్రజాపక్షమున చాలినన్ని లేవు. ప్రత్యేక పాఠశాలలు (Private Schools) ఉండఁగూడదని దొరతనమువా రాజ్ఞాపించిరి. ఆంధ్రవ్యక్తిత్వమున కిది యెంత భంగకరమో సోదరు లూహింపగలరు! నిజాము దొరతనము వారీమధ్య (1914లో) పరిశోధనాశాఖను నెలకొల్పిరి. ఈ సంఘము వారింతవఱకుఁ తెలుఁగు శాసనములను నాలుగంటినో యైదింటినో ప్రచురించిరి. వందలకొలదిగఁ బ్రతిగ్రామమునఁబడియున్న దిక్కుమాలిన తెలుఁగు శాసనములపై వీరి యనుగ్రహదృష్టి యంతగాఁ బ్రసరింపకుండుట సంతాపకరము. ఈ లోపమును తీర్చుటకై కేంద్ర సంఘమువారి యధీనమున నున్న ఆంధ్రపరిశోధక సంఘము వారు ప్రాచీన గ్రంధసంపాదనము శాసన సంపాదనము ధారాళముగఁ జేయుచున్నారు. దొరతనమువారీ శాఖకు కొంత గ్రాంట్ నొసంగి యభిమానించినచో ఆర్థిక లోపము తొలగి యింకను గొంత కృషి జరుగనవకాశము లభించును. పరిశోధక శాఖయెడ శ్రీమునగాల రాజావారు ప్రత్యేకాభిమానము జూపుచున్నారు. ఈ శాఖయెడ అదిరాజు వీరభద్రరావుగారు, సిరుగూరి హనుమంతరావుగారు, రాజాబహద్దరు పిల్లెగారు ప్రత్యేకాభిమానము చూపుచున్నారు. ప్రతి సంవత్సరమును వేసవిలో మేము ఈ సంఘపక్షమున శాసనపరిశోధనమును గ్రంధ సంపాదనమును జరుపుచున్నారము. ఇప్పటికి దాదాపుగ 225 శాసనములు, 200 తాళపత్రగ్రంధములు సమకూర్పఁబడినవి. పరిశోధక శాఖకుఁ బ్రత్యేక కార్యస్థానము, ప్రచురణపత్రిక, అవసరమని తోఁచుచున్నది. ఆర్థికలోపముచే నింతవఱకీయత్నమే లేకున్నది. అన్ని తావులందువలె నిజామురాష్ట్రమున నిరుద్యోగ సమస్య తలచూపనున్నది. యువకులు త్యాగముజేయుటకు సిద్ధముగా నున్నారు. సూర్యాపేటలో జరిగినయువక సభ ఆంధ్రుల భవిష్యజ్జీవిత విధానమును సూచించుట యొక విశేషాంశము. యువకుల దృష్టి ప్రతిభ వాఙ్మయమునందును, స్వదేశసేవ యందును, గ్రంథరచనమునందును, పరిశోధనమునందును, బ్రసరించినచో రాష్ట్రాభ్యుదయమున కెంతయో విలంబముకాదు.

రాజకీయ పరిస్థితులు

దొరతనము వారొక ప్రక్క గ్రంథాలయములకు విరాళముల నొసంగు చున్నారు. పోలీసు వారొక ప్రక్క నుండి గ్రంథనిలయములు బలవంతముగా మూయించుచున్నారు. ఈ యతివృష్టికి గాని, యీయనావృష్టికిఁగాని కారణములు తెలియుకున్నవి. ఆంధ్రసంఘమువారలు గావించు వార్షిక సభలలో భజనసంఘము, గ్రంథాలయోద్యమము, సంఘ సంస్కరణము, కేంద్ర సంఘ కార్యప్రణాలిక మున్నగు నవియె చర్చింపఁబడును. రాజకీయముల కిందు తావేలేదు. కాని ప్రభుత్వమువారి యలజడి మెండు. సభల కనుజ్ఞయే యొసంగరు. సభలు జరుపవచ్చును. వాని నాటంకపఱుపరాదను న్యాయస్థానపు తీర్మానమునకు ఆచరణమునకు సంబంధము లేకున్నది. నిజాము దొరతనమువారి యభిమానమునకుఁ బాత్రులగు జ్ఞానవయోవృద్ధులు పాల్గొను నీయాంధ్రోద్యమము నెడఁ బ్రభుత్వమువా రభిమానము జూపుట, అనుమానము విడుచుట కర్తవ్యము. దొరతనమువారి పాఠశాలలోఁ బెట్టబడు పఠనీయ గ్రంథములలో మార్పు గావలసినంత గోచరింపకున్నది. వాఙ్మయమునం దపూర్వ మగు ప్రచారము జరుగుచున్నది. వాఙ్మయ వికాసమునకు హేతుభూతములగు వాచకములు కావ్యములు వ్యాకరణములు నవలలు పెక్కులు బయలువెడలు చున్నవి. దొరతనమువారి పాఠశాలలో నీనూతనగ్రంథములకుఁ దావులేదు. విద్యాశాఖ వారి ప్రత్యేకాజ్ఞ యున్నఁగాని, నూతన గ్రంథముల నేర్పఱుపరు. మహమ్మదీయమతమును ఇతర విషయముల నీగ్రంథము విమర్శించుటలేదని ప్రత్యేకోద్యోగి విద్యాశాఖవారికిఁ దెలుపవలెను. ఇవి యనుకొన్నంత సులభముగా జరుగునవికాకపోవుటచేఁ బరంపరగా నొకేవిదమగు పఠనీయగ్రంథములు వాడుకలోనున్నవి. ఈమధ్య పఠనీయ గ్రంథసభ్యులు వసుచరిత్రమును బఠనీయముగా నేర్పఱుప దొరతనమువారి పక్షమునుండి అందలి కృత్యాదిలో మహమ్మదీయుల పరాజయములు వర్ణింపఁబడెనుగాన నిషేధింపవలయు ననిరఁట. ఇట్టిపరిస్థితులు మాఱుట కింక నెంతకాలము పట్టునో!

జరుగవలసినపని

ఆంధ్రపరిశోధనశాఖ పక్షమునః బరిశోధన మెంతయో జరుగవలెను. చివికి జీర్ణించు వ్రాఁతప్రతులను సేకరించి అముద్రితములకుఁ బ్రత్యంతరములను వ్రాయవలెను. కేంద్ర సంఘము వాఙ్మయదేశీయ సంస్థలఁ బోషించుట కెంతేని మూలధనము గడింపవలెను. నిజామురాష్ట్రమున నున్న గ్రంథాలయములు దాదాపుగ

120 ఉండును. వీనితో మనమొక త్రైమాసిక పత్రికయో, అట్టి యవకాశము గలుగనిచో సుజాతలో గ్రంథాలయానుబంధమో వెలువరించుట యవసరము. ఆంధ్రు లెచ్చట నున్న నొక్కటియే యను నుదారభావమునకు భంగకరమగు "రాష్ట్రీయాంధ్రులు, రాష్ట్రేతరాంధ్రులు" అనుప్రశ్నకుఁ దావీయక ఆంధ్రులందఱు పాలు నీరువలెఁ గలసి రాజకీయ వాఙ్మయైతిహాసిక లలితకళలలోఁ బాల్గొని యాంధ్రాభ్యుదయము.. బాటుపడవలెను. నిజాం రాష్ట్రాంధ్రులు శారదానికేతనమునకు, లక్ష్మీనృసింహ షష్ఠిపూర్తి సంపుట ప్రచురణమునకు, ఇంకను నిట్టి దేశీయసంస్థలసఁ గావించిన సేవయు, సహాయము అపారము. చారిత్రక విషయశోధనము గావించువారికి, కవి జీవితమునకు, గ్రంధసముదాయమునకు నిజాము రాష్ట్రము రత్నఖని. ఈ ఖనియందలి రత్నములన్నింటిని సమకూర్చుట యమూల్యహారము గావించి ఆంధ్రభారతి కంఠమున నలంకరించుట ప్రత్యాంధ్రునివిధి. ఎనిమిదిమండలముల వైశాల్యముగ అఱువదినాలుగు లక్షల యాంధ్రసోదరులకు నెలవై గద్వాల, వనపర్తి మున్నగు స్వదేశ సంస్థానముల కాటపట్టయి, ఆంధ్రవాఙ్మయ పీఠమగు నీ రాష్ట్రమధ్యమున ఆంధ్రుల పక్షమున ఒక చిత్రవస్తు ప్రదర్శనశాల, ఒక ప్రాచీనగ్రంథనిలయము, ఒక యితిహాస పరిశోధక శాఖ యవసరము.

సమాప్తి

నిజామురాష్ట్రములోని యాంధ్రసంస్థానములు వాఙ్మయమునకు గావించిన సేవయపారము. సేవాఫలితమును రాష్ట్రస్వరూపపటమును రాష్ట్రస్థానిక చరిత్రములను బ్రచురించి నిజామురాష్ట్రములోని యాంధ్రభాగము ఐతిహాసిక దృష్టితో సమగ్రమగు గాంధ్రఖండమున నొకభాగమునువంశము రూఢిచేయుట కాంధ్రులందఱును బ్రయత్నించుటకును, బ్రిటిషు ఆంధ్రప్రాతములలోని పత్రికలు విరివిగ నిజామురాష్ట్రమునను, నిజాము రాష్ట్రాంధ్ర పత్రికలు బ్రిటిషు ఆంధ్రదేశమునను వ్యాపింపజేసి, "ఎక్కడనున్నను నాంధ్రులంద ఱొక్కటియే" యను నభిమానము దేశీయుల హృదయములలో స్థిరపఱుప నాంధ్రనాయక రత్నములను బ్రార్థించెదము. నిజాము రాష్ట్రమునుండి బొంబాయి ప్రాంతములకు వలస యేగిన యాంధ్రసోదరులు మాతృదేశాభ్యుదయమును గాంక్షించి, కేంద్ర సంఘమునకు విరాళముల నొసంగుచు, నిజాము రాష్ట్ర విశేషాంశములు తమ మాసపత్రికయందును సంవత్సరాది సంచికయందును బ్రచురించుచు, ఆంధ్రాభ్యుదయమునకు సర్వాంకషముగ యత్నించుట భావ్యభివృద్ధికి శుభచిహ్నము. ఆంధ్రసోదరులు చరిత్రదృష్టిలోనో, సమష్టి భావముతోనో, సోదరాభిమానమోతోనో నిజాము రాష్ట్రముపై దృష్టి పఱుపుట ధర్మము.

౨౦. నిజాము రాష్ట్రము - వాఙ్మయచరిత్రము - I

*కాకతీయ మహాయుగము

పచ్చికండలు నెత్రు పంకిలంబుగఁ జేసి, తెలుఁగుపౌజులు పోరఁ దెగినతావు
సారస్వతసుమంబు సౌరభమంద మం,దానిలంబుల వీచినట్టిచోటు
వీరశైవమతాసి విశ్వసంహారతాం, డవ మాడినట్టి క్రీడాగృహంబు
ఆంధ్రశిల్పప్రౌఢి యాంధ్రవిక్రమరేఖ. జాలుగాఁ బాఱిన శాద్వలంబు

తే.గీ. రాచనెత్తుటఁ బితకుఁ దర్పణ మొనర్చి, యాంధ్రభార్గవుఁడు కృతార్థుఁడైన నెలవు
నేటియుగమున కేమి సందేశమొసఁగఁ, జాలదొక్కొ నిజాము వాస్తవ్యులార!

ఆంధ్రకవితారంగస్థలమును, దేశీయరాజన్యులకు మందిరమును, సమధికైశ్వర్య సంశోభితము నగు నిజాము రాష్ట్రమునందు గల యాంధ్ర దేశ విస్తృతియు, నచటి సారస్వతరంగస్థలములు, చరిత్ర ప్రదేశములు దేశీయులదృష్టి నంతగా నాకర్షించియుండవనుట సాహసము కాఁజాలదు. నిజాము రాష్ట్రములోని తెలుఁగు దేశము నిర్జీవస్థలముగాదు. ఆంధ్రకవిరాజుల రసవత్కవితామృతముచేఁ బునీతమైన పుణ్యభూమి; ఆంధ్ర వీరుల పరాక్రమ రక్తదారలచేఁ బవిత్రమైన స్మరణచిహ్నము; ఆంధ్రకాంతల సహగమన శ్మశానవాటికలచేఁ బావనమైన రత్నగర్భ; ఆంధ్రశిల్పులహస్తవిన్యాసముచే సజీవమైన చరిత్రరంగస్థలము. ఇపుడా ప్రాణావశిష్టములగు చారిత్రక చిహ్నములు ఆంధ్రపరిశోధకుల దృష్టి నంతగా నాకర్షింపఁబడకుంట యాంధ్రమాతృదురదృష్ట మనుటకంటె నన్యపదముపయోగింపఁ జనదు.

ఆంధ్రభాగము

నిజాము రాష్ట్రమునందు 1. వరంగల్లు, 2. కరీమునగరము, 3. ఆదిలాబాదు, 4. అత్రాపుబల్దా, 5. మెదకు, 6. నిజామాబాదు, 7. మహబూబునగరము, 8. నల్లగొండమండలములు పూర్తిగ ఆంధ్రమండలము లనఁదగియున్నవి. ఇంతియకాక

★ *ఇది మేము వ్రాయఁబోవు నిజామురాష్ట్ర వాఙ్మయచరిత్రమునందు ఒక మహాయుగము. ఇందు క్రీ.శ. 1320 వఱకుఁగల చరిత్రాంశములే చర్చింపఁబడినవి. ఆవలియంశములు పద్మనాయక మహాయుగమునఁ జర్చింపఁబడును*

రాయచూరుమండలములోఁ గొన్ని తాలూకాలు, ఇందూరుమండలములోఁ గొన్ని తాలూకాలు ఆంధ్రదేశమునకుఁ జెందియున్నవి. తక్కినమండలములలోఁగూడ నాంధ్రులు నివాసముగా నుండెడు గ్రామములు కలవు. నిజాము రాష్ట్రమునందు గల యాంధ్రదేశము విస్తీర్ణము 41,341 చదరపు మైళ్లు అని దొరతనమువారి లెక్కల వలనఁ దెలియుచున్నది. నిజాము రాష్ట్రమునఁ దెలుఁగు మాతృభాష గాఁ గలవారు ౬౧,౧౫,౧౭౪. ఇంత విశాలము ఆంధ్రజన సమావృతమగు నీ నిజాము రాష్ట్రమునఁ గల చరిత్ర స్థలములు, సారస్వతపరిణామములు, ఆంధ్రజాతీయ చిహ్నములు గుఱితించి యాంధ్రతత్త్వము సమగ్రముగా నెఱుంగుట ప్రత్యాంధ్ర భాషాభిమానికిని విధియై యున్నది.

తొలుత నిజాము రాష్ట్రములోని భూభాగమును జాలవఱకు తూర్పు చాళుక్యులు పరిపాలించిరి. తూర్పు చాళుక్యుల ప్రాచీన శాసనములు అలంపురి, కొలనుపాక, లేములవాడ, పానుగల్లు, కళ్యాణపురము, వనవాసి, కరీమునగరము లోనగు గ్రామములలోఁ గలవు. ఈచాళుక్యులెల్ల ఆంధ్రులగుటచే నాంధ్రదేశమున విరివిగా నాలయములు దుర్గములు కోటలు నెలకొల్పి దేశమునకు దమయైశ్వర్యమునంతయు ధారవోసి ప్రశస్తినొందిరి. పశ్చిమ చాళుక్యుల ధాటి వలనను, కొల్లాపుర మండలేశ్వరుఁడగు విజయాదిత్యుని వలనను, బిజ్జలుని యవినీతివలనను, బసవేశ్వరుని విజృంభణమువలనను, శైవజైనమతముల కలహములవలనను, చాళుక్య రాజ్యము ప్రాణావశిష్టమయ్యెను. తూర్పు చాళుక్యుల విస్తృత సామ్రాజ్యము పొందిన యైశ్వర్యములను దెలుపు చారిత్రక చిహ్నములు నిజాము రాష్ట్రమునఁ బెక్కులు గలవు. హతశేషములగు నాచిహ్నముల నన్నింటి నుద్ధరించి యించుమించుగా నాంధ్రదేశము నంతయు నేకచ్ఛత్రముగాఁ బరిపాలించిన రాజన్యులు *కాకతీయులను నాంధ్రశాఖీయులు.

కాకతీయ సామ్రాజ్యము

కాకతీయులలో ప్రోలరాజుమి గులఁ బరాక్రమశాలి. ఈతఁడు హనుమకొండ

---

* *కాకతీయులు ఒరంగల్లు పాలించిన యాంధ్రరాజులు. వీరు తొలుత జైనులు, పిదప శైవులు. కాకతియను దేవిభక్తులగుటచేఁ గాకతీయులనఁబడిరి. కాకతమ్మగుడి పూర్వమోరుగల్లులోఁ గలదు.*

రాజధానిగాఁ జేసికొని తెలుఁగు దేశమునంతయుఁ దన సామ్రాజ్యపతాకము క్రిందికిఁ దెచ్చికొని తీవ్రయత్నములు గావించిన మహాశూరుఁడు. ఈతని మహాయత్నమున కడ్డుబడిన చాళుక్య చూడామణియగు తైలపదేవుఁడు లుంఠాకవిషయాధీశ్వరుఁడగు గోవిందరాజు, మంత్రకూటపురాధీశ్వరుఁడగు గుండరాజు, మండలేశ్వరుఁడగు జగ్గదేవుఁడు పరాభూతులైరి. ఈప్రోలరాజు నాఁటిన స్వాతంత్ర్య బీజము లాంధ్రదేశమునకు ఆంధ్రజాతికిఁగల ప్రత్యేక జాతీయతకు నమృతభిక్ష పెట్టెననుటలో సాహసము లేదు. కాకతీయరాజన్యునితో బోరునకు దొరకొనిన యవీరాతివీరులందఱు నాంధ్రులనియు ఓరుగల్లు ప్రాంతములలో నుండు రాజన్యులనియు నూహింపనవకాశములు గలవు.

ప్రథమప్రతాపరుద్రుఁడని వ్యవహరింపఁబడు కాకతీయ రుద్రదేవచక్రవర్తి కాలమునుండి కవితాకళకు ఆంధ్రశిల్పములకు నిజామురాష్ట్రమున మంచి యవకాశములు తటస్థించెను. రుద్రదేవుఁడు అనుమకొండలో నాంధ్రశిల్పులచే విచిత్రమగు నొకదేవాలయమును గట్టించి దానికి రుద్రేశ్వరమను నామమొసంగి తమవంశచరిత్రమునంతయు రామేశ్వర భట్టారకునిచే శ్లోకరూపముగ నిర్మింపఁజేసి శాసనము వేయించెను. రుద్రదేవుఁడు స్వయముగఁ గవీశ్వరుఁడై సంస్కృతాంధ్ర కర్ణాట భాషలలోఁ గావ్యములను రచించి కవులఁ బ్రోత్సహించుటచే పాలకుఱికి సోమనాథాది మహాకవులు కాకతీయసామ్రాజ్య వృక్షచ్ఛాయ ననుసరించుచు సుఖజీవనులుకా నవకాశము తటస్థించినది. రుద్రదేవుని నాఁటి యాంధ్రకవితాగ్రంథము లింతవఱకును బ్రచురణము కాకుండుటకంటెఁ బరితాపకరాంశ మింకొకటిలేదు.

కాకతీయగణపతిదేవచక్రవర్తి ఆంధ్రకవితాభిమాని. ఇతనియొద్ద మంత్రిగానున్న విశ్వేశ్వరశివదేశికులు సంస్కృతాంధ్రములలో నఖండ పండితుఁడు. తిక్కనసోమయాజి ఈగణపతి దేవుని యొద్దకు వచ్చి తనభారతమును వినిపించి యభీష్టఫలముల నొందినటుల నైతిహ్యములు పెక్కులు గలవు. గణపతిదేవుఁడు పాండ్యదేశమును గూడ ముట్టడించి తన రాజధానిలోఁగలుపుకొనెను. గణపతిదేవుని సేనానాయకులలో రుద్రసేనాని, మేచయనాయకుఁడు, చౌండసేనాని లోనగువీరులు నెలకొల్పిన శాసనాంశములు, ధర్మములు నేఁటికిని స్థిరముగనున్నవి. రుద్రమదేవిగణపతిదేవుని కొమార్తెయని తెలుపుశాసనములు పానుగల్లునందు, కొలనుపాకలోను

గనుఁగొనఁబడినవి. రుద్రమదేవి సామ్రాజ్యసమయమున నాంధ్రకవితా కన్యపొందిన శ్రేయోవృద్ధులను గుర్తింపఁదగిన యవకాశములు కానరావు. కాని రుద్రమదేవి చరిత్రముమాత్ర మసామాన్యమైనది. ఆమె పరాక్రమము నొకకవి యిటుల గానముచేసియున్నాఁడు.

"ఆక్రామంతి తర త్తరంగవిగళద్దుగ్ధాబ్ధి ఫేనావళీ,
రాచామంతి శరచ్ఛశాంక విసరజ్జ్యోత్స్నా ప్రవాళామృతమ్;
ఆకర్షంతి సురేంద్ర దంతిదశన ప్రాకారలగ్నాం శ్రియం,
ముక్తాహారలతాయితాః ప్రతిదిశం రుద్రాంబి కాకీర్తయః"

మల్కాపురము శాసనము

రుద్రమదేవి యనంతరము ప్రతాపరుద్రచక్రవర్తి రాజ్యమునకు వచ్చినదిమొద లాంధ్రకవితకు మంచియవలంబనము దొఱకెను. పెక్కుమంది కవులు ఒరంగల్లుచేరి కవితాజీవనము చేయసాగిరి. కాకతీయ సామ్రాజ్యకీర్తి చంద్రికలు, ప్రతాపరుద్ర పరాక్రమజ్యోతి, నేఁటికిని సజీవముగాఁ జరిత్రపరిశోధకులకుఁ గనంబఱచు ప్రతాపరుద్రయశోభూషణమును వ్రాసిన విద్యానాథమహాకవి నిజాము రాష్ట్రములోని వాఁడె. కాకతీయసామ్రాజ్యముననుసరించి ప్రఖ్యాతి గాంచిన కవులలో ముఖ్యుల నామములు తెలిసినంతలో నుదాహరించెదము.

పాలకుఱికి సోమనాథ మహాకవి

ఇతఁడు కర్ణాటాంధ్ర సంస్కృతభాషలలోఁ బెక్కు కావ్యములను వ్రాసినకవి. ఇతనికవిత రసవత్తరము మనోహరముగా నుండును. పిడుపర్తి సోమనాథుఁడు ఈబసవకవి లోనగువారీతని శిష్యపరంపరలోనివారు.

భాస్కరాదులు

భాస్కరరామాయణము వ్రాసిన భాస్కరుఁడు తనకృతి సాహిణిమారున కంకితము గావించెను. సాహిణిమారుఁడు ప్రతాపరుద్రుని కాలములోనివాఁడు. భాస్కర రామాయణమునకు సంబంధించిన మల్లికార్జునభట్టు కుమారరుద్ర దేవుఁడు, అయ్యలార్యుఁడు మంత్రి భాస్కరుఁడు, హుళిక్కి భాస్కరుఁడు ఒరంగల్లు ప్రాంతమువారె?

మారనకవి

ఇతఁడు మార్కండేయపురాణముఁ వ్రాసి ప్రతాపరుద్రునిసేనా నాయకుఁడగు గన్నయ నాయకునకు నంకితము గావించెను, మారనకవి తిక్కన సోమయాజి శిష్యుఁడు.

గోనబుద్ధారెడ్డి

ఇతఁడు రంగనాథ రామాయణము వ్రాసెను. ఒరంగల్లునకుఁ గొంతదూరములోనున్న బూదపూరు వర్ధమానపురములో నున్న కుప్పాంబ శాసనములలో బుద్ధారెడ్డి ప్రశంసింపఁబడియున్నాఁడు. బుద్ధారెడ్డి కాకతీయ రాజులకడ సేనానాయకుఁడో సామంతుఁడో యై రామాయణ ద్విపద వ్రాసియుండవచ్చును. దీనివలన ఉత్తరరామాయణ ద్విపద వ్రాసిన కాచవిభుఁడు విఠలరాజు నిజాము రాష్ట్రీయులని తెలియును.

రుద్రదేవ చక్రవర్తి

ఇతఁడు క్రీ.శ. ౧౧౪౦ మొదలుకొని ౧౯౯౬ వఱకు హనుమకొండలో రాజ్యము పాలించెను. ఈ రాజన్యుఁడు సామ్రాజ్య విస్తృతికై సంగరము లొనరించుటయే కాక విద్యాభూషణ బిరుదాంకితుఁడై సంస్కృతాంధ్రకర్ణాటభాషాకవులకుఁ బ్రోత్సాహ మొనరించి తెలుఁగు భాషలో స్వయముగా నీతిసారమును గ్రంథము రచించినటులనూ రామకృష్ణకవిగారు వ్రాసియున్నారు. రుద్రదేవుఁడు రాజై ధర్మసంస్థాపనమునకుఁ బాటుపడుటయేగాక కవియై మాతృసేవకు ముందుకు వచ్చి కాకతీయ సామ్రాజ్యమును ఆంధ్రకవితారంగస్థలముగా మార్చెను. రుద్రదేవుఁడు జైనాలయములలో నొకటియగు హనుమకొండలోని పద్మాక్షి దేవాలయమును శైవాలయముగ మార్చుటకు బ్రాహ్మణులకుఁ జేయూఁతనొసంగెను. రుద్రదేవుని రాజనీతి చతురత కాతని గ్రంథములోని యీ క్రిందిపద్యములు దృష్టాంతములు కాఁగలవు.

తే.గీ. **ఆజ్ఞ లేనినృపుఁడు నరయ చిత్తరువులో**
నున్న రాజు చూడ నొక్కరూప
యానఁద్రోయునృపుని నైనను దండింప
కున్న రాజ్య మేల నుండుఁ జెడక.

ఉ. కొందఱు మేలమాడుటలు కొందఱవావులు దేర్చిపిల్చుటల్
కొందఱు ముద్దుసేయుటలు కొందఱు నెయ్యపుఁ జూపునూచుటల్
కొందఱనాత్మ భావమునఁ గొందఱమన్నన భృత్యులందు ని
ట్లందఱ నన్నిభంగుల నృపాగ్రణి వశ్యులఁజేయగాఁ దగున్.

జాయసేనాపతి

ఇతఁడు గణపతిదేవుని సేనానాయకుఁడై, కవి సభాశిఖామణి, నాట్య విద్యావిశారద, బిరుదముల నొంది నృత్తరత్నావళియను నాట్యగ్రంథమును రచించెను. జాయసేనాపతి శాసనములు గణపేశ్వరమునందును గుంటూరు మండలములోని చేబ్రోలునందును గలవు. ఇందు ఆంధ్రనృత్యాదికములు ప్రశంసింపఁబడియున్నవి. ఇది యుత్తమ గ్రంథము.

వీరభల్లట దేశికుఁడు

ఇతఁడు సర్వశాస్త్రములలోఁ బండితుఁడై ప్రతాపరుద్రచక్రవర్తి యాస్థానములో మహాకవిగా నున్నటులు చెప్పుచున్నారు. ఇతని గ్రంథము లింకను లభింపలేదుగాని

ఇతీవ కథయామాస వీరభల్లట దేశికః,
ప్రతాపరుద్ర దేవస్య సన్నిధౌ సర్వశాస్త్రవిత్.

అనునొక నాట్యశాస్త్రములోని శ్లోకమువలన వీరభట్లటుఁడు సుప్రసిద్ధుడనియు నాతని గ్రంథములు కాలగర్భమున నిమిడియున్నవనియుఁ దోఁచుచున్నది.

శాకల్యమల్లభట్టు

ఇతఁడు ప్రతాపరుద్రుని యాస్థానములోనుండెను. ఇట్లని స్థానిక చరిత్రమునందును ప్రతాపచరిత్రమునను గలదు. ఇతఁడు నిరోష్ఠ్య రామాయణము రచించెను. కాని యీ పుస్తక మిపుడు కానరాదు. భాస్కర రామాయణములోని భాగములు రచించిన మల్లికార్జునభట్టే యీతఁడని కొందఱు, అందలి యుద్ధకాండ శేషము వ్రాసిన యయ్యలార్యునకుఁ బినతండ్రియని మఱికొందఱు వ్రాసియున్నారు. ప్రసంగరత్నావళియను గ్రంథములోని "పూర్ణస్తత్కృపయా గజేంద్ర విజయీ శాకల్య మల్లః కవిః" యను శ్లోకభాగమువలన నీకవి కాకతీయ సామ్రాజ్యపతనానంతరము విద్యానగరరాజ్యము స్థాపించిన హరిహరరాయల వద్దనుండెనని తెలియును. ఇతఁడు

ఉదారరాఘవమను సంస్కృత కావ్యమును రచించెను. అందలి గద్యవలన నీకవి సహజపాండిత్యుఁడనియు శాకల్యయనునది గృహనామమనియు మాధవపండితుని కుమారుఁడనియుఁ దెలియుచున్నది. ఇతని గ్రంథము లెన్ని మాటుమణఁగియున్నవో!

శివదేవుఁడు

ఇతఁడు పరతత్త్వరసాయనమను కావ్యమును రచించెను. ప్రకృత మా గ్రంథభాగము మాత్రమొకచోగలదని తెలిసికొంటిమి. ఈకవి రుద్రమదేవి ప్రతాపరుద్రుల కాలమున నున్నటుల వినికిడిగలదు. ఇతని గ్రంథాదికము జీవితమును గూర్చి యింకను బరిశ్రమ జరుగవలసియున్నది.

విద్యానాథుఁడు

ఇతనికిది బిరుదనామము కావచ్చును. ఇతఁడు అగస్త్యేశ్వర నాముఁడని కొందఱూహించుచున్నారు. కాని యది నిశ్చయముగ నిదమిత్థమనరాని స్థితిలో నుంటచే విద్యానాథుఁడనియే మనము వ్యవహరింతము. ఇక్కవి ప్రతాపరుద్రుని యాస్థానముననుండి యాసామ్రాజ్యసంపదలను గావ్యముఖమునఁ జిత్రించి యాంధ్ర సైనికుల పరాక్రమజీవితములఁ గొని యాడినధన్యుఁడు. అతని యితర గ్రంథాదికము గూడఁ గానవచ్చుట లేదు.

ఇంతియకాక విశ్వనాథకవి, అగస్త్యేశ్వరుఁడు, శ్రీరామదీక్షితుఁడు, నృసింహపండితుడు మల్లినాథుఁడు లోనగు మహామహులందఱు కాకతీయ సామ్రాజ్యమునకు సంబంధించిన కవులు పండితులు నైయున్నారు. ఏకశిలానగరమును ఆంధ్ర సామ్రాజ్యమునకు ముఖ్యస్థలము గావించి గణపతి దేవుఁడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుఁడు, అనుమకొండ రాజధానిగఁ జేసికొని ప్రోలరాజు రుద్రదేవచక్రవర్తి ఆంధ్రదేశమునకు ఆంధ్రభాషకుఁ గావించిన యుపకారములు సమగ్రముగాగుఱుతింప వీలులేకున్నది.

క్షేత్రములు

జైనులు బౌద్ధులు హిందువులు నెలకొల్పిన దేవాలయములు నిజాము రాష్ట్రమునఁ బెక్కులుగలవు. అందనేకములు పూర్వము మిగుల నైశ్వర్యములోఁ దులతూగి యిపుడు నామమాత్రావశిష్టములైయున్నవి. అందలి శిల్పముల వైభవము, విగ్రహముల

సౌష్ఠవము, దీర్ఘికలయందము, ప్రశంసాపాత్రములనుటలో సంశయము లేదు. ఇంతియకాక మిక్కిలి ప్రాచీనములగు చరిత్రచిహ్నములు శిల్పచిహ్నములు నిజామురాష్ట్రమునఁ గలవు. వాని చరిత్రము లార్జించినచో నొకయుత్తమగ్రంథముగా రచింపవచ్చును.

అలంపురి

ఇది నిజాము రాష్ట్రములోనున్నది. దీనిని శ్రీశైలమునకుఁ బశ్చిమద్వారమని చెప్పుదురు. ఇట రాష్ట్రకూటులు, చాళుక్యులు, కాకతీయులు స్థాపించిన శాసనములు పెక్కులు గలవు. కొన్ని జైనమతమువి గలవు. ఇచట బ్రహ్మేశ్వరుని యొక్కయు జోగుళాంబయొక్కయు దేవళములు సుప్రసిద్ధములు. ఇట మంథాన భైరవుఁడను శివాగమాచార్యుడు చిరకాలము నివసించి ఆనందకందళము, మంథాన భైరవతంత్రములోనగు నుత్తమగ్రంథములు రచించెను. ఇచట నందముగనున్న దేవాలయములు పెక్కులుగలవు. వానిని గూర్చి ప్రత్యేక గ్రంథమునఁ బేర్కొనఁ దలంచినారము.

కొలనుపాక

ఇది దక్షిణకాశియని స్థలపురాణమునఁ బ్రశంసింపఁబడియున్నది. స్థలపురాణమువలనఁ దొలుత కుళుద్ధభూవతి సోమదేవుఁడు పాలించినటులందెలియును. ఇచట మిగుల పురాతమగునొక జైనదేవళముగలదు. అందలి విగ్రహసౌందర్యము ప్రశంసాపాత్రము. కొన్ని కారణములచే నీగ్రామము పూర్వము జైనాలయముగానుండి పిదప చాళుక్యలవశమున ఆస్తికులవశమయ్యె నేమోయని తోఁచుచున్నది. ఇచట మిగుల విశాలమగు సోమనాథ దేవాలయము జైనమతమువలె నున్న వీరనారాయణదే వాలయమేకాక జాతికొక్క దేవళము గలదు. వీనినన్నింటిని మతములని వ్యవహరించుచున్నారు. ఈ గ్రామములోఁ బలుతావుల చాళుక్యుల శాసనములు లెక్కకుమించియున్నవి. ఇంతియకాక జైనశాసనములు సైతము గలవు. కొలను పాకసోమనాథుని ప్రశస్తి దిగంత వ్యాప్తమైయున్నది. కొలఁదిగ నిచట కాకతీయుల శాసనములు గలవు. ఇదియొక సుప్రసిద్ధమగు శివక్షేత్రము. కాకతీయ రాజ్యముతో నీ క్షేత్రవైభవమంతరించినది.

లేములవాడ

దీనినే వేములవాడయందురు. పూర్వమిది జైనక్షేత్రము. ఇచటగల జైన విగ్రహములకు మితములేదు. గ్రామములో నేచోటచూచినను జైన విగ్రహములే. రాజేశ్వరాలయ మిచట మిక్కిలి ప్రఖ్యాతిగలిగియున్నది. పూర్వమిదియొక జైనమఠమై శైవులచే నాక్రమింపఁబడెనని చెప్పుదురు. ఈయాలయావరణములోఁ బెక్కు ధ్యానజైన విగ్రహములు కలవు. చాళుక్యరాజరాజుయొక్కయు, త్రిభువన మల్లునియొక్కయు, శాసనములు కలవు. ఇచట భీమేశ్వరాలయము మిగుల గొప్పది గలదు. ఆలయమునందలి మండపము మహోన్నతముగ విశాలముగ నుండి చూపరులకు దిగ్భ్రను గొలుపుచున్నది. ఇది చాళుక్యరాజులలో నొకఁడగు త్రిభువనమల్ల విజయాదిత్యునిచే నున్నతినొందెను. వేములవాడ భీమకవి కీభీమేశ్వరుఁడే వరప్రదాతయని చెప్పుదురు. ఇట భీమేశ్వారాలయముందుట యెరుంగక ప్రభాకర శాస్త్రిగారు భీమకవి యీవేములవాడవాఁడు కాఁడని సంశయించిరి. స్థలపురాణములో భీమేశ్వరాలయమునకు దక్షవాటికయను పేరుగలదు.

ధర్మపురి

ఈ గ్రామము పూర్వము చాళుక్యరాజులలో నొకశాఖవారికి రాజధానిగా నుండెను. ధర్మపురి రామాయణము, నరసింహశతకము ఇచటి దైవమును గూర్చినవియె. చరిగొండ ధర్మకవి తన విచిత్రరామాయణము ననిచటి నృసింహుని బొగడెను. పద్మపురాణమున మడికిసింగన యీ నృసింహస్వామి వైభవములను శ్లాఘించెను. ఈ దివ్య క్షేత్రము ఒరంగల్లునకుఁ బంద్రెండామడల దూరములో గోదావరీతీరమున నున్నది. నిజాము రాష్ట్రీయులకీ క్షేత్రముపై భక్తి విశ్వాసములు మెండు. ఇచటను గొన్ని శాసనములు గలవు.

అయినవోలు

ఇదిఒరంగల్లున కాఱుక్రోసుల దూరములో నున్న క్షేత్రము. ఇది వీరాలయము. ఇందు మైలారుదేవుఁడు శివునవతారమనియుఁ బూజనీ యుండనియు శాసనములలోఁ గలదు. ఈయాలయమున ఒరంగల్లులో నున్నట్టి శిలాద్వారములు మహోన్నతములగునవి చక్కని శిల్పవిన్యాసములతో నిండినవి నాలుగుకలవు. మైలారు పూర్వమొక మహావీరుఁడనియు నాతఁడు సంగ్రామములో మరణించినది మొదలుకొని

దైవముగాఁ బూజించుచుండిరనియుఁ గాకతీయరుద్రమదేవి విపులమగు నాలయముఁ గట్టించెననియు స్థలజ్ఞులు చెప్పుదురు. తీర్థప్రజలీ క్షేత్రమునకు విరివిగా నేతెంచి ప్రాణాచారములు పడుట నేఁటి కాచారముగ నున్నది. మైలారువీరభటులు గావించు భక్తి పారవశ్య ప్రదర్శనములు క్రీడాభిరామమున నిటులు ప్రశంసింపఁబడెను.

సీ. అవఅవమందు నెఱ్ఱనిచంద్రమల్లెల, చోద్యంపుగుండాలు చొచ్చువారు
కరవాడియలుగుల కనరుపాతరలలో, నుట్టిచేరులఁగోసి యురుకువారు
గాలంపుకొంకికంకాళచర్మముగ్రుచ్చి, యుదువీధినుయ్యాలలూగువారు
కటికియొగ్గాళంపు గండగత్తెరవట్టి, మిసిమింతులునుగాక మ్రింగువారు

తే.గీ. వీరమైలారుదేవర వీరభటులు
గొండ్లియాడుచున్నారు గొఱగపడుచు
సాహసముమూర్తి గైకొన్న సరణివారు
ధీరహృదయులు మైలారు వీరభటులు.

కాళేశ్వరము

ఇదియొక శివక్షేత్రము. ఇచట కాళేశ్వరుఁడను. శివుఁడుగలఁడు కాకతీయులు ఈశివునియందు భక్తితాత్పర్యములుగలవారై పెక్కు మాఱులు దానధర్మములు గావించి తులాభారములు తూఁగియున్నారు. ఆంధ్రదేశమునందు సుప్రసిద్ధములగు త్రిలింగ క్షేత్రములలో కాళేశ్వర మొకటి. విద్యానాథుఁడు ప్రతాపరుద్రీయములో "శ్రీశైలకాళేశ్వర ద్రాక్షారామనివాసినః" యని కాళేశ్వరశివునిఁ బ్రశంసించెను. కాళేశ్వరప్రశస్తి యచటి పూర్వవైభవ చిహ్నములు నెఱుంగనివారు, కాళేశ్వర ప్రతిభ కాళహస్తికి ముడిపెట్టుటలో వింతలేదు. త్రిలింగములలోఁ గాళేశ్వరమున జేర్పక కాళహస్తినే చేర్తుమేని యాంధ్రదేశవైశాల్యము తగ్గుటయేకాక ఉత్తరసర్కారులన్నియు ఆంధ్రదేశములోఁ జేరకుండునని యోచింపఁజాలతున్నారు. ఇక్కాళేశ్వర ప్రతిభ స్థలమహాత్మ్యము చూచిన బోధ కాఁగలదు.

ఇంతియకాక వేల్పుకొండ, యాదగిరి, ఏలేశ్వరము, ఉమామహేశ్వరము, ఆలవాల, నాగులవరము, ఓరుగల్లు, రామగిరి, మొగిలిచర్ల, మట్టిపల్లి, వాడపల్లి, జటప్రోలు, లోనగునని నిజామురాష్ట్రమున మిగులఁ బ్రశస్తినొందిన పుణ్యక్షేత్రములు. వీని సమగ్రవైభవము కాకతీయ సామ్రాజ్య ముచ్చదశలోనున్నతటి వర్ణనీయముగ

నుండెను. ప్రకృతము వీనిప్రశస్తి చాలవఱకు పరిశోధన శరణ్యముగ నుండెననుట సత్యమునకిందుకేని దూరము కాఁజాలదు.

శిల్పములు

నిజామురాష్ట్రమున మనోహరశిల్పవిన్యాసములతో నిండిన యాలయములు వేలకొలఁది గలవు. అందు పానుగల్లులోని చాళుక్యదేవాలయములోని శిల్పములు మిగుల మనోహరముగ దర్శనీయములుగ నున్నవి. ఇందలి యాలయస్తంభములపై గల చిత్రవైఖరి చాళుక్యరాజులనాఁటి శిల్పప్రశస్తిని వేయివిధములఁ గొనియాడుచున్నది. ఈ *పానగల్లే ఆంధ్రదేశమున మిగుల వ్యాప్తిలోనున్న బాలనాగమ్మ కథకు జన్మస్థలము. ఇందలి శిల్పము లాంధ్రులు దృష్టికింకను సంపూర్ణముగాఁ బాత్రము కాలేదనుట సత్యము. ఒరంగల్లునకు నాలుగైదామడల దూరములో నున్న పాలెముపట్టు చెంతగల రామప్పగుడి దర్శనీయమైనది. అందలి స్తంభములపైఁగల చిత్రనిర్మాణము. ద్వారములపైఁ గల లతాకల్పనము మండపముపైభాగములందుఁ గల చిత్రములు స్తంభములకు చాఱులకు నెలకొల్పిన స్త్రీవిగ్రహముల చక్కఁదనము ప్రశంస నీయముగ నున్నది. ఇచటి శిల్పము కాకతీయ గణపతిదేవుని నాఁటిది. ఈయాలయమందలి చిత్రములు రసవిదులగు పాశ్చాత్యమహమ్మదీయ శిల్పుల నాకర్షించి దర్శనీయముగఁ దనరుచున్నది. హనుమకొండలోని రుద్రదేవుని దేవాలయశిల్పములు, వరంగల్లులోని శంభుని దేవాలయములోని నందుల చక్కదనము, గణపవరములోని దేవళముల శిల్పప్రశస్తి, పిల్లలమఱ్ఱి, నాగులవరములోని కాకతీయ సేనానాయకులనాఁటి మనోహరచిత్ర విచిత్ర శిల్పదేవళములు కాకతీయ సేనానాయకులనాఁటి మనోహరచిత్ర విచిత్ర శిల్పదేవళములు కాకతీయరాజుల నాఁటి మనోజ్ఞ శిల్పములకు నగ్రస్థానము గొనియున్నవి. ఒరంగల్లు ద్వారస్తంభములపైఁ గల పనితనము కాకతీయశిల్పములకుఁ బరమావధులని ప్రశంసింపఁదగినవి.

కాకతీయ సామ్రాజ్యసమయమున నున్న దుర్గములలో రామగిరి దుర్గము మిగులఁ బ్రశస్తమైనది. ఇది మహోన్నతమగుశైలముపై దృఢతరముగ నెలకొల్పఁబడినది. ఓరుగల్లు చుట్టునున్న మట్టికోటయులోనున్న ఱాతికోటయుఁ

★ *ఈ పానగల్లు నల్లగొండకు నాలుగుమైళ్లదూరములోనున్నది. ఇది మహమ్మదీయ సామ్రాజ్యమునకు సంబంధించినదిగాదు. చూ. శారద, నవంబరు సంచిక.*

గొంచెము దూరముగనున్న పుట్టకోటయు తద్రాజ్యమహదైశ్వర్యమునకు ఆంధ్రుల నిర్మాణకౌశలమునకుఁ దార్కాణగ నున్నది. నంగునూరు, హనుమకొండ, వర్ధమానపురము, మంథెనలోనగు చోటులఁగల పూర్వతరదుర్గములు కాకతీయ సామ్రాజ్య దృఢస్థితికి సాక్ష్యములుగా నున్నవి. ఈ దుర్గముల కన్నింటికంటెఁ బ్రాచీనముగ దృఢతరముగానున్న నందగిరి-కళ్యాణపురము కోటలు చాళుక్యరాజుల శక్తిసామర్థ్యములకు సాక్ష్యమిచ్చుచు నేఁటికిఁ గమల పండువుగా నున్నవి. గణపతిదేవుని కాలములోఁ గట్టఁబడిన రామప్ప చెఱువు, గణపవరము చెఱువు, పాకాలచెఱువు, లక్నారముచెఱువు గాజులగట్టుచెఱువు, సముద్రమునుబోలి నిజాము రాష్ట్రమును నాఁటి నుండి నేఁటివఱకు సుభిక్షము గావించుచున్నవి. పాకాలచెఱువు ఒరంగల్లునకు ముప్పదిమైళ్ల దూరములో నున్నది. దీనికి ముద్గలతీర్థమని పేరుగలదు. గణపతిదేవుని మంత్రియగు బయ్యనామాత్యుని కుమారుఁడు జగదాళము ముమ్మడయ్యంగా రీతటాకమును నెలకొల్పెను. ఇది రెండుకొండలకుఁ గలిపి ౨౦౦౦ గజముల పోతట్టవేసి నిర్మింపఁబడెను. కట్టవెడలుపు ౫౦ గజములు, నీటిలోతు ౩౦ మొదలు ౫౦ అడుగులవఱకుఁ గలదు. చెఱువువైశాల్యము ౨౫ మైళ్లు చతురము. వేసవిలో నీరుఁడు ప్రదేశము ౧౩ మైళ్ల చతురము. మామూలుకంటె మూఁడడుగులయెత్తు నీరు రాగానే *చిత్తాపుఖాను గండినుండి ౨౫ అడుగుల వెడల్పుగనీరు ప్రవహించును. నిజామురాష్ట్రమున కాకతీయులు నెలకొల్పిన తటాకములు పాకాలచెఱువును మించినవి పెక్కులు గలవు. దీనిఁబట్టి వాని వైశాల్యమును గుర్తింపవచ్చును. నిజామురాష్ట్రమున కాకతీయరాజులు సేనానాయకులు నెలకొల్పిన తటాకములకు లెక్కలేదు.

ప్రాచీనచిహ్నములు

ప్రపంచఖ్యాతి వహించిన అజంతాశిల్పములు నిజాములోని బర్దాను తాలూకాలోనివి. అలెగ్జాండరు స్మిత్తు కీ.శ. ౧౮౨౪ లో చూచి ప్రపంచమునకు

* *చిత్తాపుఖానునిశాసనము ఒరంగల్లులో గలదు. ఇతఁడు తెలఁగవీరుఁడై స్వతంత్రముగరాజై పదునాల్గవ శతాబ్దమున ఓరుగల్లు ప్రాంతములను కంభముమెట్టును బాలించెను. ఇతని నిజనామము సీతాపతి. ఇతని మంత్రి నిమ్మల పెద్దిరాజు చిత్రభారతము చరిగొండ ధర్మకవివలన నంకితమునొందెను. చిత్తాపుఖాను అనునది బిరుదనామమనియు నీతనిపూర్తినామము బహమనీ రాజులయొద్ద "చిత్తాపుఖాను" అని వ్యవహరింపఁబడినటులఁ దెలియుచున్నది.*

సాటువఱ కీశిల్పముల సంగతి లోకమునకుఁ దెలియదు. ఇటులె నైజాములో పర్వతభాగములలో నెన్నిశిల్పములున్నవో నిర్ణయింపరాదు. ఇప్పటికి పదేండ్ల క్రింద రంగశాయిపేట (ఒరంగల్లువద్ద)లో నొకకొండలో నొక విశాలగుహ విశాలమగు శిలా శాసనము బహిర్గతమయ్యెను. దానిచరిత్రమింకను లోకమునకుఁ దెలియదు. నలుఁడు నైజాములోని బీదరు (విదర్భ) ప్రాంతములేలిన యాంధ్రరాజన్యుఁడు. నలుని పేరుతో నలదుర్గ మొకటి కలదు. నలుని వంశీయుండగు భావదత్తుని అయిదవ శతాబ్దము నాఁటి తెలుఁగులిపి సంస్కృతభాషాశాసనము విశాఖపట్టణముజిల్లా జయపురము ఏజెన్సిలోఁ బరిశోధింపఁబడెను. పశ్చిమ చాళుక్యుఁడగు కీర్తివర్మ నలునివంశము రూపుమాపినట లొకశాసనము గలదు. దీనిచే నలుఁడు విదర్భ ప్రాంత మేలిన చరిత్రయుగములోని రాజనియే తెలియుచున్నది. ఈ యాంధ్రరాజన్యుని శాసనములు వెదకవలసియున్నది. అశోకుని శిలాశాసనమొకటి క్రీ.పూ. ౨౫౯ లోనిది రాయచూరు జిల్లా మాస్కియనుచోట నుండి నీమధ్య నైజాము దొరతనమువారు ప్రచురించిరి. గణపతిదేవునకు రుద్రమదేవి కుమార్తెయగునని జెర్మనీ పండితుఁడగు హాల్‌టజు తెలుపుచు ప్రతాపరుద్రీయమునుండి దృష్టాంతము చూపువఱ కాంధ్రదేశమున కాసంగతి తెలియదు. హాల్‌టజునకు పిమ్మట రుద్రమదేవి గణపతిదేవుని పుత్రియని తెలుపుశాసనములు పరిశోధింప నవకాశము చిక్కినది. ఇటులె పరిశోధించిన నిజాము రాష్ట్రమునఁగల చరిత్ర చిహ్నము లెన్ని బయలుపడునో చరిత్రాంశములు శిల్పరహస్యము లెన్ని బహిర్గతము కాఁగలవో నాఁటిచరిత్రాంశము లేనాఁటికి గ్రంథస్థముగా నున్ననో నిర్ణయింపఁ గాలపురుషుఁడొక్కఁడే సమర్థుఁడని తోఁచుచున్నది!

పశ్చిమచాళుక్యులకడ దండనాయకుఁడుగా నుండి పిదప తురీయాశ్రమము స్వీకరించిన గురుమల్లికార్జున పండితారాధ్యుల వారు నిజాము రాష్ట్రములోని తెలుగుదేశవాసియే. ఈతని విపులజీవితము గ్రహింతుమేనిపండ్రెండవ శతాబ్దములోని శైవుల విజృంభణము, జైనమతవినాశనము, చాళుక్యరాజపతనము బోధకాఁగలదు. జైనమతసంరక్షణార్థమై బలియైన బిజ్జలుఁడు, శిలాహర రాజగు రెండవభోజుఁడు, కల్యాణనగర రాజ్యమేలిన సోమేశ్వరుఁడు, సంకారాముఁడు, ఆహవమల్లుఁడులోనగు చాళుక్యరాజన్యుల రాజ్య విస్తృతి గ్రహించినగాని కాకతీయ సామ్రాజ్యవిస్తృతి, ఐశ్వర్యము విస్పష్టముగాదు. వర్ధమానపుర రాజ్యమును జిరకాలము పాలించి రుద్రదేవుని పరాక్రమమువలన నశించిన కరికాల చోడాన్వయులగు భీమరాజు, గోకర్ణుఁడు,

ఉదయాదిత్యుడు లోనగు రాజన్యులు భాషకు మిగుల నుపకారముచేసిరి. భీమరాజు మిగుల దుష్టుఁడని రుద్రదేవుడు పేర్కొనినను పానుగల్లువర్ధపురాది శాసనముల వలన నాతఁడు పరాక్రమశాలియనుట కెంతమాత్రము సంశయములేదు. గోకర్ణుఁడుకవియనియు ఛందోశాస్త్రమును రచించెననియు నొక ప్రవాదముకలదు. అదియింకను ఇదమిత్థమని నిరూపింపరాని స్థితిలోనున్నది. ఎటులఁజూచినను పశ్చిమచాళుక్యులు భాషావిషయమున, బరాక్రమమున ఆంధ్రకాకతీయవంశమున కమృతదానము గావించి సార్థకులైరనుటకు సంశయములేదు. ఇట్టి చరిత్రాంశము లింకను గ్రంథములు కాకుంట సంతాపకరము.

తెలంగానా

నిజాము రాష్ట్రములోని యాంధ్రదేశమును తెలంగానాయని మహమ్మదీయులు వ్యవహరింతురు. ఈ తెలుఁగు భాగములలోనివారు చాళుక్యరాజులకాలమున కాకతీయరాజుల కాలమున సేనాపతులై రాజప్రతినిధులై సైనికులై కన్నడదేశములకు మహారాష్ట్ర దేశమునకుఁబోయి యటనే స్థిరవసతు లేర్పఱచుకొని నిలిచిపోయిరి. అట్టివారు నేఁటికి గృహభాషగా నాయాభాగములందుండియుఁ దెలుఁగునే వ్యవహరించుచు నాంధ్రకావ్యపఠన మొనరించుచుఁ గాలముగడుపుచున్నారు. ఈ తెలుగు దేశము పదునాలగవ శతాబ్దమధ్యకాలమునుండి మహమ్మదీయరాజన్యుల హస్తగతమయ్యెను. నాఁడు మొదలు ఆంధ్రుల చిరకాల నివాసములగు పూర్వపట్టణములకు మహమ్మదీయులు తమ పేరులుపెట్టి పూర్వనామములు మార్చిరి. కరీంనగర్, అత్రాపుబల్దా, నవాబుపేట, షెంషెర్‌బాద్, అమీనాబాద్, హస్నాబాద్, మహబూబునగర్, హుజూర్‌నగర్ అని యిటులు వ్యవహరింపఁబడు ఆంధ్రనగరములన్నింటికిఁ జరిత్ర ప్రసిద్ధమగు నాంధ్రనామములు గలవు. ప్రభుత్వ బలాతిశయముచేఁ బూర్వనామములు మాఱుపడియున్నవి. ఇపుడాధునిక శోధకులాగ్రామముల పూర్వనామములు గురుతించినఁగాని చరిత్ర సంశయగ్రంధులు విడఁజాలవు. ఇందులకుఁ బరిశోధకులు శ్రద్ధఁజేసినగాని ఫలము కనఁబడదు. ఇందువలననే పూర్వచరిత్రములకు సంబంధించిన పెక్కు గ్రామములు శాసనములలోఁ జదువుచుండియు స్థలనిరూపణమున కెంతయో శ్రమయగు చున్నది.

నిజామురాష్ట్రము కేవలము మహమ్మదీయరాజ్యమనియు నచట నాంధ్రుల యాచారవ్యవహారాదులు వేషభాషలు మనకెంతయో వ్యతిరేకముగ నుండునను వారిని బలువురను మేమెఱుంగుదుము. నిజాము రాష్ట్రమనుపేరే నాలుగువందల

సంవత్సరముల క్రింది నుండి వచ్చినదనియు, నైజాములోని తెలుంగానా యంతయు నాంధ్రదేశమునకు నాయక రత్నమనియు, నాగరిక వాసనలఁ దనివార ననుభవించు క్షోభ సోదరు లెఱుంగకుంట పరితాపకరము. పరిశోధకులు విడదీయరాని చరిత్రగ్రంథులు నిజాము రాష్ట్రములోని శాసనములవలననే యేనాఁటికైన విడిపోవఁగలవు. కాకతీయ సామ్రాజ్య మభ్యున్నతదశలో నున్నతటి నాంధ్రతత్త్వము సర్వతోముఖముగ వెలుఁగొందెను. పూర్వచరిత్రచిహ్నాము లన్నియు సురక్షితములయ్యెను. కాకతీయులకు దేశీయకళలయందు నిరుపమానమగు నభిమానముగలదు. వారు నాట్యము, భరతము, శిల్పము, కవిత, ఆయుర్వేదము, సంగ్రామము, మల్లవిద్య, ధర్మశాస్త్రము, అలంకారము, రాజనీతి, వేదాంతము, మతములోనగు విషయములలో నాటితేటిన మహనీయులఁ జేరఁదీసి యుత్తమ గ్రంథములు రచింపఁ జేసిరి. తెలంగానాలో శాసనములవలనఁ బెక్కంద్రు మనమింతదనుక నెఱుంగని కవులపేరులు దెలియుచున్నది. పరిశోధించినకొలఁది యాకవిరాజులందఱు గ్రంథకర్తలని తెలియుచున్నది. కాకతీయ సామ్రాజ్యకాలములో సంస్కృతాంధ్రములలో నుత్పన్నములైన మహా గ్రంధములనేకములు గలవు. సమస్త కళలకు సంబంధించిన పుస్తకము లపుడు వెలసెను. జైనగ్రంధములుగూడ నాప్రాంతములలోఁ బెక్కులు సంస్కృతాంధ్రములలో రచింపఁబడెను. రాజవిప్లవములవలన గ్రంధ భాండాగారములు కాల్పఁబడినను తెలంగానాలోనున్న యాంధ్రుల గృహములలో నింకను పరజనాలభ్యములైన యుత్తమగ్రంధములు వేలకొలఁది గలవని మాయనుభవముచే గ్రహించి చెప్పుచున్నారము. ఆంధ్ర సామ్రాజ్యరంగస్థలములై మూఁడువందల సంవత్సరములు లక్ష్మీసరస్వతీ క్రీడారంగస్థలములైయున్న అనుమకొండ ఒరంగల్లు నగరముల నాశ్రయించిన పండితప్రకాండుల కావ్యరత్నము లెన్నఁటికైన పరిశోధకా గమ్యముగనున్న తెలంగానాలో లభింపవలసినదే.

నిజామురాష్ట్రములో లభించిన మహాభాష్యప్రదీపోద్యానమను సంస్కృతగ్రంథ మిపుడు కాశ్మీరసంస్థానమునఁ బరిశోధింపఁ బడుచున్నది. ఆదిలాబాదులో లభించిన గర్గసంహిత లండనులో ఇండియా ఆఫీసు వారు భద్రపఱిచిరి. పాలకుఱికి సోమనాథుని సంస్కృతాంధ్ర కర్ణాటగ్రంధములు శైవులగృహములలో జీర్ణించుచున్నవి. పూర్వోక్తులగు కాకతీయ సామ్రాజ్యకవుల గ్రంథములింక ననేకము లనుపలభ్యములై నశించుచున్నవి. రుద్రదేవునిచే నిర్జితుఁడైన మేడరాజు (నైజాము) పాకాలతాలూకాలోని

కురువపట్టమొదలు గోదావరీతీరమునంతయుఁ బాలించిన రాజన్యుఁడనియు, నితనిమంత్రియగు నాగరాజు నీతఁడు జైనులనియు చరిత్రకారు లెఱుంగరు. రుద్రదేవు నెదిరించిన పొలవాసరాజగు మైళగిదేవుఁడు ధర్మపురి చెంతగల పొలాస పాలించువాఁ డనియు నిజామురాష్ట్రములోనివాఁడనియు చరిత్రవిదు లెఱుంగరు.

ఇంతయేల, కాకతీయసామ్రాజ్యములోఁజేరిన నిజామురాష్ట్రములోని దేశీయచరిత్ర చిహ్నములు సమగ్రముగఁ బరిశోధింపఁబడువఱకు దేశచరిత్ర మసమగ్రమనియే భావింపవలయును. చరిత్రమునకు భాషకు, శిల్పములకు, రాజనీతికి, ప్రాచీననాగరకతకు సంబంధించిన పవిత్రచిహ్నసముదాయము కాలవాహినిలోఁ గలసిపోకమున్నె నిజామురాష్ట్రములోని, ౪౧,౩౪౧ చదరపుమైళ్లు వైశాల్యము గల యాంధ్రదేశములో అడుగడుగునకొక పరిశోధకుఁడు తిరిగినగాని యాంధ్రదేశామూల్య చరిత్రము గోచరింపదు. అపుడుగాని కాకతీయ సామ్రాజ్యసంపూర్ణచరిత్రము గోచరింపదు. ఇప్పటికె చరిత్రచిహ్నములు చాలవఱకు రూపుమాసినవి. ఆంధ్రశిల్పము నుద్ఘోషించు దేవాలయములు పాడుపడి తుంటరిబాలుర శిలాఘాతములచే దినమునకొక చాయగా రూపుమాసిపోవుచున్నవి. శాసనశిల లనేకము లుపయోగము తెలియని భూస్వాములచేఁ దటాకగర్భములందు గోడలందు శకలములుగాఁ జేయఁబడి మరుగుపఱుపఁబడుచున్నవి. ప్రాచీనగ్రంథములు దీపావళి పండుగలో వినోదసాధనములుగా దహింపఁబడుచున్నవి. కాకతీయ మహాయుగమునకు సంబంధించిన యుత్తమగ్రంథము రచించుటకుఁ దగిన సామగ్రి యిప్పటికే చాలవఱకు రూపుమాసినది. వీనినుద్ధరించుట నిజాము రాష్ట్రవాసుల ప్రథమవిధి. వానివాని సంపూర్ణ చరిత్రములు భాషా ప్రపంచమున శాశ్వత మొనరించుట ఆంధ్రము మాతృభాషగాఁ గల ప్రత్యాంధ్రునివిధి. ఆంధ్రప్రపంచమునకు సర్వస్వము ధారవోసిన కాకతీయులయెడ మనము ప్రాలుమాలిక పశ్చాత్తాప తప్తమై భవిష్యదాంధ్రసోదరలోకమేని తేఱిచూడకపోదు. అప్పటి కీస్వల్పచిహ్నము లేని దక్కునో దక్కవో!

శా. తల్లీ! కాకతిరాజ్యలక్ష్మి! భవదుద్యత్కీర్తిసంతానముల్
పల్లీపట్టనభాసమానములు నీప్రఖ్యాతు లాంధ్రావనీ
హృల్లీలామహిమాభిరామములుకావే? తావకోత్సాహపుఁ
వెల్లిఁగైకొని కాలవాహినిని గల్పెఁ; దుష్ట దైవంబహో!

– ఆంధ్రపత్రిక క్రోధన సంవత్సరాది సంచిక (1925)

21. నిజామురాష్ట్రము - వాఙ్మయచరిత్రము- II

పద్మనాయక మహాయుగము

గత సంవత్సరపు సంచికలోఁ గాకతీయులకాలమున జరిగిన ఆంధ్రసేవను గూర్చి కొంతవరకుఁ జర్చించి నిజాము రాష్ట్రాంధ్ర వాఙ్మయ చరిత్రమునఁ గాకతీయరాజన్యులకుఁ గల యుత్తమస్థానమును సూచించయుంటిమి. ఇపుడు దానికావలియుగ మగు పద్మనాయక మహాయుగమునాఁటి ఆంధ్రవాఙ్మయ పరిస్థితులఁ దెలిసికొందము.

ప్రతాపరుద్ర దేవుఁడు ఢిల్లీనగరమునకుఁ గ్రీస్తుశకము ౧౩౨౩ ప్రాంతమునఁ గొనిపోఁబడినదిమొదలు ఆంధ్రరాజ్యము విచ్ఛిన్నమయ్యెను. రాజసోదరుఁడగు అననమదేవుఁడు పరసీమలకుఁ దల దాచుకొన నెలవులేక వలసపోయెను. చిరకాల భోగ్యమగు ప్రదేశములను వదలి సామ్రాజ్యోద్యోగులు నూతన రాజ్యస్థాపన వాంఛతో దూరదేశముల కేగిరి. అటులేగి ఆంధ్రసామ్రాజ్యపునర్నిర్మాణమునకు దారితీసినవారిలో కాకతీయ సామ్రాజ్యసుగంధ భాండాగారాధ్యక్షులగు హరిహరరాయలు బుక్కరాయలు ప్రథమగణ్యులు. కాకతీయ సామ్రాజ్యమున నిజమగు సేనానాయకులు రేచెర్ల గోత్రీయులగు వెలమవీరులు. అవిచ్ఛిన్నముగాఁ గాకతీయ సామ్రాజ్యము రెండువందల సంవత్సరములు నిలుచుటకుఁ బద్మనాయకుల విక్రమవిహారము, స్వామిభక్తి, తత్పరతకారణములని చెప్పవచ్చును. కాకతీయ సామ్రాజ్యము విచ్ఛిన్నమైనంతన అంతకుమున్న సేనానాయకులు, రాజప్రతినిధులుగా నున్న వీరాధివీరులందరు, తమ తమతావులలోఁ నున్న బలము లుపయోగించి నూతన రాజ్యములు స్థాపించిరి. అట్టివానిలోఁ గొండవీడు ప్రాంతములను బరిపాలించిన రెడ్డిరాజ్యమొక్కటి.

ఓరుగల్లురాజ్యము శత్రు హస్తగతమై ప్రతాపరుద్రదేవుడు ఢిల్లీ నగరమునకుఁ గొనిపోవఁబడినప్పుడు రణరంగమున నిలిపి పడిపోవనున్న ఆంధ్రపతాకమును నిలువఁబెట్టి, మాసిపోవనున్న ఆంధ్ర తేజమునకు మెఱుగుపెట్టి ఆంధ్రజాతీయత, ఆంధ్రవికాసము, ఆంధ్రవ్యక్తిత్వము సుప్రతిష్ఠితము గావించిన వెలుమవీరుల నామకర్తీనము ప్రత్యాంధ్రసోదరుని విధి.

ప్రతాపరుద్రదేవచక్రవర్తి బందీకృతుఁడైనంతన మహమ్మదీయ రాజ్యమున నిలువ నీడ చిక్కెను. ఆంధ్రుల యాలయములు కొలఁదిగ రూపుమాపఁబడెను.

ఆంధ్రులు దిక్కులేనివారై దాస్యశృంఖలము దాల్చుచున్న సమయమున నిలువఁబడిన
వీరుఁడు రేచర్లసింగమ నాయఁడు. ఇతఁడు ధరించిన రాయబంధిమోదక బిరుదమువలనఁ బ్రతాపరుద్రుఁడీయనచేఁ చెఱనుండి విడిపింపఁబడెనని యూహింపనగునుగాని తరువాత నాతఁడు పాలించినట్లు తెలియమిచే రాయబంధివిమోచక బిరుదమును గూర్చి మనము దూరము చర్చింప వీలులేదు.

రేచర్ల సింగమనాయఁడు

ప్రతాపరుద్రచక్రవర్తి సేనానాయకులలో నొకఁడగు ఎఱ్ఱదాచానాయకుని కుమారుఁడే ప్రకృతసింగమనాయఁడు. సింగమ నాయఁడు జనకుని యంత్యకాలమునఁ గాకతీయ సామ్రాజ్యమున సేనానిగానుండి తద్రాజ్యపతనానంతరము రాచకొండ, దేవరకొండ, ఓరుగల్లు, భువనగిరి లోనగు దుర్గములను సాధించి శ్రీశైలము ఓరుగల్లునకు మధ్య గల దేశమునంతయుఁ గృష్ణయె సరిహద్దుఁ జేసికొని పాలించుచుండెను. ఈ సింగమ నాయని పరాక్రమమునకు వెఱచి రాజు లందఱు వంశితులైరి. సింగమనాయకుఁడు జల్లిపల్లికోట ముట్టడించుట కేగఁగా సంధిగోరువానివలె నటించి దమ్మళ బ్రహ్మాజియను వంచకుఁడు సింగమనాయనిఁ గత్తితోఁబొడిచి పాఱిపోయెను. సింగమనాయఁడు తన కుమారులగు అనపోతనాయకులనకు, మాదానాయకునకు ఈ సంగతి నివేదించి తన్నుఁగపటోపాయముచేఁ జంపించిన ఇనుపర్తిరాజుల నెత్తురుతోఁ దర్పణాదుల నొసంగిన గాని యాత్మ శాంతి కలుగదని తెలిపి మరణించెను. కుమారులు పితృమరణానంతరము వీరవ్రతదీక్షాధురంధరులైరి. రేచెర్ల సింగమనాయఁడు ఏలేశ్వరమునఁ బెక్కు బ్రహ్మ ప్రతిష్టాపనములు, ధర్మములు, గావించెను. ఈవీరాధివీరుని గూర్చి యాంధ్రకవులిట్లు కీర్తించిరి.

"ఉ.లాలితశౌర్యశక్తి నవలక్ష తెలుంగు దళంబు నాజిలోఁ
దోలినపాండ్య భూవిభునితోడి పెనంకువ కోర్చి సన్నుతిఀ
వ్రాలి ప్రతాపరుద్రసభ నెన్నికకెక్కిన యెఱ్ఱదాచభూ
పాలసుతుండు సింగని కళంగుని కేబిరుదైనఁ జెల్లదే."

ప్రతిభ సామాన్యమైనదికాదు. ఇతఁడు పసివాఁడగు మాదానాయకుఁడను సోదరునితోడ్పాటుతో జల్లిపల్లి, ఇనుగుర్తికోటలు ముట్టడించి రాచవారినందఱను వధించి వారిరక్తముతోఁ దంట్రికి దర్పణాదులొసంగినట్లు వినవచ్చుకథ చాల బీభత్సమైనది. ఈ విషయమును దెలుపు బిరుదగద్యము సురభివారి వంశచరిత్రమునఁ గలదు. ఆనపోతనాయకుఁడొందిన యీవిజయము సూచించు నాధారములుగూడఁ గొన్ని కలవు. అయ్యనవోలుశాసనములోని ఇనుగుర్తి గండగోవాళ సోమకుల పరశు రామాది బిరుదములును, ఈ క్రింది శ్లోకములు గూడ అనపోతనాయని విజయమును సాటుచున్నవి.

శ్లో. సోమకులపరశురామే భుజబలభీమేఒధిభూమిగోపాలే,
యత్రచజాగ్రతి శాసతి జగతాం జాగ్రత్తి నిత్యకళ్యాణమ్."

– రసార్ణవసుధాకరము.

శ్లో. ముని రజని పశురామః స్థానే వినియుజ్య వైష్ణవం తేజః,
సోమకులపరశురామే ధరా మవ త్యన్న పోతభూపాలే"

– అయ్యనవోలు శాసనము.

ఆనపోతనాయకునితో సంగ్రామరంగములందు సోదరుడగు మాధవరాయఁడు సంచరించి విజయములలోఁ దోడ్పాటుగావించినట్లు అయ్యనవోలు శాసనమునందలి "యోమాధవేనగుణినా సహదేవ సార్థం జిష్ణుః ప్రశాస్తి వసుధాం సురరాడివ ద్యాం" అను శ్లోకమువలన దెలిసికొనవచ్చును. ఆంధ్రదేశమునఁ దిరిగి రాజ్యము నెలకొల్పి ఆంధ్ర దేశాధీశ్వరబిరుదమును శాసనములలో వ్రాయించికొని కాకతీయరాజ్యానంతరము ఆంధ్రప్రత్యేక వ్యక్తిత్వమును మఱలనిలువఁబెట్టిన అనపోతనాయకుని జీవితము స్మరణీయము. అనపోతనాయకుఁడు రాచకొండలో రాజ్యముఁ జేసెను. ఈతనిరాజధానియగు రాచకొండ చూడదగిన దుర్గము. ఇయ్యది హైదరాబాదునకుఁ దూర్పుగా 34 మైళ్లదూరమున నున్నది. రాచకొండదుర్గము నాగానాయకునికొండ, రాచకొండయను రెండుశైలములకుఁ జుట్టివచ్చిన గొప్పప్రాకారములో నున్నది. ప్రత్యేకించి రాచకొండపైఁ గట్టఁబడిన నాలుగుకోటలు, నాగానాయని కొండపైఁ గల రాతికోట తిలకింతుమేవి అనపోతానాయకుని దుర్గమెంత శత్రుజనదుర్గమమో తెలిసికొనవచ్చును. మాధవనాయకుఁడు దేవరకొండకు గొప్పదుర్గమును గట్టించి దానికి 860 బురుజులు, 9 ద్వారములు, 32 దొడ్డిద్వారముల

నేర్పఱచి మహోన్నతమగు రాజ్యమును బరిపాలించెను. ఈ సోదరుబిరువురు ధర్మమూర్తులై ప్రత్యర్థులను ముందున కదుగుపెట్టనీక పశ్చిమాంధ్రదేశము నేకధాటిగఁ బాలించిరి. కాని పలుమాఱు కొండవీటి రెడ్లకు నీ వీరసోదరులకు సంగరములు కృష్ణాతీరమున జరిగినట్లును, ఉభయులు నష్టపడినట్లును జరిత్రగ్రంథములవలనఁ దెలియుచున్నది. అనపోతనాయకున కవసానకాలమున నించుక పలుకుబడి తగ్గుటయు, మహమ్మదీయులు విజృంభించి గోలకొండలోనగు దుర్గములు గైకొనుటయు, అనపోతనాయకుఁడు తిరుగలాగుకొన యత్నించుటయు జరిగినది. కాని మొక్కవోని పరాక్రమముతో అనపోతనాయకుఁడు విజయముల నందుచువచ్చెను. క్రీ.శ 1344-1380 అనపోతనాయకుని రాజ్యకాలమని యాతని శాసనములవలనఁ దెలియుచున్నది.

అనపోతనాయకుఁడు, మాదానాయకుఁడు వీరవిహారములు, సంగ్రామములు, నూతనరాజ్యస్థాపనము, విరోధిసంహారము లోనగు దుర్భరభారములతో నవస్థపడుచుంటచేఁ బ్రతాపరుద్రునియంత్యము మొదలు అనపోతభూపతి రాజ్యాంతమువఱకుఁ బద్మనాయక మహాయుగమున నొక ప్రకరణమున సారస్వతకృషి జరుగలేదని తోఁచుచున్నది. పరరాజులదాడులు, అంతఃకలహములు, సామంతుల తిరుగబాటులతోఁ దన్మయులగుటచే నీరాజసోదరులు సారస్వత విషయమున శ్రద్ధఁ దీసికొనకున్నను వారి భవిష్యత్సంతానము భాషాసేవ సహస్రభంగులఁ గావించుటకుఁదగిన స్థిరవసతులు గూర్చుటలో మిగులఁ గృషి చేసిరిగాన మన మీరాజసోదరులఁ బ్రశంసించుట ధర్మముకాకపోదు. అనపోతానాయని సంపూర్ణశాసన మొకటి అయ్యనవోలు మైలారుగుడిలోఁ గలదుగాని యాశిల ఛిన్నభిన్నముగఁ బగిలిపోవుటచే నందలియంశములు పెక్కులు తెలియరాకున్నవి. మేము స్వయముగాఁ దీసినప్రతియు జటప్రోలుసంస్థానమువారు దీయించిన ఛాయాపటము సహాయముతో నీశాసనమునందలి చరిత్రాధారములఁ బరిశోధింపఁగలిగితిమి. అనపోతనాయకుఁడు, మాదానాయఁడు గొప్ప దాతలు. పెక్కులాలయములు గట్టించి తటాకములు ప్రతిష్టించి కీర్తిగాంచిరి. మేము వెలమవీరుల సారస్వత జీవితమును వ్రాయ సమకట్టుటచే, వీరజీవిత మంతగాఁ బ్రశంసింపమైతిమి.

ప్రకృతము వ్రాయఁబోవునది సింగమనాయకునిగూర్చి. ఈ మహనీయుని చరిత్రముపట్ల చరిత్రకారులు భిన్నాభిప్రాయులైయున్నారు. ఈ సింగమనాయని

వెలుగోటివారివంశచరిత్రము ఏడవ తరమువారని చెప్పుచున్నది. శృంగార శ్రీనాథమునఁ బ్రభాకరశాస్త్రి గారు ఇచ్చిన వంశవృక్షము ప్రకారము దాచానాయకునకు నాలుగవ తరమువాఁడు. ఇతఁడే సర్వజ్ఞబిరుదశోభితుఁడు. సంస్కృతమునంద సాధారణ పండితుఁడని పేరొంది శ్రీనాథునకుఁ బోతరాజునకు సమకాలికుఁడై సారస్వతసేవ గావించిన ధన్యుఁడు. రసార్ణవ సుధాకరమను నుత్తమాలంకార గ్రంథమును రచించిన యాతనికే సర్వజ్ఞ బిరుదము గలదు. సర్వజ్ఞ సింగభూపతి యాస్థానమునందున్న బొమ్మకంటి యప్పలాచార్యుఁడను పండితుఁడు అమరకోశమునకు వ్యాఖ్యానము వ్రాయుచు

శ్లో. కుమారసింగభూపేన లక్ష్యలక్షణ వేదినా,
శోధితశ్చే దయం గ్రంథః కింశోధ్య శ్శోధనాంతరైః
శ్లో. కుమారసింగభూపేన యఃకదాపి నశోధితః,
సగ్రంథః శోధితో స్యస్యైః కిం బుధై ర్వ్యవహీయతే॥

అని చెప్పియున్నాఁడు. దీనిచే సింగభూపాలుఁడు లక్ష్యలక్షణవేది యనియు, నతఁడు శోధించిన గ్రంధము నితరులు శోధింపఁబనిలేదనియు, సింగభూపతిచేఁ బరిశోధితముగాని గ్రంధము విమర్శనీయమనియు నిందుఁగల భావములవలన ఏడవతరము సింగభూపాలుఁడు సమస్తకలాపారంగతుఁడు, విద్వన్మౌళి, సర్వజ్ఞ బిరుదశోభితుఁడనుట కెట్టిసంశయ ముండఁజాలదు. ఈసర్వజ్ఞ సింగభూపతి విద్యావినోదములతోఁ గాలయాపనము గావించుచు రాచకొండ దుర్గమున మిగుల సౌఖ్యముగాఁ గాలముగడిపెను. ఈతనితండ్రి అనపోతానాయకుఁడు రాజ్యము నిష్కంటకము గావించి చనుటచే సారస్వతజీవనమును జేయుటకు సింగభూపాలునకు మంచియవకాశము చిక్కినదిగాని యీయవకాశమును జూచుకొని మహమ్మదీయులు రాజ్యములోని ముఖ్యభాగములు – గోలకొండదుర్గము, ఓరుగల్లు ప్రాంతములు – తిరిగి వశముజేసికొనినట్లును, అనపోతనాయకునికాలమున భిన్నమైన మహమ్మదీయరాజ్యము సింగభూపతి కాలమునఁ బునః ప్రతిష్ఠిత మెనటును దెలిసికొనవచ్చును. ఈకాలముననే మెదకుదుర్గము మహమ్మదీయ హస్తగతమగుటయు, వెలమవీరులకు శత్రువగు రెడ్డివీరుఁడైన కాచారెడ్డి కర్ణాటదేశమునుండి మెదకుదుర్గమును బాలించుటకు వచ్చినట్లు తెలియుచున్నది.

సర్వజ్ఞ సింగభూపతికాలమున మెదకుమండలమునందలి కొలిచలమ

వాస్తవ్యులు, దేవ్యుపాసనాపరులు, విద్వత్సోదరులును కామకాయన గోత్రులు నగు పెద్దిభట్టు, మల్లినాథసూరి గౌరవములఁబడసి రాచకొండకు వచ్చుచుఁ బోవుచున్నట్లు నారాయణపండితుని చంపూరామాయణ వ్యాఖ్యలోని "సర్వజ్ఞే నాభివర్ణితః" అను శ్లోకభాగము తార్కాణయగుచున్నది. మల్లినాథుఁడు, శ్రీనాథకవి, బమ్మెరపోతరాజు, మదనవిలాసాది భాణములు, విష్ణుపురాణమునువ్రాసిన నాగనాథుఁడు, చమత్కారచంద్రిక వ్రాసిన విశ్వేశ్వరకవి, నవనాథచరిత్రము హరిశ్చంద్ర ద్విపద వ్రాసిన గౌరనమహాకవి, వినుకొండ వల్లభరాయఁడు, మనకుఁ దెలిసినంతలో సర్వజ్ఞ సింగభూపాలుని సమకాలపండితకవులు. గౌరవ సర్వజ్ఞ సింగభూపాలుని కాలమువాఁడనుటకుఁ గావలసినంత చరిత్రాధారము గలదు. సింగభూపతి పినతండ్రియగు అఱవతరపు మాదానాయఁడు ఉమామహేశ్వరశాసనములోని

శ్లో. శ్రీమతో మాధవేంద్రస్య రాజ్యాంగైకధురంధరః,
మంత్రీ పోతననామాసీ త్సర్వశాస్త్రవిశారదః.

శ్లో. యస్యామాత్యశిఖామణేః కవి వరస్తోత్రైక పాత్రీకృతాం
మత్వా వాక్పతి రిద్ధనీతిసుభగాం నాగ్వైఖరీం లజ్జితే;
సోఽయం పెద్దనమంత్రివర్యతనయః శ్రీపోతరాజః.

అను శ్లోకములవలన సింగభూపతి పినతండ్రియుఁ దేవరకొండ పాలకుఁడనునగు ఆఱవతరము మాదానాయకుని చెంత పోతరాజనుమంత్రి యున్నట్లు తెలియును. ఈపోతరాజునకుఁ దమ్మునికుమారుఁడె గౌరనమహాకవి. ఇటు లనుటకు గౌరవకవి గ్రంథములు సాక్ష్యము కాఁగలవు.

శ్లో. అస్తి ప్రశస్తావనిపాలమౌళిరత్నావళీరంజితపాదపీఠః,
రేచర్లవంశార్ణవ పూర్ణచంద్రో మహాబల స్సింగయమాధవేంద్రః.

– లక్షణదీపిక.

ద్విపద. సింగనమాధవ క్షితిపాలమణికి
మంగళమూర్తికి మంత్రియై జగతిఁ
బొగడొందు పెద్దన పోతరాజునకు
తగిన తమ్ముఁడు యశోధనుఁ డెల్లమంత్రి
చెట్టవట్టంగ నోఁచినభాగ్యవతికి
చుట్టాలసురభికి సుందరీమణికి

......పోచాంబకు గారాబు సుతుండ

గౌతమగోత్రుండ గౌరనాహ్వయుండ.

– హరిశ్చంద్ర ద్విపద.

పై గ్రంథభాగముల వలన సర్వజ్ఞ సింగభూపతియు గౌరవ మంత్రియు సమకాలికులనియుఁ గవి పెద్దతండ్రి పోతరాజు, సింగభూపాలుని పినతండ్రి మాదానాయకుఁడు సమకాలికులని తెలియుచున్నది. వీరేశలింగము పంతులవారీ చరిత్రమునంతయు గ్రహించి కాలనిరూపణము చేయుతటి నింక రెండుతరముల కావలనున్న యెనిమిదవతరము మాధవరావుశాసనమును దృష్టాంతముదీసికొని కాలనిరూపణమునఁ బ్రమాదమునకు లోనైరి. ఆఱవతరము మాధవనాయకుని శాసనము వెలుగోటివారి వంశచరిత్రమున అనుబంధము 30 యవపుటలోఁ గలదు. అందు శాసనకాలము 'దంత్యంకార్కశకాబ్దశాలిని' యనుటచే శా.శ.1218-వ మాధవభూపతియుండెనుగాన ఆవల గౌరన ముప్పదియేండ్లకు, అనఁగా - క్రీ.శ.1410 ప్రాంతమున సర్వజ్ఞ సింగభూపతి కాలము నందుండెననుట పొసఁగియున్నది. ఈ సింగభూపతియే రసార్ణవసుధాకరకర్తయని చెప్పుటకు నందలి వంశక్రమముగూడ సరిపోవుచుండఁ బ్రభాకరశాస్త్రిగారీసింగభూపతిపితామహుఁడు రసార్ణవసుధాకర కర్తయని సర్వజ్ఞ బిరుద మీతనికి లేదని వ్రాయుటలో సందర్భము గోచరింపకున్నది. ఏడవతరము సింగభూపాలుని కాలము ప్రత్యేకించి తెలుపుశాసనములు లేకున్న అతనితండ్రి అనపోతనాయకుని శాసనములు క్రీ.శ.1380 వఱకును అతని మనుమఁడు ఎనిమిదవతరము మాధవరావు క్రీ.శ.1427లో శాసనము నెలకొల్పుటవలనను, సర్వజ్ఞ సింగభూపతి ఏడవతరమువాఁడై క్రీ.శ.1400 ప్రాంతమున నుండెననియు అందుచేఁ బూర్వోక్తకవులకు సమకాలికుఁడై యుండెనని మావిశ్వాసము. ఇప్పటికి సర్వజ్ఞ సింగభూపతికాలము; సమకాలిక గ్రంథకర్తలు దెలిసికొంటిమి. సర్వజ్ఞ సింగభూపతి రసార్ణవసుధాకరములో నుదాహరింపఁ బడిన కందర్పసంభవము, అభిరామరాఘవము, అనపోతనాయకీయము, పద్మావతీకామదత్తము, శృంగారమంజరి, పయోధిమథనము, వీరానందములోనగు గ్రంథములు, మల్లినాథుఁడు వ్యాఖ్యానములలో నుదాహరించిన రాజపుత్రీయము, మతంగము, చాక్షుషము, మృగచర్మీయము, లోనగు గ్రంథములు నిపుడు లభించుటలేదు.

ఇదియంతయు సమన్వయించితిమేని సింగభూపతికాలమున వాఙ్మయసేవ యెంతజరిగినది; యెన్ని యుత్తమగ్రంథములు రచింపఁబడినది తెలిసికొనవచ్చును. ఈ సింగభూపతికిఁ బలువురుతనయు లుండుటచే నేకీబావముగనున్న సంస్థానము చీలిక లగుటయు, ఒక్కొకని జయించి మహమ్మదీయులు బలవంతులగుటయుఁ దటస్థించినది.

సింగభూపతి కావలఁ గొలఁది కాలమువఱకు వెలమవీరులు మఱల స్వతంత్ర సమరములలోఁ బాలుగొనుచు నొకప్రక్క మహమ్మదీయుల ధాటికి, కృష్ణాతీరముననుండి వచ్చు కొండవీటిరెడ్ల ధాటికి, మఱికొంత కాలమునకు రాజమహేంద్రవరపు రెడ్లధాటికి నేక ముఖముగ నెదుర్కొనవలసి వచ్చుటచ ఒక శతాబ్దమువఱకు సింగమనాయని కావలగావించిన సారస్వతసేవ గానరాదు. క్రమక్రమముగ బలవంతములైన మెదకు, గోలకొండ, భువనగిరి, ఓరుగల్లు, సింగవరము, రాచకొండ, దేవరకొండ,క్రొత్తగట్టు, చంద్రగిరి, జల్లేపల్లిలో నగు దుర్గములు శత్రుహస్తగతము లగుటచే నీ రెచేర్ల గోత్రీయులెల్లరు చెల్లాచెదరై కొందరు విజయనగరరాజులకు సామంతులుగ మఱికొందఱు యనమలకు సామంతులుగా మాఱిపోయిరి. కొన్ని కుటుంబములు వలస పోవలసివచ్చెను. అటు లేగిన సంస్థానములే వెంకటగిరి, పిఠాపురము, బొబ్బిలి, మైలవరము లోనగు సంస్థానములైయున్నవి. నిజాము రాష్ట్రమునఁ జరిత్రపరిశోధనము సమగ్రముగా జరుగకపోవుటచే వీరావతంసులగు లింగమనాయఁడు, యాచమనాయఁడు లోనగువారల సమగ్ర జీవితములు తెలియుట లేదు. కృష్ణ దేవరాయల రాజ్యకాలము నాఁటికీ వెలమరాజ్యము భిన్నమయ్యెను. రేచర్ల గోత్రీయులలో నొక శాఖవారు వెలుగోటిలో, మఱియొక శాఖవారు జటప్రోలులోఁ జేరిరి. కృష్ణదేవరాయల పట్టాభిషేకమహోత్సవమునకు సామంతులతోపాటు వెలుగోటి వారును వచ్చిరనుట శ్రీకృష్ణరాయవిజయములోని పద్యభాగము తోడ్పడఁగలదు.

సీ.ధాటీ నిరాఘాటకోటీహతవిరోధి

కోటులై వెలుగు వెల్గోటివారు.

వెలుగోడులో రాజ్యము నెలకొల్పిన రాయప్పయను నిర్వాణరాయఁడుత్తమ వర్తనుఁడు. ఈయన మరణమునుగూర్చి కవిమల్లనయను నతఁడు వైకుంఠారోహణమను ప్రబంధము వ్రాసినట్లు వినుచున్నాము; ఈరాజు

ధర్మాత్ముఁడనుట కీక్రిందిపద్యము సాక్షి కాఁగలదు.

మ. తలపెల్లన్ హరిభక్తియుక్తి దినకర్తవ్యంబులున్ ధర్మముల్
నిలువెల్లం దయ రూప మెల్లయెడలన్ నిర్గర్వ మశ్రాంతమున్
గొలువెల్లం గనిగాయకాళి యితరుల్ క్షోణీశ్వరుల్ సాటియే
వెలుగోటేచయశౌరిసింగ సకలోర్వీనాథు రాయన్నకున్.

రేచెర్ల గోత్రీయులగు వెలమవీరులు కాలము కలిసిరాకపోవుట వలనను, మహమ్మదీయుల సంఘర్షణమువలనను దూరదేశములకు పలసఁ బోయినను ఒక కుటుంబము వారు మాత్రము జన్మభూమి నాశ్రయించి కొని నూతన దుర్గముల నిర్మించుచు విజయము లొందుచు నపజయముల పాలగుచు గోదావరీతీరమగు రామగిరి ప్రాంతములనుండి వెనుకడుగిడుచు బదుమూఁడవతరము మాదానాయని కాలమునాఁటికి జటప్రోలు నకుఁజేరి స్వల్పరాజ్యమును గైవసము గావించుకొని విద్యానగర సంస్థానమునకు నంకితులైరి. రేచెర్ల గోత్రీయులలో నొకశాఖవారిని చాలకాలము నుండి సురభివారని వ్యవహరించుచుండిరి. శా.శ. 1181 సరియగు క్రీ.శ. 1257 కామిరెడ్డి గోపయ్యకు సురభి మల్లారాయనింగారు శాసన మొసంగినటు లొక లిఖితపత్త్రము గానవచ్చుటచే సురభియను గృహనామము చిరకాలాగతముగా నీకుటుంబమునకు వచ్చుచున్నట్లును నామము గ్రామనామమైనట్లును

శ్లో. తద్వంశే కిల పెద్దశౌరిరితి విఖ్యాతో వినీతో గుణై
రాసీ ద్భాసితకీర్తిభూషితదిశాధీశాలయప్రాంగణః;
రాజ్యం పాలయతి స్మ యస్తు సురభిగ్రామేఽ తిధీమేదుర
స్తద్వంశ్యా యదుపజ్ఞ మేవ సురభిక్ష్మాపాలతాం బిభ్రతి.

– నృసింహవిలాసము.

గోదన్ ప్రాంతమునఁ గల సురభిలో నీకుటుంబమువారుంటచే నీయింటి పేరు వచ్చియుండు నను నూహ సమంజసముగా నున్నది. నిజాము రాష్ట్రమునందలి పద్మనాయక వీరుల సారస్వతజీవనము చెప్పవలసివచ్చినపుడు ప్రశంసింపఁదగినది, ప్రథమగణ్యమైనది జటప్రోలుసంస్థానము. రాజ్యము విచ్ఛిన్నమైనను బూర్వవైభవములు సన్నగిల్లినను తమ విజయాదికములు కీర్తించుకవుల బహూకరించుచు, వందిజాతులనఁబడు భట్టురాజకులము నుద్ధరించుచు నుత్తమకావ్యములు రచించుచు నంకిత ములొందుచు సుప్రసిద్ధులైన జటప్రోలుసంస్థాన పూర్వప్రభువులచరిత్రము

నిజాము రాష్ట్రాంధ్ర వాఙ్మయ చరిత్రమునందుచితస్థానము నలంకరింపఁదగియున్నది. ప్రకృతోపలభ్యములగు నాధారములను బురస్కరించికొని జటప్రోలు సంస్థాన ప్రభువంశీయులు భాషాసేవ యెట్లు గావించినదియుఁ గళల వారెట్లు వృద్ధిలోనికిఁ దెచ్చినదియుఁ దెలిసికొనఁ బ్రయత్నించెదము.

సురభి మాధవరాయకవి

ఈ కవిరాజు సంస్కృతాంధ్ర భాషలలోఁ గాక తర్కవ్యాకరణాది శాస్త్రములలోఁగూడ జితశ్రముఁడు. సర్వజ్ఞ సింగభూపాలుని పిమ్మట నగ్రగణ్యుఁ డీమాధవరాయప్రభువర్యుఁడే. ఈయనవ్రాసిన చంద్రికాపరిణయము విపులవ్యాఖ్యా సహితముగ ముద్రితమై యాంధ్రమహాజనుల యాదరమును జూఱగొనుచున్నది. ఇమ్మహాకవి కవిత వసుచరిత్రను బోలిన శ్లేషగుంభనములతోఁ గ్లిష్టముగ భావవంతముగ నుండును. ఈయుత్తమగ్రంథప్రశస్తినిగూర్చి రుధిరోద్గారి సంవత్సరాది సంచికలో వ్రాసియున్నారము. మాధవరాయకాలనిరూపణమునఁ జరిత్రకారులు తలకొకత్రోవ దీసిరి. వానిని సమన్వయించి యీక్రింది నుండెననుట సత్యము. అందుచే భట్టుమూర్తి, బాలసరస్వతి, మాధవరాయలు, పింగళిసూరన లోనగువారేకకాలమున నుండిరని విశ్వసింపవలయును. మాధవరావు ఆకాలమున సుప్రసిద్ధముగానున్న విద్యానగర సంస్థానమునకు రామరాజు, తిరుమలరాయలు, సదాశివదేవరాయలను దర్శించిపోవ నేతెంచుపండితుల నాదరించుచు విద్యావ్యాసంగములలో గృషి చేసె ననుటకును రామరాజు సమకాలిక కవులు మాధవరాయని వలన గౌరవమొందిరనుటకు, మాధవరావు భట్టుమూర్తికి, బాలసరస్వతికి సమకాలికుఁడనుటకు నింత చర్చచేసితిమి. మాధవరాయని యాస్థానమున తోరణాల చొక్క యామాత్యుఁడను కవి యొకఁడు గలఁడని తెలియుచున్నది. ఈకవి యేయుత్తమ గ్రంధములను రచించి సారస్వతసేవ యొనరించి ధన్యుఁడయ్యెనో తెలిసికొనవలసిన భారమింకను బరిశోధకులపైననే కలదు.

మాధవరాయకవి చంద్రికాపరిణయమే కాక తిద్గ్రంతమునకు వ్యాఖ్యానము గూడ స్వయముగా వ్రాసియున్నాఁడు. అందలి పద్యము లవలన మాధవరాయఁడు మామిడిదుర్గమును భేదించెననియుఁ బెక్కుకావ్యములు రచించెననియు వ్యాఖ్యానమునకుఁ బేరుకువలయామోదమనియుఁ దెలియుచున్నది. మాధవరాయని వ్యాఖ్య మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయమున 508వ పుస్తకముగ నున్నది.

ఎలకూచి బాలసరస్వతి మహెూపాధ్యాయ బిరుదాంకితుఁడు. వెలమవీరుఁడును దేవరకొండ నల్లగొండాది దుర్గముల నేలిన రాజవంశీయుఁడు నగు జూపల్లి వేంకటాద్రి కంకితము గావింపఁబడెను. బాలసరస్వతి చంద్రికాపరిణయము, కార్తీకేయాభ్యుదయము, ఆంధ్రశబ్ద చింతామణివ్యాఖ్యబాహాట వామనాది పురాణములు, షడ్భాషావివరణము, రంగకౌముది, లోనగు నుత్తమ గ్రంథములను రచించెను. మాధవరాయని కాలమున భాషాసేవ మిగులజరిగినట్లు పైచర్చనుబట్టి పాఠక మహాశయులు గ్రహింపఁగలుగుదురు.

స్వతంత్ర రాజ్యములు స్థాపించిన జగదేక వీరులగు వెలమవీరులు పరరాజులకు సామంతులై క్రమముగ విదేశీయులగు మహమ్మదీయ రాజులకుఁ గప్పములు గట్టు జమీందారులుగా మాఱుటతో వారి యైశ్వర్యజీవితము నశించినను సారస్వతసేవమాత్రము సన్నగిల్లలేదు.

మాధవరాయప్రభువర్యుని కుమారుఁడు నరసింగరాయనింగారు నక్షత్ర ఖేలనమను జ్యోతిషగ్రంథమును రచించి వంశపరంపర హక్కుగాఁగ వచ్చుచున్న కవితాసతికిఁ దావొసంగిరి. వీరికుమారులగు చినమాధవరాయనింగారు శూద్రస్మృతియను నొక గ్రంథమును జేయించిరి. ఈవంశమున 26–వ తరమువారగు వేంకటజగన్నాధరావు గారు విద్యాభిమానులై కవిసార్వభౌమ బిరుదాంకితులు, బ్రహ్మతంత్ర పరకాలస్వాములవారని పిలువఁబడు కృష్ణమాచార్యులవారిచే సంస్కృతమున లక్ష్మీనృసింహ విలాసము, మదనగోపాల మాహాత్మ్యమును గ్రంథరత్నముల రచింపఁజేసి సత్కరించిరి లక్ష్మీనృసింహవిలాసము సరసముగను మనోహరముగను నుండి సురభివంశీయులగు వెలమవీరుల సంపూర్ణచరిత్రము నుద్ఘోషించుచున్నది.

ఉపసంహారము

వెలమవీరులలో రేచెర్లగోత్రీయుల నామము క్రీ.శ.౧౦వ శతాబ్దమునుండి వినవచ్చుచున్నది. వెలమ వీరులలో మిగులఁ బ్రాచీనులగు బ్రహ్మసేనాని భీమసేనాని లోనగు వీరులు కాంచీదుర్గమును భేదించి రాజ్యలక్ష్మిని గాకతీయుల కప్పగించిరి. వీరాధివీరుఁడగు రుద్రసేనాని రుద్రదేవుని కాలమునాఁడు విచ్ఛిన్నమైన కాకతీయ రాజ్యమును బునరుద్ధరించి కాకతీయ సామ్రాజ్యస్థాపక బిరుదపాత్రుఁడయ్యెను.

ఇతఁడు నిర్మించిన సముద్రముతోఁబోలు తటాకము, చిత్ర శిల్పావృతమగు దేవళము, ఒరంగల్లునకు నాల్గామడలదూరములోనున్నవి. నామిరెడ్డి, బేతిరెడ్డి లోనగు వీరులు నెలకొల్పిన దేవళములు పిన వీరభద్రమహాకవి జన్మస్థానమగు పిల్లల మఱ్ఱిపురమందు మనోహరములుగ, కనుల పండువులుగ నేటికిని దృష్టిపర్వముం గూర్చుచున్నవి. ఈ వీరయుగళమునం దొకఁడగు బేతాళనాయకుని గూర్చి యొక సంస్కృత కావ్యము, ఒక ద్విపదకావ్యము గుణప్రశంస చేయుచున్నవి. ప్రసాదాదిత్యనాయఁడు, రుద్రమనాయఁడు లోనగు రేచెర్లగోత్రీయ వెలమ వీరులు గణపతిదేవుని కాలమున సుప్రసిద్ధులై యుండిరి. దాచానాయకుఁ డనువీరుఁడు పాండ్యరాజులను జయించి సింహాసనమును గడించెను. రెండవ ప్రతాపరుద్రునికాలము వఱకు సేనానాయకులుగాను వెలమవీరులు శిల్పములు కవిత లోనగుకళలఁ బోషించిరి. పౌర సంతృప్తికి దేవళములు, తటాకములు, దుర్గములు నెలకొల్పి ప్రజావిశ్వాసముచూరఁగొని ప్రభుభక్తి నద్వితీయముగఁ జూపి రాజరక్షణమునకుఁ బోరాడి, యనంతరము స్వతంత్రరాజ్యము స్థాపించుటఁబట్టిచూడ వెలమవీరులు సమయాకర్షణము, వితరణవిభవము, ప్రజాకర్షణశక్తి గలవారనుట కెట్టి సంశయము లేదు. ఈ వీరుల జీవితము వ్రాయఁబూనినఁ ప్రత్యేక గ్రంధములు కొన్నియే నికాకమానవు. నిజాము రాష్ట్రమునఁ బలుతావుల వెలమవీరులు గలరు. వీరలందఱును వీరకుటుంబ సంజాతులే. సాధారణముగ వీరలగృహములలో వీరలాంఛనములగు పూర్వాయుధములు శాసనపు పత్రములు సనదులు తాళపత్ర గ్రంథములు పెక్కులు నేఁటికిని దృశ్యములగుచున్నవి. వీరల యాదరణమునఁ బలువురుకవులు సారస్వతజీవనము గావించిరనుటకుఁ బూర్వోక్తవిషయములు సాక్ష్యమీయఁగలవు. వృత్తి స్వాస్థ్యములు గలవారగు వెలమవారు నేఁటికిని కవులను, భట్టులను బోషించుచు మాతృభాషాసారస్యమును గ్రహించి తన్మయులగుచున్నారు. పద్మనాయక వీరులను గూర్చిన చాటుపద్యములు, చాటుపద్యమణిమంజరి. చాటుపద్యరత్నాకరము, వెలుగోటివారి వంశచరిత్రము, సురభివారి వంశచరిత్రము లోనగు గ్రంథములలోఁగలవు. అవి మనోహరభావసమన్వితములై వీర రసోద్రేకాతిశయమును గలుగఁజేయుచు నాకాలపు టాంధ్రమహాకవుల వీరజీవనాభిలాషను జాటుచున్నవి.

వెలమవీరులలో దేవరకొండ దుర్గాధ్యక్షుఁడగు పళ్లచెళ్ల గోత్రీయుఁడునగు జగన్నాథకవియొకఁడీ మహాయుగమునఁ జేరఁదగియున్నాఁడు. ఇక్కవి తన

వృత్తాంతము నిట్లు *కుముదవల్లీవిలాసమను తన ప్రబంధమునఁ జెప్పుకొనియున్నాఁడు.

సీ. పొనుగోటివంశాబ్ధి పూర్ణచంద్రుఁడ పల్ల
చెల్లగోత్రాంక ప్రఫుల్లయశుఁడ
దేవాద్రిపట్టణాధిపుఁడ..... ....

....

తే.గీ. అశ్వపతిదత్త మత్తేభహయదభూమి
కాధ్వజచ్ఛత్రచామరకల్పవిభవ
సకలసామ్రాజ్యశాశ్వతై శ్వర్యధుర్య
రాజవరుఁడ జగన్నాథరాయవిభుఁడ.

కుముదవల్లీ విలాస మైదాశ్వాశముల రసవత్తర ప్రబంధము. ఈ కవి దేవరకొండలో దుర్గాధ్యక్షుఁడుగనుండి మహమ్మదీయ ప్రభువులచే నుచిత గౌరవము లొందెననుటచేఁ బ్రబంధయుగమునాఁటి కవియనఁదగును. ఇటులె యింక నెందఱు కవులపేరులు మఱుగుపడియున్నవో తెలుప నయితిగాకున్నది.

నిజామురాష్ట్రమునందలి యన్నిప్రాంతములయందును వెలమవీరులు గలరు. వీరలు స్థాపించిన దేవళములు, తటాకములు, పొందిన కృతులు చేసిన ధర్మకార్యము లసంఖ్యాకములు. ఏలేశ్వరము, శ్రీశైలము, వేల్పుకొండ, అయినవోలు, యాదగిరి, లోనగుక్షేత్రములలో వీరి శాసనములు గలవు. భువనగిరి, సింగవరము, దేవరకొండ, జంద్రగిరి, క్రొత్తగట్టు, నల్లకొండ, రాచకొండ, రామగిరి, గోలకొండలోనగు చోటుల వీరలు గట్టిన దుర్గములు కలవు. ఇంకను సమగ్రమగు పరిశోధనము జరిగినగాని యీ వ్యాసమునకుఁ దగిన చరిత్రాధారములు లభింపఁజాలవు.

ఈ పద్మనాయక మహాయుగముతో పాటు రెడ్డిమహాయుగమునుగూడఁ బ్రశంసించి రెడ్డివీరుల సారస్వతజీవనముతోపాటు గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, దొంతి, దోమకొండ, పాపన్నపేట సంస్థానాధీశ్వరులు భాషకై కావించిన యనల్పత్యాగమును ప్రశంసించుటకు ఇప్పటికే గ్రంథ విస్తరమగుటచేఁ బూనుకొనఁ

---

* *కుముదవల్లీవిలాసము ప్రకటించినవారు గ్రంథకర్తకుఁ బదియవతరమువారు గాన కవి యిప్పటికి మూఁడువందల సంవత్సరము నాఁటివాఁడు.*

జాలమైతిమి. ఆంధ్రవాఙ్మయమునం దనుపలబ్ధములైయున్న ప్రబంధములు పెక్కులు నిజామురాష్ట్రమునందలి వెలమరెడ్డివీరుల సంస్థానములలోఁ గలవు. ఈ గ్రంథములనుఁ దగిన ప్రయత్నములు సల్పి యుద్ధరించి కాపాడవలసిన భారము, భాషాసేవకు, దేశసేవకు, ఆంధ్రసేవకుఁ బూనుకొనిన నిజాం రాష్ట్రాంధ్రసంఘము పైనను, త్యాగధనులగు నిజామురాష్ట్రాంధ్ర సోదరులపైనను గలదు. వారు తమ విధుల సక్రమముగ నెఱవేర్చినపుడే నిజాము రాష్ట్రాంధ్ర దేశము ప్రత్యేకవ్యక్తిత్వముగడించి ప్రత్యేకాంధ్రవాఙ్మయచరిత్రమును, ప్రత్యేక దేశచరిత్రమును, బ్రత్యేక ప్రాచ్యలిఖిత పుస్తకాలయమును, ప్రత్యేక కవి జీవితమును బడసి నాగరికయుగమునం దగ్రస్థానముఁ బడయఁగలదని తలంచి యట్టి శుభావసరము కొఱకు నిరీక్షించుచున్నారము.

సీ. భువనగిరీ దుర్గమును జూచి యాంధ్రుల
దివ్యప్రభావంబుఁ దెలియవచ్చు
రామప్పగుడులయారజముచే నాంధ్రుల
శిల్పశక్తిని దెలిసికొనవచ్చు
ఒరుగల్లుకోట పెంపూహించి యాంధ్రుల
శేముషీబలము చర్చింపవచ్చు
పాకాల చెఱువుచెల్వముఁ జూచి యాంధ్రుల
యైశ్వర్యవిభవంబు లరయవచ్చు

తే. చిరయశంబునుగాంచిన చిహ్నలింక
దేశచారిత్రములను జిత్రించువఱకు
నిలువకుండునె? యందుఁ జిత్రింపవలదు
శాంతి కిది వేళ గాదు నిజాము భూమి.

-- ఆంధ్రపత్రిక, అక్షయ సంవత్సరాది సంచిక (1926)

౫౦౩

౨౨. నిజామురాష్ట్రము - పరిశోధనోద్యమము

ఈ రాష్ట్రమునఁ దొలుతఁ బరిశోధకులను బంపి శాసనములను ఎత్తి వ్రాయించి తాళపత్ర గ్రంథముల సేకరించిన వాఙ్మయ సేవకులలో కాలిన్‌మెకంజీ దొరగారు ముఖ్యులు. 1790-1810ల మధ్యకాలములో నీయన సంపాదించిన శాసనములు, కయిఫియతులు, వ్రాత పుస్తకములు మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకాలయమున భద్రపఱుపఁబడినవి. అందలి యమూల్యాంశములు నేఁటి పరిశోధకులకు మార్గదర్శకములు. మెకంజీ దొరవారు పరిశోధకులకు జీతములనిచ్చి, ఇతర వ్యయములు భరించి, చేతి రొక్కము ఖర్చుబెట్టి పరిశోధన కృషికిఁజేయూత యొసంగనిచోఁ జరిత్ర ప్రపంచము అంధకారబంధురమయ్యెడిది.

నిజాము రాష్ట్రమునఁ దెలంగాణమందును కర్ణాట ప్రాంతమందును సంపూర్ణముగఁ గృషిచేసి మెకంజీ దొర వారి పరిశోధకులు సమకూర్చిన లేఖనములు చరిత్రకారుల సంశయగ్రంథులు విడదీయ సహకరించుచున్నవనుట ముమ్మాటికి సత్యము. ఒరంగల్లు, మహబూబునగరము, రాయచూరు, గుల్బర్గా మండలములలో మెకంజీ దొర వారి పరిశోధకులు స్వైర విహారమొనర్చిరి. పర్యటనమందు గడించిన గ్రంథాలు వ్రాసిన శాసనపాఠాలు, గడించిన స్థానిక వృత్తాంతములు, వ్రాసిన దినచర్యలు ఇప్పటి చరిత్రాభిమానులకుఁ దోడ్పడుచున్నవి. పరిశోధకులు మెకంజీ దొరవారి యాజ్ఞచేఁదిరిగిన ప్రదేశములో నివని సూచించిన శాసనములు ఇప్పుడు కొన్ని మటుమాయమైనవి. కొన్ని స్థానభ్రష్టములైనవి. మెకంజీ దొరవారు ఇచ్చిన శాసన పట్టికలలోని కొన్ని శాసనశిలకు మాతృకలంతరించినవి.

శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు గద్వాల, వనపర్తి ఆత్మకూరు సంస్థానములలోఁ బలుకుబడి గడించి యా సంస్థానములలో భద్రపఱుపఁబడిన అనేక గ్రంథములను సేకరించి ప్రకటించిరి. శాసనములనుదీసి గ్రంథరూపమున ప్రచురించిరి. వారు తమ యనుభవమును సంపూర్ణముగ కుమారసంభవ పీఠికలో నుపయోగించుకొనిరి. పెక్కు శాసనములు భారతిలో ముద్రించిరి. తెలంగాణమునఁ బరిశోధనము స్వయముగా సాగించినవారిలో వీరే ప్రథములు. ఇంతియేగాక ఆలంపూరు దేవాలయ విశేషములు, భీమకవి నివాసస్థల చర్చ, గౌరన జీవిత విశేషములు, రససిద్ధుల

చరిత్రము మున్నగు తెలంగాణ మునఁగల గుప్త విషయములు బహిరంగపఱచిరి. ప్రజాసముదాయము మాతృదేశ ప్రశస్తి గమనింపకమున్నె పరిశోధనమునకు నడుముకట్టిరి. వారు సేకరించిన తెలంగాణ వాఙ్మయము వారి భాండారముననె యడఁగి యున్నదనుట విచారణీయము. సకల నీతి సమ్మతము అను మదికి సింగన సంకలిత గ్రంథము ప్రకటించి, భాషకు మహోపకారముఁజేసిరి. దానివలన రామగిరి ప్రశస్తి పూర్వ విస్మృత వాఙ్మయము తెలిసికొన నవకాశము లభించినది. వారు రచించిన "రాజకవులు" అను వ్యాసరాజము పరిశోధకులకుఁ ద్రోవఁజూపినది. నిష్కామ భాషాసేవకులగు వారి జీవితము తెలంగాణమును ధన్యము జేసినది. శ్రీ కొమఱ్ఱాజు లక్ష్మణరావు పంతులువారు, జయంతి రామయ్య పంతులువారు, వేటూరి ప్రభాకర శాస్త్రిగారు తెలంగాణమున సంచరించి, యమూల్య చరిత్రాంశములు వెల్లడించిరి. చితాపుఖాను చూపిన చాకచక్యము అనన్య సాధ్యము. మేము గడించిన బమ్మెర పోతరాజు నివాసస్థల చర్చ వ్యాసరూపమునఁ బ్రచురించి జయంతి రామయ్య పంతులువారు ప్రతిపక్షవాదము నిర్వీర్యము చేసిరి.

శ్రీ వెల్లాల సదాశివశాస్త్రులుగారు ప్రసిద్ధ విద్వాంసులు. వారు తెలంగాణమున గుప్తముగనున్న శాసనములు శోధించి రేచర్ల గోత్రులగు వెంకటగిరి సురభి వంశముల చరిత్రము రచించిరి. వీరలందఱు మనకుఁబూజ్యులు. ఇప్పటికి ముప్పదియైదు సంవత్సరముల క్రిందట మాట. హనుమకొండలో ఆలూరి గురురాజారావుగారు అను విద్యాధికులు సుప్రసిద్ధ శాసన శోధకులు. వారు పెక్కు శాసనములఁ బరిశోధించిరి. రామప్ప, కొండవర్తి, రంగాపురము, శాసనములు చదివి తెలంగాణమునకు సేవగావించిరి. అకాలమరణమొందుటచే వారి చరిత్రానుభవం వెల్లడి కాకపోవుట విచారకరము. వీరలందఱి యడుగు జాడలలో తెలంగాణమున నేనును, మా యన్నగారగు శేషాచార్యులవారు ఆంధ్ర సాహిత్య పరిషత్పక్షమునను ఆంధ్ర విశ్వవిద్యాలయము పక్షమునను ఆంధ్ర పరిశోధక మండలి పక్షమునను తెలంగాణమునఁ అముద్రిత గ్రంథములు పెక్కులు గడించి, ఆయా సంస్థలకిచ్చితిమి. చరిత్రాన్వేషణము దృక్పథమున నుంచికొని మేము పర్యటనముఁజేయుచుఁ గావించిన కృషి అప్పుడప్పుడు పత్రికల్లో ప్రచురించితిమి. రాష్ట్ర పితామహుఁడు శ్రీ మాడపాటి హనుమంతరావుగారు మా కృషినభిమానించి, మాతోఁ బరిశోధనము జేయించుటకు లక్ష్మణ రాయ పరిశోధకమండలిని స్థాపించి ఎక్కడనో ఉపాధ్యాయ వృత్తిలోనున్న

మమ్ము వేసవి సెలవులలో సంవత్సరమునకొక మాసము పనిచేయ నవకాశమొసంగిరి. దాని ఫలితమే తెలంగాణ శాసన సంపుటము. శ్రీయుత ఆదిరాజు వీరభద్రారావు గారు, లక్ష్మణరావుగారు శిక్షణమొసంగి తీర్చిదిద్దిన వ్యక్తి. వారు లక్ష్మణరాయ పరిశోధకమండలికి గౌరవ కార్యదర్శి. మంచి చరిత్రానుభవము గలవారు. శ్రీమారెమండ రామారావుగారు తెలంగాణ శాసనసంపుటమునొక యాకృతికిఁదెచ్చిరి. వీరలు మనకాదరణీయులు.

శ్రీ సిరుగూరి హనుమంతరావుగారు సుప్రసిద్ధులు. వారి పరిశోధనముపై విలువగల వ్యాసములు వ్రాయుటయేగాక శాసనములను గూడఁ జక్కని వివరణములతో ప్రచురించిరి. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, భావరాజు వెంకటకృష్ణరావుగారు తెలంగాణము చారిత్రక ప్రశస్తిని గూర్చి విలువగల వ్యాసములు వ్రాసిరి. శ్రీ లక్ష్మణరాయ పరిశోధకమండలివారు ప్రచురించిన తెలంగాణ శాసనములు అను పుస్తకమున శాసన పాఠములు మాత్రమీయబడినవి. అందుఁగొన్ని స్ఖాలిత్యములు గూడఁగలవు. శ్రీ పుట్టపర్తి శ్రీనివాసాచార్యులవారు అందుఁగాకతీయ శాసనములు మాత్రము ప్రతిబింబములు తీసి మఱికొన్ని శాసనములు చేర్చి, నిజాము దొరతనమువారి పక్షమున బృహద్గ్రంథమును ప్రచురించిరి. అది నిజముగాఁ బ్రశస్త ప్రచురణము. అందుఁ జారిత్రకాంశములు, భాషావిశేషములఁ జర్చ విశేషించిగలదు. శ్రీ శ్రీనివాసాచార్యులవారు ఇపుడు హైదరాబాద్ ఆర్ష శాఖకు డైరెక్టరయి బహుముఖముల సారస్వత పరిశోధక కార్యక్రమును కొనసాగించుచున్నారు. మహారాష్ట్ర కర్ణాటాంధ్ర భాషలు మిళితమైయున్న హైదరాబాదు రాజ్యములోని ప్రాచీన చరిత్రము గడించి ప్రచురించుటకుఁ దృఢమగు పునాదులు వేయుచున్నారు. కీ॥శే॥ సురవరము ప్రతాపరెడ్డిగారు పరిశోధనమున అందెవేసినచేయి. వారి రచనములలోఁ బరిశోధనము తొణికిసలాడుచుండును. శ్రీగడియారము రామకృష్ణకవిగారు శాసనములు చదువుటలో మంచి యనుభవము గడించి, అలంపుర శిధిలములను ఉత్తమ గ్రంథముగా ప్రకటించిరి. వీరలందరు స్వార్థము నపేక్షించక పరిశోధనము జరుపు ధన్యులు. మఱియొక విషయము చెప్పమఱచితిమి. ప్రధాన మంత్రివర్యులగు శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు బహుభాషాకోవిదులు; కవులు, పరిశోధకులు అప్పకవీయ రచయితయగు అప్పకవి నివాసము మహబూబు మండలమని నిరూపించుటలో వీరు చూపిన ప్రతిభ అసాధ్యమైనది, గోలకొండ కవుల సంచిక ప్రకటించి తెలంగాణము

విద్యాపీఠమని నిరూపించుటకై ప్రాచీన కవుల చరిత్ర సూచిక ఆధునిక కవుల పరిచయము ఆంధ్రలోకమునకుఁ బ్రసాదించిన సురవరము ప్రతాపరెడ్డిగారు పునస్మరణీయులు. శ్రీ చిదరమఠము వీరభద్రశర్మగారు కాశి పండితులు. వీరు వీరశైవ వాఙ్మయమునకు గొప్ప సేవచేసిరి. అంతియగాక పరిశోధన వ్యాసములు పెక్కు వ్రాసిరి. వీరి యకాలమరణము వలన ఇంతయనరాని లోటుగలిగినది.

ఇందరిన్ని విధములఁ బరిశోధనమునఁ గృషి సలుపుచున్నను, విస్తృతమగు తెలంగాణమున దేశ చరిత్రమున కొక స్వరూపమేర్పడలేదు. కారణము ఇందఱినిఁ గార్యరంగమున నిలిపి ఇతిహాస ప్రోత్సాహమొనరించుచు ఆర్థిక సాహాయ్యము గ్రంథ ప్రచురణము నెఱవేర్పు ప్రధాన సంస్థ యొకటియేని లేకుండుటచే. దొరతనమువారి అర్కాశాఖ ఉరుదు బురకా వదలించుకొని దేశభాషలు చరిత్రము ప్రోత్సహింపను బలాటపడుచున్నది గాని సరియగు ధనసహాయము ప్రభుత్వము గావింపకుండుటచే వెనుకంజ వేయుచున్నది. పాలకవర్గము ఈ ప్రధానసంస్థకు తగినంత ధనసహాయము గావించుచో ఎంతయో పని జరుగగలదు. ఆర్థిక సమృద్ధిగలిగినగాని అర్కాశాఖ బహుముఖములఁ బని చేయ వీలుచిక్కదు. శ్రీ శ్రీనివాసాచార్యులవారు సర్వవిధముల సమర్థులు. అభ్యుదయకరములగు ఎన్నియో యత్నములఁ జేయుచున్నారు. అడుగడుగునకు ఆర్థిక సమస్య యడ్డుపడుటచేఁ దమక్రింద పనిచేయు ఏకైక పరిశోధకుని నిలుపుకొనవలయునని విశ్వప్రయత్నము చేయుచున్నారు. అది కార్యరూపముదాల్చుట గడ్డు సమస్యయైనది.

ఇంతవఱకుఁ బ్రధాన విషయమునకు రాలేదు. ఈ రాష్ట్రమున ఒరియంటల్ లైబ్రరి వంటి వ్రాతపుస్తకముల భాండాగారము స్థాపింపఁబడలేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయములో లక్ష్మణరాయ పరిశోధక మండలిలో అర్కక శాఖ మ్యూజియంలోఁ గొన్ని వందల వ్రాత ప్రతులుగలవు. తెలుగు సంస్థానములలో లిఖిత గ్రంథములు సరియగు పోషణములేక దినదినము నాశనమగుచున్నవి. తెలంగాణమునఁ బలుతావుల వ్రాత పుస్తకములుగలవు. చేతిమీదుగ పాడుచేయువారు కొందఱు. గ్రంథరక్షణము చేయఁజాలకుండుటచే మీరు తీసికొందురా మీరు తీసికొందురాయని యాచించి నిరుత్తరులగువారు కొందఱు. సమృద్ధిగా గ్రంథసంచయము సమకూర్చిన యెడ వీనినిగాపాడు సంస్థయేది? వ్యయముతో నీయుద్యమము నకుఁ బ్రోత్సాహము నొసంగు సంస్థయేది? కొలదికాలము ఇటులే

మీనమేషముల లెక్కించుచుఁ గూర్చున్నచో ఒక్క తాటాకు పుస్తకమైన మిగులక నశింపవచ్చును; నశించితీరును. ఇరువదియేండ్ల క్రింద గ్రంథ సంపాదనము చేయుచున్నపుడు మాకు విరివిగా వ్రాతపుస్తకములు గోచరించినవి. ఇపుడా గ్రంథసంచయము నశించినదని తెలిసికొని విచారపడుచున్నారము.

ప్రతి వ్యక్తియుందమ ప్రాచీన చరిత్రము సంగ్రహింపవలయును. అంతో ఇంతో చరిత్ర ప్రాముఖ్యము గడింపని కుటుంబమేలేదు. గొప్పతనమునకు బూర్వ చరిత్రములతోఁ దమ కుటుంబ కథలు ముడిపెట్టువారు కొందఱుందురు. పారంపర్యముగ స్థానిక యుద్ధములు, ఆలయ నిర్మాణము, వీరకథలు, రాజుల పరిపాలనము, గ్రామ చరిత్రలు ఏకరవు పెట్టువారు కొందఱు. వారు చెప్పునది సత్యమా కాదాయను చర్చ ప్రధానము కాదు. ఉన్నది విన్నది యథాతథముగ భద్రపరచుటకై యలవాటుపడుట మన ముఖ్య కర్తవ్యము. ఇట్టి కథలు చరిత్ర కథలు తెలుఁగుదేవములోఁ బలు తావులఁద్రిప్పి పరిశోధకులచే మెకంజీ దొరవారు 150 సంవత్సరముల క్రిందట వ్రాయించి వానికి కైఫియతులని పేరుపెట్టెను. అట్టివి యిప్పుడైన మనము వ్రాయించినచో మిగుల ఉపయోగపకరమగును. స్థానిక చరిత్రములని కైఫియతులకు దేశీయనామము కట్టడములనుగూర్చిన కథలు దుర్గములను గూర్చి మనవారు పరంపరగాఁ జెప్పుకొను వృత్తాంతములు గ్రామమునందుఁగల దేవాలయముల వ్యవస్థలు, తటాకములు మొదలగు జలాశయముల నెవరేకాలమున నిర్మించిరో వానిని పరంపరగాఁ జెప్పుకొను పుక్కిటి పురాణములు, శాసనములు, కలతావులు తెలిసినవారున్న వాని పాఠములు పూర్వవీరులయుఁ బ్రాచీన కవులయు జీవితములు లోనగు గ్రామమునకు సంబంధించిన గాథలు దొరతనమువారి సహాయము బడయునన్నను గ్రంథాలయము లేని సేకరించుట అవశ్యకము. స్థానిక చరిత్రములు పూర్వమునుండి వ్రాసి భద్రపఱచు కుటుంబములు కొన్ని కలవు. పూర్వము జరిగిన సంగ్రామములలో మరణించిన మహనీయులు తిరుగుబాటుదారులు సహగమనము చేసిన వీరకాంతలు స్వామిభక్తపరాయణులగు వీర పురుషులు చేసిన సేవగూడ స్థానిక చరిత్రములలో లిఖింపవలదె. అందలి సత్యాసత్యములతో మనకుఁబనిలేదు. చరిత్రకారులు, పరిశోధకులు సత్యము నిరూపింపఁ బాటుపడుటకు ముందంజ వేయుదురు. పల్లెలలో బుఱ్ఱకథలఁ జెప్పువారు కొందఱు కలరు, వారి వాఙ్మయము గేయరూపముగా

నుండును. అందుండి మన జాతీయత సాంఘిక జీవనము వీరుల సహన కార్యములు విడదీయవచ్చును. బలుమూరి కొండ కథ, కాకతమ్మకథ, మల్లన్న కథ, సర్వాయి పాపని కథ, సదాశివరెడ్డికథ, గద్యాల సోమభూపాలుని కథ, ప్రోలరాజుకథ, ఏకవీరకథ ఇట్లు ఎన్నియో కథలను గొల్లల నడుగుకొనువారు చెప్పుచుందురు. ఈయనా దృతవాఙ్మయమును గ్రంథస్థము చేయవలయును. అంతయోపిక లేకున్న కథాంశముల నేని సేకరింపఁ బ్రయత్నింపవలయును. కొన్ని తావులలో నీ కథాంశములు గల గేయ వాఙ్మయము తాళపత్రములపై వ్రాయఁబడియుండుట మేమెఱుఁగుదుము. ఈ తాళపత్ర గ్రంథములు చాలవఱకు నాశనదేవత కాహారమైనవి. హతశేషములు నూటికొకటియో కోటికొకటియో యున్నను, వానిబైట పెట్టుటలేదు. పనిబట్టి ఈ గ్రంథజాలము సేకరించినచో దేశ చరిత్రమున కెంతయో యుపకరించును.

కరీమునగర మండలములో రామగిరి ప్రశస్తమైన దుర్గరాజము. అది సబ్బినాటి సీమకు రాజధాని. సబ్బిసాయిర మండలమనియుఁ బూర్వ వ్యవహారమునఁగలదు. వేములవాడఁ బాలించిన యొక చాళుక్యశాఖకది ప్రధాన దుర్గము. ఈ శాఖకుఁజెందిన యుద్ధమల్లుడుఁ బద్దిగ భూపతి అరికేసరి నృపాలుఁడు వీరు వారలనేల,ఈ వంశజులందఱు బ్రసిద్ధులు. చాళుక్య చొక్క నృపాలుఁడు సాహిణిమారుఁడు ముప్ప భూపాలుఁడు మొదలగు మహనీయులెందరో ఈ దుర్గమును బాలించిరి. అద్భుతములగు శిల్పములుగలవు. మొదట బౌద్ధ, జైనమతములకుఁ గేంద్రస్థానము. అచట గల కేశవాలయ మడికి సింగనకవి సకల నీతిసమ్మతమను గ్రంథమున మిగులఁ బొగడియున్నాఁడు. జగత్ప్రసిద్ధమగు నీ దుర్గరాజము చరిత్రము దుర్భేదముగా నున్నది. అడవులు బలియుటవల్ల రామగిరి దుర్గము తేరి చూడరాకున్నది. మహమ్మదీయ పాలనములో దుర్గము వికృత స్వరూపముదాల్చి ఆ రాంగిరియని నామాంతరము పొందినది. ఇట్టి దుర్గము లెన్నియో మనదేశమునఁగలవు. వాని పూర్వ చరిత్ర సంస్మరించువారును బరిశోధనము జరుపువారు దేశమున నెవరును లేరన్న సాహసమనిపించుకొనరు. రామగిరి దుర్గమునఁగల బౌద్ధ చిహ్నములు, జైనమూర్తులు ఆర్షమత సాంప్రదాయ మూర్తులు దుర్గ నిర్మాణము చెల్లాచెదరుగా నందందు పడియున్న శాసనములు పరిశోధించుచో అమూల్య చరిత్రాంశములు లభించును. ఒక్కరితో ఒక్కఁనాటితోఁదీరు కార్యముకాదు, కొండాపుర వస్తుసముదాయముతోడను పెదబంకూరు నాణెములతోడను చాళుక్య రాష్ట్రకూట

యాదవ రాజులతోడను, పురణములతోడను రామగిరికిఁ దీనికి సంబంధము గలదని నిరూపించినపుడే మనము కృతకృత్యులము. ఇట్లే తెలంగాణమున పేరొందిన దుర్గ రాజములగు నాంపల్లి, రాచకొండ, తాడిచర్ల, ములంగూరు, ఉంద్రుగొండ, నేలకొండపల్లి, ఆలంపూరు, చంద్రవల్లి, భువనగిరి, ఖమ్మంమెట్టు, కనకగిరి మున్నగు ప్రాంతములలో సమగ్ర పరిశోధనము జరుగవలయును, ప్రభుత్వమువారు జరుపు పరిశోధనమున ఈ విశాల రాష్ట్రమున నేనొకఁడనే పరిశోధకుడఁను ఈ పరిశోధనోద్యోగము ఉండుటో ఊడుటో తెలియకున్నది. ఉత్సామపరులగు విద్యాధికులు, పలువురు జాతీయాబిమానముతో నడుము కట్టినగాని యీ కార్యము నెఱవేరదు. అట్టి సుదినము ఎన్నడువచ్చునో చూచునుత్సాహము షష్టిపూర్తియైన నన్ను ఉఱ్ఱూఁతలూపుచున్నది. ఇక ప్రకృతమునకు వత్తము.

మన రాష్ట్రమున దిబ్బల త్రివ్వునపుడు మట్టిపూసలు ఱాతిబొమ్మలు, శిలాయుధమునాఁటి ఱాతి ఆయుధములు, నాణెములు, పెద్ద ఇటుక, ఱాతిగోడ చాళ్లు కనుపించుటగలదు. కొన్నితావుల రాకాసిగుండ్లు అను ఱాళ్లు వలయాకారముగాఁ బెట్టిన తావులు విస్తారముగాఁగలవు. ఆలంపూరు ప్రాంతమునందు ఇవియే మరియొక విధముగా నాఁప ఱాళ్ళతోఁ గూర్చబడినవి. కొన్ని తావుల భూమిపై పలక ఱాళ్లు నాలుగు ప్రాతిపయికప్పు ఱాయి వేసియుదును. వీనిలో దేశకాలావస్తలఁ బట్టి మార్పులు గూడ గోచరించును. ఇవి ఆదిమవాసుల సమాధులు. కొంచెము త్రవ్వినచో నాలుగు పలకఱాళ్లు కనబడును. అందు భద్రపఱుపబడిన శవముల అస్తిపంజరములును గుండలు ఇనుప సామానులు, ఱాతి ఆయుధములు, కొన్ని తావుల శవములనుంచు మట్టిపేటికలు గూడ నుండును. కరీంనగరము జిల్లాలో ఇవి విస్తారముగనున్నవి. రాష్ట్రంమంతటను గొన్ని తావులలో నివియున్నవి. ములంగూరు ప్రాంతములలోఁ జేలలోనున్న ఇట్టి సమాధులు త్రవ్వ ఱాతి పలకలను దీసిగృహములకు గాదులక్రింద గద్దెలకు, అరుగులకు నుపయోగించిన భూస్వామిని నేనెఱుఁదుగును. ఇవి దొరతనము వారు కాపాడుచున్నారు. ఇందుండు కుండలు ప్రాచీన కాలపుఁబనితనము చాటుచున్నవి. కొన్నియెడల వవపేటికలపై సంకేతలిపులున్నవి. ఇట్టి వానిని జాగ్రత్తగాఁ గాపాడినచో పరిశోధకులు త్రవ్వి, ప్రాచీన నాగరత సాటుటకవకాశముగలదు. విస్మృతకాలమునందలి నాగరకత దీనివలన వెల్లడియగును. కావున స్థానికులు ఇట్టి చిహ్నములఁ గాపాడుటయు, నిందు లభించిన వస్తువుల జాగరూకతతోఁ గాపాడుటయు నవసరము.

కొందఱు మాటకొక కథ చెప్పుదురు. రసికులగు కొందఱు ప్రసంగములో లెక్కలేనన్ని సామెతలుపయోగించి, సంభాషణమున కందచందములు గూర్తురు. పల్లె స్త్రీలు దంపకము, ధాన్యము విసరుట, కోఁతగోయుట, కలుపుదీయుట జరుపునట్టియెడ వింత పాటలు బాడుదురు. కొందరు కవితాప్రియులు చాటు పద్యములతోఁ జమత్కారముగ మాటలాడుదురు. కొంచెము శ్రమచేసి సామెతలు, పాటలు, చాటుపద్యములు సమకూర్చినచో భాషా సేవ గావించినవారగుదురు. కొన్ని గృహములలో తాటాకుల పైనను, దొడ్డ కాగితములపైనను వ్రాసిన గ్రంథ సముదాయము కలదు. నూతన గృహనిర్మాణమున ఈ చెత్తతో మనకుఁ బనియేమని పాడుపడిన బావిబొందలలోఁ బాఱవేయువారును, అగ్నిదేవున కాహుతి గావించువారును కిరాయబండ్లపై శ్రద్ధగాఁ బెట్టుకొని వానకాలమున ప్రవాహములలో బడవేయువారును మనదేశమున విస్తారముగానున్నారు. లిఖిత గ్రంథములనేగాదు అందొక ఆకును బోనీయక కాపాడుటకై మనము దీక్ష వహించినచో ఆ గ్రంథ భాండారమునుండి అజ్ఞాతములు గానున్న అముద్రిత గ్రంథరత్నములను సేకరించి, ప్రచురింప వచ్చును. హనుమకొండయందు ఒక వ్యక్తి దేశమునంతట తిరిగి వ్రాతపుస్తకముల విరివిగాఁ బ్రోగుచేసెను. అవి విక్రయించిన ధనము వచ్చునని యాయన భ్రమ. పలు మందికి వ్రాత పుస్తకములు కొందురాయని బేరము పెట్టెను. అంతటి వదాన్యులు లేనందున పెట్టెలలోనుంచి భద్రముచేసెను, మేము పలుమారు ప్రయత్నము చేసితమి. చూపిన పాపమునఁబోలేదు. కొంతకాలమున కాయన గతించెను. ఆయన కుమారులు నిరర్థకమగు నీ చెత్త యేటికి? అక్కఱకువచ్చిన ఉపయోగించుకొనుఁడనుచు నాకొసంగిరి, చిరకాలము అజ్ఞాతవాసము చేసిన ఆ గ్రంథములు పెట్టెలు తెఱచిచూడగా ఎలుకలు నుగ్గుచేసినవి. అందుండి కొన్ని యమూల్య గ్రంథములు వెలువడినవిగాని యేమిఫలము! ఎత్తి వ్రాయుటకైన వీలులేకుండ అన్నియుఁబాడైనవి. భద్రముగా ఆర్షశాఖకుఁ జేర్చి పరిశోధనము చేయుచున్నాడను. ఇట్లె ఉన్నవారు గ్రంథములీయరు. కొందఱు చూపరు. కాగితములు విడిపోయి క్రిమిదష్టములయి విరిగిపోయిన గ్రంథములు ఒసంగుటలో దాతృత్వము చూపవచ్చును. పుచ్చిన వంకాయలు బాపనికిత్తునా, పారవేయుదునా? అన్న విధముగా అన్న దాతృత్వము అంతగా ప్రయోజనకారికాదు.

పటేలు, వట్వారీల ప్రాతదస్తరములు కొన్ని గృహములలోఁగలవు. తెలిసియో తెలియకయో కలగపులగముగ అందుఁగొన్ని గ్రంథములుగూడ జేర్పబడినవి. మా

మిత్రులతో కలిసికొన్న మీఁదట ప్రాచీన గ్రంథము లేమైన నుండవచ్చునని యాకట్టలు విప్పునప్పుడు అందుండి తపతీ సంవరణోపాఖ్యానము, పద్మపురాణము అను గ్రంథములు బయటపడినవి. ఇవి అముద్రితములు. కొంత భాగము మాత్రమే లభించినది. మిగిలిన ప్రతు లేదస్తరములో మాటు మడిగెనో ఎఱుఁగము. కాన గ్రంథశోధనము చేయువారు పటేలు, పట్వారిదస్తరములు మొదలుకొని దాలించవలయును. అప్పుడుగాని కృషి ఫలింపఁజాలదు.

గద్వాల, వనపర్తి, సురపురము, ప్రాగుటూరు, దొంతి, దోమకొండ, కొల్లాపురము, పాపన్నపేట మున్నగు సంస్థానములలో అపురూపమగు లిఖిత గ్రంధసముదాయ మున్నది. సంస్థానవాసులవద్ద కూడ పుస్తక భాండారము గలదు. అల్లసాని చెప్పినట్లు పూర్వకాలమున గృహము లన్నియు "తాళీదళ సంపుట ప్రకర కాంతారములే" అప్పటి పండితులు విద్యారణ్యులే. విద్యారణ్య పంచాననులె. ఈ యరణ్యములలోనున్న వేలుజాతి చెట్లనుండి వాగ్దేవతాపూజకై ఫలములు, పుష్పములు ప్రోగుచేయనలసియున్నది. ఎవఁడో యొకఁడు చేసినచో వాని జీవితములో కొంతభాగమేని పరిశోధనము కాజాలదు. అవకాశము కలుగఁజేసికొని కవులు, పండితులు, విద్యాభిమానులు, ఉద్యోగులు పాటుపడి గ్రంధ సంపాదనము జేయవలయును. మీన మేషము లెక్కించుచు ముందెన్నఁడో ఎవరో చేయుదురను కొన్నచో ఉత్తమ గ్రంథము లనేకములు నశింపవచ్చును. ఇప్పటికే మూడుపాళ్లు నశించినవి. మిగిలిన యొకపాలు గ్రంథములు వినాశనోన్ముఖములు గానున్నవి. కాన గ్రంథ సంపాదనమునకు ప్రతిభాషాభిమానియు నడుముకట్టుట యుక్తము.

ఆంగ్లేయుఁడయ్యు బ్రౌన్‌దొరవారు ఆంధ్రమునఁ బాండిత్యము గడించి మాతేండ్లకుఁబైకాలముననే లిఖిత గ్రంధములకు ధనము వెచ్చించి సమకూర్చెను. ఆనాఁడాయన ఈ మహోపకారము చేయకున్నచో గ్రంధరత్నము లెన్నియో నశించెడివి. అటులే మన రాష్ట్రముననైనను ఏ మహానుభావుడో జనించినయెడల లిఖిత గ్రంధాలయము స్థాపించియుండెడివాఁడె. మొన్నటివఱకు ఉర్దూ ప్రాముఖ్యముగల ఈ దేశమున ఆంధ్రభాషాభ్యుదయపు యత్నమేమియు జరుగలేదు. ఆంధ్రులు దాని యవసరమును గమనింపలేదు. ఈ నవయుగారంభమున నెట్లు జరుగునో చూడవలసియున్నది.

శిలాశాసనముల విలువ తెలియక జానపదులు చాలవిధములఁ జెఱచుచున్నారు. రోళ్లుగొట్టె ఖల్వములు జేసి తిరగండ్లుగఁ జెక్కి గోడలలో ఖండఖండములు జేసి బిగించి చెఱువుల తూములలో మాటుపఱచి పాడువఱచిన తావులెన్నియో కలవు. శిలాశాసనములను గుత్తెదారులు ధ్వంసముచేసి, కంకర గొట్టించి వంతెనలక్రింద పఱుపు రాళ్లగానుపయోగించి చరిత్రద్రోహము చేయుచున్నారు. గడచిన కాలములో నోరు మెదల్పకుండ అప్పటి యధికారులు ప్రజాసముదాయము నరికట్టిరి. ఇపుడు ప్రజా ప్రభుత్వమున అట్లు దుండగములు జరుగనియక చూచుటకు ప్రజలేబాధ్యులు. ఇటులే యూరకయున్నచో భవిష్యత్సంతతికి విజ్ఞాన ద్రోహము చేసినవారమగుదుము.

సీ॥ అలయద్రోహుల నరికట్టి ప్రాచీన
శిల్పరక్షణమును జేయుఁడయ్య
విజ్ఞాన నిధులైన వివిధ శిలాలేఖ
నమ్ముల భద్రంబొనర్పుఁడయ్య
స్థానిక చరితముల్ సమకూర్చి పూర్వుల
సమధికాభ్యున్నతి సాటుఁడయ్య
పల్ల పాటలకెల్ల బ్రాణదానమొసంగి
తెలుఁగునాటి ప్రశస్తి దెలుపుఁడయ్య

గీ॥ అన్య భాషాపురంధ్రుల యందు నాంధ్ర
వాగ్లతాగాత్రి యత్యంత వైభవమున
ఈ విశాలాంధ్రమున కీర్తికెక్కెనంచు
నాదరించుఁడి ఓసోద రాంధ్రులార.

౨౩. పరిశోధక నివేదిక*

నిజాం రాష్ట్రములోని ఆంధ్రసంఘ పరిశోధన శాఖాసహాయమున వరంగల్లు, కరీంనగరముమండలములో ది. ౫-౫-౨౪ మొదలు ౫-౬-౨౪ వరకు ఒనర్చిన పర్యటనానుభవము పరిశోధనాంశములు నివేదించుచున్నాఁడను. *

ఈ సంవత్సరము వేసంగిసెలవులు పూర్తిగా బరిశోధనముతో గడుపవలయునని సంకల్పించి బయలు వెడలితిని. శ్రీయుత మాడపాటి హనుమంతరావు పంతులుగారు ఎఱుపాలెములోన నన్ను గలసికొని, సాదరపురస్సరముగ వీడ్కొనిరి. పిమ్మట వరంగల్లులో రైలుదిగితిని. అచటిభాషా సేవకులు కార్యోత్సాహ శీలురునగు టి.వరదరాజులు, దేవులపల్లి వేంకటాచలపతిరావు, కోటయ్యగారలు నాకు సర్వవిధములఁదోడుపడి దర్శనీయ ప్రదేశములు చూపిరి. వారలసహాయముతో హనుమకొండ, వరంగల్లులో, బరిశోధనార్హములగు స్థలముల గుర్తించుచు బోవలసిన స్థలముల గూర్చి విచారించుచు, పరిశోధనముననన్ను వెంబడించి పని చేయుదునని జాబువ్రాసిన కోవూరు భరతయ్యగారి కొఱకు నిరీక్షించితిని. గాని వారేలనో వచ్చికలసికొనరైరి.

అచట (అనగా వరంగల్లులో) ఇతరులు పరిశోధింపని చరిత్ర గ్రంథములలో జర్చింపబడని శాసనముల సంగతి కొంతవరకు దెలియవచ్చెను. వరంగల్లునకు చేరువనున్న రంగశాయిపేట చెంత గల ఉరునుగుట్ట వద్ద ఇటీవల గనిపెట్టఁబడిన యొకానొక దేవనాగరిలిపి శాసనమును బరికించితిని. దీనిని వెదకుటలో జాలశ్రమ

---

* *హైద్రాబాదు "ఆంధ్ర పరిశోధక సంఘము" వారియాహ్వానముపైని ఆచార్యులుగారు ది. ౫-౫-౨౪ నుండి ౫-౬-౨౪వరకు నిజాంరాష్ట్రమునందు పర్యటనము సల్పియున్నారు. తత్పర్యటనా ఫలితములను ఈ నివేదికయందు వివరించి యున్నారు. నివేదికనుబట్టి ౫౩ మైళ్ళు రైలుమీదను ౧౯౪ మైళ్లు బండి మీదను ప్రయాణముచేసి, ౨౭ గ్రామములు దర్శించి, ౨౪ శాసనములను ఆముద్రిత గ్రంథములను సంపాదించి యున్నారు. ఈ పరిశోధన పర్యటన సంబంధమున సంఘమునకు రు. ౧౧౦-౧౪-౦లు వ్యయమయినవి. నివేదికయందు భవిష్యత్పరిశోధకులకు అనుకూలముగ నుండు విషయములనేకములు గలవు. కావున, శ్రీ ఆచార్యులుగారి నివేదికను సంఘమువారు మిగుల సంతోషముతో బ్రకటించుచున్నారు." ఆ. వీరభద్రరావు, కార్యదర్శి.*

కలిగినది. కొండకొంతవరకెక్కిన పిదప రెండురాళ్ల మధ్య నుండి పోయినచోనొక గండశిలపై కొంతభాగము చదరము చేయబడి యందీ శాసనము లిఖింపబడెను. నిలువున కంటె నెత్తుగశాసన గ్రంధము ఇంచుమించుగ పదియవ శతాబ్దమునాటి నాగరలిపిలో వ్రాయబడియుండెను. శిలపైనుండి జలముకారిపాచి పేరుకొని యుండటచేవర్ణములు పోల్చుకొనవీలుకలుగలేదు. సామంత శూరుని నాగరలిపి శాసననము, గణపతిసేనాని ఇనుగుర్తి శాసనములకంటె నిది ప్రాచీనమని తోచినది. నిచ్చెన, బల్లమొదలగు సౌకర్యములు లభింపకపోవుటచే బ్రతిబింబము తీసికొనజాలనైతిని. మిక్కిలి గొప్ప శాసనము దీని ప్రతిబింబము తీయుటకు కనీసము ఇద్దఱు పరిశోధకులకు ౧౦ దినములు తక్కువగాకుండ బట్టుననుట సత్యము.

హనుమకొండలో సహస్ర స్తంభ మండలములోని శిలాశాసనము ఇదివరకే తీయబడి యుంటచే దానిని విడచినాడను. సిద్ధేశ్వరాలయము అసంపూర్తిది కలదని కొమ్మవరపు సుబ్బారావుగారు చెప్పిరి. పౌరులు చెప్పిరి. దానికొఱకు ఒక పూట వెదకితిమిగాని కనబడదాయెను. పిమ్మట హనుమద్గిరినాధుని యాలయమునందు భద్రకాళి దేవాలయము నందు శాసనములు చూచి ప్రత్యంతరములఁ దీనికొననిశ్చయించితిని. కొండలపై నొకటిరెండు శాసనములు గలవని వింటిమికాని వానిని స్వయముగా నెఱిగిన విద్యార్థులు తమ గ్రామములకు సెలవులలో నేగియుంటచే వరదరాజులు, వేంకటాచలపతిరావు గారల సహాయముతో నేనొందిన శ్రమసార్థకము కాదయ్యెను. పద్మాక్షి జైనదేవత యనుటకు చరిత్రకారులు తృప్తికరములగు సమాధానములు చెప్పియుండలేదు. పింగళి రంగారావు (వకీలు) గారు పూర్వోక్తమిత్రుల సహాయముతో బద్మాక్షి దేవతను దర్శించితిని. ఆలయములలో బశ్చిమ ముఖముగా వరుసగా, ధ్యానముతో గూర్చుండి నటులున్న ఒక జైన విగ్రహము. నిలచినటులున్న జైన దిగంబర విగ్రహము. కూర్చుండినటులున్న ఒక స్త్రీ విగ్రహము (ఈమెయేపద్మాక్షి) ప్రక్కను అసంపూర్ణముగ జెక్కబడిన ధ్యానజైన విగ్రహము వరుసగాగలవు. ప్రక్కనొక శిలపైన జైనవిగ్రహములు మనోహరముగా జిత్రింపబడి యున్నవి. ఇవి ఉత్తర ముఖముగా నున్నవి. వీనినంటి దిగంబర జైన విగ్రహములు కలవు. ఒక వినాయక విగ్రహము గూడ నిందుగలదు. వీనిచే, బద్మాక్షి తప్పక జైనదేవత యని నిరూపింపవచ్చును. ఆలయము ముందున్న ప్రోలరాజు నాటి శాసనము ఇదివరకే ప్రచురిత మగుట చేబ్రత్యంతరము తీయలేదు. పద్మాక్షి సర్వవిధముల

విజయవాడలోని కనకదుర్గా విగ్రహమును బోలియున్నది. మాధవవర్మ యేగిన గుహయని యాలయములోనొక పఱుపురాతిబండc జూపి, గుహమూసి పైఱాయి వేసిరని చెప్పెదరు. కాకతీయుల సత్కారము గొన్న పద్మాక్షికి బ్రణామ మొనరించి కృతార్థులమై బయలువెడలితిమి. పూర్వ శిల్పములు విగ్రహములు, ఆలయములు దర్శించుటకై గ్రామము గుట్టపూర్తిగc దిరిగితిమి. తాళపత్ర గ్రంథములు రెండిండ్లలో గలవట అందులకై పూర్వోక్త మిత్రులసహాయముతో నేగిపరిశోధింపగ గొలది కాలముక్రిందట నూతిలో బారవేసితిమనిరి. ఇటులె వెదకు తరి వరంగల్లు ఖాన్‌సాహెబుతోట వద్దను కటికివాని దొడ్డిలోనను ఖాజీపేటనాకావద్దను శాసనముల జూచి గుర్తు బెట్టుకొంటిమి. కోవూరు భరతయ్యగారెంతకును రాక పోవుటచే భృత్యుని వెంటదీసికొని కరీమునగరముమండలమునకు బయలుదేరినాడను. ముందు ఖాజీపేటనుండి పెద్దపల్లిలైనులో నున్న జమ్మికుంటకుcజేరితిని. అచట గ్రంథాలయము స్థాపించు విషయములో మిగులc బ్రోత్సాహము కలిగించితిని. కొలదికాలములో స్థాపించుటకు దగువీలు జరిగెను. ఆ గ్రామములో నొక శిలాశాసనము శివాలయమున కెడమ చేయి వైపున కలదు. శిలమిగుల గగ్గులతో నిండియుండటచే బైయక్షరములు పోల్చుకొనుటయే మిగులకష్టమయ్యెను. ప్రతిబింబము తీయువిషయములో నొందిన శ్రమ యంతయు వ్యర్థమయ్యెను. తుదకందలి యంశమిటులc బఠింప గలిగితిని:

"స్వస్తిశ్రీ పృథ్వీశవల్లభ మహారాజాధి
రాజపరమేశ్వరి పరమభట్టారక చాళు
క్యాభరణ సత్యాశ్రయకులతిలక శ్రీమ
దాహవ మల్లదేవ ప్రవర్ధమాన విజయ
రాజ్యాభి వృద్ధయే."

ఇంక నాలుగైదు పంక్తులు మాత్రమే వ్రాయుబడియున్నవి. కానియందలి యంశము గ్రాహ్యము కాదయ్యెను. ఇల్లింత కుంటలోనగు చుట్టుపట్టు గ్రామములను గూర్చి విచారించితిని గాని శాసనాదికముల సంగతి తెలియదయ్యెను. పెద్దపల్లికి బోయి యటనుండి వీలువెంట బోవ నిశ్చయించితిని. పెద్దపల్లి ఇంక పదిమైళ్లు దూరమున నున్నదన విశాలము దృఢతరము చారిత్రక స్థలమునగు రామగిరి దుర్గము కానవచ్చెను. కందనమంత్రి, ముప్పరిరాజు, మడికి సింగనకవి లోనగు తద్దుర్గమునకు సంబంధించిన విఖ్యాత చరిత్ర పురుషుల చరిత్రములు జ్ఞాపకమునకు వచ్చెను.

ఆదుర్గమును గూర్చి పెద్దపల్లిలో విచారించితిని. రెండు శాసనములు గలవనియుఁ గొండపై పెద్ద పులులు గలవనియు నరసంచార మిపుడుండదనియు బలువురు తెలిపిరి. పెద్ద పులులు మిగులఁగ్రూరముగ వర్తించుచుంటచే మాకెవరు నచటివారు తోడురామనిరి. విధి లేకయచట కేగుటమానుకొంటిమి. పెద్దపల్లి దొరవారపుడు పట్నము వెళ్లియుండిరి. వారి కుమారులు నాచరిత్ర ఘోషణమువిని యెట్టి ప్రత్యుత్తరముగాని వాక్సహాయముగాని చేయరైరి. ఆ గ్రామమునఁ గొంత పరిశోధనోద్యమముతో దిరుగగా గ్రామములలోని వైదికుల గృహములలో గొన్ని జ్యోతిష వైదిక ధర్మశాస్త్ర గ్రంథములు కానవచ్చెను. నేను చూచి నంతలో అన్నియు ముద్రితములే. ప్రతులు వారొసంగమని చెప్పిరి. అటునుండి మంథెనకు బండివిచారించితిమి గాని పరిశోధనమునకు దోడ్పడఁగల తిరునగరి పాపయ్యశాస్త్రి గారు గ్రామాంతరమేగి యుండిరి. అందుచే మంథెన ప్రయాణముమాని కరీమునగరమునకు బయలుదేరితిమి. మార్గమధ్యమున గర్రెపల్లి అను గ్రామములో శ్రీకృష్ణ శతానందీయమను గ్రంధము లభించెను. అటునుండి సాయంకాలము వరకు కరీంనగరము చేరితిమి.

కరీంనగరములో కలక్టరు కచేరీలో రెండు శాసనములుగలవు. ఒకటి గగ్గుఱాతిమీద పెద్ద క్షతములతోఁ జెక్కబడియున్నది. దానిలో అక్షర చిహ్నము లేమాత్రముగాని కానవచ్చుటలేదు. దానికి బ్రతిరాదయ్యెను. పిమ్మట చెంతనున్న మరియొక శాసనమునకు బ్రతిదీయ నారంభించితిమి. ఇది గొప్ప శాసనము. తెలుఁగు పద్యములలో నిండియుండెను. ప్రథమ రుద్రదేవుని కాలమునొఁడొక సేనానాయకుఁడొ నరించిన ధర్మమించుఁ పేర్కొనఁబడెను. శిలయంత ప్రశస్తమైనదికాదు. ఈ శాసనము అచటికి నాలుగుక్రోసుల దూరమునందున్న నగునూరు దేవాలయమునండఁగా దానిని జాలకాలము క్రిందట నొక మండలాధికారితెప్పించి, తన కార్యస్థానము చెంత బ్రాంతించెను. ఒకటి రెండు చోటులలో దెబ్బతగిలి కొఁబోలు అక్షరములు గలభాగము బెత్తికలు లేచెను. మిగిలిన భాగము బాగుగానేయున్నది.

బహిరంగస్థలములో నీశాసనము పాతఁబడియుంటచె ఆ వేసఁగి గాడ్పులవలన బ్రతితీయుట చాల కష్టసాధ్యమయ్యెను. తీసిన వానిలో నీ శాసనముగొప్పది. ఒక మహమ్మదీయసోదరుఁడు ప్రతిదీయుతరి చేసినసాయము మఱువజాలము. ఈ పరిశోధనోద్యమమున అచటి యువకులెవరు తగుసాయము చేయలేదని తెలుపవలసి

వచ్చినందులకు విచారమగుచున్నది. ఈమధ్య పై భాగమునం దంతటను పూర్వలిపితో నిండియున్న ఒక లోహపుబెట్టె భూమధ్యమునఁ దొరకినట్లు అది కరీమునగర జిల్లా కోర్టులోనికిఁ జేర్పఁబడినటుల విని దానిని చూడవలయునని రెండుదినములు ప్రయత్నించితిని. జిల్లాకచ్చేరి ట్రాన్సులేటరు రామాచారిగారిని విచారింపఁగా వారు మునసబుకోర్టులో విచారింపగా జిల్లాకోర్టులోఁ గలదనిరి. ఈ విషయములో మాతృసేవా పరాయణులగు యువకులెవరు సహాయపడినను సిద్ధసంకల్పుఁడనై ఆ పేటికలోని విశేషములు నివేదించువాఁడనే. ఆంధ్రసంఘమువారీ పెట్టె విషయములోఁ దీవ్రకృషిగావించి, సంపాదించి, యందలి చరిత్రరహస్యములు బహిర్గతముగావించి, మాతృసేవా పునీతులు కాదలంచెదను. అవకాశము తటస్థించిన మఱియొకమారు దానికొఱకై బోయివచ్చెదను. కరీంనగరము చరిత్రస్థలముకాదు. కాని సూర్యగ్రామము దీని పూర్వనామము దాదాపు గ్రామస్థులు మఱచిపోయిరి. ఇటులె మహమ్మదీయ నామాంకిత గ్రామముల పూర్వ నామములు చరిత్రకారులకు గోచరింపకపోవుట చరిత్ర స్మృతికొక లోపమునకతప్పదు.

కరీమునగరములోనివారు కొందరు నగునూరు చరిత్రస్థలమనియు శాసనములు పెక్కు లచటఁగల వనియుఁజెప్పిరి. అచ్చట చిత్రవిచిత్ర శిల్పములతో నిండిన యాలయములుసైతము కలవనివిని యటకుఁ బోతిమి. ఇది నల్లగొండవలె రెండు కొండల ననుసరించి కట్టఁబడినగ్రామము. ఇందుఁగాకతీయుల సేనానాయకుఁడొక డుండి పెక్కు దేవాలయములను గట్టించెను. గ్రామములకు వెలుపల సుందరములగు నాలయము లైదాఱుగలవు. ఇవియన్నియు సర్వాంగ సుందరముగ నుండియుఁ బాడుపడియున్నవి. ధ్వజములు శిలా నిర్మితములై ఉన్నతి యందు దృఢమునందు నద్వితీయములుగ నొప్పుచున్నవి. ఆలయములన్నింటిని నొక్కపూట వెదకితి కాని శాసనములు కానరాలేదు. చెంతనొక వీరాలయముకలదు. దాని ముందు వివిధాయుధహస్తులు సుందరమూర్తులగు పలువురు వీరవేషధారుల విగ్రహములు కలవు. దీని క్రింది వైపు యేమైన వ్రాసియుండవచ్చును గాని, అవియన్నియు తలవరకు నేలలో పూడుకొనిపోయియున్నవి. చెంతనొక శిలపై మూడు వైపుల మూడు విగ్రహములు కలవు. అటగల శాసనభాగమును నగునూరు శాసనమనుపేరుతోఁ జూడగలరు. ఒక దినము గుట్టను శాసనములకు వెదకితిమి. ఫలితాంశములు మధ్య గ్రామములో కొన్ని దేవాలయములు కలవు. అటనట జైన విగ్రహములు,

విగ్రహశకలములు విశేషముగా గాన వచ్చెను. ఇటపూర్వము నాలుగువందల దేవాలయములు కలవనియు బెక్కు దేవళముల నధికారులు పడవేసి యన్యగ్రామములకు శిలలఁదీసికొనిపోయిరని చెప్పిరి. నగునూరునుండి కరీమునగరముమీదుగా వెలిగందలజేరితిమి. ఇది గొప్ప దుర్గముగలచోటు. భాగవతములో గొంత భాగమునువ్రాసిన నారయామాత్యుడీ వెలిగందలకుజేందివాఁడే. కాని ఆ కవినిగూర్చిన ప్రవాదములిచట నేమియులేవు. ఇటవెలిగందల వారను నియోగులు సహితములేరు. పది సంవత్సరముల క్రిందట వేములవాడ భీమకవి నివాసస్థలము విచారింపవచ్చినప్పుడు దుర్గము చెంత నొక శిలాశాసనము జూచితిని. ఇపుడది అదృశ్యమైనది. ఏ యరుగులో ఏ గోడలో తలదాఁచుకొనెనో తెలియదయ్యెను. దీనికొరకై మే మొందినశ్రమ నిష్ఫలమైనది. గ్రామములో రెండుమూడు చోట్ల శాసనములు కలవు కాని యవి ఊరుగు శాసనములు. దుర్గము దృఢ తరముగా దర్శనీయముగానున్నది. వెలిగందల సన్యాసుల వద్ద త్రామశాసనములు గలవని వాంద్ర విచారించితిని గాని సంచారమునకు వెళ్ళియుండిరి. ఇటనుండి "కొద్రుపాక" అనుగ్రామమున కేగితిని. అట నాలయములలో మండపస్థంభముపై గొంచెము వ్రాసియుండెను. అది చరిత్రమునకు సంబంధించినది కాదు, పిమ్మట వేములవాడ జేరితిమి.

వేములవాడ దర్శనీయప్రదేశము. చరిత్ర మీ గ్రామమున నిమిడియున్నది. ఆంధ్రరాజన్యుల త్యాగముచే నీగ్రామమునిత్యము నైశ్వర్యముతోఁదులఁ దూగుచున్నది. దీనిని వేములవాడయని లేములవాడయని నాగరీకులు, లేండాల యేండాలయని యనాగరికులు వ్యవహరించుచున్నారలు. ఇట భీమేశ్వరాలయము మిగులగొప్పది. అందలిలింగము పానవట్టము మిక్కిలి యున్నతముగా బురుషప్రమాణమును మించి యున్నవి. ఆలయము ముందు ముఖమండప నిర్మాణ మత్యాశ్చర్య కరముగనున్నది. పలకలు పలకలుగా బైనిశిలలను గూర్చియెత్తుశిలలతో దీర్పఁబడిన యీ మండప ప్రశస్తినిఁ దెలుపుటకుఁ జాలపుటలు బట్టును ఈయాలయము కెదురుగ బహిరంగస్థలములో నొక శాసనముగలదు. ఇదిచాళుక్య రాజులది శిలయంద ప్రశస్తమైనది కాదు. వర్ణములు సహితము స్ఫుటముగలేవు. ప్రత్యంతరము దీసితిమి ఈ గ్రామమును ప్రసిద్ధుడగు వేములవాడ భీమకవి నివాసస్థానము దక్షుడు యజ్ఞము గావించిన స్థలమగుటచేత క్షేత్రమహాత్మ్యమును బట్టి యీ స్థలమే ద్రాక్షారము. భీమకవి

వరప్రదాత యిచటి భీమేశ్వర మహాదైవతమే. ఈ కవిని గూర్చి మేము సంపాదించిన చరిత్రాంశములు ఆంధ్రసాహిత్య పరిషత్తువారు ప్రకటించిన కవిజనాశ్రయమున జర్చితములై యున్నవి. ఇపుడేమియు నూత నాంశములు దెలియలేదు. రాజేశ్వరాలయ ములో ముందుగ బేర్కొనదగగిన క్షేత్రరాజము గ్రామమున కానుకొని గొప్ప తటాకముగలదు. దాని కట్టపై నొకవిశాల స్థలమేర్పరచియందీ యాలయమును గట్టిరి. తటాకము మధ్య నొకగుండముకలదు. దానిని ధర్మగుండమందురు. దీని సోపానములకు శాసన శిలలను నెలకొల్పిరనియు, ఎండలు బాగుగా గాసినచో నీరింకి శాసనములు బయల్పడునని చెప్పిరి. గుండము నిండ నీరుంటచే శాసన సందర్శనమునకు వీలు కాదయ్యె. తటాకములో నన్నివైపుల జైన విగ్రహములు కలవు. ఎన్నియో విగ్రహములు పూడిపోవుచున్నవి. ఇటనున్న విగ్రహములు కొన్ని పాముపడగ క్రిందనున్నట్లును మరికొన్ని ధ్యాన దృష్టితో నున్నట్లు గానవచ్చును. ముఖద్వారము వద్దను ప్రాకారమునకు లోపలితట్టును గర్భాలయములోనికి బోవుచోటను గూడ జైనవిగ్రహములు వివిధములు వివిధాకృతులు గలవి పెక్కులు గలవు. వీనినిబట్టి చూడ నీదేవళము జైనాలయమేమోయని తలంపనవకాశము గలుగుచున్నది. ఆలయములోనికి బోవుచుండఁ బ్రాకారములో నెడమ చేయివైపొక మహమ్మదీయుని సమాధి కలదు. మహమ్మదీయు లంతవఱకువచ్చి పూజాదులొనర్చుట కలదు. ఇందె విష్ణ్వాలయము కలదు. ఈ రాజేశ్వరాలయములో శూద్రాదులకు శివపాదములకు బదులు పెద్ద పాదరక్షతలపై నుంతురు. ఇట్టియాచార మిచట నేలయేర్పడెనో కారణము విచార్యము.

గర్భాలయమున కెడమవైపు రెండు శాసనములు కలవు. ఒక విశాలమగు శిలపై నొకవైపె వ్రాయఁబడినది. అక్షరములు మిగలుగుంటలుగఁ జెక్కలేదు. పైగ తీర్థసేవకులు తమనూపె చేతులచే డాకులచే శిలపై మడ్డిపట్టినది. చెంతమరయొక శాసనము చాళుక్య రాజునాటిది సంస్కృతశ్లోక మయమగునది కలదు. నాలుగువైపుల వ్రాయబడినది. పశ్చిమచాళుక్యులలో నొకనిచెనిది స్థాపింపబడినది. ఈ శాసనశిలపై దీపారాధన చేయుటచె, నక్షరములు పూడిపోవుట గాక మైనము పైన పేరుకొని శాసనశిలయని సైతము గుర్తింపవీలులేక పోయినది. చాలశ్రమచేసి ఊతిని బాగుగ గీకి గుంటలజెక్కి ప్రతిదీసితిని. ప్రతిచాల బాగుగ వచ్చెను. ఈ చరిత్ర పరిశోధన దృశ్యమును హాస్యముగ భావించి చేయు బ్రాహ్మణ వటువుల దుడుకుతనములు

ప్రభావతీ ప్రద్యుమ్నము ప్రధమాశ్వాసము లోని బ్రాహ్మణ వటువుల దుండగములను మించియున్నవి. సంపన్నులగు గ్రామవాసులీయుద్యమము విలువ నెఱింగియు దమవద్ద గల ప్రాచీనలిఖిత గ్రంధములు చూపమనిరి.

అటనుండి చెంతనున్న నామపల్లి యనుగ్రామమున కేగితిమి. సారంగధర చరిత్రమంతయు నచట జరిగినట్లును, కథాస్థలమచట గలకొండయని పురవాసులు చెప్పిరి. గ్రంధాధారములు లిఖితా దారములు బొత్తిగా లభింపలేదు.

అక్కడి నుండి వెనుకకు మరలి మార్గమధ్యమున వరదవల్లియను గ్రామమున "చిలువపడిగరేని పేరణ" మను శుద్ధాంధ్రకావ్యము, ఒక శతకము, నీరెండు నముద్రిత గ్రంధములు లభించెను.

గణపతి దేవునికాలము నాటిదగు వరంగల్లు కటికవాని యింటిలో శాసనము పూడిసోవత్ర వ్వించి ప్రతిదీసితిని. ఒరంగల్లు ఖిల్లా చెంతనున్న ఖాసాహెబుతోటలోని గణపతిదేవుని శాసనముగూడc ద్రవ్వించి, ప్రతులదీసితిమి, ఈ శాసనము ఆకాలపు సుంకములు దిగుమతివస్తువులు తెలుపుచుంటచే ముఖ్యమైనది. పిమ్మట ఖాజీపేట మడికొండ, ధర్మసాగరము ముప్పవరము, చినపేండేల, నసిగల్లు, చూచుకొని వరంగల్లు చేర నిశ్చయించితిమి. ఆయా చోటులలో శాసనములు కలవని ఒకరిద్దఱు రూఢిగా నెఱింగించిరి.

ధర్మసాగరము పోవుచుముందు మడికొండలో మజిలీ చేసితిమి. ఆ గ్రామములో వానమామలై లక్ష్మణాచార్యుల వారి వద్ద "రామకథాకల్పవల్లి" యను రామాయణము సంస్కృతమునరెండు ప్రతులుగ విభజించి వ్రాయబడినది చూచితిని. గ్రంధము చాల వరకు జీర్ణ దశలోనున్నది. గ్రంధము ఇప్పటికి ఆరువది సంవత్సరముల క్రింద హనుమ కొండలో జీవించి యున్న పండరీనాధ మహాకవిగద్య పద్యాత్మ కముగ చంపూధోరణితో సంస్కృతములో ప్రౌఢముగ రచించెను. ఇంక నీకవిరాజు ఆధ్యాత్మ రామాయణమును పేరుతో రచించెనట గాని ఆ గ్రంధము ప్రకృతము మానుకోటలో నున్న మోతుకూరి కోదండ రామారావుగారి వద్ద గలదు. ఇది తెలుగు పద్య కావ్యము. ప్రౌఢతరమని వినుచున్నాను. దీనిని జూచుటకు వీలుకలుగలేదు. ధర్మసాగరములోని విష్ణ్వాలయము ముందు ఒక శాసనఖండము పడియున్నది. ఆదిమధ్య భాగము. క్రింది పైభాగములు కానరావు. ఉన్నంతలో జూడగాగణపతిదేవుని వాక్యములని, వీరశైవ మత ప్రచారకుcడు, కవివర్యుడు మంత్రియును నగు శివదేవుడు చెప్పిన

విషయము కొంత గలదు. ఇదిపరిశోధనార్హమనుటలో సంశయము లేదు.

ఇటనుండి ముప్పవరము జేరితిని. గ్రామమునకించుక దూరముననొక గుట్టకలదు. గుట్టననుసరించి, గొప్పతటాకము నిర్మింపబడియున్నది. తటాకారంభమున ముప్పడినాధుని గుడియనునొక దేవాలయముకలదు. సర్వాంగ సుందరమగు నీయాలయమిపుడు పూజాపురస్కార శూన్యముగ నున్నది. ఈ యాలయము నంటియున్న గుట్టలను ఇనుపరాతి గుట్టలందురు. ఇందు ఇనుముగల రాళ్లు గలవు. పూర్వము వానినేరి, ఇనుము తీయువారట. ఈ యాచారము నాలుగైదు సంవత్సరముల క్రిందటివరకు గలదుగాని దొరతనమువారు నిషేధించుటచే, నీ ప్రయత్నము ఆగిపోయినటుల చ్యోతికి మగుచున్నది. గుట్టపై నొక శాసనము గలదు. దానిని "ముప్పవర శాసనము" అను పేరుతో గాంచవచ్చును. ఇది కాకతీయుల సేనానాయకులచే స్థాపితము. శిలసవ్యమైనదికాదు. లిపిగూడ సరిగా లేకపోవుటచె ప్రతిశుభ్రముగా రాదయ్యెను. అచటినుండి చినపెండ్యాల చేరితిమి. ఊరిబయటనొక శాసనము మొన్నటివఱకు గలదట. చెఱువునీటికి వంతెనగట్టుచు, దానినిలోపల వేసితిమని గ్రామాధికారిగారు సెలవిచ్చిరి. కొంచెమేని కానఁ బడునేమోయని స్వయముగాఁ బోయి చూచితిని గాని లోదట్టున వేయఁబడుటచేఁ గానరాదయ్యెను.

ఇంచుకదూరములో నున్న నసిగల్లులో శాసనము కలదనిచెప్పిరి. వెంటనే నసిగల్లుకుఁ బ్రయాణమ్తై మండుటెండలో బయలుదేరి నసిగల్లు చేరితిమి. ఆలయములోని మండపస్తంభముపై నొకంద్దఱి పేరులు శ్రీరామనామములు చెక్కఁబడి యుండెను. దీనినే శాసనమని మాకుఁజెప్పిరి. గ్రామములో లిఖిత శిలయే కానరాక పోయెను.

ఒరంగల్లుచేరి ఖాజీపేటనాకా వద్దనున్న శాసనమునకుఁ బ్రతిదీసికొంటిని. అది కాకతీయులలో మిగులఁ బూర్వుడగుఁ మహామండ లేశ్వరత్రిభువన మల్లునిది. శిలకడుగు భాగములేదు గాన శాసనమసమగ్రముగ నుండెను. ఱాతిపై నొకవైపురోలు మఱియొకవైపు పెద్దపగులు నుంటచే ప్రతిచాలశ్రమ మీద ఁదీయఁ గలిగితిని.

ఓరుగంటికి పోయివచ్చుచు ఇతరులు చూచి యెరుంగని ద్వారములపై నున్న శాసనములు మూడు వేంకటేశ్వరాలయములో నున్న దొక శాసనము మఱియొక ఆలయములో నొకశాసనము మొత్తమయిదు శాసనములు తీసితిని. ద్వారముపైఁగలమూఁడు శాసనములలో నొకటి నాగరలిపి. మఱియొకటి క్రొత్తలిపిగ

నున్నది. (ద్రవిడ మేమోనని భ్రాంతి.) ద్రవిడముండc దగని యనకాశములు కానరావు. ఇcకనొకటి తెలుcగు. ఆలయములలో నొకటి ప్రతాపరుద్రునిది. మఱియొకటి పోల్పవీలు కాకున్నది. ఇంతతో నాగక హనుమ కొండకేగి హనుమద్గిరి నాధుని వద్ద భద్రకాళిగుడిలోని మండప శాసనములు ప్రచారములో నుంటచే వానినివిడచి నాcడను. ఆయిన వోలులోని శాసనము చూచితిని అదిపద్మ నాయకుcడగు ఆనపోత నాయకునిది. ఈ శాసనము వేంకటగిరి వంశచరిత్రము సురభి వారివంశ చరిత్రములలోc జక్కcగ ముద్రింపc బడినదగుటచేc బ్రతితీయ లేదు. ఒక శాసనము చెఱువుతూములో బిగించిరి. తీయింప వీలులేకపోయినది. అందుచే దానిని బఠింప వీలులేక పోయినది. తటాకగర్భమున శాసనములు చేరుచున్న వనుటకిదియొక తార్కాణము.

వరంగల్లునకు నాలుగుమైళ్ళ దూరమున కొండిపర్తికి బోవు త్రోవలో cగొండపై నొక శివాలయముc గాcచితిని. ఒక చిన్న గుహలో నలవి మాలిన చక్కని లింగము కలదు. ఎదురుగ నాంజనేయ విగ్రహము చేతితోc గొట్టcబోవుచున్నటులc గలదు. లింగముపై వ్రేలుగుర్తులుగలవు. ఆంజనేయుcడు శ్రీరాముని ప్రతిష్ఠకు నీలింగముగొనిపోవుచు, నొకచోనుంచి దేహధర్మములు దీర్చికొని మఱలcదీసికొని పోcబోవలింగము రాదయ్యెనcట. దానికాతcడు కోపించి చేతికొలది గొట్టcగా వ్రేటుపడెనని చెప్పెదురు. ఈ లింగమునిగనిగ లాడుచు చేతికఱప నంతగొప్పదిగ నున్నది.

కొండిపర్తి వరంగల్లునకు ఎనిమిది మైళ్లదూరములోనున్నది. ఇదియొక చరిత్రస్థలము. గ్రామములో గొప్ప నేలకోట గలదు. కోటలో మోటకుపయోగించు రెండు బావులు నొక సుందరాలయమును కలవు. ప్రకృతము బాడుపడియున్నది ఈ యాలయము కలదు. ఈ యాలయము త్రికూటేశ్వరాలయమని వ్యవహరింపc బడుచున్నది. గుడికిc బశ్చిమమున నొక శాసనముగలదు. చక్కనిలిపిలో సంస్కృత శ్లోకములతో నిండియున్నది. ఒక ప్రక్క ధ్వంసము చేయcబడుటచే, నందలి చరిత్ర విశేషములు దెలియరావు. ఈ శాసనము కాకతీయ రాజన్యుల సేనానాయకుcడును మల్యాలనంశ్యుcడు నగు కోటపతిచే స్థాపింపc బడినటులc దెలియుచున్నది. కాకతీయులయు మల్యాల వంశీయులయుc దెలియు బరాక్రమ జీవితము రీశాసనమునలను విశేషముగ శ్లాఘింపc బడియున్నది. కోటగోడలో నొకదేవళము

పూడ్చి వేయఁబడెను. బహుశా హైందవేతరు లీకోటను నిర్మించుచుఁ ద్రోవకడ్డము వచ్చుటచే నాలయమును గోటలోఁబెట్టి గోడకట్టి యుంచురేవో ఇపుడా గోడభిన్నమగుటచే గోటలోని యాలయము కానవచ్చుచున్నది. కోటలోని నాలుగు బురుజులలో నొకటి యొక్క శిలమండపముపైఁ గట్టుఁబడినది. బురుజు తొలగించినను, కోటగోడతీసినను చరిత్రాంశము లాయా ప్రదేశములలో లభింపవచ్చును. చెఱువుకట్ట పోయుచు గూడకట్టక్రింద జేర్చినొక యాలయము నెవరో పూర్వులు పూడ్చిరి. పైనుండి యిటీవలి వారొక కలుగువేసి దేవళనముకు ద్రోవయేర్పఱచుటచే నాలయమును జూడవీలు చిక్కినది.

గ్రామము మధ్య పూర్తిగా జీర్ణమైన యొకదేవాలయము కలదు. ఇందలి శిలలన్నియు నితరప్రదేశములకు జేర్పఁబడెను. ఈ ప్రదేశమున నొకశిలా శాసనము కలదు. ఇదికొలదిఁ చోటుల భ్రష్టమైనను మిగిలిన స్థలములోఁబఠింపనను కూలముగనున్నది. శాసనగ్రంథము శ్లోకరూపకముగ నున్నది. ఇందు దుర్జయవంశములో జనించిన చౌండసేనానిచే నాచరింపబడిన దానాదులు పేర్కొనఁబడెను. దుర్జయవంశములో పెదముత్తగండడు, సజ్జసేనాపతి, కాటయసేనానాయకుఁడు క్రమముగ జనించిరి. వానిపుత్రులగు పోతరాజు చౌండసేనానులలో గడపటివాఁడీ శాసనకర్త. చౌండసేనాని, చౌండ సముద్రమను తటాకమున చౌండేశ్వరాలయము నెలకొల్పి శా.శ. ౧౧౧౩ అనగాఁ, క్రీ.శ. ౧౧౮౧ లో నీశాసనము వేయించెను. కాకతీయ గణపతిదేవుని రాజ్యకాలమున నీచౌండ సేనానాయకుఁడు సుప్రసిద్ధుడై యాహవములందు విజయములను గడించి పేరొందినటుల దెలియవచ్చుచున్నది.

గ్రామమునంటి యున్న తటాకమును దర్శనీయమైనది. తటాకమునకు నలుగెలంకుల వివిధ విగ్రహములు కలవు. కొన్ని జైనవిగ్రహములు వీరవిగ్రహములు, శ్రీరామాది దైవతవిగ్రహములు కలవు. ఇందు వీర విగ్రహములు కలవు. వీరులు నిజఖరాసితో తమకంఠములు ఖండించు కొనుచున్నటులా విగ్రహముల యందుఁగలదు. గ్రామమున కరిష్టములు గలిగినపుడు తమకుఁ దామబలియగు జాతియొకటి కాకతీయుల రాజ్యమునఁ గలదు. వారిలో శరచ్ఛేదకు లొకరు వీరిగూర్చి శివదేవుని మల్కాపుర శాసనములోఁ గొలఁదిగఁ జెప్పఁబడి యున్నది. అట్టి విగ్రహములే తటాకములోఁ బలుతావులఁ గాన వచ్చుచున్నవి. గ్రామములోవి విష్ణ్వాలయ మునందు

సుందరమైన శేషశాయి శ్రీరంగనాయక విగ్రహము దశావతారసంయుక్తమైన లక్ష్మీనృసింహ విగ్రహముగలదు. తటాకమున నొకగండ శిలపై పెద్దయక్షర ములతో నేదియో వ్రాసియుండెను గాని యాప్రదేశము జలావృతమై యుంట విషయము గ్రహింప వీలుచిక్కలేదు. గ్రామములో బూర్వ శిల్పకళ నుద్బోధించు సుందర విగ్రహములు పెక్కు చోటల గానవచ్చుచున్నవి. ఇది (కొండపర్తి) కాకతీయుల సేనానాయకున కొకనికి ముఖ్యపట్టణముగా నుండియా తని వితరణాతి శయముచే మహైశ్వర్యమును గడించెనని నిశ్చయింపవచ్చును. ఈ గ్రామమునకు సమీపమునఁ గల దిబ్బలుగుట్టలు గుహలు గాంచినచో నింకేమేని చరిత్ర రహస్యములు లభించవచ్చును. గ్రామస్తులకు ఎలవేని శేషములున్నవో, తెలియకపోవుటచేఁ బరిశోధకుడు సంకుచితకార్యుడగు చున్నాడు.

ఇనుగుర్తిలోనొక శాసనమున్నటుల దెలియవచ్చియటకు బైనమైపోతిమి. ప్రాఁతకోటలో గోడలోనిముద్పబడియున్న ఈ శిలాశాసనమును అధికారుల సహాయముతో చాలకాలము క్రిందట పద్ధిరాజు సీతారామ చంద్రరావుగారు తెప్పించి గ్రామ మధ్యముననున్న విష్ణ్వాలయమునందు వేయించిరి. ఇది నాగరలిపిలో నున్నది. లిపివిస్పష్టముగ నున్నది కాని కొన్ని చోటుల బెత్తికలు లేచుటచే వర్ణములు కొన్ని భ్రష్టములైనవి. కాకతీయ రుద్రదేవుని కాలములో నీశాసనము నెలకొల్పఁబడెను. రుద్రదేవుని సేనానాయకులును నతవాటి సీమా పరిపాలకులును అగు నొక సీమనాయకుని దానమిందులిఖంపబడియున్నది. బేతక్షూణిపాలకుడు దుగ్గభూపతి బుద్ధక్షోణీపతిలోనగు వీరులనామము లిందుగలవు. వీరలుచరిత్రములలో గానరారు. ఇందలి బుద్ధక్షోణి విభునకు రంగనాథ రామాయణమునకు సంబంధించిన బుద్ధవిభునకేదేని సంబంధము కలదేమో విచారింపవలసియున్నది. కోట గోడలోని ముద్పబడిన శాసన శిలాశకలము నొక దానిని దీయించి ప్రతిదీసితిమి. అదికాకతీయ రుద్రదేవుని కాలమునాటిది. మఱియొకచో బురుజులోనిముద్ప బడిన శాసన శిలాశకలము వేరొండుగావచ్చెను. ఎంత ప్రయత్నము చేసినను దానిని క్రిందఁ బడవేయసాధ్యము కాకపోవుటచే విధిలేక మానుకొంటిమి.

జియ్యరుస్వామియను నొకసాతాని వైష్ణవుని గృహమున గల కల్వముపై కొన్ని వర్ణములు గలవని విని యచటికేగితిమి. పరిశోధింపగా నదియొక శాసనశిలా ఖండమని తేలెను. ఒకవైపుగుంట కొట్టబడియుండెను. మిగిలిన మూడువైపుల

వర్ణములుంటచే బ్రతితీసికొంటిని. శాసనశిలల విలువ తెలియక పలువురు పలువిధముల భగ్నము గావించుచున్నారనుట కిది యొక నిదర్శనము. రోలున కోఖల్వమునకో అరుగునకో శిలగావలసినవారు శాసన శిలలందెచ్చి యుపయోగించుట నేనుకనులారఁ బలతావులఁ గాంచి యున్నాఁడను. ఇనుగుర్తిచెంత గల కొంగల క్రొత్తపల్లిలోనొక వైష్ణవుడు తనతండ్రి శ్మశాన వాటిక చెంతనొక శాసనశిలను గుర్తుకొరకు బ్రాతిపెట్టించెను. ఇట్టియక్రమములు శాసన విషయములో దెలిసికొన్న చోటుల దెలియక కొన్నిచోటుల జరుగుచున్నవి. సదాశివరెడ్డి దొరగారి మెదకుజల్లాశాసనముల జాబితావలన అచటశాసనము లెటుల దర్వినియోగమవు చున్నది తెలియుచున్నది. వరంగల్లు కాశీబుగ్గ చెంత రెండు మూడు సంవత్సరముల క్రిందవరకొక చక్కని శిలాశాసనముగలదట. అది ప్రాతినస్థలముగూడ గానవచ్చుచున్నది. కాని శిలాశాసనము మాత్రమదృశ్యమయినది. దానిఁగూర్చి చెప్పువారులేరు. ఇటులే కాళేశ్వరములో నొక శాసనశిలమండపముపై కప్పుగ నుపయోగించిరట. అందొక భాగముమాత్రము కాననచ్చుచున్నది. ఇల్లింద కుంటయనుచోట నాంజనేయునకు చుట్టుప్రక్కలగల శాసనములు నాలిగింటిని అనుపయోగములని భావించి పునాదిలో బ్రాతివేసిరట. ఈవిధముగా శాసనములు పెక్కులు రూపుమాపి పోవుచున్నవి. ఇంకను యనుగుర్తిని గురించి చెప్పవలసినది పూర్తి కాలేదు.

ఊరిబైటనొక చెరువుకలదు. దానిని గుండి చెరువని వ్యవహరింతురు. దానిచెంత నొకచిన్న గుట్టగలదు ఆ పర్వతగుహలో నొకదిగంబర విగ్రహముగలదు. దానిముఖశిలపై నొక చిన్న శాసనముగలదు. కాకతీయ ప్రోలరాజు ఇనుగుర్తిలో జలంధర భైరవుని బ్రతిష్టించినటులందుగలదు. భైరవప్రతిష్ఠలకు గాకతీయులకు జిరకాలసంబంధము కలదనియు బ్రోలరాజు జైనశైవమతముల సమదృష్టితో గౌరవించెననియు విస్పష్టముగ నీచిన్నిశాసనమువలన సువ్యక్తముకాగలదు.

ఇనుగుర్తిలో నూరిబైట నొకచోట ధ్యానజైన విగ్రహముగలదు. దినినటనున్నవారు దక్షిణామూర్తి యని వ్యవహరింతురు. గ్రామమునకన్ని దిశలయందు శక్తివిగ్రహములు కలవు. వానివాని మహాత్మ్యములను గురించి కొన్ని కొన్ని కథలు జనపరంపరలు చెప్పుకొనుచున్నవి. అందు జరిత్రాంశములేమిచే వదలితిమి. గ్రామమునకు నలు గెలంకులయందు జక్కని విగ్రహములు పెక్కులుగలవు. వేరువేరుగ జాలవిగ్రహముల

సందర్శించితిని. గుండి చెరువుక్రింద నొకానొకచో గొన్నివీరవిగ్రహములుకలవు. వివిధములగు నాయుధములు పట్టుకొని ప్రాచీన రాజకీయ వేషములతో నచ్చున గ్రుద్దినటుల మనోహరములగు విన్యాసములతో నిండియున్న ఈవిగ్రహముల చక్కదనము పూర్వపు టాంధ్రరాజుల యాకారముల నుద్బోధించుచున్నది. విగ్రహములు చెల్లాచెదరుగా పలుదిక్కుల బడియున్నవి. పూర్వము ఇనుగుర్తి పాలించు రాచవారికి పద్మనాయకులలో నుత్తముడు రేచెర్ల శ్రోత్రీయుఁడు రాచకొండ దుర్గపాలకుఁడగు అనపోతనాయకునకు గొప్ప సంగ్రామము జరిగెను. అకదవమున మరణించిన వీరపురుషుల స్మారక చిహ్నాములుగ నీవిగ్రహములు నెలకొల్పబడెనేమోవీని నలన నాంధ్రజాతీయత కొలఁగనో గొప్పగనో వెల్లడికాకపోదు.

ఇంతలో ఒరంగల్లులో నొకచోట ప్రాచీన పుస్తకములు గలవనియు చుట్టుపట్టుల శాసములు గల వనియు రమ్మని టి.వరదరాజులుగారు వర్తమానము చేసిరి. వెళ్ళితిమి. రామానుజ విజయ సుధారసమనుపద్య కావ్యము పరకాలలో నొక వైష్ణవుని యొద్ద నున్నటుల దెలసికొని దాని నిచ్చునటుల నొక చేయుత్తరము దీసికొని వరదరాజులగారి వద్ద దానిని నిలుపచేయవలసినదిగా జెప్పితిని. వొరంగల్లులోని జీర్ణాలయములు కొన్ని శాసనముల కొఱకు వెదకితిమి. “మొగిలి చెర్ల”యను గ్రామము వొరంగల్లునకు నాలుగు మైళ్ళదూరములోనున్నది. కాకతీయ రుద్రదేవి యీ గ్రామమునందలి ఏకవీరాదేవియను దేవతకు భక్తురాలై తదాలయమునకు బలుమారు రాకపోకలు చేసినటలు స్థానిక చరిత్రములో ప్రకటించియున్నారము. ఇక్కతన మొగిలిచెర్లను గూర్చి నిజాంరాష్ట్ర ప్రశంసలో మేము ఏకవీరా దేవియేల్పడిలోనున్న ముగిలిదిర్లయే చరిత్రమునసులేదు. అని చెప్పియున్నారము. ఇటేకవీరాదేవి మూలమము చెంతశాసనము గలదని చెప్పిరి. వెంటదీబయలుదేరియటకు బూర్వోక్తమిత్రులతో నేగితిని. మొగిలి చర్లలో బ్రాచీనాల గుడులు కొన్ని గలవు. అన్నింటిని జూచి యేకవీరాదేవి దేవాలయమున కేగితిమి. కాకతీయులచేత వర్ణింపబడిన యేక వీరాదేవి యాదేవళమున లేదు. ఆ విగ్రహమును యేదుండుగలో స్థానమునుండి తొలగించి విధ్వంసము గావించిరి. అందుచే బురవాసులు చెంత బడియున్నయొక గ్రామశక్తి విగ్రహమును దెచ్చి యాస్థానమున చేర్చిరి. ఆలయము నందెచటను శాసనము కానరాదయ్యెను. ఆలయము ముందు కొన్ని గండశిలలు కలవు. దానితో మనుష్యుడు కూర్చుండ దగినంత గుంటలుగా దొరువబడెను. ఆలయముతోబాటు చిరకాలము

క్రింద ద్రవ్వబడిన యొక బావి చెంతగలదు. దానినిర్మాణముక్రమము గంగబుగ్గబావులను సర్వవిధముల బోలి యున్నది. ఆటనుండి గ్రామశక్తి గుడికేగి చూచితిమి. అటవీరవిగ్రహములు రెండువరుసలుగా జేర్చబడియున్నవి. శాసములులేవు. మాలపోచిమ్మ వద్ద సహితము విచారించిమి. చెంత నున్న వార విచారింపగా గొంతకాలము క్రిందివరకు ఏకవీరాదేవి యాలయము చెంత శాసనము కలదనియు నిపుడది యేమైనదియు తెలియదని చెప్పిరి. మొగిలి చర్లకొఱ కొందిన శ్రమ విఫలమయినది.

మఱునాఁడు వరంగల్లుచేరఁగా 3 మైళ్ల దూరములోనున్న పైడిపల్లి దేవాలయమున శాసనము కలదనియు, దానుఁజూచితివనియు దేశాయిపేట పట్వారీ గారు చెప్పిరి. అక్కడకునేగి గ్రామముగుట్ట దేవాలయములు వెదకితిని. పూర్వాలయముకలదు గాని యటనేమియు శాసనము లేదు. పిమ్మట వరంగల్లు చేరి విచాంపఁగా తూమురంగము (వకర్) గారి యింటిలోఁ బ్రాచీనపుస్తకములు కలవని విని వారికీ యుద్యమమునివేదింపఁగ తమయింటిలోనున్న ప్రాచీనపత్రములు పెట్టెలు వెదకి ప్రతాపచరిత్రము కనపడలేదు. కొలదికాలములోఁ బంపుదుమని చెప్పి వేల్పుకొండ (జఫరుగడ) పాలించిన క్రౌర్యశీలుఁడగు ధంసాచరిత్రము వచనకావ్యమునొసంగిరి. ఇది ప్రౌఢముగఁ జరిత్రానుకూలముగనున్నది. ఇందు వేల్పుకొండను గూర్చిన చరిత్రాంశములు. పిమ్మట...... భాషయు బ్రౌధముగనున్నది. గ్రంధకర్త పేరు తెలియరాదు.

నీలగిరి పత్రికాసంపాదకుల చెంత నుండి యముద్రితలిఖితగ్రంధము నొక దానినిఁ దెప్పించితిని. ఇందుగల గ్రంధభాగములు 1. యాదగిరి నృసింహశతకము, కందపద్యములు, కవిత ప్రౌఢముగ అంత్యనియమబద్ధముగ భక్తిరసోద్బోధక ముగనున్నది. మరిగంటి సింగరాచార్యులురచించిన అబ్దులు కరీం కచ్చేరి వర్ణనము, ఉత్పలమాల. "చౌర్యములు" అను శీర్షికతో బైకవి తనయాస్థి దొంగిలించిన చోరులగాధ యిందుగలదు. ఈ రెండు చాటుపద్యములు తెగకుఁ జేరినవి. మఱియొక గ్రంధము మరిగంటి సింగరాచార్యకృతమగు నిరోష్ఠ్య సీతాకళ్యాణము. ఇది శుద్ధాంధ్రనిరోష్ఠ్య నియమములతో రచింపఁబడియున్నది. ఈ కవి రచించిన దశరధశాజనందన చారిత్రము మాత్రము కవుల చరిత్రమునఁగలదు. ఇది నూతనగ్రంధము ఈ కవి తెలుగు భాషలో నుత్తమ గ్రంధములు పెక్కులువ్రాసెను. అవి చాలువఱకు గానవచ్చుట

లేదు. కవి నిజాము రాష్ట్రములోని దేవకొండసీమనివాసి. కవిప్రతిజ్ఞా వాక్యముగ "తెలుఁగు నిరోష్ట్యపుంగృతి యిదేమతితక్కఁగ యిప్పటంథులం గలుగదు." ఇట్లు చెప్పియున్నాఁడు. ఇది మూడాశ్వాసముల గ్రంథము. ఇంతియగాక, అశ్వారాయచరిత్ర మను నొక ప్రాచీన ప్రబంధము సిరిపురము (నైజాము)లో నున్నదని భృత్యునిబంపితిని గాని ఆదిగల భట్టుమూర్తి సంచారమేగియుంటచే ప్రతి లభింపదాయెను. బేతాళచరిత్రమను ద్విపదకావ్యము నొకదానిని సంపాదించితిని. ఇది ద్విపదశైలిలో రేచర్లవంశీయుఁడు గణపతిదేవుని సేనానాయకుఁడు వీరవర్యుడు. నిజాం రాష్ట్రములోని సూర్యాపేట తాలూకా అమనగల్లు పురవాస్తవ్యుఁడునగు బేతాళనాయకుని చారిత్రము. దీని గ్రంధకర్త ఒక విశ్వబ్రాహ్మణుడు. పిల్లలమర్రిని వాసి. దీనికి మాతృక సంస్కృత కావ్యమునగల కృత్యాదిలోగలదు. ఈ చరిత్ర గ్రంధము భాషాలోకమున ద్వరలో వ్యాపింపఁదగినది.

ఒరంగల్లు నుండి చేసిన పరిశోధనములో సర్వ విధముల సాయపడిన మ.రా.శ్రీ వరదరాజులుగారికి, దేవులపల్లి వేంకటాచలపతిరావుగారికి, పి.కోటయ్యగారికి నా కృతజ్ఞత తెలుపుకొనుచు నివేదిక విరమించుచున్నాఁడ.

– శారద సం.2-6, పుటలు 695-705 మార్చి 1925.

౨౪. విస్మృతక్షేత్రము - పానుగల్లు

పానుగల్లు అని నంతనే చరిత్రపాఠకులకు బహమ నీరాజ్యమునకు సంబంధించిన మహమ్మదీయుని పాలనములో నున్న పానుగల్లు జ్ఞాపకమునకు వచ్చుట సహజము. కాని మేము చెప్పబోవు పానుగల్లు మరియొకటి. ఈ క్షేత్రము నిజామురాష్ట్రములోని నల్లగొండకు మూడు మైళ్ళదూరము నందున్నది. ఒకానొక కాలమున నీపానుగల్లుపురము ఒక రాజశాఖకు రాజధానిగా నుండి యమితభోగము ననుభవించెను. కాల మహత్వము వలన నిప్పటికి జీర్ణచిహ్నాములు మాత్రము కని పించుచున్నవి. చరిత్ర పరిశోధనమునకు నేగి రెండేండ్ల క్రిందట మే మీక్షేత్రమును ఆశ్రమలీమ సదృష్టులతో సందర్శించితిమి. దిఙ్మాత్రము నిచటగల చరిత్ర చిహ్నాముల, శిల్పములు, చరిత్రాంశములు, నివేదించి పాఠకులకు విసుగు జనింపకముందె వ్యాసమునకు స్వస్థి జెప్పెదము.

పానుగల్లిపుడు ఏడెనిమిదివందల గృహములతో నొక పల్లెటూరి వలె గనుపించుచున్నది. గ్రామమునిండ గానవచ్చు విగ్రహశకలములు– వీరవిగ్రహములు– ఆలయస్తంభములు–పాటెదిబ్బలు–అపరిచితున కీ ప్రదేశము ఆంధ్రదేశచరిత్రములో గొన్ని ప్రకరణములేని యాక్రమింపదగిన పుణ్యభూమియని తోపకపోదు. గ్రామమునకు రెండుమూడు క్రోసులదూరమెటు చూచిన శిథిల దేవాలయములు తటాకములు విగ్రహములు గృహచిహ్నాములు గానవచ్చు చున్నది. అందందుగల దిగుడు భావులకు గూపములకు లెక్కయే లేదు. పురబహిర్భాగమున నెచట నేవిశేషముగ గలదో పౌరులెరుంగరు. పెక్కుచోటుల శాసనములు గలవని చెప్పెదరు. భూమి పెరుగుటచే తను శిలలు ఆలయములు భూగర్భమున నిమిడి పోవుటచేతను మేముసలిపిన పరిశ్రమవలన పానుగల్లు సంపూర్ణ చరిత్రమునకుగావలసినంత చరిత్ర సాధనము లభింపలేదు. ఇటులని మేము నిరుత్సాహ మొందక చూచినవి విశేషములు నివేదించదము.

గ్రామముచెంతనొక గొప్పతటటాకము గలదు. దీని నుదయ సముద్రమని ప్రజలు వ్యవహరించుచున్నారు. తటాకము చాలగొప్పదియు మిగులబూర్వకాలమున నెలకొల్పబడినదియు నైయున్నది. ఈ తటాకము చోళరాజులలో నొకడగు ఉదయరాజు స్థాపించెను. గ్రామమున బదియవ శతాబ్దము నాటిచోళులయు చాళుక్యులయు

శాసనములు పెక్కులు కలవు. కాకతీయులనాటి శాసనములలో నీయుదయసముద్రము దాహరింపబడినది. కాకతీయ ప్రథమరుద్రదేవుని కాలమున నొక చోడుడు గలడు. బహుశః యీ తటాకస్థాపకుడు, ఒక కాలమున నీనగరపాలకుడు నాతడే యైయొండెనేని తటాకనిర్మాణము పదియవ శతాబ్దమున నైయుండెననుట నిక్కము. తటాకముపై నొకశాసనము గలదు. కొంత భాగమ పార్సీలోను మఱికొంత తెలుఁగు భాషలోను అందు వ్రాయఁబడియున్నది. ఆంధ్రభాషా భాగముమాత్రము ప్రకృతము దహరించుచున్నారము.

"స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శక వరుషంబులు ౧౪౯౨ అగునేటి ప్రమాది సంవత్సర మాఘ శు.౧౫ సోమవారం॥ శ్రీమన్ మహామండలేశ్వర యిభుబా హింకుతు బుశరాజ్యము చేయంగాను వారిమన్ననసభికుందు సయిదు సాదాతు సయిదు శహామీరుకు పుణ్యముగాను ఆయన నిజహితుఁడు వివేకభూషణుడు మన్నన తేజోనిధి అయిన రవంజిరామతుల్లాగారు పానుగంటి ఉదయ సముద్రము కాలువయందు పుకలసీమమిలేవద్దముసియేటికత్తువ ఖిలమయి వుండంగాను పునరోద్ధారకముగాను కత్తువ గండికాలువ శేయించి ఆడిగ నీళ్లు కృష్ణగామిని చేయించిన మిలేకత్తువ మొదలుకొని కృష్ణ యీ మధ్య చెఱువులు గుంటలు కాలువలోనించి యిందుల ఫలపడ్డదసబంధము పానుగంటి క్రింద నడిపెను. ఆచంద్రార్కంగా యీ పుదయసముద్రం వెనుక పాళ్ళవివరము. రాజుకు పాలు౧ప్రజకుపాలుంనర ౧౪ంతురకలకు బ్రాహ్మలకు పాళ్ళు రెండు ౨ యీచొప్పున ఆచంద్రార్కస్థాయిగా ఇస్తిమి. ఈ ధర్మం ప్రతిపాలించిన వారికి యెంతేని పుణ్యం॥" ఈ శాసనమువలన నాలుగువందల సంవత్సరములక్రితమే ఉదయ సముద్రము పురాతన తటాకముగ నుండెననియు నింతకు బూర్వకాలమునుండి ముసియేటికాలువ యీచెరువులోనికి వచ్చుచుండెననియు దెలియును. ఈ శాసనమువలన అలుగు కాలువ వలని జలాధార సస్యములకు గూడ సుంకము సిస్తు విధింపబడుచుండెననియు ధర్మాదాయములు బ్రాహ్మణులకు మహమ్మదీయులతో సమానముగానాకాలపు మహమ్మదీయులిచ్చు చుండిరనియు దెలియుచున్నది. మహమ్మదీయ రాజన్యులనాటి ఆయకట్టు (Irriga-tion) గ్రహించుటకీ శాసనము తోడ్పాటుగా గలదు. తటాకమధ్య మందు నీటికొలత (water level) తెలుపునొక శిలగలదు. అందు సంవత్సరమునకు సరిపడు జలము ప్రత్యేకించి పంటలకు గానలయు జలములకు బరిమితి చూపబడినది. ఇంకను

మఱికొన్ని గుర్తులాశిలపైగలవు. కాని నానియుపయోగము మఱచిపోవుటచే విశషాంశము లూహింప వీలులేదు. ఇది మన ప్రాచీన నాగరికమునకొకగుర్తు.

ఈ తటాకముతూమునకు జాయగాభ్రాగభి ముఖముగ నొకదేవాలయము గలదు. దాని యందు రెండు శాసనములుకలవు ఛాయా సోమేశ్వరాలయమనియా దేవళమును వ్యవహరింతురు. ఆలయమునకు ముందొక కొలను గలదు. చుట్టును దేవళమునకు దృఢమగు ప్రాకారములు దానికిమూడు ద్వారములు గలవు. ప్రహరిననుసరించికొన్ని దేవళములు గలవుగాని ప్రకృతమని ఖిలమై యున్నవి. ప్రధానాలయము పొక్కటిరాళ్లవల్ల మూడాలయములగలిపి ముందొక ముఖ మండపముఁ జేర్చి మనోహరముగ గట్టబడి యున్నది. ఈ మూడాలయములు త్రిమూర్తులకు జెందినటులూహింప గొన్నియవ కాశములు గలవు. తూర్పుముఖముగనున్న యాలయమును గూర్చి కొంచెము చెప్పవలసి యున్నది. ఇందలి లింగము నడుములోతు నీటిలో నున్నది. ఎదురుగానున్న కొలనునకు గర్భాలయము నందలి యీజలమునకు సంబంధ మున్నటుల తోచుచున్నది. ఇటనున్న యీజలముప్రవహించుచున్నటులఁ దెలిసికొనవచ్చును. కాని యెటకీజలము చేరుచున్నదో గ్రహింప వీలులేదు. ఇదిగాక మఱియొక చిత్రముగలదు.

తూర్పుదిశ కభిముఖముగనున్న యీ యాలయమున కెదురుగ నింకొక దేవళము గలదు. ఆదేవళమునకు నీదేవళమునకుమధ్య కొలదినగంతరాళము గలదు. శిల్పవిశేష ముచే జలమునందున్న లింగమున కానుకొని గర్భాలయమున దీర్ఘమగు నల్లనినీడ యొకటి పగలంతయు నొకేచోట కదలక కానవచ్చుచున్నది. ఈ నీడసూర్యోదయము సూర్యాస్తమానము వఱకు నొకేరీతిగఁ జలింపక యొక చోటనే గానవచ్చుట వింతగా దోపకపోదు. ఈనీడను బట్టియే యీదేవునికి ఛాయాసోమేశ్వరుడని పేరు వచ్చినది. పాశ్చాత్యశిల్పులు ప్రకృతి శాస్త్రజ్ఞులు నీ నీడను గూర్చి తెలిసి కొనజాలక విఫల మనోరథులై వెడలి నటుల వినియున్నారము. ఈ నీడకు సంబంధించిన శిల్పమును మేమొకవిధముగా దెలిసికొంటిమి. కాని దానినిటఁ జర్చించిన వ్యాసవిస్తరమగునని వదలు చున్నారము. ఇటగల రెండు శాసనములలో నొకటి యాదవరాజులది. శాసనస్థాపకుడగు శార్జ్గపాణిదేవ మహారాయలు మిగులబరాక్రమశాలి. వీరపురుషుడు. వివిధ బిరుదాభి రాముఁడు. ఇతడుగణపతిదేవ చక్రవర్తి కుమార్తె యగురుద్రమ దేవి కాలమున నున్నాడు. తనవంశమును గూర్చి

"రాజాన్వయో భూయసి యాదవానాం।
వంశేమహాన్నన్న తవాన్విభూతి॥"

అని చెప్పు కొనుట జేయాదవవంశమా కాలమున క్షత్రియవంశముగా గౌరవింపబడి నటులూహింపవచ్చును. ఇంతియగాకయీ శాసనమున గణపతి దేవునకు రుద్రమదేవి కుమార్తెయని–

"శ్రీగణపత్యధీశః స్ఫురజ్జయః శ్రీమతి
రుద్రభూపతీ తదాత్మజేకుర్వతిరాజ్యమున్నతిం"

ఈ శ్లోకమువలన స్పష్టముకాగలదు. ఇందుదాహరింపబడిన రుద్రరాజే రుద్రమ దేవియనుట నిశ్చయము. ఈ శాసనములోని యాదవవంశములో గూటస్థుడు బిల్లమదేవుడు. అతని పుత్రుడు జేతుగదేవుడు, వానికొడుకు సింగభూపతి. వీనికుమారుడే ప్రౌఢప్రతాప వీరబిరుదాంకితుడగు శార్జ్ఞపాణి దేవుడు. ఇతడు ఛాయాసోమేశ్వరునకు పండ్రెండు నివర్తనముల భూమిని ఉదయసముద్రము వెనుక గలసారవంతమగుచోట దానము గావించెను. శార్జ్ఞపాణి దేవుడు పానుగంటి రాజ్యమునకు రుద్రమదేవి పక్షమున రాజప్రతినిధిగ నుండె ననియు నితడు దేవగిరియాదవ శాఖాసంబంధియనియు దెలియుటచే రుద్రమ దేవికాలమున దేవగిరియాదవు లందందు రాజప్రతినిధులు గానున్నటుల దెలియును.

మఱియొక శాసనములో రుద్రమదేవి సేనానాయకుడగు (తంత్రపాలుడు) మల్లినాయడు ఉదయాదిత్య సముద్రము వెనుకకొంత భూమి నీసోమనాథునకు దానమిచ్చి నటుల గలదు. ఉదయ సముద్రమునకె రుద్రమదేవి కాలమున అనగా రమారమి ఏడువందల సంవత్సరములక్రింద ఉదయోదిత్య సముద్రమని పేరుంటచేత నాతటాక స్థాపకుఁడు ఉదయాదిత్యుడని తెలియును. ఇతడు ఉదయాదిత్యమను కర్ణాట అలంకార గ్రంథము నకు గర్తృత్వమునొందినవాడో మఱియొకడొ విచారింప వలసియున్నది. ఈ యాలయ మున ముఖ్యముగా నాంధ్రశిల్ప శోధకులు గమనింపదగినది లింగమునంటి యున్న ఛాయ. ఇదియె చిత్రాతి చిత్రము.

గ్రామమున కానుకొని జీర్ణమైన యొక శివాలయము గలదు. అందలి శిల్పమువర్ణనా తీతము. కాకతీయశిల్పానుసారముగ ఆలయ ద్వారమునం దేనుగులు గలవు. ఆలయములో మూడునాలుగంత ర్భాగములు కలవు. లోపలి మండప స్తంభముల నిండ శివలీలలు, విష్ణులీలలు దేవదానవ సంగ్రామములువిరివిగ లిఖింప

బడియున్నది. ద్వారశాఖలపై జిత్రింపబడిన లతావళులు విగ్రహములు చాళుక్యులనాగరకతను శిల్పశక్తిని వేయినోళ్ల శ్లాఘించుచున్నది. ఈ జీర్ణాలయములోని శిల్పమునకు హనుమకొండలలోని రుద్రదేవుని యాలయము, రామప్ప దేవాలయము, గణపురము దేవాలయము, తీసికట్టుగ జెప్పుట సాహసముకాదు. నల్లరాళ్లపై జెక్కబడిన యా విగ్రహములు; వీరవిహార దృశ్యములు, నందీశ్వరుని సుందరరూపము, ఆంధ్ర శిల్పమునకు బలమావధియనుటలో నాశ్చర్యములేదు. ఆలయములోని విగ్రహములు చాలవఱకు పగుల గొట్టబడినవి. గోపురమంతయు గూల్పబడెను. ఆలయములోని శిల్పవిగ్రహ శకలములు చుట్టు మైలు దూరమువఱకు వెదజల్లబడి యున్నవి. ఈ యాలయమున చాళుక్యత్రిభువన మల్లుని శాసనమొకటి కలదు. అదియడ్డముగా బడియుండుట చేజాలభాగమరిగిపోయినది. అందు ఎగుమతి దిగుమతి సరకులకు పన్నుగా దేవాదాయమేర్పరుప బడియున్నది. శిలగొప్పది యగుటచేతను బొరిలింప వీలులేక పోవుటచే తను అందుగల చరిత్రరహస్యము గ్రహింప వీలుకాదయ్యెను.

ఈ యాలయమునకు సమీపమునఁగల తురకల గోరీవద్దపూర్తిగా భూమిలోఁ బూడిపోయిన యొక శాసనముగలదు. దీనిపై భాగము విరుగగొట్టబడి యొక గోరీకి శిఖరముగా ఇంచుక మార్పుతో నేర్పాటు చేయబడినది. ఇందు శా.శ.౧౨౧౨ (క్రీ.శ.౧౨౮౦) కుమారరుద్రదేవుని దానము పేర్కొనబడెను. కుమార రుద్రదేవుడు తప్పక ద్వితీయ ప్రతాపరుద్ర చక్రవర్తియై యుండును. నేలలోఁబాతుకొనిపోయిన శాసన శిల చక్కని లిపిలో నున్నది. అందింతవఱకు బ్రకటింపబడని చరిత్రాంశములు కలవు. ఆశాసన శిలత్రవ్వింప బ్రయత్నించితిమిగాని మండలాధికారి యాజ్ఞ లేనిది గోరీల వద్ద హిందువులెట్టిపనిచేయరాదని రాజశాసనముంటచే నీవిషయమున పని జేయలేకపోతిమి. బయటికి గానవచ్చినంత వఱకు బరిశీలింపఁగా "మైలాంబిక భీమరాజనందను డగు తాండక్షితీశుఁడు, చోడ భీమ నారాయణుడు లోనగురాజుల రాజపత్నుల నామములు గోచరించెను. శాసనము శ్లోకమయముగ నున్నది. ఇందలి చరిత్రాంశ మెంత కాలము భూగర్భముననిదురబోవలసియున్నదో తెలియరాకున్నది. అందలి రాజుల నామములు చరిత్రములలో నింతవఱకు జేరలేదు.

గ్రామములో గలసి యొక విష్ణాలయముగలదు. అది జీర్ణాలయములోని శిలలతో గట్టబడినటుల దోచుచున్నది. అందలి శిల్పములొక కట్టుబాటులో లేవు. ఎంతదూరముగ నాలోచించినను ఆ దేవళము నాలుగు వందల సంవత్సరముల కీవల నిర్మింపబడినటుల నిశ్చితమగును. ఆలయపు గోడలో నొక శాసనశిల

యిమిడ్చబడియున్నది. దానిలోని కొంతభాగము గోడలో గలసిపోయినదిగాన అందలి చరిత్రాంశములు గ్రహించుట యసాధ్యము. తెలిసినంతలో జరిత్రాంశము నుదాహరించు చున్నారము.

"శ్రీస్వస్తిసమస్త భువనాశ్రయ శ్రీపృధ్వీవల్లభదేవ సత్యాశ్రయకుల తిలక చాళుక్యాభరణ శ్రీమత్‌భువనమల్ల దేవశ్రీ మల్యాణపు రీస్థిర నిజవిజయస్కంధావార తైలపదేవా ఖ్యాత్ శ్రీమహామండలేశ్వర భీమ"

ఈ శాసన భాగమువలన పానుగల్లు ప్రదేశము కొంతకాలము పశ్చిమ చాళుక్యులగు కళ్యాణ పురాధీశ్వరులు చోడరాజులు పిదప కాకతీయులు పాలించిరని తెలియును. గ్రామముచుట్టు లెక్కలేనన్ని జీర్ణాలయముల చిహ్నాములు వీరవిగ్రహములు మండపస్తంభములు కోనేరులు కోటలు బురుజు గుర్తులు శిల్పిచిత్రములు కానవచ్చుచున్నవి. శాసనములెచటనున్నవి గ్రామవాస్తవ్యులెరుగరు. ఇందులకై ప్రత్యేక కృషి చేసినగాని చరిత్రాంశము విస్పష్టముగా దెలియదు. పరిశోధకునకీ గ్రామమున గొన్ని మాసములపని చిక్కును. చరిత్రబంధములు పెక్కులిచటి శాసన సహాయమున విప్పవీలు చిక్కును.

ఆంధ్రదేశము నందంతటను జెప్పబడు బాలనాగమ్మకథ కీ పానుగల్లే జన్మస్థానము. బాలవద్దిరాజు మాయలపకీరు నల్లగొండపటము యివియన్నియు పానుగంటికి సంబంధించినవే? పానుగంటిలోని శిల్పములు చరిత్రాంశములు తెలిసికొనుటకు నిజాము రాష్ట్రీయులగు నాంధ్రులుకాని దొరతనమువారు గాని పూనుకొనకుండుట సంతాపకరము.

1923 మే నెలలో పరిశోధనమునకు బయలుదేరినపుడు మాకువలయు సౌకర్యము లొనగూర్చి మావెంటనుండి పానుగంటిలోని చరిత్ర దృశ్యముల దృష్టిదీర జూపి శ్రమయనక మమ్మనుసరించిన నీలగిరి పత్రికా సంపాదకులకు మాగృతజ్ఞత దెలుపుచున్నారము. నిజాము రాష్ట్రము నిట్టి చరిత్రస్థలము లూరుపేరు లేకుండుటచేతనే ఆంధ్రులచరిత్రల సముగ్రముగ నుండవలసిన గతి పట్టినది.

– శారద సం.2–2. పుటలు 185–189 అక్టోబర్ 1924

25. విరాటరాజు గద్దె

వరంగల్లు మండలములోని కంభముమెట్టునకు పంద్రెండు మైళ్ల దూరములో నేలకొండ పల్లెయగు గ్రామముగలదు. ఇది చాలప్రసిద్ధకరము. ఇందలి విశేషములకు విరాటరాజునకు ముడిబెట్ట గ్రామవాసులు భారతములో చెప్పఁబడిన విరాటమహారాజు రాజధానియనియు గ్రామము బైట నున్నదిబ్బ విరాటరాజు సింహాసనముండు చోటనియుఁ దలఁచుగా వ్యవహరింతురు. అది విరాటరాజు నగరమని కనకబండి గట్టయ్యయను కవి హరిశ్చంద్ర ద్విపదలోఁబేర్కొనినాఁడు. సుప్రసిద్ధ రామభక్తుఁడగు రామదాసు ఈ గ్రామవాసియని యైతిహ్యమేగాక రామదాసు చరిత్రమునందుఁగూడఁ జెప్పబడియున్నది. ఇట గల గ్రంధాలయమునకు విరాటరాయ గ్రంధనిలయమని పేరుబెట్టబడియున్నది.

విరాటరాజు గద్దెయనునది గ్రామమునకు అరమైలు దూరముననున్న విశాలము ఉన్నతమునగు ఇటుకరాళ్ళదిబ్బ. దిబ్బకొకప్రక్క పాలరాళ్లతోనున్న ద్వారమును మేము చిరకాలము క్రిందఁ జూచినటుల జ్ఞాపకముగలదు. దిబ్బనిండ మిగుల వెడల్పు మందముగల ఇటుకరాళ్ళు మాత్రము గోచరించును. చుట్టుపట్టుల పాలరాతి శకలములు స్ఫటిక శిలాశకములు కనఁబడుచున్నవి. చెంతనున్న యొకచెఱువులో నివి ధములగు గాజుముక్కలు గనఁబడును. అవి పూర్వకాలమునాఁటి పరిశ్రమకుఁ దార్కాణము గానున్నవి. ఈప్రదేశముననే కొన్ని బౌద్ధవిగ్రహములు దొరకఁగా దొరతనమువారు గొని పోయిరని స్థానికులు చెప్పిరి. సమీపమునందలి గుట్టలు భిక్షుక నివాసమునకుఁ దగినటుల నేర్పాటు చేయఁబడియున్నవి. వీనిని సమన్వయించి చూడగ విరాటరాజు గద్దె బౌద్ధ స్థూపమని విశ్వసించుటకుఁజాలినన్ని ఆధారములు గోచరించుచున్నవి. ఘంటసాల గుడివాడ గుంటుపల్లి సుప్రసిద్ధములగు బౌద్ధక్షేత్రములు. విజయవాడ (బెజవాడ) గూడ బౌద్ధక్షేత్రమె. బౌద్ధకాలము నాటి గుహలు కొన్ని యచటఁగలవు. సమీప మునఁగల ఉండవల్లి బౌద్ధమతసంబంధముగలదే. అమరావతి ప్రశస్తి బౌద్ధయుగమున నాప్రదేశమునందలి దీపాలదిన్నె విశ్వవిద్యాలయముగా నుండి యెంతప్రసిద్ధి పడసినది మనమెఱుంగని యంశముగాదు. బెజవాడ నుండి హైదరాబాదునకు బోవు రోడ్డుపక్కన కొంచెము తొలగించినచో అల్లూరను గ్రామముగలదు. ఇటను బౌద్ధస్థూపము కొన్ని బౌద్ధవిగ్రహములు ఒక పాళిశాసనము

కొనుగొనబడినది. నందిగామ చెంత రామిరెడ్డిపల్లెలో ఈ సంవత్సరమొక బౌద్ధస్తూపము సర్వాంగ సుందరమయినది త్రవ్వితీయబడినది. ఆకృతిలోఁ జిన్నదయినను సర్వవిధముల అమరావతి స్థూపశిలలతో శిల్పవిన్యాసముననిది తులతూగుచున్నది. జగ్గయ్యపేటలోఁ జరకాలము క్రిందనే గ్రామసమీపముననఁగల కొండపై నొక స్థూపము కనిపెట్టబడినది. జగ్గయ్యపేట సమీపముననున్న పొలసానిపల్లెయు లింగగిరియు బౌద్ధ సంప్రదాయములకుఁ చెందినవనియు పొలసానిపల్లె చెంతగల జైనపాడను భాగము జైనులకుఁ జెందినదనియుఁ బాశ్చాత్య పరిశోధకులు వ్రాసియున్నారు. నీ దృక్పదమింతతో వెనుకకు మఱలినది. ఇంకఁగొంచెము ముందునకుఁబోయినచో నైజామునవారి పాలనలోనున్న బుద్ధామువల్ల 29 గ్రామములు బౌద్ధ యుగమునకు సంబంధించినవి. బుద్ధాము పూర్తిగ బౌద్ధనివాసస్థానమె. ఇటనెంతయో పరిశోధనము జరుగవలసియున్నది. నేలకొండపల్లి యీచేరువలోని గ్రామము. పూర్వమిది మహానగరము. ఇపుడొకపల్లెగా మాఱినది. గ్రామము బైట గల దిబ్బ ఆకృతి బౌద్ధస్తూపమును సర్వవిధములఁబోలియున్నది. సమీపముననఁగల యిటుక బునాదుల వరుసలు బౌద్ధమందిరనిర్మాణక్రమమును సూచించుచున్నవి. ఇందలి ఇటుకలు చాలవఱకు గృహనిర్మాణమున కిటీవల వారుపయోగించుకొనిరని వినగల్గినందులకుఁ జింతించెదము. స్తూపములోని యిటుకలవలె నిర్మాణమునందును విశాలమునందును వర్ణమునందును నేలకొండపల్లె విరాటరాజు గద్దెలోని యిటుకలు గనుపించుచున్నవి. కొన్ని యిటుకలు మహబూబునగరములోని గంగాపురములోని స్తూపమునందలి యిటుకలవలె శిల్పవిన్యాసములతో నలరుటఁజూడ విరాటరాజు గద్దె బౌద్ధ స్తూపమని చెప్పదగియున్నది. సమీపతటాకమునందు గానఁబడునట్టి గాజుముక్కలు కుటింబినులు బౌద్ధ బిక్షుకు రాంద్రగునపుడు గావించిన త్యాగమునకుఁ దార్కాణములని మాతలంపు. తరువాత నీతటాక ప్రదేశము నూతన వైథవ్యమున కంకణ చ్ఛేదనము గావించు స్థలముగా మారియుఁడును. కావుననే యిచట వివిధములగు గాజులు కాలక్రమము దెలుపునవి లభించుచున్నవి. ఈ ప్రాంతములలో మాకుఁకొన్ని నాణెములు లభించినవి. అవి ధరణికోట స్తూప ప్రాంతము నందు లభించిన సత్తునాణెములఁబోలియున్నవి. పంద్రెండు సంవత్సరములక్రిందట మేమొక పాళిశాసనమును బావికి తాగాణిగాఁ జూచినాము, ఈ శాసనశిల యిపుడు కనిపించుటలేదు. ఇనిన్నటిని సమన్వయించెదమేని విరాటరాజు గద్దె గొప్ప బౌద్ధస్తూపమనుట కెట్టి సంశయము

కలుగదు. పూర్వము కాల్యాణనగరము మొదలు రామేశ్వరమువఱకు రాజమార్గమొకటి యుండియుండుననియు మార్గమునకుఁజేరువలో బౌద్ధ విహారములు స్తూపములు కట్టబడియుండుననియు పూర్వోక్తసందర్భములను బట్టి యూహింపవచ్చును. నిజామురాష్ట్రమునఁ బలుతావుల బౌద్ధస్తూపములుగలవు. గాని వానివిలువ తెలియక ప్రజలు దుర్వినియోగముచేయుచున్నారనుటకు విచారము కలుగుచున్నది. ముందు వ్రాయనున్న "గంగాపురస్తూపములు" అను వ్యాసమువలన నీయంశము విస్పష్టము కాగలదు.

దేశీయ చరిత్రములకు సాధనములనఁదగు స్తూపముల విషయములో నిజాము దొరతనము వారు శ్రద్ధ తీసికొని త్వరలోఁ బరిశోధనకులచేఁ బనిచేయించుట అవసరము. లేకున్నచో బౌద్ధయుగమునకు సంబంధించిన చరిత్ర మెంతయో మాటు మణగి సంపూర్ణమగును. విద్యాధికులగు యువకులు పూర్వ చరిత్ర చిహ్నముల విలువ ప్రజలకు బోధించి వానికెట్టి యపాయములు కలుగకుండునటులఁగా పాతంట ధర్మము. కాలమహిమచే మాటుపడియున్న నేలకొండపల్లి స్తూపమునుండి చరిత్రమునకు సంబంధించిన యపూర్వ రహస్యములెన్ని బహిర్గత మగునో చూడ వేడుకపడుచున్నారము.

– ఆంధ్రభారతి **(1.11.1927)**

౨౬. నేలకొండపల్లి

ఉత్తరగోగ్రహణమునాటి ముచ్చటలు

ఖమ్మము మెట్టుకు దక్షిణముగా నున్న రోడ్డుపై ౧౨వ మైలుననున్నది. గ్రామములో ప్రవేశించుటకు బూర్వము తటాకమొకటి గాననగును. రోడ్డునకు బ్రక్కన 'గాడుబావి' యని పిలువబడు నొక పురాతనపు బావి యున్నది. దీని నీరు మిగుల నారోగ్యమైనదిగ వచింపుచు నూరిలోని వారెల్ల మంచితీర్థమున కుపయోగింతురు అట్టి బావులు పమ్మి, రాజేశ్వర పురము మొదలగు సమీప గ్రామములయందు గూడ గలవు. ఇచ్చటివారీ బావిని గుఱించి "గాడుబావి పయఃపానం, వేణు(రాజ)గోపాల దర్శనం, కొండపల్లి నివాసంచ, త్రయంత్రైలోక్య దుర్లభం" అను శ్లోకముననుశృతముగ వాకొనుచున్నారు. దీనికి పడమరగా సమీపమున నొక మట్టికోట శిథిలావస్థ యందున్నది. పూర్వమీకొటయందు వెలమవారుండి, యీ ప్రాంతములకు దొరతనము చేయుచుండిరట. ప్రస్తుత మావంశము నామావశేషమై "కంకిపాటి" వారను నియోగి వ్యాపారుల దొరతనమున నున్నది. గ్రామమధ్య రోడ్డుపై నొక పెద్దరాతి ద్వారమును, పక్కన రెండు చిన్న ద్వారములును నుండి, నిన్న నేడు ప్రక్క ద్వారములు పడిపోయిన చిహ్నములు మాత్రము కనబడుచున్నవి. ఇట్టిద్వార మింకొకటి యాగ్నేయమూల సుమారు రెండుమైళ్ల దూరములో నున్నది. దానికి సమీపముగ "విరాట రాజుగద్దె" యని పిలువబడు ఒక యెత్తుమట్టి దిబ్బగలదు. దానియందు త్రవ్వినప్పుడు కొన్ని పెద్ద యిటుకరాళ్లు మాత్రము బయట పడినవని చెప్పుచున్నారు. ఆ ప్రదేశమును ద్రవ్వించినచో చరిత్రా ప్రశస్తి ప్రబోధ పదార్థములు గానరాగలవను నమ్మిక గలదు. అచటికి దక్షిణము గానగా నూరికి దూర్పున నొక చిన్న అప్పయ నృసింహ స్వామాలయమును గలదు. ప్రక్క నొక చిన్న యేటికి బందముకట్టి బంట కుపయోగించుచున్నారు. ఆ బందము పూర్వకాలపు సున్నపు బనిచే మోటుగనున్నను, మిగుల బలముగలిగి చెక్కు చెదరకున్నది. ఆ ప్రక్కను "కీచకుల గుండ" మని చెప్పబడు నొక పల్లముగలదు. అజ్ఞాతవాసమున భీముడు వధించిన కీచకుల నీస్థలమున బూడ్చి వేసిరని ప్రజలనుకొనుచుందురు. పూర్వమీ పల్లము మిగుల లోతుగలదయ్యు, నేటికి భూమట్టము వఱకు బూడియున్నది. సమీపమున గచ్చుతో గట్టబడి సుమారు ఏడెనిమిది

గజముల పొడవును, ఒక గజము వెడల్పును గల గాడియున్నది. దీనిని "భీముని ప్రొయ్యి" యని పిల్చుచున్నారు. వంటలవాడైన భీముడీ ప్రొయ్యియందు, అజ్ఞాత వాసమున నలుడుగా వండినట్లు చెప్పుదురు. ఇంకను దూర్పు రెండు క్రోసుల దూరముననున్న బాణా పురమున ధర్మరాజాదులు విరటుని గొల్వ వచ్చుచు బాణము లుంచిరనియు, అందుచే నాటినుండి బాణా పురమను పేర బిలువబడుచున్నదనియు, ఉత్తరమున గ్రోసెడు దూరమునగల గోకినేపల్లియందు అర్జునుడుత్తర గోగ్రహణమున గోవుల మరల్చెననియు, దీనికి సమీపమున గువ్వల గూడెము కడ శత్రువులు గుంపులు గూడిరనియును, ముజ్జగూడెమునం దిరుకక్షలవారును ముచ్చట లాడిరనియును భారత కథానుగుణ్యముగా గొప్ప జనశృతి గలదు. ఇందులకు సాదృశ్యముగా గ్రామ మధ్యమునగల ఉత్తరీశ్వర స్వామి యాలయమును గట్టించి యందలి శివలింగమును దనపేరుతో విరాటుని కొడుకగు నుత్తరుడు ప్రతిష్ఠించినాడనియు, అది ప్రబల దృష్టాంతర మనియు, నందుల కానుగుణ్యముగా బైనవాకొనబడిన విరాటరాజు గద్దెయనునది విరటుడు సింహాసన మధిష్టించు కొలవుకూట ప్రదేశమనియు నమ్ముచున్నారు. కాని చరిత్రకారులీ యాధారములే విశ్వసింప నవకాశమగుట లేదు. యథార్ధమును గనుగొనుటకీ యుపకరణములు చాలవు.

గ్రామమునకు మధ్య "విరాటయాంధ్ర భాషానిలయ" మను పేర నొక గ్రంథాలయము గలదు. ఈ భాండారమునకు బెంకుటిల్లు గలదు. ప్రస్తుత మంతరువు పడియున్నను బూర్వమున నిదియు గొంత ప్రచారమున నున్నదియే. గ్రామస్తులకు దీనియందే మాత్రము అభిమానమున్నటుల లేదు. గండ్లూరి శ్రీరామరావుగారను నొక వకీలుగారు దీని కార్యదర్శిగానున్నారు. వారెంతయో యభిమానము గలవారు. కాని పురజనుల ప్రోత్సాహము లేకుండుటయు, ద్రవ్యాభావము గలుగుటయు గారణములుగా వీరేపనియు నొనర్చ చాలకున్నారు. గ్రామమునకు వెలుపలనున్న శాసనముల రెంటిని గొనివచ్చి కార్యదర్శిగారీ గ్రంథాలయపు ద్వారమున కిరువైపుల బాతి యుంచిరి. మేమారెంటి ప్రతిబింబముల దీసికొంటిమి.

మఱునాడా గ్రామమునగల తాళపత్ర గ్రంథముల శోధించితిమి కాని యవి వైదిక సంబంధ గ్రంథములగుట నెంతగా నుపయోగింపవయ్యెను. పెండ్యాల కృష్ణయ్యగారి యింట "జాతక రత్నాకరి" మనునొక పద్యకావ్యము లభించెను. కేవల రాంహజారీయనువారు తాము పాల్వంచ తాలూకాలో నొకరికడనున్న గ్రంథమునకు

ప్రతి వ్రాసికొనిన "ప్రతాపరుద్ర చరిత్ర" మను వచన గ్రంథమును, నల్లగొండ మండలమునగల శాసనాదికముల గ్రామముల దొరతనముల వెల్లడించునట్టి పూర్వపు గాగితముల గొన్నిటి నొసంగిరి.

ఉత్తరునిచే ప్రతిష్ఠింపబడినదగు జనశృతిగల యుత్తరేశ్వరుని యాలయము గ్రామమునకు మధ్య భాగమున నున్నది. ఇది మిగుల పురాతన కాలమున గట్టించినది. సున్నపు బనియేమాత్రమును లేక రాతికి రాయి తాపడము చేయబడియున్నది. పూజాదులు జరుగుచు మంచి స్థితియందున్నది. ఈ యాలయమునకు సమీపముగానొక విష్ణ్వాలయమున్నది. ఇది కొలదికాలము క్రిందట గట్టింపబడినది. దీనియందు సాయంకాలమున బ్రాహ్మణ యువకులెల్లరును జేరి భజన చేయుచుందురు.

గ్రామమునకు నుత్తరమున రెండు పెద్ద రావిచెట్లున్నవి. ఒక చెట్టున కరుగ మర్పబడి యాంజనేయు నాయరుగుపై నిలువబెట్టిరి. ఆంజనేయుని ప్రక్కగా నొకటి రెండు లింగములు గూడ గలవు. ప్రక్కనున్న రెండవచెట్టు క్రింద శిథిలమై పడిపోయిన గోడలు గల గ్రామశక్తుల గుళ్లున్నవి. అశ్వత్థ వృక్షములు మిక్కిలి లావుగలిగి తమ వృద్ధ దశను వెల్లడించుచున్నవి. చెఱువు కట్టపై పురాతనమైన నింబ వృక్షమొకటి యున్నది. అది పురాతన కాలము నుండి యాస్థితియందే యున్నదని యచ్చటి వయోవృద్ధు లెఱింగించి యున్నారు.

శాసన శిలలు గలవని తెలిపిన ప్రదేశములకు వెళ్లి, ఎంతో కష్టముతో బాగుచేయించి పరీక్షించగా నవి యన్నియు శాసనములు గాక పొలిమేర రాళ్లే యగుట శ్రమయే మిగిలెను.

- గోలకొండ పత్రిక (7.4.1928)

27. రామగిరి దుర్గము

మడికి సింగన మహాకవి

రామగిరి దుర్గము కరీంనగరములోనున్న ప్రశస్త దుర్గములలోఁ బ్రథమ గణనీయము. శైలవిస్తృతియుఁ గోటఁగోడ పొంకము అందలి జలాశయములయు, దేవాలయములయు, రాజమందిర శిధిలములయు నిర్మాణవైఖరి చూడనిమ్మహాదుర్గము పైననె నగరరాజముండుననియుఁ బూర్వరాజులలోఁ జాళుక్యులు, రాష్ట్రకూటులు, కాకతీయులు వీని నాశ్రయించి వీరి రక్త వాహినులఁ బ్రహింపఁ జేసిరనియుఁ దోఁచును. ఇపుడిది దుర్గమంబయి అరణ్యముబలిసి క్రూరసత్త్వాశ్రయమై యుంటచేఁ జరిత్ర జిజ్ఞాసువుల కగమ్యముగనున్నది. మడికి సింగనకవి యీ దుర్గ పాలకుని, మంత్రిని నాశ్రయించి వాఙ్మయ జీవితమును గడపెను. సింగన్న గ్రంథములఁబట్టి రామగిరి రాజధాని చరిత్రము మంత్రుల యౌదార్యము కొంతవఱకేవి తెలిసికొన నవకాశము లభించుచున్నది. ఇతని గ్రంథరాజములు పద్మపురాణము, భాగవత ద్విపద జ్ఞానవాసిష్ఠ రామాయణము సకల నీతి సమ్మతము. కందన మంత్రి తారావళియని తెలియుచున్నది. సింగన్న వంశక్రమము బరికింతము.

ఇతఁడు భారద్వాజ గోత్రుఁడు. భారతము వ్రాసిన తిక్కన సోమయాజి పుత్రుఁడగు కొమ్మమంత్రి కుమార్తె యగు చిట్టాంబిక భర్తయగు అల్లాడ మంత్రికి మనుమఁడు. ఈ యల్లాడ మంత్రి ధరణికోట సీమలోని రావెల యగ్రహారముకు అధిపతి. అల్లాడ మంత్రి కుమారుఁడు అయ్యలమంత్రి. ఇతఁడు రాజమహేంద్రవరము పాలించు తొయ్యేటి అనపోత భూపతికి మంత్రియై గోదావరి చంతగల మడిగిలో వృత్తులు గడించెను. అయ్యల మంత్రి కుమారుఁడు సింగనకవి. ఈ సింగనకవి వేఁగి దేశమునుండి రామగిరి పాలించు ముప్ప భూపతి యాశ్రయమునకు వచ్చి అటఁ బెక్కు వృత్తులు, గ్రామములు పొంది తన విజ్ఞాన నానిష్ఠమున నిట్లు చెప్పినాడు–

ఆ మహావిభుచేత రామాద్రి సీమఁ
బెక్కు వృత్తులు గ్రామముల్ వెలయఁగాంచి
యతని యాశ్రితులందెల్ల నధికుఁడనఁగఁ
జతురుఁడన ధన్యుఁడన సజనన్నవాడ.

కూనయ ముప్ప నృపాలుని
మానుండగు తెలుఁగు విభుని సుందరి మల్లాం
బానందనుఁడగు ముప్పది
భూనాథుని సుకవివరుఁడ బుధసన్నుతుఁడ౯.

(ముప్పది) ముప్ప భూపాలుని గూర్చి పద్మ పురాణములో "విభవవిలాస విక్రమ విజయ విఖ్యాతులం బ్రసిద్ధుండగు ముప్ప భూపాలుఁడు... సబ్బినాటి రాష్ట్రంబున రామగిరి పట్టణంబు నిజరాజధానిగఁ బురంధర విభవుండై రాజ్యంబు చేయుచు నిరునెత్తు గండగోపాల, కాంచీ రక్షపాలక, చోడరాజ్య స్థాపనాచార్య, దొంతి మన్నియవిభాల, గండగజగంధవారణ, రాయగజకేసరి, మూరురాయజగదాళాది నానా బిరుద విఖ్యాతుఁడును, అనవరత దానశీలుఁడు" అని ప్రశంసింపఁబడినాఁడు. ఈ బిరుదక్రమముజూడ ముప్పవిభుఁడు కకసేనానాయకుల వంశములోనివాఁడనియుఁ దన పూర్వుల బిరుదములఁ దాల్చినవాఁడనియుఁ దోచును. శా॥ శ॥ ౧౩౪౨న పద్మపురాణము సింగన ముగించెను గాన ముప్పభూపాలుఁడుగూడ నప్పటివాఁడు. ప్రతాపరుద్రదేవుని యనంతరము దాదాపు నూఱేండ్ల తరువాత నుండియుండెను. ముప్ప భూపాలుని పూర్వులను జ్ఞానవాసిష్ఠమున సింగన పేర్కొనెను. కూనయ, ముప్పనృపతి, తెలుగురాయలు వీరలలోఁ దెలుఁగు రాయలతో మూడు తరములు చెప్పెఁగాని వారి పదవులు, బిరుదములు చెప్పలేదు. వారలఁగూర్చిన విశేషములు గ్రంథాంతరములందును దెలియరావు. కూనయ, ముప్ప నృపతి పేరులతోఁ గొన్ని గ్రామములు మాత్రము రామగిరి ప్రాంతమునఁగలవు. కూనయ కాకతీయులకడ సేనానాయకుఁడై బిరుదములు గడించెననియు నవి కృతులలోఁ జివరవాని వఱకు సంక్రమించెననియు నూహింపవచ్చును. తెలుఁగు రాయలు సంబురాయల కొడుకుగా వేఱొకఁడు గన్పట్టుచున్నాఁడు. అతఁడే శ్రీనాథకవిచేఁ గస్తూరికొఱకుఁ బ్రశంసింపబడెను. ఈ తెలుఁగురాయఁడు ముప్పరాజు కొడుకు గాన నితఁడు వేఱు. ఐనను సమకాలికలే. ముప్పరాజు ఇంటిపేరు గురిజాలవారు.

సింగనచేఁ బద్మపురాణము వ్రాయించినవాఁడు కందన మంత్రి. ఇతని పూర్తి పేరు వెలిగందలామాత్యుఁడు. వెలిగందల సుప్రసిద్ధ నృసింహ క్షేత్రము. కానసే కందన మంత్రి వెలిగందల అను గ్రామనామము తొలుతఁ బెట్టియుందురు. ధర్మపురి, మట్టుపల్లి, యాదగిరి, అర్వపల్లిలోనగు గ్రామనామములు స్థానిక దేవతల ప్రాబల్యము

బట్టి వ్యక్తులకుఁ బెట్టుటచూచుచున్నారు. కందనమంత్రి నటులె వెలిగందల యను గ్రామనామముగలవాఁడు. వెలిగందల కాకతి గణపతిదేవుని నాటి ప్రసిద్ధ నృసింహ క్షేత్రముగా నుండెనని అటఁగల చింతామణి చెఱువుకడఁగల శాసనమువలనఁదెలియును. ఔరంగజేబు దండయాత్రతో దాని పూర్వరూపము తొలఁగినది. కందనమంత్రి వాణసవంశములోనివాఁడు. గోత్రము కాశ్యపము. ఈ వంశమున మొదటివాఁడు ములుగూరుప్రభువు రుద్రమంత్రి. రెండవతరము నన్నయ. ఇతడు కాకతి గణపతిదేవునకు మంత్రి. ములుగూరులో గణపేశ్వరుని గోపాలుని ప్రతిష్ఠఁగావించెను. ములుగూరు పడమటిగవనియందు రుద్ర సముద్రము గాడిబావియు నెలకొల్పెను. మూడవ తరము మల్లన, నాలుగవతరము గణపతి, ఐదవతరము అబ్బన ప్రసిద్ధ కార్యము లొనర్చినటులఁ జెప్పలేదు. ఆరవ తరమున కేశవ కందనమంత్రియుఁ బ్రసిద్ధులు. కేశవమంత్రి ముప్పరాజుకడ అమాత్య పదవి గడించి రామగిరిలో కేశవాలయము గట్టించెను. ధర్మపురిలో నృసింహునకు ఉత్సవములఁ జేయించెను. కేశవాలయమున సువర్ణకుంభము లెత్తించెను. కేశవ మంత్రి యనంతరము కందన ముప్పరాజుకడ మంత్రియై మడికి సింగనను మన్నించి, కృతులు వ్రాయించి ప్రసిద్ధినొందెను. తరువాత నీ వంశమునుగూర్చి తెలియుటలేదు. సింగన కందన మంత్రిపేర కందములతో తారావళియు, సీసపద్య శతకమును రచించెను. అందలి కొన్ని పద్యములు సకల నీతిసమ్మతమున నుదాహరించుఁగొనెను. కందనమంత్రి భారతము వ్రాయుటలో నన్నయ్య భట్టునకుఁ దోడ్పడిన నారాయణ భట్టువలె వాణసవంశజుఁడగుట గమనింపఁదగును. కందనమంత్రి పూర్వులు వసించిన ములుగూరు పేరు చెందినదుర్గరాజము. ఇప్పుడు మొలంగూరు అను పేర వ్యవహరింపఁబడుచు కరీంనగరము జిల్లాలోనున్నది. చాళుక్య పద్ధతితోఁగట్టఁబడిన గొప్ప దుర్గము ఇట దర్శనీయము. నన్నయ కట్టించినవానిలో దేవళములు రూపుమాసినవి. గాడిబావియు రుద్రసముద్రము నేఁటివఱకు నిలిచినవి. దుర్గమును క్రిందిభాగము పెంచి మహమ్మదీయులు కొంతకాలము పాలించిరి. చారిత్రక ప్రశస్తి గల దుర్గరాజమునఁగల శాసనములు ధ్వంసము చేయబడినవి. మతోన్మాదులు చేయని దుండగములేవి? రామగిరిని ఇతర దుర్గముల తోఁబాటు కూలి కుతుబుషా ఆక్రమించుకొని తన రాజ్యమునఁగలుపుకొనెను. కాళిదాసుఁడు మేగదూతములోఁ బేర్కొన్న రామగిరి ఇదియేకావచ్చును అని ప్రభాకరశాస్త్రి గారి యభిప్రాయము.

దానికుపపత్తులుగూడఁజూపిరి. మహమ్మదీయులకు జాగీరుగా నీ దుర్గము పరిసర దేశములిచ్చుటతో హైందవశిల్పమంతయు నాశనము గావింపఁబడెను. ఇటనున్న సుందర విగ్రహములు హైదరాబాదులోని నవాబుల యంతఃపురములకు వలసపోయెను. రామాయణ కాలమున రాముఁడు సీత నివసించుటచే రామగిరియని పేరు వచ్చినటులఁ బ్రజలు చెప్పికొందురు. ఇప్పుడు యవనులు దీనికి ఆరాముగిరి యను నపభ్రంశనామమును బ్రసాదించిరి. స్వాతంత్ర్యము లభించిన పిమ్మట గూడ నీ దుర్గ విశేషములు గనుగొనవలయునను కోరిక దేశీయులకుదయింపలేదు. ఆర్షశాఖవారి దృష్టిగూడఁ బడలేదు. వాఙ్మయముతో శిల్పకళతో వాస్తు శాస్త్రముతో ఆంధ్రుల నిర్మాణకౌశలముతోఁ బేరుగొన్న రామగిరి దుర్గమునఁ జరిత్రమునకెక్కని మూగ యితిహాసమెంత యిమిడియున్నదో! సంవత్సరమున కొక్క పర్యాయము అచటి యాలయమున జరుగు ఉత్సవములలో సమీప గ్రామములవారు దుర్గరాజమున కెక్కుదురఁట. అపుడైన చరిత్ర ప్రియులు యాత్ర సాగించినచో అజ్ఞాత చరిత్రము ఎంతేని లభించుట కవకాశముగలదు. ఇఁక నింతతో నీ వృత్తాంతము ముగించి రామగిరి ప్రశస్త వాఙ్మయమున సుస్థిరముగావించి మడికి సింగనవైపు మరలి అతని గ్రంథవిశేషములు తెలిసికొనుటకుఁ బ్రయత్నింతము.

మడికి సింగన తన తరముననే ముప్పరాజు ప్రాపకము నొంది కేశవమంత్రి కందనమంత్రుల ప్రోత్సాహముచే రామగిరియను సబ్బినాటి రాజదానికిఁజేరి జీవితముగడపెను. తెలంగాణమునకె వాఙ్మయామృతము పంచి యొసంగెను. సబ్బినాడు, సబ్బిసీమయని సబ్బి పాయిరమండలమని తత్పూర్వులచే వ్యవహరింపఁబడినది. ఇతని తండ్రియగు అయ్యలమంత్రి యనువాఁడు అహోబిల నరసింహ భక్తుఁడై తన కుమారులకు నరసింహార్థ జోతకములగు నామములఁ బెట్టుట కదియే కారణము.

> "ధరణిహపరములకును గురు
> చరణంబులె యూఁతయగుట చర్చించిమదిఁ
> బరవాది భద్రవారణ
> హరిభక్తుల తిరుమలయ్య లార్యులఁదలఁతుఁ."

అని సింగన ప్రతివాది భయంకరము తిరుమలాచార్యుల శిష్యుఁడనని చెప్పుకొనుటచే వైష్ణవ సాంప్రదాయములోని వాఁడని తెలియుచున్నది. కవిస్తుతిలో

నన్నయ తిక్కనల మాత్రము స్మరించెను. కందనమంత్రి పూర్వులలో గన్నయ్య అనువాఁడుండుటచే ఇతఁడు మార్కండేయ పురాణము వ్రాయించి అంకితము నొందిన గన్నయసేనాని వంశజుఁడని శ్రీ వీరేశలింగము పంతులుగారు తలంచిరి. మార్కండేయ పురాణ సంబంధియగు గన్నయ సేనాని శూద్రుఁడు గాన కందనమంత్రికి పూర్వుఁడని చెప్పఁజాలము.

"ఆ పరమేశ్వర మకుట
వ్యాపృత గంగాప్రవాహ వరకవితా స
ల్లాపుఁడగు కవిని సింగనఁ
జేపట్టక కీర్తిగలదె శ్రీమంతులకున్."

అను పద్మపురాణ పద్యముచే సింగన కవితాధార పరమేశ్వర మకుట గంగాప్రవాహమువలె నుండునని యొప్పుకొనఁదగియున్నది. కందన మంత్రి సింగనకవికి స్నేహబాంధవుఁడట, మొత్తముమీఁద సింగన తన కావ్యములో గందన మంత్రిని విశేషించి ప్రశంసించుటచే కందనమంత్రి గొప్ప వాఙ్మయప్రియుఁడు. జ్ఞానవాసిష్టము ఈ కవికిఁగల వేదాంతానుభవమును దెలియఁజేయును. తాత్త్విక విషయములు తేటతెల్లముగను సుబోధకముగను రసవంతముగను సింగన తెలుఁగుఁ గావించుచు

'మృదుమధుర వచన గర్భము
గదియించినయట్ల తత్త్వ గాఢార్థము చె
ప్పుదుఁ బువ్వుదేనెఁగొను తు
మ్మెద ప్రాఁకులు దొలుచు నేర్పు మెఱసినభంగిన్'

అని చెప్పినాఁడు. ఇందెంతయేని సత్యముగలదు. జ్ఞానవాసిష్టము అహోబల నరసింహస్వామి కంకితము. రసవంతమగు కావ్యము. ప్రాచీన సాంప్రదాయముగా నిందు కృత్యాది శ్లోకముచే నారంబింపఁబడినది. ఇది నరకృతికియ్యకొనని యుత్తర వయస్సులోన రచియింపఁబడెను. పద్మపురాణమున ఉత్తరఖండమును మాత్రము ఏకాదశాస్వాసముల గ్రంథముగా సింగన తెలుగుఁజేసెను. ఇంతకుఁబూర్వము శ్రీనాథకవితాత కమలనాభామాత్యుఁడు తెలిఁగించిన పద్మపురాణమును సింగన చూచియుండఁడు. సింగనయేకాదు శ్రీనాథునకుఁదక్క దానియునికెతెలియదు. ఆ గ్రంథమంతరించుట విచారకరము. సింగన పద్మపురాణమును జూలూరి అప్పయ్య

పంతులుగారు సంస్కరించి శుద్ధప్రతి వ్రాసినారు. ఈ ప్రతి మద్రాసు ఓరియంటల్ లైబ్రరీలోఁగలదు. అందు ఈ విధముగా అప్పయ్యపంతులుగారు లిఖించియున్నారు.

'పద్మపురాణోత్తరఖండమునకు సింగనకవి లెస్సగా తెనుగుజేసియుండగా కాలాంతరమందు లేఖక దోషములచేత అనేక స్థలములయందు చెడిపోయి శుద్ధప్రతి లేకయుండుట చేతను అనేక ప్రతులు తెప్పించి గీర్వాణమునకు సరిగా అధ్యాయసంఖ్య యేర్పడేటట్టున్నూ పార్శ్వములయందు ఆయా కథాభాగములందలి వర్ణనాంశములు మొదలైనవాటి యొక్క సూచనలు వ్రాయబడి యుండేటట్టున్నూ యీ ప్రకారము తీర్పు చేయవలసినదని మచిలీపట్టణ న్యాయకర్తలైన మహారాజశ్రీ చాడి బ్రౌమదొరవారు అనుజ్ఞ యిచ్చినందున శాలివాహనశక వర్షములు ౧౭౭౪ అగు నేటి నందననామ సంవత్సరమునకు సమానమైన ఇంగ్లీషుయుగ ౧౮౫౨ సంవత్సరమందు బందరులో జూలూరి అప్పయ్య పూర్ణముగా పదకొండు ఆశ్వాసములున్నూ తీర్పుచేసి గీర్వాణమునకున్నూ తెలుగున కున్నూ కొన్ని స్థలములందు భేదములు వచ్చియుండఁగాను అధ్యాయక్రమ వ్యత్యయములు అయాస్థలములయందు విశదపఱచడమైనది. ఈ పద్మపురాణమందు ఉత్తరఖండము మాత్రము తెనుగు అయినట్టు కనపడుచున్నది. కడమ ఖండములకు తెనుగుచేసినట్టుగా యెక్కడను మాకు కనపడలేదు.' బ్రౌను దొరవారు స్వయముగా 'The language used in this translation is easy and very beautiful' వ్రాసియున్నారు.

బమ్మెర పోతనగారి భాగవతములోని పద్యముల పోకడలు పద్మపురాణములోఁ గనిపించుచున్నవి. ఇట్టి అమూల్య గ్రంథము స్ఖాలిత్యములతోఁ బలుచని కాగితములపై మద్రాసులో నెన్నడో ముద్రణమైనది. ఇప్పుడు ప్రతులు దొరుకవు. తెలంగాణములోని యే ధనవంతులైన బ్రౌమదొరవారి శుద్ధప్రతిని ప్రత్యంతరము వ్రాయించి ముద్రింతురేని లోకోపకారము గాఁగలదు. దోమకొండ సంస్థానప్రభువగు మల్లారెడ్డి పదునేడవ శతాబ్దిలో పద్మపురాణము తెలిఁగించెఁగాని అది యసమగ్రము కవిత్వము రసవంతము అదియుఁ దెలంగాణములోని కృతియె. మరికొందరు గూడఁ బద్మపురాణము తెలిఁగించిరి గాని యవి సింగనకవితతోఃబోలవు నీరసములు.

భాగవతములోఁ గొన్ని స్కంధములు లోపించుటఁ జూచి సింగన వానిని ద్విపదగాఁ దెలిగించెను. పోతన పోకడలు ఇతని కవితలోఁ గనిపించుటచే

భాగవతమును ఇతఁడు చూచియుండెనని తలంపవచ్చును. పోతన మడికి సింగనకు గొంచెము పూర్వుఁడు గాననే దశమము ఏకాశద్వాదశ స్కంధములు తెలిగించుట సంభవించియుండవచ్చును. ఇపుడు పిఠాపురము రాజావారి లైబ్రరిలోను తంజావూరు సరస్వతి సుహాలునందును ద్విపద భాగవతములు కలవు. అని పూర్తిగఁ బరిశోధితములుగాలేదు. ముద్రణాదృష్టమునకు నోచుకొనలేదు. సింగన భాగవతము ద్విపదగా రచించిన సంగతి యాతని గ్రంథములలో గలదు. అదియు సింగన కందనమంత్రికె అంకితముగావించెను. ద్విపద బాగవతమింతవఱకు నేను జూడలేదు గాన దానినిగూర్చి యెక్కుడు తెల్పఁజాలను. సకల నీతిసమ్మతములో మదీయములని గ్రంథభాగములు వ్రాసికొనెను. అది యేగ్రంథములోని భాగములోఁదెలియదు. ఇట్లు పేరు తెలియకున్న యొక గ్రంథముకూడ సింగన రచనమునఁ జేరియున్నది.

సకలనీతిసమ్మతము సింగనకవి ప్రాచీన కావ్యముల నుండి యేరితీసిన పద్యములు గల సంధానగ్రంథము. ఇది గద్వాల సంస్థానముననుండఁగా పరిశోధక వతంసులగు మానవల్లి రామకృష్ణకవిగారు శ్రమపడి బయటికిఁదీసి ప్రచురించిరి. అందిఁకను గొంత గ్రంథభాగము లోపించినది. ముద్రితమైన ...ఁడాశ్వాసములవలన సింగనకవి బహుగ్రంథ పరిశోధకుఁడుయు ఇంతవఱకు లభ్యములుగాని గ్రంథరాజములలోని పద్యములు ఉదాహరించిన మొదటి సంధాకర్తయనియుఁ దెలియును. విషయసూచికలన ముద్రితమైన మూఁడాశ్వాసములు గాన ఇంకను రెండాశ్వాసములు మిగిలియున్నట్లు తలంపవచ్చును. ఇందలి విశేషములను దెలిసికొందము.

భారత రామాయణ కుమారసంభవాది ముద్రిత గ్రథములయందునుండియెగాక అముద్రతములగు ముద్రామాత్యము, నీతిసారము, పంచతంత్రి పురుషార్థసారము నీతిభూషణము కామందకము నీతితారావళి యను గ్రంథములనుండి పెక్కు పద్యములు సకలనీతిసమ్మతమున నుదాహరింపఁబడినది. ఈ గ్రంథములలో మొదటి యాఱును నాంధ్రలోకమునకపరిచితములు. నీతి తారావలి గ్రంథ పద్యములు 27 కందన మంత్రి పేర సింగనయే రచించెను. పురుషార్థసారము కాకతీయ గణపతి దేవునిమంత్రి శివదేవుఁడు రచించెను. సింగన్న చూచిన యీయపూర్వ గ్రంథములు పదునేనవ శతాబ్దికిఁ బూర్వపు వాఙ్మయమునకుఁ జెందినవి. రామగిరి ప్రాంతములలోఁ గల తాళపత్ర గ్రంథములలో నిందుఁగొన్నియేని లభింపవచ్చునని

కొండంతాశతో వెదకివెదకి వేసారితిని. పరిశోధకులెవరేని యీ గ్రంథములలోఁ గొన్నిటినేని గడించి ప్రచురించిన వాఙ్మయమున కెంతయో అభ్యుదయము కలుగఁగలదు. అపూర్వములగు చరిత్రాంశములు బయలుపడును.

సకల నీతిసమ్మతమును సింగనకవి రామగిరి కేశవస్వామికి అంకితముగావించెను. కేసన వాణస వంశజుఁడనియుఁ గేశవస్వామిని బ్రతిష్ఠించినవాఁడనియుఁ గందనమంత్రికి అగ్రజన్ముఁడనియుఁజెప్పెను. పద్మపురాణమునుండియుఁ గొన్ని పద్యములు చేర్చికొనెను. సకలనీతిసమ్మత రచనమును సింగన కవి యిటుల సమర్థించియున్నాఁడు.

"మును కవులెల్లఁ జెప్పినది
మున్నొని చర్విత చర్వణంబుగాఁ
బనివడి వ్రాయనేల యని
ప్రాజ్ఞులు చిత్తమునందుఁజూడుఁడా
ఘనుండగు ప్రౌఢమాలకరి
గమ్మని పువ్వులఁగూర్చి దండఁ గ
ట్టిన క్రియనీతిదామము
ఘటింపుదు మీరలు మెచ్చునట్లుగ౯"

సకల నీతిసమ్మతములోఁ దాముచెప్పదలంచిన యంశములకు కృత్యాదిలో సింగన స్పష్టముగాఁ జెప్పియున్నాఁడు. ఉపలభ్యమగు మూఁడాశ్వాసములలో సొంత ప్రచురణములు కాక అముద్రితములును ఇంతవఱకు ననపభ్యములగు ఏడు ఆంధ్ర గ్రంథములనుండి యుదాహరణములు తీసికొన్నాఁడు. మిగిలిన విషయసూచికఁ జూచినచో రెండాశ్వాసములు గల గ్రంథము లభింపలేదని తెలియును. ఆ రెండాశ్వాసముల విషయసూచిక యిది.

'పౌరాంగ నావిటనటీలక్షణమును, సజ్జన దుర్జనవర్తనములు, లుబ్ధ త్యాగి యాచవ గుణవిశేషములును, పంచగుప్త ప్రసంశయు, సకలలోకోక్తి విశేషంబులును, నింగితాకార చేష్టలును, సంగీత నాట్యప్రకారంబులును, నన్యాపదేశంబులును, ధనాధనవాణిజ్యకృషీవలపశుపాలన లక్షణంబులును దేవాలయోద్యాన తులసీవన తటాకాది ప్రతిష్ఠాఫలంబులును హరిహరభక్తి విశేషంబులును, సాలగ్రామ పూజాఫలంబులును, గాయత్రీమంత్ర గురు పితృబక్తి విధంబులను, నానా తీర్థ

విశేషంబులును, మాఘస్నానఫలంబును నను నివియాది గాఁగలిగి బహు కవీంద్ర వాక్యామృత పూరంబై ధర్మార్థ కామమోక్ష ప్రపంచంబగు నీతిప్రపంచంబు వివరించెద'

ఈ ప్రతిజ్ఞ నిర్వహించుటలో నింకనెన్ని పూర్వకవి కృతగ్రంధముల నుపయోగించెనో యనునది గ్రంథభాగము లోపించుటచే గ్రహింపనవకాశము లభింపకున్నయది. సింగన యుదాహరించిన ముద్రామాత్యము లక్కాభట్టు రచించినట్లు నువానికే క్షేమేంద్రుఁడను బిరుదనామముగలదనియుఁ దెలియుచున్నది. కవిసంజీవనిలోని గ్రంథముదాహరింపఁబడెను. ఉదాహృతపద్యములవలన నందలి కథాంశము ఒక రాజచరిత్రమువలెనున్నది. నీతిసారము కాకతిరుద్రదేవుని కృతముగా నితర గ్రంథములవలనఁ దెలియును. వేఱొక లక్షణ గ్రంథము దీనినే ఆంధ్రభోజకృతమని చెప్పుచున్నది. ఇంతవఱకు యత్కర్తృకమొ తేలలేదు. పురుషార్థసారము శివదేవయ్య రచించెను. శివదేవధీమణియను శతకము ఇతఁడెవ్రాసెనో పరులం కితముగావించిరో తెలియదు. ఇది కాకతీయ సామ్రాజ్యమున గణపతిదేవుని కాలమునఁబట్టిన గ్రంథము శివదేవుఁడు గణపతిదేవుని మంత్రియని వినుచున్నారము. కామందకము పంచతంత్రి యెవరురచించినవో. ఈ పేరుఁగల పుస్తకములితర కవితకృతములు గనవచ్చుచున్నవిగాని సింగన్న యుదాహరణము దీసికొన్నవి అంతకుఁబూర్వములు. రమణీయములగు నా కావ్యములు రెండును నింతవఱకు లభ్యములు గాలేదు. విమర్శక శిరోమణులగు శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు అనుపలబ్ధములగు గ్రంథముల యోగ్యత తమ పీఠికలో నిట్లు 'కవితా రచనములో నీతిసార పురుషార్థసారములు చాలఁ బ్రౌఢములయినవి. తరువాత పంచతంత్రిముద్రామాత్యము కామందకములఁ గ్రమముగాఁ జెప్పవచ్చును. పురుషార్థసారములోని భావములు వక్రోక్తి చతురములై హృదయంగమములగుచున్నవి. తుల్యప్రదేశములఁ బోల్చిచూడ నీ ప్రాచీన పద్యములకుఁ దరువతికవుల పద్యరచన తీసిపోయి వస్తునిష్కృష్టియు, రసభావ సమగ్రతయు, నిమిడికయు అనుటలో న్యూనత్వము చెందుచున్నది.'

అని యముద్రితాంధ్రకావ్యములఁ బేర్కొనియున్నారు. తత్తత్కవితాప్రసక్తికీప్రశంస చాలుననుకొందును. లభించినవి మూఁడాశ్వాసములైనను జాలపద్యములు అసంపూర్ణములుగనున్నవి. మాతృకయొకటె లభించుటయు అదియు నసమగ్రమగుటయు నీకొఱఁతకుఁ గారణము. మొదటి యాశ్వాసము కొంత

లోపించుటచే నాశ్వాసాంతపద్యములు కొఱంతపడినవి. సకలనీతిసమ్మతమున రెండవ షష్ఠ్యంత పద్యముతోఁ బ్రథమాశ్వాసము ముగియుటకిది యకారణమని నిర్ణయించుకొనవచ్చును. పాఠకులు సింగనగ్రంథములకై పరిశోధనము చేయుచో గొన్నియేని లభింపవచ్చును. ఇది భాషాభిమానుల కర్తవ్యము.

మడికిసింగన జీవితకాలమగు పదునేనవశతాబ్ది సువర్ణయుగము. తెలంగాణమునఁ బ్రసిద్ధులగు కవులుండిరి. సంస్కృత కవులలో విశ్వేశ్వరుఁడు, మల్లినాధసూరి, సర్వజ్ఞ సింగభూపాలుఁడు మొదలగువారు సింగన సమకాలికులు. ఆంధ్రకవులలో గౌరవ భైరవకవి శ్రీనాథకవి. బమ్మెర పోతరాజు జక్కన అనంతామాత్యుఁడు కొఱవి గోపరాజు పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు లోనగు ఆంధ్ర కవిరత్నములీకాల మనునుండిరి. సర్వజ్ఞ సింగభూపతి, ప్రౌఢరాయలు పెదకోమటి వేమారెడ్డి, ముప్పరాజు, కాటయ వేమారెడ్డి మున్నగు భాషాభిమానులగు పండిత కవిరాజులు అను నృపాలురు కవులకుఁ బ్రోత్సాహము కలిగించుచుండిరి. విశాలాంధ్రమునుండి పలువురు తెలుఁగుకవులు సుభిక్షముగానుండి రాజన్వతియగు తెలంగాణమునకు వలసవచ్చినటులఁ గనుపించును. కాటయ వేమారెడ్డి ప్రఖ్యాత విద్వాంసుఁడు. గొప్ప వ్యాఖ్యాత, రసికుఁడు. ఈయన శాకుంతల వ్యాఖ్యానమునందుఁ దానుగెల్చిన దుర్గములను జెప్పుకొనినాఁడు. అందు –

> ధాటిఘోటి ఖురాగ్రతృటిత గిరితటే
>   యాత్రమాక్లేదిదుర్గఁ
> దుర్గం కిమ్మూరు సంజ్ఞం దళితరిప్రబత
>   దుర్గమంబెండపూర్ద్రోమ్
> దుర్భేదం వజ్రకూటం జితవతిరభసా
>   రామగిర్యాఖ్య దుర్గం
> విఖ్యాతం వీరఘోట్టంగళి తమసుహృదాం
>   దుర్గసన్నాహ దార్ఢ్యమ్.

అని దుర్భేదము వజ్రకూటమునగు రామగిరిని కాటయవేముఁడు జయించెనని చెప్పఁబడినది. కాటయ వేమారెడ్డి రాజమహేంద్రవరరాజు గోదావరిమార్గమున రామగిరిని జయించి యుండును. కాటయవేముఁడు ముప్పరాజునకుఁ బరిపాలనా ధికారము నొసంగినపిమ్మటఁ క్రమముగా ముప్పరాజు స్వతంత్రుఁడయ్యనేమో.

అప్పకవీయములో సాహిణిమారుఁడు చాళుక్య చొక్కరాజు రామగిరిని పాలించిరని చెప్పఁబడినది. రామగిరి ప్రసిద్ధికెక్కిన దుర్గరాజమనుటకీప్రసంగము చాలును.

"రామగిరీంద్రమందుఁ
గవిరాజులు రాజులుగూడి కేశవ
స్వామి యనుగ్రహంబున
యశంబు గడించిరి, నాఁడు వాఙ్మయ
శ్రీమధురామృతైక రస
సిక్తములైన నృపాలమందిరా
రామములందుఁ గార్కొనె
నరణ్యములుఙ్ శిధిలావశిష్టముల్."

౨౮. రామప్పగుడులు

రామప్పగుడులను బాగుచేయించుటకు నిజాము దొరతనమువారు పదివేల రూపాయలు కర్చుబెట్టుట మిగుల సంతోషకరమగు విషయము ఎన్నియో శిధిలములుండి నయాంధ్రశిల్పదేవాలయము పయి దొరతనమువారి దృష్టి పడుటయొక విధముగా నాంధ్రుల యదృష్టమనవచ్చును. ఈ యవకాశమును బురస్కరించి యానిర్మాణమును గుర్చిన విశేషములు శిధిలములను బాగుచేయుటలో దొరతనము వారు ప్రత్యేకముగ జూపవలసిన శ్రద్ధనుగూర్చి కొంచెము దెలుపదలంచితిమి.

రామప్పగుడులకు వరంగల్లు వద్ద నుండి ములుగుమీదుగా బోవచ్చును. ప్రత్యేకించి మెట్టదారియు గలది జనసంచారమంతగా లేనియరణ్యమధ్యమున నీ రామప్పగుడులు కలవు. ఇందలిశిల్పములను నిజాము దొరతనమువారి మోడరన్ రివ్యూ పత్రికవారు ఇంక గొందరు పాలెంపట్టు శిల్పములని ప్రకటించిరి. ఈగుడులకు సమీపములో నుంటవలననే యీ పేరుతో వారు వ్యవహరించి యుందురు. అంతియగాని ఆలయమునకు బాలెంపట్టునకు సంబంధము లేదు.

రామప్పగుడులు ఒక విశాలప్రదేశమున గట్టబడిన మూడు గుడులుచుట్టును ఆనాడు గట్టిన విశాలము దృఢమునగు ఊాతిగోడ కలదు. ప్రహరిలోనున్న ఆలయములు మూడింటిలో మధ్యగల యాలయమె విఖ్యాతమయినది రెండువైపుల గల యాలయములు, చాలచిన్నది. అందు శిల్పములేదని చెప్పవచ్చును. మధ్య గల శివాలయమును రామప్పగుడి యనియేల వ్యవహరింతురో నిరూపింప వీలుకలుకదు. ఆలయము కట్టించినది రేచర్ల గోత్రీయుడగు రుద్రసేనానియని శాసనమునందు రూఢము గాగలదు. ఆలయము శివాలయము ఈ పరిస్థితిలో రామప్పగుడులనుటకు గారణము గోచరింపలేక అచట యనాగరకులు కట్టిన శిల్పిపేరును బట్టి యీనామమేర్పడినదని చెప్పిరిగాని యిది యంగీకరింపదగినది కాదు.

రామప్పగుడి (మూడుగుళ్లలో మధ్యనున్నది) ఇంచుక మెరుపురంగుగల సామాన్యశిలతో మిగుల నెత్తయినతావున గట్టబడినది. దాదాపు ఆలయము పానపట్టమును బోలియుండును. తక్కిన యాలముల యందువలెగాక నందీశ్వరుదు ఆలయములోపలనే యిమిడి యున్నాడు. అందుచే నందిపయినాడెన్నడో గావించిన

కురువిందపు మెఱుంగులు నేటికి జెక్కుచెదరక యున్నవి. హనుమకొండ దేవాలయమువలె రామప్పగుడి త్రికూటాలయము గాదు. ఏకకూటాలయమె ఆలయములోని మండప స్తంభములందును వానిపయిని వేసి యడ్డస్తంభములందును గర్భాలయమునకు ముందుండు ద్వారబంధమునసుగల శిల్పము అసదృశము. అనేక పురాణాంశములట జిత్రింపబడినవి. కృష్ణశిలలపైన విగ్రహములు చెక్కబడినవి గాన వాటిమెఱుగు నేటికి దర్శనీయముగ నుండి నెడలుగ్రక్కుచున్నవి. శిల్పప్రశస్తిలో హనుమకొండ, పిల్లలమఱ్ఱి, నాగులపాడు, గొడిశాల, మున్నగుతావుల అన్ని దేవళముల కంటె నిదియగ్రగణ్యమనదగియున్నది. ఆలయమునకు వున్న అడ్డస్తంభముల మీద నుండి అలముమారుతున్నట్లు మూడు వైపుల పురుష ప్రమాణముల విగ్రహములు నిలువబెట్టబడయున్నవి.ఆ విగ్రహములు నైజాము విలాసమునకు అసదృశ్యము. ఈ మధ్య ఒక అధికారి ఇట్టి విగ్రహములలో రెండిటి విడదీయించి అతని గృహమునకు కొనపోవుటకు ప్రయత్నించిరి. దొరతనము వారి సహాయముచే ఆ పని ఆగిపోయినది. ఆ విగ్రహములను పాడుచేయుచున్నారు. అందలి శిల్పము వరంగల్లు, హనుమకొండలలోని నందుల శిల్పమునకు దీసిపోదు. దీనిభారముచే వున్న శిలలువిరిగి కృంగిపోయినవి. అందువలన ఆలయమునందలి కొంతభాగము కప్పుచెదరినది. దీని సవరించుట యత్యవసరము ఆలయావరణలోని జీర్ణాలయములను బాగుపరచి లోనున్న చిన్ననూతిని సరిజేయవలసియుండును. ఆలయముచెంతనుండే పారు చెఱువు కాలువకు మెట్లేర్పడిన గాని యాత్రార్థులకు సౌకర్యముగా నుండదు రామప్పగుడులలోని ఇటుకలకు నీటిపై తేలునని చెప్పగా మేము వినియున్నారము స్వయముగా మేమీయంశము చూడలేదు. ఇదియు సత్యమే కొన్ని యిటుకలు భద్రపరచి యాలయశిఖరమును బాగుజేయుట యత్యవసరము.

రామప్పగుడులకు జెంత గొప్ప చెఱువు వొకటి గలదు. ఇందలి జలాధారమువలన నెంతయో భూమి సాగుఅగుచున్నది మన్నెపు ప్రదేశమని ఇచటికి క్రొత్తవారురారు. ఇచటిభూమి సాగుచేయదగినంత మంది కర్షకులిటలేరు. ఇందుచే నీప్రాంతములు దుర్భిక్షముగా లున్నవి ఈ చెఱువు రెండుకొండలకు కలిపి పెద్దకట్టబోసి యేర్పఱుపబడినది. కట్టకురెండు చివరలందును సామాన్యములగు నాలయములు రెండుగలవు ఇందు జిత్తరువులుగూడ గలవు. ఒక యాలయమున జైనవిగ్రహములుంచబడినవి. ఈ రెండునుగూడ బాగుచేయదగినవె. రామప్పచెఱువుండు దీసినయలుగు కాలువ చాలవింతయైనది ఈ యలుగుకొఱకు

ఒకకొండను బగులదీసి త్రోవయేర్పఱచిరి. ఆనాటి అపూర్వ పరిశ్రమల కిదియొక తార్కాణము ఇపుడీగండినుండి నీరువచ్చుటలేదు. ఈ గండి చెదరనీయక యుంచుట ప్రభుత్వమువారి కర్తవ్యము. ఆలయచరిత్రము తెలుపు శాసనము చాల అమూల్యమైనది. అది బహిరంగస్థలమున నుంటచే జెడినది. ఒక సురక్షిత స్థానమున జేర్పకున్నచో త్వరలో పాడుగాగలదు. ఇప్పటికే చాలభాగము చెడినది. సమీప ప్రదేశములలో లెక్కలేనన్ని గుడులున్నవి. ఆయాతావులలో గల శిల్పములు మేము గమనింపలేదు గాని అవియు దర్శనీయములై అందమైన శాసనములు శిల్పములున్న గాపాడవలయును. రామప్ప గుడులలో మల్లికార్జున పండితారాధ్యులవారి విగ్రహము ఒక గోడపయి చెక్కబడియున్నది. అది యదార్థరూపమని మేము చెప్పుట తగదుగాని యాకాలపు వస్త్రధారణము వేషభాషలు గుర్తించుటకు దగినవిగా నున్నది. ఇది దక్క మల్లికార్జున పండితారాధ్యులవారి స్వరూపము దెలుపు విగ్రహమింకొకటిలేదు. గావున సురక్షితము గావింపదగినది. ఈ ప్రదేశమంతయు బూర్వము మహానగరముగా నున్నటుల ననేక సూచనలు గలవు. ఎటజూచినను బరిశోధనార్హములగు బ్రదేశములు గోచరించుచున్నవి. క్రూరమృగములకు నెలవగు నీ ప్రదేశమని నొంటరిగా దిరుగుటయు శోధించుటయు అసాధ్యము అందులకు దొరతనము వారు మార్గములు వేసి యచటి దృశ్యములన్నింటిని గాపాడి మరుగుపడిన యీ పుణ్యప్రదేశపు పూర్వ చరిత్రమును వెల్లడించుట యత్యవసరము.

అన్నిదండ యాత్రలలో యాలయముకూడా కొంతవరకు దుస్థితికి లోనైనది. ఆలయము ముందున్న గజవిగ్రహములు రూపు మాసినవి. అందినంతవరకు బాదు చేయబడిపోయి. ఆలయసౌందర్యము మాత్రము చెడలేదు. ఈ యాలయము నందలి విగ్రహముల నృత్యమునకు నాట్యశాస్త్రముకు తార్కాణముగలదని విజ్ఞులు చెప్పుచున్నారు. జీర్ణాతిజీర్ణము కాకముందె యీ నిర్మాణము పునరుద్ధరింపబడుట సంతోషకరమగు నంశము ఆంధ్ర చరిత్రమునకు అవినాభావ సంబంధము గల యీ శిల్పాలయము ప్రకృతము జంగమదేవర యర్చకత్వముక్రింద నిత్యనైవేద్య దీపారాధనలతో నొప్పుచుండుట యొక విశేషము.

– (8.10.1930)

29. సువర్ణయుగము

ఆంధ్రవాఙ్మయమునకుఁ బ్రాణభిక్షపెట్టిన చాళుక్య రాజులు భాషాసేవకులకు వందనీయులు. ఆంధ్రభాషలోఁ గవిత్వముప్రాయుటకుఁ బండితులను బ్రోత్సహించి ప్రత్యేకవ్యక్తిత్వమును భాషకు వీర లొసంగుట చేతనే నిరవలంబనముగా నున్నను బ్రకృత మాంధ్రసారస్వత మిన్నివిధముల వికాసవంతుగ నలరారు నవకాశము లభించినది. చాళుక్యకాలములో బయలువెడలిన గ్రంథరాజములలో మొదటిది మనమెఱింగినంతలో భారతము; చివరది కావ్యాలంకారచూడామణి. మహదైశ్వర్యముతో విపులసామ్రాజ్య భారముతో నిరవకాశుఁడయ్యురాజరాజు నన్నయ్యభట్టారకుని భారత రచనమునకుఁ బ్రేరేపి వాకొన్న అమృతప్రాయ వాక్యములు ప్రాతస్మరణీయములు.

"ఇవి యేనుఁ సతతంబు నాయెడఁ గరం
బిష్టంబులై యుండుఁ బా
యవు భూదేవకులాభితర్పణ మహీ
యఃప్రీతియుఁ భారత
శ్రవణాసక్తియుఁ బార్వతీపతి పదా
బ్జధ్యానపూజామహో
త్సవముఁ సంతత దానశీలతయు శ
శ్వత్సాధు సాంగత్యముఁ"

చాళుక్యరాజ్యము ఛిన్నభిన్నమై పరాధీనమైన కాలమునఁ జిన్న రాజ్యముతోఁ గాలముగుడుపుచుఁ దమవంశపరంపరాగతమగు భాషాభిమానమును బురస్కరించుకొని లక్ష్యలక్షణ సమన్వితముగఁ గావ్యాలంకార చూడామణియను దొమ్మిదియుల్లాసముల గ్రంథమును విన్నకోట పెద్దనచే వ్రాయించిన చాళుక్యాభరణుఁడగు విశ్వేశ్వర భూపతి ఈ వంశజుల వాఙ్మయచరిత్రమునకుఁ గడపటివాఁడు. నన్నయ్యభట్టారకుని కవిత నిరర్గమనోహరము. సమకాలికుఁడగు నారాయణభట్టు ఆంధ్రభాషలోఁ గవియే కాని యాతనిగ్రంథములకు మనము నోఁచికొనమైతిమి. ఈ యిరువురియనుంగు చెలికాఁడగు పావులూరిమల్లన ప్రౌఢకవి.

కాని యాతఁడు వ్రాసినది గణితశాస్త్రము గావునను, కవితాకళ కంత సంబంధము లేనిది గావునను వాఙ్మయమున నాతనికి స్థిరమగుదావు లభింపకపోయెను. తరువాతి కవులలో నెవరికివారు ప్రత్యేకవీరులు. పాలకురికి సోమనాథుఁడు, తిక్కనసోమయాజి, ఎఱ్ఱాప్రగడ, నన్నెచోడుఁడు, నాచనసోమనాథుఁడు, భాస్కరాదులు మున్నగుకవు లొకరికొకరు దీసిపోవరు. తారతమ్యచర్చకుఁ గడంగితిమేని యగ్రస్థానము ఇందుఁ దిక్కనసోమయాజిదె. ఇది పదియవ శతాబ్దినుండి పదమూడవ శతాబ్దము వఱకుఁ గల వాఙ్మయ చర్చాలేశము. ప్రకృతమునకు వత్తము.

ఆంధ్రవాఙ్మయచరిత్రమున సువర్ణయుగమని చెప్పదగినది సర్వవిధములఁ బదునేదవశతాబ్దమని మావిశ్వాసము. ఆంధ్రులలో నిక్కువమగు పౌరుషము, ఆంధ్రకవులలో మహత్తరమగు నుపజ్ఞ ఆంధ్రవీరులలో నపూర్వమగు నుత్సాహశక్తి, ఈశతాబ్దముననే వెల్లివిరిసెను. ఆనాటి యాంధ్రజాతీయతావికాసములు, ఈనాఁడు లక్ష్యమునం దుంచుకొనుట భవిష్యదభివృద్ధిసూచకము.

రాజకీయ పరిస్థితులు

పదునేనవశతాబ్దమున ఆంధ్రదేశమున రాజకీయపరిస్థితులు మిగులదుర్భరముగా నుండెను. ఆంధ్రులపాలిటి పెన్నిధియనఁదగు ఆంధ్రసామ్రాజ్య మస్తమించెను. ఆంధ్రత్వమునకు సర్వస్వము ధారబోసిన ప్రతాపరుద్ర చక్రవర్తిని యవనులు బందించి కొనిపోయిరి. చిరకాలోపార్జితమగు నాంధ్రసామ్రాజ్యముతో నాంధ్రులసంపద, ఉత్సాహము కార్యదీక్ష కడబట్టెను. గ్రంథభాండారములు తగులఁబెట్టఁ బడెను. దేవళములు నేలమట్టమయ్యెను. ఇంతయేల? కడుపులోఁ జల్లఁ గదలక సురక్షితముగ నున్న ఆంధ్రులు కాకతీయసామ్రాజ్య విచ్ఛన్నముతోఁ జెల్లాచెదరైరి. హరిహరరాయాదులు నూతన రాజ్యస్థాపనమునకు విద్యానగరప్రాంతముల కేగిరి.

కాటమరెడ్డి ప్రభృతులు కృష్ణా గోదావరీమధ్య భాగమున నూతనరాజ్యము స్థాపించిరి. పతనమైన యాంధ్రసామ్రాజ్యమును బునరుద్ధరించి రేచర్లగోత్రుఁడగు అనపోతనాయకుఁడు జాతీయపతాకమును. నిలువబెట్టెను ఈ పరిస్థితులలో నీముగ్గురు రాజ్యనిర్మాతలకును, బొత్తులు కుదురలేదు. పరస్పర ద్వేషములు, సంగ్రామములు. ఈయవకాశములలో యవనుల దండయాత్రులు, ఎల్లప్పుడు అశాంతియే. పరిపాలన విధానమున నెట్లున్నను కవుల కీయుగమునుండియే వికాస మంకురించెను. ఆంధ్ర

సామ్రాజ్యమహావృక్షము యవనమారుతముచే మొదలంట విరిగిపడెను. వేళ్లబలముచే మూలమున నీమూడు శాఖలు బయలువెడలెను. మూఁడును అభివృద్ధికి వచ్చెను. కవికోకిలముల కీశాఖాత్రితయము సర్వవిధముల శరణ్యమయ్యెను. ఈముగ్గురు స్వతంత్రరాజుల కుటుంబములలో జనించి భాషాభిమానులగు సమకాలికరాజులు ముగ్గురు గలరు. విద్యానగర రాజ్యమునుండి ప్రౌఢదేవరాయులును ఓరగల్లు రాజ్యమునుండి సర్వజ్ఞసింగ భూపాలుని, కొండవీటి రాజ్యమునుండి పెదకోమటి వేమభూపాలుని గైకొని ఈసమకాలిక రాజత్రితయము గావించిన వాఙ్మయసేవ గమనింతము. విరాగశీలుఁడగు బమ్మెరపోతరాజు దక్క మిగిలిన కవిరాజులందఱు నీయుగమున నీమూఁడు రాజ్యముల నేలుప్రభువులనో, రాజప్రతినిధులనో, రాజకీయోద్యోగులనో యాశ్రయించి జీవితము గడిపిరి.

పదునేనవ శతాబ్దిలోని కవులు

అమరేశ్వరుఁడు, మడికిసింగన, జక్కన, శ్రీనాథుఁడు, బమ్మెరపోతరాజు, గణపతిదేవుఁడు, వల్లభరాయఁడు, నిశ్శంకకొమ్మన, గౌరనమంత్రి, దగ్గుపల్లిదుగ్గన, పినవీరభద్రుఁడు, నందిమల్లయ్య ఘంటసింగయ్యలు, నాగనాథుఁడు, భైరవుఁడు, నారాయణకవి మొదలగువారీశతాబ్దిలోని యాంధ్రకవులు. అరుణగిరినాథుఁడు, పెదకోమటివేముఁడు, కుమారస్వామి, వామనభట్టబాణుఁడు, నరసింహకవి, విశ్వనాథకవి, కోలాచల మల్లినాథుఁడు, మామిడిసింగన, సర్వజ్ఞ సింగభూపతి, విశ్వేశ్వరుఁడు, ముమ్మడి దేవరాయలు, బొమ్మకంటి అప్పలాచార్యులు, మున్నగువారీ శతాబ్దములోని సంస్కృతకవులు. వీరల ప్రజ్ఞాప్రతిభాదులను వర్ణించుట కిది తావుగాదుగాన విడువక తప్పదు.

పదునేనవ శతాబ్దమునందుఁ గవులు పలువురు గలరు. విప్లవములలో వారిగ్రంథము లెన్నియో నశించుటచే లక్షణగ్రంథములవలన వానినామములు మాత్రమే వినవచ్చుచున్నవి. ఆంధ్రసాహిత్య గృహమును వివిధ వస్తు సంపూర్ణ మొనరించిన కవులను, ఇందులకుఁ బ్రోత్సహించిన రాజులను మనము మఱువఁజనదు.

కవుల ప్రతిభాదికములు

ఈ శతాబ్దిలోనున్న కవులందఱిలో సమష్టిదృష్టితోఁ జూచితిమేని శ్రీనాథకవి గొప్పవాఁడు. సంస్కృతాంధ్రములలో సమానముగఁ గవితజెప్పఁ జాలుదిట్ట. అత్యద్భుత మేధాశాలి. శాస్త్ర పరిజ్ఞానమునం దీతఁడు అసాధారణుఁడు. తనకావల నాంధ్రవాఙ్మయము సర్వతోముఖముగాఁ బ్రకాశించుట కీతఁడే కారకుఁడు. దుగ్గన కవి శ్రీనాథునకు బావమరిది. కానఁ దాను స్వయముగా నెఱింగినవాఁడు గాన శ్రీనాథు నిట్లు వర్ణించినాఁడు:

సీ॥ సంస్కృతప్రాకృత శౌరసేనీముఖ్య
భాషాపరిజ్ఞాన పాటవంబు
పన్నగపతిసార్వభౌమ భాషితమహా
భాష్యవిద్యా సమభ్యాసబలము
అక్షపాద కణాద పక్షిలోదీరిత
న్యాయకళాకౌశ లాతిశయము
శ్రుతిపురాణాగమ స్మృతిసాంఖ్యసిద్ధాంత
కబళనవ్యుత్పత్తి గౌరవంబు
పూర్వ కవిముఖ్య విరచితాపూర్వకావ్య
భావరససుధా చర్వణప్రౌఢతయును
కందళింపంగఁ గాశికాఖండనైష
ధప్రముఖ వివిధప్రబంధము లొనర్చి.

– నాసికేతోపాఖ్యానము.

శ్రీనాథునికవిత కఠినముగనున్నను అన్వయసరళముంటచే సులభముగా బోధయగును. అతనివచనములం దొకవింత సొంపుగలదు. సీసపద్యకల్పనమున నీతఁడప్రతి మానుఁడు. మూలానుసరణమగు నాంధ్రీకరణమునకుఁ ద్రోవదీసినవాఁ డీతఁడె. ఇంతయేల! వాఙ్మయమునఁ గల యన్ని శాఖలలో నీతఁ డప్రతిమానుఁడే.

ఈ శతాబ్దమున ద్విపద యమోఘముగ వృద్ధికి వచ్చినది. ఆంధ్రభాషలో గౌరన హరిశ్చంద్రచరిత్రమును మించిన ద్విపదకావ్యము లేదు, ఇందలికరుణరసము, కవితాధోరణి, మనోహరభావములు, కల్పనాసౌష్ఠవము అప్రతిమానము. ఈతని

నవనాథచరిత్రముగూడ నిట్టి యోగ్యతగలదె! పదునేనవ శతాబ్దిలోని లక్షణగ్రంథములలో విన్నకోటపెద్దన కావ్యాలంకారచూడామణి, భైరవుని కవిగజాంకుశము, గౌరన లక్షణదీపిక, సర్వజ్ఞుని రసార్ణవసుధాకరము పేర్కొనఁదగిన గ్రంథములు. రసార్ణవ సుధాకరము సంస్కృతగ్రంథమైనను సులభముగ, సుబోధముగ నున్నది. సంస్కృత వచనరచనమున బాణుని తరువాత మరల నంతవాఁడు జనింపలేదట. అకొఱంతదీర్చి నాఁడవని సగర్వముగాఁ జెప్పుకొన్న వామనభట్టబాణుఁ డీకాలమునఁ గొండవీటనున్న వాఁడు. భావసామ్యము శ్రీనాథుని గ్రంథములకు, నీతని గ్రంథమునకుఁ గానవచ్చును. ఈయుభయులలో నొకరు ఆస్థానకవి. వేఱొకరు విద్యాధికారి. వీరలను బోషించు కోమటివేమారెడ్డి వాఖ్యాతృ శిరోమణియేగాదు; సర్వజ్ఞ చక్రవర్తి. వీరలు ముప్వురు మూర్తిత్రయమునకుఁ దీసిపోనివారలు. అమరేశ్వరునికవిత అమృతస్యంది. ఈతనివిక్రమసేన మింతవఱకును లభింపలేదు. ఉపలభ్యములగు నుదాహృతపద్యములవలన నీతఁడు ప్రౌఢకవియనియు, మాళవదేశాధీశ్వరుఁడగు విక్రమసేనుని కథను బ్రబంధముగ వ్రాసియుండు ననియుఁ దెలియుచున్నది. ఆంధ్రకవులలో ననంతామాత్యునికవితలో నొకవిలక్షణత్వ మిమిడియున్నది. తేటతెనుంగుమాటలను గూర్చుటలో నీతఁడు మిగులనేర్పరి. కవితలోఁ గఠినపదము గానరాదు. శ్రీనాథునికవిత యెంత జటిలముగనుండునో యీతనికవిత యంతమృదులముగ నుండును. ఈతనిభోజరాజీయ మాంధ్రభాషకపూర్వమగు నలంకారము. కథలు చిత్రములుగ నీతిదాయకములుగ నుండును. ఇందలి యుపాఖ్యానముల సమ్మేళనము చాలవఱకు పంచతంత్రమును బోలియుండును. ముఖ్యముగ నిందలి అనుమతికథయు, గోవ్యాఘ్రచరిత్రము ఎన్నిమాఱులు చదివినను దవినితీఱదు. దగ్గుపల్లిదుగ్గన, మల్లయసింగయలు, పినవీరభద్రుఁడు విద్యానగరసంస్థానాశ్రయులు. కవితలో నీముప్వురిని మూఁడుత్రోవలు. మధురశైలిలో సరళధారతో సరసభావములతోఁ గవితఁ జెప్పువాఁడు దుగ్గన. ఈతఁడు ప్రబంధయుగ మార్గదర్శకుఁడుగ నున్నాఁడు. పినవీరుఁడో! వాణినారాణియన్న గండరగండఁడు. కవితలో, ధారలో, కల్పనాశక్తిలో నీతఁడు గడుసరి. ఈతని శృంగారశాకుంతలము స్వతంత్రగ్రంథమని చెప్పఁదగినది. సింగయమల్లనలు బ్రబంధ కవితకుఁ ద్రోవదీసినవారు. వరాహపురాణము వీరలు ప్రౌఢముగఁ దెనిఁగించిరి. ప్రబోధ చంద్రోదయనాటకమును మిగులశ్రమజేసి నాటకమును బ్రబంధముగఁ

గూర్చువిధమును వీరు దొలుత ప్రకటించిరి. గణపతిదేవుఁడు శివయోగసారము రచించిన కవిరాజు. ఈయనకవిత సర్వవిధములు ప్రౌఢముగా హృద్యముగా నుండును. మొన్నటి వఱకీకవి యత్యంతాధునికుఁడని విశ్వసించితిమి. చిలుకూరి వీరభద్రరావుగారి యపూర్వపరిశోధనముచేఁ గవి ప్రాచీనుఁడనియు శ్రీనాథుని సమకాలికుఁడనియు వ్యక్తమయ్యెను. మడికసింగన బహుగ్రంథ రచయిత. వల్లభ రాయఁడు ఓరుగంటి వైభవమక్షరరూపమునఁ బ్రతిష్ఠించిన దిట్ట. కొమ్మన వీరశైవకవి మణి, భైరవుఁడు లాక్షణికవంశము. వీరి గ్రంథములన్నియు మనోజ్ఞతో నిండిన భావమనోహరములు, కల్పానాభూషితములు. ఇందఱు కవులొకకాలమున నుండుట సుకృతము.

ఈకవులందఱును నొకయెత్తు, బమ్మెర పోతన నొకయెత్తు. పోతరాజు గర్భదరిద్రుడు. బహుకుటుంబ భారవహుఁడు, నిరాధారుఁడు. ఇట్టివిపరీత దుర్గతులలోఁ దగుల్కొని భాగవతము వంటి మహాగ్రంథము నెట్లు రచింపఁ గల్గెనో తోఁచదు. సమకాలిక కవులందఱు, భోగభాగ్యములతోఁ తులదూఁగుచుండఁ తాను హృదయపూర్వకముగా దరిద్రమును ప్రేమించి తన బాహ్యదేహమును అష్టకష్టములపాలు జేసెను. సమకాలికులు రాజకీయవాగురలలోఁ దగుల్కొనియుండఁ దనకు రాముఁడు దక్క రాజు వేఱొకఁడు లేఁడని చెప్పిన వాక్యము అభిమానవీలుఁడగు కవి నిత్యము పఠింపఁదగినది.

ఇమ్మనుజేశ్వరాధముల
కిచ్చిపురంబులు వాహనంబులు
సొమ్ములు కొన్ని పుచ్చుకొని
చొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెట వ్రేటులు బడక నమ్మతి
శ్రీహరి కిచ్చి చెప్పె నీ
బమ్మెరపోతరా జొకఁడు
భాగవతంబు జగద్ధితంబుగన్

మహాకవియగు పోతన భాగవతమున నితరులు చేయిజేసికొనవలసిన స్థితి తటస్థింపక గ్రంథమంతయు సురక్షితముగ నున్న ఆంధ్రుల సుకృతమునకు మేరే లేకుండెడిది. ఏమికర్మమొకాని భారతము, రామాయణము, భాగవతము అను

నీమూఁడు గ్రంథములు బహుకర్తృత్వమునకుఁ బాలైనవి. భారతమునకుఁ గుదిరినటులుగ దక్కిన గ్రంథములకుఁ తగిన కవులు లభింపకుంట గొప్ప కొరత. పదునేడవ శతాబ్దమున అయ్యనార్యుఁడు, ఫణిభట్టు, నాగనాథుఁడు, చెన్నమరాజు, వెన్నెలకంటి సూరనార్యుఁడు మున్నగు మహాకవులింక నెందరో కలరుగాని, వారి గ్రంథము లిపుడు మూలమణగియున్నవి. ఈయమూల్య గ్రంథరత్నము లెపుడు లభించునో ఆంధ్రుల పుణ్య మెపుడు ఫలించునో. సంస్కృతకవులఁ గూర్చి కొంచెము జెప్పవలసి యున్నది. ఈ శతాబ్దమునఁగల సంస్కృత కవులలో డిండియభట్టు వామనభట్టబాణుఁడు మిగులు బ్రసిద్ధులు. అందఱకంటె మిగులఁ బ్రసిద్ధుఁలు. కోలచలము మల్లికాథుఁడు. ఈతఁడు మహావిద్వాంసుఁడు. సమస్త విద్య లీయనకు ముఖస్థము. మూలగ్రంథములోని భావము వెల్లడించి రమ్యపరిణామముల నెఱింగించుటలో నీతండిఁగల చతురత యేవ్యాఖ్యాతకు లేదు. కాళిదాసుని గ్రంథరత్నములకు వ్యాఖ్యాత లొనరించిన దొసఁగుల నీతఁడు తొలగించుటకె నూతనముగా వ్యాఖ్యలు రచించినాఁడఁట.

> **"భారతీ కాళిదాసస్య కువ్యాఖ్యా విషమూర్ఛితాః**
> **ఏషా సంజీవనీవ్యాఖ్యా తా నుద్యోజ్జీవయిష్యతి"**

ఈ మల్లినాథుఁడు సర్వజ్ఞసింగభూపాలునిచేఁ గనకాభిషేకాది సత్కారులు నొందెనఁట. సంస్కృత భాషా ప్రపంచమున మల్లినాథుఁడుని నమస్కరింపని మానవుఁడే లేడు. కుమరస్వామి సోమయాజియు వ్యాఖ్యాతలలో నెన్నదగినవాఁడు. పెదకోమటి వేమనృపాలుని వ్యాఖ్య మనోహరముగా నున్నఁది. అమరుకమునందలి శృంగారభావము లీతఁడు మనోహరముగాఁ జెప్పినాఁడు. ఉన్న వ్యాఖ్యలన్నింటిలో నీతనివ్యాఖ్యయే సరసమైనది. కాటయవేముఁడును వ్యాఖ్యాతలలోఁ బ్రసిద్ధుఁడే ఇంగనీ శతాబ్దిలో నెందరెందరో వ్యాఖ్యాతలు గలరు.

చాళుక్యులు, కాకతీయులు సమకూర్చిన సామ్రాజ్యములు ఛిన్నముకాఁగానే రాజులు పునరుద్ధరించినటుల మతవిప్లవములు దండయాత్రలమూలమున గ్రంథ సముదాయము నశింపఁగనే కవులు పునరుద్ధరించిరి. ఇందఱుమహాకవు లొక శతాబ్దములోనుండి యాంధ్రసారస్వతమునకు సర్వతోముఖముగఁ గావించిన సేవకతననే ఆంధ్రవ్యక్తిత్వము నేఁటిదనుక నిలచినది. ఆకాలపురాజులో కావ్యకవితావినోదులు. విద్వాంసులో మహామేధాశాలురు, గ్రంథరచనాకౌశలురు. ఇన్ని

విధముల వాఙ్మయమున కుపకరించిన యీపుణ్యకాలమును వాఙ్మయచరిత్రములో సువర్ణయుగమని చెప్పవచ్చును. ఈయుగమున బయలువెడలినదే నిజమైనకవిత. కవులలో నుద్రేకము భావనాశక్తి, ఉపజ్ఞ, ఔచితి నిజముగా నీ శతాబ్దముననే యున్నది. మనదురదృష్టవశమున నీశతాబ్దమున రచింపఁ బడిన గ్రంథము లెన్నియో యంతరించినవి. ఎడతెగని సంగరములలోఁ దొలుత మన దేవళములు, పిదప మనగ్రంథములు బలియయ్యెను. హతశేషములగు గ్రంథము లెందేనియున్న వేమో శోధించి సర్వాంగసుందరమగు నాంధ్రభాషను అలరించుటకు ఆంధ్రసోదరులారా, మన మొక్కమా సువర్ణయుగమును స్మరించి ప్రాచీనగ్రంథ సంపాదనమునకు బయలుదేఱుదమా!

– ఆంధ్రపత్రిక శుక్ల సంవత్సరాది సంచిక (1929)

౩౦. శ్రీకృష్ణదేవరాయల విజయయాత్ర

ఈ క్రింద నుదహరింపఁబోవు శాసనము తిరువణ్ణామలై దేవాలయము లోపలి ప్రాకారము నందు ఉత్తరపువైపున శిలపై వ్రాయఁబడినది. ఇంతవఱకు శ్రీకృష్ణదేవరాయలు పూర్వ దిగ్జైత్ర యాత్రా సందర్భమున నిజాంరాష్ట్ర మందలి సుప్రసిద్ధ దుర్గరాజములగు అరువపల్లి, జిల్లిపల్లి, కొందికొండ, కప్పలుకొండ, నల్లగొండ, కంభముమెట్టు, కనకగిరి, శంకరగిరి లోనగు దుర్గములు రాయలవారు లోఁబడఱచుకొన్న యంశము మనకుస్పష్టముగాఁ దెలియదు. ఈవిషయము నీ శాసనము విశదము చేయుచున్నది. పైని పేర్కొనఁబడిన దుర్గము లన్నియు మనమెఱింగినవె. కనకగిరి యనునది నెల్లూరిమండలము లోని దని కొందరు చెప్పుచున్నారు. అది సరిగాదు. కనకగిరి దుర్గము, మధిరతాలూకాలోని (ప్రస్తుతం సత్తుపల్లి తాలూకాలోనిది) కల్లూరునకు సమీపమందున్నది. ఇచ్చటమిగుల దృఢమైన గొప్పదుర్గము గలదు. దీనిని సర్వజ్ఞ సింగ భూపాలుని దుర్గమని వ్యవహరింతురు. రాయలపాదధూళిచే నిజాము రాష్ట్రమునందలి యాంధ్రదేశము పావన మయ్యెనని తెలుపుటకా శాసన భాగము నిట నుదహరించుచున్నారము.

"శ్రీశుభమస్తు, స్వస్తిశ్రీ మన్మహారాజాధి రాజ రాజపరమేశ్వర, మూరురాయరగండ, ఆదిరాయవిఫాల అష్టదిక్కురాయ మనోధయంకర, బాషగ తప్పువరాయ గండ, పూర్వ దక్షిణ పశ్చిమ సముద్రాధీశ్వర, యవన రాజ్యస్థాపనాచార్య, గజపతివిఫాల, శ్రీ వీరప్రతాప శ్రీకృష్ణసేనహారాయలు విజయనగరాన నుండి పూర్వది గింజయ యాత్రకు వచ్చి ఉదయగిరి దుర్గము సాధించి రావుతురాయ మహాపాత్రునిం బట్టుకొని అద్దంకి, వినికొండ, బెల్లముకొండ నాగార్జునకొండ, తంగెడ, కేతవరము, ఇవి మొదలైన దుర్గాలు స్థలదుర్గాలు ఏకదాడిని గైకొని కొండవీటిదుర్గం కొండవీటికి లగ్గలు పట్టించి ఆ దుర్గం పుచ్చుకొని ప్రతాపరుద్రరాయల కుమారుండు వీరభద్ర రాయండు, కుమారహం వీర పాత్రునికొడుకు, నరహరిదేవు, రాయచూరి మల్లూఖానుండు, ఉద్దండభానుండు జన్యాలకిసవా పాత్రుండు. పూసపాటి రాచిరాజు శ్రీ నాథరాజ లక్ష్మీపతి రాజు పశ్చిమ బాలచంద్ర మహాపాత్రుఁడు, వీరు మొదలైన పాత్ర సామంతులను మన్నెవారి నిన్నీ జీవగ్రాహంగా పట్టుకొని వారికి అభయదానం ఇచ్చి ధరణి కోట అమరేశ్వరునకు తులా పురుష మహా దానమున్ను చేయ

నవధరించి... విజయనగరానకు వచ్చి సామ్రాజ్యము చేస్తున్ను మరిన్ని కళింగాదిక దిగ్విజయార్థము బెజవాడకు విచ్చేసి కొండపల్లి దుర్గమును సాధించి ఆ దుర్గము మీద నున్న ప్రహరేశ్వర మహా పాత్రుండు చోడ జన మహా పాత్రుండు బిజిలిఖానుండు వీరిని మొదలయిన వారిని జీవగ్రాహం గాను పట్టుకొని వారికి అభయదానం ఇచ్చి, అనంతగిరి, ఉంద్రగొండ, ఉర్లుగొండ, అరువపల్లి, కందికొండ, కప్పలుకొండ, నల్లగొండ, కంభంమెట్టు, కనకగిరి, శంకరగిరి, ఇవి మొదలైన తెలుంగాణ్యపు దుర్గాలు ఒక దాడిని గైకొని సింహాద్రి పొట్నూరుకు విచ్చేసి అక్కడను జయస్తంభము వేసి మహాదానము చేయనవధరించి తిరిగి రాజమహేంద్రవరమునకు విచ్చేసి తమ దేవుల చిన్నా దేవమ్మ తిరుమల దేవమ్మ గారిచే తను సేయించ నవధరించి విజయనగరానకు విచ్చేసి స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకవర్షంబులు ౧౪౩౮ వ అగు నేటి ధాత సంవత్సర పుష్యబహుళ ౧౩ సోమవారము నాడు తిరువణ్ణామలకు విచ్చేసి, అణ్ణామల దేవునిన్ని ఉణ్ణామల నాంచారమ్మనున్నుద ర్శించి దేవునికి మాణిక్యాల పతకం బంగారం దండ బాహుపురి ఉత్తరిగె ప్రభావళి ఇంద్ర విమానం వెండిగిండి అభిషేకొనకు వెండి బిందె ఇంత పట్టుకు సమర్పించి దేవుని తిరుకాళ్లకు వెండి పూయించి దేవుని తిరుపణ పదకొండు నిలువల గోపురం వేయికంబాలమంటపం ఇందు ముందుర వసంత తెప్ప తిరుణాళ్లకు చేయించిన తిరుకుళం ఇండ్లకు (ఇందులకు) నీరు వచ్చేటట్టుగాను కట్టించిన తిరుమల దేవమ్మ సముద్రం తిరుణాళ్ల మంటపం మకర సంక్రాంతి మంటపం వినాయక దేవుని తేరు తిరువిడి ఇంతమట్టుకు కట్టించి.... గోపురం వాకిటితలుపు ద్వార బంధాన కున్ను ఉత్తమ చోళని వాకిట తలుపు ద్వారబంధాన కున్ను వాకిలి మీది... కిన్ని ఉణ్ణామల నాచమగుడి కిన్ని చట్ట పెరుమాళ్ల సన్నిధిని పడమటి వాకిలి ద్వార బంధానకున్న ఇంత వట్టుకు వెండి పూయించి దేవుని గర్భగృహం వాకిటి ముందర ముఖ భద్రకు రాతి జగతి కట్టించి కంబం నిలిపి మదన చేతులిచ్చి వెండి పూయించి మదవల్లి ముందరను ఆ రాముడు బావిత్రవ్వించి దేవునికి పంచామృతఅభిషేకం"

లఘు విమర్శనము

ఈ శాసనము క్రీ.శ. ౧౫౧౬ లో స్థాపింపఁబడెను. రాయలు ౧౫౧౫ మొదలు ౧౫౧౬ లో పలుమారు కళింగ దేశముపైకి దాడివెడలెను. అమరావతికి కొండవీటికి శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ.౧౫౧౫ లోఁ బోయి యుండునటుల

నితరాధారములచే నిర్ణయమగు కతన నిజాము రాష్ట్రములోని పై దుర్గములన్నియు క్రీ.శ.౧౫౧౫ లో గెలువఁబడినవనియె చెప్పవచ్చును. రాయలవారు సింహాద్రి యందును తిరుపతియందును నితరస్థలములందును నిద్దరు దేవులతఁ గూడ దానములు గావించినటుల శాసనములు గలవు. తిరుపతిలో ఇరువురి దేవులు తానునిలచి యున్నటుల విగ్రహములు చేయించి స్వామి వారి కభి ముఖముగా నెలకొల్పఁబడెను. రాయలవారితోఁ బ్రతిదిగ్విజయ యాత్ర యందును దేవేరులు ప్రయాణమగుచుండి రనియు తన ద్రవ్యములోఁ జాలభాగము దేవాలయాదులకు రాయలు వినియోగించె ననియు నీశాసనము వలన గ్రహింపవచ్చును. కృష్ణ దేవరాయల శాసనమొకటి నేలకొండ పల్లెలోఁ గలదు. వీనినన్నిటిని సమన్వయించి చూచినచో నిజాము రాష్ట్రములోని తెలుఁగు దేశ మంతయు రాయలు పాలించెననియుఁ దెలంగాణ్య మని రాయలు ప్రయోగించుటచే తెలంగానాయను నామము యవనప్రభులు పెట్టకముందే నిజాము రాష్ట్రమునందలి యాంధ్రదేశము తెలంగాణ్య మను వ్యవహారముతో సుప్రసిద్ధముగా నుండెననియు విశ్వసింపవచ్చును. ఈ శాసనము వలన రాయలకు నిజాము రాష్ట్రమునకుఁగల సంబంధము తెలిసి రజతోత్సవావసరము బోధకాఁగలదు.

– **శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ రజతోత్సవ సంచిక (1927)**

31. తెనాలి రామకృష్ణకవి

(పద గుంభనము)

ఆంధ్ర కవులలో నీతఁడు సుప్రసిద్ధుఁడు. కౌండిన్యస గోత్రుఁడు. రామయ మంత్రి కుమారుఁడు ఇందుమతీ పరిణయాది గ్రంధకర్త యగు తెనాలి యన్నయ్యా కవికి అగ్రజుఁడని తెలియును. రామకృష్ణుని గ్రంథములలో పాండురంగ మహత్త్యము, ఘటికాచలమాహాత్త్యము మాత్రము లభించినవి. ఉద్భటారాధ్య చరిత్రము తెనాలి రామలింగ కవి కృతము లభించినది. వంశావతారాదికముచేఁ దొలుత శైవమతాభిమానిగా నుండి రామలింగ నామమున ఉద్భటారాధ్య చరిత్రమును వ్రాసి వైష్ణవ మతము స్వీకరించి రామకృష్ణ నామధేయము ధరించి ఘటికాచలమాహాత్త్యము, పాండురంగ మాహాత్త్యము రచించెనని విశ్వసింపఁదగు నాధారములు గలవు. రామకృష్ణ కవి గ్రంథములలో, కందర్పకేతు విలాసము ఇంత వఱకును లభింపకున్నవి.

రామకృష్ణకవి శ్రీకృష్ణ దేవరాయల కాలము వాఁడు కాఁడని ఆంధ్రకవుల చరిత్రము నందుఁగలదు. రామకృష్ణకవి క్రీ.శ.౧౫౫౦-౧౫౬౦ ప్రాంతమున పాలదురంగ మాహాత్త్యము రచించి శ్రీకృష్ణదేవరాయల సమకాలికుఁడని నిర్ణయింపఁ జాలినన్ని యాధారములు గలవు. అష్టదిగ్గజములలో రామకృష్ణకవి యొకఁడనుటకు సంశయింపఁ బనిలేదు.

రామకృష్ణకవి కవితానైపుణ్యమున నసమానుఁడు. కూర్చుబింకము నందును మనోభావముల వర్ణించుటయందును రచనా కౌశలమునందును నితఁ డప్రతి మానుఁడు. పెద్ద నార్యుఁడు కనక నగసీమ పచ్చరాచట్టుపై నచ్చరచేఁజాలు గరగించునటుల వీణవాయింపఁ జేసి సామాన్య బ్రాహ్మణుని మోహితునిఁ జేయింపలేక పోయెను. రామరాజ భూషణుఁడు వర్ణించినది పవిత్రమగు గృహస్థ ధర్మమునకు సంబంధించిన పరిణయమగు కథ. రామకృష్ణుఁడట్లుగాక మోక్ష గ్రంథములనఁదగు నుత్తమ భక్తిరస గ్రంథముల వ్రాసెను. కాని యందును దన నేర్పుఁజూపుటలోఁ బ్రాలుమాల లేదు. పాండురంగ మాహత్త్యము నందు నిగమ శర్మోపాఖ్యానము సుశీల చరిత్రము రసవత్తరములగు ఘట్టములు. పూర్వకవులెవరు త్రొక్కని త్రోవతో నీరెండుచోటుల రామకృష్ణుఁడు తన స్వతంత్ర రచనా కౌశలము వెల్లడించెను. ఇతని కథారంగములు మంచుమలలోని సెలయేటి యిసుక తిన్నెలు గావు. కొండనెత్తమ్ముల

క్రీఁజాయనున్న పొదరిండ్లుగావు. ఆర్యధర్మోచితములగు బ్రాహ్మణగృహములు. దురాచార పరవశుఁడగు నిగమశర్మనొక యెడఁ బాత్రముగఁ దీసికొని యద్భుత కల్పనా సామగ్రితో నాతని యక్కచేఁ జెప్పించిన నీతులు. సుశీలను బోషించుచుఁ దద్భర్త యగు కటిలబాహ్మణునిఁ గూర్చి వర్ణించిన వర్ణనలు కవికిఁగల సారస్వత స్వాతంత్ర్య మునకుఁదార్కాణములుగ నున్నవి. రామకృష్ణుఁడు హాస్య కథా కౌశలుఁడనఁ దగిన తావు లాతని గ్రంథములన్నింటను గలవు. ఉద్భటారాధ్య చరితమునందలి రెండవయాశ్వాసమునఁగల మదాలసుని కథయు నీకవికిఁగల రచనా కౌశలమునకు నాదర్శ ప్రాయములై మనోహరతరములుగా నున్నవి.

రామకృష్ణుని కవితలో ననుకరణము మందున కేని గానరాదు భావములు స్వతంత్రములు. ధారనిరర్గళము. భక్తిరసముట్టి పడునటుల శ్రీవిష్ణు క్షేత్రమాహాత్మ్యము లెన్ని వాకొనినను శృంగారరస ఘట్టము వచ్చెనేని, ఉచితమగు కథాంశము లభించెనేని యీమహాకవి తన నేరుపు కూరుపు జూపుటలో నద్వితీయుఁడు. ఇమ్మహాకవి యొకఁడె తెలుఁగున స్వతంత్ర భావకవితా కౌశలుఁడు. కథా కల్పనముగల గ్రంథరచనమునకె యితఁడు పూనుకొనెనేని వాఙ్మయమును సర్వంకషముగ నలంకరించినవాఁడే! కృష్ణదేవరాయలకీ కవి యంకిత మీయమికిఁ గారణము తెలియరాదు.

32. గుప్త సామ్రాజ్యము

గుప్తరాజులయొక్క శిలాలేఖనములనుండి చరిత్ర కొంతకొంత దెలియవచ్చు చున్నది. ఈ వంశమున రాజ్యము స్థాపించినవాఁడు శ్రీగుప్తుఁడు. శ్రీగుప్తుని కుమారుడు ఘటోత్కచుడును, మనుమడు చంద్రగుప్తుడును నైయుండిరి. ఈతడే ప్రథమ చంద్రగుప్తుడను పేరుతో బ్రఖ్యాతి వహించెను. బౌద్ధమతమున బ్రసిద్ధవహించిన "లిచ్ఛవి" వంశమున జన్మించిన కుమారదేవియను రాజకుమారికను పాణిగ్రహణ మొనర్చెను. ఇందుచే జంద్రగుప్తుని ప్రభావము "రాజాధిరాజ" అను బిరుదు వహించునంతటి యౌన్నత్యపదవికి వచ్చెను. ఇంకను నిందుచేతనే బీహారము, అయోధ్య, తిరహతు ప్రాంతదేశములు దనవశమునకు వచ్చెను. ఈతని రాజధాని పాటలీపుత్రమై యుండెను. పట్టాభిషేకకాలమునుండి గుప్తశకము నేర్పాటు చేసెను. క్రీ.శ. ౩౨౦ సంవత్సరమునుండి ప్రారంభమగుచున్నది. తన ప్రభుత్వమున ననేక విధములైన నాణెములు చెల్లున ట్లేర్పాటు చేసెను. వానినుండి చంద్రగుప్తునియొక్కయు, నాతని రాణియొక్కయు, "లిచ్ఛవి" వంశీకులయొక్కయు బేరులు లభించుచున్నవి. ఆ నాణెములు బంగారుచే జేయబడి యొకప్రక్కను రాజదంపతుల యాకారములు చిత్రతములై బ్రాహ్మీభాషావర్ణములతో "చంద్రగుప్త కుమారదేవీ శ్రీః" అనియు, రెండవ ప్రక్కను సింహవాహనయగు దేవీవిగ్రహమును, "లిచ్ఛవయః" అనియును లిఖింపబడియున్నవి.

ప్రథమ చంద్రగుప్తుని యనంతరము వానిపుత్రుడగు సముద్రగుప్తుడు క్రీ.శ. ౩౨౬ సంవత్సరమున రాజసింహాసన మధిష్ఠించెను. ఇత దత్యంతశక్తిశాలి. ఇంచు మించు సమస్త భారతవర్షమును దన పరిపాలనలోనికి జేర్చుకొనుటనుబట్టి యితని పరాక్రమాదులను మనము సులభముగ గ్రహింపవచ్చును. మఱియు రాజపుత్ర స్థానము బందేలు ఖండుయొక్క యదవిరాజులను దన పరిపాలనలోనికి దీసికొనుటయే గాక దక్షిణమందలి పల్లవులను, రాష్ట్రకూటులను, గళింగులను, మహారాష్ట్రులను జయించి కావేరినది వఱకు గూడ రాజ్యము నభివృద్ధి పరచెను. మఱియు నేపాలము, కామరూపము, బంగాళములును గూడ యాతని యాధీనమునొందెను. పశ్చిమ భారతదేశ ప్రజలు గూడ నాతనిపాలనకు లోబడిరి. కాబూల్ లంకారాజ్యములు కూడ వీనిమైత్రతి నాశించియుండెను. ఈదిగ్విజయమునకు దర్వాత నీతడశ్వమేధ

యాగములు గూడ జేసెను. అనేకవిధములైన నాణెములను దనరాజ్యమున వాడుకలోనికి దెచ్చెను. అవియును బంగారు వైయుండి యొకప్రక్కను రాణియగు "మూర్ఛ ల్దేవి" యజ్ఞస్తంభము జిత్రింపబడి బ్రాహ్మీభాషా క్షరములలో "రాజాధిరాజః పృధి వీవిజిత్య దివం జయ త్యప్రతివార్యవీర్యః" అని వ్రాయబడియున్నది. సముద్రగుప్తుడు మిగుల సద్గుణములు గలవాడును లలితకళావేత్తయునైయుండెను. కవిత్వమల్లుటయు, సంగీత శాస్త్రమును బ్రేమించుటయు ననువానియం దభిమానము మెండుగనుండెను. ఈతని పాలనమున జెల్లిన నాణెములనుబట్టి యాతనికున్న సంగీత శాస్త్రపరిచయాభిమానములు మనము నిర్ణయింపవచ్చును. కొన్ని నాణెములయం దొక ప్రక్కను సముద్రగుప్తుడు కూర్చుండి వీణను వాయించుచున్నట్లు చిత్రింపబడి బ్రాహ్మీవర్ణములతో నాలుగువైపులను "మహారాజాధిరాజ శ్రీ సముద్రగుప్తః" అని లిఖింపబడియున్నది రెండవప్రక్కను లక్ష్మి కూర్చున్నట్లు చిత్రింపబడి 'సముద్రగుప్తః' అని లిఖింపబడి యున్నది.

సముద్రగుప్తుని యనంతరమం దాతనికుమారుడగు ద్వితీయచంద్రగుప్తుడు క్రీ.శ. ౩౭౫ వ సంవత్సరమున పట్టాభిషిక్తుడయ్యెను. తరువాత నాతడు విక్రమాదిత్యుడను బిరుదును ధరించెను. తన ప్రభుత్వమున పశ్చిమ దేశపురాజులను జయించి మాళవ, ఘూర్జర, కథియవారు ద్విపకల్పములయందుగూడ దన ప్రభుత్వాధికారములను వెలయించెను. ఈ సమయముననె బౌద్ధ చైనాయాత్రికుడు "ఫాహియానా" అనునతడు భారతవర్షమునకు వచ్చెను. ఆతడు భారతవర్షమున నైన తత్కాలసౌభాగ్యమును బ్రశంసించియున్నాడు. ఆవాక్యములను బ్రతి భారతీయుడును నభిమానముతో బఠింపవలసినవై యున్నవి. విక్రమాదిత్యుడు తన రాజధానిని పాటలీపుత్రము నుండియ యోధ్యకు మార్చెను. విక్రమార్క శకమునకు మూలమీతడేయని కొందరు విద్వాంసుల మతమైయున్నది. విక్రమాదిత్యుని యాస్థానముననే మహాకవి కాళిదాసుండి యుండెను. ఈతడు మిక్కిలి పరాక్రమవంతుడును, యోధుడునునై యుండెను. విని నాణెములనుండి యాతని బలపరాక్రమాదులు గొంతకొంత తెలియవచ్చుచున్నవి. ఆ నాణెములయం దొక ప్రక్కను విక్రమాదిత్యుడొక మృగరాజుతో పోరాడుచున్నట్లును రెండవప్రక్కను సింహవాహనయగు దేవియును జిత్రింపబడియున్నవి.

ద్వితీయ చంద్రగుప్తుని కుమారుడు కుమారగుప్తుడు క్రీ.శ.౪౧౩ వ సంవత్సరమున గుప్తసామ్రాజ్యమునకు నుత్తరాధికారి యయ్యెను. వీరిపాలనను గూర్చి

విశేషాంశము లేనియును దెలియవచ్చుటలేదు. మొత్తముమీద పూర్వార్జిత సామ్రాజ్యమును చెదరిపోనీయక యవకాశమునుబట్టి క్రొత్త రాజ్యమును దనరాజ్యమున గలుపుకొనుచుండెనని చెప్పవచ్చును. ఎట్లన సార్వభౌమాధికారమును సూచించునట్టి యశ్వమేధయాగము నీత డొనర్చియుండెను. వీని నామములనుబట్టి గుప్తసామ్రాజ్యాధః పతన మీతని పాలనముననై యుండదని నొక్కి చెప్పవచ్చును. కుమార గుప్తుని తర్వాత నాతసిపుత్రుడు స్కందగుప్తుడు క్రీ.శ. ౪౫౫ వ సంవత్సరమున సామ్రాజ్యమున కుత్తరాధికారియయ్యెను. ఈతఁడు సింహాసన మధిష్ఠించగానే యడవులయందలి హూణులు వీనిరాజ్యము నాక్రమించిరి. కాని స్కందగుప్తుడు పరాక్రమముతో వారిని బారఁదోలెను. తరువాత శాంతిప్రదముగా పదుమూడు సంవత్సరములు రాజ్యమేలెను. 470వ సంవత్సరమున దిరిగి హూణులెదిరించి స్కందగుప్తునోడించిరి. ఈతని రాజ్యములో హెచ్చుభాగ మాహూణులవశము కాజొచ్చెను. ఈతని నాణెములబంగార మంత శుభ్రమైనదికాదు. నిర్మాణమునగూడ గొంత యక్రమముండెను. ఈతని నాణెముల నాహూణులు గ్రహించుచుండిరనియు నందు చేఁ జేయునది లేక స్కందగుప్తుఁడిట్టి యక్రమమును బూనవలసిన వాడయ్యెననియు దోచుచున్నది. ఇట్లు నిరుత్సాహియైన స్కంధగుప్తుఁడు క్రీ.శ. ౪౮౦ సంవత్సరమున స్వర్గమునకు జనియెను. వానితోఁగూడ గుప్తసామ్రాజ్య మంతరింపఁజొచ్చెను. ఈ వంశముయొక్క యొక శాఖ 600ల సంవత్సరము వరకు మగధ దేశములోను మఱియొక శాఖ 500ల వరకు మాళవదేశములోను కేవలము రాజ్య మొనర్చుచుండెను. గుప్తరాజుల నాణెముల నుండి రెండు విషయములు దెలియుచున్నవి. అందొకటి గుప్తరాజుల నాణెములపై బౌద్ధధర్మముల యొక్క చిహ్నములు లేకుండుట. పౌరాణిక దేవతలగు దేవీదేవతల మూర్తులుండుట. రెండవది నాణెములపై శుద్ధ సంస్కృతభాష బ్రాహ్మిలిపితో నుండుట. దీనిచే గుప్తరాజుల కాలమున బౌద్ధమతప్రచారము లేదనియు స్వల్పముగా సంస్కృత భాషాప్రచారము గలదనియుఁ దేలుచున్నది. గుప్తరాజులు పౌరాణిక ధర్మానుష్ఠానపరులనియు సంస్కృత భాషాభిమానత గల వారనియు దెలియుచున్నది.

– సారస్వత సర్వస్వము (1.2.1922)

కలవకొలనుశాసనము[1]

1. ఓం స్వస్తిశ్రీ జయాభ్యుదయ శకవషాᳵలు ౧౨౪౩ అగు దు
2. ర్మతి సంవత్సర భాద్రపద శు॥ ౧౧ గురువారాన। స్వస్తిశ్రీ (మ) న్మ
3. హా మన్డలేశ్వర కాకతీయ్య ప్రతాపరుద్రదేవ మహారాజు
4. లు పృద్ధిరాజ్యంబు సేయుచుంనుండంగాను। స్వస్తిశ్రీ మ
5. న్మహాసామంతచేఱకు జగదాళు ఇమ్మడి దేవరంగా
6. రి సుపుతృ(త్రు)లు ప్రోలయరెడ్డివారు తమకు ఆయురా
7. రోగ్యస్థైయాᳵభివృద్ధిగాను కలువకొలని శ్రీప్రసన్న
8. వల్లభ దేవరకు అంగరంగభోగార్ధమై అష్టాదశప్రజ
9. లను అనుమతించి దారబోసి ఇచ్చినవత్రము కలు
10. వ కొలని సుంకానకు వచ్చిచూడబడిసర్వద్రవ్యాలవల
11. నను మాడబడి అమ్మబడి వీసం లెక్కనిచ్చిరి మరిన్ని తమ
12. వత్యా.....త్తరినియోగముజ.....వ.............
13. బడి యాడబడి వీసం లెక్కనిచ్చిరి॥ ఈ ధర్మము ఆ చంద్రార్క
14. స్థాయిగానిచ్చిరి.........

మాదిరెడ్డి కుంటశాసనము[2]

1. యో రామేశ్వరపండితో యమితి దిగ్వ్యా
2. ప్తో యశఃశ్చంద్రికా జాత్తై ర్యో
3. గుణరత్నరోహణగిరి ర్మాహేశ్వ
4. రగ్రామణీః। ఏతేషాం సురసద్మనా
5. చ కృతవాᳵ పుంజం ఘృణాతత్పరో
6. దాతాన్నం వికలార్తదీనమునివిప్రే
7. భ్య స్తపోవిశ్రుతః॥ (1) కృత్వా వై
8. జనవల్యాః శివపురనామ త్రిపురు

---

1. ఈ శాసనముయొక్క నకలు శ్రీదూపాటి వేంకట రమణాచార్యుల వారిచే నొసంగబడినది ॥సం॥

2. మండలివారి వద్దనున్న ప్రతిబింబమునుండి.

9. షతీర్థం। స్వదత్తం యస్య భక్త్యా
10. త్రిభువనమల్లావనీశజన కేన॥ (2)
11. వేత్తా యా (యో)లకులేశ్వరాగమమ
12. హాసిద్ధాంన్తసారామృతం యే
13. నాస్యం(స్యాం) ప్రకటీకృతౌ పసుమతౌ
14. ధర్మ స్య(శ్చ) యస్యోత్తమః॥
15. శిష్యో సౌ చలమర్తిగండనృప
16. తిః ప్రోలావనీవల్లభః స్తంభం
17. స్తాపితవాన్ స్వకీర్తి విమల స్తం
18. భాయితః శాశ్వతం॥ (3)

అనుబంధం

ఆత్మకథ

చ. తల నెఱసె దనూపటిమ తగ్గుచునున్నది జీవయాత్రపైఁ
దొలఁగుచునుండె సమ్మదము దుస్తరసంసరణాంబురాశిలోఁ
దలమునుకల్ పొనర్పఁగలతాలిమి లేదిఁక నీపదాబ్జముల్
తలఁపున నిల్పుకోఁదగినస్థైర్య మొసంగవె భక్తవత్సలా ! 1

ఉ. సేవకవృత్తిలో క్షణము చిక్కదుతీఱిక యాంధ్రభారతీ
సేవకు వీలు కన్పడదు "జీవితలక్ష్యము దేహయాత్రయే
చావును బుట్టువుల్ ప్రకృతిచర్యల" టంచును దృప్తినొంద నీ
జీవికిఁ జేతఁగా దెటులఁజేకురు నూఱట భక్తవత్సలా ! 2

గీ. కూర్పుబింకంబులును భావగుంభనములు
లలితశయ్యలు మధురకల్పనలు గలుగు
తెలుఁగుకబ్బంబు లరయఁగా వలనుపడని
శిథిలజీవిత మేల యిచ్చితివి తండ్రీ ! 3

ఉ. నన్నయభట్టభారతమునన్ రసవాహిను లుల్లసిల్లుమేల్
తెన్నులఁజూచి సమ్మదమతిం బ్రకృతిన్ మఱపొందియున్నచోఁ
గన్నులఁగట్టిన ట్లగును గౌరవపాండవసంగరంబు నా
కెన్నటికైన శక్యమగునే? ప్రథమాంధ్రకవీంద్ర పద్ధతుల్ 4

మ. ప్రతివాక్యంబున రామణీయకము నాంధ్రత్వంబు నెక్కొల్పి భా
రతమందున్ బదునేనుపర్వముల ధారాశుద్ధిమై వ్రాసి యి
చ్చితి వాంధ్రావని కీవు తిక్కనకవీ! చేకూరునే తద్రసో
ద్గతగట్టంబులఁ జూచి సమ్ముదమునొందన్ జిత్తసంశుద్ధిగన్. 5

సీ. శంభుదాసమనోజ్ఞశైలి నుద్బోధించు
హరివంశకవితారహస్య మరసి
శ్రీనాథసుకవితాసేవధియై మించు
నైషధకావ్యసందర్భ మెంచి
సహజపాండిత్య వాచాసుధావార్ధియై

యలరుభాగవతంబు నాలకించి
కృష్ణరాయనృపాలకీర్తిచంద్రిక యగు
నాముక్తమాల్యద నాశ్రయించి 5

గీ. ఆంధ్రభూమిని నాంధ్రుఁడనై జనించి
ధన్యతమజీవినైతని తలఁచువేళఁ
జిరతి రాగతసేవకజీవితంబు
కటకటా! యడ్డుపడు నెటు గల్గు దృప్తి? 6

క. ఉత్తర రామాయణమునఁ
జిత్తరువుగ సీతశూన్యజీవితమును లో
కొత్తరుఁడు పాపరా...
హత్తించెఁ బఠించు టొదన దహరహ మకటా! 7

ఉ. తొల్లిఁటి తెన్గుకబ్బములతో నిహరించి రసప్రపంచము
దుల్లము నిల్పి వాఙ్మయశుభోదయముల్ తిలకింపనైతి నా
తల్లికి నాంధ్రభారతికి దైవతవాణికి సేవఁజేయకే
యల్లన జీవయాత్ర తెగనాడితి నెంతనిసంతసించెదన్. 8

చ. పురువులు ప్రింగ జీర్ణ మగుపూర్వకృతిప్రచయంబు మందిరాం
తరమునఁ జేర్చికొంటి నొకదాని లిఖింపఁగ లేకపోతి నా
కరమున జీర్ణతాళదళకావ్యపరంపర నుద్ధరింపఁగా
వెరవు లభింప దీనగపు వీడదు సైచుట యెట్లు నెవ్వగన్. 9

మ. కవితల్ వ్రాయుదునా? పురాతనకృతుల్ కాపాడ యత్నింతునా?
కవిరత్నంబులభవ్యకావ్యరచనా కల్పంబు లాలింతునా?
భవబంధం బగు ఘోరసంసరణసంబంధంబులో నుందునా?
అవురా! తోఁచదు నాదుజీవితసమస్యల్ పూర్తి కానేర్చునే! 10

మ. ప్రతివారంబును బత్రికావితతికిన్ వ్యాసంబు లీనైతి జీ
వితలక్ష్యం బది మాతృసేవయని భావింపంగలేనైతి, స
ద్గతికై యత్న మొనర్పనైతి నిజసంకల్పంబు లిట్లుండ జీ
వితసంపూర్తి యొనర్పఁబోకుము దయాబ్ధీ! దైవచూడామణీ! 11

సీ. పఠియింపలేనైతి భావనాబంధుర
ప్రాచీనసత్కావ్యరత్నములను
అర్చింపలేనైతి నాంధ్ర సరస్వతీ
మహనీయపాదపద్మద్వయంబు
శోధింపలేనైతి సుకవికావ్యాలీన
రుచిరవాఙ్మయసుస్వరూపకలన
విహరింపలేనైతి వివృతనాకద్వార
ఘంటాపథాధ్యాత్మకర్మవీధి 12

గీ. జరగె జీవితమున నొక్కసగము కడమ
సగము రోగజరాదికసంకులంబు
అకట! యీశూన్యజీవి కీయైహికమున
నుచిత ఫలసిద్ధి కనుభవ మొదవదయ్యె 13

క. పావను లగుతలిదండ్రులఁ
బూవులతోఁ బూజసేసి పురుషార్థంబుల్
సేవింపనైతి వృథగా
జీవితలక్ష్యంబుగూడ శిథిలం బయ్యెన్ 14

మ. మును జేకూరిన సంస్కృతాంధ్ర కవితామూల్యప్రచారంబు, జీ
వనఘంటాపథ మాచరించి చరియింపన్ సాగితిన్ భవ్యకా
వ్యనిధుల్ త్రవ్వి రసజ్ఞలోకమున కీయన్ జాలనైతిన్ మహో
వనవిభ్రాజిత చంద్రికారుచుల లేవన్ స్రుగ్గె నానేరుపుల్. 15

మ. అవధానంబు లటంచుఁ గావ్యకలనావ్యాసంగ మంచున్ వృథా
వ్యవహారంబులలోఁ దగుల్కొని కవిత్వప్రౌఢిఁ గోల్పోతి నా
కవునే భవ్యమృదూ క్తిబంధురమహాకావ్యప్రతాపంబు స
త్కవిలోకం బరుదందఁగా సలుపుదీక్షాదక్షధీసంపదల్ 16

మ. నిగమార్థంబులు తేటతెన్గునుడులన్ నిండారఁగాఁ గూర్చి ధ
ర్మగుణాలంకృతు లైనపూర్వకవిసామ్రాట్టుల్ మహాగ్రంథముల్
మొగిఁగల్పించిరి తత్తదంచితరసాపూరంబు శ్రోత్రాంజలిన్
మిగులన్ గ్రోలనిరిక్తజన్ముఁడ వశంబే? నాకు ధర్మార్థముల్. 17

మ. విలసిల్లెఁ యువకాశయంబుల రసస్విన్నంబులౌ భావనా
జలజన్యంబులు నూత్నకల్పనము లీప్రాంద్రోనసంసారి కా
ఫలముల్ వాచవి గావు ప్రాక్పథమునం బ్రాగల్భ్యమా లేదు సం
కులసంరంభమునందు మధ్యమ దగుల్కొనాఁడ నెం దేగుదు.ఁ 18

మ. కులధర్మంబులలోన మా ర్పొదవెఁ దళ్కుల్ బెళ్కులుం జూపి వ
న్నెలు చిన్నెల్ పచరించువంచకుల కెందే గౌరవం బున్న దీ
కలికాలంబున ధర్మసంగ్రహణ సంకల్పంబుఁ బోనాడి ని
ష్ఫలమౌ నాస్తికజీవితం బెటుల నే సాధింతు సర్వేశ్వరా ! 19

మ. సంభావ్యంబుగ దైవతాంధ్రకవితాసంపత్తితో శాసన
స్తంభంబుల్ నెలకొల్పి రెందఱొ కళాధౌరేయు లాకల్పనా
గాంభీర్యంబుల నైతిహాసికమతిఁ గన్గొంటలే కీకుటుం
బాంభోరాశిని మున్గియుండు టది శక్యంబౌనె? నా కీశ్వరా? 20

మ. రమణీయంబుగఁ దీర్చి కూర్చిన సమగ్రగ్రంథభాండారరా
జమునం జేరినవేళ నాదగునవస్థల్ దెల్పఁగాఁజాలఁ గా
వ్యములం దన్నియు నుత్తమోత్తమములే భాషాచమత్కారధు
ర్యము లే నేది పఠింపుదుఁ రసపిపాసాయ త్తచిత్తంబునఁ. 21

సీ. స్వాతంత్ర్య సౌభాగ్యసంధాయకం బైన
కర్షకవృత్తితోఁ గడపనేర్చి
కవితాలతాంగిమేల్కవుఁగింట రేఁబవ
ళ్ళను రాగవశమున నత్తమిల్లి
విస్మృతకావ్యార్థ విభవసంగ్రహణమే
జీవితఫలముగాఁ జింతసేసి
వాఙ్మయసేవనవ్రతమహాదీక్షతో
జన్మఫలంబును సంతరించి

గీ. కవితతోఁ గావ్యకలనతోఁ గవివరేణ్య
కవనసంపత్తితో మహాకవివిసృష్ట
కీర్తికౌముదిలో నాంధ్రకీర్తనంబు
సలుపు టొదవునె నాకు నీజన్మమందు? 22

ఉ. నన్నయభట్టకావ్యకలనంబు గనుంగొనునంతలోనఁ ది
క్కన్న కవిత్వవైభవము గాంచ మనస్సగు నంతలోనఁ బో
తన్న మహారాసార్ద్రకృతియందు జనించును గోర్కి, యీరన
స్విన్న మనస్కుఁ డేకవిత చేకొన శక్తుఁడొకో ప్రియంబుగన్. 23

శా. కాకత్యాంధ్రనృపాలకుల్ ననయశఃకన్యావరుల్ సద్గుణా
స్తోకుల్ గట్టినయోరుగంట వితతస్తూపంబు లొప్పారె సం
దేకాకారము నొంది శిల్పనిచయం బెంతెంత దాఁగున్నదో
నా కెన్నండది చూడఁగల్గునొకొ? యానందాశ్రుధారాప్లుతిన్. 24

సీ. పురుష వేషముతోడ భువనమోహనమైన
సౌందర్య రేఖను జాటుపఱచి
సేవణసైన్యంపుఁజూపుఁ జూచినదాఁక
తురగంబు దిగనని బిరుదుఁగట్టి
నవలక్షతెన్గు సేనలకు ముందట నిల్చి
దేవగిరికిఁ గ్రొత్తత్రోవఁ దీసి
మహరాష్ట్రభూపతి మహదేవునవనతి
తిలకించి హితము బోధించి యనిపి 25

గీ. నలుబదేడులు విక్రమకలన నాంధ్ర
దేశ మేలినరుద్రమ దేవి కీర్తి
గీతికలఁ బాడుకొనుచు సంజాతమోద
పరవశత్వంబుఁ గాంచిసద్బ్రదుకె బ్రదుకు 26

మ. అవలోకించితి సంస్కృతాంధ్రకృతు లర్థాపేక్షతో ముద్రణ
వ్యవహారంబులలోనఁ ద్రిమ్మరితి దేశాంతస్థనానాకృతి
ప్రవరం బెంతయు నుద్ధరించితిని నాపాపంబొ యీవాఙ్మయ
వ్యవసాయస్థమహత్త్వమో తనివిలే దావంత యేనాఁటికిన్. 27

చ. జననము లేని నీచరణసారససేవనజీవనంబు నా
కనువుగఁ గూర్పు మీశ్వర! దయానిధి! కాదని కూర్చుచోఁ బున
ర్జననము నోరుగల్లునగరంబున ద్వారచతుష్కమధ్య నా
కొనరుచు మీఁగఁగానయిన నుండెద శిల్పశిలాంతికంబునన్. 28

శేషాద్రి రమణకవుల వాఙ్మయ సూచిక

ఇది సమగ్ర వాఙ్మయ సూచికకాదు. ఇందులో చేరనివి
మరికొన్ని ఉన్నాయి. మరో సందర్భంలో ప్రచురించుకొందాము.
ఇవిగాక మిత్రులకు రాసిన అనేక పద్యలేఖలు,
గ్రంథాభిప్రాయములు, పీఠికలు అనేకం ఉన్నాయి.

కావ్యాలు - కవితలు

1. కావ్యాలు :

1. ఉదయలక్ష్మి : ప్రథమ ముద్రణ : 1923, రచనా కాలం 1923, ప్రచురణ శ్రీ వీరేశలింగం కంఠాభరణ గ్రంథమాల, ఉస్మానియా ముద్రణాలయము, నల్గొండ, 1/8 డెమ్మీ సైజు; పుటలు 8 + 26 మొదటి కూర్పు 1000 ప్రతులు, 'శ్రీయును శైలపుత్రి' అనే పద్యంతో ఆరంభమై 'పూతమొనర్పుము మిత్రరత్నమా' అనే పద్యంతో కావ్యం ముగుస్తుంది. మొత్తం 112 పద్యాలు.

2. నిజాము రాష్ట్ర ప్రశంస : ముద్రణ 1924, రచనా కాలము 1923, ప్రచురణ నీలగిరి పత్రికాధిపతులు; 1/8 క్రౌను, పుటలు 6+113, వెల 0-8-0. ఇందులో 10 శీర్షికలున్నాయి. 93 పద్యాలు ఉన్నాయి. ఇవికాక అనుబంధంలో 5 శీర్షికలున్న కవితలతో బాటు అకారాదిగా చరిత్ర స్థలాలను తెలిపే విషయ వివరణ పట్టిక ఉంది.

3. నీతి గీతములు : ఈ కావ్యం సంస్కృతంలో క్షేమేంద్రుడు వ్రాసిన 'చారుచర్య' అనే కృతికి తెనుగు సేత. రమణాచార్యులవారు 'తమ జీవిత చరిత్రం' (ముద్రితం) మొదటి భాగంలో ఈ రచన గురించి పేర్కొన్నారు. రచనా కాలము 1922-1929 మధ్య.

4. మందార మంజరి ప్ర.ము 1913-1914, రచనా కాలము 1910, రమణాచార్యులవారు తమ 'జీవిత చరిత్రం' (ముద్రితం) మొదటి భాగంలో ఈ రచన గురించి పేర్కొన్నారు.

5. విక్రమోర్వశీయము : ప్ర.ము 1926, రచనా కాలము 1916, ప్రచురణ ప్రబంధరత్నమాల-1, ఆంధ్ర గ్రంథాలయ ముద్రాక్షరశాల - బెజవాడ, 1/8 డెమ్మీ, పుటలు 12+97+2, వెల 0-12-0 అణాలు, అయిదాశ్వాసాల ప్రబంధం, మొదట దాతృప్రశంస 10 పద్యాలు. పిదప ప్రథమాశ్వాసం కృత్యాది 'శ్రీమద్భూమి'తో మొదలై పంచమాశ్వాసంలో 'సమాన సుందరా' అనే పద్యంతో ముగుస్తుంది. కొప్పర్తి నారాయణమూర్తిగారు ఈ పుస్తకానికి పీఠిక వ్రాశారు.

2. శతకాలు :

ఎ. బాలనీతి శతకము : ప్ర.ము 1929, ప్రచురణ వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ – మద్రాస్ 1/8 క్రౌను; పుటలు 19. ఈ శతకం వావిళ్ళవారు ప్రచురించిన నీతిశతక సంపుటంలో చేర్చి అచ్చువేయబడింది. నీతిశతక సంపుటంలో ఈ శతకం 16 వదిగా 469–488 పుటల మధ్య చేర్చబడింది. ఇందులో 102 పద్యాలున్నాయి. ఈ శతకం సంస్కృతంలో కుసుమదేవ కవి రచించిన 'దృష్టాంత కళిక' అనబడే శతకానికి తెనుగు సేత. తేటగీతి చందంలో వ్రాయబడిన ఈ శతకంలో మకుట నియమం పాటింపబడలేదు.

బి. భక్తవత్సల శతకము : ప్ర.ము. 1927, రచనా కాలము 1926. ప్రచురణ వేంకట్రామ్ అండ్ కో బెజవాడ, రామాముద్రాక్షరశాల – ఏలూరు. 1/8 క్రౌను పుటలు 4 + 18, వెల 0–2–0 అణాలు ఈ శతకంలో 104 పద్యాలు ఉన్నవి.

సి. సర్వలోకేశ్వర శతకము : ప్ర.ము 1928, రచనా కాలము 1912–1916, ప్రచురణ : వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ – మద్రాస్, 1/8 క్రౌన్ పుటలు 4+28, వెల 0–0–12 పై. ఈ శతకంలో 115 పద్యాలున్నాయి. ఈ శకతానికి సంబంధించిన 14 పద్యాలు 1926 ఏప్రిల్ నాటి భారతిలో అచ్చైనాయి.

3. కవితలు : (143 శీర్షికలు – సుమారు 5000 పంక్తులు)

అతిథిపూజ – పంటరెడ్డి – 16 పద్యాలు ప్రచురణ పత్రిక రెడ్డిరాణి, సం. 1–21 పుటలు 37, 38, నవంబర్ 1923.

అతిథిపూజ : 19 పద్యాలు, ప్రచురణ పత్రిక భారతి, సంచిక 2–7, పుటలు 6–8, జులై 1925.

అనుమకొండ : 1 పద్యం వరంగల్ కాలేజ్ సంచిక, 1/8 నోటు బుక్కులోని 154వ పుటలో వ్రాయబడి ఉంది.

అన్నపూర్ణాదేవి ప్రశంస : 5 పద్యాలు ప్రచురణ 'ఆంధ్రప్రతిక', పుటలు 249, 250, విభవ ఉగాది సంచిక 1928.

అన్యోక్తిముక్తావళి : 5 పద్యాలు. ప్రచురణ పత్రిక 'సారస్వత సర్వస్వము', సంచిక 3, పుట 8, 1924.

అన్వేషణము-రాధ : 18 ద్విపద పంక్తులు. ప్రచురణ పత్రిక 'భారతి'. సంచిక 4-5 పుట 120, మే 1927.

అశ్రుభిక్ష : 18 గీతాలు. ప్రచురణ పత్రిక 'సాహితి', సంచిక 5-3 పుటలు 147-150, రుధిరోద్గారి ఆశ్వీజ, 1923.

అహంకారము : 4 గీతాలు ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 4-7, పుట 113, జులై 1927.

ఆంధ్రనగరము : 8 గీతాలు ప్రచురణ పత్రిక 'శారద' సంచిక 2-1, పుట 447, జూన్ 1924.

ఆంధ్రనగరము : ప్రచురణ పత్రిక 'ఆంధ్రాభ్యుదయము', సంచిక 3-2, పుట 18, 19. మార్చి 1925.

ఆంధ్రపతాకము : 7 పద్యాలు ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 15-1, పుట 2, జనవరి 1938.

ఆంధ్రభూమి : 6 పద్యాలు ప్రచురణ పత్రిక 'ఆంధ్రభూమి', సంచిక 1-4, పుట 12, ఆగస్టు 1933.

ఆంధ్రభూమి : 12 గీతాలు, ప్రచురణ పత్రిక 'గోలకొండ పత్రిక' పుట-2, డిసెంబర్ 1935.

ఆంధ్ర మాతృ సందేశము : 5 పద్యాలు 'గోలకొండ పత్రిక', సంచిక 4-80, పుట 12, మార్చి 3, 1930.

ఆంధ్ర సామ్రాజ్యము : 22 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గోలకొండ', పుట 9-13, 1928.

ఆంధ్రాభ్యుదయము : 1 పద్యం ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి'. పుట 666.

ఆదిశంకరుడు - అంత్యజుడు : 13 పద్యాలు ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి' సంచిక 5-12, పుట 1082, ఫిబ్రవరి 1933.

ఆవేగము : 1 పద్యం ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 2-9, పుట 12 సెప్టెంబర్, 1925.

ఆశీస్సు : 5 పద్యాలు ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 2-1, పుట 1, జనవరి 1928.

ఇది కవిత్వమా : 17 గీతాలు, ప్రచురణ పత్రిక 'శోభ', సంచిక 2-5, పుట 3, ఆగష్టు 1950.

ఉదయలక్ష్మి : ప్రచురణ పత్రిక 'ఆంధ్రలక్ష్మి' III 2, 3 1924.

ఊహాగానము : 38 గీత పంక్తులు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 11-2, పుట 250, ఫిబ్రవరి 1934.

ఎవడు సుకవి : 60 గీతపంక్తులు, ప్రచురణ పత్రిక 'శారద', సంచిక 2-1 పుట 136 సెప్టెంబర్ 1924.

ఓ యదృష్టమ నీకీర్తి యుజ్జ్వలంబు : 69 గీత పంక్తులు ప్రచురణ పత్రిక 'చంద్రిక' సంచిక 1-6, పుటలు 391, 392, ఆగస్టు 1934.

ఓరుగంటి శిథిలములు – శోభనముల బావి : 8 పద్యాలు ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', పుటలు 207, 208, 1935.

ఓరుగల్లు : 5 గీత పద్యాలు, ప్రచురణ పత్రిక 'గోలకొండ పత్రిక', 1, ఆగస్టు 1935.

ఓరుగల్లు కోట : 18 ద్విపదపంక్తులు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 3-11, పుట ముఖపత్రం, అక్టోబర్ 1926.

కపోతదాంపత్యము : 16 గీతాలు ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 8-5, పుటలు 803, 804, మే 1931.

కర్తవ్యము : 5 గీతాలు ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 6-58, పుట 3, డిసెంబర్ 1951.

కర్తవ్యము : 4 గీతాలు ప్రచురణ పత్రిక 'ఆంధ్రభారతి', సంచిక 2-5, పుట 2, ఆగష్టు 1927.

కవికి భాగ్యమేల : 12 గీతాలు ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 2-11, పుట 32, నవంబర్ 1925.

కవి జిజ్ఞాస : 14 పద్యాలు ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 3-4, పుట 99, ఏప్రిల్ 1926.

కవి నిర్వేదము : 10 గీతాలు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 9-7, పుట 38, జులై 1932.

కవి నిర్వేదము : 9 పద్యాలు, ప్రచురణ పత్రిక 'ఆంధ్రభారతి', సంచిక 2-9, పుట 609, నవంబర్ 1934.

కవయిత్రి మొల్ల : 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 7-9, పుట 609, నవంబర్ 1934.

కాకతిప్రోలరాజు : 9 పద్యాలు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 9-3, పుట 451, మార్చ్ 19..2.

కాకతీయాంధ్రలక్ష్మి : 1 పద్యం, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 1-9, పుట 32, సెప్టెంబర్ 1924.

కానరాకుండిరకట యీ కాలమందు : 1 పద్యం ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 3-7, పుట 517, సెప్టెంబర్ 1930.

కాపుకన్నె : 1 పద్యం ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 1-12, పుట 139, డిసెంబర్ 1924.

కాపుపడుచు : 5 గీతాలు, ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 11-14, పుట 2, జూన్ 1936.

కావ్యగానము : 12 గీతాలు, ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక ?, పుట 5, ఫిబ్రవరి 1927.

కావ్యనిధి చెలికాని లచ్చారాయస్మృతి : 1 పద్యం, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 1-1, పుట 144, జనవరి 1924.

కుంతీ సందేశము : 35 పద్యాలు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 7-5, పుటలు 804-808, మే 1930

కురంగము : 8 పద్యాలు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 8-10, పుటలు 605, 606, అక్టోబర్ 1931.

కృతఘ్నత : 5 గీతాలు, ప్రచురణ పత్రిక 'గోలకొండ పత్రిక', సంచిక 9, పుట 7, మే 1934.

కృతజ్ఞతావందనము : 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 2–1, పుట 19, జనవరి 1928.

కృతార్థత : 5 గీతాలు, ప్రచురణ పత్రిక 'ఆంధ్రభూమి', పుట 811

కృష్ణదేవరాయా : 8 గీతాలు, ప్రచురణ పత్రిక 'ఆంధ్రాభ్యుదయము', పుట 25, 26, మార్చి 1924.

కోకిల : ప్రచురణ పత్రిక విభూతి, ఏప్రిల్ 1940.

కోకిల గీతము : 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'శారద', సంచిక 2–2, పుట 167, అక్టోబర్ 1923.

గృహలక్ష్మి జయంతి మహోత్సవము : 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', మార్చి 1930.

గోరువంక : 28 పద్యాలు, ప్రచురణ పత్రిక 'భారతి', పుట 104–106, డిసెంబర్ 1929.

గ్రామ జీవనము : 5 పద్యాలు, 'గోలకొండ పత్రిక', సంచిక 10–3, పుట 3, 16 మే 1935.

చంద్రగ్రహణము : 4 గీతాలు, ప్రచురణ పత్రిక నీలగిరి, పుట 5, 10 సెప్టెంబర్ 1920.

చాటుపద్యము : 1 పద్యం, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 17–1, పుట 32, జనవరి 1940.

చామర్తిరాజశేఖర కవిరాయస్మృతి : 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', సంచిక 13, పుట 199, మే 10, 1922.

చెల్లెలా : 7 ముత్యాలసరాలు, ప్రచురణ పత్రిక 'రెడ్డిరాణి', సంచిక 1–4, 116, జనవరి 1924.

చైత్రలక్ష్మి : 1 పద్యం, ప్రచురణపత్రిక 'భారతి', సంచిక 1–6, పుట 6, జూన్ 1924.

జలక్రీడ : 27 పద్యాలు, ప్రచురణ పత్రిక నీలగిరి, పుట 70–72, 1924.

జానకీ ప్రశంస : 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 7, పుట 809, నవంబర్ 1932.

తల్లినీవెవతెవమ్మ : 113 గీత పంక్తులు, ప్రచురణ పత్రిక 'ప్రబుద్ధాంధ్ర', సంచిక 3-6, పుట 103, 104, జనవరి 1924.

తెనుగుతల్లి : 14 గీతాలు, ప్రచురణ పత్రిక 'ఆంధ్రభూమి', సంచిక 8-5, పుట 179, డిసెంబర్ 1939.

తెలంగాణము : 6 పద్యాలు, ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', పుట 46, 47, 1938.

నందీశ్వరుడు : 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గోలకొండ పత్రిక', సంచిక 7-81, పుట 1, 2; మార్చి 1933.

నాగరక విప్లవము : 1 పద్యం, ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 2-10, పుట 9-9, డిసెంబర్ 1929.

నా గోరువంక : 48 గీత పంక్తులు, 4 పద్యాలు ప్రచురణ పత్రిక 'ఆనందభారతి', సంచిక 1-3, పుట 96-98, జూన్ 1929.

నిజాం ప్రభువరేణ్యుని రజతోత్సవ ప్రశంస : 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గోలకొండ పత్రిక', సంచిక 1-8, పుట 2, 1, మార్చి 1937.

నిరర్థక జన్మ : 20 గీతపంక్తులు, ప్రచురణ పత్రిక 'ఆంధ్ర సర్వస్వము', సంచిక 1-9, పుట 261, సెప్టెంబర్ 1924.

నిర్వేదము : 6 గీతాలు, ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 3-5, పుట 380, ఆగష్టు 1929.

నిర్వేదము : ప్రచురణ పత్రిక 'విభూతి' II -1

నీవెవడవు : 46 గీత పంక్తులు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 9-12, పుట 895. డిసెంబర్ 1932.

నేను ధన్యుడ : 12 గీతాలు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 2-6, పుట 41, జూన్ 1925.

పంచమ సోదరుడు : 6 పద్యాలు, ప్రచురణ పత్రిక 'ఆంధ్రభారతి', సంచిక 2-1, పుటలు 29, 30, ఏప్రిల్ 1927.

పక్షి అన్యోక్తి : 3 గీతాలు, ప్రచురణ పత్రిక 'నీలగిరి', పుట. జులై 1928.

పద్యావళి (గ్రంధాలయ ప్రశంస) 8 పద్యాలు, ప్రచురణ పత్రిక 'తెనుగు పత్రిక', సంచిక 3-41, పుట 5, జూన్ 1925.

పసిపాప : 4 ద్విపదలు : ప్రచురణ పత్రిక 'సాహితి', సంచిక 5–3, పుట 145, అక్టోబర్ 1924.

పరిశోధనోద్యమము : 5 పద్యాలు, 'శ్రీకృష్ణదేవరాయ గ్రంథాలయ రజతోత్సవ సంచిక', పుట 38, 1927.

పాంథప్రబోధము : 4 పద్యాలు, ప్రచురణ పత్రిక 'సుధ', సంచిక 1–12, పుట 37, 1931.

పోతన స్మరణము ప్రచురణ పత్రిక 'తెనుగుతల్లి', మార్చి 1940.

ప్రకృతి ప్రపంచము : 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 1–5, పుట 41, మే 1924.

ప్రతాపరుద్ర చక్రవర్తి : 26 పద్యాలు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 5–12, పుట 551–555, అక్టోబర్ 1928.

ప్రణయ రాధిక : 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 3–5, పుట 6, మే 1926.

ప్రబోధ గీతములు : 6 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గోలకొండ పత్రిక', సంచిక 11–60, పుట 19, డిసెంబర్ 1936.

ప్రశంసా పద్యములు : 8 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గోలకొండ సంచిక' 9–86, పుట –1, మార్చి 1935.

ప్రశంసా పద్యములు : 13 పద్యాలు, ప్రచురణ పత్రిక 'అభినవ సరస్వతి', పుట 154, జనవరి 1936.

ప్రశంసా పద్యములు (అయ్యంకి వెంకటరమణయ్య) 11 పద్యాలు ప్రచురణ పత్రిక 'సరస్వతీ సామ్రాజ్యము', డిసెంబర్ 1942.

ప్రాక్తనాచారముల కెట్టి పదవి గలిగె ? 1 పద్యం, ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 2–11, పుట 995, జనవరి 1930.

ప్రేమగీతి ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక', 19 జూన్ 1920.

ప్రేమతత్త్వము ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక', 18 అక్టోబర్ 1919

బమ్మెర పోతరాజు : 10 పద్యాలు, ప్రచురణ పత్రిక 'ఆంధ్రభూమి', పుట 318, 319, ఫిబ్రవరి 1934.

భావ తరంగములు : 7 పద్యాలు, ప్రచురణ పత్రిక 'పుష్పమాల', సంచిక 1–4, పుట 39, 40.

భావ తరంగములు : 17 పద్యాలు ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 1-3, పుట 31-33, మార్చి 1924.

మహాప్రస్థానము : 11 పద్యాలు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 5-6, పుట 523, జూన్ 1938.

మహామారి : 21 పద్యాలు, ప్రచురణ పత్రిక 'చంద్రిక', సంచిక 1-11, పుట 747-750, జనవరి 1935.

మాతృవందనము : 18 పద్యాలు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 4-1, పుటలు 115, 120, జనవరి 1927.

మాతృవందనము : 45 గీత పంక్తులు ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 6-10, పుట 952, డిసెంబర్ 1933.

మాతృవందనము : 13 పద్యాలు, ప్రచురణ పత్రిక 'ఆంధ్రభూమి', పుట 455, 456, మార్చి 1934.

మాతృవందనము : 12 గీతాలు, ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 7-7, పుట 521, సెప్టెంబర్ 1934.

మాతృవందనము : 83 గీత పంక్తులు, ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 84, పుటలు 259, 260, జూన్ 1935.

మాతృవందనము : 78 గీత పంక్తులు ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 9-1, పుటలు 1041, 1042, మార్చి 1936.

మాతృసందేశము : 5 సీస పద్యాలు; ప్రచురణ పత్రిక 'గోలకొండ పత్రిక', సంచిక 4-84, పుట 5, మార్చి 1930.

మాలకరి : ప్రచురణ పత్రిక 'విభూతి' మే 1940.

మాలపల్లె : 25 పద్యాలు, ప్రచురణ పత్రిక 'కళ', పుటలు 269-273, పుష్య రుధిరోద్గారి, 1924.

మిత్రస్మృతి : 9 పద్యాలు, ప్రచురణ పత్రిక 'సాహితి', పుటలు 50-52, 1922.

రక్తాంజలి : 62 ద్విపద పంక్తులు, ప్రచురణ పత్రిక 'సాహితి', సంచిక 3, పుటలు 149-152.

రాజ్ఞీ రుద్రమదేవి : 10 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 6-1, పుట 15చ మార్చి 1933.

రుద్రమదేవి సందేశము : 9 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 8–3, పుట 209, మే 1935.

లేఖిని : 55 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గోలకొండ పత్రిక', సంచిక 9–15, పుట 3 జూన్ 1934.

విద్యార్థి ప్రబోధము : 7 పద్యాలు, ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 1–12, పుటలు 13, 14, డిసెంబర్ 1927.

విధి : 5 గీతాలు, ప్రచురణ పత్రిక 'ఆంధ్రభూమి', సంచిక 7, పుట 276, 27 జనవరి 1934.

వియోగ రాధిక : 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', పుట 124, మార్చి 1925.

వియోగ రాధిక : 18 పంక్తులు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 5–1, పుట 9, జనవరి 1928.

విరహిణి : 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 4–34, పుట 4, సెప్టెంబర్ 1929.

విశ్రమించిన దేశాభివృద్ధి యెట్లు : 1 పద్యం, ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', పుట 25, 1932.

విషాద గీతములు : 11 పద్యాలు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 15–5, పుట 567, మే 1938.

విస్మృత నగరము : 13 పద్యాలు, ప్రచురణ పత్రిక 'ఆంధ్రభూమి', సంచిక 3–10, పుట 857, 858.

విస్మృత మురళి : ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక'.

వీడ్కోలు : 7 పద్యాలు, ప్రచురణ పత్రిక 'కాలేజి మ్యాగజైను', సంచిక 2–1, 1932.

వీరమాత ఉపదేశము : 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గ్రంథాలయ సర్వస్వము', సంచిక 3–5, పుట 182, 1918.

వేణుగాన స్మరణము : 7 పద్యాలు, ప్రచురణ పత్రిక 'శారద', సంచిక 2–4, పుట 420, డిసెంబర్ 1923.

వేణుగాన స్మరణము : 7 పద్యాలు, ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', సం? పుట 166, 1923.

వేమన యోగి : 9 పద్యాలు, ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 4, పుట 1, ఏప్రిల్ 1927.

వేయి స్తంభాల గుడి శాసన వ్యాసంలో చివరి పద్యం. ప్రచురణ పత్రిక 'వరంగల్ కాలేజ్ పత్రిక', సంచిక 1-34, జులై 1931.

శాద్వలము : 9 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గ్రంథాలయ సర్వస్వము', సంచిక 2-2, పుట 109, 110, 1919.

శిథిల నగరములు : 3 పద్యాలు, ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 3-4, 15 నవంబర్ 1955.

శివాజి ప్రశంస : 4 పద్యాలు, ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 1-5, పుట 1, మే 1927.

సంతాప పద్యములు : 6 పద్యాలు, ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 4-57, డిసెంబర్ 1929.

సంతృప్తి : 5 పద్యాలు ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 1-8, పుట 18, ఆగష్టు 1927.

సంవత్సరాది : 8 గీతాలు, ప్రచురణ పత్రిక 'రెడ్డిరాణి', సంచిక 2-1, పుట 19, ఆగస్టు 1927.

సంవత్సరాది : 8 గీతాలు, ప్రచురణ పత్రిక 'నీలగిరి', పుట 50, రక్తాక్షి 1924.

సంవత్సరాది : 6 పద్యాలు, ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 1-4, పుట, ఏప్రిల్ 1927.

సహగమనము : 23 పద్యాలు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 2-2, పుట 135, ఫిబ్రవరి 1925.

సానుస్మరణము : 1 పద్యం, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 1-2, పుట, ఫిబ్రవరి 1924.

సుకవి : 5 గీతాలు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 2-5, పుట 146, మే 1925.

సోదరీ సందేశము : 8 గీతాలు, ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 4-10, పుట 105, అక్టోబర్ 1927.

సోదరీ సందేశము : 8 గీతాలు, ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 1-6, పుట 14, జూన్ 1927.

స్వప్న కావ్యము : 21 పద్యాలు, 'గ్రంధాలయ సర్వస్వము', సంచిక 6–1, పుటలు 15–17, 1923.

స్త్రీ విద్య : 26 గీత పంక్తులు, 'హిందూ సుందరి', సంచిక 13–10, పుట 2.

హంసాన్యోక్తి : 11 గీతాలు, ప్రచురణ పత్రిక 'ఆంధ్రసర్వస్వము', సంచిక 1–5, పుట 136, మే 1924.

హనుమకొండలేఖ : 33 పద్యాలు, ప్రచురణ పత్రిక 'వైజయంతి', సంచిక 4, పుటలు 30–84, 1936

హనుమకొండలేఖ : మిత్రలేఖలు : 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'వైజయంతి' సంచిక 5, పుటలు 32, 33, 1937

హేమంతయాత్రికుడు : 8 పద్యాలు, ప్రచురణ పత్రిక 'శారద', సంచిక 2–6, పుట 783, ఫిబ్రవరి 1924.

శీర్షిక లేదు : (స్వాగత పద్యాలు) 5 పద్యాలు, ప్రచురణ పత్రిక 'కాకతీయ సంచిక', పుట 290, మార్చి 1932

శీర్షిక లేదు (కోప్పరపు కవుల ప్రశంస) 5 పద్యాలు, ప్రచురణ 'కొప్పరపు సోదరకవుల శతావధానములు' ప్రథమభాగము, పుట 26, 27, 1963

శీర్షికలేదు (కొప్పరపు కవుల ప్రశంస) 2 పద్యాలు, ప్రచురణ 'కొప్పరపు సోదర కవుల చరిత్ర', పుటలు 61, 62, 1973

నాటకాలు – నాటికలు

1. నాటకాలు

1. అర్జునపరాభవము : ప్ర.ము 1916, రచనా కాలము 1912, ప్రచురణ : చంద్రికా ప్రెస్. గుంటూరు 1/8 డెమ్మీ, పుటలు 6+104, వెల 0–10–0 అణాలు, మొదటి కూర్పు 1000 ప్రతులు. కృత్యాదిలో 22 పద్యాలు తక్కినది 6 అంకముల నాటకం. 'పరమానంద' అనే నాందీ పద్యంతో ఆరంభమై షష్ఠాంకంలో 'శాశ్వత సౌఖ్యము గాంత్రుగావుతన్' అనే భరత వాక్యంతో ముగుస్తుంది. ఈ నాటకం కుమార రాజాగారికి అంకితం చేయబడింది.

2. పాపారాయ నిర్యాణము అను (బొబ్బిలి సంగ్రామము) : ప్ర.ము 1921, రచనా కాలము 1915, ప్రచురణ : ఆంధ్ర పరిషత్తు – బెజవాడ,

ఆంధ్రముద్రాక్షారశాల, బెజవాడ, 1/8 డెమ్మీ, పుటలు 10+136, వెల రు. 1-0-0 7 అంకాల నాటకం. చామర్తి రాజశేఖరరావు పీఠిక వ్రాశారు.

2. నాటికలు

ఎ. క్షమా సందర్శనము : ప్రచురణ పత్రిక 'రెడ్డిరాణి', సంచిక 3-8, పుటలు 5 పుటలు 1926 మే. 1/8 నోటుబుక్కు కాపీలో 160-164 పుటలు మధ్య ఈ నాటికను రమణాచార్యులవారు వ్రాసి పెట్టుకొన్నారు.

బి. దమయంతీ సంవరణము : ప్రచురణ పత్రిక 'భారతి'. సంచిక 6-2, పుటలు 11 (179-189) ఫిబ్రవరి 1929 శ్రీహర్షుని నైషధంలోని 5,6,7,8,9 సర్గల ననుసరించి వ్రాయబడిన రెండంకాల రూపకము.

సి. పాదుకా పట్టాభిషేకము : ప్రచురణ పత్రిక 'సుజాత'. పుటలు 4 (155-158), ఏప్రిల్ 1929. (ఏకరంగ ప్రయోగము)

డి. ప్రచండ భార్గవము : ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 3-9, పుటలు 9 (24-32) సెప్టెంబర్ 1926. (ఏకాంక నాటకము)

నవలలు - కథలు

1. నవలలు :

1. అన్నయమంత్రి : ప్ర.ము 1951, రచనా కాలము 1951. ప్రచురణ : రాజహంస పబ్లికేషన్స్ - తెనాలి. 1/8 క్రౌను, పుటలు 4+173 వెల 1-2-0 I.G, 1-5-0 O.S; చారిత్రాత్మక నవల. కథాంశం కాకతీయ రుద్రమదేవి కాలానికి సంబంధించింది.

2. కొండపల్లి ముట్టడి : పునర్ముద్రణ 1956, ప్రచురణ : వేంకట్రాం అండ్ కో విజయవాడ-కర్నూలు. కనకదుర్గాప్రెస్, విజయవాడ. 1/8 క్రౌను, పుటలు 2+84, వెల 0-8-0 అణాలు. చారిత్రాత్మక నవల. కథాంశం కృష్ణదేవరాయల కాలానికి సంబంధించింది. ఈ నవల ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖవారిచే (Approved Andhra Pradesh Gazette page 38 D/12-4-1956) పాఠ్యాంశంగా ఆమోదింపబడింది.

3. వసుంధర : ప్ర.ము 1922. పునర్ముద్రణ 1934. రచనా కాలము 1914. ప్రచురణ : ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల - బెజవాడ; 1/8 క్రౌను, పుటలు 6+203+4, వెల రు.1-0-0 ఈ నవలలో మొదటి ప్రతాపరుద్రునికి సంబంధించిన కథాంశం 13 ప్రకరణాల్లో రెండు భాగాలుగా విభజించి వ్రాయబడింది. సేవూరి లక్ష్మీనరసయ్యగారు ఈ నవలకు తొలిపలుకు వ్రాశారు.

2. కథలు :

1. ఇల్లాలు మాట తప్పుతుందా? ప్రచురణ పత్రిక 'సాహితి', సంచిక 4-78, పుటలు 331-336, 1923.

2. ఎఱ్ఱిక్కసానమ్మ : ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 4-11, పుటలు 974-976, జనవరి 1932.

3. కామమ్మ సహగమనము : ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', పుటలు 834-841, 1931

4. తగిన శిక్ష : ప్రచురణ పత్రిక 'ప్రబుద్ధాంధ్ర', సంచిక 5-5, పుటలు 189-194, మే 1934.

5. నిజమైన ప్రేమ : ప్రచురణ పత్రిక 'ఆంధ్రభారతి', సంచిక 2-4, పుటలు 17-20, జులై 1927.

6. పాతివ్రత్యమహిమ : ప్రచురణ పత్రిక 'వివేకానంద', సంచిక 5-3, పుటలు 5-7, సెప్టెంబర్ 1954.

7. బాష్పపతనము : ప్రచురణ పత్రిక 'ప్రబుద్ధాంధ్ర', సంచిక 3-12, పుటలు 387-391, ఫిబ్రవరి 1925.

8. రాణి శంకరమ్మ : ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 1-9, పుటలు 32-35, నవంబర్ 1928.

9. వీరమాత రాణూబాయి : ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 2-5, పుటలు 339-341, జులై 1929.

10. సువర్ణష్ఠీవి : ప్రచురణ పత్రిక 'వివేకానంద', సంచిక 5-4, పుటలు 5-7, అక్టోబరు 1954.

3. వచన రచనలు

1. ఆంధ్ర మంత్రులు : ప్ర.ము 1923, పు.ము 1927, ప్రచురణ కాకతీయ గ్రంథమాల -1, 1/8 డెమ్మీ, పుటలు 10+124, వెల 0-2-0 అణాలు. ఈ పుస్తకంలో పూర్వాంధ్ర రాజ్యాలకు చెందిన పది మంది మంత్రుల చరిత్రాంశాలు వర్ణింపబడ్డాయి.

2. ఆంధ్ర వీరులు - ప్రథమ భాగము : ప్ర.ము 1927, ప్రచురణ వేంకట్రాం అండ్ కో బెజవాడ - ఆంధ్ర గంధాలయ ముద్రాక్షరశాల 1/8 క్రౌను, పుటలు 6+139, 0-8-0 అణాలు. ఇందులో పది మంది ఆంధ్రవీరులకు సంబంధించిన చరిత్రాంశాలు వర్ణింపబడ్డాయి.

ఆంధ్రవీరులు - ద్వితీయ భాగము : ప్ర.ము 1928. ప్రచురణ : వేంకట్రాం అండ్ కో బెజవాడ: వాణీ ముద్రాక్షరశాల : 1/8 క్రౌను; పుటలు 8+194, వెల 0-12-0 అణాలు. ఇందులో పది మంది ఆంధ్రవీరుల చరిత్రాంశాలు వర్ణింపబడ్డాయి.

3. ఇతిహాసమంజరి : ప్ర.ము 1927, ప్రచురణ : వెంకట్రాం అండ్ కో బెజవాడ జీవిత చరిత్రం ప్రథమభాగంలో 90వ పుటలో ఈ పుస్తకం గురించిన ప్రస్తావన ఉంది. ఆంధ్ర వీరులు అనే పుస్తకం మొదలుకొని పందొమ్మిది పుస్తకాలను వెంకట్రాం అండ్ కో వారికి ప్రచురణార్థం ఇచ్చినట్లుగా రమణాచార్యుల వారు పేర్కొన్నారు. ఆ పుస్తకాల పట్టికలో ఈ పుస్తకం క్రమ సంఖ్య 3 అని ఉంది.

4. కాకతీయ సామ్రాజ్యము : ప్ర.ము మార్చి 1924. రచనా కాలము 1921. ప్రచురణ 'ఆంధ్రాభ్యుదయము' పత్రికా సంపాదకులు కోకల సీతారామశర్మగారిచే ప్రకటింపబడింది. శ్రీ రామలింగేశ్వరే ముద్రాక్షరశాల: ఓరుగల్లు: 1/8 క్రౌను, పుటలు 2+20, వెల 0-2-0 అణాలు; ఈ పుస్తకంలోని విషయం యథాతథంగా 'ఆంధ్రపత్రిక' దుర్మతి ఉగాది సంచిక 'కాకతీయ సామ్రాజ్యము' అనే పేరుతో వ్యాసంగా ప్రకటింపబడింది (1921) రెండోసారి కోకల సీతారామయ్య గారి సంపాదకత్వంలో 'ఆంధ్రాభ్యుదయము' అనే పత్రికలో ముద్రింపబడింది. (రుధిరోద్గారి - మార్గశిర - పుష్యం - 1923)

కుశలవులు : ప్ర.ము : 1928, రచనా కాలము 1027, ప్రచురణ వెంకట్రామా అండ్ కో, రామాముద్రాక్షర శాల - ఏలూరు 1/8 క్రౌను, పుటలు 72+2, వెల 0-5-0 అణాలు.

నీతికథాసారము : ప్ర.ము 1927. ప్రచురణ వెంకట్రాం అండ్ కో బెజవాడ. 1/8 క్రౌను, పుటలు 2+41 వెల 0-3-0 అణాలు. ఇందులో 32 నీతిబోధాత్మకమైన కథలు కూర్చబడ్డాయి. ఈ కథలన్నీ పంచతంత్రము, హితోపదేశము, కేయూరబాహుచరితము అనే గ్రంథాల్లోని మూల కథలను అనుసరించి వ్రాయబడినాయి.

పురాణ కథామంజరి : ప్ర.ము 1927, రచనా కాలము; ప్రచురణ వెంకట్రాం అండ్ కో బెజవాడ; 1/8 క్రౌను, పుటలు 2+36, వెల 0-3-0 అణాలు, ఇందులో భారతాది ఇతిహాస పురాణాల నుండి గ్రహింపబడిన 24 నీతిబోధాత్మక మైన కథలు కూర్చబడ్డాయి. ప్రతి కథకు ముందు ఒక నీతివ్యాఖ్య, చివరలో కొన్ని కథలకు ఒక్కొక్క నీతి పద్యమూ కూర్చబడ్డాయి.

భక్తమంజరి : ప్ర.ము 1927; ప్రచురణ : వెంకట్రాం అండ్ కో, రామా ముద్రాక్షరశాల – ఏలూరు, 1/8 క్రౌను, పుటలు 2+76 వెల 0-3-0 అణాలు, ఈ పుస్తకంలో భాగవత పురాణానికి సంబంధించిన 12 మంది భక్తుల కథలు వర్ణింపబడ్డాయి.

రామాయణ కథలు : ప్ర.ము 1927, ప్రచురణ వెంకట్రాం అండ్ కో, బెజవాడ: ఆంధ్ర ముద్రాక్షరశాల ముద్రణ 1/8 క్రౌను, పుటలు 4+91. ఇందులో రామాయణానికి సంబంధించిన 12 పాత్రలను గురించి కథారూపాన వర్ణించబడింది.

రెడ్డికుల నిర్ణయచంద్రిక : ప్ర.ము : 1927. రచనా కాలము 1927 ప్రచురణ గోల కొండముద్రాక్షరశాల–హైదరాబాదు. 1/8 క్రౌను, పుటలు 190, వెల రు.1-0-0 ఈ పుస్తకానికి కావ్యకంఠ గణపతి శాస్త్రిగారు పీఠిక వ్రాశారు.

శ్రీరాముడు : ప్ర.ము 1927, ప్రచురణ వెంకట్రాం అండ్ కో బెజవాడ, రామా ముద్రాక్షరశాల – ఏలూరు, 1/8 క్రౌను, పుటలు 2+52, వెల 0-3-0 ఈ పుస్తకాన్ని శేషాద్రి రమణ కవులు నందిగామలో డిప్యూటి ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్సు అయిన శ్రీ కొప్పర్తి నారాయణమూర్తి గారితో కలిసి రచించారు. ఇందులో రాముని జననం మొదలుకొని రామ పట్టాభిషేకం దాకా రామాయణకథ సంక్షిప్తంగా వర్ణించబడింది.

4. వ్యాసాలు (సుమారు 170)

అకలంకము కృష్ణమాచార్యకవి : ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక' డిసెంబర్ 1919.

అనపోతనాయకుడు : ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', పుటలు 157-160, 1927

అనపోతనాయకుడు : ప్రచురణ 'సంగ్రహాంధ్ర విజ్ఞానకోశము' Vol I, 1960

అనవేముని ఉప్పుగల్లు శాసనము : ప్ర.ప్ర 'గ్రంథాలయ సర్వస్వము' సంచిక 3-2, పుటలు 49-53, 1918

అనవేముని ఉప్పుగల్లు శాసనము : ప్రచురణ పత్రిక 'శారద', సంచిక 2-5,పుటలు 510-516, జనవరి 1924

అనవేముని ఉప్పుగల్లు శాసనము : ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', పుటలు 165-166.

అపూర్వ నిఘంటువు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 7-45, పుట 10, అక్టోబర్ 1932.

అముద్రిత ద్విపద కావ్యములు : ప్రచురణ పత్రిక 'విభూతి' II-1

అల్లాదుర్గము : ప్రచురణ పత్రిక 'తెనుగు పత్రిక', సంచిక 3-40, పుట 4, 31 మే 1925.

అల్లసాని పెద్దనార్యుడు వైదికియా : ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 1-12, పుట 1-9, డిసెంబరు 1927.

అల్లుడనా : ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక', సం. 1916.

ఆంధ్ర కవుల చరిత్రము : ప్రచురణ పత్రిక 'నీలగిరి', పుట 6, 3, ఫిబ్రవరి 1927.

ఆంధ్రము-కర్ణాటము : ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక', 3, జనవరి 1920.

ఆంధ్రుల శిల్పము : ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 12-4, పుటలు 295-296, జూన్ 1939.

ఆంధ్ర సభలు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సం 4-2, పుట 3, 11, మే 1929.

ఆంధ్ర సభలు - అనుమతి : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 4-78, పుట 9, ఫిబ్రవరి 1930.

ఆంధ్రసభలు - జోగిపేట : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 4-79, పుట 9, 1 మార్చి 1930.

ఆంధ్ర సభలు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', పుట 1,3 మార్చి 1931.

ఆంధ్ర సభలు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 5–87, పుట 8, 4, ఏప్రిల్ 1931.

ఆంధ్ర సభలు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 10–27, పుట 7, 5 డిసెంబర్ 1935

ఆంధ్ర సాహిత్య పరిషత్తు : ప్రచురణ పత్రిక 'ప్రబుద్ధాంధ్ర', సంచిక 3–9, పుటలు 196–203, నవంబర్ 1929.

ఆంధ్రులు – ఉన్నత పాఠశాల : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 5–39, పుట 6, 27 సెప్టెంబర్ 1930.

ఆలయములు – వాని దుస్థితి : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 6–93, పుట 9, 23 ఏప్రిల్ 1932.

ఉచ్ఛల విషాదము : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 9–93, పుట 7, 19 ఏప్రిల్ 1934.

ఉరుదూ–తెల్గు నిఘంటువు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 14–89, పుట 5, 21 మార్చి 1940.

ఓగిరాల రంగనాథకవి : ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక' 22 నవంబర్ 1919.

కట్టా వరదరాజ కవి : ప్రచురణ పత్రిక 'ప్రబుద్ధాంధ్ర', సంచిక 12; 10 మార్చి 1939.

కాకతీయ గ్రంథమాల : ప్రచురణ పత్రిక 'నీలగిరి', పుట 5, 17 ఫిబ్రవరి 1927.

కాకతీయుల ఆంధ్రభాషాసేవ : 'కాకతీయ సంచిక', పుటలు 160–163, 1935.

కాకతీయుల చరిత్రము – విశేషాంశములు : 'కాకతీయ సంచిక', పుట 245–260, 1935.

కాకతీయ యుగము : ప్రచురణ పత్రిక 'గోలకొండ', 2, మార్చి 1936.

కాకతీయ రాజులు : ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', పుటలు 190–197, 1931

కాకతీయ శిల్పము : ప్రచురణ పత్రిక 'సుజాత', పుటలు 16–21, 15 ఆగస్టు 1950.

కాకతీయ శిల్పములు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', పుట 6, మే 1940.

కాకతీయ సామ్రాజ్యము : ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక' పుటలు 163-168, 1921.

కాకతీయ సామ్రాజ్యము : ప్రచురణ పత్రిక 'ఆంధ్రాభ్యుదయము', సంచిక 1-6, 7, పుటలు 9-8, 1923.

కాకతీయ సామ్రాజ్యము - (కాకతి ప్రోలరాజు చరిత్రము) : 'ఆంధ్రపత్రిక', 1932, పుట. 164-168.

కాకతీయ సామ్రాజ్యము (హనుమకొండ సంగ్రహచరిత్ర) : ప్రచురణ పత్రిక 'గోలకొండ', పుటలు 31-39, 1 మే 1937.

కాకతీయుల అపూర్వ చరిత్రము : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 7-68, పుట 1, 2 జనవరి 1933.

కాకునూరి అప్పకవి : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 11-1, పుట. 4, 11 మే 1936.

కాకునూరి అప్పకవి : 'గోలకొండ', సంచిక 11-8, పుట 1, 1 జూన్ 1936.

కృతజ్ఞతాభివందనము : ప్రచురణ పత్రిక 'తెలుగు పత్రిక', సంచిక 3-3,4, పుటలు 3-20, సెప్టెంబర్ 1924.

కేంద్ర సంఘ సమావేశము : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 4-32, 31 ఆగస్టు 1929.

కొటికలపూడి సోమనాథకవి : ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక' (సార. అనుబంధం) జనవరి 1921.

కొలనుపాకక్షేత్రము : ప్రచురణ పత్రిక 'ప్రబుద్ధాంధ్ర', సంచిక 7-4, 15, ఏప్రిల్ 1936.

కోనయామాత్య కవి : ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక', సంచిక ?, పుట.?, 10, ఏప్రిల్ 1920.

ఖద్దరు పరిశ్రమ : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 5-77, పుట. 10, 21 ఫిబ్రవరి, 1931.

ఖమ్మంమెట్టు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 4-56, పుట. 11, 4, డిసెంబర్ 1929.

ఖాజీపేట దరగా శాసనము : ప్రచురణ పత్రిక 'గోలకొండ', పుటలు 74-79, 6 మే 1936.

చంద్రికా పరిణయ వ్యాఖ్య : ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 8, పుటలు 35,36, ఆగస్టు 1927.

గంగాధరుడు : ప్రచురణ పత్రిక 'ప్రబుద్ధాంధ్ర', పుటలు 113-116, మార్చి 1934.

గంగాధరుని శిలాశాసనము : ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', పుటలు 173, 174

గద్వాలరాణి ఆదిలక్ష్మమ్మాదేవిగారు : ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 4-3, పుటలు : 11-212, మే 1931.

గద్వాలరాణి ఆదిలక్ష్మమ్మాదేవిగారు : ప్రచురణ 'విభూతి', సంచిక ?, పుట?, 1940.

గుప్తసామ్రాజ్యము : ప్రచురణ పత్రిక 'సారస్వత సర్వస్వము', సంచిక 1-6, పుటలు 25-27, 1923.

గోలకొండ కవుల సంచిక : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 9-38, పుటలు 3, 4, సెప్టెంబర్ 1934.

గోలకొండ కవుల సంచిక : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 9-77, పుటలు 3, 4, 18, ఫిబ్రవరి 1935.

గోలకొండ దుర్గము : ప్రచురణ పత్రిక 'ఆనందబోధిని', సంచిక 1-11, పుటలు 424-416, ఏప్రిల్ 1931.

గ్రంథాలయోద్యమము : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 4-45, పుటలు 14 సెప్టెంబర్ 1929.

గ్రామ వృత్తాంతములు : ప్రచురణ పత్రిక 'ఆంధ్రకేసరి', సంచిక 1-5, పుటలు 13-15, జూన్ 1941.

చామర్తి రాజశేఖరరావు : ప్రచురణపత్రిక 'సాహితి', పుటలు 106, 107-1922.

చింతలపూడి రాధామాధవ కవి : ప్రచురణ పత్రిక 'భారతి', పుటలు 318-383, సెప్టెంబర్ 1930.

చిత్తాపుఖానుడు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 7-80, పుట 1,2, 1 మార్చి 1933.

చిత్తూరి గంగాధర కవి : ప్రచురణ పత్రిక 'విభూతి', ఏప్రిల్ 1940.

జోగిపేట ప్రముఖుల ప్రశంస : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 4-30, పుట 3, 17 ఆగస్టు 1929.

తాళపత్ర గ్రంథములు : ప్రచురణ పత్రిక 'నీలగిరి', పుటలు 9, 10, 16 సెప్టెంబర్ 1926.

తాళపత్ర గ్రంథములు : ప్రచురణ పత్రిక 'తెలంగాణ' పత్రిక, 17, ఆగస్టు 1944.

తిమ్మరుసు వ్యాఖ్యాత : ప్రచురణ పత్రిక 'నీలగిరి', పుట. 4, 14, ఏప్రిల్ 1927.

తెనాలి రామకృష్ణకవి : ప్రచురణ పత్రిక 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం సంచిక', పుట 55, 1927.

తెలంగాణము - ప్రాచీనాంధ్ర వాఙ్మయము : ప్రచురణ పత్రిక 'సుజాత', పుట 38-44.

తెలుగు సామెతలు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక, పుట 27, అక్టోబర్ 1935.

దగ్ధ గ్రంథాలయము : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 5-92, పుటలు 9, 22, ఏప్రిల్ 1931.

దానకర్ణుడు : ప్రచురణ పత్రిక 'లలిత'-I, సంచిక 2, సెప్టెంబర్ 1926.

దాసబోధ : ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 2,3, పుటలు 19-12, మార్చి 1928.

దేశచరిత్రములు : ప్రచురణ పత్రిక 'నీలగిరి', పుట 4, 27, జనవరి 1927

ధాన్యకటకాస్థానము : ప్రచురణ పత్రిక 'సుజాత', పుటలు 22-25, 15, అక్టోబర్ 1950.

నన్నయభట్టారకుడు : ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక', 21, ఆగస్టు 1920.

నన్నయభట్టారకుడు : 'ఆంధ్రపత్రిక' (సార. అనుబంధం) 5, ఫిబ్రవరి 1921.

నామేశ్వరాలయము : ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక', 14, సెప్టెంబర్ 1929.

నిజాము రాష్ట్ర కవులు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 7-71, పుట 4, 21, మే 1933.

నిజాము రాష్ట్ర కవులు (రాజలింగకవి) : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 10-28, పుట 5, 15, ఆగస్టు 1935.

నిజాము రాష్ట్ర కవులు (సోమకవి) : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 10-64, పుట. 15, 30, డిసెంబర్ 1935.

నిజాము రాష్ట్ర కవులు (లక్ష్మణాచార్యులు) : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 12-1, పుట. 1, 10, మే 1937.

నిజాము రాష్ట్రకవులు : ప్రచురణ పత్రిక 'శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయ రజతోత్సవ సంచిక', పుటలు 90-95, 1927.

నిజాము రాష్ట్రాంధ్రకవులు : ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక' 6, డిసెంబర్ 1919.

నిజాము రాష్ట్రాంధ్రకవులు : ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక' 10, జనవరి 1920.

నిజాము రాష్ట్రాంధ్రకవులు : (పినవీరభద్రుడు) ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక' 12, జూన్ 1920.

నిజాము రాష్ట్రాంధ్రకవులు : ప్రచురణ పత్రిక 'శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయ రజతోత్సవ సంచిక', పుటలు 22-30, 1927.

నిజాము రాష్ట్ర ప్రశంస : ప్రచురణ పత్రిక 'తెలుగుపత్రిక', సంచిక 3-3,4, పుట 3, సెప్టెంబర్ 1924.

నిజాము రాష్ట్రము - చరిత్ర పరిశోధనము : ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', పుటలు 216-222, 1926.

నిజాము రాష్ట్రమందలి జైనాలయములు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', 10 మే 1940.

నిజాము రాష్ట్రమందలి జైనాలయములు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', 16 మే 1940.

నిజాము రాష్ట్రమందలి శిల్పసంపద : ప్రచురణ పత్రిక 'శోభ', సంచిక 2-8, పుటలు 54-57, నవంబర్ 1950.

నిజాము రాష్ట్ర ప్రశంస : ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక' 5, ఏప్రిల్ 1923.

నిజాము రాష్ట్రము - చరిత్ర పరిశోధనము : ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', పుటలు 216-222, 1926.

నిజాము రాష్ట్ర పరిశోధనోద్యమము : ప్రచురణ పత్రిక 'ఆంధ్రాభ్యుదయము', సంచిక 1-4,5, పుటలు 1-12, 1923.

నిజాము రాష్ట్రమందలి ఆంధ్రదేశ ప్రశస్తి : ప్రచురణ పత్రిక 'శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయ రజతోత్సవ సంచిక' అనుబంధం, పుటలు 14-24, 1928.

నిమ్మగడ్డ రామకృష్ణదాసకవి : ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక' 18, అక్టోబర్ 1919.

నిర్మల చరిత్రము : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 14-95, పుట 4, 15 ఏప్రిల్ 1940.

పరిశోధక నివేదిక : ప్రచురణ పత్రిక 'శారద', సంచిక 2-6, పుటలు 695-705, మార్చి 1925.

పరిశోధక మండలి నివేదిక : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 9-74, పుట 3, 7 ఫిబ్రవరి 1935.

పరిశోధకులకు సూచన : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 5-93, పుట 10, 25 ఏప్రిల్ 1931.

పానుగల్లు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 5-95, పుట 4, 2 మే 1931.

పాల్కురికి సోమనాధకవి : ప్రచురణ పత్రిక 'గోలకొండ' 1, ఆగస్టు 1935.

పుస్తక ప్రదర్శన ప్రారంభోపన్యాసము : ప్రచురణ పత్రిక 'శోభ', పుట 27-34, ఫిబ్రవరి 1950.

పురాతన భారతేతిహాస పరిశోధన : ప్రచురణ పత్రిక 'సుజాత', పుటలు 365-370, ఆగస్టు 1929.

పూర్వగాథలు (బూరుగుగడ్డ) : ప్రచురణపత్రిక 'గోలకొండ', సంచిక 9-4, పుట 4, 21 మే 1934.

పూర్వగాథలు (బూరుగుగడ్డ) : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 9-5, పుట 9, 24 మే 1934.

పూర్వగాథలు (బూరుగుగడ్డ) : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 9-6, పుటలు 9,10,29 మే 1934.

పృధ్వీరాజు - I ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 1-5, పుటలు 11-19, మే 1927.

పృథ్వీరాజు –II ప్రచురణ పాత్రిక 'సుజాత', సంచిక 1–, పుటలు 7–15, జులై 1927.

పూర్వకవి పరిచయము : ప్రచురణ పత్రిక 'గోలకొండ', కవుల సంచిక, పుటలు 389–419, 1934.

పోతనామాత్య స్మరణము : ప్రచురణ పత్రిక 'ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక', ఫిబ్రవరి 1815.

ప్రతాపరుద్ర చక్రవర్తి : ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 8–12, పుట 842–848, డిసెంబర్ 1931.

బాలనాగమ్మ : ప్రచురణ పత్రిక 'నీలగిరి', పుట 6, 16, సెప్టెంబర్ 1926.

బిజ్జల తిమ్మ నృపాలుడు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', పుట 55–57, 1, మే 1937.

బౌద్ధస్తూపము బయటపడుట : ప్రచురణ పత్రిక 'నీలగిరి', పుట 5–6, 9 డిసెంబర్ 1926.

భీమకవి నివాసస్థానము : ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 3–7, పుటలు 18–24, జులై 1926.

భీమరాజు–గోకర్ణుడు : ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', పుటలు 151–154, 1936.

బ్రౌను దొరవారు : ప్రచురణ పత్రిక 'శోభ', సంచిక 2–8, పుటలు 30–34, 1 నవంబర్ 1950.

మల్లారెడ్డి : ప్రచురణ పత్రిక 'గ్రంథాలయ సర్వస్వము', సంచిక 2–2, పుటలు 106–108, 1917.

మల్లారెడ్డి (కామినేని) : ప్రచురణ పత్రిక 'రెడ్డిరాణి', సంచిక 1–1, అక్టోబర్ 1923.

మల్లికార్జున పండితారాధ్యులు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 7–80, పుటలు 2, 3, 1 మార్చి 1933.

మహాద్భుత నిరూపణము : ప్రచురణ పత్రిక 'వివేకానంద', సంచిక 4–9, పుటలు 19–21, మార్చి 1954.

మహబూబునగర మండలము : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 6–27, పుట 12 ఆగస్టు 1931.

మహమ్మదీయరాజుల సంస్కృతభాషాసేవ-I: ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 1-6, పుట 27, 28 జూన్ 1927.

మహమ్మదీయ రాజుల సంస్కృత భాషాసేవ-II : ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 1-11, పుటలు 33-35, నవంబర్ 1927.

మాహురము : ప్రచురణ పత్రిక 'విభూతి', ఏప్రిల్ 1940.

ముక్తుదెవ్వడు : ప్రచురణ పత్రిక 'వివేకానంద' సంచిక 4-7, పుటలు 12-15, జనవరి 1954.

మొల్ల రామాయణము : ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 7-5, పుటలు 361-362, జులై 1934.

యయాతి చరిత్రము - పొట్లచెర్ల : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 11-95, పుట 1, ఏప్రిల్ 1937.

యల్లమపల్లి గ్రంథాలయము : ప్రచురణ పత్రిక 'నీలగిరి', పుట 6, 28, జులై 1927.

యాదవుల గ్రంథనిలయము : ప్రచురణ పత్రిక 'గోలకొండ' పత్రిక, 15 మే 1929.

రంగనాథ రామాయణము : ప్రచురణ పత్రిక 'రెడ్డిరాణి', సంచిక 8-2, పుటలు 39-45, 28 ఫిబ్రవరి 1931.

రాజా మానూరి అప్పాజీకవి : ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', (సారస్వత అనుబంధం) జనవరి 1927.

రాజ్ఞి ఇనుగంటి సరస్వతీదేవి : ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', సంచిక 10-12, పుటలు 917, 918, ఫిబ్రవరి 1938.

రాపాక లక్ష్మీపతి : ప్రచురణ పత్రిక 'గ్రంథాలయ సర్వస్వము', సంచిక 5-1, పుటలు 19-22, 1920.

రాపాక వేంకటదాస కవి : ప్రచురణ పత్రిక 'విభూతి', ఏప్రిల్ 1940.

రామదాసస్వామి : ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక' 28, సెప్టెంబర్ 1929.

రామప్పగుడులు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 5-41, పుట 10, 8 అక్టోబర్ 1930.

రుద్రమదేవి : ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక' పుటలు 176-182, 1930.

రుద్రదేవుని అనుమకొండ శాసనము : ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 6-4, పుటలు 531-539 ఏప్రిల్ 1929.

రుద్రసేనాని చరిత్రము : ప్రచురణ పత్రిక 'గ్రంథాలయ సర్వస్వము' సంచిక 3-6, పుటలు 254-257, 1918.

రెడ్డి విద్యార్థుల ప్రశంస : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 6-28, పుట 10, 15 ఆగష్టు 1931.

రెడ్డెడ్డి మల్లారెడ్డి కవి : ప్రచురణ పత్రిక 'రెడ్డిరాణి', సంచిక 17-2, పుటలు 1-3, ఫిబ్రవరి 1940.

రెడ్డెడ్డి మల్లారెడ్డి కవి : ప్రచురణ పత్రిక 'విభూతి', ఏప్రిల్ 1940.

రేచెర్ల గోత్రీయులు : ప్రచురణ పత్రిక 'సుజాత', పుటలు 402-407, సెప్టెంబర్ 1929.

లవిత్రము : ప్రచురణ పత్రిక 'అభినవ సరస్వతి', సంచిక 4-11, పుటలు 1-7, అక్టోబర్ 1913

లేములవాడ భీమకవి : ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', పుట 5-13, మే 1936.

వసుచరిత్రము - చంద్రికా పరిణయముల కథావస్తు నిర్మాణము : ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', పుటలు 81-89, ఏప్రిల్ 1924.

వింతయిటుకలు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక,5 డిసెంబర్ 1931.

విద్యార్థులకొక మనవి : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 9-91, పుట 3, 11, ఏప్రిల్ 1935.

విశ్వేశ్వర శివదేవుడు : ప్రచురణ పత్రిక 'శోభ', సంచిక 2-6, పుటలు 42, 43, 1 సెప్టెంబర్ 1950.

విష్ణుమాయా నాటకము : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 7, మార్చి 1940.

విస్మృత క్షేత్రము - పానుగల్లు : ప్రచురణ పత్రిక 'శారద', సంచిక 2-2, పుటలు 185-189, అక్టోబర్ 1924.

వేములవాడ భీమనకవి : ప్రచురణ పత్రిక 'గోలకొండ', పుటలు 42-55, 1928.

వేములవాడ భీమనకవి : ప్రచురణ పత్రిక 'గోలకొండ', 4 మే 1936.

శంభుదాసుడు వైష్ణవుడా? : ప్రచురణ పత్రిక 'భారతి', సంచిక 7-8, పుటలు 332, 333 ఆగష్టు 1930.

శాసన పద్యమంజరి : ప్రచురణ పత్రిక 'ప్రబుద్ధాంధ్ర', సంచిక 5-10, పుటలు 405-408 అక్టోబర్ 1934.

శాసనములు – ఆంధ్ర కవిత్వము : ప్రచురణ పత్రిక 'కిన్నెర', పుటలు 34-44, 27 మార్చి 1939.

శివపల్లి సర్వోత్తమ కవి : ప్రచురణ పత్రిక 'కృష్ణాపత్రిక', 18, అక్టోబర్ 1919.

శ్రీకృష్ణ కర్ణామృతము – మోతే పురుషోత్తమ కవి : ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 1-10, పుటలు 13, 14, 15 మే 1951.

శ్రీకృష్ణదేవరాయల విజయయాత్ర : ప్రచురణ పత్రిక 'శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయ రజతోత్సవ సంచిక', పుట 61, 62, 1927.

శృంగార తిలకము : ప్రచురణ పత్రిక 'అభినవ సరస్వతి', పుటలు 1, 2, అక్టోబర్ 1915.

షబ్నవీసు వెంకట నరసింహారావు : ప్రచురణ పత్రిక 'గోలకొండ' 1938.

సరస్వతీ రామాయణము : ప్రచురణ పత్రిక 'గృహలక్ష్మి', పుటలు 207-210, 1936.

సారంగధర చరిత్ర విమర్శనము : ప్రచురణ పత్రిక 'సుజాత', సంచిక 3-6, పుటలు 243-249 జూన్ 1929.

సురభి మాధవరాయకవి : ప్రచురణ పత్రిక 'సారస్వత సర్వస్వము' సంచిక 1-10, పుటలు 20-30, 1924.

సువర్ణయుగము : ప్రచురణ పత్రిక 'ఆంధ్రపత్రిక', పుటలు 78-82, 1929.

స్వదేశీవస్తు ప్రోత్సాహము : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 5-90, పుట 9, 15 ఏప్రిల్ 1931.

హనుమకొండ : ప్రచురణ 'సంగ్రహాంధ్ర విజ్ఞానకోశము' Vol-I పుట. 1961.

హనుమకొండ : ప్రచురణ పత్రిక 'ఆంధ్రాభ్యుదయము' సంచిక 3-2,3 పుటలు 71-78, 1925.

హిడింబాశ్రమము : ప్రచురణ పత్రిక 'సుజాత' పుటలు 28, 29, 15 నవంబర్ 1950.

హైదరాబాదు విశేషములు : ప్రచురణ పత్రిక 'గోలకొండ', సంచిక 10-81, పుట 9, 27 ఫిబ్రవరి 1936.

పాఠ్యపుస్తకాలు

1. వాచకాలు :

శేషాద్రిరమణ కవులు & కొప్పర్తి నారాయణమూర్తి గారలచే రచింపబడినవి. ప్రచురణ రామా & కంపెనీ – ఏలూరు.

1. మొదటి తరగతి	ప్ర.ము	1925	వెల	0–1–6 పై	పద్యవాచకాలు
2. రెండవ తరగతి	”	”	”	0–1–6 పై	
3. మూడవ తరగతి	”	”	”	0–2–0 పై	
4. నాల్గవ తరగతి	”	”	”	0–2–0 పై	
5. ఐదవ తరగతి	”	”	”	0–2–6 పై	

జీవిత చరిత్రము – ప్ర.భా.లో 90వ పుటలో ఈ వాచకాలు పేర్కొనబడినాయి, క్ర.సం. 16.

I. ఆంధ్ర వాచకముల సంస్కరణము : III, IV, V (నాలుగు, అయిదు ఫారముల సెలెక్షన్)	ఈ రెండు జీవిత చరిత్రంలోని 90వ పుటలో పేర్కొబడ్డాయి క్ర.సం. 14, 15.

2. వ్యాకరణము :

1. వ్యాకరణము 1, 2, 3 భాగములు : జీవిత చరిత్రము ప్ర.భా.లోని 90వ పుటలో పేర్కొబడ్డాయి. పట్టికలో వీటి క్రమ సంఖ్య 7, 8, 9.

2. వ్యాకరణ సర్వస్వము : (ఆంధ్ర వ్యాకరణ సర్వస్వము) : ప్ర.ము. 1947, ప్రచురణ రామా అండ్‌కో ఏలూరు. 1/8 డెమ్మీ, పుటలు 8+165.

3. ఆంధ్ర వ్యాకరణము : (4, 5 తరగతులకు) లోయర్ గ్రేడు ట్రెనింగ్ విద్యార్థులకు – ప్రకటన – ప్రచురణ పత్రిక ప్రాంభ విద్య – శ్రీముఖ సంచిక, వెల 0–4–0, పుట 176. (గౌ.గ్రం.)

4. వ్యాకరణ సంగ్రహము : (6,7,8 తరగతులకు) హైయర్ గ్రేడు ట్రెనింగ్ విద్యార్థులకు – ప్రతి పుస్తకం వెల 0–4–0 అణాలు: ప్రకటన – ప్రచురణ పత్రిక ప్రారంభ విద్య – శ్రీముఖ సంచిక – పుట 176. (గౌ.గ్రం.)

అముద్రిత రచనలు*

1. కావ్యాలు : కవితలు.

1. సమర్థ రామదాస చరిత్రము 1/8 ఎక్సర్‌సైజు, 'Students Note Book' కాపీలు (3)

మొదటి కాపీలో 216 పుటలు.

రెండవ కాపీలో 214 పుటలు.

మూడవ కాపీలో 92.

మొత్తము 522 పుటల్లో ఈ కావ్యం వ్రాయబడింది. రమణాచార్యులవారు తమ జీవిత చరిత్రం (అముద్రితం) మొదటి భాగంలోనే 145వ పుటలో ఈ కావ్యరచన గురించి పేర్కొన్నారు. 7 ఆశ్వాసాల పద్య కావ్యం : మొత్తం పద్యాల సంఖ్య 971, రచనా కాలము 1939.

2. ఖండ కావ్యాలు :

ఎ. ఋతు సంహారము : 1/8 సైజు తావు తెల్ల కాగితాలు (6), 8,9,10,27, 28, 29 అనే క్రమ సంఖ్యలు వేసి ఉన్న ఈ ఆరు కాగితాలపై మొత్తం 31 పద్యాలు వ్రాయబడి ఉన్నాయి. ఆచార్యుల వారు తమ జీవిత చరిత్రం మొదటి భాగంలోని 86వ పుటలో ఈ రచన గురించి పేర్కొన్నారు. రచనా కాలము 1915-20 మధ్య.

బి. ప్రణయిని : ఆచార్యుల వారి జీవిత చరిత్రం మొదటి భాగంలోని 86వ పుటలోను 'దాసబోధ' గ్రంథం చివర ఉన్న కాకతీయ గ్రంథమాల పట్టికలోను ఇదొక అద్భుత కల్పనలుగల ఖండ కావ్యంగా పేర్కొబడింది. రచనా కాలము 1915-1920 మధ్య.

3. అనువాద కావ్యాలు :

ఎ. ప్రతాపరుద్రీయము : 1/8 తావు సైజువి (9) క్రౌను కాగితాలు. మొత్తం పద్యాల సంఖ్య 103, జీవిత చరిత్రం రెండవ భాగంలోని 34వ పుటలో ఈ రచన గురించిన ప్రస్తావన ఉంది. రచనా కాలము 1943.

★ *ఇవి చాలావరకు కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పురావస్తు కేంద్రంలో వున్నాయి.*

బి. మానస బోధామృతము : 1/8 ఠావు సైజువి 21 తెల్ల కాగితాలు, మొత్తం పద్యాల సంఖ్య 205. జీవిత చరిత్రం రెండవ భాగంలోని 158వ పుటలో ఈ రచన పేర్కోబడింది. రచనా కాలం 1940 ప్రాంతం.

4. పురాణాలు :

ఎ. బ్రహ్మ వైవర్త పురాణము : 5-1/8 నోటుబుక్కు కాగితాలు. మొత్తం పద్యాల సంఖ్య 33. దాసబోధ కావ్యం చివర చేర్చబడిన కాకతీయ గ్రంథమాల పుస్తకాల పట్టికలో ఈ పుస్తకం అచ్చులో ఉన్నట్లు పేర్కోబడింది. (పుట 7) ఒక ఆశ్వాసం,

5. శతకాలు :

ఎ. భాస్కర శతకము : జీవిత చరిత్రం రెండవ భాగంలోని 27, 34 పుటల్లో ఈ రచన గురించి ప్రస్తావించబడింది. రచనా కాలము : 1943 ప్రాంతం.

బి. రామ శతకము : జీవిత చరిత్రం రెండవ భాగంలోని 103వ పుటలో ఈ రచన గురించి ప్రస్తావించబడింది. రచనా కాలము : 1955 ప్రాంతం.

సి. సమర్థరామదాస శతకము : 1/8 సైజువి 22 నోటుబుక్కు కాగితాల్లో ఈ శతకానికి సంబంధించిన 120 పద్యాలు వ్రాయబడి ఉన్నాయి. రమణాచార్యుల వారు తమ జీవిత చరిత్రం రెండవ భాగంలోని 34వ పుటలో ఈ రచనను గురించి పేర్కొన్నారు. రచనా కాలము జులై 1943-ఆగస్ట్ 1943 మధ్య.

6. కవితలు :

అనామిక : 1/8 సైజు ఠావు తెల్ల కాగితాలుపయోగించి 3 పుటల్లో 13 పద్యాలు వ్రాయబడినాయి. రచనా కాలము నవంబర్ 5, 1957.

అశ్రుతర్పణము : 1/8 సైజు నోటుబుక్కు కాగితంపై ఒకే వైపు రెండు పద్యాలు వ్రాయబడినాయి.

'ఈశ్వరా' పద్యాలు : ఈ మకుటంతో వ్రాసిన 130 పద్యాలు. 87 పద్యాలు 12 1/8 సైజుఠావు తెల్లకాగితాలపైనా, 43 పద్యాలు 5 క్యాలెండర్ కాగితాలకు వెనక వైపునా వ్రాయబడ్డాయి. మొత్తం 17 కాగితాలు. రచనాకాలము 1955 ప్రాంతం. ఆచార్యులవారు తమ జీవిత చరిత్రం రెండవ భాగంలోని 103వ పుటలో వీటిని గురించి పేర్కొన్నారు.

ఓరుగంటి పరిచయము : 1/8 సైజు నోటుబుక్కు కాపీలో పుటలు 165 నుండి 175 మధ్య వ్రాయబడిన ఈ కవితలో 37 పద్యాలున్నాయి.

గాంధీమహాత్ముడు : 1/8 సైజువి 2 నోటుబుక్కు కాగితాల్లో వ్రాయబడిన ఈ కవితలో 15 పద్యాలున్నాయి.

దాంపత్యము : 1/8 సైజు తావు తెల్లకాగితంపై వ్రాయబడిన ఈ కవితలో 5 పద్యాలున్నాయి. రచనాకాలము నవంబర్ 13, 1957.

ధమ్మపథము : ఆచార్యులవారు తమ జీవిత చరిత్రం రెండవ భాగంలోని 109వ పుటలో ఈ రచన గురించి పేర్కొన్నారు. రచనా కాలము 1956.

పరిదేవనము : జీవిత చరిత్రం మొదటి భాగంలోని 95వ, 143వ పుటల్లో ఈ రచన ప్రస్తావించబడింది. ఈ శీర్షికపై 400 పద్యాలు వ్రాసినట్లు ఆచార్యుల వారు పేర్కొన్నారు. రచనా కాలము జూన్ 1938–ఆగష్ట్ 1939 మధ్య.

రాజరాజ నరేంద్రుడు : (స్వగతము) 1/8 సైజుతావు తెల్లకాగితాలు రెండు ఈ కవితలో 7 పద్యాలున్నాయి. రచనా కాలము నవంబర్ 9, 1957.

వసంతోత్సవము : 1/8 సైజు తావు కాగితాలు 2. 13 పద్యాలు.

సంతాపవహ్ని : 1/8 సైజు నోటుబుక్కు కాగితాలు 7, 23 పద్యాలు. ర.కా. 1955

సర్వేశ్వరా : 1/8 నోటుబుక్కు కాపీలో 144–147 పుటల మధ్య వ్రాయబడిన ఈ కవితలో 20 పద్యాలున్నాయి. రచనా కాలము 1939.

స్వీయ చరిత్రము : జీవితచరిత్రం రెండవ భాగంలో 109వ పుట. ఈ రచన పేర్కోబడింది. రచనా కాలము 1956.

శీర్షికలేని పద్యాలు : (1) జీవత చరిత్రం రెండవ భాగం నోటుబుక్కులో వెనకవైపు నుండి వ్రాయబడిన ఈ రచనలో 53 పద్యాలున్నాయి. పుటలు 12.

(2) సమర్థ రామదాసు చరిత్రం వ్రాయబడివున్న 3వ కాపీలో వెనక వైపున 57 పుటల్లో 200 పద్యాలున్నాయి. రచనా కాలము ఆరంభం ఆగష్ట్ 2, 1940. జీవిత చరిత్రం రెండవ భాగంలోని 27వ పుటలో ఈ రచన ప్రస్తావించబడింది.

7. నాటకాలు :

1. ఆంధ్ర సామ్రాజ్యము (చారిత్రక నాటకం) 1/8 సైజు తావు 18 తెల్లకాగితాలపై వ్రాయబడింది. ప్రథమ, ద్వితీయాంకాల్లో కొంత భాగం, తృతీయాంకం కొంత భాగం మాత్రమే లభించింది. 'దాసబోధ' కావ్యంలో చివర చేర్చబడిన కాకతీయ గ్రంథమాల పట్టికలో ఈ నాటకం ఓరుగల్లు రాజుల చరిత్రంగా పేర్కోబడింది.

2. ఉత్తరుడు : (పౌరాణిక నాటకం). 1/8 సైజు ఠావు 8 తెల్ల కాగితాలపై ఈ నాటకం వ్రాయబడింది. జీవిత చరిత్రం మొదటి భాగంలోని 95వ, 143వ పుటల్లో ఈ నాటకం గురించి ఆచార్యులవారు పేర్కొన్నారు. రచనా కాలము : 1938 జూన్ 1939 ఆగస్టు మధ్య.

3. ఒక పెగ్గు (సాంఘిక నాటకం) : శేషాద్రి రమణ కవులను గురించి 1977, డిసెంబర్ 26 నాటి 'జనధర్మ' పత్రికలో ప్రకటించిన వ్యాసంలో వ్యాస రచయిత శ్రీ డి.సోమేశ్వరరావుగారు ఈ నాటకం రమణాచార్యుల వారి రచనగా పేర్కొన్నారు. రచనా కాలము 1936–1937.

4. చంద్రరేఖ : (సాంఘిక నాటకం) ఆచార్యులవారి జీవిత చరిత్రం మొదటి భాగంలోని పుట 63, 941వ పుటలోను ఈ నాటక రచన ప్రస్తావించబడింది. 1/4 సైజు ఠావు తెల్ల కాగితాలు 49 ఉన్న కాపీలో వ్రాయబడింది ఈ నాటకం : రచనా కాలము 1935.

5. విచిత్రవివాహము (సాంఘిక నాటకం) : ఆచార్యులవారు తమ జీవిత చరిత్రం మొదటి భాగంలోని 63వ, 94వ పుటల్లో ఈ రచనను పేర్కొన్నారు. 1/4 సైజు ఠావు తెల్లకాగితాల 3+47 ఉన్న కాపీలో ఈ నాటకం వ్రాయబడింది. రచనాకాలము 1934.

6. సుశీల (సాంఘిక నాటకం) : ఆచార్యులవారు తమ జీవిత చరిత్రం మొదటి భాగంలోని 63వ, 94వ పుటల్లో ఈ రచన గూర్చి పేర్కొన్నారు. 1/8 ఎక్సర్‌సైజు నోటు బుక్కు కాపీలో 65 పుటల్లో ఈ నాటకం వ్రాయబడింది. రచనాకాలము 1937.

8. నవలలు :

1. గుణవతీవిలాసము (పద్యాత్మక నవల) ఆచార్యులవారు తమ జీవిత చరిత్రం మొదటి భాగంలోని 78వ పుటలో ఈ రచనను పద్యాత్మక నవల అని పేర్కొన్నారు. కోటగిరి వెంకటకృష్ణారావుగారి 'చాటు పద్యములు' (1916) అనే పుస్తకం వెనుక అట్టపై గూడ ఈ రచన పద్యములు గల నవల అనే పేర్కొబడింది. 1/8 సైజు ఠావు తెల్లకాగితాలు 36 ఉన్న కాపీలో 52వ పద్యం నుండి 314వ పద్యం దాక మొత్తం 262 పద్యాలు వ్రాయబడి ఉన్నాయి. రచనాకాలము 1910–11 ప్రాంతం.

2. స్వర్ణమేఖల : ఆచార్యులవారు తమ జీవిత చరిత్రంలోని మొదటి భాగంలో 86వ పుటలో ఈ నవలా రచన ఆరంభించినట్లు పేర్కొన్నారు. ఈ రచన కొంత జరిగిన తరువాత ఆగిపోయినట్లుగా వారే వ్రాసుకొన్నారు. కోటగిరి వేంకట కృష్ణారావుగారి (చాటుపద్యములు) 1916 అట్టవెనుక భాగాన ఈ రచన 'నవల'గానే పేర్కొబడింది' రచనాకాలము 1914 ప్రాంతం.

9. వచన రచనలు :

1. జీవిత చరిత్రము : 2 భాగాలు మొదటి భాగం కాపీలో 1/8 ఎక్సర్ సైజువి 163 పుటలు, రెండోభాగంలో 123 పుటలున్నాయి. మొదటి కాపీ రచనా కాలం 1939 ప్రాంతం కాగా రెండో భాగం కాపీ 1940లో ఆరంభించబడింది.

2. నోటు పుస్తకము : 1/8 క్రౌనుసైజు బ్రౌను కాగితాల కాపీలో 73 కాగితాలున్నాయి. నోటుబుక్కుపైన 'నందిగామ' అని పేర్కొన్న దాన్నిబట్టి ఈ నోటు పుస్తకం వ్రాయటం ఆరంభించిన కాలం సెప్టెంబర్ 11, 1922 తరువాత అయి వుండాలి.

3. పోతరాజు – వేమన : ఆచార్యులవారు తమ జీవిత చరిత్రం మొదటి భాగంలోని 88వ పుటలో ఈ రచనను పేర్కొన్నారు. రచనా కాలము 1922–26

4. సరళ సంస్కృత ప్రవేశిక : M.S.Book 80 Pages అనే ఎక్సర్‌సైజు నోటుబుక్కులు (2) కాపీలు 80 పుటల్లో 20 పాఠాలు మొదటి కాపీలోను 21 పుటల్లోను 14 పాఠాలు రెండవ కాపీలోను వ్రాయబడ్డాయి.

10. వ్యాసాలు :

1. అధ్యక్షోపన్యాసము : విశ్వనాథ సత్యనారాయణగారికి వరంగల్లో సన్మానం జరిగిన సందర్భంలో వ్రాయబడింది 1/8 సైజు రావు తెల్ల కాగితాలు (2) మూడు పుటలు. రచనాకాలము ఏప్రిల్ 2, 1956

2. కొన్ని మరపురాని శతావధానములు : రేడియో ఉపన్యాసం. కాలపరిమితి 15 నిమిషములు: 1/8 సైజురావు తెల్లకాగితాలు 9, పుటలు 9. రచనాకాలము 21–9–51.

3. కొన్ని విస్మృత గ్రంథములు : 1/8 సైజు తెల్లకాగితం (1) రెండు పుటలు. రాపాకవెంకటదాసకవి, సింగరాచార్యులు అనువారిని గురించిన వ్యాసం.

4. తెలంగాణము- సారస్వత వికాసము-శిల్ప వైభవము : 1/8 సైజు తెల్లకాగితాలు 10. పుటలు 9.

5. తెలంగాణా ఆంధ్ర కవులు : 1/8 సైజు తెల్ల కాగితాలు 2 పుటలు 2 పొనుగోటి జగన్నాథరాయ కవిని గురించి వ్రాసినది.

6. తైలపదేవుడు : 1/8 సైజు తెల్ల కాగితాలు 10, పుటలు 10,

7. నందవరీకులు : 1/8 సైజు తెల్ల కాగితాలు 23, పుటలు 23,

8. పరశురామ పంతుల లింగమూర్తి : ఆంధ్ర సారస్వతపరిషత్తు ప్రశ్న పత్రాల వెనక వైపున వ్రాయబడింది. 1/8 సైజు పత్రాలు 1950 మార్చి కాలం నాటివి. పుటలు 4. రచనాకాలము 1950 తరువాత.

9. రామదాసస్వామి : 1/8 సైజు తావు తెల్ల కాగితాలు 26. పుటలు 26.

11. లుప్త రచనలు :

ఈ క్రింది రచనల్ని శేషాద్రి రమణ కవులు తమ జీవిత చరిత్రం (అముద్రితం) మొదటి భాగంలో పుటలు (76-80) పేర్కొని, అవి లుప్తమైనట్లు కూడా పేర్కొన్నారు.

1. ఆళువందారు స్తోత్రము (అనువాదం)	ర.కా.	1909-1910
2. కృష్ణవింశతి (సీసపద్యాలు)	"	" "
3. కొప్పరపు కవుల నిందాగర్భస్తుతి	"	1911-19
4. గేయాలు	"	1908-19
5. పితృస్మృతి 25 లేక 30 పద్యాలు	"	1909
6. ప్రద్యుమ్న విజయము - జంగం కథ (వీధినాటకం)	"	1908-1909
7. భావపురి మహాత్మ్యము (అనువాదం)	"	" "
8. శేషాద్రిరమణ కవుల వివాహ చరిత్ర (పద్యకృతి) 100 పద్యాలు	"	1912-13

పీఠికలు - అభిప్రాయాలు

1. అవధానమంజరి : తొలిపలుకు - ప్రతాప వేంకటేశ్వరకవి విరచితం, నందిగామ; 1-12-1926.

2. ఆంధ్రపద నిదానము : తొలిపలుకు-తూము రామరాసకవి కృతం. నందిగామ, శుక్ల-మాఘ సం॥ బ 25. (1930)

3. ఆంధ్రవిజయము : పీఠిక - దూపాటి కొండమాచార్య ప్రణీతం, నందిగామ 1925.

4. ఆంధ్ర సాముద్రికశాస్త్రము : పీఠిక మరియు తాత్పర్యరచన, అన్నయ మంత్రి కృతం, వావిళ్ళ ప్రచురణ, నందిగామ 1-8-1926.

5. కవిరాజమనోరంజనము-పీఠిక, కనుపర్తి అబ్బయామాత్య విరచితం, వావిళ్ళ ప్రచురణ, 1929

6. కాశీయాత్ర : తొలిపలుకు-వాజపేయ యాజుల రామసుబ్బారామ విరచితం, కవితావిలాసము, హనుమకొండ 9-9-1934.

7. కేశవనాథ శతకము : తొలి పలుకు - ఉదయరాజు శేషగిరిరావు రచన, హనుమకొండ, 2-6-1954.

చరిత్ర పరిశోధక వరేణ్యులు

– ఆచార్య ఎస్వీరామారావు

చరిత్ర నిర్మాణంలో, తెలంగాణా చరిత్ర, శాసన పరిశోధన రంగంలో విశేష కృషి సలిపిన పరిశోధక వరేణ్యులు శేషాద్రి రమణకవులు. ఈ జంటలో అగ్రజులు దూపాటి శేషాచార్యులు (1890–1940), అనుజులు దూపాటి వెంకట రమణాచార్యులు (1893–1963). గుంటూరులో జన్మించిన వీరు హనుమకొండను స్థావరంగా చేసుకొని భాషా సాహిత్య పరిశోధన కావించారు. హనుమకొండలో సంస్కృతాంధ్ర పండితులుగా పని చేస్తూ చారిత్రక పరిశోధక మండలిని ఏర్పాటు చేసి 1931లో అఖిలాంధ్ర చారిత్రక సమ్మేళనాన్ని నిర్వహించారు. వెంకట రమణాచార్యులు నిర్మల్, కరీంనగర్ ప్రాంతాల్లోనూ, హైదరాబాదు పురాతత్వ శాఖలోనూ పని చేశారు.

అవధాన విద్యా కౌశలంలో ఇనాములు పొందిన ఈ జంటకవులు శాసన పరిశోధకులుగా, కావ్య పరిష్కర్తలుగా, పీఠికాకర్తలుగా కీర్తి గడించారు. కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్తు స్థాపకులైన జయంతి రామయ్య పంతులు కోరికపై తెలంగాణ అంతటా పర్యటించి తాళపత్ర ప్రతులు, పలు శాసన ప్రతిబింబాలను సేకరించి వారికి పంపించారు. రామప్ప, పాకాల, కొలనుపాక మొదలైన శాసనాలను ప్రకటించారు. సురవరం ప్రతాపరెడ్డి సంకలించిన 'గోలకొండ కవుల సంచిక'లో (1934) పూర్వకవుల వివరాలను అందించిన శేషాద్రి రమణ కవులు పలువురు నిజాం రాష్ట్రంలోని కవుల చరిత్రను వెలుగులోనికి తెచ్చారు. రుద్రమదేవి గణపతిదేవుని కూతురని, మల్లికార్జున పండితుడు, మల్లినాథసూరి తెలంగాణ వారని తొలిసారిగా నిరూపించారు. వసుచరిత్ర వ్యాఖ్య, మేదినీహారావళి నిఘంటు వివరణము, ఆంధ్రపద నిదానము, రెడ్డికులచంద్రిక పీఠికలు మొదలైనవి వారి పాండితీ ప్రతిభను చాటుతాయి. పరిశోధన రచనలే కాక ఈ జంట కవులు సృజనాత్మక సాహిత్యాన్ని కూడ వెలువరించారు. 'నిజాం రాష్ట్ర ప్రశంస' పద్యకృతి, 'కొండపల్లి ముట్టడి' నాటకం, వసుంధర, ప్రతాపరుద్రుడు నవలలు రచించారు.

1920–1940 మధ్య ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక, భారతి మాసపత్రిక, సుజాత, శారద, రెడ్డిరాణి, సారస్వత సర్వస్వము, గోలకొండ పత్రిక, ఆంధ్రభారతి

మొ॥ పత్రికల్లో కాకతీయ సంచికలో శేషాద్రి రమణకవులు వెలువరించిన విస్తృత వ్యాసాలు తెలంగాణ చరిత్రకు సంబంధించిన విలువైన సమాచారాన్ని వెల్లడిస్తున్నాయి.

కాకతీయ సామ్రాజ్య చరిత్రకు సంబంధించిన అమూల్య పరిశోధన వ్యాసాలు ఈ సంపుటిలో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. నిజాం రాష్ట్ర ప్రాచీన కవులు–చారిత్రక స్థలాల వివరాలు కూడా వీనిలో చేరటం గమనార్హం.

తొలి తరం చారిత్రక, శాసన పరిశోధకులు

దూపాటి వెంకటరమణాచార్యులు

– కుర్రా జితేంద్రబాబు

దూపాటి వెంకటరమణాచార్యులు తెలుగుభాషా సాహిత్యోపాధ్యాయునిగా, శాసన, చరిత్ర, సంస్కృతి పరిశోధకులుగా తెలంగాణా అంతటా విస్తృతంగా పర్యటించి చారిత్రక సాహిత్య విశేషాలను రాశులుగా పోసిన మహానుభావుడు. శేషాద్రి రమణ కవులుగా ప్రసిద్ధికెక్కిన జంటకవులలో మొదటివారైన దూపాటి శేషాద్రి గారు, వెంకటరమణాచార్యులవారి మూడవ అన్నగారు. 20వ శతాబ్ది ఆరంభంలో అవధానోద్యమం సంస్థానాల్లో ఊరేగుతున్నపుడు ఈ సోదరద్వయం కూడ జంటకవులుగా అవధాన కవితారంగంలో నిలదొక్కుకోవడానికి ప్రయత్నించి విఫలమైనారు. ఆనాటికే అవధాన సాహిత్య బ్రాహ్మణికం, నియోగి, వైదిక భేదాలచేత రెండుగా చీలింది. వైష్ణవులయిన ఈ జంటకవులు నిలబడటానికి కష్టమై ఎవరికివారే జీవికకోసం వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దూపాటి వెంకటరమణాచార్యులు తెలంగాణా ప్రాంతానికి జీవికకోసం వచ్చి ఉపాధ్యాయులుగా స్థిరపడి యిచ్చటే ఉద్యోగించి చివరి వరకు తెలంగాణాలోనే గడిపినా రచనలు మాత్రం శేషాద్రి రమణ కవుల పేరునే జీవితాంతం ప్రచురించారు.

దూపాటి రంగాచార్యులు, లక్ష్మమ్మ దంపతులకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఇందులో నాల్గవ కుమారుడు వెంకటరమణాచార్యులు. ఇతను గుంటూరు జిల్లా పెద్ద ఎనమదల గ్రామంలో నందన నామ సంవత్సరం (క్రీ.శ. 1892లో) మేనమామ ఆకలంక రామాచార్యుల ఇంట్లో జన్మించారు (వారు స్కూలు రికార్డులో 15 జూన్, 1893 అని వ్రాసుకున్నారు). ప్రాథమిక విద్యాభ్యాసం తండ్రివద్దనే చిలకలూరి పేటలో కొంతకాలం, సత్తెనపల్లిలో రెండవ అన్నయిన శ్రీనివాసాచార్యుల వద్ద కొంతకాలం, ఆ తరువాత వినుకొండ, కమ్మవారి పాలెం గ్రామాల్లో పెద్దన్న వద్ద కొంతకాలం జరిగింది. ఆ కాలంలోనే స్వేచ్ఛా సంచారం, దుస్సాంగత్యంతో అన్ని దురలవాటులకు లోనయ్యారు. దీనితో రమణాచార్యుల తండ్రి వారిని తిమ్మాపురంలో ఉన్న పెద్దకుమారుని వద్దకు పంపగా అక్కడ అన్నతోపాటు వీధిబడిలో చదువుచెప్తూ కొంతకాలం గడిపారు. అన్నతో కలిసి కవితారచన సాధన చేసి గ్రామ

సంచారం కూడా చేశారు. 1908లో తిమ్మాపురం వీధిబడి మూతపడడంతో సొంతంగా వీధిబడిని ప్రారంభించి క్రీ.శ. 1909లో తండ్రి మరణించడంతో దానిని మూసివేసినాడు. అక్కడ నుండి బాపట్ల చేరి ప్లీడరు వద్ద గుమస్తాగా కుదిరి ఆ పని నేర్చుకుంటూనే బాపట్ల, నాదెండ్ల గ్రామాల్లో గల కవిపండితులతో పరిచయం పెంచుకొని సంస్కృతాంధ్రభాషా జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకున్నారు. కొంతకాలం పత్తిపాడు వీధిబడిలో రమణాచార్యులు, వీరిసోదరుడు శేషాచార్యులు తక్కెళ్ళ పాడు వీధిబడిలో ఉపాధ్యాయులుగా పనిచేశారు.

ఆ రోజుల్లో అనగా క్రీ.శ. 1910 ప్రాంతంలో చింతలపాడులో శతావధానులైన కొప్పవరపు సోదరులు ఆశుకవిత్వ సభను నిర్వహించారు. ఆ సభలో దూపాటి శేషాచార్యులు, రమణాచార్యులు తమ కవిత్వ ప్రతిభను ప్రదర్శించటంతో కొప్పవరపు సోదరులు వీరికి 'శేషాద్రిరమణ'కవులని నామకరణం చేశారు. ఆ తరువాత కొంతకాలానికి కొప్పవరపు కవుల సాంగత్యాన్ని వదిలి తిరుపతి వెంకటకవుల అనుయాయులుగా మారి నియోగి, వైదిక వివాదాల్లో తలదూర్చి ఉపాధ్యాయవృత్తికి స్వస్తి చెప్పి మాచర్లలో తొలిసారి అవధానం చేశారు.

క్రీ.శ. 1912లో తమ బంధువుల కుమార్తె అయిన అండాళ్ళమ్మను మార్కాపురంలోని చెన్నకేశవుల ఆలయంలో రమణాచార్యులు వివాహం చేసుకున్నారు. వివాహానంతరం ఋణాలక్రింద వున్న ఆస్తి ఊడ్చి పెట్టుకు పోవడంతో ఉద్యోగాలు దొరకక జీవితం నడవటం కష్టమై క్రీ.శ. 1912 ఆగస్టులో మదరాసు సంచారార్థం వెళ్లి తిరిగి రెండునెలల తరువాత రమణాచార్యులు మాచెర్ల చేరారు. ఈ సోదరులిద్దరు ఒకసారి తెలంగాణా ప్రాంతానికి వచ్చి, నల్లగొండలో షబ్నవీసు నరసింహారావు సహకారంతో ఒక అవధానాన్ని, హైదరాబాదులో రెండు, కరీంనగరులో ఒకటి, హనుమకొండ, హుజూరాబాద్, భూదాన పోచంపల్లిలలో అవధానాలు చేసి కొంత డబ్బు సంపాదించారు.

ఈ కాలంలోనే రమణాచార్యుల వారు 'గుణవతీ విలాసం' అను దాదాపు 315 పద్యాలతో నవలను రచించారు. నేటి వరకు ఈ నవల అముద్రితంగానే ఉండిపోయింది.

ఆ కాలంలో గుంటూరులో అసిస్టెంటు కలెక్టరుగా వున్న జయంతి రామయ్య పంతులుగారిని రమణాచార్యులు దర్శించి తాను రచించిన 'అర్జున పరాభవము'లోని కొన్ని పద్యాలను వినిపించి, ఆశుకవిత్వాన్ని కూడా చెప్పగా వారు ఆంధ్రసాహిత్య

పరిషత్తు పక్షాన నైజాం రాష్ట్రంలో పర్యటన చేసి శాసనాలను సేకరించవలసిందిగా కోరినారు. శేషాచార్యుల వారికి గుంటూరు జిల్లాలో శాసనాలు సేకరించే పని అప్పచెప్పినారు. రమణాచార్యులునకు రూ. 25/- అడ్వాన్సు, రూ. 20/- నెలజీతం రోజుకు 0-8-0 భత్యం, రైలు ప్రయాణపు ఖర్చు మైలుకు 0-2-0 ఇస్తానని వాగ్దానము చేయటంతో తెలంగాణ ప్రవేశించి, ఎర్రుపాలెం చేరి, జమలాపురం వెంకటకిషన్‌రావు, మాడపాటి తిరుమలరావుల సహకారంతో వరంగల్లు, కరీంనగరు, నల్లగొండ జిల్లాలలో అనేక ప్రాచీన గ్రంథాలను, శాసనాలను సేకరించారు. వీరి పనికి సంతోషించి జయంతి రామయ్య పంతులు వేములవాడ భీమకవి నివాస స్థలచర్చ 'కవిజనాశ్రయము' పీఠిక వ్రాయటానికి అవసరమైన వివరాలు సేకరించమని వేములవాడకు వెళ్ళమని రమణాచార్యులకు పని పురమాయించారు.

వీరు వేములవాడకు వెళ్ళకుండానే అక్కడికి వెళ్ళినట్లు, అది వేములవాడ భీమకవి నివాసంకాదని అక్కడ భీమేశ్వరాలయం లేదని నివేదిక పంపటంతో జయంతి రామయ్యపంతులు ఇతను అక్కడికి వెళ్లలేదని గమనించి మందలించడంతో క్షమాపణ కోరి ఈసారి వరంగల్లునుండి నడుచుకుంటూ రమణాచార్యులు వేములవాడ వెళ్లి వివరాలు సేకరించి జయంతిరామయ్య పంతులుకు అందించారు. ఆ సందర్భంలోనే పోతన వరంగల్లు దగ్గరి బమ్మెర గ్రామస్థుడని ఆధారాలు సేకరించి జయంతిరామయ్య పంతులుకు అందించడంతో పాటు, కడపలో జరిగిన ఆంధ్రసాహిత్య పరిషత్తు వార్షికోత్సవ సభలో ఈ ఆధారాలతో వ్యాసం కూడ చదివినారు.

1916లో ఒక సందర్భంలో జగ్గయ్యపేట దగ్గర గ్రామమైన మక్కపేట గ్రామంలో ఒక వైష్ణవుని ఇంట రమణాచార్యులు దిగి భోజనాది కార్యక్రమాలను ముగించుకొన్నారు. ఆ సమయంలో ఇంటి యజమాని లేడు. ఇంటి యజమాని తరువాత వచ్చి తన భార్య తన ఇష్టం లేకుండా సంపాదించుకొన్న అల్లునిగా రమణాచార్యులను భావించి కొంత గోల చెయ్యటం జరుగగా ఆ గ్రామస్థులు కొందరు అతని మాట నమ్మి వివాదం చేసినారు. ఎలాగో బయటపడి జగ్గయ్యపేట చేరి ఆ తరువాత కృష్ణాపత్రికలో "నేనా, అల్లుఁడనా?" అనువ్యాసం కూడ ప్రకటించారు.

రమణాచార్యులు గంపలగూడెం కుమారరాజాతో పరిచయం పెంచుకొని రూ. 30/-లు వేతనం మీద వారి సంస్థానంలో ఆస్థాన విద్వాంసులుగా చేరి వారి పుస్తకాలు సంస్కరించుటకు ఒప్పుకొని 'పాదుషా పరాభవం', 'యౌవన నిగర్హణము',

'గోషావ్యాసఖండనము', 'చాటుపద్యాలు' పరిష్కరించారు. వారిపేరుతో కొన్ని వ్యాసాలను కూడా రచించారు. కృష్ణరాయ గ్రంథమాలను స్థాపించినప్పటికి ఆ తరువాత 'పాపారాయ నిర్యాణము' అన్న నాటక రచనతో కొంత వివాదము ఏర్పడి కుమారరాజా వద్దనుంచి తప్పుకున్నారు. రమణాచార్యులు తిరుపూరులో ఒక అవధానాన్ని నిర్వహించినారు. చిత్రాడ జమీందారు చెలికాని లచ్చారావు నిర్వహించిన ఆంధ్రపరిశోధనా మండలి వార్షికోత్సవ సభలో నిజాం రాష్ట్రకవుల గురించి వ్యాసం చదివినారు.

గంపలగూడెం సంస్థానం వదిలివేసిన తరువాత 1921లో బెజవాడలో గ్రంథాలయ ప్రెస్సులో పనిచేస్తూ తన రచనలైన 1. పాపరాయనిర్యాణము (1921) చారిత్రక నాటకం, 2. వసుంధర (1922) చారిత్రక నవల, 3. ఆంధ్రమంత్రులు (1923) రచనలను ఈ ప్రెస్సులో ముద్రించుకొన్నారు.

1. 'ప్రణయిని' (ఖండకావ్యం), 2. 'ఋతుసంహారం' (ఆంధ్రీకరణం), 3. 'సర్వలోకేశ్వర శతకం', 4. 'విక్రమోర్వశీయం' పద్యకావ్యం మొదలైన గ్రంథాలను రచించారు. మాడపాటి హనుమంతరావు, ఆదిరాజు వీరభద్రరావులను కలిసి ఛాదర్‌ఘాట్ హైస్కూలు, మహబూబ్‌కాలేజిలలో ఉద్యోగ ప్రయత్నం చేయగా ఫలించలేదు.

నందిగామ బోర్డు హైస్కూలులో ప్రధాన ఆంధ్రోపాధ్యాయ పదవిని, బెజవాడలోని తుర్లపాటి వెంకటేశ్వరరావు సహకారంతో సంపాదించారు. నందిగామలో ఉద్యోగం చేస్తున్న కాలంలో తను సేకరించిన 250 తాళపత్ర గ్రంథాలను పిఠాపురం రాజావారికి ఇచ్చివేశాడు. వారు వరంగల్ జిల్లా రామప్ప గుడిలోగల శాసనప్రతి తెచ్చుటకు రూ.50/-లు ఇచ్చినారు. అదే శాసనప్రతిని సంపాదించి ఇవ్వమని కొల్లాపూరు రాజా రూ.50/-లు, మునగాల సంస్థాన దివాన్ కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు కూడా ఆ శాసనప్రతిని సేకరించుటకు రూ.20/-లు ఇచ్చారు. వేంకట రమణాచార్యులు వారి బావమరిది సింగరాచార్యులను వెంటబెట్టుకొని రామప్ప శాసనప్రతిని సంపాదించటంతో పాటు, నల్లగొండ జిల్లాలోని కొలనుపాకలో గల కొన్ని శాసనముల ప్రతులను కూడా సేకరించారు.

నందిగామ బోర్డు హైస్కూలులో తొమ్మిది సంవత్సరములు ఉపాధ్యాయునిగా రమణాచార్యులు పనిచేశారు. ఆ సమయంలో 'పోతరాజు వేమన' అను చిన్న పుస్తకాన్ని

ప్రచురించారు. నందిగామలో ఉన్న కాలంలోనే ఆంధ్రభారతి, అభ్యుదయ, నీలగిరి, కళ, విద్యార్థి, కృష్ణాపత్రిక, ప్రబుద్ధ ఆంధ్ర, గృహలక్ష్మి, శారద లాంటి పత్రికలకు అనేక వ్యాసాలు రచించారు. ఆ కాలంలోనే ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు వరంగల్లు జిల్లాలో ప్రాచీన గ్రంథాలయ సంపాదించుటకు నెలకు రూ.100/- వేతనం చొప్పున రమణాచార్యులను నియమించి ఇచ్చారు. మద్రాసులోని వావిళ్ళ వారి సంస్థకు అనేక కావ్య ప్రబంధాలు పరిష్కరించి పీఠికలు రచించి ఇచ్చారు. క్రీ.శ. 1923లో 'నీలగిరి' పత్రికా సంపాదకులు షబ్నవీసు నరసింహారావుతో వున్న మైత్రిని పురస్కరించుకొని ఆయన భార్య జానకీబాయి మృతి సందర్భంగా ఉదయలక్ష్మి అను స్మృతి కావ్యాన్ని కూడా రచించారు. ఈ కావ్యంలో 1 నుంచి 107 పద్యాల్లో జానకీబాయి బాల్యం, నిర్యాణము, జీవిత చరిత్రము రచించబడింది. కావ్యం చివరలో 'శాంతి పంచకం' అనుపేరుతో అయిదు పద్యాలను రచించారు. ఈ గ్రంథములో

"రమణిగాత్రంబు పంచభూతములఁ గలిసె
సాధ్వి శీలంబు భాషతో సంగమించె
భావవీధిని జానకీబాయి గలదు" (ఉదయలక్ష్మి - 95వ పద్యం)

జానకీబాయి ఫొటొకింద పై పద్యాన్ని పేర్కొన్నారు.

నందిగామలో ఉన్న కాలంలో వరంగల్లులో స్నేహితులైన తూము వరదరాజులు, దేవులపల్లి వేంకటా చలపతిరావుగారల ప్రద్బోలంతో "కాకతీయ గ్రంథమాల"ను స్థాపించి 'ఆంధ్రమంత్రులు', 'వసుంధర', 'విక్రమోర్వశీయము', 'దాసబోధ', 'ఆంధ్ర పదనిదానము' వంటి గ్రంథాలను ప్రచురించారు.

'నిజాం రాష్ట్ర ప్రశంస' అను కావ్యాన్ని 1926లో రమణాచార్యులు ప్రచురించారు. 1920 ప్రాంతంలో నీలగిరి పత్రికలో ఐదు పద్యాలు, నిజాం రాష్ట్రాన్ని ప్రశంసిస్తూ రచించగా అవి ప్రఖ్యాతి పొందినవి. దానితో మరొక ఇరవై పద్యాలు వ్రాసి పై గ్రంథాన్ని ప్రచురించారు. ఇది చారిత్రక ఖండకావ్యము. ఈ గ్రంథానికి చరిత్రాచార్యులు సిరుగూరి హనుమంతరావు పరిచయం రచించారు.

వావిళ్ళ ప్రచురణ సంస్థకు 1. వేమన పద్యాలకు తాత్పర్యం దిద్ది వ్రాయుట, పీఠిక 2. వసుచరిత్రమునకు పీఠిక, కొత్త వ్యాఖ్య 3. సీతారామాంజనేయం పీఠిక 4. విష్ణుపురాణం పీఠిక 5. సాముద్రిక శాస్త్రం పీఠిక తాత్పర్యం 6. మేదిని, హారావళి, ఏకాక్షర నిఘంటువు, విశ్వనిఘంటువు, అమరశేషము మొదలైన గ్రంథాలకు అర్థాలు

వ్రాయుట 7. మనుచరిత్ర వ్యాఖ్యానము 8. భాగవతమునకు పీఠిక 9. కవిరాజమనోరంజనమునకు పీఠిక 10. మార్కండేయ పురాణం పీఠిక 11. కేతన దశకుమార చరిత్రకు పీఠిక 12. హరివంశము పీఠిక, పాఠాంతరముల శుద్ధి మొదలైన పనులు చేసిపెట్టారు. వెంకట్రామా అండ్ కో వారికి వెంకట రమణాచార్యులు రచించిన పుస్తకములు : 1. ఆంధ్రవీరులు (రెండు భాగాలు), 2. ఇతిహాస మంజరి, 3. భక్తమంజరి, 4. పురాణకళామంజరి 5. నీతికథలు 6. వ్యాకరణం (మూడుభాగాలు) 7. రామాయణ కథలు 8. భక్తవత్సల శతకం 9. వ్యాకరణ సర్వస్వం 10. కుశలవులు 11. ఆంధ్రవాచికముల సంస్కరణ 12. IV, V ఫారముల సెలక్షన్ 13. పద్యవాచకము 1 నుండి 5 తరగతులు 14. భాగవత సార ముక్తావళి దిద్దుట 15. భారత సారముక్తావళిని దిద్దుట 16. కొండపల్లి ముట్టడి మొదలయిన సాహితీ పరిశ్రమను రమణాచార్యులు చేసినారు.

దోమకొండ సంస్థానాధీశుల కోరికపై 'రెడ్డికుల నిర్ణయ చంద్రిక' అను గ్రంథాన్ని రచించినారు. దాన్ని వేంకటకృష్ణకవి అనునతడు తాను పైగ్రంథాన్ని రచించినట్లుగా సంస్థానాధీశులకు తెలిపి తన పేరున ప్రచురించినాడు. ఈ విషయాన్ని శ్రీకృష్ణ దేవరాయాంధ్రభాషానిలయ రజతోత్సవ సభలలో ప్రసంగించటానికి వచ్చిన శ్రీ కావ్యకంఠగణపతిమునికి తెలిపి తరువాతి ముద్రణలో వేంకటరమణాచార్యులు తమ పేరు పునర్ముద్రణలో వేయించుకొన్నారు. హనుమకొండ నందలి రాజరాజ నరేంద్రభాషానిలయ వార్షికోత్సవ సభకు వచ్చినపుడు మాదిరాజు రామకోటేశ్వరరావు సలహా, సహాయాలతో హనుమకొండలో 23 జూన్, 1930లో ఉపాధ్యాయులుగా ప్రవేశించినారు. హనుమకొండలో ఉండగా 'విచిత్ర వివాహము', 'చంద్రలేఖ', 'సుశీల' అను నాటికలను విద్యార్థులకొరకు రచించినారు. 1938 జూన్ ఆదిలాబాద్ జిల్లా నిర్మల్‌కు బదిలీ అయినారు.

1939 డిసెంబర్‌లో రమణాచార్యులవారికి కరీంనగర్ బదలీ అయింది. 1941 జూన్ 6న కుడిచేయి పక్షవాతము వచ్చినది. 1942 వేసవి సెలవలలో కిషన్‌పూర్‌లో ఇల్లు మరమ్మత్తు చేసుకొని, కరీంనగర్ జిల్లా మంతెన దగ్గర గ్రామమైన తూండ్లలో 1945లో వ్యవసాయ భూములుకొని వ్యవసాయం ప్రారంభించినారు. 1949 మేనెలలో కరీంనగరులో ఉద్యోగవివరణ చేసినారు. ఆ తర్వాత వరంగల్ ఏ.వి. హైస్కూలులో 1951 జూన్ వరకు ప్రయివేటు స్కూల్‌లో పని చేశారు. ఇదే సంవత్సరము పురావస్తు

శాఖలో శాసన పరిశోధకుడుగా ప్రవేశించి అజంతా, ఎల్లోరా, మహబూబ్‌నగర్ జిల్లా, వరంగల్ జిల్లాలో కొంత భాగము పర్యటించి అనేక శాసనాలు సేకరించినారు. రాయచూర్ జిల్లా మాస్కిలో అశోకుని శాసనముల ప్రతి తీయుటకువెళ్లి మార్చి 1952 అనారోగ్యం పాలైనారు. పురావస్తు శాఖలో పనిచేసిన రెండు సంవత్సరాలలో 400 తాళపత్ర గ్రంథములు, 300 శాసనములు, 4 తాళపత్ర శాసనములు సేకరించినారు. వీరు సేకరించిన తాళపత్ర గ్రంథాలు పరిష్కరించే నాధుడు లేక రాష్ట్ర పురావస్తు శాఖ మ్యూజియం పబ్లిక్ గార్డెన్‌లో నేటికి ఎదరు చూస్తున్నాయి. 1954 దాకా పురావస్తు శాఖలో ఉద్యోగించారు.

ఆ తర్వాత ఏ ఉద్యోగానికి అర్హత కాని వయస్సు, వ్యవసాయంలో నష్టం, తరచూ అనారోగ్యం, ఎదిగి చేతికి అందని సంతానం, అనేక కుటుంబ సమస్యలు రమణాచార్యులవారిని వృద్ధాప్యంలో చుట్టుముట్టాయి.

లక్ష్మణరాయపరిశోధకమండలి పక్షాన తెలంగాణ అంతా తిరిగి శాసనాలను సేకరించారు. మధిర, సూర్యాపేట, జోగిపేట, ఖమ్మంమెట్టు, షాదనగర్‌లలో జరిగిన ఆంధ్రమహాసభలలో, వారు నిర్వహించిన కార్యక్రమాలలో వెంకటరమణాచార్యులు వక్తగా అనేక ఉపన్యాసాలు చేశారు. ఆదిలాబాదునందలి శ్రీకృష్ణ దేవారాయాంధ్ర భాషానిలయంలో మూడుసార్లు, బాలసరస్వతీ గ్రంథాలయంలో ప్రధాన వక్తగా, వరంగల్ గ్రంథాలయ వార్షికోత్సవంలో ముఖ్య ఉపన్యాసకునిగా, హనుమకొండ రజతోత్సవ సభలలోను, కాకతీయ సభలలోను, నిజాం కాలేజి చర్చా సంఘంలోను ఉపన్యసించారు. వెంకటరమణాచార్యులవారు కాకతీయ చరిత్రగురించి ఆంధ్రపత్రికలో రచించిన వ్యాసాన్ని కోకిల సీతారామశర్మ గ్రంథరూపంగా ముద్రించారు. తూము రంగయ్య, వరదరాజులు గారలు వారి తండ్రిచేత రచించబడిన 'ఆంధ్రపద నిదానము' అను గ్రంథాన్ని వెంకటరమణాచార్యులు ప్రచురించారు. భక్తవత్సల శతకం, సర్వలోకేశ్వర శతకం, బాలనీతి శతకం, స్త్రీ బోధ శతకం, సూర్య శతకంలను రచించారు.

ఆంధ్రదేశ పురావైభవము, కాకతీయ రాజ్య వైభవములపై అనేక కవితలను దూపాటి వారు రచించారు. అవి: ఆంధ్రనగరం, (1924 జూన్, శారద పత్రిక, సం. 2–1, పుట–447), మాతృవందనం (1927 జనవరి, భారతి, సం.4–1, పుటలు 119, 120); ఆంధ్రసామ్రాజ్యము (1928 గోల్కొండ పత్రిక, పుటలు 9–13);

ఆంధ్రభూమి (1933 ఆగష్టు, ఆంధ్రభూమి, సం.1-4, పుట-12); ఆంధ్రభూమి (1935 డిసెంబరు 5, గోల్కొండ పత్రిక, పుట-2); ఆంధ్రపతాకం (1938 జనవరి, భారతి, సం.15-1, పుట-2), తెలంగాణ (1938 ఆంధ్రపత్రిక, ఉగాది సంచిక, పుట-46-47); తెలుగు తల్లి (1939 డిసెంబరు, ఆంధ్రభూమి, సం.8-5, పుట-179); కాకతీయాంధ్రలక్ష్మి (1924 సెప్టెంబరు, భారతి, సం.1-7, పుట-32); ఓరుగల్లు కోట (1926 అక్టోబరు, భారతి, సం.3-11, కవరుపేజి); ప్రతాపరుద్ర చక్రవర్తి (1928 అక్టోబరు భారతి, సం.5-10, పుట-551-555); కాకతీయ ప్రోలరాజు (1932 మార్చి, భారతి, సం.9-3, పుట-451), రాణి రుద్రమదేవి (1933 మార్చి, గృహలక్ష్మి, సం.6-1, పుట-15); ఓరుగంటి శిథిలములు - శోభనముల బావి (1935, ఆంధ్రపత్రిక, పుటలు 207-208); ఓరుగల్లు (1931 జులై 25, గోల్కొండ పత్రిక, సం.10-23, పుట-2); విస్మృతనగరం, (1935 ఆంధ్రభూమి, సం.3-10, పుట-857); శిథిల నగరములు (1952 నవంబరు 15, సుజాత, సం.3-4, పుట-1); దేశభక్తి పూరితమైన ఈ కవితలను ఒక సంపుటిగా ప్రచురించిన ఎంత ఉపయుక్తం కాగలదు.

తన మిత్రులు ఆత్మీయులు చనిపోయినప్పుడు అనేక స్మృతి కవితలను రచించారు. అవి: చామర్తి, రాజశేఖర రాయస్మృతి (ఆంధ్రపత్రిక, దుందుభి ఉగాది సంచిక); అశ్రుభిక్ష (సాహితి 1923); కావ్యనిధి చెలికాని లచ్చారాయస్మృతి (1924 జనవరి, భారతి); సంతాప పద్యములు (నీలగిరి పత్రికా సంపాదకులు, షబ్నవీసు వేంకటనరసింహారావు మరణించినపుడు రచించినవి, 1929 డిసెంబరు 7, గోల్కొండ పత్రిక, సం.4-57, పుట-4);

"రసవంతముగఁ గృతి వ్రాయుదంకితమేను
కొనదనటంచు వాక్రుచ్చినావు
మిమ్ముఁ బోషింతు మామిళ్ళ గూడెమునకు
రండని జాబులు వ్రాసినావు
పరిశోధనంబున బడలిన మముఁ జూచి
మించువేడుక కౌగిలించినావు
నేను స్వతంత్రుండనైనచో మిము వీడి
పరితపింతునె యంచుఁ బల్కినావు

దినమునకు నొక్కమాఱు మీ తెనుగుకైత
చెవిని పడకసైపలేనని చెప్పినావు
అకట యా యైహికంబు లెట్లుడిచి పరము
చేరితివి షబ్నవీసు నృసింహరాయ" (3వ పద్యం)

ఈ పద్యం వల్ల శేషాద్రి రమణకవులకు షబ్నవీసు వేంకటనరసింహారావుకు మధ్య గల అనుబంధాన్ని గమనించవచ్చు.

విషాదగీతములు, (1938 మే భారతి, కాశీనాథుని నాగేశ్వరరావు స్మృత్యర్థం రచించింది); అన్నపూర్ణాదేవి ప్రశంస (మాగంటి బాపినీడు సతీమణి అన్నపూర్ణాదేవి (1927 అక్టోబరు 10న మరణించినపుడు రచించిన స్మృతి (1928 ఆంధ్రపత్రిక) మొదలయినవి.

దూపాటి వారు 5000 పేజీలు పద్య సారస్వతముతో, పదాల సంఖ్యతో, చారిత్రక నవలలతో పాటు వందలాది చారిత్రక పరిశోధనా వ్యాసాలను, ఆనాటి వివిధ పత్రికలలో ప్రచురించారు. ఈ సాహితీ సంపదను పరిశోధన సంస్థలు గాని, విశ్వవిద్యాలయాలు గాని సంపుటాలుగా ప్రచురిస్తే చరిత్ర పునర్నిర్మాణంలో ఉపయోగపడగలవు. ఎన్నో వ్యాసాలు క్రిందటి శతాబ్ది తొలి దశలో చరిత్ర నిర్మాణ క్రమములో దూపాటి వెంకటరమణాచార్యులు స్వయంగా విస్తృతంగా తెలంగాణ అంతటా పర్యటించి సేకరించిన ఎన్నో చారిత్రక విశేషాల సమాహారం.

తెలంగాణ చరిత్ర నిర్మాణానికి శేషాద్రి రమణకవులు చేసిన కృషి మరువరానిది. వీరు రచించిన వ్యాసాలను పునర్ముంచి భావి పరిశోధకులకు అందుబాటులో ఉంచగలిగితే చరిత్ర పునః నిర్మాణానికి, చరిత్ర ఆధారాల పునర్మూల్యాంకానికి ఎంతగానో దోహదపడుతాయి. దాదాపు 34 చరిత్ర వ్యాసాలను ప్రచురిస్తున్న సారస్వత పరిషత్తు వారిని అభినందిస్తున్నాను. ఇందులో ఎన్నో విశేషాలు, చారిత్రక వివరాలు తెలియచేసే గొప్ప వ్యాసాలున్నాయి. వారు చూసిన కొన్ని చారిత్రక శిధిలాలు, శాసనాలు ఈనాడు కాలగర్భంలో కలిసిపోయాయి. కాని శేషాద్రి రమణకవులు ఆ శాసనాల, గ్రంథాల ఆధారంగా ప్రకటించిన వివరాలు విశ్లేషణలు భావితరాలకు, చరిత్ర అధ్యయనాభిలాషులకు, పరిశోధకులకు మార్గదర్శకంగా నిలుస్తాయని భావిస్తున్నాను. ఈ గ్రంథ అనుబంధంలో శేషాద్రి రమణ కవుల వాఙ్మయ సూచిని పాఠకుల సౌకర్యార్థం కూర్చడం జరిగింది.

1955 నుంచి వ్యవసాయం చేయించుకుంటూ కరీంనగర్ జిల్లాలోని కొంపల్లి గ్రామంలో జీవితాన్ని గడుపుతూ 1961 మార్చి 2న సాయంకాలం గం॥ 4.30॥లకు మరణించారు.

1940లో వారి స్వీయచరిత్రను రచించటం ప్రారంభించి అసంపూర్తిగానే వదలివేశారు. కాకతీయ విశ్వవిద్యాలయ తెలుగు విభాగము పురావస్తు కేంద్రము 1987లో "దూపాటి వేంకటరమణాచార్యులు జీవితచరిత్రము" పేరున వారి స్వీయచరిత్రను ప్రచురించి మహోపకారం చేశారు. అలాగే రమణాచార్యులవారి అనేకానేక రచనలను ఏ విశ్వవిద్యాలయమైనా సంపుటాలుగా ప్రచురించిన తెలుగువారికి, భవిష్యత్తరాలకు ఎంతో ఉపయుక్తం.

మనవి

- దూపాటి శేషకుమారాచార్యులు.

తెలుగు భాషపై మక్కువ పెంచుకొన్న సాహితీమూర్తులు ఎందరో ప్రాచీన గ్రంథకర్తలు నుండి నేటి ఆధునిక రచయితలు వరకు చాలా కృషి చేసినారు. అసలు ఈ సాహిత్యం ఎప్పుడు, ఎక్కడ, ఎలా పుట్టింది దానికి గల ఆధారాలు కావాలంటే ప్రామాణికాలు ఉండాలి. అలాంటి ప్రామాణికాల కోసమే చేసిన పరిశోధనే శాసనాలు తీయడం. అలాంటి కార్యక్రమాలు చేయాలంటే అవగాహన,పట్టుదల, శ్రమ చాలా అవసరం. దూరాభారాలు నడుస్తూ, కాలాన్ని తలవక అనేక వ్యయాప్రయాసలకు లోను కావాల్సి వస్తుంది.

ఒక ప్రక్క ఆహారనియమాలను పాటిస్తూ ఆకలి నిద్రను అలసటను లెక్కచేయకుండా మనకు అందించిన గుప్త సంపద ఇది. ఎవరూ దొంగిలింపరాని సొత్తు. కాని రానురాను తెలుగు భాషపై కొద్దిగాఅభిమానం తగ్గుతున్నదనే విషయం తలుచుకుంటే చాలా బాధ వేస్తున్నది. శాసనాల లిపి, ద్రావిడం, నాగరలిపి, కొన్నిచోట్ల తెలుగులోను అర్థం కాని భాషలో వుంటాయి. వాటిని పరిశోధించాలంటే తగిన పరిజ్ఞానం అవసరం. అలా కృషి చేసినవారు జంటకవులుగా ప్రసిద్దులు కీ.శే. దూపాటి శేషాద్రి రమణకవులు.

శ్రీ దూపాటి శేషాద్రి రమణకవులు రచించిన అనేక వ్యాసాలు ప్రముఖ పత్రికలు భారతి, ఆంధ్రపత్రిక, రెడ్డిరాణి, శారద, మొదలగు వాటిల్లో ముద్రితమయినాయి. 1921 నుండి 1945 వరకు విస్తారంగా పర్యటించి అనేక కష్టనష్టాల కోర్చి పగలనక రేయనక చాలా దూరం నడచి వివిధ కోణాలలోని వీలున్నన్ని శాసనాలు బయటకు తీసి కాకతీయుల ఉనికిని మనకు అందించి తెలుగులో వాటిని కనుల ముందు అగుపడుటట్లు చేసి ప్రాచీన భాష లో కాకుండా మనకు అర్థం అయ్యేలాగా అందించిన మహానుభావులు శతావధాన కర్తలు శ్రీదూపాటి శేషాద్రి రమణకవులు. వీరు పండిత వంశములో జన్మించారు. వీరి తాతగారు శ్రీదూపాటి కొండమాచార్యులు. వీరి తాతగారు, తండ్రి గారు గుంటూరు జిల్లా నుండి ఉద్యోగరీత్యా వరంగల్లు వచ్చారు. శ్రీ రంగాచార్యులుగారి కుమారులు, శ్రీశేషాచార్యులు, వెంకట రమణాచార్యులు ఇరువురు కలసి జంట కవులుగా ప్రసిద్ధిచెంది వృత్తి పరంగా ఉపాధ్యాయులుగా పనిచేస్తూ అవధానాలు చేస్తూ శాసనాలు వెలికి తీయడం చేస్తుండేవారు.

అనేక ప్రముఖ పుస్తకాలకు పీఠికలు, అనేక నవలలు, నాటికలు, పద్య ఖండికలు రచించారు. నిజాం నవాబు దౌర్జన్యంను రూపుమాపుటకు ఉత్తేజపరచి "నిజాంరాష్ట్ర

ప్రశంస" అనే పద్యకావ్యమును, రుద్రమ గొప్పదనం చాటు కాకతీయ చరిత్రలను, కొండపల్లి ముట్టడి అనే నాటకం, వసుంధర ప్రతాపరుద్రీయం అనే నవలలు, అనేక పండుగల గురించి వ్యాసాలు, పద్యాలు, కవితలు, కథలు వ్రాసారు. అసలు ఈ సంకలనానికి కావలసిన సమాచారంను నా సోదరుడు శ్రీదూపాటి శ్రీనివాసాచార్యులు చాలా శ్రమపడి వివిధ పాత సంచికల లోంచి సేకరించి అందించి తోడుపడ్డాడు. వారికి చాలాకృతజ్ఞతలు. వీరి రచనలు ఎక్కువగా వెంకట్రామా & కో వారు, వావిళ్ల వారి ద్వారా ప్రచురించారు.

కవులు, శాసన కర్తలు, మరుగున పడిన వారు సాధించిన ప్రగతి, ప్రజ్ఞ పాటవాలను మనకు అందించడం లో చేసిన కృషి శ్లాఘనీయం. రాళ్లే కదా అని తేలికగా తీసిపారేయడానికి లేదు. వాటి నుండి చక్కని సంగీతం, సాహిత్యం సంస్కృతి సంప్రదాయములు గురించి తెలుసుకోవడానికి జీవనాడులుగా నేటికి చిరస్థాయిగా చెరగని ముద్రలు వేసాయి. శారద కరుణా కటాక్ష వీక్షణములు లేనిదే ఏమి సాధించలేరని భక్తితో వాణి ఉపాసన చేసిన ఘనులు వీరు పరమపదించినా వారి గుర్తులు మనకు మిగిల్చారు.

అలాంటి వారిని సంస్మరించుకోవడం మన కర్తవ్యంగా భావిస్తున్నాను. అవధాన విద్యతో అనేక మందిని మెప్పించి గొప్ప ఈనాములు పొందిన శతావధానులు. వీరి అవధానం స్ఫూర్తి శ్రీతిరుపతి వెంకటకవులని అనేక సభలలో తెలియజేసారు. అర్ధ శతావధానంతో ప్రారంభించినారు. చెట్ల కొమ్మలకు పద్యపాదాలు కట్టి కళ్లకు గంతలు కట్టుకొని అందలి పద్యపాదాలను ఒకరు రెండు పాదాలుచెప్పి మిగిలిన పాదాలను రెండవవారు పూరించేవారు. ఒకసారే 100మంది దొరకరు కాబట్టి ఈరకంగా సాధన చేసారని పెద్దవాళ్ల ద్వారా తెలిసింది.

వీరి రచనలు ఎక్కువగా పరిశోధనలకు పనికి వచ్చే విధంగా వుండటం వలన నలుగురికి ఉపయోగపడాలనే దృష్టితో శ్రీదూపాటి వారి సాహిత్యాన్ని మీకు అందిస్తూన్నాము. ఈ మహా యజ్ఞంలో మాతో పాలు పంచుకోన్న మా చినతాతగారు వెంకటాచార్యులు గారి మనుమలు. కోడళ్లు సంతానం 1 దూపాటి నారాయణాచార్యులు (సుందరవరదాచార్యులు గారి అబ్బాయిలు)2. దూపాటి రమాదేవి (శ్రీయుత రంగాచార్యుల గారి ధర్మపత్ని వారి సంతానం) 3. దూపాటి శేషకుమారాచార్యులు (వెంకటరమణాచార్యులు) గారికి శేషాచార్యులు గారి తాలుకు 1. వి.యస్. రంగనాయకమ్మ (శేషాచార్యులుగారి పుత్రిక) 2. దూపాటి సౌభాగ్యలక్ష్మి (సంపత్కుమారాచార్యులు) వారి సంతానమునకు ముఖ్యంగా ఈ సమాచారం అందించిన దూపాటి శ్రీనివాసాచార్యులకు సోదరునకు నా ప్రత్యేక కృతజ్ఞతలు.